# ఇతిహాసకాలంలో మానవసంబంధాలు

(రామాయణ, భారతాల అధ్యయనం)


రచయిత

**చివుకుల రమాకాంత శర్మ**



ప్రచురణ

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2018**

# ITHIHASA KALAMLO MANAVA SAMBANDALU
**(Ramayana, Bharatha, Adhyayanam)**

*By*
**Chivukula Ramakantha Sharma**

T.T.D. Religious Publication Series No.1272
© All Rights Reserved

*First Print:* 2018

*Copies:* 1000

*Published by :*
**Sri ANIL KUMAR SINGHAL**, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***D.T.P:***
Publications Division,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

# ముందుమాట

**'ఇతిహాస'** మంటే **'చరిత్ర'**. వ్యుత్పత్తిని బట్టి చూస్తే **'ఇతి–హ–ఆస'** అనే దానికి **'ఇది ఈ విధంగా జరిగింది'**, అని అర్థం. జరిగింది జరిగినట్లుగా చెప్పేదే చరిత్ర. కాబట్టి 'ఇతిహాస' మంటే 'చరిత్ర' అని రూఢి కెక్కింది.

వాల్మీకి రామాయణం, వ్యాసభారతం – రెండే ఇతిహాసాలున్నాయి. మొదటిదశలో వ్యాఖ్యాతలే విమర్శకులుగా ఉండేవారు. దక్షిణ భారతదేశంలో ఉడాలి వరదరాజ పండితుడు మొట్టమొదటి రామాయణ వ్యాఖ్యాత. ఆయన తర్వాత అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత, శాక్తేయ వ్యాఖ్యానాలు కోకొల్లలుగా వెలిశాయి. మత సిద్ధాంతాల మధ్య వైరుధ్యం ఏర్పడి గ్రంథ స్వరూపంలో మార్పులు చేర్పులు చోటు చేసికొన్నాయి. ముఖ్యంగా విశిష్టాద్వైతపరమైన గోవిందరాజీయ వ్యాఖ్య వాల్మీకి రామాయణాన్ని శ్రీవైష్ణవ మత గ్రంథంగా రూపాంతరీకరణం (Transformation) చేసింది.


ఇదిలా ఉండగా క్రీ.శ. 12వ శతాబ్దంలో భారతదేశంలో భక్తి ఉద్యమం (Bhakti Movement) పుట్టి యావద్భారత దేశంలో వ్యాపించింది. మతం ఏదైనా సరే **'భక్తి చేతనే ముక్తి'** అని అందరు ఆచార్యపురుషులు అంగీకరించారు. దీనితో ఇతిహాసాలైన రామాయణ, భారతాల్లో భక్తికే ప్రాధాన్య మేర్పడింది. త్యాగరాజాదులచే **'రామభక్తి సామ్రాజ్య నిర్మాణం'** జరిగింది. క్రీ.శ.1250 నుండి క్రీ.శ.1850 వరకు భక్తి ఉద్యమం భారతదేశంలో **'భిన్నత్వంలో ఏకత్వాన్ని'** స్థాపించి, (Unity in Diversity) పాశ్చాత్యుల పాలనలోని బానిసత్వం నుండి విముక్తిని కల్గించి దేశానికి స్వాతంత్ర్యాన్ని అందించింది.

క్రీ.శ. 1947 నుండి స్వాతంత్ర్యోత్తర కాలంలో పాశ్చాత్య విద్యావిధాన ప్రభావంవల్ల కొత్త కొత్త దృక్పథాలతో దృక్కోణాలతో జాతీయ కావ్యాలైన ఇతిహాసాల పునఃపరిశీలన ప్రారంభమైంది. ఈ దశలో **'భక్తి'** అనే స్థానంలో

**'మానవ సంబంధాలు'** (Human Relations) అనే కొత్త పరిభాష చోటుచేసికొన్నది. దేశీయత, జాతీయత, అంతర్జాతీయత వంటి పరిభాషల నేపథ్యంలో జాతీయ కావ్యాలను విమర్శించడంలో మానవ జీవితాల మధ్య సమన్వయం, రామాయణ, మహాభారతాలపై జరిగాయి, జరుగుతున్నాయి. ఈ కోవలోకి చెందిన గ్రంథమే తి.తి.దే. ప్రస్తుతం అందిస్తున్న **'ఇతిహాసకాలంలో మానవసంబంధాలు'.** ఈ గ్రంథంలో పై విషయాలన్నీ సంక్షిప్తంగా చక్కని తెలుగులో వివరించడం జరిగింది.

ఇటీవలి 50 ఏండ్లకాలంలో ఆధునికంగా పురావస్తు పరిశోధకశాఖ వారు దేశ విదేశాల్లో భూమిలోపలా సముద్రంలోపలా కూడా జరుపుతున్న త్రవ్వకాల సామగ్రీ విశేషంచేత **'శ్రీరాముడు కట్టిన సేతువు'** బయటపడడం, శ్రీకృష్ణుని ద్వారకానగరం సముద్ర గర్భంలో ఉందని తెలుసుకోవటం జరిగింది. దీనితో – శ్రీరాముడు, శ్రీకృష్ణుడు పురాణపురుషులు కారు (Mythical Persons) చారిత్రక పురుషులు (Historical Personalities) అని పురావస్తు చరిత్ర శాస్త్రజ్ఞులు నిరూపిస్తున్నారు. ఇలా 'చరిత్ర పునరావృతమౌతున్నది'. (History repeats itself) అన్నట్లుగా రాముడు, కృష్ణుడు ఇతిహాస (చరిత్ర) కాలంనాటి చారిత్రక పురుషులుకావడం మనకెంతో ఆనందాన్ని కల్గించే విషయం. ఈ విధమైన ఆలోచనకూడా ఈ గ్రంథంలో కొంత కనబడుతూ ఉంది. ఇది మన ఇతిహాసాలకు శుభోదయం! మహోదయం! కావాలని కోరుకుంటూ ఈ గ్రంథ రచయితను అభినందిస్తూ ఈ గ్రంథాన్ని పాఠకులు చదివి ఆనందిస్తారని ఆశిస్తాను.

*సదా శ్రీవారి సేవలో....*



కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

**C. Ramakanta Sarma**
M.A.(Pub. Admn.) B.P.R., D.L.L.,



# ఒకమాట

మానవసంబంధాలకు పుట్టిల్లు భారతదేశం. అనాది నుంచి గ్రామాలలో వర్గ, వర్ణ, కుల, మత, ప్రాంతీయ తేడాలు లేకుండా ప్రజలంతా సత్సంబంధాలు, సన్నిహిత సంబంధాలు పెంచుకొని, పంచుకొని సహాయ, సహకారాలందించి జీవనం సాగించారు. మానవసంబంధాలు విషయంలో వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు, పురాణాలు, భగవద్గీత మొదలైన గ్రంథాలన్నీ మానవాళి మనుగడకు ఎన్నో సూచనలు చేశాయి. మానవసంబంధాలు ఎలా ఉండాలి, ఎలాంటి వారితో స్నేహం పెంచుకోవాలి మొదలగు విషయాలెన్నో మహర్షులు, ఋషులు, పీఠాధిపతులు ఎన్నో ఉపన్యాసాలు, ఆధ్యాత్మిక, ధార్మిక సందేశాల ద్వారా హితబోధ చేశారు, చేస్తున్నారు. నలభై సంవత్సరాల క్రిందట సినిమా రంగం పౌరాణిక, జానపద, సాంఘిక సినిమాల ద్వారా మానవసంబంధాలగురించి అవగాహన కల్పించి మానసిక మార్పుకు కృషిచేశాయి. ఆ రోజుల్లో చిత్రసీమ సమాజ హితంకోసం సినిమాలు నిర్మించి, ప్రదర్శించి 'శభాష్' అనిపించుకున్నాయి.

## నేటి పరిస్థితి

నేడు మారుతున్న హైటెక్ యుగంలో పాశ్చాత్య నాగరికత మోజు, పాశ్చాత్య సంస్కృతి సంప్రదాయాలపై ఇష్టత పెంచుకోవటం, కాంట్రాక్టు పద్ధతులలో వివాహ, విందు, శుభకార్యక్రమాలు నిర్వహించటం వలన మనుషులమధ్య సంబంధాలు దూరమవుతున్నాయి. కుటుంబసభ్యుల మధ్య సంబంధాలు దూరమవుతున్నాయి. ఈ రోజుల్లో భార్యాభర్తలమధ్య, తల్లిదండ్రులు పిల్లల మధ్య సంబంధాలు సన్నగిల్లుతున్నాయి. రక్త

సంబంధీకుల మధ్య సత్సంబంధాలు, అంతంత మాత్రంగా ఉన్నాయి. నేటి కుటుంబాల్లో సంస్కృతీ, సంప్రదాయాలకు హృదయంలో చోటు కరువయింది. ఇటువంటి విషసంస్కృతి మారాలి. భారతీయ వైభవం, కుటుంబాలు, వంశాలు, సమాజం పచ్చగా ప్రకాశించాలంటే పూర్వ వైభవానికి మళ్ళీ అంకురార్పణ జరగాలి. త్రేతాయుగం, ద్వాపరయుగాలలో మానవసంబంధాలు, కుటుంబ సంబంధాలు, రాజులకు – ప్రజలకు మధ్య సత్సంబంధాలు సమాజ సంబంధాలు ఎలా ఉన్నాయి అనే విషయాన్ని లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. నేటి యువతకు అవగాహన కల్పించి, భారతీయ సనాతన జీవనవిధానంపై ఆసక్తిని పెంచాల్సిన అవసరం ప్రస్తుత కర్తవ్యం. యువతరాన్ని సన్మార్గంలో నడిపించటమే ప్రస్తుత తరం వారి బాధ్యత.

ధర్మబద్ధమైన జీవనం, సత్యసంధత, మానవసేవ, సత్ప్రవర్తన, నడవడి, నైతిక విలువలు కలగా పులగంగా వ్యక్తులలో ఉన్నపుడే మానవసంబంధాలు ప్రకాశిస్తాయి. ఇటువంటి మానవసంబంధాలే సమాజాన్ని, రాష్ట్రాన్ని, దేశాన్ని శాంతియుతంగా ఒడిదుడుకులు లేని వసుధైకకుటుంబాన్ని నిలబెడుతాయి.

నేటి మానవాళికి మానవసంబంధాలపై స్ఫూర్తి, ప్రేరణ ఆసక్తి ఎలా కలిగించాలి? భరతఖండంలో ముచ్చటైన రెండు పవిత్ర ఇతిహాస గ్రంథాలు గురించి అందరం చెప్పుకుంటూంటాం. అవి ః **శ్రీమద్రామాయణం, మహాభారతం.** ఈ ఇతిహాస గ్రంథాలలోని చరిత్రే మనకు ఆధారం, ప్రేరణ. రామాయణకాలంలో తల్లి తండ్రి కొడుకుల మధ్య, అన్నదమ్ములమధ్య, భార్యాభర్తల మధ్య, తోడికోడళ్ళ మధ్య, రాజులు – సేవకుల మధ్య, రాజులు – ప్రజల మధ్య సంబంధాలు, ధర్మం, సత్యం, త్యాగం, సేవ, మానవతా హృదయంతో ప్రకాశించాయి. శ్రీరాముడు కథానాయకుడుగా ఆయన పరివారమంతా విలువలతో గూడిన బృందంగా సుపరిపాలన, ధర్మయుద్ధం



చేయటం కొనియాడదగినది. నేటికీ భారతీయులు రామాయణకాలంలోని సంస్కృతీ, సంప్రదాయాలనే అనుసరిస్తున్నారు. ఈ నాటికీ రాముణ్ణి కొలుస్తున్నారు, రామాయణం చదువుతున్నారు, శ్రీరామనామాన్ని స్మరిస్తున్నారు. రామాయణకాలంలోని కుటుంబసంబంధాలు, మానవ సంబంధాలు నేటికీ ఆదర్శమే. మన పెద్దలు పాతతరం వారు ఆచరించారు, తరువాత తరాలకు పంచి ఇచ్చారు. నేటితరం వారు రాబోవు యువతరానికి మానవసంబంధాల గురించి హితబోధ చేయాలి. ఆ దిశగా మెల్ల మెల్లగా తప్పటడుగులు వేస్తూన్న యువతను ప్రేరేపించాలి. వంశవృక్షం, కుటుంబ నేపథ్యం వటవృక్షంలా పెరగాలి, నిలబడాలి, అందరికీ నీడను ఇవ్వాలి. ఇది ప్రతి వ్యక్తీ ప్రథమ కర్తవ్యం.

మహాభారతకాలం పూర్తిగా ఒకే వంశంలోని పాండవులు కౌరవుల మధ్య ద్వేషం పెరిగి కుటుంబసంబంధాలు విచ్ఛిన్నమై అన్నదమ్ములే పరస్పరం యుద్ధం చేయాల్సిన పరిస్థితి వచ్చింది. వీరంతా ఒకరి మీద మరొకరు కాలు దువ్వుతూ దుష్టసంబంధాలు సాగించారు. ఫలితంగా ధర్మవర్తనులైన పాండవులు రాజ్యం సర్వస్వం పోగొట్టుకొని అరణ్యం పాలైనారు. అధర్మంగా, దురాశతో, జూదంతో రాజ్యాన్ని సంపాదించి రాజ్యమేలారు కౌరవులు. అయినా దురాశ ఎక్కువై బలవంతులమని భావించి పాండవులను మట్టుపెట్టి శాశ్వతంగా రాజ్యాధికారం వారి హస్తగతం చేసుకోవాలని కౌరవుల ఊహ, ప్రణాళిక.

ఈ రెండు వర్గాల మధ్య కుటుంబ సంబంధాలు సత్సంబంధాలుగా పెంచి, పోషించాలని ఆనాటి పెద్దలు భీష్మ, ద్రోణ, కృప, అశ్వత్థామ, శ్రీకృష్ణుడు, బలరాముడు, విదురుడు, సంజయుడు రాయబారాలు చేసి సయోధ్య కుదర్చటానికి ఎంతో శ్రమపడ్డారు. వీరందరి హితవు పెడచెవిని పెట్టారు దుష్టచతుష్టయం. రెండు కుటుంబాల మధ్య మళ్ళీ పూర్వ వైభవంతో ప్రేమ

పూర్వక సంబంధాలు ప్రతిష్ఠించాలని శ్రీకృష్ణుడు ఎంతో ప్రయత్నం చేశాడు. ఆ ప్రయత్నం కౌరవులు అంగీకరించక యుద్ధానికి సిద్ధమైనారు. కుటుంబసంబంధాలు విచ్ఛిన్నమైనాయి. యుద్ధం జరిగింది. ధర్మం, సత్యసంధతగల పాండవులు రాజ్యంలో విజయం సాధించారు. అధర్మం, అసత్యం, మోసం, అత్యాశ పెంచుకున్న కౌరవులు, వారి బంధువర్గం యుద్ధంలో మరణించారు. ధర్మానికి అధర్మానికి జరిగిన పోరాటమే కురుక్షేత్ర సంగ్రామం. సత్సంబంధాలకు, దుష్టసంబంధాలకు మధ్య జ్వలించిన పోరాటమే కురుక్షేత్ర సమరం. భారతం మన నిత్య జీవితం, భారతంయొక్క సారాంశం చదివే వాడిని బట్టి తెలుస్తుంది. అందుకే తెలుగువారు **'తింటే గారెలు తినాలి, వింటే భారతం వినాలి'** అన్నారు.

"పురాణకాలంలో మానవసంబంధాలు" అంశంపై త్రేత, ద్వాపర యుగాలలోని కుటుంబసంబంధాలు, మానవసంబంధాలు, ధర్మాచరణ, సత్యం, త్యాగం, ప్రేమ, మానవసేవ, ఆధ్యాత్మిక భక్తి సంబంధాలు, రాజులు – ప్రజల మధ్య ప్రజాసంబంధాలు, పరిపాలనా నైపుణ్యాలు, మెళకువలు, నైతిక విలువలు, మానవీయ విలువలు, రాయబారుల ద్వారా స్నేహసంబంధాలు నెలకొల్పటం, క్లిష్టసమయంలో ఓర్పు, సంయమనంతో జీవనం సాగించటం, మొదలైన ఎన్నో సద్విషయాలను క్రోడీకరించి, విశ్లేషించి, పరిశీలించి అధ్యయనం చేశాను. సద్విషయాల పర్యవసానమే "పురాణకాలంలో మానవసంబంధాలు (రామాయణం, భారతం)" గ్రంథం కార్యరూపం దాల్చింది.

ఈ అధ్యయన సత్ఫలితాలు రాబోవు తరం భారతీయులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయనుటలో సందేహం లేదు. మంచిని అక్షరరూపంలో ప్రజలకు పంచి ఇవ్వటమే "పురాణకాలంలో మానవ సంబంధాలు" ప్రధాన లక్ష్యం.



## కృతజ్ఞతలు

ఈ గ్రంథరచనకు నాకు శుభసంకల్పం మనసులో స్ఫురింపచేసిన కలియుగ ప్రత్యక్షదైవం, మాఇంటి ఇలవేల్పు భరద్వాజస గోత్రీకులు, శ్రీశ్రీశ్రీ వేంకటేశ్వరస్వామి వారికి నా మనఃపూర్వక శతకోటి పాదాభివందనములు.

కంప్యూటర్ సాంకేతిక మెళకువలలో నాకు సంపూర్ణ సహకారాలందించిన అత్యంత ఆప్తుడు, శ్రీ మైలవరపు సత్యమాచిరాజు, సీనియర్ అసోసియేట్ ప్రొఫెసరు, వ్యవసాయ ఆర్థిక శాస్త్రం, శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల, తిరుపతి వారికి సహృదయంతో నా కృతజ్ఞతలు. ఈ గ్రంథరూపకల్పనకు, తుదిమెరుగులకు సహకరించిన డా॥ శ్రీ టి.రవి, ప్రజాసంబంధాల అధికారి, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి వారికి ఆత్మీయ కృతజ్ఞతలు.

ఈ అధ్యయనం అంకురార్పణకు "ముందుమాట" శీర్షిక ద్వారా పండితులు, ఆధ్యాత్మిక వేత్తలు అభిప్రాయం అందచేశారు. వారిలో ప్రముఖులు – "1. బ్రా॥శ్రీ॥వే. కందాడై రామానుజాచార్యులుగారు, ఉపన్యాస శిరోమణి, వేద విభూషణ ఆధ్యాత్మికవేత్త, 2. బ్రా॥శ్రీ॥వే॥ డా॥ హెచ్.ఎస్. బ్రహ్మానందగారు, విశ్రాంత డీన్, తెలుగు శాఖ, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, మరియు ఎమిరెటస్ ప్రొఫెసర్ (తెలుగుభాష) యు.జి.సి. ఈ ఇద్దరు ఆధ్యాత్మికవేత్తలు, భాషావేత్తలు ఎంతో ఓర్పు, సహనం, సంయమనంతో ఈగ్రంథాన్ని ఆమూలాగ్రం పరిశీలించి, విశ్లేషించి, వారి అభిప్రాయాలను సుస్పష్టంగా నివేదించారు. వీరిద్దరికీ నిండు మనస్సుతో నా నమస్కారములు, కృతజ్ఞతలు.

ఈ అధ్యయనం కార్యరూపందాల్చి ఒక ప్రామాణికగ్రంథంగా రూపుదిద్దుకోవటానికి నాకు అన్నివిధాలా సహకరించిన కుటుంబసభ్యులు, నా ధర్మపత్ని శ్రీమతి అన్నపూర్ణ సీతామహలక్ష్మి కుమారులు చి॥ వేంకట సుబ్రహ్మణ్యం, చి॥ కృష్ణకాంత్, కుమార్తె చి॥ల॥సౌ॥ గాయత్రిలకు అభినందనలు, ఆశీస్సులు.

ఎన్నో గృహకృత్యములు, కుటుంబంలో నిర్వహించు కార్యక్రమముల పని వత్తిడిలోనూ నాకు సహకరించిన, సలహాలు అందించిన నా సోదర త్రయం చివుకుల సీతారామయ్య, ఆంజనేయశర్మ మరియు వాసుదేవమూర్తికి మనఃపూర్వక అభినందనలు, ఆశీస్సులు.

**– చివుకుల రమాకాంత శర్మ**
తెనాలి.



అస్మద్గురుభ్యో నమః

## మానవసంబంధాలు – మా 'నవ' సంబంధాలు

శ్రీ చివుకుల రమాకాంతశర్మగారు సత్సంకల్పంతో అధ్యయనం చేసిన ''పురాణకాలంలో మానవసంబంధాలు'' (రామాయణ–భారతాలు) అందమైన గ్రంథంగా ముద్రింపచేసి, దానిపై నా అభిప్రాయాన్ని అందించవలసినది అని నన్ను కోరినారు. వారికి నాపై ఉన్న ఆదరాభిమానాలు ఆ పని చేయించి ఉంటాయని నా భావన.

భారతీయులకు రామాయణ, భారత ప్రాణసమానములు. సర్వాధికముగా సర్వాధికులచే సమాదరించబడుచున్నవి. ఇందులోని మానవసంబంధాలను నేటి సమాజానికి రాబోవు తరాలకు అనంత భావికాలాలకు ఎట్లు ఆదర్శాలోఅనుసరణీయాలో చక్కగా వివరించబడియున్నవి. ఇవి ఒక కాలంలో మాత్రమే ఆచరించవలసినవి కావు, అనుసరించవలసినవి కావు. ఇవి సార్వకాలీనాలు. ఒక్కమాటలో చెప్పాలంటే మానవులున్నంతకాలం, వారిలో మానవత్వమున్నంతకాలం, మానవత్వాన్ని కలకాలం పదిలంగా పరిరక్షించుకోవాలనుకున్నంతకాలం ఈ సంబంధాలు విలువలు తెలుసుకోవాలి, ఆచరించాలి, అనుసరించాలి. ఈ విషయాన్ని రమాకాంతశర్మగారు ఈ అధ్యయనంలో చక్కగా నిరూపించియున్నారు. ముఖ్యముగా భాష భావప్రకటనా ఆబాలగోపాలం అలరించే విధంగా అందరికీ అర్థమయ్యే సరళ భాషలో శైలిలో పొందుపరిచినారు. పురాణకాలంలోని సంఘటనలు, సన్నివేశాలు, పాత్రలు, పాత్రల ప్రవర్తనలు, సంభాషణలు భావాలు, అనుభవాలు, ఉపదేశాలు, సందేశాలు, ఆదేశాలు, స్తోత్రాలు, ఆరాధనలు, ఆవేదనలు, అనుతాపాలు, పరితాపాలు, సంతాపాలు, మానవసంబంధాలకు సంకేతాలుగా పేర్కొనవచ్చు.

ధర్మాచరణ, సత్యవాక్పరిపాలన అనగా సత్యపరిపాలన, వాక్యపరిపాలన సర్వభూతదయ, శత్రువులను కూడా ప్రేమించగలగటం, దాంపత్యబంధాలు, తోటికోడళ్ళు, తల్లిదండ్రులు, పుత్రులు, అన్నదమ్ముల అన్యోన్యత, ఆప్యాయత, ఆచార వ్యవహారాలు, సంస్కృతీసంప్రదాయాలు ఇవి అన్ని కాలాలలో మానవసంబంధాలను పెంచటంలో దృఢమైన ఆలంబనాలు ఆధారాలు, ఆయుధాలు కూడా. రమాకాంతశర్మ గారు ఈ అధ్యయనంలో వీటిని చక్కగా ఎత్తిచూపి నిరూపించియున్నారు.

ఈ విషయాన్ని రామాయణ, భారత పురాణాలనుండి వాటిలోని పాత్రలు సన్నివేశాలు, సంభాషణలు మొదలుగాగల వాటిని చక్కగా విశ్లేషించి చూపియున్నారు. ఇందులో రమాకాంతశర్మగారు మొదట చూపిన మానవసంబంధం అత్యంత ప్రాధాన్యాన్ని పేర్కొన్న సంఘటన చక్కని సర్వోత్తమ గుణం, లోకోపకారవ్రతం. ఇది మన పురాణ ఇతిహాసాలలోని పాత్రలలో చాలా స్పష్టంగా కనిపిస్తున్నది. అసలు ఋషుల పురాణ ఇతిహాసాల రచనే లోకోపకారవ్రతం వల్ల కాదా! అదే లేనినాడు తమ తపస్సేమో, తమ ధ్యానమేమో, మోక్షమేమో తాము చూచుకునేవారు కాదా. అంతేకాదు, ఋషుల కోట్లకొద్ది ఉపదేశాలు, సందేశాలు, ఆదేశాలు లోకోపకారవ్రతం వల్లనే కదా! రామాయణంలోని ఆదిత్యహృదయోపదేశం భారతంలోని విష్ణుసహస్రనామోపదేశం, విదుర మైత్రేయ సంవాదం, ఇట్లు అన్ని సంవాదాలు, ఉపదేశాలు, లోకోపకారవ్రతం వలన లోకోపకారం చేసినవే కదా! దానిని గుర్తించగలిగిన నాడు అన్ని మానవ సంబంధాలు లోకోపకారవ్రతం వలనే ఏర్పడుతాయి. వృద్ధిపడుతాయి, విస్తరిస్తాయి, కలకాలం నిలుస్తాయి అని నిరూపించియున్నారు. ఈ లోకోపకారవ్రతాన్ని పరిపూర్ణంగా ఆచరించినవాడు నారద మహర్షి. రామాయణంలోనే కాదు భారతంలో, అనగా కృత, త్రేతా, ద్వాపరయుగాలలో మానవసంబంధాలను లోకోపకారవ్రతంద్వారా పెంపొందించిన ఆదిఋషి నారదమహర్షి.



వాల్మీకికి రామాయణ రచనను చేయమని, రాముని గుణాలను బోధించినవాడు, వ్యాసభగవానునకు భాగవతరచన చేయమని ఉపదేశించినవాడు నారదమహర్షియే, అంతేకాదు, హిరణ్యాక్ష, రావణ, శిశుపాల, నరక, జరాసంధ, కాలయవనాది రాక్షస వీరులను అనునయంతో చాతుర్యంతో మరీ విజృంభించి లోకోపద్రవాలు కలుగకుండా అనగా కలుగజేయకుండా నియంత్రించిన మహానుభావులు నారద మహర్షియే. న్యాయంగా చెప్పాలంటే : నారద మహర్షి–మానవసంబంధాలు, వ్యాసమహర్షి–మానవసంబంధాలు, మార్కండేయ మహర్షి–మానవసంబంధాలు అని ఒక్కొక్క మహర్షి పెంపొందించిన, అనుసరించిన, ఆచరించిన మానవతావిలువలు, మానవతాసంబంధాల మీద ఒక్కొక్క పరిశోధన, ఏర్పరచి అందించవచ్చు. ఒక్కొక్క పరిశోధన 2000ల పేజీలకు తక్కువ కాకుండగా ఉంటుంది. ఇటువంటి పరిశోధనలను భారత ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల మంత్రిత్వశాఖ కొందరిద్వారా వివిధ భాషలలో రచింపచేసి అందించాలి. ఒక్క భారతదేశానికే కాక యావత్ప్రపంచానికి ఎంతో మేలు చేసిన వారౌతారు. ముఖ్యంగా మన పురాణాల మీద, ఇతిహాసాలమీద చిన్నచూపు గలవారికి, ఇటువంటి పరిశోధనల ద్వారా కనువిప్పు కలుగుతుంది. ఎంతటి విలువలు, విశేషాలు, అద్భుతాలు ఉన్నవో తెలియదు కదా!

ఇక రామాయణంలో ఎంతోమంది మహాపురుషులు మహోన్నతవ్యక్తులు, మహర్షులు రాజులు వీరి చరిత్రను గమనించిననాడు మన మీనాడు కలవరిస్తున్న, పలువరిస్తున్న వ్యక్తిత్వ వికాస లక్షణాలు, గుణాలు, నాయకత్వ లక్షణాలు, అభిప్రాయప్రకటనలో చాతుర్యాలు, సేవాభావం, విధాన నిర్ణయంలో వైశిష్ట్యం ఇట్లా ఎన్నో ఉన్నాయట.

ముఖ్యంగా రామాయణ, భారత కాలాల్లో సర్వభూతదయ, సర్వప్రాణి సమాన దృష్టి. భార్యకు ముఖ్యంగా స్త్రీకి ఇచ్చిన మహోన్నతస్థానం, రాజుల సత్పరిపాలన, ప్రజలపై రాజులకున్న వాత్సల్యం, రాజులపై ప్రజలకున్న

అనుబంధాలు, సంబంధాలు, సోదరుల ప్రేమ, దాంపత్యవిలువలు, సేవకులపై ప్రభువుల చూపు, ఆదరణ, ఇవన్నీ మానవసంబంధాలే. వాటిని ఆయా సంఘటనలను ఉదహరించి రమాకాంతశర్మగారు చక్కగా చూపినారు.

ఒక వానరం, ఒకసర్పం, ఒక భల్లూకం, ఒక పావురం, ఒక కాకి, ఒక కొంగ, ఒక చిలుక, ఒక పంజరం–ఇవన్నీ రామాయణ భారతాలలో పాత్రలే. మానవసంబంధాలను ఎత్తిచూపడంలో నిలువెత్తు దర్పణాలు.

ప్రధానంగా ఉద్బోధించినవి ఇంద్రియ నిగ్రహం, మాతృ పితృ భక్తి, గురుభక్తి, సత్యవాక్యనిష్ఠ, స్వాధ్యాయ అధ్యయనం, కథారూపంలో జీవితవిలువలను బోధించేవారు. విశ్వామిత్ర మహర్షి రామలక్ష్మణులకు ఎన్ని కథలు బోధించినారు. మార్కండేయుడు ధర్మరాజునకు, సాంబుని పుత్రుడు వజ్రునకు ఎన్నికథలను బోధించినారు కథావివరణలలో ఎన్ని ప్రధానమైన మానవవిలువలను బోధించినారు, మహాభారతంలో భీష్ముడు శాంతి, అనుశాసనికపర్వాలలో ధర్మరాజునకు ఎన్ని కథలు, ఎన్ని సత్యాలు, రాజధర్మాలు స్త్రీ ధర్మాలు, ఆపద్ధర్మాలు, దానధర్మాలు, మోక్షధర్మాలు ఇట్లు ఎన్నెన్ని ధర్మాలను మానవతావిలువలను సంబంధాలను కథల ద్వారా బోధించినారు. అసలు కథా కథనమే మానవతాసంబంధాలను పాదుకొలుపుటకు మూలాధారాలుగా చెప్పుకొనవచ్చు. శ్రీరమాకాంత శర్మగారు రామాయణంలో, మహాభారతంలోని ప్రతి సన్నివేశాన్ని, ప్రతి పాత్రను, ముఖ్యమైన ఆ పాత్రల ప్రవర్తనలో ఆంతర్యాన్ని, వారి సంభాషణలోని విలువలను చక్కగా ఎత్తిచూపినారు.

ముఖ్యంగా గుహుని చరిత్ర, శబరి చరిత్ర, త్రిజట, అనల చరిత్రలు, మండోదరి, తార, కౌసల్య, సీత మొదలగు పాత్రలలో ఔన్నత్యాలు వారి జీవిత విశేషాలు బోధించిన మానవసంబంధాలు చక్కగా నిరూపించినారు. మానవులలోనే కాకుండా జంతువులలో కూడా మానవసంబంధాలు ఎలా చూపారో వివరించారు.



ఈ గ్రంథం రమాకాంతశర్మగారి అత్యుత్తమ కృషి నేటి సమాజానికి అందించే అనర్ఘోపాయనము. ఒక్క తెలుగులోనే కాక ఆంగ్లంలో, హిందీలో కూడా అందించిననాడు భారతదేశానికి ఇది మహోపకారకమౌతుంది. ముఖ్యంగా నేటి సమాజంలో వేస్తున్న వెర్రితలలకు కొంతైనా గుణపాఠం అవుతుంది. ముఖ్యంగా నేటి యువత తప్పక చదివి తీరవలసిన గ్రంథం. అన్ని కళాశాలలవారు, అన్ని శాఖలవారు, అన్ని విశ్వవిద్యాలయాలవారు ఆయా పరీక్షలలో పాఠ్యగ్రంథంగా దాన్ని నిర్ణయించి యువకులచే చదివించిన నాడు ప్రపంచమే సర్వమానవ సౌభ్రాత్ర క్షేత్రరాజమౌతుంది అని నా అభిప్రాయం. ఇంత చక్కని గ్రంథాన్ని అందించినందుకు రమాకాంతశర్మగారికి శుభాభినందనలందిస్తూ 'ఒక్కొక్క ఋషిచరిత్ర మానవ సంబంధాలు' శీర్షికలతో ఒక్కో గ్రంథరచన చేసి సమాజానికి కొత్త ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని అందించాలి. అలాంటి శక్తిసామర్థ్యాలు, ఆయురారోగ్యాలు ఆ భగవంతుడు శ్రీవేంకటచలాధీశుడు వేంకటేశ్వరస్వామి ప్రసాదించాలని ప్రార్థిస్తూ . . . .

ఇట్లు
బుధజనవిధేయుడు

**డా॥ కందాడై రామానుజాచార్యులు**
ప్రధానాచార్యులు,
శ్రీవేంకటేశ్వర వేదాన్తవర్ధినీ సంస్కృతకళాశాల
సికింద్రాబాదు.

# ఇతిహాస రహస్య నిధి

శ్రీ చివుకుల రమాకాంతశర్మగారు సుప్రసిద్ధ రచయిత. భారతీయ సంస్కృతిని విద్యార్థులలో, యువతీ యువకులలో గత నాల్గు దశాబ్దాలుగా ప్రచారం చేస్తున్న నిబద్ధతగల విద్వాంసుడు. తిరుమల తిరుపతి దేవస్థానాల ఉద్యోగులకు భారతీయ విలువల పట్ల విశిష్ట ఉపన్యాసకులుగా వ్యవహరిస్తున్న వీరు 'యువత–భవిత' అనే ఉత్తమ గ్రంథాన్ని రెండు మూడు నెలలక్రితం రచించి ప్రచురించారు. దానిని భారత ప్రభుత్వ భారతీయ భాషల అధ్యయనసంస్థ (మైసూరు) ఉత్తమగ్రంథంగా పరిగణించి ధనసహాయం చేసింది.

ఇప్పుడు వారు ప్రచురిస్తున్న ఈ గ్రంథం **"పురాణకాలంలో మానవ సంబంధాలు."** వారు ప్రధానంగా మానవసంబంధాలకు, పరిపాలనా వ్యవహారాలకు సంబంధించే వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పనిచేసినవారు కావటంవల్ల ఈ అధ్యయనాంశం వారికి కొట్టినపిండి. వారితో నేను ఎప్పుడు చర్చించినా పురాణాలలో కనిపించే ఉదాత్త మానవసంస్కృతిని గురించే మాట్లాడుకుంటాం. 'మానవసంబంధాలు' అనే అంశం సాంప్రదాయకమైన పదం కాకపోయినా దాని అర్థం మానవసంఘటనకు మూలమైన ధర్మసంబంధమనే అర్థం చేసుకోవాలి.

యుగయుగాల జీవితాన్ని మానవచరిత్ర వ్రాసింది. చరిత్ర పరిశోధనకు అందని ప్రాచీనత పురాణాలలో ఉంది. వాటిలో ఎన్నో లక్షల సంవత్సరాల మానవ సంస్కృతీ పరిణామక్రమం చర్చించబడి ఉంది. పురాణకాలం అంటే చరిత్రకందని మానవ పరిణామ కాలమని అర్థం.

ఉదాహరణకు తిరుమల కొండ మీద 'శిలాతోరణం' ఉంది. దాని వయస్సు 200 కోట్ల సంవత్సరాలని ఆర్కియాలజీ శాస్త్ర పరిశోధకులు 'కార్బన్' శాతాన్ని ఆధారంగా నిర్ణయించారు. తిరుమలకు ఆదివరాహక్షేత్రమని పేరు. శ్వేత వరాహకల్పమని పిలువబడిన ఈ ఒక

కల్పంలోని, వైవస్వతమన్వంతరంలోని కలియుగంలో ప్రథమపాదంలో మనమున్నాం. శ్వేతవరాహరూపంలో భూమిని సముద్రంనుండి ఉద్ధరించి 195 కోట్ల పై చిలుకు సంవత్సరాలవుతోందని యుగాల పరిగణన ప్రకారం పురాణపండితులు చెబుతారు. ఈ రెండూ సమన్వయం పొందుతున్నాయి. ఇది చరిత్రకందని కాలం. దీన్నే పురాణకాలమని అంటాం. సముద్రాంతర్భాగాలలోనే శిలాతోరణాలు ఏర్పడతాయని పరిశోధనలు గుర్తించాయి. అందుచేత ఇప్పుడు తిరుపతికి 100 కిలోమీటర్లదూరంలో సముద్రం ఉండగా పురాణకాలంలో ఈ ప్రాంతమంతా సముద్రంగా ఉండేదని అర్థం. దీనినుండి భూమిపైకి వచ్చింది. సముద్రం దూరానికి జరిగింది. దీనికి పురాణకథే వరాహావతారగాథ.

ఇలాంటి ప్రాచీన కాలంలోని మానవసంబంధాలను గురించి ఎందుకు తెలుసుకోవాల్సి ఉంది? ఎందుకంటే భారతీయులు సంస్కృతిలో బ్రతికే ఒక లక్షణం కల్గినవారు. సంస్కృతి 'పురాణం' ద్వారా తెచ్చిన పరంపరాగత బలం కల్గింది. అందుకే ప్రపంచంలోని ఇతర దేశాలకన్నా భారతదేశం ఇప్పటికీ పుణ్యం- పాపం, ధర్మం-అధర్మం, స్వర్గం-నరకం, మంచి-చెడు ఇలాంటి ద్వంద్వాల్ని పరిగణించి మంచిని గౌరవిస్తోందంటే ఈ భావాలు చరిత్రకందని పూర్వకాలంలో నుండే భారతీయులలో నరనరాలలో జీర్ణించుకొనిపోయి ఉన్నవనే భావించాల్సి వస్తోంది. ఎందుకంటే భారతీయచరిత్రలో సంస్కృతి, కాల్పనికత, పురాణగాథలు, పురావృత్తాలు అన్నీ కలిసే ఉన్నాయి. భారతీయ సాహిత్యాన్ని వదలి చరిత్రను మనం పునర్నిర్మించలేము. సాహిత్యం సంస్కృతిలో భాగం. ఆ సంస్కృతి పురాణప్రబోధితం కావటమే విశేషం. అందుకే ఈ అధ్యయనాన్ని శర్మగారు చేపట్టారు.

రామాయణం దాంపత్యం-కుటుంబం వీటికి సంబంధించి బోధించగా, భారతం ఉమ్మడి ఆస్తిని ఎలా పంచాలి - అన్న ధర్మాధర్మ మీమాంస చేసి



చివరకు అర్థం అనర్థదాయకమని మానవసంబంధాలు అర్థాన్ని అంటిపెట్టుకొన్నంతకాలం మనిషికి శాంతిలేదని బోధించగా, భాగవతం మనిషి జంతుప్రపంచంలో విలక్షణుడని దివ్యప్రకృతి అతని లక్షణమని ఆత్మతత్త్వమే ఆ దివ్యలక్షణమని, ఆత్మజ్ఞానమే మానవ జీవనగమ్యమని, దానికి 'భక్తి' ప్రధానసాధనమని, భగవంతుని గుర్తించటమంటే స్వాత్మ జ్ఞానానుభూతిని పొందటమేనని సిద్ధాంతం చేసింది. భగవంతునికి జీవునికి ఉన్న అనివార్య సంబంధం మనిషికి సహనాన్ని, పరోపకార బుద్ధిని, ధార్మికచింతనను కల్గిస్తోందని, ఇదే మానవజీవితం సంపూర్ణం కావటానికి సహకరించే 'భావన' అని ప్రబోధించింది.

ఈ రెండు గ్రంథాలలోని విలక్షణ మానవీయ విలువలను, వివరిస్తూ క్రమంగా కృత-త్రేత-ద్వాపర-కలియుగాలలో ఈ సంబంధాలు ఎలా పరిణమిస్తూ వచ్చాయో ప్రతి పుటలోనూ శర్మగారు నిరూపించారు. ఈ గ్రంథాన్ని చదివితే ఆ రెండు మూల గ్రంథాలను చదివిన ప్రయోజనమూ యువతీ యువకులకు తప్పకుండా కలుగుతుంది. ఈ ప్రయోజనం ఆధునిక విద్యలోని ఏ 'సిలబస్' ద్వారానూ రావటంలేదు. అందుకే 'ధర్మ' మనే ఒక ప్రగాఢ జ్ఞాన సంపదను ఈ ఇతిహాసాలు జీవన ప్రమాణంగా నిరూపించాయి. ధర్మం నాల్గు పాదాలుగా ఉన్నది కృతయుగమని, ఒకపాదం లోపించి త్రేత, రెండు లోపించి ద్వాపరాలు కాగా, ఒకే పాదం మిగిలి కలియుగమయిందని, అది కుంటుతూ ఉంటుందని ధర్మంచేత అధర్మం సంపూర్ణంగా ఆక్రమించబడటమే 'కలి' అని పురాణాలు స్పష్టంగా చెప్పాయి.

కృతయుగంలో 'తపస్సు', త్రేతలో 'యజ్ఞం', ద్వాపరంలో 'ధర్మకర్మ'లు, మానవసంబంధాలను నిలబెట్టాయి. కలియుగంలో మానవసంబంధాలు సంపూర్ణంగా భగ్నం కావటానికి అర్థకామాల విజృంభణమే ప్రధానహేతువు. దీన్ని ఎలా నియంత్రించే ప్రయత్నం ప్రాచీనకాలంలో జరిగిందో రామాయణ, భారతాలలో ఉంది.

అందుకే మానవ జీవితాన్ని ఆక్రమించే పురుషార్థాలు మానవ సంబంధాలను ఎలా నియమిస్తూ వచ్చాయో నిరూపించే విధంగా ఆయా ఇతిహాసాలకు ప్రణాళిక సిద్ధం చేసుకొని ప్రతిగ్రంథంలో విశ్లేషణ ఇచ్చారు. వాటిని చదివితే ఎంత సునిశిత పరిశీలనను వారు చేపట్టారో తెలుస్తుంది. వారు మూలగ్రంథాలను పరిశీలించి, ఎన్నో ప్రామాణిక గ్రంథాలను అనుశీలించి స్వతంత్రంగా సామాన్య పాఠకునికి కూడా అర్థమయ్యే రీతిలో ఈ గ్రంథాన్ని రచించారు.

ఈ గ్రంథాలప్రయోజనం ఏమిటో చివరికి శర్మగారు ఇలా సంక్షిప్తీకరించారు.

"ఈనాటి సకల వర్ణాల సామాజిక స్థితిగతులమధ్య అందరి శుభ భావనల వేదనాదం, నినాదంకూడా 'సర్వేజనా స్సుఖినో భవంతు' కావాలి. అదే నిత్య సత్య శుభాకాంక్ష.

ఇది గొప్ప ఆశావహ దృష్టి. సకారాత్మక దృక్పథం. ఇవి నశించి నిరాశ, నిస్పృహ. నకారాత్మకత ఇవి వ్యాపించి మనుష్యులు సంకుచించుకుపోతున్న ఈ రోజులలో మంచి 'అమృతాంజన' ఘుటిక ఈ గ్రంథం.

ఈ గ్రంథం తప్పక ముద్రణ పొందాలని విస్తృతంగా ప్రచారంలోకి రావాలని మనసారా శ్రీనివాసుని ప్రార్థిస్తూ ఇలాంటి మరెన్నో గ్రంథాలను శ్రీశర్మగారు రచించాలని కోరుకుంటూ పాఠకులకు స్వాగతం పలుకుతున్నాను.

**ఆచార్య హెచ్.ఎస్.బ్రహ్మానంద**
విశ్రాంత కార్యదర్శి,
హిందూ ధర్మప్రచార పరిషత్,
తి.తి.దే. తిరుపతి.

# విషయసూచిక

పేజీ నెం.

| | |
|---|---|
| ముందుమాట | iii |
| ఒకమాట | v |
| మానవసంబంధాలు - మా'నవ' సంబంధాలు | xi |
| ఇతిహాసరహస్యనిధి | xvii |

## ప్రథమభాగం
## రామాయణకాలంలో మానవసంబంధాలు

| | |
|---|---|
| 1. పరిచయం | 1 |
| 2. శ్రీరాముని వ్యక్తిత్వం | 10 |
| 3. సీతారాముల దాంపత్యం | 12 |
| 4. భార్యాభర్తల సంబంధం | 14 |
| 5. సీతకు కౌసల్య సలహా | 15 |
| 6. సీతారాముల అంతరంగం | 16 |
| 7. శ్రీరామునిపై ప్రజల అభిమానం | 18 |
| 8. ప్రజల మనోభావాలు | 19 |
| 9. అన్నదమ్ముల ధర్మాచరణ | 20 |
| 10. గుహుని సాన్నిహిత్యం | 23 |
| 11. ఋష్యాశ్రమాలతో సంబంధాలు | 25 |
| 12. ప్రకృతితో సంబంధాలు | 27 |
| 13. శూర్పణఖ-దుష్టసంబంధాలు | 27 |
| 14. మారీచుని మానవతా దృక్పథం | 30 |
| 15. సీతాపహరణ | 34 |
| 16. రావణుని వ్యక్తిత్వం-దుష్ప్రవర్తన | 37 |
| 17. సీత రాముడికే అంకితం | 39 |
| 18. అశోకవనంలో సీత - అనుకూల సంబంధాలు | 40 |

19. సీతకోసం రాముని అన్వేషణ 41
20. జటాయువుతో సంభాషణ–అన్నదమ్ముల కరుణ 42
21. సుగ్రీవునితో స్నేహ సంబంధాలు 46
22. సీతాన్వేషణలో వానరులు 55
23. హనుమ రాయబారం 62
24. రాముని యుద్ధసన్నాహాలు 71
25. విభీషణునికి–రామునితో సంబంధాలు 77
26. సముద్రుని సేవ 82
27. శుక, సారణులగూఢచర్యం–రాముని కరుణ
సీతతో సరమ సంబంధాలు 84,85
28. రావణుని మానసికస్థితి 86
29. అంగదరాయబారం 88
30. లక్ష్మణునిపై రాముని మమకారం 89
31. గరుత్మంతుని సేవ 90
32. రావణుని స్వయంకృతాపరాధం 91
33. రామ–రావణయుద్ధం 96
34. రావణుని వధ 98
35. దశరథుని దర్శనం – సందేశం 106
36. అయోధ్యకు రాముని ప్రయాణం 109
37. రాముని కృతజ్ఞతలు 110
38. భరద్వాజాశ్రమ సందర్శన 111
39. రామ – భరతుల కలయిక – సంభాషణ 113
40. శ్రీరాముని పట్టాభిషేక సన్నాహాలు 114
41. బంధాలు – అనుబంధాలు 118
42. ఆంజనేయుని వాక్శక్తి 121
43. కుబేరుని ఔదార్యం – రాముని విశాల హృదయం 123



44. రాముని సుపరిపాలన – ప్రజాసంబంధాలు 124
45. ఆదర్శరాముడు 126
46. ధర్మో రక్షతి రక్షితః 128
47. అన్నదమ్ముల అనుబంధాలు 129
48. తల్లిదండ్రులు – తనయుల సంబంధాలు 131
49. ధర్మంతోనే మనుగడ 133
50. గౌరవించటం – రాముని లక్షణం 134
51. దంపతుల ఆదర్శ జీవనం 135
52. రామాయణకాలంలో గురుశిష్య సంబంధాలు 136
53. సీత భూమాతలో ఐక్యం చెందటం 142
54. శ్రీరాముడు దివ్యధామానికి చేరవ 143
55. శ్రీరాముడు వైకుంఠ ప్రాప్తి–ఆర్తితో అనుసరిస్తున్న జనసందోహం 145
56. రామాయణకాలంతో నేటి ప్రజలకు సంబంధాలు 146

## ద్వితీయభాగం

## భారతకాలంలో మానవసంబంధాలు

పేజీ నెం.

**I · పరిచయం**
1. మహాభారతం 160
2. ద్వాపరయుగం 160
3. కురువంశవృక్షం 162
4. భారతం విశిష్టత 164

**II. మహాభారతం – మానవసంబంధాలు**
5. పాండవులు–కౌరవులు మనస్పర్ధలు 167
6. పాండవులు–వారి సంబంధాలు 168

7. బంధాలు–అనుబంధాలు 172
8. తోడికోడళ్ళ సంబంధాలు 172
9. కౌరవవంశం – వ్యక్తిత్వం 174
10. మాటల నైపుణ్యం 175
11. దుష్యంతుని సుపరిపాలన 176
12. పాండవులు–ప్రజలమధ్య సంబంధాలు 177
13. విదురుడు, వ్యాసుని హితబోధ 178
14. బ్రాహ్మణులతో పాండవుల సంబంధాలు 180
15. ధృష్టద్యుమ్నుడు, ద్రౌపది జననం 183
16. ధర్మజుని మానవతాదృష్టి 184
17. పాండవులు ధౌమ్యునితో సంబంధాలు 186
18. ద్రౌపది స్వయంవరమహోత్సవం 186
19. కోడలు ఎలా వుండాలి? 191
20. దుష్టసంబంధాలకు పునాది 193
21. పాండవులకు ప్రజల జేజేలు 195
22. పాండవులకు అర్ధరాజ్యం 196
23. ద్రౌపది విషయంలో నియమంతో సోదరుల సంబంధాలు 197
24. ధర్మజుని వ్యక్తిత్వం 198
25. నారదుని రాజనీతి 200
26. ధర్మరాజు రాజసూయయాగం 207
27. కౌరవుల ఈర్ష్యాసూయలు 212
28. కౌరవుల కుతంత్రాలు – క్షీణించిన సంబంధాలు 225
29. పాండవుల గుణగణాలు 227
30. అరణ్యవాస ప్రవేశం 227
31. కుటుంబ కలహాలు – చెదిరిన సంబంధాలు 228





32. అజ్ఞాతవాస సమయంలో సంబంధాలు 236
33. విరాటునిపై దండయాత్ర 240
34. రాయబారవ్యవస్థ – సత్సంబంధాలు 242
35. శ్రీకృష్ణుని విశ్వరూపం 261
36. గీతా మకరందం 264
37. భీష్ముని ధర్మసూక్ష్మాలు 265
38. భీష్ముడు – మానవసంబంధాలు 269
39. విష్ణుసహస్రనామం – ప్రజలలో చైతన్యం 270
40. ప్రజలు – ప్రభుత్వాలు – ప్రజాసంబంధాలు 272
41. సుపరిపాలన 277
42. కుశలప్రశ్నలు 278
43. ధర్మో రక్షతి రక్షితః 281
44. భారతవీరుని వ్యక్తిత్వం 282

# రామాయణకాలంలో మానవసంబంధాలు

## 1. పరిచయం

భరతభూమిలో విఖ్యాతిగాంచిన శ్రీమద్రామాయణం సులభగ్రాహ్యంగా ఉండటంవల్లనూ, కథాకథనం రమణీయంగా, సాంప్రదాయకంగా ఉండటం చేతనూ అందరినోళ్ళలోనూ నానుతోంది. రామాయణాన్ని మొట్టమొదటిసారిగా వాల్మీకి మహర్షి సంస్కృతంలో రచించాడు. ఆయనే ఆదికవి. ఆ తర్వాత భారతదేశంలోని వివిధ ప్రాంతీయభాషల్లో రచించారు. మరెన్నో వివరణలతో, విశ్లేషణలతో ఎందరో మహానుభావులు పండితులు, పామరులు, సాహితీవేత్తలు, కవులు ముఖ్యమైన అంశాలను ఎంచుకొని భారతీయులకు అవగాహన కల్పించారు. ప్రపంచభాష అయిన ఆంగ్లభాషలోకి అనువదించారు.

ప్రపంచంలో ఇంతవరకు ఉన్న గ్రంథాలన్నిటిలో రామాయణంతో సమానమైన గ్రంథము ఏది లేదని మహాపండితులు, లౌకికులు, వైదికులు స్వదేశీయులు, విదేశీయులు, నాగరికులు, జానపదులు, సంగీతకళాకారులు అందరూ కూడ ముక్తకంఠంతో అంగీకరించారు. అందుకే శ్రీమద్రామాయణానికి ఆదికావ్యమనేపేరు వచ్చింది.

### రామాయణం విశిష్టత

రామాయణంలోని వర్ణనలు ఎప్పుడూ గుర్తుకు వస్తాయి. విభిన్న వృత్తాలతో, అలంకారాలతో పాఠకుల హృదయాలను ఆనందంతో, ఉత్సాహంతో ఊగించే మహాకావ్యం శ్రీమద్రామాయణం. త్రేతాయుగంలో శ్రీరామునితో సన్నిహితంగా ఉన్న మహర్షులు, మహనీయులు, ధర్మవేత్తలు వివిధ కోణాలలో, అంశాలలో రామాయణ కావ్యాన్ని రచించారని చరిత్ర చెబుతోంది. వాటిలో ముఖ్యమైనవి – విశ్వామిత్ర రామాయణం, వశిష్ఠరామాయణం, హనుమద్రామాయణం, విభీషణరామాయణం . . . . . . ఇలా రచించారని తెలుస్తోంది. అయితే అవి అన్నీ అందుబాటులో

లేవని పరిశోధకులు చెబుతున్నారు. ప్రస్తుతయుగంలో శ్రీమద్రామాయణాన్ని కవులు, సాహితీవేత్తలు, మహర్షులు వివిధ అంశాలనుఎన్నుకొని వివిధమైన పేర్లతో రామాయణాన్ని రచించారు. రంగనాథరామాయణము ఆధ్యాత్మరామాయణం, నిర్వచనోత్తరరామాయణం, మొల్లరామాయణం, భాస్కరరామాయణం, రామచరితమానస్, కంబరామాయణం, రామాయణ కల్పవృక్షం, మొదలైన పేర్లతో రచించి రామాయణ విశిష్టతను ప్రజలకు అందించారు. ఆవిధంగానే రామాయణకాలంలోని వివిధ ఘట్టాలను, సంఘటనలను ఎంచుకొని చిత్రసీమలో కమ్మని పాటలతో, మాటలతో, ఆటలతో, పద్యాలతో, శ్లోకాలతో కనువిందుచేసే దృశ్యాలు చిత్రీకరించి రామాయణాన్ని చిరస్థాయిగా ప్రజల హృదయాలలో చెరగని ముద్రవేశారు.

సినిమాలు రాకపూర్వం తోలుబొమ్మలాటలు, పురాణాలు, హరికథలు, బుర్రకథలు, యక్షగానాల రూపంలో రామాయణాన్ని వినటం, చూడటం జరిగింది. ఆనాడు ఇవన్నీ ప్రచారసాధనాలుగా ఉండేవి. పురాణకథలు, గాథలు ఈ సాధనాలద్వారానే ప్రజల మనస్సులో చోటు చేసుకొన్నాయి. పురాణాలలోని పాత్రలను, వారి చర్యలను, వారి సత్ప్రవర్తన, ధర్మం, న్యాయం, సత్యం, సేవాగుణం అలవరచుకొనేవారు.

రామాయణం ఇంతపేరు, ప్రఖ్యాతులు పొందటానికి కారణం సంస్కృతభాషలో వాల్మీకి రచనాశైలి. సంస్కృతంలో 24,000 శ్లోకాలతో రచించాడు ఆదికవి వాల్మీకి. సంస్కృతంలో శ్లోకాలు చదువుతున్న సమయంలో భాష రానివారికి సయితం వినటానికి ఇంపుగా, సులభతరంగా అర్థం అవుతాయి. రామాయణంలోని కథానాయకుడు శ్రీరాముడు. శ్రీరాముని అవతారానికి సంబంధించిన సంఘటనలన్నీ వాల్మీకి హృదయాకాశంలో స్పష్టంగా గోచరించాయి. పూర్వం బాలురకు ఇండ్లల్లో బాలరామాయణం శ్లోకాలతో, అర్థ, తాత్పర్యాలతో చదివించి కంఠస్థం



చేయించేవారు. బాలురకు భక్తి, వైజ్ఞానిక, సత్ప్రవర్తనలు లభించాలని పెద్దల కోరికగా ఉండేది. ప్రపంచదేశాలైన రష్యా, మలేషియా, చైనా, ఇండోనేషియా దేశాలలో రామాయణకావ్యాన్ని పరిశోధనచేసి ఆ దేశ మాతృభాషలోకి అనువదించి రామాయణ కావ్యాన్ని గౌరవించారు.

రామాయణం ఒక మనస్తత్త్వశాస్త్రం, రామాయణం ధర్మశాస్త్రం, రామాయణం శకునశాస్త్రం, మానవసంబంధాలు, మానవీయ విలువలను తెలియజేసే ఉత్తమకథ. రామాయణం అంటే రాముని కదలిక, పయనం అని అర్థం. 'అయనం' అంటే 'పయనం' అని గూడ అర్థం. రామాయణకాలంలో ధర్మం, సత్యం రెండుకాళ్ళ వంటివి. ఆ కాళ్ళతోనే రాముని కదలిక ఆధారపడి ఉంది. రాముడు ఏది చేసినా ధర్మమే.

రామాయణం ధర్మప్రతిపాదితం. అయోధ్యకాండ అంతా ధర్మమే. ధర్మశాస్త్రాలపుట్ట. యుద్ధకాండ వేదాంతమైన తత్త్వచింతనతో ఉంది. ఇందులో ధర్మయుద్ధం ఉంది. ఇందులో రాముడు జీవించినంతవరకు, రాజ్యభారాన్ని నెరవేర్చినంతవరకు ధర్మానుష్ఠానం చేశాడు. రామాయణంలోని పాత్రలన్నీ ధర్మాన్ని పట్టుకొని జీవించాయి. అందుకే రామాయణం విశిష్టకావ్యం. రాముని యుగం ధర్మయుగం. ధర్మంతోనే మానవసంబంధాలు పెంపొందాయి.

## రామాయణంలో నారదుని పాత్ర

శ్రీమద్రామాయణకాలంలో నారదమహర్షి, వాల్మీకి మధ్య ఎంతో ధార్మికసంబంధం ఉంది. శ్రీరామకథ వ్రాయటానికి మూలపురుషుడు నారదమహర్షి. షోడశగుణ పరిపూర్ణుడైన మానవోత్తముడెవరు? ఎవరి కథ వ్రాయాలి?" అని అడిగాడు. వాల్మీకికి శ్రీరామకావ్యాన్ని వ్రాయుమని ఆదేశించిన దేశికోత్తముడు నారద మహర్షి. ఈనాటికీ ప్రపంచ మానవులంతా శ్రీరామచరితను విని, చదివి, గానంచేసి తరిస్తున్నారంటే అందుకు కారణం శ్రీనారదమహర్షే.

లోకోపకార వ్రతం జీవన వ్రతంగా చేసుకున్న నారదమహర్షి గొప్ప ప్రచార సంచారవైతాళికుడు. భక్త శ్రేణిలో అగ్రగామిగా త్రిలోకోత్తర భక్త శిఖామణి – దేవర్షి నారదమహర్షి.

కృతయుగంలోనే గాకుండా త్రేతాయుగం, ద్వాపరయుగాలలో గూడ మానవ సంబంధాలకు ఆద్యుడు శ్రీనారదమహర్షి. దేవతలు, దేవుళ్ళు, మునులు, ఋషులు, రాజులు, చక్రవర్తులు రాక్షసులు మొదలైన వారితో వినోదంగా మాట్లాడుతూ మంచి మాటకారిగా GOOD COMMUNICATOR పేరు పొంది మానవసంబంధాలను సృష్టించి, పెంచి, పోషించిన మహోన్నత వ్యక్తిగా ఆయనను పేర్కొనవచ్చు.

భరతఖండంలో సమాచార వ్యవస్థకు పునాది వేసినవాడు, మంచి మానవ సంబంధాలు శాంతికి మార్గమని బోధించినవాడు నారద మహర్షి ఒక్కడే. నారద మహర్షి సూత్రాలే ఈనాటికి బహుళ ప్రచారంలో ఉన్నవి.

## 'రఘు' వంశవృక్షం

రఘువంశపురాజులు సూర్యవంశానికి చెందినవారు. వీరిలో ప్రథముడు వైవస్వతమనువు. అతని వంశంలో జన్మించినవాడే దిలీపుడు. దిలీపుని భార్య మగధవంశానికి చెందిన సుదక్షిణాదేవి. సుదక్షిణా దిలీపులు 'నందినీ' ధేనువును (ఆవు) పూజించిన ఫలితంగా రఘుమహారాజు జన్మించాడు. ఈయన పేరు మీదనే రఘువంశం పరివ్యాప్తమైంది.

'రఘు' మహారాజు దంపతులకు అజమహారాజు జన్మించాడు. అజుని భార్య ఇందుమతీదేవి. ఈ దంపతులకు 'దశరథుడు' జన్మించాడు. దశరథ మహారాజు అయోధ్యానగరానికి రాజు. ఈయనకు ముగ్గురు భార్యలు. వారు కౌసల్య, కైకేయి, సుమిత్రలు. దశరథ మహారాజు సంతానంకోసం ఋష్యశృంగమహర్షి ఆధ్వర్యంలో పుత్రకామేష్టియాగం నిర్వహించాడు. ఈ యాగఫలితంగా యజ్ఞ జ్వాలలో నుంచి సకల శుభలక్షణాలు కలిగిన ఒక



దివ్యపురుషుడు ఆవిర్భవించాడు. అతని చేతిలో పాయసంతో నిండి ఉన్న స్వర్ణపాత్ర ఉంది. ఆ దివ్యపురుషుడు దశరథమహారాజుతో "నేను విష్ణుదూతను" అని చెప్పి, నీవు చేసిన అశ్వమేధయాగం, పుత్రకామేష్టియాగాల ఫలితమే ఈ పాయసపాత్ర. ఈ పాయసాన్ని విభజించి నీ ముగ్గురు భార్యలకు పంచిపెట్టు. వారి ద్వారా నీకు నలుగురు కుమారులు జన్మించి నీ యశస్సును శాశ్వతంగా సుస్థిరం చేస్తారు" అని చెప్పి అంతర్థానమయ్యాడు.. వెంటనే దశరథ మహారాజు కౌసల్యకు సగం పాయసాన్ని, సుమిత్రకు నాలుగోవంతు, కైకేయికి ఎనిమిదో వంతు ఇచ్చాడు. ఇంకా మిగిలిన ఎనిమిదో వంతు పాయసాన్ని సుమిత్రకు ఇచ్చాడు. ముగ్గురు భార్యలు పన్నెండు నెలలు నిండి ఒక శుభముహూర్తంలో నలుగురు కుమారులకు జన్మనిచ్చారు. కౌసల్యకు కలిగిన కుమారునికి రాముడని, కైకేయి పుత్రునికి భరతుడని, సుమిత్ర కవలలకు లక్ష్మణ, శత్రుఘ్నులని పేరు పెట్టారు. వంశగురువైన వశిష్ఠమహర్షి ఈ నామకరణ మహోత్సవాన్ని అతి వైభవంగా నిర్వహించాడు. వారికి ఉపనయన సంస్కారాలు, వివాహాది శుభకార్యాలు జరిపించాడు దశరథ మహారాజు. ఆ తర్వాత నలుగురి కుమారులు శస్త్రాస్త్ర విద్యలలో ఆరితేరారు.

శ్రీరాముని భార్య సీత. లక్ష్మణుని భార్య ఊర్మిళ, భరతుని భార్య మాండవి. శతృఘ్నుని భార్య శ్రుతకీర్తి. శ్రీరాముని కుమారులు కుశలవులు. భరతుని పుత్రులు తక్షుడు, పుష్కలుడు. లక్ష్మణుని సంతానం అంగదుడు, చిత్రకేతుడు. శత్రుఘ్నుని కుమారులు. శత్రుఘాతి, సుబాహుడు.

## రామాయణంలో వ్యక్తిత్వ లక్షణాలు

రామాయణంలో ఎంతోమంది మహాపురుషులు, మహోన్నతవ్యక్తులు, ఋషులు, మహర్షులు, రాక్షసరాజులు, వానరజాతి, వారి ప్రముఖవ్యక్తులు ఎందరో ప్రముఖపాత్రలు పోషించారు. రామాయణంలో వ్యక్తిత్వ

వికాసలక్షణాలు, గుణాలు, నాయకత్వలక్షణాలు, భావవ్యక్తీకరణ నైపుణ్యం, సేవాభావం, శాంతస్వభావం, విధాన నిర్ణయచాకచక్యం, అహింస, సత్ప్రవర్తన, నడవడి, సానుకూల దృక్పథం, సేవాభావం, ధర్మాచరణ, సత్యవాక్యం, త్యాగం, ప్రేమ, అన్నదమ్ముల అనుబంధం, రాజ్యకాంక్ష లేకుండుట, స్నేహశీలత, భార్యాభర్తల అనుబంధం, మాతా పితరులపై వాత్సల్యం, శత్రువులను ఆదరించి మిత్రులుగా చేసుకోవటం మొదలైన సుగుణాలన్నీ ఆయాపాత్రలు పోషించాయి. కనుకనే అయోధ్యానగరప్రజలకు, రాజులకు మధ్య మానవసంబంధాలు సత్సంబంధాలుగా ఉండేవి.

రామాయణంలోని కథ అంతా శ్రీరాముడే కేంద్రంగా సాగింది. ఆయన ప్రధాననాయకుడు. ఆయన భార్య సీతాదేవి. ఆమె సౌశీల్యవతి, గుణవతి, రాముడికి అనుకూలవతి. సీతారాముల దాంపత్యం అన్యోన్యం, ఆప్యాయతలతోనే చివరివరకు సాగింది. వారిద్దరి దాంపత్యం ఈనాటికీ ఆదర్శంగా నిలచింది. రామాయణంలో తరువాత ముఖ్యంగా చెప్పుకోవలసినవారు, దశరథమహారాజు, కౌసల్య, కైకేయి, సుమిత్ర, మంథర, జనకమహారాజు, విశ్వామిత్రుడు, వశిష్ఠుడు, భరద్వాజమహర్షి, ఋష్యశృంగమహర్షి, అగస్త్యముని, భృగుమహర్షి, హనుమంతుడు, జాంబవంతుడు, వాలి, సుగ్రీవుడు, అంగదుడు, విభీషణుడు, జటాయువు, ప్రతినాయకులుగా లంకాధిపతి, రావణుడు ఆయన రాజకుటుంబీకులు కొందరు ఈ సందర్భంగా చెప్పవలసినవారు.

శ్రీరాముని భక్తులుగా చెప్పుకోదగిన ప్రముఖులలో గుహుడు, అహల్య, శబరి ఉన్నారు. శ్రీరామునికి సేవ చేసిన వారిలో అతి చిన్న శాకాహార జంతువు 'ఉడుత' సేవను విశేషంగా చెప్పారు.

## విశ్వామిత్రునితో సత్సంబంధాలు

విశ్వామిత్రుడు ఒకనాడు దశరథ మహారాజు ఇంటికి వెళ్ళాడు. విశ్వామిత్రునికి స్వాగతవచనాలు పలికాడు. గౌరవమర్యాదలు చేశాడు.



అర్ఘ్యపాద్యాదులిచ్చి, కుశల ప్రశ్నలు వేసి ఉచితాసనంపై కూర్చుండపెట్టి వచ్చిన పని ఏమిటి? అని ప్రశ్నించాడు దశరథమహారాజు.

విశ్వామిత్రుడు వెంటనే నేను ఒక గొప్పయజ్ఞాన్ని నిర్వహిస్తున్నాను. పూర్తికావలసిన చివరిదశలో మారీచ, సుబాహులు అనే ఇద్దరు రాక్షసులు యజ్ఞానికి అంతరాయం కలిగిస్తున్నారు. వారిని సంహరించటానికి రాముణ్ణి నావెంట పంపవలసింది. నీ సహాయం అర్థించటానికి వచ్చానని విశ్వామిత్రుడు చెప్పాడు. నా దీక్షను నెరవేర్చటంలో నీపుత్రప్రేమతో నాకోరిక కాదనకు. ఎందుకంటే, రాముడు అవలీలగా నా వాంఛితాన్ని నెరవేర్చగలడని నేను శపథంగా చెప్పగలను. ఈ రాక్షససంహారానికి రాముడే సమర్థుడు అని విశ్వామిత్రుడు దశరథునితో అన్నాడు.

దశరథమహారాజు లేత వయసువాడైన శ్రీరాముని రాక్షససంహారానికి పంపడమా? అందునా జ్యేష్ఠకుమారుడు నా రాముణ్ణి పంపడమా? భయవిహ్వలుడై, శోకసంతప్తుడై పుత్రవాత్సల్యంతో విశ్వామిత్రుని అభ్యర్థనను తిరస్కరించాడు. "బ్రాహ్మణుల పట్ల ఇట్లా ఆడితప్పిన ప్రవర్తన రఘువంశంలో మునుపెన్నడూ లేదు. అందువల్ల ఈ వంశ స్థలం వదలి ఈ క్షణమే వెళ్ళి పోతాను", అని విశ్వామిత్ర మహర్షి ప్రకటించాడు.

## వశిష్ఠుని ప్రేరణ

మహర్షి కోపావేశానికి కారణంగా భూమి కంపించింది. స్వర్గంలోని దేవతలు గూడా భీతిల్లారు. పరిస్థితిని గ్రహించిన కులగురువు వశిష్ఠుడు దశరథుణ్ణి సమీపించి 'ఓ రాజా! ఇప్పుడు సత్యమార్గాన్ని వదిలిపెట్టి ఇన్నాళ్ళుగా సంపాదించుకున్న పుణ్యాన్నంతటినీ నాశనం చేసుకోకు. నీవు ఘనంగా వాగ్దానం చేశావు. ఇప్పుడు నీ పుత్రుడైన రాముణ్ణి విశ్వామిత్రుడికి అప్పగించి ఆయన అభ్యర్థనను మన్నించటం మంచిది.

## దశరథుడికి హితోపదేశం

"నీవు భయపడవలసిన పనిలేదని నా అభిప్రాయం. విశ్వామిత్రుడు గతంలో ఒక మహారాజు. దక్షుని కుమార్తెలైన జయ, సుప్రభలనుండి ఆవిర్భవించిన దివ్యాయుధాలను ఆయన పరమశివుడి నుండి పొందాడు. ఈ ఆయుధాలను వాటితో పాటు ఆ రాక్షసులను మట్టు పెట్టటానికి కావలసిన శక్తియుక్తులను విశ్వామిత్రుడు రాముడికి ఉపదేశిస్తాడనటంలో సందేహం లేదు. నిజానికి విశ్వామిత్రుడు తలచుకుంటే మారీచ, సుబాహులను తేలికగా మట్టుపెట్టగలడు. కాని, నీ కుమారుడి కీర్తిని, పరాక్రమాన్ని విశ్వవ్యాప్తం చేయటానికే ఆయన రాముడి సహాయాన్ని కోరుతున్నాడు" అని వశిష్ఠుడు చెప్పాడు.

వశిష్ఠమహర్షి ఇక్ష్వాకువంశానికి మేలుచేసే కులగురువు. ఆయన సలహామేరకు మనశ్శాంతిని పొందినవాడై మహారాజు విశ్వామిత్రుడి అభ్యర్థనకు అంగీకారం తెలియజేశాడు. ఆపైన దశరథమహారాజు రాముడితోబాటు లక్ష్మణుణ్ణి కూడా వెంట ఇచ్చి విశ్వామిత్రుడితో సాగనంపాడు.

## గురుశిష్య సంబంధం

సరయూనదీతీరంలో విశ్వామిత్రుడు శ్రీరాముడికి బల, అతిబల అనే మంత్రాలను ఉపదేశించాడు. రాక్షసి తాటకిని విశ్వామిత్రుని సలహామేరకు వధించాడు. "స్త్రీని చంపగూడదు స్త్రీహత్య మహాపాపం అన్నాడు" రాముడు. "అయినా స్త్రీ రాక్షస కృత్యాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులను చేసి హతమారుస్తున్నపుడు దోషంలేదు" అని విశ్వామిత్ర మహర్షి చెప్పాడు. ఇంద్రాదిదేవతల సూచనల మేరకు శ్రీరాముడికి దివ్యాస్త్ర జ్ఞానాన్నంతటిని బోధించాడు విశ్వామిత్రుడు. దేవతలు, ఋషులు ఇచ్చే సూచనలు, సలహాలు అన్నీ రాముడికి అనుకూలంగానే వున్నాయి. ఆ అస్త్రాలన్నీ రూపందాల్చి అతని ముందునిలచి "ఓ రామా! మమ్మల్ని ఆజ్ఞాపించు నీకు ఏ విధంగా



సేవచేయాలో చెప్పు" అని అడిగాయి. "నేను మిమ్మల్ని తలచినంతనే మీరంతా వచ్చి నాముందు నిలవాలన్నదే నాప్రార్థన" అని రాముడు సమాధానమిచ్చాడు. అస్త్రాలు గూడ శ్రీరాముడికి సేవ చేయాటానికి అంగీకారం తెలిపాయి. రాముడి పై అస్త్రాలకు ఎంత గౌరవం, అభిమానం వున్నాయో తెలుస్తోంది.

విశ్వామిత్రుడి యజ్ఞవాటికను అప్రమత్తంగా సంరక్షిస్తున్నారు రామ లక్ష్మణులు. ఆ సమయంలో మారీచసుబాహులు తమ అనుచరగణంతో యజ్ఞాన్ని నాశనం చేయటానికి విరుచుకు పడ్డారు. ఆ సమయంలో రాముడు లక్ష్మణుడితో "ఈ దుష్టరాక్షసులను నా ఆయుధాలతో లొంగదీస్తాను." అని చెప్పాడు. రాముడు ఒక శక్తిమంతమైన అస్త్రాన్ని ప్రయోగించగా అది మారీచుడి రొమ్ముని తాకింది. అతనిని నూరు యోజనాల (800 మైళ్ళు అని వైదిక ప్రమాణం) దూరం సముద్రంలోకి విసరివేసింది కాని చంపలేదు. మరోశక్తిమంతమైన బాణాన్ని ప్రయోగించగా అది సుబాహుడి గుండెలోకి దిగబడి వాడు నేలకూలి మరణించాడు. ముచ్చటగా మూడో అస్త్రాన్ని ప్రయోగించి మిగిలిన రాక్షసులనందరిని పారద్రోలాడు. తరువాత యజ్ఞవాటిక ప్రాంతమంతటా శాంతి నెలకొన్నది.

యజ్ఞకార్యనిర్వహణ నిర్విఘ్నంగా, శాంతియుతంగా ముగిసింది. ఋషులంతా స్వస్థానానికి తిరిగి వచ్చి శ్రీరాముడు చేసిన అద్భుత కార్యానికి అభినందనలు తెలిపారు. యజ్ఞకార్యం విజయవంతంగా పూర్తయింది. ఋషులు, విశ్వామిత్రుడు, మొదలైనమహర్షుల హృదయాలలో చిరస్థాయిగా నిలచాడు శ్రీరాముడు. లోకకళ్యాణం కోసమే రాముడి సేవలను వినియోగించారు. అస్త్రవిద్యా గురువు విశ్వామిత్రుడికి, రామలక్ష్మణులకు సయోధ్య ఏర్పడటం ధర్మరక్షణకు, రాక్షస సంహారానికి మూలకారణమైంది.

సీతారామలక్ష్మణులను వెంటపెట్టుకొని జనకమహారాజు నిర్వహిస్తున్న యజ్ఞానికి పిలుపురాగా విశ్వామిత్రుడు మిథిలానగరానికి బయలుదేరాడు.

మార్గమధ్యంలో గౌతముని ఆశ్రమానికి వెళ్ళారు. గౌతముని భార్య అహల్య. ఈమె వంచితురాలై ప్రమాదవివశయై చేయని పాపానికి గౌతమమహర్షి ఆమెను శిలారూపంలో ఉండమని శపించి హిమాలయాలకు వెళ్ళాడు. ఆమాట చెబుతూ సుదూరభవిష్యత్తులో శ్రీరాముడు ఈ ప్రదేశానికి వచ్చినపుడు నీవు విశుద్ధి పొంది నీ భర్తనైన నన్ను తిరిగి పొందుతావు" అని గౌతమముని చెప్పాడు. ఈ వృత్తాంతం తెలిసిన విశ్వామిత్రుడు శ్రీరాముడు గౌతమముని ఆశ్రమంలోకి అడుగుపెట్టిన వెంటనే పాదస్పర్శ వలన శిలారూపంలో వున్న అహల్య మంచి తేజస్సుతో తన పూర్వరూపాన్ని పొందింది. అకస్మాత్తుగా స్వర్గంలో దుందుభులు మారుమ్రోగాయి, దివ్యపుష్పాలు వర్షించాయి. రామలక్ష్మణులు, అహల్య పాదాలను స్పృశించగా ఆమె గౌరవపురస్సరంగా ఆ సోదరులకు, విశ్వామిత్రునికి స్వాగతం పలికింది. అదే సమయంలో గౌతమమహర్షి వచ్చి ఆమెను భార్యగా స్వీకరించి పత్నీ సమేతంగా ఎంతో భక్తిశ్రద్ధలతో శ్రీరామలక్ష్మణులను పూజించాడు. విడిపోయిన భార్యాభర్తల మధ్య సంబంధాలను పునరుద్ధరించాడు శ్రీరాముడు. ఆనాటి నుంచి శ్రీరాముని మీద వారికి గౌరవాదరణలు పెరిగాయి.

**శ్రీరాముని వ్యక్తిత్వం**

**"కో - న్వస్మిన్ సాంప్రతంలోకే గుణవాన్ కశ్చ వీర్యవాన్,**
**ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ సత్యవాక్యో దృఢవ్రతః" (బాలకాండ, 1-2)**

ఇత్యాదిగా వాల్మీకి మహర్షి నారదుల వారిని ప్రశ్నించారు. అంటే ఈ యుగంలో, ఈ లోకంలో సద్గుణసంపన్నుడెవరు? ప్రతాపంగలవాడు, ధర్మం తెలిసినవాడు, కృతనిశ్చయం గలవాడు, సత్యవాక్యతత్పరుడు, ఉపకారం మరవనివాడు, నిశ్చలమైన మనస్సుగలవాడు, పూర్వం సద్వంశచరిత్రతో కూడినవాడు, సర్వప్రాణుల హితంకోరేవాడు, విద్యావంతుడు, సామర్థ్యం గలవాడు, అందరివిషయంలో సమానమైన ప్రేమగలవాడు, కోపాన్ని జయించినవాడు, ప్రకాశం గలవాడు, సముద్రుడు వలె గంభీర స్వభావంగలవాడు,



మేరునగధీరుడు, అసూయలేనివాడు ఎవరు? అలాంటి మహాపురుషుని గురించి తెలుపవలసిందిగా నారదమహర్షిని వాల్మీకి మహర్షి ప్రార్థించాడు.

అందుకు సమాధానంగా నారదమహర్షి "అన్ని గుణాలు గలవారు ఈ యుగంలో ఈ లోకంలో చాల అరుదు. అట్టి గుణాలు దుర్లభం. ఆ సకల గుణాలు గలవాడు ఒక్కడే ఒక్కడు ఉన్నాడు. అతని గురించి వివరిస్తానని అన్నాడు నారదుడు.

**"ఇక్ష్వాకువంశ ప్రభవో రామోనామ జనైః శ్రుతః ।**
**నియతాత్మా మహావీర్యో ద్యుతిమాన్ ధృతిమాన్ బలీ ॥ (బాలకాండ,1-8)**

ఇక్ష్వాకువంశంలో 'రాముడ'నే ప్రసిద్ధనామధేయంగలవాడు ఉన్నాడు. ఆయన నియతాత్ముడు, పరాక్రమవంతుడు. ధైర్యవంతుడు, ఇంద్రియనిగ్రహం కలవాడు. అంతేగాదు. అతను ఐశ్వర్యవంతుడు, బుద్ధిమంతుడు, నీతిగలవాడు, జితేంద్రియుడు, మాటల విషయంలో ప్రియభాషి, సత్యభాషి, మితభాషి, హితభాషి, మృదుభాషి, మధురభాషి మొదలగు భావనైపుణ్యాలు గలవాడు. రాముడు శత్రువును మిత్రుడుగా భావించువాడు, ఏకపత్నీవ్రతుడు, తండ్రిమాట జవదాటనివాడు. ఎల్లప్పుడు మోముపై చిరునవ్వు చిందించి, చూపరులను ఆకర్షించేవాడు. షోడశగుణ ప్రపూర్ణుడైన మానవోత్తముడెవరు? ఎవరి కథ వ్రాయాలి. అని అడిగిన వాల్మీకి శ్రీరామ కావ్యాన్ని వ్రాయుమని ఉపదేశించిన దేశికోత్తముడు నారద మహర్షి. ఈనాటికీ ప్రపంచమానవులంతా శ్రీరామచరితను విని, చదివి, గానం చేసి తరిస్తున్నారంటే అందుకు కారణం శ్రీనారద మహర్షే.

మహర్షి వాల్మీకి, రామాయణంలో **"రామవత్ వర్తితవ్యం న రావణవత్"** అని పలికాడు. అంటే అందరూ "శ్రీరామునివలె ప్రవర్తించాలి కాని రావణుని వలె కాదని" దీని అభిప్రాయం.

శ్రీరాముడు తన క్షత్రియధర్మానికి, తన రాజ్యంలోని ప్రజలకు రక్షకుడు, వేదవేదాంగాలు తెలిసినవాడు, శస్త్రాస్త్రవిద్యలలో నేర్పరి, సర్వశాస్త్రాలు తెలిసిన

వాడు. ఏమరుపాటులేనివాడు. సర్వలోకప్రియుడు. కరుణాహృదయుడు. యుక్తిగలవాడు. నిదానమే ప్రధాన ఆశయం గలవాడు. కష్టసుఖాలను చిరునవ్వుతో స్వాగతించువాడు. ధీరస్వభావంలో హిమాలయ పర్వతం వంటివాడు. ఇంకా రాముడు ఓర్పు, సహనం, సంయమనం, సమయస్ఫూర్తి, నేర్పు మొదలైన గుణాలు కలిగినవాడు. **ఈతరం యువత, రాబోవుతరంవారు శ్రీరాముని వ్యక్తిత్వలక్షణాలను, గుణాలను అలవరచుకొని ఆదర్శవంతులుగా నడచుకోవాలి.**

### సీతారాముల దాంపత్యం

మిథిలానగరరాజైన జనకమహారాజు తన వద్దనున్న 'శివధనుస్సును" ఎవరు ఎక్కుపెట్టి లక్ష్యానుసంధానం చేస్తారో వారికి నా కుమార్తె సీతను ఇచ్చి వివాహం చేస్తానని ప్రకటించాడు. ఆ మాట విన్న విశ్వామిత్రుడు రామలక్ష్మణులతో మిథిలానగరానికి వెళ్ళాడు. సీత స్వయంవరానికి అనేకమంది రాజులు విచ్చేశారు. ఆ రాజులందరూ "శివధనుస్సు"ను విచ్ఛిన్నం చేయటానికి ప్రయత్నించి విఫలమయ్యారు. శ్రీరాముడు తనవంతురాగానే శివధనుస్సును సమీపించి, నమస్కరించి, ధనుస్సును ఎక్కుపెట్టి సునాయాసంగా విరిచాడు. సిగ్గుతో తలవంచి, మెల్లమెల్లని అడుగులువేస్తూ చిరునవ్వు చిందిస్తూ రాముని మెడలో పుష్పహారంవేసి తన అంగీకారాన్ని ప్రకటించింది సీత. ఈ శుభవార్తను దశరథునికి విన్నవించి, జనకమహారాజు తన కుమార్తె సీతను శ్రీరామునికిచ్చి వైభవంగా వివాహం జరిపించాడు. ఈ శుభ సమయంలోనే తన మిగతా కుమారులు లక్ష్మణునకి ఊర్మిళను, భరతునికి మాండవిని, శత్రుఘ్నునికి శ్రుతకీర్తిని ఇచ్చి నలుగురు కుమారులకు కులగురువైన వశిష్ఠమహర్షి ఆధ్వర్యంలో అతివైభవంగా వివాహం జరిపించారు.

లావణ్య సద్గుణాలు మూర్తీభవించిన సీతను పొందాడు శ్రీరాముడు. రాముడు అపరిమితమైన ఆనందాన్ని, సంతృప్తిని అనుభవించాడు. రూపం,



సౌందర్యం, ప్రవర్తన, వయస్సు, ప్రవృత్తివంటి దివ్యలక్షణాలన్నింటిలోనూ సీతారాములు సమానులే. పరస్పరం హృదయాలను అంకితం చేసుకున్న సీతారాములు లక్ష్మితోకూడిన విష్ణువు మాదిరి అద్భుతంగా ప్రకాశించారు. సాక్షాత్తు వారిద్దరూ కృతయుగంలో లక్ష్మీనారాయణులే. త్రేతాయుగంలో మానవజన్మను పొంది సీతారాములుగా అవతరించారు.

సనాతనదంపతులైన సీతారాములు పరస్పరం విడదీయరాని భార్యాభర్తలు. వైభవోపేతంగా జరిపే వివాహ మహోత్సవాలంటే ఈనాటికీ ప్రపంచంలో ఎక్కడైనా ప్రజలు మక్కువచూపుతూనే ఉంటారు. ధర్మబద్ధంగా నడచుకోవటం ద్వారా స్త్రీ పురుషులు తమ వైవాహిక జీవితాన్ని విజయవంతంగా ఎలా అనుభవించవచ్చునో పరమాత్ముడైన శ్రీరాముడు స్వయంగా ఆచరించి చూపాడు. ఇదే భారతీయులకు ఆదర్శం.

సీతారాముల పరస్పర సహజ ప్రేమానురాగాలు దినదిన ప్రవర్ధమానమైనాయి. పరస్పర సౌందర్య సద్గుణాలకు బద్ధులై వారు సంపూర్ణంగా ఒకరికొకరు అంకితమైనారు. రాముని హృదయాంతర్గతభావాల నన్నింటినీ సీత మనస్సుతోనే చదువగలిగేది. భర్తకు ప్రీతికలిగించటానికే నిరంతరం కృతనిశ్చయురాలైన సీత, స్త్రీ సహజమైన మృదు స్వభావానికీ, పాతివ్రత్యానికీ ప్రతీకలా వ్యవహరించేది. అనతికాలంలోనే సీత శ్రీరాముని హృదయాన్ని నియంత్రించగలిగే స్థితికి వచ్చింది. రావణాసురుడు సీతను అపహరించి లంకకు తీసుకువెళ్ళి, తనను భర్తగా స్వీకరించుమని, సకలభోగాలు, సౌకర్యాలు సమకూరుస్తానని చెప్తాడు. ఆ సమయంలో సీత అశోకవృక్షం క్రింద కూర్చొని విలపిస్తూ, బాధాతప్తహృదయంతో తలవంచుకొని, ప్రక్కన నేలమీద ఉన్న గడ్డిపోచను రావణునికి చూపింది. అంటే నీవు గడ్డిపోచతో సమానం. నీవు మనిషివి కావు. సీత చాల చులకనచేసి రావణాసురుని తిరస్కరించినట్లు గడ్డిపోచతో సంకేతాన్నిచ్చింది. సీత తన మనస్తత్వాన్ని ఈ విధంగా తెలియజేసింది.

## భార్యాభర్తల సంబంధం

దశరథ మహారాజు పెద్దకుమారుడైన రామునికి పట్టాభిషేకం చేయటానికి బదులు భరతునికి రాజ్యం అప్పగించాలనీ, రాముణ్ణి పద్నాలుగు సంవత్సరాలు అరణ్యవాసం చేయుమని ఆజ్ఞాపిస్తాడు. తండ్రి ఆజ్ఞను చిరునవ్వుతో స్వీకరిస్తాడు రాముడు. వెంటనే రాముడు భార్యసీతతో "సీతా! తండ్రి గారి ఆజ్ఞను పాలించటం తప్ప నాకు గత్యంతరం లేదు. కాని, నీవు మాత్రం అయోధ్యలోనే ఉండి నాతండ్రి పాదాలకు ప్రతిరోజు నమస్కారం చేస్తూ ఉండు. భరతుని ఆజ్ఞలను ఖచ్చితంగా అమలు పరుస్తూండు" అని చెప్పాడు. ఈ మాటలు విన్న సీత భర్తతో "ఓ పతిదేవా! భర్త జీవితంలో పాలుపంచుకోవటం భార్యవిధి. భార్యగా స్వీకరించిన స్త్రీ జీవితంలో పాలుపంచుకోవటం భర్తవిధి. కాబట్టి, అడవికి నీతో పాటు నేనూ రాక తప్పదు.

"తండ్రి, తల్లి, సోదరుడు, కొడుకు, కోడలు, అందరికీ వారి వారి ప్రత్యేకమైన అస్తిత్వం వారికి ఉంటుంది. కాని, భార్యకు మాత్రం తన భర్తను అనుసరించటం తప్ప మరో మార్గంలేదు. నేను వేరెవరినీ ఆశ్రయించను. నా భర్తయేనాకు ఏకైక ఆశ్రయం. అందువల్ల నేను భర్తను అనుసరించాలనే నిశ్చయంతో ఉన్నాను. నేను నీవు భుజించిన తర్వాతనే భుజిస్తాను. నీకు అసంతృప్తి కలిగించే పని ఏది చేయను. కొండలు, కోనలు, సరస్సులు, నదులు, ప్రకృతి అందాలను చూచి ఆనందిస్తూ సంతోషంగా ఉంటాను. నీ సంరక్షణలో భద్రంగా ఉంటాను. నీవు లేనిదే నేను స్వర్గంలోనైనా జీవించగోరను. రామా! నేను నిన్ను మాత్రమే ప్రేమిస్తాను. నీవులేకుంటే నేను మరణించటం తథ్యం. తన భర్త లేకుండా భార్య జీవించచాలదు. నీతో నన్ను రానీయకుంటే నేను విషం సేవించిగాని, అగ్నిలో ప్రవేశించిగాని, నీటిలో దూకిగాని నా ప్రాణాన్ని త్యాగం చేస్తాను. భర్తను అనుసరించటం, భర్త ఆజ్ఞను పాలించటం నా జీవనగతి. భర్తతో ఉండటమే స్వర్గం. భర్తలేని జీవితం నరకం. కనుక రామా! నేను నీతోనే ఉంటాను.



సీత మనస్తత్వాన్ని అర్థం చేసుకున్నాడు రాముడు. సీతను తనతో అరణ్యానికి తీసుకువెళ్ళటానికి అంగీకరించాడు. వివేకవంతుడు తనకారుణ్యాన్ని ఎలా విడువలేడో అలాగే నేను నిన్ను విడువలేను. నీవు లేని నేను మాత్రం ఎలా జీవించగలను? కనులు మూసినా నీవాయె, నే కనులు తెరచినా నీవాయె!" అని రాముడు తన అంగీకారాన్ని తెలిపాడు. మనిద్దరం నార దుస్తులతో అడవికి వెళ్ళాలి కనుక నీ విలువైన వస్తువులను, దుస్తులను, ఆభరణాలను, ఇంకా నీకున్నవాటినన్నిటిని బ్రాహ్మణులకు దానం చేసేయ్" అని రాముడు చెప్పాడు.

సీతారాముల నిరాడంబరతకు, ఆర్భాటాలపై ఆసక్తి లేకపోవటం వారి సాధారణ జీవితానికి నిదర్శనం. కష్టసుఖాలను భార్యాభర్తలు సమానంగా పంచుకోవాలని వారిద్దరి మనస్సులోని నిర్ణయం. వారితో సుమిత్ర కొడుకు లక్ష్మణుడు వెంట వెళ్ళాడు. కాబట్టి, వారి రక్షకుడుగా, సేవకుడుగా తోడూ నీడగా అండగా ఉండటం మరొక విశేషం. లక్ష్మణుడు సీతారాములకు ఆప్తుడు, ఇష్టుడు, రామునికి సోదరుడుగూడ. రామరాజ్యంలో స్త్రీమాటకు అత్యంతగౌరవం ఇచ్చేవారు. భార్య భర్తను నిందించగూడదు. భర్తవల్లే భార్యకు మాంగల్యం, స్త్రీత్వం అలరారుతూ ఉంటుంది. ఇది ధర్మం. భర్తకు భార్య ఆత్మవంటిది. అరణ్యంలో చిన్న పర్ణశాల నిర్మించుకొని సీతారాములు నివాసం చేస్తున్నారు. సీత నిద్రపోతుంటే రామలక్ష్మణులు మెలకువతో ఆమెను రక్షిస్తున్నారు. నేటి భారతీయులు సీతారాములను ఆదర్శంగా తీసుకోవాలి.

## సీతకు కౌసల్య సలహా

సీత అడవికి ప్రయాణమైన సమయంలో అత్తగారైన కౌసల్య సీతను ఆలింగనం చేసుకుని ఒక స్త్రీగా ఇలా సలహా ఇచ్చింది. "సీతా! నా కుమారుడు ప్రవాసంలో ఉన్న కారణంగా అతనిని అవజ్ఞ చేయకు. అతను ఎల్లప్పుడు అన్ని పరిస్థితులలోనూ నీ ఆరాధ్యదైవంగా నిలుచుగాక!".

సీత ముకుళిత హస్తాలతో కౌసల్య హితవాక్కులను స్వీకరించింది. "నా భర్త రాముని పట్ల నా కర్తవ్యమేమిటో నాకు తెలుసు. దయచేసి విశ్వాసహీనలైన స్త్రీల గురించి నాకేమీ చెప్పవద్దు. వెన్నెలకు చంద్రునితో ఉన్న అనుబంధం వంటిదే రామునితో నాకున్న అనుబంధం. తంత్రులు లేకుండా వీణ ఉండదు. చక్రాలు లేకుండా రథం ఉండదు. అలాగే వేయిమంది పుత్రులున్నప్పటికీ భర్తలేనిదే భార్య భవిష్యత్తు అనేది ఉండదు. రాముడు నాదైవం. ఆయన ఎప్పటికీ నాదైవంగానే ఉంటాడు. నేను ఆయనను అవజ్ఞ చేయటం ఎలా జరుగుతుంది? అని బదులిచ్చింది. తన భర్తపట్ల ఆమెకుగల సంకల్పం ఎటువంటిదో గ్రహింపవచ్చు.

## సీత నిర్దోషిత్వం

రావణ సంహారానంతరం సీతను తిరిగి తన వద్దకు తీసుకురావటానికి రాముడు ఒక పరీక్ష నిర్దేశించాడు. అది అగ్నిపరీక్ష. పరాయి పురుషుని పంచన ఉన్న భార్యను తెచ్చి సంసారం చేస్తున్నాడనే అపవాదు ఇక్ష్వాకువంశరాజులకు అంటుతుంది. సీత పవిత్రురాలని తెలిసినా, లోకాపవాద నిమిత్తం అగ్నిపరీక్షలో ఆమె శుద్ధత, నిర్మలత్వం బయటపడాలి అని రాముడు షరతు పెట్టాడు. సీతాదేవి ఆ షరతుకు అంగీకరించింది. అగ్నిలో ప్రవేశించింది. అగ్నిహోత్రుడు ప్రత్యక్షమై సీత నిర్దోషి, పవిత్రురాలని చెప్పాడు. అక్కడవున్న వారందరూ సంతోషించారు. ఈ పరీక్షకూడ ధర్మబద్ధంగా జరిగినదే. రాముడు ఏది చేసినా ధర్మయుక్తంగానే ఉంటుంది. ఆయనకు అందరూ సమానులే. అగ్ని పరీక్షవలన భార్యాభర్తలమధ్య అనుమానాలకు తావు లేకుండా వారి సంబంధాలు దృఢపడినాయి.

## సీతారాముల అంతరంగం

రావణుని చెరలో ఉన్న సీత, అడవిలో సంచరిస్తున్న రాముని శరీరాలు వేరైనా – వారి మనసులు మాత్రం వేరుగా లేవు. వారిద్దరి మనసులు ఒకటే. హృదయాలలో వారు ఒకరిపై ఒకరు ప్రేమనుపెంచుకున్నారు. రాముడు సీతను జపిస్తున్నాడు, తపిస్తున్నాడు, కలవరిస్తున్నాడు, సమయంకోసం నిరీక్షిస్తున్నాడు. అదేవిధంగా సీత హృదయంలో రాముణ్ణి పదిలపరచుకుంది. సీత రోజూ రామనామం చేస్తూనే వుంది. రాముణ్ణి జపం ద్వారా పూజిస్తోంది., గౌరవిస్తోంది, నమస్కరిస్తోంది. అతని రాకకై నిత్యం ఎదురు చూస్తోంది. సీతారాములు భౌతికంగా దూరమైనా వారి మనసులు దగ్గరగానే వున్నాయి. భార్యాభర్తల అవ్యాజమైన ప్రేమకు వారు నిదర్శనం.



సీతారాముల దాంపత్యం లోకానికి ఆదర్శం. సీత సాక్షాత్తు లక్ష్మీ స్వరూపమే. ఆమెను జానకి, వైదేహి, వేదవతి, భూమిజ, మైథిలి, అయోనిజ అనే పేర్లతో పిలవటం పండితులు, పామరులు, సాహితీవేత్తలకు అలవాటు. సీతమ్మవారంటే భారతీయులకు అనిర్వచనీయమైన భక్తి, గౌరవం.

**భార్యాభర్తల సంబంధాలు ఎలా ఉండాలో సీతారాముల మనోభావాలు, అడుగుజాడలే మనందరికీ ఆదర్శం. వాల్మీకి మహర్షి రామాయణం ద్వారా మంచి సందేశాన్ని ఇచ్చారు. సీతారాముల ప్రేమైకజీవనం అందరికీ ఆదర్శం.**

## రాముని అరణ్యవాసం ధర్మబద్ధమే

కైకేయి అడిగిన రెండు వరాలను దశరథమహారాజు నెరవేర్చాడు. తండ్రి దశరథునికి, తల్లి కౌసల్యకు, యితర పెద్దలకు నమస్కరించి, రాముడు, సీత, లక్ష్మణుడు వారి వద్ద అనుమతి, సెలవు తీసుకుని దండకారణ్యానికి ప్రయాణమైనారు. పద్నాలుగు సంవత్సరములు అరణ్యవాసం చేయాలనే నిర్ణయాన్ని రాముడు చిరునవ్వుతో స్వీకరించి, అంతకంటే సంతోషకరమైనది ఏమి కావాలి? ఎందరో ఋషులను, మహర్షులను, ప్రకృతి రమణీయతను, అంద చందాలను చూచే భాగ్యం రావటం మా అదృష్టం అన్నాడు రాముడు. తండ్రిమాట వినటం, ఆచరించటం పుత్రునిగా నాధర్మం. మాత కైకేయి అడిగిన వరాలు తీర్చటం రాజుగా, భర్తగా ఆయన ధర్మం. తండ్రి నిర్ణయానికి

కట్టుబడి ఉండటం భరతుడికి ధర్మం. ఇక్ష్వాకు వంశ "సంప్రదాయాలు, ఆడినమాట తప్పగూడదు" అనే నిర్ణయాలకు పుత్రులు కట్టుబడి ఉండాలి అని రాముని భావన. వంశ ప్రతిష్ఠ, గౌరవం కాపాడాలి. అది నా ధర్మం అని రాముని నిర్ణయం.

### శ్రీరాముడిపై ప్రజల అభిమానం

శ్రీరాముడు అరణ్యవాసానికి బయలుదేరాడనే వార్త దావానంలా అయోధ్యా నగరమంతా వ్యాపించింది. రాజ్యంలోని ప్రజలంతా దుఃఖంలో ఉన్నారు. గిడ్డంగులు, దుకాణాలు మూసివేశారు. వీధులు, బజారులు, గృహాలలో విషాదచ్ఛాయలు అలముకున్నాయి. రాముణ్ణి కోల్పోవటం దశరథుడికి ప్రజలకు జగత్ ప్రళయంలా ఉంది. మహారాజును, కౌసల్యను సుమంత్రుడు ఓదార్చటానికి ప్రయత్నించాడు. "దయచేసి మీకుమారుని కోసం విలపించకండి, సీత, లక్ష్మణుడు కూడ రాముడి వెంట ఉన్నారు. రాముడికి ఏమాత్రం కష్టం కలుగదు. నిజానికి రాముడు సాధారణ మానవుడుగాదు. అతడు దేవాధిదేవుడు. సాక్షాత్తు సూర్యుణ్ణి ప్రకాశింపచేసేవాడు. అరణ్యాలలో గూడ భూదేవి, సకల చరాచర ప్రకృతి ఆయన భక్తి యుక్త సేవలో నిమగ్నమవుతాయి. పెద్దకుమారుడైన రాముడు తండ్రికి దూరమవుతుంటే ఏ తండ్రికి మానసిక బాధ ఉండదు? అందునా రాజ్యాధికారం చేపట్టవలసిన అర్హతలు గల రాముడు అరణ్యాలకు వెళుతుంటే ఇంకెంత బాధ ఉంటుంది? అయోధ్యాపురంలోని ప్రజలు సమస్త కార్యకలాపాలను నిలిపివేశారు. మీరు ప్రజానీకాన్ని ఓదార్చి, అనునయించి, సముదాయించి ఉపశమన వాక్యాలతో వారు ఆవేదనకు గురికాకుండా చూడాలి" అని సుమంత్రుడు చెప్పాడు.

పురజనుల్లో చాలమంది అడవికి వెళ్తున్న రాముని రథం వెంట నడుస్తూ ఆయనను వెనుకకు రమ్మని అర్థిస్తున్నారు. రాముడు వారితో "నేను నా



ప్రతిజ్ఞకు భంగం కలిగించలేను. ఇప్పుడు మీరు నా మీద చూపిస్తున్న ప్రేమ, ఆదరాభిమానాలను రాజ్యం స్వీకరించబోయే భరతునిపై చూపండి." అని కోరాడు. రథం వెంట పరుగెత్తుతున్న వృద్ధ బ్రాహ్మణులను చూచాడు. వారి అవస్థకు జాలిపడి రథం దిగి పాదయాత్రచేసి వారిని ఓదార్చాడు. వారి వంక చూచి మీరు అయోధ్యకు తిరిగివెళ్ళి, తండ్రి, రాజులు, తల్లులు, ప్రజలక్షేమంకోరి మీరు ఉత్తమ కార్యాలు నిర్వహించండి." అని రాముడు వారికి మంచి మాటలు చెప్పి పంపాడు.

అయోధ్యానగర ప్రజలకు రామునిపైగల అవ్యాజమైన ప్రేమను ఎవరు తిరస్కరించగలరు? రామునికి ప్రజలకు మధ్యగల మానవసంబంధాలు జన్మతః వచ్చినవే!

**ఇచట రామునికి ప్రజలకు మధ్యవున్న అనురాగం, ఆప్యాయత, గౌరవం పూర్తిగా కళ్ళకు కట్టినట్లుకనుపిస్తున్నాయి. రాజుకు ప్రజలకు మధ్య సత్సంబంధాలు బాగున్నాయన్న విషయం వెల్లడయింది.**

### ప్రజలమనోభావాలు

నిద్రలేచిన పురజనులు తమ ప్రియమైన ప్రభువు శ్రీరాముడు కనుపించకపోవటంతో అన్ని దిక్కులు వెదకి నిరాశచెందారు. "రాముడు లేకుండా మనం అయోధ్యకు తిరిగి ఎలా వెళతాం? మనం రాముణ్ణి తీసుకుని రాలేకపోతే స్త్రీలు, పిల్లలు, మిగత బంధువులు ఏమంటారు? చివరకు చేసేది లేక పురజనులు అయోధ్యకు తిరిగి వెళ్ళారు. రాముడు లేకుండా భర్తలు తిరిగి రావటంతో ఇండ్లలోని స్త్రీలు వారిని పరుషవాక్కులతో నిందించారు. కొంతమంది కూర్చొని దుఃఖించారు. కొందరు వినటానికి నోచుకోలేదు. మరికొందరికి నోటివెంట మాటలు రాలేదు.

దుఃఖపూరితులై అయోధ్యలో ఎవరూ తిండి, తిప్పలు పట్టించు కోవటంలేదు. వినోదాల జోలికి వెళ్ళటంలేదు. నిజానికి రాముని వియోగబాధలో మునిగి ప్రతి ఒక్కరు జీవచ్ఛవాల్లా కనిపించారు.

**రాముడులేని అయోధ్య**

కైకేయి పాలన క్రింద జీవించలేమని చెబుతూ అయోధ్యలో ప్రతిఒక్కరూ ఆమెను నిందించసాగారు. అలా అయోధ్యలో జనజీవనం దాదాపు స్తంభించిపోయింది. నీరంతా ఇంకిపోయిన మహాసముద్రంలా ఉంది. బ్రాహ్మణులు తమవిధులను నిర్లక్ష్యం చేశారు. వైశ్యులు వ్యాపార నిర్వహణను నిలిపి వేశారు. అన్ని వృత్తులవారు వారి పనులను నిలిపివేసి రాముని గురించి దుఃఖిస్తున్నారు. పనులమీద దృష్టి పెట్టలేకుండా ఉన్నారు. గృహస్థులెవరు వంటావార్పు చేసుకోలేదు. పశువులు సయితం దిగ్భ్రాంతి చెందినట్లు ముఖంపెట్టి ఆహారం ముట్టుకోలేదు. గోవులు తమ దూడలకు పాలివ్వటం మానివేశాయి. తమ బిడ్డలను పలకరించటం, తల్లులకు ఇక సంతోషాన్ని కలిగించటమేలేదు. ఆకాశంలోని తారలు గూడ గంభీరంగా కనుపించాయి.

సీతారాములు లేని అయోధ్య కళావిహీనమై ఉన్నది. సాక్షాత్తు లక్ష్మీనారాయణ స్వరూపులైన సీతారాములు నివసించిన అయోధ్య దుఃఖంతో ఒంటరిగా ఉన్నదా! అన్నట్లున్నది. రాజ్యంలో ప్రజలంతా స్వచ్ఛందంగా నిర్మానుష్య వాతావరణాన్ని ఆనాడు త్రేతాయుగంలో పాటించారా! అన్న అనుమానం వస్తున్నది. ఇదంతా రామునిపై ప్రజలకు గల అభిమానం, మమతా మమకారాలు. రాముని మీద వారికి అనిర్వచనీయమైన వాత్సల్యం. రాముడు మానవుడు అయినప్పటికి అతనిని ప్రజలంతా దేవునిగా కొలిచారు.

**అన్నదమ్ముల ధర్మాచరణ**

దశరథుని కుమారులైన రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు రాజ్యకాంక్ష, పదవీకాంక్ష, ధనకాంక్ష, స్త్రీవాంఛ లేనివారు. ఇక్ష్వాకువంశ రాజులు ధర్మపరాయణులు. వంశపారంపర్యంగా అనుసరిస్తున్న ధర్మాన్ని



ఆచరించేవారు. సదాచారాలను, సత్సంప్రదాయాలను, ప్రజాసేవ, మొదలైన సద్గుణాలను పరిరక్షించాలనే అన్నదమ్ముల ఆకాంక్ష.

వనవాసానికి వెళ్ళిన అగ్రజుడైన శ్రీరాముణ్ణి దర్శించి భరతుడు విలపించి చేతులు జోడించి, నమస్కరించి నేను రాజ్యానికి అనర్హుడిని. నా తల్లి కైకేయి స్వార్థ బుద్ధితో నాకు రాజ్యం కట్టబెట్టింది. అసలు అయోధ్యకు రాజుగా తగిన వాడు శ్రీరాముడే. నీవు అగ్రజుడవు వేద వేదాంగాలు, ధర్మశాస్త్రాలు, శస్త్రాస్త్రవిద్యలు తెలిసిన వాడివి. కనుక నీవు సింహాసనం అధిష్ఠించటం ధర్మం. తండ్రి దశరథుడు నీకు రాజ్యం ఇవ్వాలని నీవు పుట్టినపుడే మనసులో అనుకున్నాడు. ఆ నిర్ణయం మనసులో నాటుకుపోయింది. ఇది ధర్మం. కనీసం నాన్నగారి జీవుడు స్వర్గంలో ఉన్నాడు. ఇప్పుడైనా ఆయన ఆత్మ సంతోషిస్తుంది. అయోధ్యకు వచ్చి పట్టాభిషిక్తుడివై నీవు రాజ్యాన్ని పాలించు" అని భరతుడు వేడుకుంటాడు.

అందుకు సమాధానమిస్తూ రాముడు "నాన్నగారు తమ భార్య కైకేయి వరాలను తీర్చడం ధర్మం. మాతాపితరులను నిందించగూడదు. రఘువంశచరిత్రలో మాతాపితరులకు కుమారులు సముచితస్థానం ఇచ్చి గౌరవించారు. తండ్రి మాటను జవదాటగూడదు. తండ్రి దశరథమహారాజు నిర్ణయం రాజధర్మం. దాన్ని పాటించవలసిన వారం మన నలుగురం. అది మనందరి ధర్మం.

ఇంకా రాముడు "భరతా! నాన్న గారు ఏదిచేసినా ఆలోచించి చేస్తారు. ఆయన ఒక్కొక్క నిర్ణయానికి ఒక్కొక్క అర్థం ఉంటుంది. దానిలో ధర్మం కలిసి ఉంటుంది. భార్యమాట తీర్చటం ఆయన ధర్మం. నాన్న మాట శిరసావహించటం నా ధర్మం. నన్ను అరణ్యానికి వెళ్ళమనటం, దానిని అంగీకరించటం నా ధర్మం. నీకు రాజ్యాన్ని ఇచ్చాడు నీవు స్వీకరించటం నీ ధర్మం. అందువల్ల ధర్మాన్ని వినటం, ఆచరించటం మన ధర్మం. అందుకే

మనశాస్త్రాలు **"ధర్మో రక్షతి రక్షితః"** అని హితవు చెబుతున్నాయి. **"రామో విగ్రహవాన్ ధర్మః"** అన్నాడు మారీచుడనే రాక్షసుడు.

శ్రీరాముడు, భరతుడు ఇలా చర్చించుకుంటున్నప్పుడు గూడ లక్ష్మణ, శత్రుఘ్నులు నిశ్శబ్దంగా విన్నారు తప్ప "మీ ఇద్దరు రాజ్యంకోసం పోట్లాడుకుంటున్నారు గదా! మాలో ఒకరికి రాజ్యం ఇవ్వండి" అని నోరు విప్పి మాట్లాడలేదు. లక్ష్మణుడు అన్న రాముని వెంట ఉన్నాడు, భరతుడు రాజ్యం తిరస్కరించాడు, ఇంక మిగిలింది శత్రుఘ్నుడు రాజ్యకాంక్షను వ్యక్తం చేశాడా! లేదు. అన్న రాముని మీద వారు ముగ్గురికి వున్న ఆప్యాయత, అన్యోన్యత, ఐక్యత, సఖ్యత, సమైక్యత లోకానికి నిదర్శనం. రాజమర్యాదలు నాకుగాదు, రామునికే అంటాడు భరతుడు. అన్నమీద అవ్యాజమైన అభిమానం ప్రదర్శిస్తాడు భరతుడు. ఇక్ష్వాకువంశంలో జ్యేష్ఠుడికే రాజ్యం ఇవ్వాలి.

అన్న రాముడే రాజ్యాభిషేకానికి అర్హుడని నిర్ణయించి, శ్రీరాముని పాదుకలను తీసుకెళ్ళి పాదుకాపట్టాభిషేకం చేశాడు. భరతుడు, శత్రుఘ్నుని సహాయంతో రాజ్యభారాన్ని పద్నాలుగు సంవత్సరాలు నిర్విఘ్నంగా నెరవేర్చాడు. అన్నదమ్ముల సత్సంబంధాలకు నిదర్శనం రామాయణకాలమే.

రామలక్ష్మణులు ఒక జంట, భరత శత్రుఘ్నులు మరొక జంట. మొదటి జంట అడవిలో నారచీరలు కట్టుకొని కందమూలాలు తిని ఋషులను సేవిస్తున్నారు. ప్రకృతి అందాలను తిలకిస్తూ కాలక్షేపం చేస్తున్నారు. రెండవజంట అయోధ్యానగరంలో సింహాసనంమీద రాముని పాదుకలు ఉంచి, రాజ్యభారం వహిస్తూ, ధర్మమార్గంలో, తండ్రి దశరథుని అడుగుజాడలలో నడుస్తున్నారు. మాతలైన కౌసల్య, కైకేయీ, సుమిత్రలను సేవిస్తూ వారికి మానసికబాధ కలుగకుండా ముగ్గురిని మాతృభావనతో పూజిస్తున్నారు. జాగ్రత్తలు తీసుకుంటూ ప్రజాపాలన జనరంజకంగా సాగించారు. ఇది భరతుని గొప్పతనం. భరతుడు మార్గమధ్యంలో భరద్వాజుడు ఏర్పాటుచేసిన భవంతిలో సింహాసనం మీద కూర్చొనకుండా,



రాముడు కూర్చున్నాడని భావించి సింహాసనానికి నమస్కరించాడు. శ్రీరాముని మీద భరతుడికి సాటిలేని అభిమానం.

ఈ సందర్భంలో భరద్వాజమహర్షి "రఘువంశజులు చేయవలసిన మూడు లక్షణాలను భరతునికి ఉపదేశించాడు. అవి : 1. గురుజనసేవ, 2. ఇంద్రియనిగ్రహం, 3. సజ్జన సాంగత్యము. అన్ని యుగాల ప్రజలకు ఈ సందేశం ఆచరణీయం.

శ్రీరాముడు భరతునితో చర్చించినపుడు "నేను మృగాలకు రాజును, భరతా! నీవు నరులకు రాజువు" అని అంటాడు. రాముడు సామాన్య మనుషులు మాట్లాడినట్లు సరళంగా, క్లుప్తంగా మాట్లాడుతాడు. రామునికి భరతునికిమధ్య జరిగిన సంభాషణ అంతా ధర్మాచరణమీదనే జరిగింది. రాజ్యపదవిని ఎవరూ ఆశించలేదు. రాజ్యసింహాసనం అన్న రాముడికే కేటాయించారు తమ్ములు ముగ్గురు.

### గుహుని సాన్నిహిత్యం

అరణ్యవాసానికి వెళుతూ మార్గమధ్యంలో సీతారామలక్ష్మణులు గంగానదిని దాటారు. ఆ ప్రాంతానికి రాజైన గుహుడు వారిని స్వాగతించాడు. ఇతను రామునికి మిత్రుడు, సన్నిహితుడు. రాముని రాకను గురించి వినటంతోనే గుహుడు ఆనందోత్సాహాలతో పరివారంతో ఆయనను కలుసుకోటానికి వచ్చాడు. నిషాద కుటుంబంలో పుట్టి దళితకులానికి చెందినవాడైనప్పటికీ ఒక గొప్పభక్తునికి ఉండవలసిన గుణగణాలన్నీ రాజైన గుహునిలో ఉన్నాయి. అతను సౌమ్యుడు, ఆత్మ నిగ్రహం గలవాడు, వినయవంతుడు, సహనశీలి, దానశీలి, భగవంతునికి గొప్ప భక్తుడైనందున అతను నిజానికి ఒక బ్రాహ్మణుని కంటే గొప్పవాడు. మనిషియొక్క కులాన్ని బట్టి అతని పుట్టుకయే నిర్ణయిస్తుందనుకోవటం చాల పెద్ద పొరపాటు. వేదాల నిర్ణయం అలా లేదు.

శ్రీరాముడు దగ్గరకు రావటం గమనించిన గుహుడు రాముణ్ణి పలకరించి ఆలింగనం చేసుకున్నాడు. రామలక్ష్మణులు ఆటవిక దుస్తులలో ఉండటం గమనించిన గుహుడు "ప్రియమైన రామా! నా రాజ్యం నాది మాత్రం కాదు. నీది కూడాను. అందువల్ల నీవు అయోధ్యలో ఉన్నట్లుగానే భావించి ఇక్కడ వున్న సకల సౌకర్యాలు ఉపయోగించుకో. నీవు నా అతిథిగా ఉండటం నాకెంతో గౌరవం" అన్నాడు. గుహుడు రామునికి మృష్టాన్న భోజనం, పరుపులు, పూజాద్రవ్యాలు తీసుకువచ్చాడు. రాముడు ఇదంతా చూచి గుహుణ్ణి ఆలింగనం చేసుకొని "నీవు నాకు సమర్పించిన వాటినన్నిటినీ హృదయంతో స్వీకరిస్తున్నాను. అయితే కుశగ్రాసం (దర్భ) నార, జింకచర్మం మాత్రమే ధరిస్తాను. ఫలాలు, దుంపలు మాత్రమే తింటాను. నేను ప్రతిజ్ఞ చేసినందువల్ల ఈ కానుకలను నేను ఉపయోగించుకోలేను. నీవిచ్చిన భోజనాన్ని నా అశ్వాలకు తినిపిస్తాను. ఎందుకంటే దశరథమహారాజు వద్ద విశేష ప్రేమను చూరగొన్న గుఱ్ఱాలు ఇవి.

**శ్రీరాముడు తను ఆహారం మాని రథాశ్వాలకు ఆ ఆహారాన్ని ఇచ్చాడు. రాముడి హృదయంలో నోరులేని అశ్వాలపై చూపిన ప్రేమ, కరుణ వర్ణనాతీతం. సర్వప్రాణులపట్ల దయగలవాడనటానికి ఇదొక నిదర్శనం. లక్ష్మణుణ్ణి కూడ విశ్రాంతి తీసుకోమని గుహుడు కోరినప్పటికీ రాముడూ, సీత నిద్రిస్తుండగా తాను నిద్రించేదిలేదని చెప్పాడు. వారిద్దరికి రక్షణగా లక్ష్మణుడు ఎల్లప్పుడూ వుంటాడు. అన్న, వదినల సేవను తండ్రి, తల్లిసేవగా భావించాడు లక్ష్మణుడు. తండ్రి తరువాత అన్నను తండ్రి మాదిరి చూడాలని శాస్త్రవచనం. తల్లి సుమిత్రాదేవి మాట గూడా ఇదే.**

మరుసటి రోజు రాముడు సుమంత్రునితో "ఇక నీవు అయోధ్యకు తిరిగి వెళ్ళి, దశరథమహారాజును, ఇతరులను ఓదార్చే స్థితిలో ఉండు, నీవు ప్రశాంత చిత్తుడవై ఉండు. దయచేసి దీనావస్థలోనున్న నా తండ్రి సంగతి చూడు. పద్నాలుగు సంవత్సరములు పూర్తికాగానే మేము తిరిగి వస్తాము. కనుక ఏమీ విచారం పెట్టుకోవద్దు. నేను క్షేమంగా ఉన్నానని నా తల్లిదండ్రులకు నచ్చజెప్పు. భరతుడికి ఆలస్యం లేకుండా పట్టాభిషేకం చేయుమని రాజుగారిని అర్థించు. తన తల్లులందరిని సమానంగా చూడుమని, ఆదరించుమని భరతుణ్ణి నా తరపున ప్రార్థించు' అని చెప్పి గట్టిగా వెళ్ళమన్నాడు.



అందరి మనసులు తెలిసిన వాడు శ్రీరాముడు. దూరంగా వున్నా రామునికి కుటుంబంపై, ప్రజలమీద ఎంత శ్రద్ధ, అభిమానం ఉందో అర్థమవుతుంది. ప్రజలను కన్నబిడ్డలవలె భావించాడు రాముడు. రాముని ప్రతి నిర్ణయం, భావన, ఆచరణ నేటి పాలకులకు ఆదర్శమే. కుటుంబసంబంధాలు, మానవసంబంధాలకు ప్రాముఖ్యమిచ్చాడు శ్రీరాముడు.

## ఋష్యాశ్రమాలతో సంబంధాలు

గంగా యమునా నదుల సంగమాన్ని సమీపించి భరద్వాజాశ్రమాన్ని చేరుకుని, భరద్వాజుని కలవటానికి అనుమతికోరాడు శ్రీరాముడు. రాముడు భరద్వాజుని పరిచయం చేసుకుని తను అరణ్యవాసానికి రావటం వెనుక సంఘటనలన్నీ వివరించాడు. ఆ తర్వాత భరద్వాజుడు సీతారామ లక్ష్మణులకు రుచిగా, శుచిగా మంచి విందు ఇచ్చాడు. వారికి పలురకాల పండ్లు, దుంపలతో తయారు చేసిన వివిధ వంటకాలను వడ్డించాడు. వసతి సౌకర్యాలు ఏర్పాటు చేసిన పిమ్మట భరద్వాజుడు "ఓరామా! నీ అరణ్యవాసం గురించి విన్నప్పటినుంచి నీవు వస్తావని ఎదురుచూస్తూనే ఉన్నాను. ఇక్కడ నీవు నా ఆశ్రమంలోనే పద్నాలుగు సంవత్సరములు నివసించడం నా అభీష్టం. నా శిష్యులందరూ నీ అధీనంలో ఉండగా నీకు ఏ విధమైన అసౌకర్యం కలుగదు" అన్నాడు. ఇందుకు సమాధానంగా రాముడు "నా అరణ్యవాస దీక్షను నిర్వహించటానికి ఉండదగ్గ ఏకాంత ప్రదేశం ఏదైనా ఉంటే దయచేసి

నాకు తెలియజేయండి" అన్నాడు భరద్వాజునితో. రామాయణకాలంలో అతిథి మర్యాదలు, సత్కారాలు, ప్రదర్శించిన ప్రేమానురాగాలు, ఏ విధంగా ఉన్నాయో మనకు అవగాహన కల్గిస్తున్నాయి.

అరణ్యవాస సమయంలో సంచరిస్తున్న సీతారామలక్ష్మణులు ఎన్నో పర్వతాలను, ఎంతోమంది ఋషులు, మహర్షులు, మహానుభావుల దర్శనం చేసుకున్నారు. వాటిలో చిత్రకూట పర్వతం, వాల్మీకి ఆశ్రమం, అత్రిముని ఆశ్రమం, అత్రిముని భార్య అనసూయ, దండకారణ్యం, శరభంగ మహర్షిని, సుతీక్ష్ణ మహర్షి, ధర్మ భృతుడనే ఋషి, అగస్త్యఋషి, మొదలగు వారి ఆశ్రమాలను సందర్శించి ఋషుల సలహాలను పాటించారు. ఋషులు వారి వారి ఆశ్రమాలకు రాముడు వచ్చినపుడు ప్రేమతో స్వాగతం పలికి, ఆతిథ్యమిచ్చారు.

అగస్త్యఋషి మాత్రం విష్ణుధనుస్సును, దేవేంద్రుడు ఇచ్చిన రెండు అక్షయ తూణీరాలను, అమోఘమైన శరాన్ని, బ్రహ్మదేవుడిచ్చిన స్వర్ణఖచితమైన ఖడ్గాన్ని కానుకలుగా ఇచ్చాడు. సీత వైపు చూచి అగస్త్యుడు "నీ భర్త కోసం స్వచ్ఛందంగా అరణ్యవాస కష్టాలను స్వీకరించి చిరయశస్సును సంపాదించుకున్నావు. పురుషుడు సిరిసంపదలతో అనుభవించినంతకాలం మాత్రమే ప్రేమించటమనేది సృష్టి మొదటినుంచి స్త్రీ స్వభావంగా ఉంటూ వచ్చింది. అందువల్ల నీ ప్రవర్తన, నిర్ణయం విశేష పుణ్యప్రదం "అంటూ అభినందించాడు.

గోదావరీ తీరంలో పంచవటికి వెళ్ళి నివాసం ఏర్పరచు కోవలసిందిగా అగస్త్యమహర్షి శ్రీరామునికి సలహా ఇచ్చాడు. ఈ సందర్భంలో జటాయువు అనే పక్షిరాజు కనుపించాడు. వారికి. నేను నీ తండ్రి దశరథమహారాజుకు మంచి మిత్రుణ్ణి. నన్ను నీ విశుద్ధ సేవకునిగా స్వీకరించు. ఈ అరణ్యంలో ఎందరో భయంకర రాక్షసులు నివసిస్తున్నందున నీవు, లక్ష్మణుడు ఇంటిని



వదలి వెళ్ళినపుడల్లా నేను సీతను కనిపెట్టి ఉంటాను" అని జటాయువు రామునికి ధైర్యం చెప్పింది. తన తండ్రితో పూర్వ స్నేహసంబంధం ఉన్నందున రాముడు జటాయువుకు గౌరవసూచికగా వందనం చేశాడు. జటాయువు వెంటరాగా అందరూ పంచవటికి వెళ్ళారు. రామునికి స్నేహితుడిగా జటాయువు కనపడటం, రాముడికి సేవచేయుట కోసం అంగీకరించటం ఎంతో పుణ్యఫలం కలగటం కాకతాళీయంగా జరిగాయి. మహాత్ముల సేవకు అందరూ ముందుంటారని తెలుస్తోంది. జటాయువుకు ఇక్ష్వాకువంశానికి ఉన్న సంబంధాలు అనిర్వచనీయమైనవి.

**ప్రకృతితో సంబంధాలు**

శ్రీరాముడు ఏ ఆశ్రమానికి వెళ్ళినా, ఏ ఋషిని దర్శించినా, ఏ నదులలో స్నానమాచరించినా, ఏ తోటలలోనికి వెళ్ళినా, ఏ పర్వతాలు, వృక్షాలను తాకినా అవి రాముని స్పర్శకు పచ్చదనాన్నిచ్చి తలలు వంచి రామునికి నమస్కరించినట్టుగా ఉన్నాయి. అనురాగంతో స్వాగతసత్కారాలు చేశాయి. రాముని పాదస్పర్శతో ఆ ప్రాంతమంతా సస్యశ్యామలమైంది. పుష్పాలు పుష్పించాయి, చెట్లకు పండ్లు కాశాయి. సెలయేళ్ళు పరుగులు తీశాయి. నదులు ప్రశాంతంగా ప్రవహిస్తున్నాయి. సముద్రఘోష తగ్గింది.

పురుషోత్తముడైన శ్రీరామునికి ప్రకృతిగూడ తలలు వంచి, అలలు తగ్గి, ప్రశాంతతతో నమస్సుమాంజలులు సమర్పించాయి. ఆయన ధర్మనిరతికి నిదర్శనం. ప్రకృతికి రామునికి గల సంబంధం ఏనాటి బంధమో! అది విడదీయరాని బంధం.

**శూర్పణఖ- దుష్టసంబంధాలు**

ఒక రోజు ఉదయాన రామలక్ష్మణులు స్నానమాచరించి వస్తున్న దారిలో స్త్రీ రాక్షసి శూర్పణఖ వికృతంగా కనపడింది. ఆరాక్షసికి రాముణ్ణి చూచినంతనే కామవాంఛ కలిగింది. శ్యామలవర్ణంతో శోభిస్తూ

పద్మదళాయతాక్షుడైన రాముడు మానవరూపం దాల్చిన మన్మథునిలా గోచరించాడు. రాముని దేహం యౌవనవంతమై, సమవిభక్తమై, బలిష్ఠమై రాజచిహ్నాలతో ప్రకాశిస్తోంది. కానీ, ఆ రాక్షసిదేహం వెగటుపుట్టించేదిగా, వికృతరూపంతో అసహ్యంగా వుంది.

శ్రీరాముణ్ణి చూచిన ఆ రక్కసి తన గురించి చెబుతూ, "నాపేరు శూర్పణఖ, నేను రావణ, కుంభకర్ణ, విభీషణ, ఖర దూషణాదులకు సోదరిని. ఈ అడవిలోని జీవరాశుల గుండెలను దడ దడలాడిస్తూంటాను. నా సోదరులు బలశాలురైనప్పటికినీ, నేను వారందరిని మించినదానను. దాపరికం లేకుండా చెబుతున్నాను. రామా! నేను నీ అందానికి భుజబలానికి ముగ్ధురాలినైనాను. నిన్ను భర్తగా స్వీకరించాలని ఉన్నది. నీవు వెంటనే అంగీకరించు" అని మనసులోని మాట చెప్పింది శూర్పణఖ. వెంటనే రాముడు నేను వివాహమైనవాడిని. సీత సవతిగా నీతో జీవించడానికి సహించదు. నా తమ్ముడు భార్యతోడు లేకుండా ఉన్నాడు. కాబట్టి అతణ్ణి వివాహం చేసుకోమని నా సలహా" అని రాముడు శూర్పణఖకు చెప్పాడు.

తరువాత లక్ష్మణుని వద్దకు చేరి అతణ్ణి పొగడి, కామోద్రేకపు మాటలు మాట్లాడింది శూర్పణఖ. రామలక్ష్మణులు ఆ రాక్షస స్త్రీ కామచేష్టలకు, మాటలకు, ఆటలకు గుణపాఠం చెప్పాలని రాముడు లక్ష్మణునికి సైగ చేశాడు. సైగ చేసిన వెంటనే లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు, చెవులు ఖండించాడు. ఆ బాధతో ఆర్తనాదం చేస్తూ రక్తం కారుస్తూ రోదిస్తూ తన సోదరుడు ఖరదూషణుల వద్ద పాదాలపై బడింది. జరిగిన వృత్తాంతాన్ని వారికి వివరించింది. ఎవరితో ఎలా ప్రవర్తించాలో రామలక్ష్మణులకు వెన్నతో పెట్టిన విద్య. దుష్టులకు దూరంగా ఉండాలని తెలుసుకోవాలి.

ఖరుడు విషయం తెలిసి కోపోద్రిక్తుడై 14,000 మంది రాక్షసులతో బయలుదేరాడు. రాక్షసులకు రాముడికి మధ్య భీకర పోరాటం జరిగింది.



కామమోహితయైన రాక్షస స్త్రీ ప్రేరణవలన కొన్ని వేలమంది రాక్షసులు, సోదరులైన ఖరదూషణాదులను మూడు గడియలలో శ్రీరాముడు సంహరించాడు. దేవతలందరూ అమితానందం పొంది రాముడిపై పుష్పవర్షం కురిపించారు. దేవతలు రాముణ్ణి అనేక విధాల పొగడారు. రాముడు సురక్షితంగా, హాయిగా ఉండటం చూచిన సీత మహదానందంతో పరుగెత్తుకు వచ్చి ఆయనను ఆలింగనం చేసుకుంది.

**ధర్మాచరణ, సత్యం పలికే వారికెప్పుడూ విజయమే కలుగుతుందని ఈ యుద్ధం వల్ల తెలిసింది. ఇంకా రాముడు ఎన్నియుద్ధాలు చేయాలో, ఎంతమంది దుర్మార్గులను, అధర్మపరులను, రాక్షసులను, సంహరిస్తాడో! ధర్మమే గెలుస్తుంది. ధర్మ విజయం సాధించడంలో రామునికి ఎంతో మంది ఋషులు, రాజులు, వానరులు, దేవతలు సహకరిస్తారో చూద్దాం. మానవసంబంధాలే విజయానికి తొలిమెట్టు.**

ఈ యుద్ధంలో నుండి తప్పించుకున్న అకంపనుడనే రాక్షసుడు లంకలోని రావణునికి సోదరులిద్దరి మరణవార్తను తెలియజేశాడు. నీ సోదరులిద్దరిని 14,000 రాక్షసులను సంహరించినది దశరథమహారాజు పుత్రుడైన రాముడనే మానవుడు అని వివరించాడు. రావణుడు ఆగ్రహంతో "నేను వెంటనే జనస్థానానికి వెళ్ళి ఈ రామ లక్ష్మణులను చంపివేస్తాను. వాళ్ళు నిజానికి ఎటువంటి వీరులో అప్పుడు మనకు తెలుస్తుంది" అని ప్రకటించాడు.

అయితే అకంపనుడు రావణుణ్ణి హెచ్చరిస్తూ "దయచేసి రాముని శక్తి యుక్తులు తక్కువగా అంచనావేయవద్దు. తొందరపడవద్దు. అతడు సమస్త విశ్వాన్ని నాశనం చేయగలడు, దానిని సృష్టించగలడు. దేవతలు, దానవులు అంతా కలిసి వచ్చినా కూడా వారు రాముణ్ణి వధించగలరని నేను అనుకోను. రామునికి మహాపురుషులతో, మహర్షులతో శక్తిమంతమైన స్నేహసంబంధాలు ఉన్నాయి. అందువల్ల ఓ ప్రభూ! బలప్రయోగంతో అతని

మీద దాడిచేయాలని అనుకోవద్దు. అయితే రాముడు మరణించేలా ఒక ఉపాయముంది. రాముడి భార్య సీత అసమానసౌందర్యరాశి. వేయి చందమామలను మించిన అందం ఆమె ముఖంలో ఉంది. నిజానికి ఆమె స్త్రీత్వపు ఆకర్షణకు ప్రతీక. పాతివ్రత్యంలోను, ప్రవర్తనలోను పరిపూర్ణురాలు. సీత లేకుంటే రాముడు ఎంతో కాలం జీవితాన్ని భరించలేడు. అందువల్ల మీరు వెళ్ళి ఆమెను అపహరించాలని నా సలహా" అన్నాడు.

మహాపతివ్రత సీత బాహ్యసౌందర్యాన్ని, అంతః సౌందర్యగుణాలను తెలిసిన రాక్షసులు అధర్మవర్తనులై, హింసామార్గంలో సీతారాములను విడదీయటానికి ప్రయత్నిస్తున్నారు. సీతారాముల అన్యోన్య దాంపత్యం, వారిద్దరి గుణగణాలు లోకానికి విదితమే.

దుర్మార్గపు ఆలోచనే లక్ష్యంగా పెట్టుకున్న రావణుడు "మారీచా! నేను రాముని భార్యయైన సీతను అపహరించాలని పథకం వేశాను. కనుక నీ సహాయం నాకు అవసరం" అన్నాడు.

**మారీచుని సలహా**

మారీచుడు విపరీతమైన ఆశ్చర్యంతో, భయంతో ఇలా అన్నాడు. "ఈ ఆలోచన నీకు ఎవరు కలిగించారో? రాముడు స్నేహితుని రూపంలో వున్న నీ పరమశత్రువు మాత్రమే. ఓ రావణా! ఈ మూర్ఖమైన పథకం నీవు అమలుచేస్తే నీకు సర్వనాశనం కలుగుతుంది. ఎందుకంటే శ్రీమహావిష్ణువు స్థాయిలో ఊహించని పరాక్రమం ఉన్నవాడు శ్రీరాముడు.

**మారీచుని మానవతా దృక్పథం**

శ్రీరామచంద్రుడు రాక్షసుడైన మారీచుడికి రెండుసార్లు ప్రాణభిక్ష పెట్టాడు. రాక్షసుని విషయంలోనూ మానవతా దృక్పథంతో ఆలోచించాడు రాముడు. ఇది రాముని ధర్మాచరణకు నిదర్శనం. మూడవ పర్యాయం



మారీచుని సంహరిస్తాడు రాముడు. మారీచునికి రామునిమీద, రావణునిమీద భక్తి ఎక్కువ. కనుకనే, మారీచుడు "సీతను వదలి రామునికి అప్పగించమని" సలహా ఇస్తాడు. ఈ సలహా రావణునికి రుచించలేదు. స్నేహభావం ఉన్నది కనుకనే, మారీచుడు రావణుని "మృత్యువు కొని తెచ్చుకోవద్దు. రాముడు మహా పురుషోత్తముడు. సాక్షాత్తు శ్రీమహావిష్ణువు అవతారం, ధర్మశీలుడు. అటువంటివానితో 'స్నేహం చేయాలిగాని శత్రుత్వం పనికిరాదు" అని ఎన్నో మంచి మాటలు చెప్పాడు.. ఇంతేగాదు, మారీచుడు రాముణ్ణి **"రామో విగ్రహవాన్ ధర్మః"** రాముడు మూర్తీభవించిన ధర్మం. రాముడిలో నిలువెల్లా ధర్మం నిండి ఉన్నది. రాముడి ప్రతిరక్తపుబొట్టు, అణువు అణువు ధర్మమే" అని పలికాడు. ఒక రాక్షసుడు రాముణ్ణి ధర్మమూర్తిగా పొగిడాడు అంటే ఆ రాక్షసునిలో ఎంతగౌరవం, అభిమానం ఉన్నదో తెలుస్తోంది.

మారీచుడు శ్రీరాముడి శక్తియుక్తులు రావణునికి వివరంగా తెలియజేశాడు. రాముడు ఒక అగాధమైన సముద్రంవంటివాడు. అతని ధనుస్సే మకరాలు. అతని శక్తిమంతమైన భుజాలే సుడిగుండాలు. ఆయన విడుదల చేసే ప్రతిబాణం ఎగిరిపడే తరంగాలు. ఒకతీరం నుండి మరొక తీరానికి వ్యాపించి వున్న ఆ సాగరం యొక్క పరిధి యుద్ధ క్షేత్రమే. అందులో ఆయన శత్రువులు మునిగి పోతారు. ఓ రాక్షసరాజా! నీవు నీకోపాన్ని నిగ్రహించుకొని లంకకు తిరిగి వెళ్ళటమే మంచిది. అక్కడ నీ భార్యలతో నీవు సుఖించు. రాముణ్ణి దండకారణ్యంలో తన భార్యతో కలసి సుఖించనివ్వు. లేకుంటే నీ వినాశనాన్ని నీ తల మీదకు తెచ్చుకున్నవాడివవుతావు" అన్నాడు మారీచుడు.

మారీచుడు రావణుని శ్రేయోభిలాషి. రాముని పరాక్రమం తెలిసినవాడు గనుక రావణుని క్షేమం కోరి మంచి చెప్పాడు. ఇంక రావణుని నిర్ణయానికి వదిలేశాడు.

## మాయలేడి మారీచుడు

రావణుడు తన సోదరి శూర్పణఖ ద్వారా లావణ్యవతియైన సీతగురించి వినగానే ఆమెను సొంతం చేసుకోవాలన్న నిశ్చయానికి వచ్చాడు. రావణుడు మారీచుని ఆశ్రమానికి వెళ్ళి "తన కోరికను, ప్రతీకారజ్వాలను అతనికి చెప్పి, సీతను అపహరించటానికి ఒక కొత్త పన్నాగాన్ని పన్నేడు, దానికి నీ సహాయమై వచ్చాను., నీవు నెరవేర్చాలి" అన్నాడు.

మారీచా! నీవు వెండిమచ్చలు నిండిన ఒక బంగారు లేడిరూపాన్ని ధరించి, అడవిలోకి వెళ్ళి సీత ముందు ఆటలాడు. నీ రూపానికి ఆమె ముగ్ధురాలై, నీ మాయలేడి రూపాన్ని తను పెంచుకోటానికి సిద్ధపడి రాముణ్ణి "ఆ లేడిని తీసుకురమ్మని" అడుగుతుంది అని రావణుడు సలహా ఇచ్చాడు.

రాముని పేరు వినటంతోనే మారీచుడు ఎంతగానో భయపడి పోయాడు. మారీచుడు చేతులు జోడించి "ఓ ప్రభూ! ఈ పథకాన్ని గనుక నీవు అమలు చేస్తే దానివల్ల సకలరాక్షసులు, వారితో పాటు నీ లంకారాజ్యం సర్వనాశనం కావటం తథ్యం. నీ కామవాంఛ వలనను, రాముని పరాక్రమాన్ని గురించిన అజ్ఞానం వల్లనూ, నీవు అవివేకంగా వినాశనంవైపు వెళుతున్నావు. గ్రుడ్డిగా వ్యవహరించి నీ స్వీయవినాశనాన్ని కొనితెచ్చుకునే ముందు రాముని గొప్ప మహిమగల విశేషాలను గురించి చెబుతాను.

రాముడు తన బాణాలతో నన్ను విశ్వామిత్రుని యాగ నిర్వహణకు ఆటంకం కలిగించిన సందర్భంలో 800 మైళ్ళు విసిరివేసి సముద్రంలో పడవేసినపుడు స్పృహ కోల్పోయాను. మళ్ళీ నేను ప్రతీకారం తీర్చుకోవటానికి రాముని వైపు వెళ్ళగా ఆయన మూడు బాణాలు విసిరాడు. నా సహచరరాక్షసులు ఇద్దరు మరణించారు. నేను పరుగెత్తి తప్పించుకుని లంకకు తిరిగి వచ్చాను. ఆనాటి నుంచి నాకు రాముని భయం వెంటాడుతూనే ఉన్నది. కాబట్టి, రాజా! నీవు సీతాపహరణను మానుకోవలసిందిగా సలహా ఇస్తున్నాను. భయం సంగతి తర్వాత, అసలు నీవు అలాంటి పాపకార్యం



ఎందుకు చేయాలి? పరస్త్రీని అపహరించటానికి మించిన ఘోరమైన నేరం మరొకటి లేదు. నీకున్న సహస్ర సంఖ్య గల భార్యలతో సంతృప్తి చెంది నీ హుందాతనాన్ని, భాగ్యాన్నీ, రాజ్యాన్నీ, నీ ప్రాణాలను కాపాడుకో' అని హితవు పలికాడు మారీచుడు రావణునితో.

మారీచుడు ఎంత చెప్పినా రావణుడు అతని మొండితనాన్ని, మూర్ఖత్వాన్ని వదలలేదు. సీతను అపహరించుటయే రావణుడు దుష్టలక్ష్యంగా నిర్ణయించుకున్నాడు. సన్నిహిత సంబంధాలున్న మారీచుని సలహా రావణుడు వినలేదు.

మిత్రుడైన రావణుని మాటవిని మారీచుడు బంగారు లేడి రూపం ధరించి సీతాపహరణకు రావణుడితో అరణ్యానికి బయలుదేరటానికి అంగీకరించాడు. రావణా! నీ చేతిలో చావటం కంటే శ్రేష్ఠుడైన శత్రువుచేతిలో మరణించటానికే నేను ఇష్టపడతాను. అందువల్ల ఇద్దరం తత్క్షణం బయలుదేరుదాం" అన్నాడు మారీచుడు.

మారీచుడు బంగారులేడి రూపం దాల్చి సీతారాముల వనవాస సమీపాన సంచరిస్తూ, గెంతులేస్తూ, ఆడుకుంటూ సీతను కవ్విస్తున్నాడు. ఆకర్షణీయమైన మాయలేడిని చూచి సీత మనసు చలించి రామునితో "రామా! దయచేసి ఆలేడిని పట్టుకో! ఇలాంటి లేడి నాకు చక్కని పెంపుడు జంతువుగా ఉంటుంది. త్వరగా వెళ్ళి దానిని పట్టి నాకు తెచ్చి ఇవ్వండి" అని సీత అడిగింది. వెంటనే రాముడు లక్ష్మణుణ్ణి సీతకు రక్షణగా ఉండుమని, ఎక్కడకు వెళ్ళవద్దని చెప్పి, ఆ మాయలేడిని పట్టుకోటానికి బాణాలు ఎక్కుపెట్టి వెంటపడ్డాడు. చివరకు రాముడు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించగా మారీచుడు రాక్షసుని రూపంగా మారి హా సీతా! హా లక్ష్మణా! అంటూ అమితమైన బాధతో రాముని కంఠస్వరాన్ని పోలిన గావుకేక పెట్టాడు. మారీచుడు ప్రాణం వదిలాడు.

ఆ అరుపులకు సీత భయపడి రాముడికి ప్రాణాపాయం జరిగిందేమో లక్ష్మణా! నీవు వెంటనే వెళ్ళి రాముణ్ణి పరామర్శించి రావలసిందిగా ఆజ్ఞ వేసింది. వదిన సీత మాటను తిరస్కరించలేక లక్ష్మణుడు రాముణ్ణి వెదకటానికి బయలుదేరాడు. రావణుడు ఈ అవకాశం కోసమే ఎదురుచూస్తున్నాడు.

**శత్రువులు ఎప్పుడు మాయలతోనే పథకాలు వేసి మంచివారికి ద్రోహం తలపెడుతూంటారు. చాల జాగ్రత్తగా ఉండుమని హెచ్చరిక సుమా!**

**సీతాపహరణ**

రామ లక్ష్మణులు లేని సమయం చూచి రావణుడు కాషాయాంబరాలతో నెత్తిన జుట్టుముడివేసుకున్నాడు. పాదుకలు ధరించాడు. కుడిభుజాన ఒకఛత్రాన్ని దాల్చి, ఎడమచేతితో దండ కమండలాలను చేతబూని సన్యాసి వేషంలో సీత ఎదుటకు వచ్చాడు. రావణుని వేదమంత్రాలకు, బ్రాహ్మణ వేషానికి, భక్తికి మురిసిపోయిన సీత అతనికి ఆసనమిచ్చి, అర్ఘ్యపాద్యాలు సమర్పించి, సీత ఇలా వివరించింది. నా పేరు సీత, మిథిలాధిపతి జనకుని కుమార్తెను, దశరథమహారాజు కుమారుడు రాముణ్ణి వివాహమాడాను. తర్వాత జరిగిన పరిణామాలు క్రమంగా రావణునికి చెప్పింది. కాషాయాంబరాలతో నున్నది రావణాసురుడనే రాక్షసుడని, తనను అపహరించటానికి వచ్చాడని సీత ఊహించలేదు, ఆలోచించలేదు, అనుమానించలేదు.

రావణుడు తన మనస్సులోని కోరికను నిగ్రహించుకోలేక తాను రాక్షసులకు రాజైన రావణుడనని, నా పేరు వింటే దేవతలు సైతం గజ గజ వణుకుతారని సీతతో చెప్పాడు. నీ అందాన్ని చూశాను గనుక నా అందమైన భార్యలతో సమానంగా నిన్ను సుఖపెడుతాను. సీతా! నీవు నా పట్టపురాణిగా ఉండు. దాసీజనంతో సుందరమైన ఉద్యానవనాల్లో విహరిస్తూ నాతో భోగాలు అనుభవించు" అని తన మనసులోని మాట వివరించాడు రావణుడు.



**తిరస్కరించిన సీత**

రావణుని మాటలు విని సీత తీవ్రమైన కోపంతో తిరస్కారభావంతో యిలా బదులిచ్చింది. "పర్వతంవలె సుస్థిరుడు, సాగరంవలె గంభీరుడు, వటవృక్షం మాదిరి ఆశ్రయ ప్రదాతయైన రామునికి నేను సంపూర్ణంగా అంకితమైన దానిని, మహాబాహుడు, పీనవక్షుడు, పూర్ణచంద్రముఖుడు, ఆత్మనిగ్రహసంపన్నుడు, ధర్మపరాయణుడు, అయిన రామునికి అంకితమైన దానిని. రాముడు నరులలో సింహం వంటివాడు. జంబుకం వంటివాడైన నీవు సింహికలాంటి నన్ను చేపట్టగోరుతున్నావు. రాముడు గరుత్మంతుడు కాగా నీవు ఒక కాకివి మాత్రమే. రాముడు ఒక మహాసముద్రం కాగా నీవు ఒక రొచ్చుగుంటవు. రాముడు అమృతం. నీవు పాసిపోయిన గంజివి. ఆయన శ్రీగంధం. నీవు బురదలాంటి వాడివి. రాముడు సువర్ణం, నీవు ఒక ఇనుప ముక్కవి. రాముడొక హంస, నీవు రాబందుకంటే నీచుడివి. నీవు నన్ను అపహరించగలవేమో కాని రాముడు జీవించినంతకాలం నీవు శ్లేష్మంలోపడి తన్నుకులాడే ఈగకుమించి నన్నేమి చేయలేవు.

**సీత ఆక్రందన**

సహజ రాక్షసగుణం గల రావణుడు సీత జుట్టును పట్టుకున్నాడు. లాగి స్వర్ణరథంపై భయంతో నున్న సీతను తన చేతుల్లోకి తీసుకున్నాడు. ఆకాశంలోకి పైకి లేచాడు. వారు ఆ విధంగా ఆకాశ మార్గాన వెళుతుండగా సీత "రామా! రామా! వచ్చి నన్ను కాపాడు. ఈ దుష్ట రావణుణ్ణి శిక్షించు, అంటూ కేక పెట్టింది. సీత ఆ సమయంలో ఎవరి సహాయం లేనిదై వృక్షాలను, నదులను, పక్షులను, జంతువులను ఎలుగెత్తి పిలచి తాను అపహరణకు గురైనట్లు రామునికి చెప్పుమని ప్రార్థించింది. సరిగ్గా ఆసమయంలో ఒక చెట్టుపై కూర్చొనివున్న జటాయువుని సీత చూచింది. జటాయూ! "దయచేసి నాకు సహాయం చెయ్యి. ఇప్పుడే వెళ్ళి నన్ను దుష్టరావణుడు అపహరించాడని రామునికి చెప్పు", అని పెద్దగా అరిచి చెప్పింది.

## జటాయువు సేవాభావం-అనుబంధం

సీత అరుపులను విన్న జటాయువు మేల్కొని ఆమెను రావణుడు తీసుకువెళ్తూండటం గమనించి ఓ రావణా! నేను గ్రద్దలకు రాజు జటాయువును. పరస్త్రీ మీద చేతులు వేయటానికి నీకు చేతులు ఎలా వచ్చాయి? జాగ్రత్త! నీ చేతిలో ఒక విషసర్పాన్ని మోసుకుపోతున్నావు. నేను 60,000 సంవత్సరాల వృద్ధుణ్ణి, ఆయుధాలు లేనివాడిని. నీవు యువకుడవు. అనేక ఆయుధాలు కలిగి ఉన్నావు. అయినా సీతను ఎత్తుకుపోనివ్వను. నిన్ను హెచ్చరిస్తున్నా. నీ దుర్మార్గపు ఆలోచన విడనాడి సీతను వదలిపెట్టు లేదా వృక్షంలోని పండ్లు నేల రాలినట్లు నీ రథం నుండి క్రిందకు పడడానికి సిద్ధంగా ఉండు" అని రాక్షసరాజును సవాలు చేసింది.

ఆ మాటలకు రావణుడు జటాయువు వైపు దూసుకెళ్ళాడు. పోరాటంలో రెండు మహాపర్వతాలు ఢీకొన్నట్లు కనుపించింది. రావణుడు తన ఆయుధాలను విసరగా, ఆ పక్షిరాజు తన పాదాలకున్న నిశితమైన గోళ్ళతో రావణుణ్ణి గీరాడు.

జటాయువు తన రెక్కలతో రావణుని ధనుస్సును విరిచాడు. రావణుని కవచాన్ని ముక్కలు చేశాడు. రథానికి కట్టిన గుఱ్ఱాలను వధించాడు. రథాన్ని ముక్కలుగా చేసి అదే సమయంలో రావణుని రథసారథి తల తుంచి వేశాడు. రథం తునాతునుకలు కాగా రావణుడు సీతతో సహా నేలకూలాడు. ఈ అద్భుతమైన పరాక్రమ ప్రదర్శనను వీక్షించిన జీవరాసులన్నీ జటాయువు పరాక్రమాన్ని పొగడి, శభాష్ అన్నాయి. జటాయువుకు సీతారాములమధ్యగల బంధం ఏనాటిదో?

తరువాత రావణుడు ఆకాశంలోకి లేవగా సీత ఆభరణాలు తెగిపోయి రత్నమాణిక్యాలు నేలపై బడ్డాయి. రావణుని నుంచి పట్టువిడిపించు కోవటానికి సీత ప్రయత్నించింది.



**ఈ సంఘటనను పూర్తిగా దివ్యదృష్టితో గ్రహించగలిగిన బ్రహ్మదేవుడు మాత్రం మన "ఉద్దేశ్యం ఇపుడు నెరవేరింది" అని ప్రకటించాడు. రావణ సంహారానికి ఈ సంఘటన నాంది అని దీని అంతరార్థం.**

## రావణుని వ్యక్తిత్వం - దుష్ప్రవర్తన

రావణాసురుని వ్యక్తిత్వం రాముని వ్యక్తిత్వానికి పూర్తిగా వ్యతిరేకమైనది, రాక్షసభావన రాక్షసకార్యాలతో కూడుకున్నది. సీతాపహరణం రావణుని, రాక్షస కార్యమే కాని రాక్షస వివాహంకాదు. కాని, రావణుని కిష్టమైనవన్నీ బలాత్కార వివాహాలే! సీత పరదార కదా అంటే రావణునికి పరదారయే పంచదార. అతనికి వివాహ వ్యవస్థపై బొత్తిగా నమ్మకం లేదు. కారణం, రాక్షసత్వం కరుడుగట్టిన నరమాంస భక్షకుడు గనుక రావణుడు విశ్వావసుబ్రహ్మ కుమారుడు. ఇతనికి కుంభకర్ణుడు, విభీషణుడు, ఖరదూషణులు సోదరులు, శూర్పణఖ సోదరి ఉన్నారు. రావణుడు పది తలలు, ఇరవై చేతులు గలవాడు. శివుని గురించి తపస్సు చేసి గొప్పవరాలు పొందాడు. రావణుని తపస్సుకు మెచ్చిన బ్రహ్మదేవుడు "మానవులు మినహా మరియే ఇతర ప్రాణుల చేతుల్లోను అతనికి మృత్యువు కలగకుండా వరాన్ని" ప్రసాదించాడు. ఈ వరాన్ని పొందిన తరువాత రావణుడు బలగర్వితుడై మునులను వధిస్తూ వారియజ్ఞాలను ధ్వంసం చేయసాగాడు. అలా అతడు పక్కలో బల్లెంగా మారటంతో వారంతా శ్రీమహావిష్ణువును ఆశ్రయించి రావణుని నాశనం కోరుతూ ఎంతగానో ప్రార్థించారు.

రావణునికి మొండితనం, మూర్ఖత్వం ఎక్కువ. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు – శరీరం అంతా అణువణువునా జీర్ణించుకుపోయాయి. ఎంతోమంది స్త్రీలను బలాత్కరించి కామవాంఛ తీర్చుకునే అలవాటు కలవాడు. ధర్మాధర్మవిచక్షణ లేదు. రావణుడు తను అనుకున్నది సాధించటానికి ఎంత దుర్మార్గానికైనా, దుష్టచర్యకైనా వెనుకాడడు. అతను తపస్సుద్వారా సంపాదించుకున్న వరాలను,

శక్తియుక్తులను, శస్త్రాస్త్ర విద్యలను చెడు పనులకే ఉపయోగించాడు. ప్రతికూల భావాలు ఎక్కువగా పుణికి పుచ్చుకున్నాడు. రక్తం పంచుకున్న తమ్ములు మంచి చెప్పినా, అధర్మం వద్దని వారించినా, హింస విడువుమని చెప్పినా వినేవాడు కాదు. మాయలు సృష్టించే మోసగాడు. తన తపశ్శక్తి నంతా మంచికి వినియోగించక చెడుకి మాత్రమే ఉపయోగించేవాడు. చివరకు తన కుటుంబం, రాజ్యం, తన జీవితం నాశనానికి దారి తీసింది.

రావణుడు జ్ఞానేంద్రియాలను, కర్మేంద్రియాలను మంచి పనులకు శుభకార్యాలకు, మానవసేవచేయుటానికి, ఆధ్యాత్మిక తత్వానికి ఉపయోగించకుండా, దురాలోచనతో చెడు కార్యక్రమాలు చేస్తూ, అత్యాచారాలు చేస్తూ జీవితం వెళ్ళబుచ్చుతున్నాడు. అందరితోనూ దుష్టసంబంధాలు పెంచుకున్నాడు.

ఇటువంటి దుర్గుణాలు గల **రావణుడు మహాపతివ్రతయైన సీతను తీసికొని లంకవైపు వేగంగా పోతుండగా సకల ప్రాణులు "ధర్మానికి చోటెక్కడ? సత్యానికి చోటెక్కడ? మర్యాదకు చోటెక్కడ? స్త్రీకి గౌరవమెక్కడ" అని విలపిస్తున్నట్టు కనుపించాయి.** తన శిరోజాలుగాలికి ఊగుతున్నాయి. తన కుంకుమ చెదిరింది. తనముఖం సంతోష విహీనం అయింది. కాగా సీత "ఓరామా! ఓ లక్ష్మణా!" అని ఆక్రోశించింది. ఆసమయంలో అయిదుగురు వానరులు ఒక కొండకొమ్ముపై పర్వతం చివరన కూర్చొని ఉండటం సీత చూచింది. రావణుడు గమనించకుండా తన పట్టుపైటలో కొన్ని ఆభరణాలను తీసి వారి మధ్యన పడవేసింది. ఈ విలువగల వస్తువులను చూచి, వానరులు రెప్పవేయని కన్నులతో చూస్తుండగా రావణుడు సీతను లంక వైపు తీసుకెళ్ళాడు.

**మహర్షి వాల్మీకి, రామాయణకావ్యంలో "రామవత్ వర్తితవ్యం న తు రావణవత్" అని పలికాడు. అంటే అందరూ 'శ్రీరాముని వలె ప్రవర్తించాలి కాని రావణుని వలె కాదని' దీని అభిప్రాయం. ఈ సందర్భంలో రాముని వ్యక్తిత్వ లక్షణాలు, గుణాలు తెలుసుకున్నాం. అన్నీ మంచి గుణాలే. అందుకే పూర్వంనుంచి రాముని "సకల సద్గుణ శోభితుడు రాముడు" అనే సామెత ప్రచారంలోకి వచ్చింది.**



**రావణుని వ్యక్తిత్వం అవగుణాలు, దుర్లక్షణాలు తెలుసుకున్నాం. కాబట్టి మనం చేయవలసింది రాముని అనుకరించడమే, అనుసరించగమే. రాముని గుణాలు భావించాలి. రామ నామాన్ని స్మరించాలి. అయోధ్యా నగరంలోని ప్రజలంతా 'యథా రాజా తథా ప్రజా' అన్నట్లు రాముని గుణగణాలే అలవరచుకున్నారు. నేటి యువతరానికి ఈ గుణాలన్నీ అలవరచుకోవాలని వాల్మీకి సందేశం.**

### సీత రాముడికే అంకితం

రావణుడు తన మనసులోని కోరికను సీతతో చెప్పాడు. ఓ సీతా! నీకు తెలివి ఉన్నట్లయితే నాకోరికను నీవు నెరవేర్చితే నా పట్టపురాణిగా చేస్తాను. నా ప్రియభార్యవై ఈ ఐశ్వర్యాన్నంతటినీ ఏలుకో. నీ ఒక్క దానికే నేను అంకితుణ్ణి అవుతాను. యౌవన సౌందర్యం ఎప్పుడూ ఉండదు. కనుక దయచేసి నన్ను భర్తగా అంగీకరించు. శౌర్యం లేని రాముణ్ణీ, అడవి పాలైన రాముణ్ణీ, రాజ్యాధికారం లేని రాముణ్ణీ మరచిపోయి నాతో నీ జీవితాన్ని ఆనందంగా అనుభవించు" అని రావణుడు పలుసార్లు చెప్పాడు.

రావణుని ఆశను తిరస్కరించింది సీత. సీత నిర్భయంగా "నా హృదయం ఒక్క రామునికే అంకితం. పద్మాలతో నిండిన సరస్సులో నా జతగానితో క్రీడిస్తున్న హంసనైన నేను ఒడ్డున సంచరిస్తున్న బాతు నెందుకు చేరతాను? నీవు నన్ను ఏమి చేయగలవో చేసుకో. నీ దుష్టమైన కామప్రవృత్తి కారణంగా నీవు త్వరలోనే రాముని చేతుల్లో మరణిస్తావు" అని బదులు పలికింది.

కోపిష్టియైన రావణుడు "నీవు నాకు లొంగి పోవటానికి పన్నెండునెలలు సమయమిస్తున్నాను. నా ఆజ్ఞను తిరస్కరించి, నీ భావం మార్చుకోకపోతే

నిన్ను నావంట వాళ్ళ చేత ముక్కలుగా నరికిస్తాను. నా ఉదయపు ఫలాహారంగా నిన్ను వండించుకొని భుజిస్తాను" అన్నాడు.

**అశోకవనంలో సీత-అనుకూల సంబంధాలు**

రావణుడు సీతను అశోకవనానికి పంపాడు. ఆమెను జాగ్రత్తగా కనిపెట్టమన్నాడు. ఏదో ఉపాయాలు పన్ని ఆమెను నా వైపు బుద్ధి మార్చేటట్లుగా చేయటానికి ప్రయత్నించండి" అని పరిచారికలకు ఆజ్ఞ వేశాడు. వికృతరూపిణులైన స్త్రీ రాక్షసులను చూచి సీత భయంతో స్పృహ తప్పింది.

**ఇదంతా గమనిస్తున్న బ్రహ్మదేవుడు ఇంద్రుణ్ణి పిలిపించి "సీత రావణుడిచేత అపహరింపబడి లంకకు చేర్చబడింది. ఇది మన అదృష్టం. ఎందుకంటే, ఇక రాక్షసరాజు మరణించటమే తరువాయి అని ఖచ్చితంగా చెప్పవచ్చు. అయినప్పటికీ రాముని వియోగం కారణంగా సీత మరణించటానికి అవకాశం ఉంది. అందువల్ల నీవు వెళ్ళి ఈ దివ్య పాయసాన్ని ఆమె తినటానికి ఇవ్వు" అని చెప్పాడు.**

**"ఇంద్రుడు బ్రాహ్మణరూపంలో వెళ్ళి నేను స్వర్గాధిపతియైన ఇంద్రుడిని. శ్రీరామునికి సహాయం చేయటానికి వచ్చాను. నేను తెచ్చిన దివ్యపాయసం తీసుకోవలసింది. ఈ పాయసం రానున్న అనేక సంవత్సరాలపాటు ఆకలి దప్పులు గాని, బాధలు గాని లేకుండా చేస్తుంది. కనుక దయచేసి స్వీకరించు." అంటాడు.**

**సీత ఆ బ్రాహ్మణుణ్ణి అనుమానించింది. అది గమనించిన ఇంద్రుడు తన నిజస్వరూపాన్ని సీతకు చూపించాడు. అతడు ఇంద్రుడేనని నిర్ధారించుకొని పాయసాన్ని స్వీకరించింది. సీత తను ఆహారంగా భుజించే పాయసాన్ని శ్రీరామునికి నివేదించింది. తరువాత ఆమె భుజించటంతోనే**



**సకల శారీరక బాధలనుండి బయటపడింది. తమ కార్యం సఫలం కావటంతో ఇంద్రుడు, నిద్రాదేవి ఆ స్థలం నుండి అంతర్ధానమైనారు. (ప్రక్షిప్త సర్గ-56)**

సీతారాముల శరీరాలు వేరైనా, దూరంగా ఉన్నా, విరహం అనుభవించినా మనసులు కలిసే ఉంటాయి. సీత మనసులో, నోటి వెంట 'రామ' నామం జపిస్తూ ఉంటుంది. రాముని మనసులో, మాటలో ఎప్పుడూ 'సీత'ను కలవరిస్తాడు, పలవరిస్తాడు. సీతారాముల మనసులను ఎవరూ మార్చలేరు, దోచుకోలేరు. ఒకరి పై ఒకరికి ప్రేమ ఎక్కువ. భార్యాభర్తల అనుబంధం జన్మ జన్మలబంధం.

**సీతకోసం రాముని అన్వేషణ**

మారీచుణ్ణి వధించిన మీదట రాముడు చాల వేగంగా తన పర్ణశాలవైపు అడుగులు వేస్తూ వెళ్తున్నాడు. దారిపొడవునా మనస్సులో "నేను రాక్షసులను చంపినందుకు వారు నా మీద పగతీర్చుకోటానికి సిద్ధమై ఉంటారు. అందుకేవారు మాయలేడిని పంపి నన్ను సీతకు దూరంచేసి ఉంటారేమో! లక్ష్మణుడు సీతను వదిలి వెళ్ళి ఉండకూడదని నా ప్రార్థన" అని ఆలోచించసాగాడు. ఇంతలో రామునికి అశుభసూచనలు కనుపించాయి. వెంటనే రామునికి ఎదురుగా వస్తున్న లక్ష్మణుడిని చూచి తక్షణమే. "సీతను కాపాడకుండా వదిలేసి నా ఆజ్ఞను నీ వెలాధిక్కరించావు". అయ్యో లక్ష్మణా! సీతను ఒంటరిగా ఎలా వదిలి రాగలిగావు? అంటూ నిందించాడు.

అంతట లక్ష్మణుడు "సహాయం కోసం నీవుపెట్టిన కేకలు విని సీత పిచ్చిదైపోయింది. ఆమె నిన్ను చావుకు వదిలి వేశానని కఠినంగా మాట్లాడింది. అంతట నన్ను భరతుని మనిషినని, కపటవేషంలోనున్న నీ శత్రువని ఆరోపించింది. ఆమె ఆరోపణ అబద్ధాలని చెప్పడానికి నీకోసం వచ్చాను" అని బదులిచ్చాడు.

రామలక్ష్మణులు తమ పర్ణశాలకు చేరి నిర్మానుష్యంగా ఉండటం గమనించారు. సీత కోసం ఆ చుట్టుప్రక్కల అంతా గాలించారు. ఎక్కడా ఆమె కనుపించక పోవటంతో ఆయన ముఖం వాడిపోయింది. కళావిహీనమైంది. దుఃఖంతో నలుపుబారినట్లుంది. రాముడు సీత ఆనవాలు, కట్టిన చీర, పసుపురంగు చెట్లను, పుట్టలను, వన్యమృగాలను, అడగటం ప్రారంభించాడు. వారినుంచి సమాధానంలేదు. తన ఎదుట సీత ప్రత్యక్షమైనట్లు ఊహించుకొని "ఓ ప్రియాతిప్రియతమా! ఎందుకు నానుంచి పారిపోయిదాక్కుంటున్నావు? నాతో ఎందుకు పలుకవు? పలుకే బంగారమయ్యేనా! అని పెద్దగా విలపించాడు.

రామ లక్ష్మణులు సీతను వెదకుటకోసం పర్వతాల్లో, అరణ్యాల్లో, మైదానాల్లో తిరిగారు. రాముడు నిస్సత్వంతో ముందుకు నడవలేక దుఃఖానికి లోనైనాడు. లక్ష్మణుని ఓదార్పువల్ల రాముడు ఉదాసీనుడైనాడు. ప్రేమగలవాడై సీతా! సీతా! అంటూ రాముడు ఆక్రోశించాడు. ఒకానొక సందర్భంలో "పరియాచకాలాడటంకోసం దాక్కున్నావా! దాగుడుమూతలు కట్టిపెట్టి నావద్దకురా! అంటూ వేడుకుంటున్నాడు. ఎందుకంటే నాబాధ చాల తీవ్రంగా ఉంది. రాముడు మతిభ్రమించినవాడిలా మాట్లాడుతున్నాడు.

### జటాయువుతో సంభాషణ - అన్నదమ్ముల కరుణ

రామలక్ష్మణులు అరణ్యంలో గాలిస్తూ రక్తపు మడుగులో పడి ఉన్న జటాయువుకు కనుపించారు. రావణుని పట్టునుంచి రక్షించే యత్నంలో ప్రాణం పోయేంతగా గాయపడ్డాడని, రాముడు అర్థం చేసుకున్నాడు. రాముడు జటాయువును ఆలింగనం చేసుకున్నాడు. తన సేవకుని దయనీయస్థితిని చూచిన రామునికి దుఃఖం రెండింతలైంది.

ఓ జటాయూ! సీతను గురించి, ఆమెను అపహరించినవాణ్ణి గురించి దయచేసి నీకు తెలిసినదంతా నాకు చెప్పు" అని ఆదుర్దాగా అడిగాడు.



**మృత్యువుకు సమీపంలోన్న జటాయువు జరిగినదంతా వివరించింది. రావణుడు సీతను 'విందు' అనబడే ముహూర్తంలో ఎత్తుకువెళ్ళాడు. ఎవరైనా వ్యక్తి ఆ ముహూర్తంలో దేనినైనా పోగొట్టుకున్నట్లయితే అతను దానిని తప్పకుండా తిరిగి పొందుతాడని శాస్త్రవచనం. ప్రియమైన రామా! సీత కారణంగా ఎక్కువగా దుఃఖించకు. నీవు యుద్ధంలో ఆ రాక్షసరాజును సంహరించి ఆమెను తప్పకుండా తిరిగి పొందుతావు"**అని అభయమిచ్చాడు. రావణుని వంశవృక్షాన్ని, ఉన్నతస్థితిని వివరిస్తూ "రామా! రామా! అంటూ జటాయువు ప్రాణాలను విడిచాడు.

లక్ష్మణా! సీతాపహరణ వార్త కంటే నా కోసం జీవితాన్ని పణంగా పెట్టిన ఈ జటాయువు మరణం నాకు మరింతగా బాధకలిగిస్తున్నది. ఇతని శరీరానికి దహన సంస్కారం చేయాలి. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయుమని" రాముడు అన్నాడు. లక్ష్మణుడు చితిని సిద్ధపరచగా రాముడు జటాయువు దేహాన్ని దానిపై ఉంచి అగ్ని సంస్కారం చేశాడు. జటాయువు ఆత్మశాంతికోసం సోదరులిద్దరూ తర్పణాలు విడిచి వేదమంత్రాలను చదివారు. రామలక్ష్మణులు గోదావరి తీరానికి వెళ్ళి స్నానాలు ఆచరించి, అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు.

రామునికి చేసిన సేవకు ప్రతిఫలంగా జటాయువు ఉన్నతలోకాలకు చేరుకుంటాడని గ్రహించాలి. జటాయువు అడవిలో అనాథగా పడి ఉన్న సమయంలో రామ లక్ష్మణులు తటస్థపడి, సంభాషించారు. మరణించిన తదుపరి అనాథప్రేత సంస్కారం చేయటం రాముని గొప్పతనానికి, సేవకు నిదర్శనం. అనాథప్రేత సంస్కారం కోటిజన్మల పుణ్యఫలాన్నిస్తుందని శాస్త్రవచనం అని గమనించాలి. రాముడు ఏ పని చేసినా శాస్త్రప్రకారం నడుచుకుంటాడని అర్థం. అందరూ శాస్త్ర ప్రకారం నిర్వహించాలనే అవగాహనతో ఉండాలి.

## రాక్షసుడితో సంబంధం - సుగ్రీవుడితో స్నేహం

రామలక్ష్మణులు దండకారణ్యాన్ని విడిచి క్రౌంచారణ్యంగుండా కీకారణ్యంలోకి ప్రవేశించారు. అక్కడ వారికి వికృతాకారంలో ఉన్న కబంధుడనే రాక్షసుడు కనుపించాడు. ఇటువంటి వికృతాకారం గల రాక్షసుడు రామలక్ష్మణులకు ఎంతో సహాయం చేశాడు.

కబంధుడు "పూర్వజన్మలో నాకు దేవేంద్రుడు దీర్ఘాయువును ప్రసాదించాడు. ఇంద్రునితో యుద్ధం చేయుటవలన వజ్రాయుధం తగిలి నా అవయవాలు దేహంలోకి చొచ్చుకొని వెళ్ళాయి. అటువంటి దు:స్థితిలో చిక్కుకున్న నేను నన్ను వధించమని ఇంద్రుణ్ణి అడిగాను. అలా వధిస్తే బ్రహ్మ దేవుని మాట వృథా అవుతుందని ఇంద్రుడు తిరస్కరించాడు. అంతట ఇంద్రుడు రామలక్ష్మణుల సందర్శనం నీకు కలుగుతుంది. అపుడు నీ దివ్యరూపాన్ని పొందుతావు" అని ప్రకటించాడు. ఇంద్రుడు ప్రకటించినట్లుగా నాకు ఈనాడు రాముని దర్శనం లభించింది" అని కబంధుడు అన్నాడు.

రాముడు కబంధునితో "నా భార్య సీతను రాక్షసరాజైన రావణుడు అపహరించాడు. అతని రూపు, రేఖలు, నివాసస్థలం నాకు తెలియదు. అందుచే అతని గురించి చెప్పవలసింది. నేను నిన్ను ఒక పెద్ద గోతిలో పడవేసి నీ దేహాన్ని దహనం చేసి నీవు కోరుకునే ఉత్తమగతిని పొందేలా చేస్తాను. అందుకు బదులుగా రావణుని గురించి కొంత సమాచారాన్ని ఇవ్వవలసింది" అన్నాడు.

"రావణుని గురించి నాకు తెలియదు కానీ ముల్లోకాలలో సంచరించే ఒక వ్యక్తి గురించి నీకు తెలియజేస్తాను. రాక్షసరాజు ఎక్కడున్నాడో అతను నీకు సహాయం చేయగలడు" అని కబంధుడు అన్నాడు.

ఓ రామా! నీవు నీ భార్యను కోల్పోయి కష్టాలలో ఉన్నట్లుగా ఇదే పరిస్థితిలో వున్న ఒకానొక వ్యక్తి సహాయంతో నీవామెను తిరిగి



పొందగలుగుతావు. ఆ వ్యక్తి వానరరాజు సుగ్రీవుడు. ఇంద్రపుత్రుడైన తన సోదరుడు వాలికారణంగా అడవిలో ఉంటున్నాడు. ఓ రామా! ఋక్షరాజుభార్యకు సూర్యునివల్ల జన్మించిన సుగ్రీవునితో నీవు స్నేహం చేయాలి. ఎందుకంటే అతను గూడ తనకు సహాయం చేయగలవ్యక్తి అవసరంలో ఉన్నాడు. ప్రస్తుతం అతను మరోనలుగురు వానరులతో కలిసి పంపాసరస్సు సమీపంలో ఋశ్యమూక పర్వతంపై నివసిస్తున్నాడు.

ఋశ్యమూకపర్వతంమీద ఒక పెద్ద గుహలో సుగ్రీవుడు నివసిస్తున్నాడు. వాలి దాడి చేస్తాడేమోనని నిరంతరం భయపడుతూ దాగివున్నాడు సుగ్రీవుడు. సుగ్రీవుడు విధేయతగలవాడు, ప్రజ్ఞావంతుడు, ఔదార్యం గలవాడు. వివేకి, సాహసి, శక్తిమంతుడు, రాక్షసుల గురించి సర్వం తెలిసినవాడు. కనుక నీవు అతనితో స్నేహం చేయటం శ్రేయస్కరంగా వుంటుంది. సీతను వెతికే వరకు అతని అనుచరులు భూమండలమంతా సంచరించగలరు. ఈ విషయాలన్నీ పూస గ్రుచ్చినట్లుగా శ్రీరాముడికి చెప్పి కబంధుడు స్వర్గానికి వెళ్ళాడు. రామ లక్ష్మణులు కబంధుని సూచనలు పాటిస్తూ పయనం ప్రారంభించారు. అక్కడ వారికి మతంగ మహర్షి ఆశ్రమం కనిపించింది.

## శబరిస్వాగతం

రామలక్ష్మణులు మతంగమహర్షి ఆశ్రమంలోనికి ప్రవేశించిన వెంటనే శబరి వారికి స్వాగతం పలికింది. రామలక్ష్మణులకు అతిథిసత్కారాలు అందించి రామునితో "నీ దర్శనభాగ్యంతో నా తపస్సాధనలన్నింటి వల్ల ఫలసిద్ధిని నేను సాధించాను. నీ దర్శనం అయిన తరువాత నేను దివ్యలోకానికి రాగలనని ఋషులు పలికారు" అని పరిపూర్ణ సిద్ధురాలైన శబరి బదులు పలికింది.

శబరి రామలక్ష్మణులకు పంపాసరస్సుయొక్క రమణీయమైన పరిసరప్రాంతాలన్నీ త్రిప్పిచూపించింది. ఆ తర్వాత తాను విశ్వాసపాత్రంగా

సేవించిన ఋషులను తిరిగి కలుసుకొనటానికై తన శరీరాన్ని విడవటానికి రాముని అనుమతి కోరింది. శబరి పట్ల ఎక్కువ గౌరవంతో రాముడు ఆమె కోరికను మన్నించాడు. వెంటనే అగ్నిని రాజేసి నారబట్టలు ధరించి జడలతో వృద్ధ శబరి ప్రజ్వరిల్లుతున్న అగ్నిజ్వాలల్లోకి దూకింది. మరుక్షణం శబరి దివ్యాభరణ పుష్పదామ సంశోభితయై దివ్యలోకాలకు చేరింది.

ఆ విధంగా శబరి ఆధ్యాత్మికమహాశక్తిని పంపి రామలక్ష్మణులు పంపా సరస్సులో స్నానం చేశారు. ఉల్లాసాన్ని పొంది సీతను కనుగొనాలని ఆశతో సుగ్రీవుని కలవాలనే ఉత్సాహంతో అక్కడ నుండి బయలుదేరారు.

**రామలక్ష్మణులు అరణ్యవాస సమయంలో ఎంతోమంది తపస్వినులను, ఋషులను, రాక్షసులను కలిశారు. వారికి మోక్షమార్గాన్ని ప్రసాదించాడు రాముడు. రాముని హృదయం ఎంత దయగల హృదయమో! వారెంత పుణ్యం చేసుకుంటేనో! ధర్మ ప్రభువైన రాముని దర్శనం కలిగి బాధలనుంచి విముక్తి పొందారు. బాధలలో, కష్టాలలోనున్న వారికి సహాయం చేయటం, సేవ చేయటం మానవధర్మమని గుర్తించాలి.**

### సుగ్రీవుడితో - స్నేహసంబంధాలు

మతంగ మహర్షి ఆశ్రమంలో ఆశ్రమానికి సుగ్రీవుడున్న చోటుకు కూత వేటు దూరంలో రామలక్ష్మణులకు వానరశ్రేష్ఠుడు, సుగ్రీవుని సచివుడు అయిన హనుమంతుడు స్వాగతం పలికాడు. హనుమంతుడు తన గురించి, తన ప్రతిభను, కోరిన రూపాన్ని ధరించగల కామరూపిణి అని చెప్పుకున్నాడు. తన మైత్రిని, ఆతిథ్యాన్ని మీకు అందివ్వటానికై సుగ్రీవుడు నన్ను ఇక్కడకు పంపించాడు" అని చెప్పాడు.

### హనుమంతుని వ్యక్తిత్వం - సన్నిహిత్వం

"మనం ఎవరికోసరం వెతుకుతున్నామో అట్టి వానర శ్రేష్ఠుడైన సుగ్రీవుని మంత్రి ఈ హనుమంతుడు. ఇతను అత్యంత సౌజన్యమూర్తిగా



కనుపిస్తున్నాడు. చాల కవితాత్మకంగా సంభాషణ చతురతగలవాడుగ నున్నాడు. అతని నేత్రాల్లోనూ, శరీరాంగాల్లోనూ, వైఖరిలోనూ, హావభావాల్లోనూ, అసంతుష్టికరమైనదిగాని వంచనతో కూడినదిగాని ఏది లేదు. హనుమంతునిలో ఆత్మవిశ్వాసం, శక్తి ఉన్నాయి. ఇతని సంభాషణలో హృదయం, స్వరం, ప్రజలయొక్క పరిణత, సమైక్యత ప్రతిబింబిస్తోంది. ఇతని మాటలకు శత్రువైనా మురిసిపోతాడు. స్నేహ శీలంగా ఉండవలసిన లక్షణాలు గలవాడు. ఓ లక్ష్మణా! మనమనస్సు ఇక్కడకు తీసుకువచ్చిన సంఘటనల వరుసక్రమాన్ని వాయునందనుడికి వివరించు" అన్నాడు రాముడు.

లక్ష్మణుడు హనుమంతుడితో "నిన్ను కలుసుకోవటం మా సోదరుల అదృష్టం. మేము సుగ్రీవునికోసం, ఆయనకు సహాయం చేయటానికి ఉత్సాహం చూపుతున్నాం. లక్ష్మణుడు అయోధ్య వదలి, అరణ్యవాస ప్రయాణంలోని సంఘటనలన్నీ వివరించాడు హనుమంతునికి. సుగ్రీవునితో స్నేహం చేయుమని, మీకు సహాయం చేస్తాడని కబంధుడు చెప్పిన సలహాను హనుమంతునికి చెప్పారు.

రాముడి స్నేహం చేయాలనే అభిప్రాయాన్ని హనుమంతుడు సుగ్రీవునికి తెలిపాడు. సుగ్రీవుడు స్నేహ పూర్వకంగా చేయి ముందుకు చాపగా, వెంటనే రాముడు ఆనందంతో చేతిని ముందుకు చాపి కరచాలనం చేసి ఆత్మీయంగా సుగ్రీవుణ్ణి ఆలింగనం చేసుకున్నాడు.

**కరచాలనం చేయటం, ఆలింగనం చేసుకోవటం అనే రెండు పద్ధతులు ఆత్మీయతను తెలుపుటకు చిహ్నాలు. ఇద్దరు వ్యక్తులు తటస్థపడినపుడు స్నేహం పెంచుకోటానికి ముఖ్య సాధనాలు. ఆధునిక యుగంలో కరచాలనం, ఆలింగనం అనేవి పాశ్చాత్య సంస్కృతి అని కొందరి అభిప్రాయం. త్రేతాయుగంలో రాముడు సుగ్రీవుడు ఈ రెంటినీ స్నేహానికి గుర్తులుగా ఉపయోగించారని వాల్మీకి రచన ద్వారా తెలుస్తున్నది.**

పరిచయాలు అయిన వెంటనే సుగ్రీవుడు ప్రియమైన రామా! ఈ ఘడియ నుంచి నీసుఖమే నా సుఖం ., నీ దుఃఖమే నా దుఃఖం., అలాగే నా సుఖ దుఃఖాలు నీవి అవుతాయి అని సానుకూలంగా పలికాడు. ఇద్దరూ నేలపై కూర్చొనగా సుగ్రీవుడు "ప్రియమైన రామా! నా సోదరుడైన వాలి కారణంగా నేను నా జీవితాన్ని నిరంతర ఆందోళనతో గడుపుతున్నాను. వాలి బలవంతంగా నా భార్యను, రాజ్యాన్ని అపహరించాడు. వెంటనే, నేనీ అరణ్యంలో ఆశ్రయం పొందాను. కాని నా అన్న ఏసమయంలోనైనా ఇక్కడకు వచ్చి నా మీద దాడి చేస్తాడనే భయం నన్ను వెంటాడుతూనే ఉంది. ఒక్కక్షణం గూడ మానసిక ప్రశాంతత నేనెరుగను" అని వివరించాడు.

రాముడు మందహాసం చేసి **"సేవయే స్నేహానికి నిజమైన ఫలం. అందువల్ల వాలిని వధించి నీ రాజ్యాన్ని నీ భార్యను నీవు తిరిగి పొందటంలో నీకు సహాయం చేయటమే నా విధి"** అన్నాడు.

**సుగ్రీవుడు రాముని ఆత్మ బంధువుగా, ఆపద్బంధువుగా భావించాడు. తన కష్టాలను చెప్పి మానసికంగా శాంతిని పొందాడు. రాముడు చెప్పిన ప్రతిజ్ఞ, ధైర్యం, విజయానికి సోపానాలుగా సుగ్రీవుడు సంతసించాడు. రాముడి మందహాసమే సుగ్రీవుడు శ్రీరామ రక్షగా భావించాడు.**

అంతట సుగ్రీవుడు "నీ అరణ్య వాసం గురించి నీ భార్య అపహరణ గురించి హనుమంతుడు నాకు చెప్పాడు. ఆమె స్వర్గంలో ఉన్నా, భూమి మీద ఉన్నా లేక పాతాళంలో వున్నా ఆమెను నీవు తిరిగి పొందే వరకు సహాయం చేస్తానని ఒక మిత్రునిగా ఇదే నా శపథం! ఓ రామా! ఒక బలవంతుడైన రాక్షసుడు తనను ఎత్తుకొని పోతుండగా 'రామా! రామా! అని కన్నీరు గారుస్తున్న సీతను నేను చూశానని గట్టిగా నమ్ముతున్నాను. నేను నా స్నేహితులతో కలిసి ఈ పర్వతం పై కూర్చొని వుండటం ఆమె చూచింది. తన ఉత్తరీయాన్ని కొన్ని ఆభరణాలను క్రిందకు పడవేయగా మేము వాటిని సేకరించాం. ఇవిగో సేకరించిన ఆభరణాలు అని వాటిని



చూపించాడు. రాముడు ఆభరణాలను ఉత్తరీయాన్ని గుర్తుపట్టి "హా ప్రియా! హా ప్రియాతి ప్రియతమా! అని పెద్ద ఆనందంతో కేక వేశాడు. తన పద్మంవంటి నేత్రాల నుండి ఆనందాశ్రువులు జారుతుండగా రాముడు దీనంగా విలపించాడు.

**ఆభరణాలను, ఉత్తరీయాన్ని ఆకాశం నుండి క్రిందకు పడవేయటంలో 'ఎవరైనా వీటిని తీసుకుని రాముడికి చేర్చకపోతారా! వాటిని రాముడు గుర్తించక పోతారా! అని తెలివితో ఆలోచించి చేసిన పనే అయివుంటుంది. అపహరణ సమయంలో గూడ సీతామాత ఓర్పు, నేర్పు, సహనం, సంయమనం, సమయస్ఫూర్తి చెప్పుకోదగినవి.**

రాముడు బాధనుంచి తేరుకొని "లక్ష్మణా! ఈ వస్తువులన్నీ సీత ధరిస్తున్నవే. నీవు గుర్తు పట్టావా? అన్నాడు. "నేను పాదాలకు పైన సీతపై ఎన్నడూ దృష్టి ఉంచలేదు. అందువల్ల ఈ వస్త్రం ఆమెది అవునో, కాదో నేను చెప్పలేను. కాని, **ప్రతి ఉదయం ఆమె పాదాలకు నమస్కరించేవాడిని గనుక కాలి అందెలను మాత్రం నేను గుర్తు పట్టగలుగుతున్నాను"** అని సమాధానం ఇచ్చాడు.

లక్ష్మణుడు తల్లి సుమిత్ర చెప్పిన విధంగా సీతను, వదినను తల్లిగా భావించమంది గనుక ఆమె పాదాలకు రోజూ నమస్కరిస్తున్నాడు. సీతపై నిశితంగా దృష్టిపెట్టి ఉండలేదు గాబట్టి స్త్రీల విషయం తన హద్దుల్లో తను ఉండి మర్యాదపాటించాడని అర్థం. ఈ ప్రక్రియలు లక్ష్మణునికి గల మంచి గుణాలుగా పేర్కొనవచ్చును.

### సుగ్రీవుడు శ్రీరాముణ్ణి ఓదార్చుట

శ్రీరాముడు రావణుణ్ణి గురించి ప్రశ్నించగా సుగ్రీవుడు ఇలా సమాధానమిచ్చాడు. 'దురదృష్టవశాత్తు రావణుణ్ణి గురించి నేను వినలేదు. కాని, అతణ్ణి కనిపెట్టడంలో నేను నీకు సహాయం చేయగలననే విషయంలో

మాత్రం నీవు నిశ్చింతగా వుండు. ఓ రామా! నీ ప్రియపత్నిని పోగొట్టుకున్నందుకు నీవు మితిమీరి దుఃఖించవలదు. అనవసరంగా దుఃఖిస్తూ కూర్చోవటం వల్ల ఎవరూ ఎన్నడూ సుఖాన్ని పొందలేరు. నిజానికి అలాంటి దుఃఖం వల్ల మనిషి శక్తి సామర్థ్యాలు నశించి అతని జీవితమే ప్రమాదంలో చిక్కుకుంటుంది. నేనొక మూర్ఖుణ్ణి అయినప్పటికీ నేను కూడా అదే విధమైన పరిస్థితుల్లో ఉన్నప్పటికీ నీవు విచారించినంతగా నేను బాధపడటం లేదు."

సుగ్రీవుని మాటలతో రాముడు కొంచెం స్థిమిత పడ్డాడు. ధైర్యం వచ్చింది. కష్టకాలంలో ఆదుకునే వారున్నారని మనస్సు శాంతించింది. రామ సుగ్రీవులు పరస్పరం స్నేహం పెంపొందినంతనే ఆలింగనం చేసుకున్నారు. వాలివలన తనకున్న భయం గురించి సుగ్రీవుడు ప్రస్తావించగా రాముడు ''సుగ్రీవా! ఈ రోజే వాలిని వధిస్తాననే విషయంలో నిశ్చింతగావుండు. అయితే ముందుగా సోదరులిద్దరిమధ్య శత్రుత్వం ఎలా పెంపొందిందో తెలుసుకున్నాడు.

**వాలివధ**

వెంటనే రాముడు జాలిగొని, ప్రియమైన సుగ్రీవా! నీవు నీ భార్యను రాజ్యాన్ని తిరిగి పొందగలిగేలా నేను వాలిని సంహరిస్తాననే విషయమై నిశ్చింతగా ఉండు" అని అభయమిచ్చాడు.

సుగ్రీవుడు కిష్కింధకు చేరగానే పెద్దపెద్దగా కేకలతో సోదరుడు వాలిని యుద్ధానికి ఆహ్వానించాడు. మహాకోపంతో, పగ తీర్చుకోవాలని ఇద్దరూ పిడిగుద్దులు గుద్దుకున్నారు. అయితే సోదరులిద్దరు ఒకే పోలికతో ఉన్నారు. ఎవరు వాలి, ఎవరు సుగ్రీవుడో పోల్చుకోలేక సందిగ్ధంలో ఉన్నాడు రాముడు.

వెంటనే రాముడు "మీ ఇద్దరిలో వాలి, సుగ్రీవులు ఎవరో గుర్తించ లేక పోయాను. మీరిద్దరు ఒకే పోలికతో ఉన్నారు గదా! అది నాతప్పు



గాదు. అందువల్ల నీ మెడలో నాగకేసరపులతను గుర్తుగా దండగా వేస్తాను. మళ్ళీ యుద్ధానికి ఆహ్వానించు వాలిని, తరువాత 'నేను నా నిర్ణయం నెరవేరుస్తాను' అన్నాడు రాముడు.

మళ్ళీ రామలక్ష్మణులు, హనుమంతుడు, సుగ్రీవుడు కిష్కింధకు చేరారు. పెద్దగా అరుస్తూ మళ్ళీ వాలిని యుద్ధానికి రమ్మని పిలిచాడు. కోపంతో వాలి పెద్ద, పెద్ద అంగలు వేస్తూ, వాలి భార్య తార వారించినా, యుద్ధానికి తలబడ్డారు ఇద్దరూ. రామలక్ష్మణులు సుగ్రీవుని వెంట ఉన్నారు. వారి బలం చూచుకుని సుగ్రీవుడు విజృంభిస్తున్నాడని చారుల ద్వారా విని అంగదుడు తండ్రికి విషయం వివరించాడు.

శ్రీరాముడు సాక్షాత్తు శ్రీమహావిష్ణువు అవతారం కనుక అనూహ్య శక్తి సంపన్నుడు. ఆయనతో శత్రుత్వానికి పోకుండా, సుగ్రీవుణ్ణి రాజ్యానికి వారసునిగా ప్రతిష్ఠించు తద్వారా ఈ సమస్యను పరిష్కరించి, రామునితో స్నేహం కలుపుకో" అంటూ వాలి భార్య తార సలహా ఇచ్చింది.

ఈ సలహా అతనికి రుచించలేదు. నాతో శత్రుత్వం లేని రామునితో నాకే మాత్రం పనిలేదు. అతనితో చర్చించే అవసరం నాకు లేదు అని భీకర సంగ్రామానికి సిద్ధమైనాడు. మొదటిసారి యుద్ధంలో మాదిరి వాలిదే పైచేయి అయింది. సుగ్రీవుడు తన బలశక్తులు క్షీణిస్తున్నాయని రామునికి సూచించాడు. రాముడు బాణాన్ని సంధించాడు. ఆ బాణం వాలి హృదయంలోకి లోతుగా దిగిపోయింది, నేల కొరిగి పడిపోయినాడు. అయితే వాలి మెడలో తండ్రి దేవేంద్రుడిచ్చిన స్వర్ణమాల ఉండటం వలన వెంటనే మరణించలేదు.

రామలక్ష్మణులు దాగివున్న స్థలం నుంచి వాలి వద్దకు వచ్చారు. వాలి రామునితో "హేరామా! నేను నీ రాజ్యంలో గాని, నగరంలో గాని ఏ చెడుపని చేయలేదు. నేను నిన్ను అవమానించలేదు. నిందించలేదు, తప్పుచేయని

నన్నెందుకు వధించావని" ప్రశ్నిస్తాడు. దాని సమాధానంగా రాముడు వాలితో "ఈ సమస్త భూమండలం ఇక్ష్వాకు వంశ రాజుల అధీనంలో ఉంది. నీతి, నియమాలు, పట్టుదల, సత్యం, పరాక్రమం కలిగిన భరతుడు ఈ భూమండలానికి అధిపతి. నీవు ధర్మాన్ని విడచిపెట్టావు. కుటుంబ ధర్మాన్ని రాజ్య మర్యాదలను అతిక్రమించి నీ తమ్ముని భార్య రుమను నీ భార్యవలె కోరుకున్నావు. అందుకే నీకు మరణశిక్ష విధించాను. సోదరుని భార్యతో ధర్మ విరుద్ధంగా తిరిగావు గనుక నీకు మరణదండనే సరైంది. నీ పాపాన్ని నీవు తెలుసుకొని పరితాపం చెందక సత్పురుషుల ధర్మాన్ని ఆక్షేపిస్తున్నావని" సమాధానమిచ్చాడు. అంగదుణ్ణి తాను సంరక్షిస్తానని వాలికి రాముడు అభయమిచ్చాడు.

**శ్రీరాముని ఉపదేశంతో వాలిలో పశ్చాత్తాపం కలిగింది. వాలి చేతులు జోడించి రామునితో "ఓ పురుషోత్తమా! మీరు ధర్మ ప్రభువులు. నేను కావాలనే అపరాధం చేశాను. నన్ను క్షమించండి' అని ప్రాధేయపడి చివరకు ప్రాణాలు వదిలాడు.**

వాలి అంత్యక్రియలు ఘనంగా నిర్వహించిన మీదట సుగ్రీవుడు కిష్కింధలో ప్రవేశించగా పౌరులందరూ అతనికి స్వాగతం పలికారు. మైందుడు, ద్వివిదుడు, హనుమంతుడు సహా వానర శ్రేష్ఠులూ, - భల్లూకరాజైన జాంబవంతుడు వచ్చి సుగ్రీవునికి పట్టాభిషేకం జరిపారు. సుగ్రీవుడు తన భార్య రుమను పునఃస్వీకరించి అంగదుని రాజసింహాసనానికి వారసునిగా చేశాడు.

కొంతకాలం గడిచిన తర్వాత రాజైన సుగ్రీవుడు హనుమంతుని సలహాతో నీలుని పిలిచి వానర యోధులందరికీ నా ఆజ్ఞను చేరవేయండి. అందరూ పదిహేను రోజుల్లో వచ్చి విధి నిర్వహణలో చేరాలి, లేనిచో మరణశిక్షకు గురి కావలసివస్తుంది' అని చెప్పాడు. ఈ ఆదేశాన్నిచ్చి సుగ్రీవుడు



అంతఃపురంలోకి వెళ్ళిపోయాడు. ప్రకటించిన గంట లోపలే లక్షలాది మంది వానరులు ప్రవాహంలా కిష్కింధకు రావటం ప్రారంభమైంది. ఈ సమయంలో సుగ్రీవుడు రాముని ముందు సాష్టాంగ పడి ఆయన పాదపద్మాలకు నమస్కారం చేసాడు. కారుణ్య పూర్వకంగా సుగ్రీవుణ్ణి లేవనెత్తి ఆలింగనం చేసుకున్నాడు.

"ప్రియమైన రామా! నీకు సహాయం చేసేందుకు నేను ఉత్సాహంతో ఉన్నాను. ఇక్కడ సమావేశమైన వారందరూ కూడా అలాగే సిద్ధంగా వున్నారు. దయచేసి నిశ్చింతగా వుండు" అని సుగ్రీవుడు భరోసా ఇచ్చాడు. తమ స్నేహాన్ని తిరిగి ధ్రువీకరిస్తూ రాముడు మరల సుగ్రీవుడిని ఆలింగనం చేసుకున్నాడు. వెంటనే సుగ్రీవుడు "ప్రియమైన ప్రభూ! ఈ వానర యోధులను నీ సొంత సైన్యంగానే భావించు. దయచేసి ఈ రోజునుంచి నీవు ఇవ్వదగిన పద్ధతిలో వారికి ఆదేశాలివ్వండి" అన్నాడు.

**సుగ్రీవుడు, రాముని మధ్య సయోధ్య పెరిగింది. అశేష వానర సేనావాహిని అంతా సర్వసన్నద్ధమైంది. సుగ్రీవునికి రామునిపై గల అభిమానం, సేవాభావం అనిర్వచనీయం. సేవ, సహాయం చేసిన రామునికి తిరిగి సేవ, సహాయం చేయటానికి సుగ్రీవుడు కంకణం ధరించాడు అనటానికి ఇది నిదర్శనం. రామ సుగ్రీవుల మధ్య సన్నిహిత సంబంధాలే గాకుండా సత్సంబంధాలుగా వెల్లివిరిస్తున్నాయి. సహాయం చేసిన వారిపై విశ్వాసముంచి తిరిగి వారికి అవసర సమయంలో సహాయం చేయటం మానవ ధర్మం. నరులు-వానరులమధ్య స్నేహ సంబంధాలకు అంకురార్పణ చేశారు.**

### హనుమంతుని సూచనలు

సీతను వెదకటానికి హనుమంతుడు సమర్థుడని భావించి సుగ్రీవుడు ''ఓ హనుమంతా! శక్తిమంతులైన వానరులందరిలోనూ నీవు ప్రతిభావంతుడవు. భూమి మీదను, ఆకాశంలోను, స్వర్గంలోను, అధో

లోకాల్లోనూ నిన్ను అడ్డుకునే వారెవ్వరు లేరు. మానవాతీతమైన బలశక్తులు నీకున్నాయి. నీవు ధైర్యశాలివి, ప్రజ్ఞాధురీణుడవు. సమయస్ఫూర్తి, ఓర్పు, సహనం, సంయమనం గలవాడవు. సమయ సందర్భాలను కనుగొని మాట్లాడగలనేర్పరివి. సీతను కనుగొనటంలో నేను నీ మీదనే విశేషమైన ఆశలు కలిగి ఉన్నాను.

హనుమ పూర్ణ వ్యక్తిత్వాన్ని గమనించిన రామునికి గూడ అతనిపై నమ్మకం గలిగింది. హనుమంతుని ఆత్మసౌందర్యం, ఆత్మవిశ్వాసం రామునికి నమ్మకం కలిగించాయి. రాముడు తన ఉంగరాన్ని తీసి హనుమ చేతిలో ఉంచి, దీనిలోపల నా నామాక్షరాలు ఉన్నాయి. నీవు సీతను కనుగొని ఈ ఉంగరాన్ని ఆమెకి ఇవ్వు. అప్పుడు నీవు నా దూతవని ఆమెకు నమ్మకం కలుగుతుంది. "ప్రియమైన హనుమా! నా తరపున, నా వానివిగా ఈ ముఖ్య కార్యాన్ని నీవు నెరవేర్చగలుగుతావని నాకు పూర్తి నమ్మకం ఉంది" అని రాముడు అన్నాడు.

హనుమ ఆ ఉంగరాన్ని తీసుకుని తన కళ్ళకు అద్దుకుని రామునికి సాష్టాంగ ప్రణామం చేశాడు. వానరులందరూ భూమండలమంతా తిరుగుతూ వెదుకుతున్నారు. వానరులందరూ వెళ్ళిన తరువాత రాముడు సుగ్రీవునితో "నీవు ఇంత విస్తృతమైన భూగోళ పరిజ్ఞానాన్ని ఎలా సంపాదించావు" అని ప్రశ్నించాడు.

"వాలి, నేను కిష్కింధకు రాజుగా ఉన్నపుడు నన్ను బలవంతంగా సింహాసనం నుంచి తోసివేశాడు. అందువల్ల నేను ఆశ్రయం కోసం వెతుకుతూ భూతలమంతటా విరామం లేకుండా తిరిగాను. ఆ ప్రయాణంలో ఎక్కడ, ఏమి ఉన్నది, ఆ ప్రాంత విశేషాలను తెలుసుకునే అవకాశం ఏర్పడింది. చివరకు మతంగముని ఆశ్రమంలో ఆశ్రయం పొందాను" అని చెప్పాడు.



## సీతాన్వేషణలో వానరులు

అందరి అభిప్రాయాలను, శక్తి సామర్థ్యాలను పరిశీలించిన మీదట జాంబవంతుడు "ఓ హనుమంతా! నీవు గరుడునితో సమానుడివి. నీవేమి మాట్లాడలేదేమి?

## హనుమంతుడి ప్రతిభ

హనుమంతుడు బాల్యంలోనే సూర్యుణ్ణి మెరిసే పండుగా భావించి దానిని పట్టుకో దలచి ఆకాశంలో 3000 యోజనాలకు పైగా ఎత్తుకు ఎగిరాడు, కాని, సూర్యుని తేజస్సుకు విసిరివేయబడ్డాడు. ఈ సాహసానికి ఇంద్రుడు ఆగ్రహించి తన వజ్రాయుధాన్ని విసిరాడు. ఆయుధం హనుమంతుణ్ణి ఒక పర్వత ప్రాంతానికి విసిరి వేశాడు. అతని దవడభాగం చిట్లింది. ఈ సంఘటన వల్లనే హనుమంతుడికి ఆ పేరు వచ్చింది. **హనుమంతుడంటే 'హనువుభంగమైనవాడు' అని అర్థం.**

హనుమంతునికి అనేక పేర్లతో పిలుస్తూంటాం. అంజనీకుమారుడు గావటం వలన ఆంజనేయుడని, మారుతి అని, పవన కుమారుడు అని పిలుస్తూ భక్తులు ఆనంద పడుతుంటారు. ఆంజనేయస్వామిని భగవత్ స్వరూపంగా భావించి మందిరాలు, దేవాలయాలు ప్రతిగ్రామంలోను, పట్టణాల్లోనూ, నగరాల్లోను, మెట్రో నగరాల్లోను విశేష సంఖ్యలో వెలువడినాయి. మంగళ, ఆదివారాలు ప్రజలు విశేష సంఖ్యలో ఆంజనేయస్వామి ఆలయాలకు వెళ్ళి పూజలు చేస్తారు. వారికోరికలు నెరవేరుస్తాడని ప్రజల నమ్మకం. ముఖ్యంగా పిల్లలకు భయాలు ఏర్పడినప్పుడు నలతగా వున్నపుడు ఆంజనేయస్వామికి మొక్కు తీర్చుకుని మంత్రించిన తాయెత్తులను పిల్లలచేతికి కడతారు. ఇది ఇప్పటికీ వస్తున్న సంప్రదాయం. ప్రజల విశ్వాసం. పిల్లలకు భయంతో జ్వరం వచ్చినపుడు **'ఆంజనేయ దండకం' లేదా తులసీ దాస్ రచించిన హనుమాన్ చాలీసా'** చదువటం

భారతీయుల సంప్రదాయం. మగపిల్లలు పుట్టిన వారికి ఆంజనేయస్వామి పేరు పెట్టుకోవటం ఆనవాయితీగా వస్తోంది. కోతులు ఇంటికివస్తే హనుమంతుడు వచ్చాడని ఆ కోతిని పూజిస్తారు, పండ్లు, ఫలాలు ఇచ్చి సంతృప్తి చెందుతారు. ఆంజనేయస్వామి దేవాలయాలకు వెళ్లేటప్పుడు విద్యార్థులు పరీక్షల్లో విజయం సాధించటానికి, ఈ క్రింది శ్లోకం చదువుతూ 18 సార్లు ప్రదక్షిణం చేస్తారు.

**శ్లో॥ బుద్ధిర్బలం యశోధైర్యం నిర్భయత్వమరోగతా ।**
**అజాడ్యం వాక్పటుత్వం చ హనుమాన్ దేహిమే సదా ॥**

హనుమంతునికి రామాయణకాలంలోనే కాదు, అన్ని యుగాలలోను ప్రజల హృదయాలలో చిరంజీవిగా నిలిచిపోయిన తపస్వి. రామతారకం ఉపదేశం పొంది ఎల్లవేళలా రామనామం జపించేవాడు. నేటికీ ఆంజనేయుడు చిరంజీవే. ఈ నాటికీ మానససరోవరంలో హిమాలయాల గుహలో తపస్సులోనే ఉన్నాడని ఋషుల వాక్కు. అదే నిజమైతే భారతీయులు అదృష్టవంతులే. ఇదీ హనుమంతుని వ్యక్తిత్వం. అన్ని యుగాల ప్రజలకు హనుమతో సంబంధాలున్నాయి.

**హనుమంతుని బలపరాక్రమాలు**

అచట వానర ప్రముఖులందరు హనుమను పొగడటంతో, తన మహాకాయాన్ని ధరించి అమితంగా విస్తరించసాగాడు. "నేను తలచుకుంటే ఆగకుండా మేరు పర్వతాన్ని వేయిసార్లు ప్రదక్షిణ చేసి రాగలను. సముద్రజలాలను ఎగురగొట్టి ప్రపంచాన్నంతటినీ జలాల్లో ముంచగలను. గరుడుడు ఆకాశంలో ఎగురుతుండగా అతనిని వేయిమార్లు ప్రదక్షిణం చేయగలను. లంకా నగరాన్నంతటినీ సమూలంగా పెకలించి ఎంతటి దూరానికైనా మోసుకుపోగలను" తన గొప్పమహిమను వర్ణించాడు హనుమంతుడు.



హనుమంతుడు తన పరాక్రమాన్ని కొనియాడటం విన్న వానరులంతా ప్రేరేపితులైనారు. "నీవు తిరిగి వచ్చేటంతవరకు మేమిక్కడ ఒంటి కాలిపై ఉంటాం. మా ప్రాణాలు, సీతను తిరిగి పొందగల ఆశలు అన్నీ నీ మీదనే ఉన్నాయి" అన్నారు వానరులు.

అపారమైన శక్తితో మహేంద్రపర్వతంపైకి లంఘించాడు హనుమంతుడు.

రామలక్ష్మణులకు తనమీద నమ్మకం కలుగుటకు, తన పట్టుదల కర్తవ్యం ఏమిటో తెలియుటకు హనుమంతుడు తన గురించి చెప్పాడు. ఎదుటివారికి నమ్మకం కుదరాలంటే మాటలవల్లనే పరస్పర అవగాహన కలగాలి గదా! (దీనినే ఇంగ్లీషులో "Relationships build with Trust and Mutual understanding" అంటారు).

**హనుమకు అంతా అనుకూలమే**

హనుమ లంఘన శక్తి ప్రభావం చేత మహేంద్ర పర్వతం పై నున్న వృక్షాలన్నీ సమూలంగా పెకలించి దూరంగా విసిరి వేయబడ్డాయి. రంగు రంగుల పుష్పాలు రెపరెపలాడుతూ రాలి చెల్లాచెదరుగా వ్యాపించి ఒక సుందరమైన దృశ్యాన్ని కల్పించాయి. వాయుదేవుని పుత్రవాత్సల్యం చేత చల్లని గాలులు వీస్తున్నాయి. సూర్యకిరణాల వేడి ఆయనపై పడకుండా జాగ్రత్త తీసుకున్నాడు.

ఆకాశానికి ఎగిరిన హనుమను చూచి సకల జాతులకు చెందిన ప్రాణులు ఆయనను అనేకవిధాలుగా కొనియాడారు. శ్రీరాముని యందు గల పూజ్యభావం కారణంగా సముద్రుడు కూడా ఆయనకు చేయూతనిచ్చాడు. రాముని పూర్వీకుడైన సగర రాజు సముద్రపు సరిహద్దులను విస్తరించి ఆయనకు సహాయం చేయటం తన బాధ్యతగా సముద్రుడు భావించాడు.

వంశంలోని వారంతా సహాయ సహకారాలను ఇచ్చి పుచ్చుకోవాలని, సగరుని నిర్ణయాన్ని హర్షించాలి. ఈ విధమైన భావం అందరిలో అవసరం.

**హనుమ లంకానగర ప్రవేశం**

హనుమ లంకానగర ఉత్తర ద్వారాన్ని సమీపించి అక్కడ కట్టడాలను, రమణీయ దృశ్యాలను చూచాడు. అసంఖ్యాకమైన భయంకర వికృత రూపంగల రాక్షసులు గుమిగూడి యున్నారు. వారు సకలవిధాలైన ఆయుధాలు ధరించారు. వారు కామరూపులు. ఈ నగరం దేవతలు గూడ ప్రవేశించలేనంత కట్టుదిట్టంగా ఉంది. గాలియైనా రహస్యంగా ప్రవేశించలేని విధంగా ఉన్నది. అందువల్ల మరోరూపాన్ని దాల్చి రాత్రివేళ నగరం లోపలికి ప్రవేశించాలి అని హనుమ మనసులో భావించాడు.

**ఎక్కడికైనా, ఏ ప్రదేశానికైనా, ఏ పనిమీద వెళ్ళినా అక్కడ పరిస్థితులను ముందు అవగాహన కలిగించుకుని చేయవలసిన పనిపై ప్రణాళిక రూపకల్పన చేయాలి. అదే విజయానికి సోపానం.**

సీతకోసం లంకా నగరమంతా తిరుగుతున్నాడు. లంకా నగర శోభ వర్ణించటానికి వీలుకాకుండా ఉంది. లంకానగరం ఒక స్త్రీ రూపం అని నిర్ణయించాడు. ఆ స్త్రీ వికార రూపంలో వచ్చి హనుమను కలిసి చేతిలో చేయి వేసి "హనుమా! చాలా కాలం క్రిందట బ్రహ్మ దేవుడు నాతో "ఒక వానరం నిన్ను లొంగతీసుకున్నప్పుడు కొద్దిరోజుల్లోనే ఈ నగరానికి వినాశనం దాపురించినట్లే" అని చెప్పాడు. ఎందుకంటే రావణునికి మృత్యువు చేరువలో ఉంది. ఓ వానరా! నీకు లంకలో ప్రవేశించటానికి అనుమతి ఇస్తున్నాను.

**లంక గ్రామదేవత. వికృత రూపంలో వచ్చి రావణుని దుర్మార్గాలకు చలించి, బాధపడడం, లంకా నగర రాక్షసులకు, బ్రాహ్మణులకు, స్త్రీలకు, సమస్త ప్రజలకు విముక్తి కలుగుతుంది అని అర్థం. మనకు ఒక**



**సామెతలోకంలో ఉంది "వినాశకాలే విపరీత బుద్ధిః" అని. అది అక్షర సత్యం. ఈ సంఘటనలో దుర్మార్గాల వైపు మనస్సు పోనీయకుండా మంచికి బాట వేయాలని తెలుసుకోవాలి.**

సీత లంకలోనే ఉన్నదని సంపాతి నమ్మకంగా చెప్పినప్పటికీ హనుమంతుడు మాత్రం ఎక్కడా ఆమెను కనిపెట్టలేక పోయాడు. సీతను గురించి అనేకవిధాల ఆలోచించాడు హనుమ. లంకా నగరమంతా తిరిగాడు. అకస్మాత్తుగా ఒక విశాలమైన అశోకవృక్షవాటికను కనుగొన్నాడు. సమీపంలోని వృక్షంపై ఎక్కి జాగ్రత్తగా పరిశీలిస్తున్నాడు హనుమ. సమీపంలోని వెయ్యి స్తంభాలపై నిలిచిన ఒక ఎత్తైన దేవాలయం కనుపించింది. ఆ దేవాలయానికి ఎదురుగా మలినమైన, జీర్ణమైన, చక్కని పసుపు రంగు గల ఏక వస్త్రాన్ని ధరించి ఉన్న ఒక స్త్రీ కూర్చొని ఉంది. ఆమె ఉపవాసం వల్ల కృశించినట్లు కనుపిస్తున్నది. మనోవ్యధ కారణంగా నిట్టూర్పులు విడుస్తోంది. ఆమె ముఖం అలసి ఉన్నప్పటికీ ఒక దివ్య తేజస్సుతో ప్రకాశిస్తోంది. గతంలో రావణుడు ఎత్తుకుని వెళ్తూ కనిపించిన స్త్రీ ఆమెయేనని హనుమంతుడు గుర్తుపట్టాడు. అలాగే ఆమె ఆభరణాలు వాటి గురించి రాముడు ఇచ్చిన వివరాలతో, గుర్తులతో సరిపోలి ఉండటాన్ని హనుమ గుర్తించాడు. ఈమె సీతయేనని నిర్ణయించుకున్నాడు.

"రాముడు ప్రేమిస్తున్నది ఈమెనే! ఈమె కోసమే ఆయన బాధపడుతూ ఒక్కొక్కప్పుడు దైన్యాన్ని, ఒక్కొక్కప్పుడు కారుణ్యాన్ని, దుఃఖాన్ని పొందుతున్నాడు. సీత దోషురాలు కాదని సందేహం లేకుండా చెప్పవచ్చు. నిజానికి సీతను త్రాసులో ఒక ప్రక్కన ఉంచి, త్రిలోకాధిపత్యాన్ని రెండో ప్రక్కన ఉంచితే, ఆమె విలువలో ఆ రెండోది లవలేశానికి తూగదు. రాముని గురించి ఆలోచనల్లో నిమగ్నురాలై ఉన్నందున ఆమె బయట బాధను గమనించలేకున్నదని నాకు తెలుసు" అనుకున్నాడు హనుమంతుడు.

సీతను కనుగొన్నందుకు హనుమంతుడు ఆనందంతో కళ్ళనీళ్ళు రాల్చాడు. అశోకవృక్షంపై దాగి ఉండి ఆమెను గమనిస్తూ ఉండగా రాత్రి గడచిపోయింది. రావణుడు సీతతో "ఆమె అందాన్ని పొగడుతూ తనకున్న భార్యలు గూడ నీ ముందు దిగదుడుపే. నిన్ను అర్ధాంగిగా, పట్టపురాణిగా చేస్తాను. అని ఆమెను బ్రతిమలాడుతాడు.

నిన్ను వశపరచుకోటానికి 12 నెలలలో పదినెలల గడువు తీరి పోయింది. మరొక రెండు నెలలు మాత్రమే ఉన్నది. అప్పటికీ నీవు నా ప్రేమ పట్ల అనుకూలంగా మాట్లాడకపోతే నిన్ను ముక్కలు ముక్కలుగా నరికించి ఫలహారంగా భుజిస్తాను. రావణుడు వెళ్ళిన వెంటనే రాక్షసస్త్రీలు "నీకు రాముడు తగినవాడు కాదని రాక్షస స్త్రీలను బాధించి రాక్షసరాజును స్వీకరించటానికి సందేహించకు. నీవు మొండిగా ఉండిపోతే అది నీ వినాశానికి దారితీస్తుంది? అంది రాక్షసి. రాక్షస స్త్రీలు తలా ఒక మాట పలికి ఆమెను రావణుని వైపు మనసు మార్చుకోవాలని" సలహా ఇచ్చారు.

**సీతకు అనుకూలపరిస్థితి**

రాక్షస స్త్రీలందరు సీతను భయపెడుతూ, రాముడు ఎప్పుడు వచ్చి సంహరిస్తాడోనని భయం చెందుతున్నారు. వీరందరు వెళ్ళిన తరువాత త్రిజట అనే వృద్ధ రాక్షస స్త్రీ ఇతర రాక్షస స్త్రీలను సమీపించి ముందు చూపుతో ఇలా అంది "ఓనిర్భాగ్యుల్లారా! సీతను ఇలా హింసించటానికి మీరెలా సాహసిస్తున్నారు. ఆమెను మీరు ఏమి చేయలేరు. నా కిప్పుడు కల ఒకటి వచ్చింది. అందులో సీతను రక్షించటానికి, రాక్షసుల నందరిని మట్టు పెట్టడానికి రాముడు రావటం నేను చూశాను" అన్నది. ఆ జరిగిన కథనంతా వివరంగా వివరించి పుష్పక విమానంలో సీతా సమేతంగా రామలక్ష్మణులు ఆకాశమార్గాన ఉత్తర దిశకు పోవటం నేను చూశాను.

ఆ కలలో రావణుడు శరీరానికి రక్తం పూసుకుని ఉండటం చూశాను. చీకటితో నిండిన నరకంలో పడి రావణుడు అదృశ్యం కావటం చూశాను. రావణుని సోదరులు, కుమారులు అలాగే వెళ్ళడం చూశాను. విభీషణునికి మాత్రం ఆగతి పట్టలేదు. చివరకు లంకా నగరం యావత్తు కుప్పకూలి సముద్రంలోకి పడిపోవటం చూశాను.



ఈ సంఘటనలు జరిగిన అతిత్వరలోనే రాముడు వచ్చి రాక్షసులను సంహరించిన మీదట సీతను స్వాధీనం చేసుకుంటాడని నేను నిర్ణయానికి వచ్చాను. ఇక మీరు సీతను బాధలు పెట్టటం మాని ఆమెను క్షమాపణ వేడుకోవాలి".

రాక్షస స్త్రీలు బాధ పెట్టడం, త్రిజట తన కలలోని విషయాలను రాక్షస స్త్రీలకు వివరించటం, సీత వారితో సంభాషించిన విషయాన్నంతా చెట్టుపైన కూర్చొని హనుమంతుడు "ఈమె సీతయే! సందేహం లేదు. సీతను ఎలా పలకరిస్తే మంచిదో నేను చాలా జాగ్రత్తగా ఆలోచించాలి."

సీత విశ్వాసాన్ని చూరగొనటం కోసం నేను ముందుగా రాముని స్తోత్రం గానం చేస్తాను. ఆపైన రాముని సందేశాన్ని ఆమెకు అందజేస్తాను" అని హనుమ నిర్ణయించుకున్నాడు. అశోకవృక్ష కొమ్మలలో నుండి హనుమంతుడు గానం చేశాడు. రాముని చరితను క్లుప్తంగా గానం చేసి సీతను మేల్కొలిపి సంతోషపరిచాడు. వెంటనే ఆమె చెట్టుపైకి తేరిపారచూచి "ఇతను ఎవరో! ఇతని గానం నాకు శుభం కలిగేలా ఉందని అనుకుంది సీత.

చెట్టులో తాను దాగివున్న చోట నుండి హనుమంతుడు క్రిందికి దిగి వచ్చాడు. సీత ఎదుట ముకుళిత హస్తాలతో నిలిచి 'అమ్మా! నీవెవరవు? ఎవరో దేవతవలె కనిపిస్తున్నావు. నీవు రాముని భార్య అయి ఉంటావని అనుకుంటాను" అన్నాడు.

రాముని పేరు వినటంతోనే సీత మహానందం పొందింది. హనుమంతుని ప్రశ్నలకు సమాధానంగా దాదాపుగా తన జీవిత వృత్తాంతాన్నంతటినీ వర్ణించి చెప్పింది. చివరగా "నేను జీవించటానికి

రావణుడు రెండు నెలల సమయం మాత్రమే ఇచ్చాడు. ఈలోగా రాముడు ఇక్కడకు రాకుంటే నేను ప్రాణాలు విడుస్తాను" అని వివరించింది.

సీత నమ్మకాన్ని తెలుసుకున్న హనుమంతుడు "నేను రాముడు పంపగా వచ్చిన దూతను. ఆయన క్షేమంగానే ఉన్నారు. నీవు ఎక్కడ ఉన్నావో నీ గురించి తెలుసుకోవటానికి రాముడు నన్ను ఇక్కడకు పంపించాడు. నీ యోగక్షేమాలను గురించి ఆయన కుతూహలంతో తెలుసుకోవాలని అనుకుంటున్నాడు" అని చెప్పాడు.

**హనుమ రాయబారం**

సీతారాముల వియోగ బాధను తీర్చడానికై హనుమంతుడు రాయబారిగా లంకకు వెళ్ళాడు. త్రేతాయుగంనుంచి కుటుంబ సమస్యలు, రాజ్యంలో సమస్యలు, వ్యక్తుల మధ్య మనస్పర్థలు తొలగించుటకు రాయబార వ్యవస్థ ఉంది. హనుమ మాటలు విని సీత ఎంతగానో ఆనందించింది. అమితమైన సంతోషంతో వారు పరస్పరం కుశల ప్రశ్నలు వేసుకుంటూ మాట్లాడుకున్నారు.

"ఇది వరలో రావణాసురుని మాయలో పడి తను మోసపోయిన అనుభవం గుర్తుకు వచ్చింది. మళ్ళీ తను ఇప్పుడు గూడ అలా మోసపోయానేమోనని" అనుకుంది. కానీ, మరుక్షణం "ఈ వానరాన్ని చూస్తే నా హృదయంలో నిశ్చయంగా ఆనందం కలుగుతోంది. నిజంగా రాముని దూతగా ఉండవచ్చును. మరింత అనుకూల ధోరణి కనుపరుస్తూ, "దయచేసినాకు మరింతగా రాముణ్ణి గురించి చెప్పు. నీవు చేసిన వర్ణనలు నా చెవులకు, హృదయానికి చాలసంతోషంగా ఉన్నాయి" అంది సీత.

ధైర్యం తెచ్చుకుని, నీవు రాముణ్ణి ఎలా కలుసుకున్నావో, రాముని అతను సోదరుడు లక్ష్మణుని శరీర లక్షణాలను నాకు పూర్తిగా వర్ణించు"



అన్నది. అంటే సీతాదేవికి హనుమంతుని మీద సంపూర్ణమైన నమ్మకం కలుగటానికి రామలక్ష్మణుల గుర్తింపుగా వారిద్దరి బాహ్యసౌందర్యాన్ని చెప్పమని పరీక్ష పెట్టింది. బాహ్యసౌందర్యం అంటే మనిషి రంగు, రూపు, ముఖ కవళికలు, అవయవ నిర్మాణం, సౌష్ఠవం, ధరించిన వస్త్రాలు, వివరంగా తెలియపర్చటమే బాహ్యసౌందర్యం. రాముని బాహ్యసౌందర్యం ఈ విధంగా విశదపర్చాడు హనుమ.

ఓ విదేహ రాజకుమారీ! రాముని నేత్రాలు అరవిందదళాలను పోలి ఉంటాయి. ఆయన భుజాలు విశాలమైనవి. బాహువులు బలమైనవి. ఆయన మెడ శంఖాకారంలో ఉంటుంది. ఆయన నయనాలు తామ్రరంజితాలు. ఆయన కంఠం దుందుభివలె గంభీరంగా నినదిస్తుంది. ఆయన రొమ్ము, మణికట్టు, పిడికిలి అనే మూడు స్థానాలు కఠినమైనవి. ఆయన వక్షం, నాభివలయం. ఉదరం అనే మూడు స్థానాలు ఉన్నతమైనవి. ఆయన నేత్రాలు, నఖ–కరతలాలు, కాలి మడిమలు అనే మూడు స్థానాలు అరుణిమ గలవి. ఆయన శీఘ్రగామి. ఆయన మీదను, ఉదరం మీదను మూడు రేఖలున్నాయి. ఆయన సింహం వలె, వ్యాఘ్రం వలె, నడక కలవాడు. ఆయన వర్ణం, నోరు, నేత్రాలు, జిహ్వ, పెదవులు, తాలువులు, స్తనాలు, నఖాలు, కరతలాలు, పాదాలు అనే పది స్థానాలు పద్మం వంటివి. నిజానికి ఇవేగాక ఇంకా ఎన్నో ఉత్తమ గుణాలున్నవాడు రాముడు.

లక్ష్మణుని సౌందర్యం గూడ అమోఘమైనది. ఉన్నతమైనది. శ్రీరాముడు శ్యామల వర్ణుడు కాగా లక్ష్మణుడు హేమవర్ణుడు. రామలక్ష్మణులను నేను ఇంతకు ముందు ఋష్యమూక పర్వతం వద్ద కలుసుకున్నాను. రావణుడు నిన్ను తీసుకొని వెళుతున్నపుడు నీవు జారవిడిచిన ఆభరణాలు చూచి రాముడు ఆనందించాడు. సుగ్రీవునితో మైత్రి ఏర్పరచుకున్నాడు రాముడు. నిన్ను అన్వేషిస్తున్న సమయంలో ఇప్పుడు అదృష్టవశాత్తు ఈ దూరప్రాంతంలో

నేను నిన్ను కనుగొన్నాను. తన గురించి హనుమంతుడు సీతకు చెప్పి పరిచయం చేసుకున్నాడు.

రామలక్ష్మణుల సౌందర్య వర్ణనకు ముగ్ధురాలైన సీతకు దూత అయిన హనుమపై నమ్మకం కుదిరింది. ఆమె ఆనంద బాష్పాలు రాల్చి ఇదే సరియైన సమయంగా భావించి రాముడు ఇచ్చిన ఉంగరాన్ని సీతకు అందించాడు. వెంటనే సీత "ఓ హనుమంతా! ఈ కానుక ఇచ్చినందుకు గాను నీకు శాశ్వతంగా ఋణపడి ఉన్నాను.

లంకా నగరంలో తనకు జరిగిన అవమానాన్ని, బాధలను రాక్షస స్త్రీల కఠినపుమాటలు, త్రిజట అనే వృద్ధ రాక్షసి అనుకూలమైన మాటలు, విభీషణుడు రావణునికిచ్చిన సలహాలు, అన్నీ హనుమంతునకు వివరించిది సీత. అందరి సలహాలు, ధర్మసూత్రాలు, తిరస్కరిస్తున్నాడు రావణుడు" అని సీత హనుమతో చెప్పింది.

హనుమను సాగనంపుతూ "ఓ హనుమంతా! నేను సంపూర్ణంగా నా పతిదేవునికే అంకితురాలినై వున్నందువలన నేను రాముడిని తప్ప ఇతరుల శరీరాలను తాకను. రాముడే స్వయంగా వచ్చి ఈ దుష్టరావణుణ్ణి వధించి నన్ను కాపాడవలసింది. ఈ కార్యమొక్కటే రాముడి మంచితనాన్ని తెలియజేస్తుంది" అని సీత అన్నది.

"పతివ్రతవు, రాముని ధర్మపత్నివి అయిన నీ స్థాయికి తగినట్లుగా నీ మాటలు అభినందనీయాలు. నేనిక వెళ్ళివస్తాను అని హనుమ సీత వద్ద సెలవు పుచ్చుకుని బయలు దేరాడు.

ఆ మాట వింటూనే సీత తన కొంగు ముడి తీసి తాను శిరోభూషణంగా ఉపయోగిస్తున్న చూడామణిని తీసింది. దానిని హనుమంతునకిస్తూ సీత "ఈ చూడామణిని చూచినపుడు రామునికి ముగ్గురు వ్యక్తులు గుర్తుకు వస్తారు. ఎందుకంటే రాముడు, ఆయన తండ్రి – వీరిద్దరి సమక్షంలో



మాతల్లి దీనిని నాకు పెండ్లి కానుకగా ఇచ్చింది. ఓ హనుమంతా! నీవు త్వరగా వెళ్ళి రాముని త్వరగా వచ్చి నా దుఃఖాన్ని అంతం చేయమని గట్టిగా చెప్పు" అంది.

'అంతట హనుమంతుడు సీతకు ప్రదక్షిణ నమస్కారాలు చేశాడు. బయలు దేరుతూ "చింతించకు తల్లీ, రావణుని, రాక్షసులను వధించటం కోసం రాముడు, లక్ష్మణుడు, వానర యోధులందరూ ఇక్కడకు వస్తారు" అని సమాధానమిచ్చాడు.

**సీతారాముల మనోభావాలను ఒకరికొకరికి తెలియ పర్చటానికి హనుమంతుడు రాయబారిగా-సమాచార వైతాళికునిగా(Communicator గా) వ్యవహరించటం ఆనాటి కమ్యూనికేషన్ వ్యవస్థకు తార్కాణం. భార్యాభర్తల ప్రేమను వ్యక్తపరచటానికి సంకేతాలుగా రాముడు ఉంగరాన్ని సీతకు, సీత చూడామణిని రామునికి ఇవ్వమని హనుమంతుణ్ణి కోరారు. వీరిద్దరికి హనుమ పై వున్న విశ్వాసం కొనియాడదగినది.**

సీత వద్ద సెలవు తీసుకున్న హనుమంతుడు లంకలోని అశోక వృక్షాలను ధ్వంసం చేయటం, పెకలించి వేయటం ప్రారంభించాడు. సరస్సులను కల్లోలితం చేసి పర్వతాలను నుగ్గుచేశాడు. దాదాపు అశోక వనాన్నంతటిని ధ్వంసం చేశాడు. పక్షులు, జంతువులు భయంతో అరుపులు విని కావలి ఉన్న రాక్షస స్త్రీలు ఉలిక్కి పడ్డారు. హనుమంతుణ్ణి చూచి వారి గుండెలు గుభేలు మన్నాయి. రాక్షస స్త్రీలు సీతను "ఈ ప్రాణి ఎవడు? నీవు, అతను ఏమి మాట్లాడుకున్నారు." అని ప్రశ్నించారు.

హనుమంతుడు అక్కడ ఉన్న రాక్షసులందరితో పోరాడాడు. భయానక దృశ్యాలను కలిగించాడు. అచట వున్న వారందరిని దిగ్భ్రాంతికి గురిచేశాడు. గాలిలో ఎగురుతూ ఇనుప గుదియను చేతిలో పట్టుకొని త్రిప్పుతూ రాక్షస సేన నంతటినీ మట్టు పెట్టాడు. రాక్షసులు – జంబుమాలి సచివుని ఏడుగురు

పుత్రులు, అయిదు గురు ప్రముఖ సేనాపతులతో భయంకరయుద్ధం చేసి వారిని సంహరించాడు హనుమంతుడు.

అంతట ఇంద్రజిత్తు హనుమంతుణ్ణి తాళ్ళతో బంధించి రావణుని దగ్గిరకు తీసుకొని వెళ్ళారు రాక్షసులు. రావణుని సమక్షంలో మాట్లాడటానికి ఇదొక మంచి సమయం అని మనసులో అనుకున్నాడు హనుమంతుడు.

రావణునికి ఎదురుగా నిలచి ఉన్నాడు. హనుమంతుని ప్రశ్నించవలసిందిగా రావణుడు తన మంత్రులను ఆదేశించాడు. వారి ప్రశ్నలకు సమాధానంగా హనుమంతుడు "నేను వానర రాజైన సుగ్రీవుని దూతను. ఆయన మీకు తన శుభాకాంక్షలు తెలియచేయుమన్నాడు. మీరు ధర్మసూత్రాలకనుగుణంగా వ్యవహరిస్తున్నారని, మీరాజ్యం అభివృద్ధి మార్గంలో ఉన్నదని మహాత్ముడైన సుగ్రీవుడు ఆశిస్తున్నాడు" అని చెప్పాడు.

ఇంకా హనుమంతుడు రావణునితో "నేను ఇక్కడకు వచ్చిన అసలు కారణమేమిటో చెబుతాను, దయచేసి వినండి. నా పేరు హనుమంతుడు. దశరథమహారాజు పుత్రుడైన శ్రీరాముని దూతగా వచ్చాను. అపహరించబడిన సీతకోసం నేను ఎప్పటినుంచో వెదుకుతున్నాను. నా అదృష్టం వల్ల ఆమెను ఇచట కనుగొన్నాను.

ఓ రావణా! నీవు ధర్మ సూత్రాలను లెస్సగా ఎరిగిన వాడవు. తెలివైన వాడెవడుగాని ధర్మమార్గాన్ని విడిచి వినాశనాన్ని కొని తెచ్చుకోడు. దయచేసి నా సలహా పాటించి సమయం మించిపోకముందే రామునికి సీతను తిరిగి అప్పగించు. గతంలో నీవు ఉగ్రమైన తపస్సాధనలు ఆచరించి దేవతల చేతుల్లో గానీ, దానవుల చేతుల్లోగానీ, మృత్యువు సంభవించకుండా చేసుకోగలిగావు. అలాగే సీతను అపహరించటమనే అధర్మమైన పని నీకు వినాశనాన్ని తెచ్చి పెడుతుందని ఇప్పటికైనా నీవు గ్రహించు. యావత్తు లంకను నేనైనా సర్వనాశనం చేయగలను. ఇక సమస్త విశ్వాన్ని లయం



చేసి మరల సృష్టి చేయగల రాముని గురించి చెప్పవలసిందేముంది. రామ-రావణుల మధ్య సయోధ్యకు యత్నించాడు హనుమ.

రావణుడు హనుమంతుని మాటలకు కోపంతో ఎర్రపడిన నేత్రాలతో "ఈ వానరుణ్ణి తక్షణమే వధించండి" అని కేక పెట్టాడు.

కాని, **మృదుస్వరమైన విభీషణుడు రావణునితో "అగ్రజా! దూతలను చంపటం మంచిదికాదు. నీవు నిశ్చయంగా మహా విద్వాంసుడవు. నీవు చేయకూడని పనికి కోపాన్ని తెచ్చుకుంటే నీ జ్ఞానమంతా బూడిదలో పోసిన పన్నీరవుతుంది".** అని సలహా ఇచ్చాడు. హనుమంతుడు దూత మాత్రమే, కాని, నిజంగా నీకు శత్రువులు రామలక్ష్మణులు. నీ మీద ప్రతీకారానికి సిద్ధపడుతున్నారు. కనుక వారితో పోరాటానికి నీ సైన్యాన్ని ఎందుకు పంపవు?"

పవిత్రమైన మనస్సుగల తన సోదరుని ప్రభావంతో, రావణుడు ఎట్టకేలకు "వానరులు తమ తోకలను అపురూపంగా పెంచుకుంటారు, అందువల్ల ఈ హనుమంతుని తోకకు నిప్పు పెట్టి లంకా పురవీధుల యందు ఊరేగించండి. "లంకా ప్రజలు అతని గురించి తెలుసుకుంటారు" అన్నాడు.

రావణుడు ఆజ్ఞ ఇచ్చిన వెంటనే హనుమంతుని తోకకు రాక్షసులు నిప్పు అంటించారు, క్రోధంతో హనుమంతుడు ఆ తోకను అటు ఇటు కదిలిస్తూ దానితో రాక్షసులను బాదసాగాడు.

నా తోక మండుతూ ఉంది కనుక లంకనంతటినీ అగ్నిజ్వాలల్లో ముంచటానికి దీని నెందుకు ఉపయోగించుకో గూడదు అనుకున్నాడు హనుమ. వెంటనే ప్రధానమంత్రి ఇంటిమీదకు దూకి దానికి నిప్పంటించాడు. అంతస్తులు కుప్పకూలాయి. అమితమైన వేడికి స్వర్ణ, రజతాలు ద్రవీభవించి అది ముత్యాలతోను, రత్నాలతోను మిళితమైన లావావలె వీధుల్లోకి ప్రవహించింది. లెక్కలేనన్ని అశ్వాలు, గజాలు, దగ్ధమైనాయి. అరుపులు,

ఏడుపులు ఎక్కువైనాయి. "వానర రూపంలో అగ్నిదేవుడే మన నగరాన్ని ధ్వంసం చేయటానికి ఇంద్రుడు గాని, బ్రహ్మగాని, విష్ణువు గాని లేదా ఆయన అపరిమిత శక్తిగాని ఇక్కడకు రావటం జరిగిందా! అని ఆశ్చర్యం వెలిబుచ్చారు.

హనుమ సముద్రం వద్దకు వెళ్ళి తోకకు వున్న అగ్నిని చల్లార్చుకొన్నాడు.

ఇంతసేపు సిద్ధులు, చారణులు ఇతర దివ్య పురుషులు హనుమంతుని వీరోచిత సాహసకృత్యాలను పొగుడుతూ ఉన్నారు. ఇప్పుడు హనుమంతుడికి ధైర్యమివ్వటానికి సీత సురక్షితంగా ఉన్నదన్న వార్త వారు అతనికి తెలియజేశారు. సీతను చూచి, ఆనంద బాష్పాలు రాల్చాడు హనుమ. సీత మళ్ళీ మళ్ళీ హనుమంతుడికి "రాముణ్ణి వచ్చి నన్ను తీసుకుని వెళ్ళమని చెప్పవలసింది" అని చెప్పింది.

తిరిగి వెళ్తూ ఆకాశంలో ప్రయాణిస్తూ మరోసారి గౌరవ సూచకంగా మైనాక పర్వతాన్ని స్పర్శించాడు. చివరకు మహేంద్రపర్వతాన్ని సమీపిస్తూ హనుమంతుడు తన వానర మిత్రులను కలుసుకునే ఉత్సాహంతో తోకను ఊపుతూ విజయోత్సాహంతో గర్జించసాగాడు.

"హనుమంతుని ఉత్సాహాన్ని గమనిస్తే అతను తన కార్యంలో విజయం పొందాడని చెప్పవచ్చు" అని జాంబవంతుడు ఇతరులతో అన్నాడు.

**కోపాగ్ని జ్వాలల్లో, ఆగ్రహవేశాల్లో రావణుడు, హనుమంతుడు పరస్పరం నిందించుకుని, లంకానగరం అగ్ని జ్వాలలకు ఆహుతి అవటం దురదృష్టకరం. కోపం ఎంత పని చేస్తుంది. ఎంతపనైనా చేస్తుంది! కోపంలో జ్ఞాపక శక్తి నశిస్తుంది. ఏమి చేస్తున్నాం అనే ఆలోచనాశక్తి, విచక్షణాశక్తి నశిస్తుంది. కోపం ఒక్కోసారి ప్రాణాలను సైతం బలితీస్తుంది. ఎంత ప్రాణనష్టం, ఆస్తి నష్టం., నగరాలు మాయమైనాయి. కోపంవల్ల శత్రుత్వం పెరుగుతుంది. సంబంధాలు తెగిపోతాయి.**



**అందుకే ఋషులు, శాస్త్రాలు "ఓర్పు, నేర్పు, సహనం, సంయమనం, సమయస్ఫూర్తి" అలవరచుకోవాలని చెప్పాయి.**

కొద్దిసేపట్లోనే అంగదుని బృందమంతా రాముని సమక్షానికి తిరిగి వచ్చారు. "సీత క్షేమంగా వుంది. రావణుడు ఎన్నిసార్లు ప్రయత్నాలు చేసినా ఒక్కసారైనా వాటికి లొంగకుండా ఆమె తన పాతివ్రత్య దీక్షతో స్థిరంగా నిలిచి ఉంది" అంటూ హనుమంతుడు ఉత్సాహంగా చెప్పాడు. రాముడు ప్రేమపూరితమైన నేత్రాలతో హనుమను చూచాడు. వానరులంతా సుగ్రీవునికి, రామలక్ష్మణులకు నమస్కారాలు చేశారు.

"రావణుని నివాసం ఖచ్చితంగా ఎక్కడ ఉందో నాకు వివరించండి. సీత గురించి ఇంకా చెప్పండి? అని ప్రశ్నించాడు రాముడు.

సీతను వెదకి కనిపెట్టటానికి దారి తీసిన సన్నివేశాలనన్నిటినీ వివరంగా చెప్పాడు హనుమంతుడు. సీత ఇచ్చిన చూడామణిని రామునికి ఇస్తూ "జనకరాజ పుత్రిక భక్తి అంతా నీ మీదనే స్థిరంగా నిలిచి ఉంది. నీ ఎడబాటులో ఆమెకు జీవితం గడపటమే కష్టంగా ఉంది, అని చెప్పాడు. సీత సందేశాలను రామునికి వివరించాడు.

రాముడు సీత పంపిన చూడామణిని తన హృదయానికి హత్తుకున్నాడు. రామలక్ష్మణులు భోరుమని కన్నీరు కార్చారు.

రామా! సీత కష్టాలను, బాధలను దృష్టిలో ఉంచుకొని ఇక ఎంతమాత్రం ఆలస్యం పనికిరాదు. మనం లంక పై దాడి చేయటానికి తగిన మార్గాలను, ప్రణాళికలను త్వరగా ఆలోచించి ఆచరణలోకి తీసుకు రావలసిందిగా నిన్ను అభ్యర్థిస్తున్నాను" అంటూ ముగించాడు హనుమంతుడు.

**సీతారాముల మధ్య అనుసంధాన కర్తగా, దూతగా వెళ్ళి వారిద్దరి మధ్య ప్రేమ పూర్వక వాతావరణాన్ని కలిగించి వారిద్దరిని కలుసుకోటానికి మార్గం సుగమం చేసిన ఘనత హనుమంతునిది. చూడామణి, ఉంగరం**

**సీతారాముల ఆదర్శ ప్రేమకు, ఆదర్శ జీవితానికి నిదర్శనాలు. భార్యా భర్తల మధ్య సత్సంబంధాలు తిరిగి స్థాపించటానికి హనుమ అంకురార్పణ చేయటం సంతోషదాయకం.**

**రాముని ప్రశంసల వర్షం**

హనుమంతుడు సాధించిన అసాధారణ విజయానికి రాముడు పరమానందభరితుడై ప్రశంసల వర్షం ఇలా కురిపించాడు. "**గరుత్మంతుడు తప్ప ఎవ్వరూ నీవు నిర్వహించినట్లు ఈ కార్యం చేయలేరు. యజమాని తనకు అప్పగించిన పని కంటే ఎక్కువగా సాధించే వాడు సేవకులందరిలో ఉత్తముడు. తాను మరింత చేయగల సమర్థుడై ఉండి కూడా యజమాని ఆదేశాల మేరకు మాత్రమే చేసి అంతకు మించి యత్నమే చేయని వాడు మధ్యస్థుడు. చివరగా సమర్థుడై ఉండి కూడా యజమాని ఆదేశాలను నిర్వర్తించని వాడు అధముల్లో అధముడైన సేవకుడు.**

**త్రేతాయుగంలోనే యాజమాన్యం - సిబ్బంది మధ్య సయోధ్య, సత్సంబంధాలు మెరుగుపర్చటానికి రాముడు సిఫార్సు చేసిన పై మూడు సూత్రాలు అందరూ ఆలోచించి ఆచరించదగినవి. సుపరిపాలన అందించటంలో ఈ మూడు సూత్రాలు అత్యంత ఉపయోగకరం.**

ప్రియమైన హనుమంతా! నీవు సీత జాడను కనిపెట్టడం మాత్రమే **గాక నీ మాటలతో ఆమెను ఓదార్చావు అని అభినందించాడు రాముడు. మనిషి మాట్లాడే పదాలు అవతల వ్యక్తికి ఉపశనం కలిగిస్తాయి. కఠినమైన పదాలు మనిషికి అసహ్యాన్ని పుట్టిస్తాయి. "ఆచితూచి" మాట్లాడాలని పూర్వము పెద్దలు సలహా యిచ్చారు గదా! హనుమంతుడు తు.చ. తప్పక మాట్లాడి సీతారాముల హృదయాన్ని మంచి మాటలతోనే ఆకట్టుకోగలిగాడని తెలుస్తున్నది.**

రాముడు యింకా – "నీవు లంకానగరాన్నంతటని చూచి, రాక్షస మహాయోధుల శక్తిని పరీక్షించి, రావణుని గుండెలో భయం కల్పించావు.



నిజానికి నీ సేవ పట్ల నా ప్రాణాన్నే నిలబెట్టావు. అందువల్ల నీకు సముచితమైన బహుమతిని యివ్వలేక పోవటం నాకు అమితమైన బాధను కలిగిస్తోంది. సరియైన ఆధారమనేది లేక నేను ప్రవాస జీవనం గడుపుతున్నాను. నీ **సేవలకు ప్రతిఫలంగా నా ఆలింగనాన్ని మాత్రమే యివ్వగలను! ఈ ప్రశంసపు మాటలు పలుకుతూ రాముడు హనుమంతుణ్ణి ప్రేమపూర్వకంగా హృదయానికి హత్తుకున్నాడు.**

సుగ్రీవుడు కలుగ చేసుకొని రాక్షసులతో యుద్ధం రాబోతున్నందుకు నాకు మహదానందంగా వుంది. వానరులంతా ఈ కార్యానికి గట్టివారేనని నాకు దృఢమైన విశ్వాసముంది. బహుశ మనం ఏదో ఒకవిధంగా సముద్రంపై వంతెనను నిర్మిస్తే సరిపోతుంది. వానరులు లంకకు చేరితే చాలు వారు విజయం సాధించగలరని నేను నిశ్చయంగా చెప్పగలను" అన్నాడు.

**అందుకు రాముడు "నేను స్వయంగా వెళ్ళి లంకను నాశనం చేయాలనేది నా శపథం" అని బదులిచ్చాడు.**

మళ్ళీ రాముడు "సూర్యుడిప్పుడు ఆకాశంలో నడినెత్తిన ఉన్నాడు. శుభప్రదమైన అభిజిత్ ముహూర్తం యిప్పుడు వచ్చింది. యుద్ధ కార్యక్రమాలు ప్రారంభించటానికి అనువైన సమయమిదే. అలాగే నా కుడి రెప్ప అదురుతూ విజయాన్ని సూచిస్తోంది. అందువల్ల త్వరగా వానరులను సమావేశ పరచండి. తక్షణమే లంకకు మన జైత్రయాత్ర ప్రారంభించవచ్చును" అని సుగ్రీవునితో చెప్పాడు.

**రాముని యుద్ధసన్నాహాలు**

రాముని శిబిర నిర్మాణంలో వానరులు తలమునకలై ఉన్నారు. లోతైన సముద్రాన్ని విస్ఫారిత నేత్రాలతో సైనికులు తిలకించారు.

నిశ్శబ్దంగా విశ్రాంతిగా కూర్చొని ఉన్న రాముడు లక్ష్మణునితో "కాలం గడిచే కొద్దీ దుఃఖం అదృశ్యమవుతుంది అంటాడు. కానీ, సీతా

వియోగం వల్ల కలిగిన నా బాధమాత్రం ఒక్కొక్క రోజు గడిచిన కొద్దీ అధికమవుతూనే ఉంది. లక్ష్మణా! సీతకు ఇవ్వబడిన వ్యవధి త్వరగా గడచిపోతున్నదనే ఆవేదన నాకు అత్యంత బాధాకరంగా ఉన్నది. రావణుణ్ణి సంహరించి ఆమెను రక్షించే సమయం కోసం నా హృదయం ఆత్రుతగా ఉంది. అప్పుడు మాత్రమే ఒకవ్యక్తి జీర్ణవస్త్రాన్ని విసిరివేసినట్లు నేను నా దుఃఖాన్ని శాశ్వతంగా వదలి వేయగలుగుతాను" అన్నాడు. లక్ష్మణుని ముందు రాముడు తన బాధ వివరిస్తుండగా క్రమంగా సూర్యుడు పశ్చిమ దిక్కున చివరి ప్రయాణంగా ఆరోజు అస్తమించాడు.

ఎంతోమంది వానర ప్రముఖులు ఎన్నో లక్షల మంది వానరసైనికులు ఉత్సాహంగా ఉన్నారు. యుద్ధంలో పాల్గొనాలని వ్యూహరచనలో నిమగ్నమై రామలక్ష్మణులు. వారు పూర్తిమద్దతు ప్రకటించిన సమయంలో రాముడు అతనికి సీత పై గల వియోగబాధను శాశ్వతంగా దూరం చేసుకోవాలని మానసికంగా నిర్ణయించాడు రామునిది అనుకూల ఆలోచనే. దీనినే ఆధునికులు Positive thinking అంటున్నారు. సానుకూల ఆలోచనలే మానసిక బలాన్ని, విజయాన్ని కలుగ చేస్తాయి. **సమస్యలు, కష్టాలు, దుఃఖాలు మానవ సహజం. మానసిక, సానుకూల ఆలోచనలే మనిషి ఎదుగుదలకు సోపానాలు. అందుకే రామాయణం ధర్మశాస్త్రమే గాదు మానసిక శాస్త్రం అని గూడా ఆధునికులు దీనిని గుర్తించాలి.**

మానవజాతికి, వానరజాతికి సత్సంబంధాలు బలపడటానికి రామరావణయుద్ధం వేదికైంది. ధర్మం నిలబెట్టటానికి ఆకాలంలో ఎంతో ఉత్సాహం చూపించేవారు.

**రావణుని సమావేశ హితోక్తులు**

లంకను అల్లకల్లోలం చేసిన తరువాత హనుమంతుని పరాక్రమానికి, రాజ ప్రాసాదాలు శిథిలమైనాయి. తెలివిగల రాక్షసులు, యోధులు



మృతులైనారు. మంచి సలహాయే విజయానికి మూలమని శాస్త్రాలు చెబుతున్నాయి. అందువల్ల రాక్షస ప్రముఖులను సమావేశపరచాడు రావణుడు. ముందు తన అభిప్రాయాలను వ్యక్తపరచాడు. ఈ లోకంలో మూడు రకాల వ్యక్తులుంటారు. అవి..

1. ఏదైనా చర్య తీసుకునే ముందు వివేకవంతుడైన వ్యక్తి మంచి ఆలోచన గల పెద్దల, మిత్రుల సలహా తీసుకుంటాడు. ఆపైన అంతిమంగా దైవం మీద ఆధారపడుతూనే వారి సలహా పాటిస్తూ తన పూర్తి సామర్థ్యం మేరకు కృషి చేస్తాడు.

2. మధ్యముడైన వ్యక్తి ఒక విషయాన్ని గురించి తనకు తానే ఆలోచించి, తన సొంత ఆలోచన ప్రకారం అన్ని విషయాలు పరిశీలించి అందుకు అనుగుణంగా వ్యవహరిస్తాడు.

3. ఇక దేవుని మీద విశ్వాసాన్ని పూర్తిగా వదలి, పనిచేయాలనే భావనలేకుండా, తమకు ఎలా తోస్తే ఆ విధంగా తమ కార్యకలాపాలు నిర్వహించే వారు అత్యంత అధములు. అలాంటివారు ఏది శ్రేయస్కరమో ఏది హానికరమో సరిగా నిశ్చయించుకో లేక 'ఏది ఏమైనా ఇది చేసేస్తాను' అంటూ గ్రుడ్డిగా ముందుకు పోతారు.

రావణుడు అదే విధంగా మూడు రకాల సలహాలను ప్రకటించాడు.

1. సమస్యను విషయాత్మకంగా అధ్యయనం చేసి, ధర్మ సూత్రాలకు అనుగుణంగా ఇవ్వబడేది ఉత్తమ సలహా.

2. సమస్యను వాడిగా, వేడిగా, చర్చించిన మీదట ధర్మ సూత్రాల కంటే స్వప్రయోజనానికి పెద్ద పీట వేస్తూ ఇవ్వబడేది మధ్యరకమైన సలహా.

3. ఇక అంతిమ పరిణామాల గురించి సరిగా పట్టించుకోకుండా మోహంతో కూడిన అహంభావంతో లేదా ముఖస్తుతికోసం ఇవ్వబడేది చెడు సలహా.

**రావణుడు మూడు రకాల వ్యక్తుల భావాలు, మూడు సలహాలను ప్రముఖుల ముందు నివేదించటం జరిగింది. పై సలహాలను ఆరింటిని పరిశీలిస్తే రావణుడు ఒక మేనేజ్‌మెంట్ వ్యవస్థకు నిపుణుడు వంటివాడుగా తోస్తున్నది. రాజ్య నిర్వహణలో అతనికి యాజమాన్య మెళకువలు, చిట్కాలు బాగా తెలిసి సరియైన, స్పష్టమైన కఠిన నిర్ణయాలను తీసుకోగల మేధా సంపత్తి గల వాడని తెలుస్తున్నది. రాజుకు ఉండవలసిన గుణాలలో ఇవి ముఖ్యమైనవి. ఆయన సలహాలు, చిట్కాలు ఈనాటి మేనేజ్‌మెంట్ వ్యవస్థ సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహించటంలో ఉపయోగ పడుతాయనటంలో సందేహం లేదు. వ్యక్తికి గల శ్రద్ధ, తెలివితేటలు, నైపుణ్యాలను అంచనా వేయటమే ఆయన ప్రధానోద్దేశ్యం.**

**రావణుని దుర్గుణం స్త్రీవాంఛ ఒక్కటి. తనకు అడ్డు వచ్చిన వారిని హతమార్చటం రెండవ దుర్గుణం. మూర్ఖత్వమే మూడవ దుర్గుణం. మంచి సలహాలను ఇస్తే పెడచెవిని పెట్టడం నాలుగవ దుర్గుణం. అయితే వేద వేదాంగాలలో నిష్ణాతుడు. శివ పూజా దురంధరుడు. చివరకు దుర్గుణాల వల్లనే నాశనమైనాడు.**

భారత స్త్రీలను గౌరవించటం, ఆదరించటం, పూజించటం ధర్మ సూత్రాలలో భాగం. ఇది సనాతన ధర్మంగా వస్తూనే ఉంది. అగౌరవపరిచిన వారికి రావణుని దుర్గతి వస్తుందని తెలుసుకోవాలి. తరువాత ప్రజ్ఞావంతులైన రాక్షస ప్రముఖులు – సేనాపతి ప్రహస్తుడు, మరో రాక్షస ప్రముఖుడు దుర్ముఖుడు, వజ్రదంష్ట్రుడనే రాక్షసుడు, వజ్రహనుడనే వారందరూ రావణునికి అనుకూలంగా మాట్లాడి యుద్ధం చేయవలసిందేనని గట్టిగా చెప్పారు. నిజానికి చాలమంది రాక్షస వీరులు తాము ఒక్క చేత్తో శత్రువును జయించగలమని రావణునికి ధైర్యమిస్తూ ప్రగల్భాలు పలికారు. అయితే రావణుడి సోదరుడు విభీషణుడు వినయంగా వారిని శాంతింపచేశాడు.



పవిత్రాత్ముడైన విభీషణుడు “ప్రియమైన అగ్రజా! సామ, దాన, భేదాలు అనే మూడు ఉపాయాలు విఫలమైన తర్వాతనే దండోపాయాన్ని ప్రయోగించాలని వివేకవంతులైన వారిమాట. రాముని విషయానికివస్తే ఆయన అత్యంత శక్తిమంతుడు, ధార్మికుడు, ప్రతీకారంకోసం ఉవ్విళ్ళూరుతున్నవాడు. అలాంటి రాముణ్ణి ఓడించగలమని ఆశించటం ఎలా? సీతాపహరణమే ప్రస్తుత సంక్షోభానికి మూలహేతువు. లంకను, అందులో నివసించే వారి నందరిని రాముని బాణాలు సర్వనాశనం చేస్తాయి. ఈ లోపల నీవు ఆమెను రామునికి తిరిగి అప్పగించాలి” అన్నాడు.

రావణుడు తన సోదరుడు విభీషణుడు చెప్పిన సలహాలు రుచించక కొంత బాధపడ్డాడు. “నేను రామునికి గాని, మరొకరికి గాని, భయపడేది లేదు. సీతను తిరిగి అప్పగించటానికి ఎట్టి పరిస్థితులలోను నేను అంగీకరించను. తమ్ముడా! నీవింక సెలవు తీసుకుని నీ వ్యవహారాలు నీవు చూచుకొనవచ్చు” అంటూ గట్టిగా మందలించాడు.

రావణుని భార్య మండోదరి కూడ “దుఃఖంలో నున్న సీత క్రుంగి, కృశించి, శల్యమైనది. అంద విహీనమైనది. అటువంటి సీతను వదిలిపెట్టు. మనిద్దరం అంతఃపురానికి వెళుదాం! అని రావణుని వెంట తీసుకుని రాజగృహానికి వెళ్ళింది.

**రావణుని యుద్ధ సన్నాహాలు**

రావణుడు తన సేనాపతి ప్రహస్తునితో లంకను లోపలి నుండి బయట నుంచి రక్షించుటకు సేనలను సిద్ధం చేయండి. ఏ క్షణానైనా యుద్ధం తప్పదని తెలిసిన రావణుడు తన మంత్రులను చాల జాగ్రత్తగా ఉండవలసిందిగా ఆదేశాలు జారీ చేశాడు.

మరొక సోదరుడు కుంభకర్ణుడు గూడ “అగ్రజా! రావణా! నీవు ముందు వెనుక ఆలోచించకుండా నీ ఇష్టం వచ్చినట్లు వ్యవహరించావు. సీతను

అపహరించటానికి ముందే మాతో సంప్రదించి ఉండాల్సింది. అంతా నీ ఇష్టప్రకారం చేసి మంత్రులను, సేనాపతులను, సోదరులను, రాక్షసశ్రేష్ఠులతో సమావేశ పరచి సలహాలు అడిగి ఇబ్బందిలో పడి కష్టాలు తెచ్చుకున్నావు. అయినా నీవు సోదరుణ్ణి గనుక నీ ఆదేశాలను పాటిస్తాను! నేను చేయవలసిన పని ఏమిటో చెప్పు" అన్నాడు.

**విభీషణుడు-రావణుడి మధ్య క్షీణించిన సంబంధాలు**

రావణుని శ్రేయోభిలాషిగా విభీషణుడు బదులిస్తూ "రాముడు సాక్షాత్తుగా శ్రీమహావిష్ణువు స్థాయిలో అపరిమితమైన, అనూహ్యమైన మహిమలు గలవాడు. నేను కేవలం నా అన్న శ్రేయస్సును, రాజ్యాన్ని, వంశ గౌరవాన్ని పదిల పర్చాలనే విషయాలను దృష్టిలో ఉంచుకొని సీతను రామునికి తిరిగి అప్పగించాలని చెబుతున్నాను. రాజైనవాడెప్పుడు మంచి చెడులను శత్రువు బలాబలాలను అంచనా వేయాలి. అందుకు అనుగుణంగా సలహా ఇచ్చే మంత్రి నిజమైనశ్రేయోభిలాషి" అన్నాడు.

రావణుడు కూడా విభీషణుని వ్యతిరేకసలహాలు విని విసిగిపోయాడు. విభీషణా! స్నేహితుణ్ణని చెప్పుకుంటూ వాస్తవానికి ద్రోహం తలపెట్టే వ్యక్తినీ, స్వంత సోదరుడైనా అతనితో కలసి జీవించటం కంటే శత్రువుతోనో, విష సర్పంతోనో కలిసి ఉండటం మేలు. "విభీషణా! నీమాదిరిగా వేరెవరైనా మాట్లాడితే అతన్ని తక్షణమే వధించి ఉండేవాణ్ణి. ఓ నిర్భాగ్య సోదరుడా! మన గొప్ప వంశానికి నీవు ఒక కళంకివి"!

ఆఖరు ప్రయత్నంగా విభీషణుడు కోపంతో గదచేత పట్టి నలుగురు అనుచరులతో పాటు హఠాత్తుగా లేచి "రాజా! నా కన్న నీవు ఉన్నత స్థానంలో ఉన్నప్పటికీ అధర్మాన్ని అనుసరించడానికే నిశ్చయించుకున్నావు. గనుక నీ మాటలకు నేను ఎంతమాత్రం సహించలేను. నీకు భజనపరులు లభిస్తారు.



నీకు శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని మాట్లాడేవారు మాత్రం చాలా అరుదుగా ఉంటారు. రావణా! నీవు రాముని చేతిలో మృత్యువు కలుగకుండా రక్షించే ఆశతో మాత్రమే నేను నీకు సలహా ఇచ్చాను. కాని, నా సలహానతిక్రమించావు. ఆస్వేచ్ఛ నీకుంది. అందువల్ల ఓ సోదరా! నీకు మంచి జరగాలని కోరుకుంటున్నాను. నేను మాత్రం ఇక నీతో ఉండను" అన్నాడు. అన్నదమ్ముల మధ్య ధర్మాధర్మ ఆచరణ విషయంలో భేదాభిప్రాయం వల్ల విభీషణుడు ధర్మం వైపు మొగ్గు చూపాడు.

విభీషణుడు తన అనుచరులతో కలిసి బయలుదేరి రాముని శిబిరానికి చేరుకున్నాడు.

**విభీషణుడు - రాముడు సంబంధాలు**

విభీషణుడు రాముని శిబిరానికి వచ్చిన వెంటనే సుగ్రీవుణ్ణి కలిసి "ఓ వానరేంద్రా! నేను రావణుని తమ్ములలో చిన్నవాణ్ణి సీతను రామునికి తిరిగి అప్పగించ వలసినదిగా రావణుని పూర్వ సచివుడనైన నేను ఆయనకు పదే పదే సలహా ఇవ్వటం జరిగింది. నా సలహా నచ్చక నన్ను కఠినమైన మాటలతో నిందించాడు. అందువల్ల నేను నా గృహాన్ని, భార్యను, బిడ్డలను వదలి శ్రీరాముని పాద పద్మాలవద్ద ఆశ్రయం తీసుకోవటానికి వచ్చాను. దయచేసి నా అంగీకారాన్ని రాముడికి తెలియపర్చు" అని విభీషణుడు వెల్లడించాడు.

సుగ్రీవుడు రామునికి విభీషణుని అభిప్రాయాన్ని చెప్పి" రామా! అతణ్ణి నమ్మలేము. అతనొక గూఢచారి అయివుంటాడు. అతడు మనకు హాని తలపెట్టవచ్చు. ఇక్కడ సమాచారాన్ని రావణునికి అందచేయవచ్చు. అందువల్ల అతన్ని వధించి వేస్తే మంచిదని నా సలహా" అన్నాడు.

వెంటనే రాముడు హనుమంతుని నేతృత్వంలోని ఇతర వానరులతో సమావేశమై వారి అభిప్రాయాలను అడిగాడు. వానరులు ఒకే స్వరంతో

మూకుమ్మడిగా "ప్రియమైన రామా! నీవు సర్వజ్ఞుడవు. ధర్మపరుడవు. నీవు మమ్ములను గౌరవించటం కోసమే నీవు మా అభిప్రాయాలను కోరుతున్నావని మేము అనుకుంటున్నాం".

అంగదుడు అభిప్రాయం తెలుపుతూ, "ఈ రాక్షసుడు ఉన్నందువల్ల మనకేమైనా ప్రయోజనం ఉండేటట్లయితే చాల జాగ్రత్తగా ఆలోచించి ఇతణ్ణి అనుమతించాలి. ఇతని వల్ల ఏదైనా కష్టం వాటిల్లే అవకాశమున్నట్లయితే ఇతణ్ణి సాగనంపాలి. శరభుడు, జాంబవంతుడు, మైందుడు మొదలగు వానరులు వారి అభిప్రాయాలను చెబుతూ "విభీషణుణ్ణి జాగరూకతతో అనుమానంతోను చూడవలసిందే. అతన్ని కనిపెట్టి వుండటానికి ఒకరిని ప్రత్యేకంగా నియమించాలి. మనం నిర్ణయం తీసుకునే ముందు అతణ్ణి క్షుణ్ణంగా ప్రశ్నించి తెలుసుకోవాలి.

నిత్యవివేక శీలుడైన హనుమంతుడు మాట్లాడుతూ" మనకు సమయం లేదు. అతడు శ్రీరాముని ఆశ్రయాన్ని ఆశిస్తూ పూర్ణమైన చిత్తశుద్ధితోనే ఇక్కడకు వచ్చాడని నా అభిప్రాయం. రావణుడు దుష్టుడని, రాముడు పవిత్రతకు ధర్మానికి ఉన్నతమైన ప్రతీక అని అతను అర్థం చేసుకున్నాడు. అతని వ్యవహారసరళి, గౌరవ ప్రదమైనమాట, అతని లక్ష్య శుద్ధిని సూచిస్తున్నాయి. కపట, కుట్ర ఆలోచనలు గలవారు అంత ప్రశాంతమైన మనసుతో ఉండలేరు. **ముఖకవళికలు ఎప్పుడూ ఒకవ్యక్తి యొక్క ఆలోచనలను కొంతవరకు తెలియజేస్తాయి.** అందువల్ల ఎటువంటి అనుమానాలకు అవకాశం లేకుండా విభీషణుణ్ణి స్వీకరించాలని నేను అభిప్రాయపడుతున్నా"నని అన్నాడు. ఒకవ్యక్తితో సత్సంబంధాలు పెంచుకోవటానికి మంచి చెడులను పరీక్షించాలి.

ఇక్కడ హనుమంతుని అభిప్రాయాలను పరిశీలిస్తే అతను మానసిక శాస్త్రజ్ఞుడుగా సలహా ఇచ్చినట్లు అనిపిస్తున్నది.



అందరి అభిప్రాయాలను పరిశీలించి, పరీక్షించిన మీదట రాముడు మాట్లాడుతూ, "విభీషణుడు మంచిమనసుతోనే రావణుణ్ణి తిరస్కరించాడని నేను విశ్వసిస్తున్నాను. ఇటువంటి విబేధాలు, మనస్పర్ధలు రాజకుటుంబాలలో ఎక్కువగా వింటూనే ఉంటాం. అతణ్ణి మిత్రునిగా స్వాగతిద్దాం" అన్నాడు.

విభీషణుణ్ణి మిత్రునిగా స్వీకరించటానికి రాముని భావాలు, ఆలోచన ఎలాంటివో ఒకసారి గమనిద్దాం.

"శత్రువు ముకుళిత హస్తుడైవచ్చినప్పుడు అతణ్ణి ఎలాగైనా రక్షించి తీరవలసిందేనని శాస్త్రగ్రంథాలలో పలుచోట్ల చెప్పబడింది. భయంవల్లనో, లేక మూర్ఖత్వం వల్లనో మాత్రమే ఇందుకు విరుద్ధంగా ప్రవర్తించి పాపాన్ని మూట గట్టుకోవటం జరుగుతుందని కండు మహర్షి వ్యాఖ్యానించాడు. అంతేగాక, **దేవాది దేవుణ్ణి అయిన నేను ఏప్రాణి అయినా సరే "నేను నీ వాణ్ణి" అంటూ ఒక్కసారైనా పలికి నా ఆశ్రయం వేడితే అతణ్ణి అన్ని విధాలా భయం నుండి విముక్తి చేయటాన్ని నానిత్య వ్రతంగా పాటిస్తాను. రావణుడు గూడ స్వయంగా వచ్చి నన్ను శరణు వేడినా సరే అతన్ని అన్ని విధాలా సంరక్షిస్తాను".**

రాముని ఉన్నతమైన మాటలు విన్న మీదట సుగ్రీవుని హృదయం భక్తితో నిండింది. కనుల వెంబడి నీరుకారగా "ఓ రామా! నీ పలుకులు, నీ చేతలు ఎల్లప్పుడు నీ ఉన్నతమైన స్థానానికి తగినట్లుగానే ఉన్నాయి. విభీషణుడు నిర్మలమైన మనస్సుకలవాడేనని నాకు కూడ అనిపిస్తోంది. అందువల్ల ఆలస్యంలేకుండా స్నేహం చేసుకుందాం" అన్నాడు. శత్రువును మిత్రునిగా భావించి స్నేహ సంబంధాలకు ఆజ్యం పోయటం శుభపరిణామం.

### రాముడు - విభీషణుని సంభాషణ

రాముడు, సుగ్రీవుడు సుదీర్ఘ చర్చల తర్వాత రాముని అంగీకారం వచ్చిన వెంటనే భూమి పైకి దిగి శ్రీరాముని పాద పద్మాలకు సాష్టాంగ ప్రణామం చేశాడు. సంపూర్ణ శరణాగతిభావంతో ఇలా వివరించాడు. "నేను రావణుని సోదరుల్లో చిన్నవాణ్ణి. నాపేరు విభీషణుడు. నేను రాక్షస రాజు మంచి కోరి మంచి సలహా ఇస్తే నన్ను కఠినంగా నిందించాడు. అందువల్ల నేను నీమీద అమితభక్తి ఉన్నవాడను. నీ సేవలో నిమగ్నుణ్ణి కాదలచి నా గృహాన్ని, నా కుటుంబాన్నీ, ఆస్తులను వదలి లంకను విడిచి వచ్చాను. ఇక నా మిగిలిన జీవితం ధర్మప్రభువైన నీ చేతిలో వుంది. కరుణతో నన్ను ఆశీర్వదించు" అని అభ్యర్థించాడు.

### రావణుడి శక్తి, సామర్థ్యాలు

విభీషణుని కళ్ళలోకి ప్రేమాదరాలతో చూస్తూ రాముడు శత్రువు శక్తి, సామర్థ్యాలను, బలహీనతలను వివరించమని అడిగాడు. అందుకు సమాధానంగా విభీషణుడు ఇలా చెప్పాడు. "బ్రహ్మ దేవుని వర ప్రభావంవల్ల రావణునికి దేవతలు, గంధర్వులు, దైత్యులు, దానవులు, నాగుల చేతుల్లో మృత్యువు లేదు. నిజానికి మానవులు తప్ప మరి యే ఇతర ప్రాణులు అతనికి మృత్యువు కలిగించలేవు. మానవులు లెక్క చేయదగిన వారు కాదని అతని అభిప్రాయం. రావణుని మరొక సోదరుడు కుంభకర్ణుడు పర్వతమంత సమానమైన మహాకాయుడు. దేవేంద్రుడంతటి శక్తిమంతుడు. రాక్షసుల సేనాపతి ప్రహస్తుడు. అతను ఒకప్పుడు కైలాస పర్వతంవద్ద యక్షులతో మహావీరుడైన మణిభద్రుణ్ణి ఓడించాడు. అలాగే రావణుని పుత్రుడైన ఇంద్రజిత్తు అన్ని విధాలా తండ్రితో సమానమైనవాడు. అతను ఛేదించలేని కవచాన్ని ఎల్లప్పుడు ధరిస్తాడు. మహోధరుడు, మహాపార్శ్వుడు, అకంపనుల నేతృత్వంలో లక్షలాది మంది రాక్షసులున్నారు. వారంతా అతిభయంకరులు, కామరూపులైవున్నవారు.



అంతా విన్న రాముడు "విభీషణా! రావణుని పరాక్రమం నాకు బాగా తెలుసు. అతడిని, యితర రాక్షస యోధులను సంహరించి లంకా రాజ్య సింహాసనం పై నిన్ను కూర్చోనిస్తానని నీకు యిదే మాట యిస్తున్నాను" అన్నాడు.

అందుకు మారుగా విభీషణుడు లంకను జయించటంలో తాను రామునికి సహాయం చేస్తానని హామీ ఇచ్చాడు. రాముడు అతని పట్ల ప్రీతి గలవాడైనాడు. విభీషణుణ్ణి ఆదరంతో ఆలింగనం చేసుకున్నాడు. రాముడు, విభీషణుని మధ్య సత్సంబంధాలకు అంకురార్పణ జరిగింది.

రామునిలో వున్న సుగుణం వల్ల శత్రువుని మిత్రునిగా చేసుకుని, ఆశ్రయమిచ్చి, రాజ్యాధికారం ఇస్తానని చెప్పటం అచట అందరికీ ఆశ్చర్యం గొలిపింది. వారందరూ హర్షధ్వానాలు చేశారు.

రాముని మేలు గోరి విభీషణుడు "సముద్రానికి అధిదేవతయైన వరుణుణ్ణి రాముడు ఆవాహన చేయాలి" అని సూచించాడు. పూర్వం రాముని పూర్వీకుడైన సగరుడు భూమిని తొలిచి సముద్రుని వెడల్పు పెంచాడు. ఆనాడు చేసిన సేవ కారణంగా రాముడు తన కార్యాన్ని సాధించటంలో సముద్రుడు తప్పక సహాయం చేస్తాడు" అన్నాడు.

అది మంచి ఆలోచన అని రాముడు భావించి సుగ్రీవునితో "నీవు, లక్ష్మణుడు ఏమి నిర్ణయిస్తే అదే నేను చేస్తాను" అన్నాడు. వారిద్దరూ విభీషణుని మాటను ఆమోదించారు. అంతట రాముడు దర్భాసనం పై కూర్చొని సముద్రముఖుడై ఉన్నాడు.

### విభీషణుడు ధర్మవేత్త

రావణ, కుంభకర్ణ, శూర్పణఖ, ఖరులవలె గాకుండా విభీషణుడు ధర్మాచరణే ప్రధానంగా ఆచరించేవాడు. విభీషణుడు లంకను వదలటం "అంటే, లంకా రాజ్యం ధర్మాన్ని వదులుకుంది" అనుకోవాలి.

**రామ - విభీషణ స్నేహం**

రామునికి విభీషణునికి సంబంధాలు ప్రేమ పూర్వకంగా, ఒకరినొకరు అర్థం చేసుకున్నారు. రావణుణ్ణి వధించి సీతను స్వయంగా రాముడు తిరిగి తీసుకుని రావడానికి మార్గం మరింత సులభమైంది. రామ, విభీషణులిద్దరూ ధర్మపరాయణులు. ఇద్దరి భావాలు సమానమే. సీతాపహరణ దోషమని విభీషణుడు అంటే, పరస్త్రీని అపహరించటం, రావణుడు అధర్మవర్తనుడని, రాముడు పలకటం లక్ష్యసిద్ధికి అంగీకార సూచన. వీరిద్దరి సత్సంబంధాల వలన రావణ వధ, విభీషణుని లంకారాజ్య పట్టాభిషేకం జరగటం విశేషం. అధర్మాన్ని కూకటి వేళ్ళతో నాశనం చేయటం ధర్మాన్ని వేద సూత్రాల ఆధారంగా ప్రతిష్ఠించటం రామ, విభీషణుల లక్ష్యం. మానవాళికి మేలు చేసి శాంతిని స్థాపించటం వీరి అభిమతం.

ముఖ్యంగా మనం తెలుసుకోవలసింది "శత్రువునైనా, అతని మాటలను, గుణగణాలను, లక్షణాలను అంచనా వేసి మిత్రునిగా భావించటం వ్యక్తిత్వానికి నిదర్శనం. అందరూ ఈ నిర్ణయం అనుసరిస్తే మంచిది.

**సముద్రుని సేవ**

సముద్రునికి అధిష్ఠాన దైవమైన వరుణుణ్ణి ప్రార్థించాడు రాముడు. వెంటనే నీటిలో నుండి సముద్రుడు పైకి వచ్చి రామునికి దర్శనమిచ్చాడు. ముసళ్ళు, తాబేళ్ళు, మత్స్యజాతులు పైకి ఎగురుతుండగా గంగా, సింధూల వంటి నదీ దేవతలు తనను అనుసరించగా సముద్రతీరం మీదకు అడుగు పెట్టాడు. చేతులు జోడించి రాముణ్ణి సమీపించి "సర్వవ్యాపకుడవైన ఓ పరమపురుషా! మందమతులమైన మేము మీరెవరో గుర్తించలేక పోయాం. అయితే నీవు పరమపురుషుడవని, సమస్త ప్రపంచానికి అధినాయకుడవని, పరిణామ రహితుడవైన ఆదిపురుషుడవైన భగవానుడవని మేము అర్థం చేసుకుంటున్నాం. దేవతలు సత్త్వగుణం చేతను, ప్రజాపతులు రజోగుణం



చేతను, భూతపతి తమోగుణం చేతను మోహితులై ఉండగా నీవు మాత్రం ఈ త్రిగుణాలకు అధిపతివై అతీతుడవై ఉన్నావు.

ఓ రఘువంశ శ్రేష్ఠా! భూమి, జలం, అగ్ని, వాయువు, ఆకాశం అనే పంచభూతాలు శాశ్వతంగా తమ ప్రకృతిసిద్ధ లక్షణాలతో కలిసి ఉంటాయి. నేను చాల అగాధమైన వాణ్ణి, కష్టంతోకూడిన వాణ్ణి. నాకు మరో మార్గంలేదు. ఓ రామా! నా సముద్ర జలాలను నీవు దాటటానికి అనుకూలంగా నీకోసం మాత్రమే నేనొక ప్రత్యేక సులభమైన అవకాశాన్ని కలిగిస్తాను. ఓ జానకీవల్లభా! నీవు నా జలాలను కోరిన విధంగా వినియోగించుకోవచ్చును. నీవు ఈ వంతెన మీద నుంచి లంకకు చేరవచ్చును. రావణుణ్ణి సంహరించి తిరిగి సీతను పొందవచ్చును.

సముద్రుడంతటివాడు శ్రీరాముడు అడిగిన వెంటనే తను చేయగలిన సేవను పూర్తిగా వివరించి సఫలీకృతుడైనాడు. సహాయ సహకారాలు, సేవలు అందించటానికి, అందులో ముఖ్యంగా రాముడు తలచిన కార్యం నెరవేరటానికి సముద్రుడు ముందుకు రావటం విజయానికి సూచిక. రామునికి ఎంతమందితో సత్సంబంధాలు, సన్నిహితసంబంధాలు, అనుకూల సంబంధాలు ఉన్నాయో అవగతమవుతోంది.

**ఎవరైనా శుభకార్యానికి సహాయం అడిగినప్పుడు ప్రతికూలమైన మాటలు చెప్పక, సానుకూలంతో పనిచేస్తే అడిగినవారికి, సేవ చేసినవారికి పుణ్యఫలం దక్కుతుంది.**

**ఉడుత భక్తి - సేవ**

ఈ సందర్భంలో ఒక ఉడుత భగవంతుడైన రామునికి సేవ చేసే ప్రయత్నంలో సముద్రంలోకి మట్టిని ఎగదోస్తూ కనిపించింది. ఈ దృశ్యాన్ని హనుమ చూచి 'నీవు దారికి అడ్డు తొలగు. లేకపోతే గాయపడుతావు. మేము పెద్ద రాళ్ళను మోస్తున్నాం. నీవు తోస్తున్న మట్టితో ఏమి చేస్తావు? ఏమి సాధిద్దామని? అని ఉడుతతో అన్నాడు.

హనుమంతుని మాటలు విని రాముడు ''ఇలాంటి మాటలు ఎందుకంటావు? ఈ ఉడుత, నీవు ఇద్దరూ నన్ను సేవిస్తున్నారు. ఎవరు శక్తి మేరకు వారు సేవ చేస్తున్నారు. అందువల్ల నీవు చేసిన సేవ, ఈ ఉడుత చేస్తున్న సేవ సమాన విలువ గలవిగా నేను భావిస్తున్నాను''. అంటూ హనుమంతుణ్ణి రాముడు మందలించాడు.

లోకంలో "ఉడుతభక్తి"గా సహాయం చేయండి అనే సామెత ప్రాచీన కాలం నుండి వాడుకలో వుంది. చిన్న శాకాహార జంతువు చేసిన సేవ చాలు తృప్తి కలగటానికి అని దాని అర్థం. ఉడుత సేవకు రాముడు తృప్తి పొందాడు. ఉడుతను చేతిలోనికి తీసికుని దాని అలుపును, కష్టాన్ని పొగుడుతూ వీపు మీద వ్రేళ్ళతో ఊరడించాడు, బుజ్జగించాడు. ఈనాడు ఉడుత వీపు పై ఉన్న మూడు వ్రేళ్ళ ముద్రలు రాముని వ్రేళ్ళు అంటారు. ఇటువంటి సేవాభావం అందరూ అలవరచుకోవాలని సూచన.

**రాముడు మానవసంబంధాలు మనుషులతోనేగాదు, జంతువులతోనూ స్నేహ సంబంధాలు గలవాడని తెలుస్తున్నది.**

### శుక, సారణుల గూఢచర్యం-రాముని కరుణ

రావణునికి గూఢచారులుగా వ్యవహరిస్తున్న శుకసారణులు వానరుల రూపంలో ప్రవేశించి అధికసంఖ్యగల వానరసైన్యాన్నిచూచి ఆశ్చర్యపడ్డారు. ఇంతలో మారు వేషాలలో వున్న శుక సారణులను విభీషణుడు గుర్తుపట్టి, రాముని వద్దకు తీసుకు వెళ్ళాడు. వారిద్దరూ గూఢచర్య విషయాలను రామునికి వివరించాడు.

ఈ మాటలు విన్న రాముడు నవ్వేసి "మీ కార్యం పూర్తయితే తక్షణమే రావణుని వద్దకు మీరు తిరిగి వెళ్ళవచ్చు. ఒకవేళ మీ పని పూర్తి కానట్లయితే విభీషణుని సారధ్యంలో మీ పరిశీలన కొనసాగించవచ్చు. అయితే మీరు రావణునితో "నేను నా వానరసేనతో వచ్చి లంకా నగరాన్ని నాశనం చేస్తాను.



రాక్షసులందరినీ సంహరిస్తాను' అన్న నా సందేశాన్ని అందజేయమని మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను" అన్నాడు.

ఎవరి బాధ్యతలను, విధులను వారు నిర్వహించుకోవచ్చు అని రాముడు చెప్పడంలో ఆయనకు గల నమ్మకం, ధైర్యం, చిత్తశుద్ధి అర్థం చేసుకోవచ్చు. ఏ పనికైనాఈ లక్షణాలు ప్రతిమనిషికి అవసరమని గుర్తించాలి.

కృతజ్ఞతా సూచకంగా శుకసారణులు రామునికి నమస్కారం చేసి ''మీకు విజయం కలుగుగాక'' అన్నారు. ఈసందర్భంలో రాముని మానవీయవిలువలు కొనియాడదగినవి. అంత వారిద్దరు రావణుని వద్దకు తిరిగి వెళ్ళి "మమ్మల్ని విభీషణుడు పట్టుకున్నాడు, కాని రాముడు కరుణా స్వభావుడై మమ్మల్ని విడిపించాడు. వారిసేవ మెచ్చుకోదగినది. దాని పరిధిని అంచనా వేయటం మాకు సాధ్యం కాలేదు. కాని రాముడు, లక్ష్మణుడు, సుగ్రీవుడు, విభీషణుడు, అంగదుడు తలచుకుంటే యితర వానరుల సహాయం లేకుండానే లంకా నగరాన్నిపెకలించి ఎత్తుకొని పోగలరని మీకు నిశ్చయంగా చెప్పగలం. నిజం చెప్పాలంటే రాముడొక్కడే లంకను, రాక్షసులను సర్వనాశనం చేయగలడని మాకు గట్టినమ్మకం కలిగింది. సీతను రామునికి తిరిగి అప్పగించి ఆయనతో స్నేహాన్ని చేయవలసిందిగా నీకు మా సలహా ఇస్తున్నాం" అని వారు నివేదికను వివరించారు.

ఎంతమంది, ఎంత శక్తి ఉన్నవారు నా మీద దాడి చేసినా నేను సీతను తిరిగి ఇవ్వడమనేది జరగదు. కొద్దిమంది వానరులు హింసిస్తారని చెప్పటంతో మీరు పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారు. నేనెందుకు భయపడాలి? అంటూ రావణుడు బదులు చెప్పాడు.

### సీతతో సరమ సంబంధాలు

విభీషణుని భార్య సరమ, సీతతో అనుకూల సంబంధాలు కలిగి ఉన్నది. ఆ సమయంలో సరమ ఇలా పలికింది – "నేను దగ్గరలోనే వున్న ఒక పొద

వెనుక దాగి రావణుడు చెప్పినదంతా విన్నాను. రాముడు మరణించ లేదని నీకు హామీ యివ్వగలను. నీవు చూచిన శిరస్సు ఒక రాక్షసమాంత్రికుడు మోసంతో ఏర్పాటు చేయబడినది. నిజానికి రామలక్ష్మణులు వానర సేనతో లంకకు ఇప్పటికే చేరుకున్నారు. రావణుని పై దాడికి వారు సిద్ధమైనారు.

**రావణునికి వంశపెద్దల సలహాలు**

సీతా! నేను విన్న విషయమేమిటంటే రావణుని వృద్ధ సచివులు, చాలమంది రామలక్ష్మణుల బలపరాక్రమాలను వర్ణించి, నీవు సీతను రామునికి అప్పగించవలసిందని సలహా యిచ్చారు.

రావణుని తల్లి సైతం రామునితో సంధి చేసుకోమని చెప్పింది.

రావణుని మాతామహుడైన మాల్యవంతుడు గూడ "వివేకవంతుడైన రాజు తనకంటె బలపరాక్రమాలు గల శత్రువుతో ఎన్నడూ యుద్ధం తలపెట్టడు. నీవు సీతను రామునికి అప్పగించి శాంతమైన మనస్సుతో ఉండు, అని సలహా ఇచ్చాడు. ఓ రావణా! రాముడంటే మానవాకృతిలో కనుపిస్తున్న సాక్షాత్తూ శ్రీ మహావిష్ణువేనని నాభావన. నీవు వెంటనే వెళ్ళి ఆయనకు శరణాగతుడవై రానున్న కష్టాల నుంచి నిన్ను నీవు కాపాడుకో".

రావణుని మొండివైఖరిని, మూర్ఖత్వాన్ని సరమ సీతకు వివరించింది. "వృద్ధులు, పెద్దలు, బంధువులు, తల్లి ఎందరు చెప్పినా రావణుడు వినలేదు. యుద్ధ సన్నాహాలు చేస్తున్నాడు రావణుడు" అని సరమ చెప్పింది.

**రావణుని మానసిక స్థితి**

రావణుడు పంపిన గూఢచారులు, రావణుని తల్లి, రావణుని భార్య మండోదరి, రావణుని మాతామహుడు మాల్యవంతుడు, విభీషణుని భార్య సరమ, ఇతర బంధువులు, సచివులు, శ్రేయోభిలాషులు మొదలైన వారు చెప్పిన మాటలు తిరస్కరించాడు. సీతను తిరిగి రామునికి అప్పగించటానికి



ఇష్టపడక, రామునితో యుద్ధానికి సిద్ధమైనాడు రావణుడు. **"ఎవరు చేసిన కర్మ వారనుభవించక తప్పదు"** అన్న సామెత ఇచట అక్షరాల సత్యం. అరిషడ్వర్గాలైన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు ఆరింటిలో **రావణుడు పూర్తిగా కామక్రోధాలలో మునిగిపోయాడు.**

**పరస్త్రీతో కామవాంఛ పెంచుకున్నాడు. అది తీరకపోతే కోపం పెరుగుతుంది. కామం తీరితే తృప్తి కలిగి కోపం పోతుంది. ఇచట కామం తీరలేదు, తృప్తి కలగలేదు, కోపం పెరిగింది. కామ క్రోధాలు పెరిగిన వారికి ఉచితానుచితాలు ఆలోచించరు. మంచిచెడుల విచక్షణా జ్ఞానముండదు. బంధువులు, రక్త సంబంధులు, స్నేహితులు, హితులు, సన్నిహితులు ఎవరు ఎన్ని మంచి సలహాలిచ్చినా అన్నీ 'బూడిదలో పోసిన పన్నీరు' లాంటివి!**

**"కామ క్రోధాలు నరకానికి ద్వారాలు. ఈ రెండు జంట పదాలు. ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉంటాయి. కామ క్రోధాలతో మాట్లాడే వారి విషయంలో వారి హృదయ సంస్కారం ఏమిటో తెలుస్తుంది, అని ధర్మశాస్త్రాలు బోధిస్తున్నాయి. రాజు ఎల్లప్పుడూ ధర్మశాస్త్రబద్ధంగా రాజ్యపాలన చేయాలి, ప్రజలను ధర్మబద్ధంగా నడిపించి, కన్న బిడ్డలవలె చూచుకోవాలి. ఇచట వ్యక్తి అభివృద్ధి, కోరికలు కాదు కావలసింది. రాజ్యాభివృద్ధి, ప్రజల అవసరాలు కాపాడాలి. రాజుకు మంత్రులకు, వృద్ధులకు, పెద్దలకు మధ్య సంబంధాలు సన్నగిల్లాయి. రాజులకు ప్రజలకు మధ్య మానవ సంబంధాలు కుంటుపడ్డాయి. అందరూ దూరమయ్యారు. లంకారాజ్యంలో మానవ సంబంధాలు అనే మాటకు అర్థం లేకుండాపోయింది రావణుని స్వోత్కర్ష, నింకుశత్వం ముందు ఎవ్వరూ ప్రాణభయంతో నోరుతెరవలేదు. నీతికంటే ప్రాణభీతిని కల్గించాడు రావణుడు. ఇది మానవీయ విలువలకు గొడ్డలిపెట్టు.**

సద్గుణాలకు లంకా రాజ్యాధిపతి రావణుని వద్ద వీసమంతైనా లేక పోవటం బాధాకరం. ఇది అందరికి తెలిసిన విషయం. అయినా రాజు గదా! మంచి చెప్పారు, చూచారు, జరిగేది జరుగుతుందని ఊరుకున్నారందరు. ఇదంతా రావణునిస్వయం కృతమే. స్త్రీలతో లైంగిక సంబంధం పెంచుకోవాలని ఆశ, ఆత్రుతచూపేవాడు అనర్థాల పాలవుతాడు.

రావణుని సైన్యం, వారి పరివారం, రాముని సైన్యం, వానరులు, వారి పరివారం – ఇరు పక్షాలవారు – యుద్ధ సన్నాహాలు, వ్యూహాలు, యుద్ధ తంత్రాలు సిద్ధం చేసుకున్నారు. ఇంతలో సూర్యుడు అస్తమిస్తున్నాడు. మరుసటి రోజు యుద్ధంప్రారంభం అవుతుంది. ఎవరికి ఉన్న సంబంధాలు వారికి ఉన్నాయి. అయితే ఇక్కడ ధర్మానికి దగ్గరలో ఉన్న వారికి, ధర్మానికి దూరంగా ఉన్న వారిలోనే విభేదాలు. ఈ రెండింటి మధ్యే యుద్ధం.

**అంగదరాయబారం**

రాముడు రావణునికొక సందేశాన్ని అందజేయమని అంగదుణ్ణి ఆదేశించాడు. తమ మంత్రులతో కూర్చొని ఉన్న రావణుని ముందు అంగదుడు నిలచి ఇలా అన్నాడు. నా పేరు అంగదుడు. రాజైన సుగ్రీవునికి అన్నకుమారుణ్ణి. కిష్కింధా రాజ్య సింహాసనానికి యువరాజును. రాముని దూతగా ఆయన సందేశాన్ని అందించటానికి ఇచటకు వచ్చాను.

**ఓ రాక్షసరాజా! "నీవు సంపాదించుకున్న పుణ్యమంతా ఇపుడు అంతరించి పోయినందున ఋషులమీద నీవు చేసిన అత్యాచారాలకు ప్రతిగా నిన్ను సంహరించబోతున్నాను. నీవు తక్షణమే నన్ను శరణువేడకుంటే నేను యావత్ ప్రపంచాన్ని నాశనం చేస్తాను. నీవు నాకు లొంగి పోవటమో లేక నా బాణాలచేత నిన్ను కళంక విముక్తుణ్ణి చేయటానికైనా సిద్ధంగా ఉండడమో చేయాలి. సీతను తిరిగి అప్పగించి నాముందు 'దాసో - హం' కావటానికి ఇష్టపడక పోతే లంకను తనివి తీరా ఆఖరు సారిగా తృప్తిగా కనులారా చూచుకోమని సలహా ఇస్తున్నాను" ఇది రాముని సందేశం.**



ఆగ్రహంతో రెచ్చిపోయిన రావణుడు అంగదుణ్ణి వధించమని తన మంత్రులను ఆజ్ఞాపించాడు. తన శక్తి సామర్థ్యాలతో అంగదుడు నలుగురు రాక్షసులను కూడా పైకి తీసికొని పోయి అకస్మాత్తుగా నలుగురిని గృహం మీదనుంచి క్రిందకు పడేశాడు. వారు నలుగురు క్రిందవున్న రావణుని పాదాల వద్ద నేలపై గభాలున పడ్డారు. అంగదుడు రావణుని రాజగృహగోపురాన్ని బలంగా తన్నటంతో గోపురం ముక్కలై కూలింది. రామ, లక్ష్మణులకు జయం! జయం! అంటూ వానరులంతా ముక్త కంఠంతో ఘోషిస్తుండగా ఆ శబ్దతరంగాలతో లంకా పట్టణం దద్దరిల్లింది.

**లక్ష్మణునిపై రాముని మమకారం**

రామునికి ఇంద్రజిత్తుకు జరిగిన సంగ్రామంలో రామలక్ష్మణుల నాగాస్త్రాలకు బందీలయి నేలపై ప్రాణాలలో పడి ఉన్నారు. కొద్ది సేపటికి రాముడు స్పృహలోకి వచ్చాడు. ప్రక్కన పడివున్న సోదరుని చూచి ఆవేదన చెందాడు. గద్గద స్వరంతో రాముడు "నేను సీతను తిరిగి స్వాధీనం చేసుకోవటంలో విజయం సాధించినప్పటికీ లక్ష్మణుడు మరణిస్తే నా కృషి అంతా వ్యర్థమైనట్లే! జానకి స్థానంలో వేరొక భార్యను నేను పొందటం సాధ్యపడుతుందేమో గాని, లక్ష్మణుని వంటి మరొక తమ్ముణ్ణి మాత్రం నేనెప్పటికీ పొందలేను. కాబట్టి, అతను మరణిస్తే నేను కూడా నా ప్రాణాన్ని త్యజిస్తాను. నా సమక్షంలోనే అతను మరణిస్తే ఏముఖంతో అతని తల్లి ఎదుట నేను నిలబడగలను?" అన్నాడు.

**అన్నదమ్ముల మధ్య అనురాగం, ఆప్యాయత, ప్రేముడి ఈ సందర్భంలో కొనియాడదగింది. ఒకరినొకరు వదిలి ఉండలేనివారు. వారి అన్యోన్యత సహాయ సహకారాలు, పరస్పరం ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో ఉంటాయి.**

**తల్లులు వేరైనా సొంత సోదరుల వాత్సల్యం కన్నమిన్న వారిది. లక్ష్మణుని దీన స్థితిని చూచి అన్న రాముడు పడిన బాధ, ఆవేదన హృదయంలోని వాత్సల్యం బయటికి పొంగుతోంది. రామలక్ష్మణుల అన్యోన్యత నేటికీ, ఏనాటికైనా ఆదర్శమే.**

### గరుత్మంతుని సేవ

యుద్ధసమయంలో గరుత్మంతుడు ఒక గాలిగా వచ్చి వాలాడు. అతడు శ్రీమహావిష్ణువు వాహనం. సర్ప రూపాల్లో రామ లక్ష్మణులను బంధించి ఉన్న నాగాస్త్రాలు ఆయనను చూచిన వెంటనే పారిపోయాయి. అంతట గరుత్మంతుడు వచ్చి రామలక్ష్మణుల ముఖాలను తన చేతులతో తుడిచాడు. ఆయన స్పర్శమాత్రం చేత వారి శరీరాలు ప్రకాశించ సాగాయి. వారి శక్తి సామర్థ్యాలు రెట్టింపు అయినాయి. గరుత్మంతుడు రాముణ్ణి లేవదీసి ఆలింగనం చేసుకున్నాడు. రాముడు సంతోషంతో 'మేమిద్దరం నీకు శాశ్వతంగా ఋణపడివున్నాం, మేము యోగ్యులమైనట్లయితే దయచేసి నీవెవరివో మాకు వెల్లడించు" అన్నాడు. ఏనాటి బంధమో వీరి అనుబంధం ఏనాటికీ చెరగని బంధం.

గరుత్మంతుడు బదులిస్తూ "నేను మీ నిత్య సేవకుణ్ణి. గరుత్మంతుణ్ణి. వినత పుత్రుణ్ణి. మీరు రాక్షసులతో పోరాడేటప్పుడు జాగ్రత్తగా ఉండండి. వారు జిత్తుల మారి వారని గ్రహించాలి. ఇక నేను శెలవు తీసుకుంటున్నాను. నేనువెళ్ళే ముందుగా నీకు హామీ ఇస్తున్నాను. మీరు విజయం సాధించటం, మీ ప్రియపత్ని సీతను తిరిగి పొందటం తథ్యం" అని అన్నాడు.

గరుత్మంతుడు రామునికి ప్రదక్షిణ నమస్కారాలుచేసి, మరొక సారి ఆలింగనం చేసుకున్న మీదట ఆకాశంలోకి వేగంగా దూసుకుపోయాడు.

**కష్టసమయంలో ఆదుకునే వాడే నిజమైన మిత్రుడు, హితుడు, శ్రేయో - భిలాషి. శ్రీరామచంద్రుని పూర్వపు అవతారం శ్రీ మహావిష్ణువు గదా! ఆయన వాహనం గరుత్మంతుడు. రాముడు ఆపదలో నున్నాడని తెలిసి స్వయంగా గరుడుడు వచ్చి రామునికి సేవ చేయటం ఆయన ధర్మం. ధర్మ వర్తనులకు ధర్మవేత్తలే ప్రాణమిత్రులు. రాముడు, గరుడుని సంబంధాలు కృతయుగం నుంచి ఉన్నవే. ఎక్కడ ఉన్నా, ఏమైనా బంధాలు తెగిపోనివని తెలుస్తోంది.**



### వానరుల సంబరాలు

రామలక్ష్మణులు ప్రాణంతో ఉన్నారని వానరులు హర్షాతిరేకంతో గర్జనలు చేశారు. కదన కుతూహలంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వానరుల సంబరాలను చూచి రావణుని మనసు చలించింది. అతని ముఖం రంగు మారింది.

### రావణుని స్వయంకృతాపరాధం

సింహాసనం పై కూర్చొని తన సచివులకు ఇలా విశదీకరించాడు రావణుడు. "చాలాకాలం క్రిందట బ్రహ్మదేవుని నుండి నేను వరాలు పొందిన సమయంలో నన్ను మానవుల విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిందిగా ఆయన హెచ్చరించాడు. అటు తర్వాత ఇక్ష్వాకు వంశానికి చెందిన అనరణ్యుడనే రాజు 'భవిష్యత్తులో నా వంశంలోనే ఒకడు అవతరించి నిన్ను నీబంధువులను హతమారుస్తాడు' అంటూ నన్ను శపించాడుఆపైన వేదవతిని నా వాంఛ తీర్చమని అడిగినప్పుడు ఆమె కూడా నన్ను శపించింది. నిజానికి ఆమెయే నాకు మృత్యువు కలిగించటానికై జనకమహారాజు పుత్రికగా వచ్చిందని నమ్ముతున్నాను".

మరొక సంఘటనలో "ఒకసారి నేను కైలాస పర్వతాన్ని ఎత్తినప్పుడు ఉమాదేవి భయకంపితురాలై దుష్టరాక్షసుడా! ఏదో ఒకనాడు ఒకస్త్రీ నీ మృత్యువుకు కారణమవుతుంది!" అని శపించింది. వేరొక సంఘటనలో వానరుని వంటి ముఖం కలిగిన నందీశ్వరుణ్ణి చూచి నేను నవ్వాను. "దీని

పర్యవసానంగా వానర సేన నీ వంశాన్నంతటినీ సర్వనాశనం చేస్తాయి" అని శపించాడు. ఇంతేగాక "నేను అమాయక స్త్రీలను మానభంగం చేసినందుకు గాను రంభ, బ్రహ్మదేవుడు, పుంజికస్థలి, నలకూబరుడు మొదలైన వారంతా శపించారు.**"ముందు నీవు ఏమిటో తెలుసుకో. తరువాత ఎదుటి వారిని తెలుసుకో.** అన్న శాస్త్రవచనం తెలుసుకొని ప్రవర్తించాలి.

**రావణుని మనోవేదన వల్ల అతను పూర్వ జన్మలో చేసిన పాపకార్యాల ఫలితమే ఇప్పుడు శాపరూపంలో చెడు ఫలితాలు కలుగుతున్నాయి. నేను, నా కుటుంబం, నా వంశం, నా రాజ్యం అంతా సర్వనాశనం కాగల - సమయం ఆసన్నమైనదని, స్వయంకృతాపరాధమని చింతిస్తున్నాడు. ఇపుడు చింతించి ఏమి ప్రయోజనం? మనకు తెలుగులో ఒక సామెత వుంది - *"చేతులు కాలినతర్వాత ఆకులు పట్టుకొని ఏమిలాభం?"* అన్న చందంగా ఉంది రావణుని ఆలోచన.**

**రావణుని ఆత్మపరిశీలన**

కుంభకర్ణుడు మరణించిన వార్త విన్న రావణుడు "కుంభకర్ణుడు లేనిదే ఇక జీవితానికి అర్థం లేదు కనుక, నేనింక జీవితం సాగించలేను. విభీషణుని మంచిమాటలు, సలహా వినిపించుకోకుండా ఎంత తప్పు చేశాను" అని దుఃఖించాడు. ధర్మమార్గంలో నడిచే వారిని, మంచి సలహానిచ్చే వారిని, శ్రేయో - భిలాషిని అందరూ ఎల్లప్పుడూ గుర్తుచేసుకుంటారు. వారి మంచి మాటలు వినక బాధ పడుతూంటారు. ఆ కోవకు చెందిన వాడే రావణుడు. తమ్ముడు విభీషణుని సలహాను పదే పదే గుర్తు తెచ్చుకుని తనలో తను బాధ పడుతూంటాడు.

అతికాయుని మరణ వార్త వినగానే రావణుడు తన మనసులో "రామలక్ష్మణులు నేను ఊహించలేనంత శక్తిమంతులు. నా అత్యుత్తమ యోధులను వధించివేశారు. **రాముడంటే మానవ రూపంలో అవతరించిన**



**శ్రీమన్నారాయణుడేనని ఇప్పుడు అర్థం చేసుకోగలుగుతున్నాను.**ఈ వాస్తవం ముందే చూచాయగా తెలిసినప్పటికీ అదేదో పిరికి పందలు, ఉన్మాదులు చెప్పే మాటలుగా భావించాను. రాముడిని ఓడించగల యోధుడెవరు? అని ఆలోచించాడు.

**ఓషధి సేవ**

జాంబవంతుడు హిమాలయాలలో ఋషభపర్వతం కైలాస పర్వతాలకు మధ్యలో ఓషధులతో ప్రకాశించే పర్వత మొకటి ఉంది. ఆ ఓషధి మొక్కలు నాలుగింటిని తీసుకుని వస్తే ఆ ఓషధి వాసనకు రామలక్ష్మణులు, వానరులు స్పృహ నుంచి బయట పడతారు. గాయాలు గూడ నయమౌతాయి, అని చెప్పాడు. ఈ పనికి విజయం కలగటానికి హనుమంతుడే సమర్థుడు. కాబట్టి హనుమా! నీవు ఆ పర్వతాన్ని గుర్తించి ఓషధులు తీసుకొనిరా! అని ఆదేశించాడు.

వాయువేగంతో ఆకాశంలోకి ఎగిరాడు హనుమంతుడు. హిమాలయాలకు చేరాడు. కావలసిన ఓషధులకోసం హనుమ ఆ పర్వతమంతా వెదకి ఓషధులు గుర్తించలేక ఆ పర్వత అగ్రభాగాన్ని త్రుంచి ఆకాశంలోకి 1000 యోజనాలు ఎగిరి లంకకు చేరాడు. ఆ ఓషధులు జాంబవంతుడే గుర్తిస్తాడని అతని యూహ.

వెంటనే జాంబవంతుడు ఆ ఓషధులను రామలక్ష్మణుల ముక్కులవద్ద ఉంచి వాసన పీల్చేట్లుచేయగా వారిరువురు స్పృహనుంచి తేరుకొన్నారు. గాయాలు నయమైనాయి. ఆ విధంగా మిగతా వానరులకు ఓషధ సేవచేసి ప్రాణం పోశారు. హనుమంతుని నిస్వార్థసేవకు అందరూ హర్షించారు.

**ఇంద్రజిత్తు యుద్ధప్రవేశం**

యజ్ఞవాటికకు ఇంద్రజిత్తు వచ్చి లక్ష్మణుని, హనుమంతుణ్ణి,విభీషణుని చూచాడు. ఒకరినొకరు యుద్ధానికి సవాలు విసురు కున్నారు. ఇంద్రజిత్తు

విభీషణునితో "నాకు హాని తల పెట్టటానికి నా సొంత పినతండ్రి ఇక్కడకు రావటమా? నేను నీ అన్నకు ఇష్టమైన కుమారుణ్ణి. నీకుటుంబ సభ్యుల పట్ల ప్రేమానురాగాలు లేవా? నీవు కూడ రాక్షస వంశంలో జన్మించావు. నీ పుట్టుకకు నీవు గర్వించటం లేదా? బుద్ధిలేని మూర్ఖుడా! నీ సన్నిహిత బంధువులను ఎలా మోసగిస్తున్నావో అర్థం కావటం లేదా? బంధువుల్లో ఎంతటి అధముడైనా బయటి మనుషులకంటే ఎల్లప్పుడు మేలనిపిస్తాడు. నీవు ఒక్కడివి మాత్రమే చెడుబుద్ధితో వ్యవహరించగలిగావు! అంటూ ఇంద్రజిత్తు దూషించాడు.

'విభీషణుడు సమాధానమిస్తూ "ఇంద్రజిత్తా! నీకు నిజంగా ధర్మానురక్తి ఉన్నట్లయితే నీకంటే పెద్దవాడినైన నన్ను ఎందుకు దూషిస్తావు? నేను రాక్షసవంశంలో జన్మించిన మాట వాస్తవమే. కాని నా స్వభావం పూర్తిగా భిన్నమైనది. నేను మొరటుతనాన్ని, క్రూరత్వాన్ని ద్వేషిస్తాను. మనవంశంలో కట్టుబాటు తప్పిన వాడు నీ తండ్రియే గాని, నేను కాదు. కుటుంబపరమైన బంధుత్వం ఉన్నప్పటికీ పాపాత్ములైన మనుషులతో అన్ని సంబంధాలను తెగ త్రెంచుకోవటమే కర్తవ్యమని ధర్మశాస్త్రాలుఆదేశిస్తున్నాయి. పర భార్యను అపహరించే వాడు అధమాధముడు. వేద సూత్రాలను అవమానించినవాడు. అలాంటి వాళ్ళను దేహానికి చుట్టుకున్న సర్పాన్ని విసిరి వేసినట్లు విసిరి వేయాలి.

**"ఇంద్రజిత్తా! మిత్రులను విశ్వసించక పోవటం, పరస్త్రీతో శారీరక సంబంధం పెట్టుకోవడం, పరుల ఆస్థిని అపహరించడం ఎప్పుడూ వినాశానికే దారితీస్తాయి. రావణునికి పోయే కాలం దాపురించింది. నీవూ, లంకానగరం సర్వనాశనం కావటం తప్పదు. నీవు కొద్దిసేపట్లోనే లక్ష్మణుని బాణాలచే ప్రాణాలు వదులుతావు"** అన్నాడు విభీషణుడు. సత్సంబంధాలు, ధార్మిక సంబంధాలున్నవారు దుష్టసంబంధాలను సహించలేరని ఈ సన్నివేశం చెబుతున్నది.



**కుటుంబసంబంధాలు ధర్మానికి కట్టుబడి వుండాలని, నీతి నియమాలకు ఆలయంగా ఉండాలని, నేర సూత్రాలకు నిశితంగా పరిశీలించి నడుచుకోవాలని, రాజు ప్రజల క్షేమం కోరి పరిపాలన చేయాలని, సత్సంబంధాలను పెంచుకోవాలని విభీషణుడు ఇంద్రజిత్తుకు ఇచ్చిన సందేశంలోని అంతరార్థం.**

భీకరపోరాట సమయంలో లక్ష్మణుడు దేవేంద్రుడిచ్చిన బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించగా ఇంద్రజిత్తు శిరస్సు ఛేదించి వేసింది. లక్ష్మణుణ్ణి వానరులు అభినందించారు.

### రావణునికి మంత్రి సలహా

రావణునికి ఎందరో పెద్దలు, శ్రేయోభిలాషులు సలహా ఇచ్చారు. దుఃఖసాగరంలో ఉన్న సీతను చూచి హృదయం కలత చెంది మంత్రి సుపార్శ్వుడు రావణునితో "ఓ ప్రభూ! నీవు సకల వేదాలను అధ్యయనం చేశావు. కఠిన తరమైన వ్రతాలను పాటించావు. అలాంటి నీవు ఈ విధంగా ఒకస్త్రీకి హాని చేయాలని ఎలా ఆలోచించగలుగుతున్నావు? సౌందర్యవతి సీతను అలాగే ఉండనీ. అందుకు బదులుగా నీ క్రోధాన్ని యథార్థమైన శత్రువు మీద వెళ్ళగ్రక్కు. రాముణ్ణి వధించిన తరువాత నీవు సీతను తనివితీరా అనుభవించగలుగుతావని నాకు గట్టి నమ్మకముంది. నీ హృదయంలో ఎప్పటి నుంచో దాగివున్న స్త్రీ వాంఛను ఈవిధంగా తీరుతుంది అని సలహా ఇచ్చాడు.

స్త్రీ హత్య మహాపాపం, అందులో సాక్షాత్తు లక్ష్మీదేవి అవతారమే సీత. స్త్రీహత్య నివారించటానికే సుపార్శ్వుడు రావణుని మనసును మరొక వైపుకు మళ్ళించి నిరోధించగలిగాడు. సుపార్శ్వుని హృదయంలో రెండు ప్రశ్నలు రెండు సమాధానాలున్నాయని చెప్పక తప్పదు. రావణుని గెలుపు అసాధ్యమని మంత్రికి తెలుసు. ఎందుకంటే, తమ్ములు, పుత్రులు, ఇతర బంధువులు,

రాక్షస వీరులు అందరూ మరణించారు. రావణునికి సహాయంగా యోధులు లేరు. ఒక్కడే రావణుడు మిగిలాడు. చివరి నిమిషంలో ధర్మబోధ, ఎవరికి నచ్చుతుంది. అందులో రావణుని మనసెరిగిన వాడు మంత్రి. అందుచేత స్త్రీహత్యకన్నా యుద్ధంలో వీరమరణం శ్రేష్ఠమని పరోక్ష సలహా ఇచ్చాడు. రావణుని మనస్తత్వాన్ని తెలుసుకుని ఉచిత సలహా ఇవ్వటం విజ్ఞుల లక్షణం అని గమనించాలి. కనుక ఎవరైనా ఉచితానుచితాలను ఆలోచించి నిర్ణయాలను తీసుకోవాలి. రామరావణయుద్ధం నివారించటానికి వారిమధ్య సత్సంబంధాలు కలిగించాలని మంత్రి ప్రయత్నం సంతోషింపదగినది.

**రామ రావణ యుద్ధం**

ఇంక మిగిలింది రావణుడొక్కడే. మరణమో, వీర స్వర్గమో తెలుసుకుందామనుకున్నాడు. రావణుడు, యుద్ధరంగ ప్రవేశం చేసి రుద్రాస్త్రంతో రాముని పై దాడి చేశాడు. రాముడు ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించి రావణుని బాణాలు నిరోధించగలిగాడు. రావణుడు రుద్రాస్త్రాన్ని ప్రయోగించగా, రాముడు గాంధర్వాస్త్రంతో దానిని నిరోధించాడు. రామలక్ష్మణులు రావణుని రథసారథి శిరస్సు ఛేదించారు. రావణుని రథాన్ని ధ్వంసం చేశారు. మరో అయిదు అస్త్రాలతో రాక్షసరాజు ధనుస్సును ఖండించారు.

**రావణుడి పై రాముని విసుర్లు**

నిరసనగా నవ్వుతూ రావణునితో "నీవు నరభక్షకుల్లో అధమునికంటే అధముడివి. ఓ సీతాపహారీ! నిన్ను నీవు ఒక మహావీరునిగా భావించు కుంటున్నందుకు మూర్ఖాగ్రేసరచక్రవర్తివని చెప్పాలి. నన్ను మోసంతో ప్రలోభ పెట్టి దూరంగా తీసుకుని పోయిన మీదట నా భార్యను అపహరించడానికి సాహసించావు. ఇది పరమ పిరికివాళ్ళు చేసే కార్యం. నీవు అంతటి పరమ పిరికివాడివి. తన భర్తలేని సమయంలో రక్షణ లేని ఒక స్త్రీని అపహరించినందుకు ఎలా గర్వించగలవు. గృహస్థు లేని సమయంలో



శునకం అతని వంట గదిలోకి ప్రవేశించి తినుబండారాలను దొంగిలిస్తుంది. అదే విధంగా నేను లేని సమయంలో నా భార్యయైన సీతను అపహరించుకొని వెళ్ళిన నీవు శునకాన్ని పోలిన వాడివి. పాపాత్ములను యమధర్మరాజు శిక్షించిన విధంగానే నేను నిన్ను శిక్షిస్తాను. నీవు అత్యంత నీచుడవు, పాపాత్ముడవు, సిగ్గు మాలిన వాడివి. రావణా! నీకు సరియైన అంత్యకాలం నేడే కలుగుతుంది. నీవు ఎంతగానో అభిమానించే శరీరం నక్కలకు, రాబందులకు ఆహార మవుతుంది "అంటూ రాముడు నిందించాడు.

**అగస్త్యఋషి రాముడికి మంత్రోపదేశం**

రావణుడు లేని సమయంలో అగస్త్య ఋషి రాముని వద్దకు వచ్చాడు. ప్రియమైన రామచంద్రా! సూర్యభగవానునికి ప్రీతి కలిగించటానికి ఆదిత్యహృదయమంత్రం దయచేసి నానుండి స్వీకరించు. ఆ మంత్రం ఇదే.

**"ఓ సూర్యభగవానుడా! నీకు నా ప్రణామాలు సమర్పిస్తున్నాను. సకల విశ్వాన్ని నిలిపి ఉంచే నీ అపరిమితమైన వెలుగు కారణంగా నీవు దేవతల్లో ప్రధానమైన వాడివి. వాస్తవానికి దేవతలు, దానవులు, కూడా చివరి కోరిక నిమిత్తమై నిన్ను పూజిస్తుంటారు. సకల జీవుల ప్రాణాధారానివి. నీవు *సాక్షాత్తు శ్రీమహావిష్ణువు ప్రతినిధిగా విరాజిల్లుతున్నావు. అందువల్లనే వేదవేత్తలైనవారు అనునిత్యం ముమ్మారు సముచితమైన ప్రార్థనలు చేస్తున్నాను. నిన్ను సూర్యునిలో దాగియున్న శ్రీమన్నారాయణునిగా ఆరాధిస్తున్నారు.* అందువల్ల నీకు వినమ్రుడనై నమస్కరిస్తున్నాను. పరమాత్మునికి నేత్రమై జగత్తు క్రియాకలాపాలకు సాక్షిభూతుడవైన ఓ అమిత తేజస్వీ! నీకు మరల సహస్ర ప్రణామాలు సమర్పిస్తున్నాను". అని ఆదిత్య హృదయ మంత్రాన్ని ఉపదేశించాడు.**

ఉపదేశాన్ని ముగిస్తూ అగస్త్య ఋషి "రామచంద్రా! సూర్యభగవానుణ్ణి ఆరాధిస్తూ ఈ మంత్రాన్ని పఠించావంటే, నీవు శత్రువును నిశ్చయంగా

జయించ గలుగుతావు. కష్టాల్లో ఏ వ్యక్తి అయినా సూర్యుణ్ణి ఆరాధిస్తే అతను ఎప్పుడూ దుఃఖాన్ని పొందడు." అని చెప్పి అగస్త్యుడు వెళ్ళాడు. వెంటనే రాముడు సూర్యుని పై దృష్టి నిలిపి ఆదిత్య హృదయ ప్రార్థన చేసి మహత్తర దివ్యానందాన్ని అనుభూతిని పొందాడు.

**వాల్మీకి మహర్షి ఈ సందర్భంలో అగస్త్యుడు ఉపదేశించిన ఆదిత్య హృదయస్తోత్ర మహిమను తాను రచించిన రామాయణ మహాకావ్యం ద్వారా ప్రజలకు మంచి సందేశాన్నిచ్చాడు.**

**రామునికి సానుకూల స్పందన**

రాముడు తిరిగి ధనుస్సు అందుకుని రావణుని వైపు సాగుతుండగా ఆకాశం నుంచి సూర్యుడు "ఆలసించవద్దు! త్వరగా కదులు! అంటూ ఉత్తేజపరిచాడు. వెంటనే "మాతలీ! రథాన్ని శీఘ్రమే రావణుడున్న చోటుకు పోనివ్వు, అయితే చాలా జాగ్రత్తగా ఉండాలి సుమా! అని ఆదేశించాడు. అతను చాల త్వరగా రథాన్ని రావణుని ప్రక్కకు తీసుకువచ్చాడు. రామరావణులు ఒకరి పై ఒకరు బాణాలను ప్రయోగించుకోగా యుద్ధం మరల తీవ్రరూపం దాల్చింది. రామ రావణ పరస్పర పోరాటంలో విడుపు అనేది లేకుండా ఎన్నో పగళ్ళు, రాత్రులు గడిచిపోయాయి.

**రావణుని వధ**

సముచితమైన మంత్రాలతో అభిమంత్రించి రాముడు ప్రచండమైన బ్రహ్మాస్త్రాన్ని తన వింటి నారిపై సంధించాడు. ప్రజ్వలిస్తున్న ఆ అస్త్రాన్ని వీక్షిస్తూ వానరులు ఆనందోత్సాహాలతో కేకలు వేస్తూ ఉన్నారు. రాక్షసుల హృదయంలో భయం కంపిస్తోంది. ముఖాలలో విషాదచ్ఛాయలు చుట్టుముట్టాయి.

రాముడు వింటి నారిని చెవిదాక లాగిన వెంటనే భూమి కంపించింది. లోకాలు గతులు తప్పుతున్నట్లు అనిపించింది. చివరకు రాముడు



బ్రహ్మాస్త్రాన్ని వదలగానే అది మృత్యుదేవత వలె రాక్షసరాజు యొక్క వక్షః స్థలాన్ని తాకింది. వజ్రాయుధం వలె రావణుని హృదయాన్ని చీల్చుకుంటూ పోయి ఆ అస్త్రం రావణుని పాపభూయిష్ఠమైన జీవితాన్ని వెంట తీసుకొని పోతూ భూమి లోపలకి ప్రవేశించింది. ఆ పైన అద్భుతమై బ్రహ్మాస్త్రం తిరిగి వచ్చి రాముని తూణీరంలో చేరింది. రావణుడు రక్తం కక్కుతూ మరణించాడు.

**ఆనందోత్సాహాలు**

రావణుని మరణ వార్త తెలిసిన వెంటనే వానరయోధులు రాముని ఘనవిజయాన్ని ఎలుగెత్తి కీర్తిస్తూ పారిపోతున్న రాక్షససేనను తరిమికొట్టారు. ఆకాశంనుండి దేవతలు "భళారే! అత్యద్భుతం అంటూ నినాదాలు చేస్తూ రాముని రథాన్ని పుష్ప వర్షంతో కప్పివేసి దివ్య దుందుభులు మ్రోగించారు.

రావణుడు మరణించటంతో ఋషులు దేవతలు అంతవరకు చాలా కాలంనుంచి తాము అనుభవించలేక పోయిన ధన్యమైన నిశ్చింతను, మనశ్శాంతిని పొందారు.

ప్రకృతి గూడ ఆనందించి చల్లని హాయిని గొలిపే మెల్లని సువాసనల గాలి వీచసాగింది. సూర్యుడు ప్రశాంతంగా తన కిరణాలను వెదజల్లాడు. అన్ని దిక్కులయందు సుఖశాంతులు వ్యాపించినట్లయింది. ఆకాశం కలవరపాటు లేకుండా నిర్మలంగా వుంది. శుభశకునాలు ప్రస్ఫుటంగా కనుపిస్తున్నాయి.

ముందుగా సుగ్రీవుడు, అంగదుడు, విభీషణుడు, లక్ష్మణుడు వచ్చి రామునికి చేతులు జోడించి నమస్కరించారు.

**విభీషణునితో రాముని ధర్మోపదేశం**

రాముడు విభీషణునితో "ఇంకా ఆలస్యం లేకుండానే సోదరుని దేహానికి అగ్ని సంస్కారం ప్రారంభించు" అని ఆదేశించాడు. అందుకు విభీషణుడు

బదులిస్తూ "పరస్త్రీలను అపహరించినవాడు, నిర్దాక్షిణ్య స్వభావుడు, క్రూరుడు, అధర్మవర్తనుడు అయిన వ్యక్తికి అంతిమ సంస్కారాలు చేయటానికి నా మనసు అంగీకరించటం లేదు. వెంటనే రాముడు "విభీషణా! నీ మాటలు ధర్మశీలతను నిలిపేవి కనుక వాటిని ఆమోదిస్తున్నాను. అయినప్పటికీ నీ సోదరుని దేహానికి నీవు దహన సంస్కారం చేయగోరుతాను. అతని దోషాలు, తప్పులు ఎటువంటివైనా శత్రుత్వాలన్నీ మరణంతో అంతమై పోయాయి అన్నాడు. అంతట విభీషణుడు రావణుని అంత్య క్రియలు పూర్తిచేశాడు. పుత్రులు లేనివారికి సోదరుడే దహన సంస్కారాలకు అర్హుడు. ఈ కార్యక్రమం నిర్వహించడం సోదరుడుగా నీ ధర్మం. నీవు ధర్మవేత్తవు. ధర్మాన్ని ఆచరించాలి అని మంచి సందేశాన్నిచ్చాడు రాముడు.

యుద్ధం పరిసమాప్తి కావటంతో దేవతలు ఆకాశం నుండి తమ స్వస్థానాలకు తిరిగి వెళ్ళారు. వెళ్లేటప్పుడు వారు అమిత సంతృప్తితో శ్రీరాముని మహిమలను గానం చేశారు. శ్రీరామునికి, దేవతలకు ఉన్న సత్సంబంధాలు పూర్వజన్మ నుంచీ కొనసాగుతున్నాయి.

అన్ని కార్యక్రమాలు ముగించి శిబిరానికి వచ్చిన రాముడు లక్ష్మణుణ్ణి పిలిచి "విభీషణునికి పట్టాభిషేక మహోత్సవం జరిపించ వలసిందిగా" ఆదేశించాడు. లక్ష్మణుడు నాలుగు సముద్రాల జలాలను తెప్పించి, వైదిక ధర్మశాస్త్రాల అనుగుణంగా పట్టాభిషేకమహోత్సవం జరిపించాడు. శ్రీరాముని నాయకత్వంలో లంకలో ధర్మరాజ్యస్థాపనజరగటం ప్రజలంతా ఆనందించారు. లంకానగర ప్రజలకు విభీషణునికి మానవసంబంధాలు పటిష్ఠతకు అంకురార్పణ జరిగింది.

వెంటనే రాముడు హనుమంతునితో 'దయచేసి వెళ్ళి సీత ఎలా ఉందో విచారించు. నేను రావణుని వధించానని ఆమెకు తెలియచేసి ఆమె నాకోసం ఏదైనా సందేశమిస్తే తీసుకుని తిరిగిరా' అని చెప్పాడు.



లంకకు వెళ్ళి వినయ పూర్వకంగా సీత ఎదుట నిలబడి హనుమంతుడు "అమ్మా! నీ భర్త నీకు ఈ సందేశాన్ని అందచేయమని నన్ను పంపించాడు. ఏమంటే 'నిద్రలేకుండా ఎన్నో మాసాలు గడిపిన మీదట నిన్ను విముక్తి చేస్తానన్న నా శపథాన్ని నేను నెరవేర్చాను. నీకు ఘోర అపకారం చేసిన దుర్మార్గుడైన రావణుడు ఇప్పుడు మరణించాడు. రావణుని మరణ వార్తను, రాముని క్షేమవార్తను విని సీత అమితానందంతో వివశురాలై కొంత సమయం ఏమి మాట్లాడలేక పోయింది. సమాధానం రాలేదేమని అడుగగా ఆమె "నేను సంతోషాతిశయం వల్ల మాట్లాడలేక పోతున్నాను. హనుమంతా! స్వర్ణం కన్నా, రత్న రాసులకన్నా నీవిప్పుడు చెప్పిన వార్తలు అపరిమితంగా ఎంతో విలువైనవి" అని సీత అన్నది.

## సీత దయార్ద్ర హృదయం

ముకుళిత హస్తాలతో హనుమంతుడు "అమ్మా! నీవు కోరినట్లయితే నిన్ను ఇంతకాలంగా హింసించిన ఈ రాక్షస స్త్రీలందరిని నేను వధించగలను. నీవు పడిన బాధలు, కష్టాలన్నిటికీ ప్రతీకారం చేయటం నాకు అమితానందాన్ని కలిగిస్తుంది. నీ అనుమతి కోసం మాత్రమే నేను నిరీక్షిస్తున్నాను" అని చెప్పాడు. దయార్ద్ర హృదయురాలైన సీతామాత సమాధానమిస్తూ "వీరంతా తమ రాజు యొక్క ఆదేశాలను అమలు చేయక తప్పదు గదా! వీరి తప్పేముంది. నేను పడిన బాధలన్నీ నా పూర్వజన్మల కృత ఫలితమే. ఈ రాక్షస స్త్రీలు విధిచేతిలోని సాధనాలుగా మాత్రమే పనిచేశారు. ఓ హనుమంతా! 'మహాపురుషుడైన వాడు తన పట్ల ఇతరులు చేసిన అపచారాలను ఎన్నటికీ పరిగణనలోనికి తీసుకోరు. నిజానికి ఎట్టి పరిస్థితుల్లోను అపకారికి ప్రతి అపకారం చేయరాదనే సూత్రానికి బద్ధురాలినైవున్నాను అన్నది సీత.

**సీతారాముల హృదయాలు మానవతకు నిండుగా, ఒకే విధంగా స్పందించటం శుభకరమే. రాక్షస స్త్రీలవిషయంలో గూడ ఆమె కరుణతోనే**

**ప్రవర్తించింది. మానవసంబంధాలు మానవీయ విలువలతోనే వికసించాలని వాల్మీకి సందేశం.**

### సీతారాముల కలయిక

రామునికేదయినా సందేశం ఇస్తావా? అని హనుమంతుడు సీతను అడిగాడు. నేను చెప్పేది ఇదొక్కటే. తన అనన్య భక్తుల పట్ల ఎల్లప్పుడూ అనురాగాన్ని కురిపించే ప్రియమైన నాథుని దర్శించటానికి నేను ఉవ్విళ్ళూరుతున్నాను" అని సీత బదులు పలికింది. "రామ లక్ష్మణులను ఈ రోజే నీవు చూడటం తథ్యమని నమ్ము. దయచేసి ఈ సందేశాన్ని ఆలస్యం లేకుండా రామునికి అందచేయటానికి అనుమతి ఇవ్వు, అన్నాడు హనుమంతుడు. హనుమంతుడు రాముని వద్దకు తిరిగి వచ్చి సీతామాత సందేశాన్ని వివరించాడు" నిన్ను చూడాలని నిరంతరం తపించిపోతున్న సీత ఎన్నో కష్టాలను భరించింది. కనుక దయచేసి తక్షణమే అశోకవనానికి వెళ్ళు అంటూ సీతను కలుసుకోమని హనుమంతుడు రామునికి గట్టిగా చెప్పాడు. ఈ విజ్ఞప్తి వినగానే శ్రీరామచంద్రుని కళ్ళనుండి నీళ్ళు జాలువారాయి. సందేశాలను అందించటంలో హనుమంతుడు రాయబారిపాత్రను నైపుణ్యంతో నిర్వహించి మంచిసందేశకుడుగా పేరు పొందాడు.

అంతట రాముడు విభీషణునితో "సీత స్నానం చేసి కొత్త వస్త్రాలు ధరించిన మీదట నా ఎదుటకు తీసుకుని రావలసింది" అని ఆదేశించాడు. రాముడు చెప్పిన ప్రకారంగా సీతను పల్లకిలో రాముని ఎదుటకు తీసుకుని వచ్చారు.

### సీత ఆనందోత్సాహాలు

సీత తనలోకి తాను ఒదిగినట్లుగా అమితమైన సిగ్గుతో రాముణ్ణి సమీపించింది. అంతట తను హృదయంలో దాచుకున్న ప్రియమైన



భర్తరూపాన్ని, మోమును చూచిన వెంటనే ఆమె మానసిక, శారీరక బాధలన్నీ కనుమరుగైనాయి. ఆమె సహజ సౌందర్యమైన తేజస్సు తిరిగి వచ్చింది. తన ప్రియనాథుణ్ణి కనులారా చూడగలిగింది. ఆమె ఆనందంతో ఉప్పొంగి పోయింది. పద్మాన్ని బోలిన ఆమె వదనంలో ఆ ఆనందం వ్యక్తమైంది.

### సీతారాముల సమాగమం

ప్రజలు ఏ అపనిందలు వేస్తారోననే భయం రాముని హృదయాన్ని పీడిస్తోంది. అందువల్ల సీతనుద్దేశించి రాముడు ఆగ్రహంతో "నిన్ను తిరిగి గెలుచుకుంటాననే శపథం నెరవేర్చాను. అయితే రావణుణ్ణి సంహరించటానికై నేను చేసిన మహా కృషి వాస్తవంగా నీ కోసం కాదని, నా పరువు, ప్రతిష్ఠలను, ఇక్ష్వాకువంశపు కీర్తిని నిలపటం కోసమేనని నీవు అర్థం చేసుకోవాలి. సత్యం చెప్పాలంటే నీవు నా ముందు నిలబడటం ఏమంత మంచిది కాదు. అందువల్ల నీవు కోరుకున్న ప్రదేశానికి ఎక్కడికైనా సరే నీవు వెళ్ళటానికి నేను అనుమతినిస్తున్నాను.

రాముని మాటలు విన్నంతనే సీత వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి. ఆమె శిరస్సు అవమాన భారంతో వాలిపోయింది. ఇప్పుడు రాముడు పలికిన మాటలు సూదుల్లా ఆమె హృదయంలో నాటుకుపోయాయి. ఆమె పెద్దగా విలపించసాగింది. అనేకమంది ప్రజల సాక్షుల ముందు తాను నిలబడి ఉన్నందున తన భర్త నిందారోపణలను భరించటం ఆమెకు కష్టంగా ఉంది.

వెంటనే లక్ష్మణుని వంక చూచి "నన్ను నేను అగ్నిసాక్షిగా సమస్త ప్రజల ముందు పవిత్రురాలిగా నిరూపించుకుంటాను. నేను ఏ పాపం ఎరుగనప్పుడు పంచభూతాలకు, ప్రజలకు, మహర్షులకు, దేవతలకు భయపడవలసిన అవసరం లేదు. నీవు త్వరగా అగ్నిజ్వాలను రాజేయి.

### సీత అగ్నిప్రవేశం

ముందుగా సీత రామునికి ప్రదక్షిణ నమస్కారాలు చేసింది. తరువాత బ్రాహ్మణులకు, దేవతలకు నమస్కారాలు చేసింది. అగ్నిదేవుణ్ణి ఇలా

ప్రార్థించింది. "ఓ అగ్ని దేవా! నా హృదయం రాముని నుండి ఎన్నడూ దూరంగా ఉండనందున దయచేసి నాకు రక్షణ కల్పించు. నేను మనసా, వాచా, కర్మణా రామునికి ఎన్నడూ ద్రోహం చేయలేదు. నేను దోషంకల దానినైనానని ఆయన నాపై నిందారోపణ చేస్తున్నాడు. అందువల్ల మూడులోకాల్లో జరిగే కర్మలన్నిటికీ సాక్షిభూతుడవైన ఓ అగ్నిదేవా! నా పవిత్రతకు నీవు సాక్షిగా నిలబడవలసిందిగా నిన్ను ప్రార్థిస్తున్నాను".

సీత అగ్నికి ప్రదక్షిణ చేసింది. మహాజనసమూహం సంభ్రమాశ్చర్యాలతో చూస్తుండగా నిర్భయమైన మనస్సుతో సీత అగ్ని జ్వాలలో ప్రవేశించింది. ఆ సమయంలో సీతా మాత అద్భుతమైన సువర్ణతేజస్సుతో ప్రకాశించింది. రాముడు ఆలోచనలో వున్నాడు. అంతట దేవతా ముఖ్యులు, బ్రహ్మదేవుడు, పరమశివుల నేతృత్వంలో ఆయన ఎదుట ప్రత్యక్షమైనారు. దేవతలంతా ముకుళిత హస్తాలతో రామునితో "ఓ దేవాదిదేవా! శ్రీరామచంద్రా! నీవు సీతా మాతను నిర్లక్ష్యం చేసిన విధం మాకు చాల బాధ కలిగించింది. నీవు ఈ విశ్వాన్ని సృష్టించిన వాడవు. సకల దేవతలకు అధీశుడవు. నీవు నీ దివ్యత్వాన్ని పరిగణించక ఒక సాధారణ మానవునిగా సీతను తిరస్కరిస్తావేమి? అన్నారు.

**బ్రహ్మదేవుడు ప్రియమైన శ్రీరామా! నీవు సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడవు. అందువల్ల నారాయణుని అన్ని రూపాలు నీవే అయి ఉన్నావు. దేవతలంతా నీలోని అంగాలే. నీ శాశ్వత సేవకులే. అదీగాక సీత సాక్షాత్తు జగన్మాత శ్రీమహాలక్ష్మియే తప్ప వేరుకాదు. రావణుని నాశనం చేయటానికై మీరిద్దరు భూలోకంలో అవతరించారు. ఈ మహాకార్యం విజయవంతమైనందున ఓ దేవా! నీవు కోరినంత కాలం భూమండలాన్ని పరిపాలించిన మీదట ఆధ్యాత్మిక లోకంలో ఉన్న నీ దివ్యధామానికి తిరిగి నీవు చేరుకోవచ్చు," అని వివరించాడు.**



బ్రహ్మదేవుని సందేశం పూర్తి చేయగానే అగ్ని జ్వాలల్లో నుంచి సీతతో సహా అగ్నిదేవుడు ప్రవేశించాడు. అగ్నిదేవుడు సీతను రాముని ముందు నిలబెట్టాడు. ఆమె శరీరంగాని, ప్రకాశించే అరుణ వస్త్రాలుగాని, ఆభరణాలు గాని, శిరోజాలు గాని ఏ కొంచమైనా దహించిన గుర్తులు లేకపోవటం ప్రతి ఒక్కరూ ఆశ్చర్యంతో చూడగలిగారు.

ప్రపంచానికంతటికి సాక్షిగా నిలబడి అగ్నిదేవుడు **"రామా! నీ ప్రియ సతి సీత ఇదిగో. ఈమె ఏ కొంచం మాత్రమైన దోషం లేనిది. మనసులో, వాక్కులో, దృష్టిలో గాని ఆమె నీ కెన్నడూ కొంచెమైనా ద్రోహం చేయలేదు.** ఇక కర్మల విషయం వేరే చెప్పాలా! అందువల్ల ప్రియమైన రామా! నీ కఠినవాక్కులను, ప్రవర్తనను విడనాడి ఎటువంటి అనుమానం లేకుండా సీతను నీవు స్వీకరించి తీరాలి" అని ప్రకటించాడు. అగ్నిదేవుని సాక్ష్యం విని రాముడు సంతోషించి అంగీకరించాడు.

### శ్రీరాముని సమాధానం

ఆనందాశ్రువుల మధ్య "ఓ అగ్నిదేవా! సీత దోషంలేనిదని, పవిత్రురాలని ప్రజలకు విశదపరచుటకు, వారికి విశ్వాసం కలిగించుటకు నేను ఈ అగ్ని పరీక్ష చేయవలసివచ్చింది. ఆమెకు అగ్ని పరీక్ష చేయకుండా నిరోధించి ఉంటే ప్రజలు నన్ను విమర్శించివుండే వారు. నేను కేవలం కామ ప్రేరేపితుడనైనట్లు భావించేవారు. తన ధర్మశక్తి చేత ఆమె సర్వదా సంపూర్ణంగా సంరక్షితురాలై వుంది. ప్రపంచానికి సీత పాతివ్రత్యాన్ని తెలియటం కోసమే ఆమెను నిర్లక్ష్యం చేస్తున్నట్లు కనుపించాను" అని వివరణ ఇచ్చాడు రాముడు.

సీతతో తిరిగి సమావేశమైనందుకు రాముడు అనిర్వచనీయమైన ఆనందాన్ని పొందాడు. అంతట పరమశివుడు ఆలింగనం చేసుకుని "ప్రభూ! అసమాన బలపరాక్రమాలు గల రావణుణ్ణి సంహరించావు. ద్వారా నీవు

చేసిన ఈ అద్భుత సాహసకృత్యం ప్రళయకాలంవరకు ముల్లోకాలలో కీర్తించ బడుతుంది” అన్నాడు.

సీతారాములు ఎల్లప్పుడూ ప్రేమమూర్తులే. భార్యాభర్తల జీవితం అందరికి ఆదర్శమే. లోకాపవాదు రాకుండా నిరోధించుటకు ప్రవేశపెట్టిన అగ్ని ప్రవేశం, అగ్నిసాక్షి సీతను నిర్దోషురాలిగా ప్రకటించాడు. తద్వారా ప్రజల్లో రాముని పరువు, ప్రతిష్ఠ పెంపొందటానికి అవకాశం కలిగింది. ముందు, ముందు రాజ్యభారాన్ని ప్రజల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ అగ్ని పరీక్ష అవసరమని భావించి ఉండవచ్చు. ప్రజాభిప్రాయాలను గౌరవించే రాజుని ప్రజలు తప్పు పట్టకుండా చూడాలిగదా! రాముడు ఏ పని చేసినా, ఏ నిర్ణయం తీసుకున్నా ధర్మ శాస్త్ర బద్ధంగా ఉంటుందని తెలుసుకోవాలి. ప్రజలు గూడ తమ భార్యా బిడ్డలను ఈ విధమైన ధర్మశాస్త్రబద్ధంగా నడవాలని రాముని నిర్ణయంగా ఉండటం ముదావహమే! అందుకే ‘యథా రాజా తథా ప్రజా’ అన్నారు.

**దశరథుని దర్శనం, సందేశం**

ఆకాశం వైపు చూపుతూ పరమేశ్వరుడు “రామా! నీతండ్రి దశరథుడు తన దివ్యరథం పై కూర్చొని ఎలా చూస్తున్నాడో చూడు. కారుణ్యమూర్తివైన నీ వలన ముక్తి పొంది ఆయన ఇపుడు ఇంద్రలోకంలో నివసిస్తున్నాడు. నిన్ను చూచేందుకు దశరథుడు ఇక్కడకు వచ్చాడు. నీవు వెంటనే లక్ష్మణునితో వెళ్ళి ఆయనను తిరిగి కలుసుకో” అని చెప్పాడు.

రామలక్ష్మణులు దశరథమహారాజుకు తలలు వంచి నమస్కరించారు. దశరథుడు రాముణ్ణి తొడమీదకు తీసుకుని “నాకు స్వర్గలోక వాసం కంటే నిన్ను చూడగలిగినందుకు మాత్రమే నేను సుఖసంతోషాలను పొందుతున్నాను. నీ అరణ్యవాసానికి కైకేయి పలికిన మాటలు నా హృదయంలో ముద్ర వేసుకున్నాయి, నీవు అయోధ్యకు తిరిగి వెళ్ళు! భరతుణ్ణి



కలవటం, చక్రవర్తిగా పట్టాభిషిక్తుడివి గావటం చూడాలని ఇంకా తపిస్తూనే ఉన్నాను. నీవు సాక్షాత్తు శ్రీమహావిష్ణువువేనని, రావణుని సంహరించటంకోసం అవతరించావని నేను ఇప్పుడు అర్థం చేసుకో గలుగుతున్నాను.”

“ప్రియమైన తండ్రీ! నన్ను అరణ్యవాసానికి పంపే సమయంలో మీరు కైకేయితో భరతునితో మీ సంబంధాన్ని వదులుకున్నట్లుగా పలికిన మాటలు ఉపసంహరించుకోవలసిందిగా నా ప్రార్థన. దశరథ మహారాజు ‘తథాస్తు’ అంటూ అందుకు వెంటనే అంగీకరించాడు. తరువాత దశరథ మహారాజు లక్ష్మణుణ్ణి ఆలింగనం చేసుకుని “నాయనా! లక్ష్మణా! నీవు రామునికి అంకిత భావంతో చేసిన సేవకుగాను నేను శాశ్వతంగా ఋణపడి ఉన్నాను. నీ అన్న లోకకల్యాణంకోసం మానవరూపం దాల్చిన సాక్షాత్తు పురుషోత్తముడని గ్రహించు. దేవతల్లో గొప్పవారికి సైతం ఆయన ఆరాధ్యుడు. ఇంక మావంటి వారికి చెప్పవలసిందేముంటుంది

**వెంటనే దశరథమహారాజు సీతతో “నీ పాతివ్రత్యాన్ని రాముడు పరీక్షించినందుకు నీవు అలుగరాదు. నీ శ్లాఘనీయమైన శీలం ఈ ప్రపంచం ఇంతవరకు చూచిన అత్యంత మహిమోపేతురాలైన స్త్రీగా చరిత్రలో పదిలమైన స్థానాన్ని సంపాదించి పెడుతుందని గ్రహించు.” అని చెప్పాడు. మామ–కోడలు మధ్య వాత్సల్యం ప్రశంసనీయం. దశరథమహారాజు శ్రీరామునితో సంభాషిస్తూ తాను ఋణపంచకం ఎలా తీర్చుకున్నదీ వివరించాడు. అవి –**

1. **యజ్ఞాలు ఆచరించడంచే దేవఋణం**
2. **వేదాధ్యయనంతో ఋషిఋణం**
3. **సత్సంతానప్రాప్తిచే పితృఋణం**

**4. ధర్మాచరణంచే గురుఋణం**

**5. ధర్మసుఖానుభవంచే గృహస్థాశ్రమఋణం**

తండ్రి స్వర్గలోకంలో ఉన్నా తండ్రి–తనయుల మధ్య సన్నిహిత సంబంధాలు శాశ్వతంగా ఉండటం సంతోషం. మహారాజు తన దివ్య రథాన్ని ఎక్కి తిరిగి స్వర్గలోకంలోకి ప్రవేశించాడు. ముకుళిత హస్తాలతో నిలిచిన రాముణ్ణి చూచి ఇంద్రుడు "నా దర్శనం ఎన్నడూ వృథా కాబోదు. అందువల్ల నా నుంచి ఏదైనా వరాన్ని స్వీకరించ గోరుతున్నాను, అన్నాడు.

ఇంద్రుని ప్రకటన విన్న రాముడు సంతసించి "ఓ దేవేంద్రా! నా సేనలో అసువులు బాసిన వానరయోధుల నందరిని బతికించాలి. ఈ వీరులు ఏ ప్రదేశంలో నివసించినా అక్కడ వృక్షాలన్నీ ఆకాలంలో సైతం పండ్లు కాసేటట్లు కూడా వరమివ్వు, అన్నాడు. నాకు కష్టమైనది అడిగినప్పటికీ నీ కోసం సంతోషంతో వరమిస్తున్నాను" అన్నాడు.

వెంటనే వానరులంతా సజీవులై తమ గాయాలన్నీ మాయమై నేలమీద నుండి లేవసాగారు. వారు ఏదో దీర్ఘ నిద్రనుండి తాము మేల్కొంటున్నట్లుగా భావన పొందారు. అక్కడ వున్న రాముణ్ణి, దేవతలను చూచిన వెంటనే తిరిగి ప్రాణాలు పొందగలిగామని తెలిసి అంతులేని ఆనందాన్ని పొందారు.

తనకోసం సేవచేసి, యుద్ధం చేసి, ప్రాణం ధారపోసిన వానర యోధులను బతికించమని ఇంద్రుణ్ణి వరంగా అడగటం రాముని మానవతా దృక్పథానికి నిదర్శనం. అటువంటి మర్యాదా పురుషోత్తముడు "న భూతో న భవిష్యతి" అని గట్టిగా చెప్పవచ్చు. రాముని సత్సంబంధాలు మానవులతోనే కాదు, వానరులతోనూ కలిగి ఉండటం సంతోషింపదగిన విషయం.

దశరథ మహారాజుతో సంభాషించిన సమయంలో రాముని దయార్ద్ర హృదయం గొప్పది. కైకేయి, భరతుని విషయంలో తండ్రి, పుత్రులమధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. పుత్రుడైన రాముని మాటకు విలువ ఇచ్చాడు



దశరథుడు. ఇచట రాముని గొప్ప మనసు, విశాల హృదయం స్పష్టమైంది. కపటంలేని వాడు రాముడు. లక్ష్మణుణ్ణి, సీతను సముచిత రీతిలో వారి సేవలను అభినందించాడు. సీత పతివ్రతగా అగ్ని పరీక్షలో నెగ్గిన విషయాన్ని పొగడి వారిని ఆశీర్వదించటం స్వర్గం నుంచి వచ్చిన దశరథుని ప్రేమకు తార్కాణం. సీతా రామ లక్ష్మణుల విషయంలో తప్పు చేశానని దశరథుడు బాధపడటం అందరికి హృదయాలను కదిలించాయి.

అంతట విభీషణుడు రాముని అభిషేకం కోసం వివిధ రాజలాంఛనాలను తీసుకుని వస్తున్న అనేకమంది పరిచారికలతో కలసి రాముని ఎదుటకు వచ్చాడు. కాని, రాముడు ప్రియమైన విభీషణా! సుగ్రీవుని నాయకత్వాన వానరులనందరినీ పిలిపించు. ఈ రాజభోగాన్ని వారినే అనుభవించనివ్వు. నాతరపున కఠినమైన తపస్సు చేయుచున్న భరతునినుండి నేను వేరుగా ఉన్నంత కాలం ఇలాంటి రాచమర్యాదలేవీ నాకు రుచించవు. నేను తిరిగి అయోధ్యకు త్వరగా చేరుకోగల ఏర్పాటు ఏదైనా చేయమని మాత్రమే నిన్ను అభ్యర్థిస్తున్నాను. నిజానికి పాదయాత్రతో అక్కడికి ప్రయాణించటంలో ఎంతో శ్రమతో కూడిన యాత్ర అవుతుంది" అని ఆదేశించాడు.

**ఇలాంటి రాచమర్యాదలు ప్రస్తుతం అక్కర్లేదు అనటంలో రాముని సాధారణ మానవ జీవితాన్ని కోరుకుంటున్నాడని, ఆడంబరాలు, ఆర్భాటాలు తనకు నచ్చవని అర్థమవుతుంది.ఏ పదవిలో వున్నా, ఎంత ధనమున్నా, ఎన్ని శక్తులున్నా, రాజభోగాలున్నా, వాటిని త్యజించి సామాన్య మానవునిగా జీవించటానికి అలవాటుపడాలని రాముని సందేశం.**

**అయోధ్యకు రాముని ప్రయాణం**

విభీషణుడు శీఘ్రమే వెళ్ళి తన పుష్పక విమానాన్ని రాముని వద్దకు తెచ్చాడు. ఈ పుష్పక విమానంలో ఎంతమందైనా ప్రయాణించవచ్చు. రత్న ఖచితమైన ఆసనాలతో ఈ రథాన్ని విశ్వకర్మ బంగారంతో నిర్మించాడు.

అద్భుతమైన ఈ విమానం తన సారథి చెప్పిన సూచనల మేరకు ఎక్కడికైనా ప్రయాణించగలదు. అందువల్ల తమ ఆదేశం కోసం నిరీక్షిస్తూ తమ ఎదుట గాలిలో నిలిచి వున్న రథాన్ని చూచిన రామలక్ష్మణులు ఆశ్చర్యచకితులైనారు.

వెళ్ళేముందు రాముడు వానర సైనికులకు స్వర్ణాన్నీ, రత్న మాణిక్యాలను కానుకలుగా ఇవ్వవలసిందిగా విభీషణుణ్ణి అభ్యర్థించాడు. వానరులు చేసిన సేవ, సహాయ సహకారాలకు ప్రతిఫలంగా బహుమానాలు ఇవ్వటం వారిని గౌరవించినట్లవుతుందని రాముని హృదయం తెలుపుతుంది. ఉచితరీతిన సహాయం పొందిన వారిని తగినవిధంగా సత్కరించటం మానవ ధర్మం.

రాముడు సీతా, లక్ష్మణులతో పుష్పక రథాన్ని అధిరోహించాడు. వానరులకు రాముడు కృతజ్ఞతలు ఈ విధంగా చెప్పాడు.

### రాముని కృతజ్ఞతలు

“నా ప్రియమైన వానర యోధులారా! నా తరపున మీరు చేసిన వీరోచితమైన పోరాటానికి గాను మీ ఋణం నేను తీర్చుకోగల మార్గమేదీ లేదు. మీ అకుంఠితమైన భక్తి, సేవ భవిష్యత్తులో భక్తులకు సర్వదా ఒక ప్రేరణగా నిలుస్తుంది. అలా మీ కీర్తి ప్రతిష్ఠలు శాశ్వతంగా ఉజ్వలంగా ప్రకాశిస్తాయి. ఇక దయచేసి కిష్కింధకు తిరిగి వెళ్ళి సుగ్రీవుని నాయకత్వంలో అక్కడ సుఖ సంతోషాలతో జీవించండి. విభీషణా! లంకాపుర జనులు ఇపుడు తమ మహారాజును కోల్పోయి ఉన్నారు. కాబట్టి, నీవు వెంటనే లంక పరిపాలనా బాధ్యతలు స్వీకరించాలి” అని ఉద్బోధించాడు. సుగ్రీవ, విభీషణులు రాముని ఎదుట చేతులు జోడించి నమస్కరించి “ఓ ప్రభూ! నీ వెంట మమ్ములను అయోధ్యకు రానివ్వు, పట్టాభిషేక మహోత్సవాలను చూచిన మీదట మేము మా స్వగృహాలకు తిరిగి వెళతాం అని ప్రార్థించారు.

**కిష్కింధారాజ్య వానరులకు లంకారాజ్య ప్రజలకు అయోధ్యా నగరవాసులకు శాశ్వత స్నేహ సంబంధాలు ఏర్పడ్డాయి.**



రాముడు సమాధానమిస్తూ “నా ప్రియమిత్రులందరితో కలిసి అయోధ్యకు తిరిగి వెళ్ళటం కంటే నాకు సంతోషకరమైన విషయం వేరే ఉండదు. అందువల్ల మీరు, ఇతర వానర వీరులంతా కూడా పుష్పక రథాన్ని ఎక్కితే మనందరం వెంటనే బయలుదేరుదాం” అన్నాడు. అందరూ కూర్చొన్న వెంటనే పుష్పక రథం రీవిగా గాలిలోకి ఆకాశమార్గంలో ఎగురుతూ ప్రయాణించింది.

మార్గమధ్యంలో సీతకు రాముడు యుద్ధ భూమిలోని ప్రదేశాలను, జరిగిన సంఘటనలను, రామేశ్వరం వద్ద సేతు సముద్రాన్ని, వంతెనను, ఋశ్యమూక పర్వతం, పంపా సరస్సు, గోదావరి నది, యమునా, గంగ నదుల ప్రవాహాన్ని, గుహుని రాజధాని, భరద్వాజ మహర్షి ఆశ్రమం, మొదలైన పవిత్ర ప్రదేశాలను, నదులను చూపించాడు. సీత ఆ ప్రదేశాలను, ప్రకృతి అందాలను, కొండలు, గుహలు, పచ్చని వృక్షజాతులను చూచి తనివి తీర ఆనందించింది.

### భరద్వాజాశ్రమ సందర్శనం

రాముడు పుష్పక రథాన్ని భరద్వాజాశ్రమం వద్ద ఆపి తన బంధువులను కలుసుకునేందుకు, వారి యోగక్షేమాలు గురించి ఆయనను ప్రశ్నించాడు. భరద్వాజుడు రామునికి సంతోష పూర్వకంగా స్వాగత సత్కారాలు చేసి ఓ రామా! నీవు భూ భారాన్ని తొలగించావని నా దివ్య దృష్టితో తెలుసుకున్నాను. అందువల్ల నీవు ఏది కోరినా నేను సంతోషంతో నీకు ప్రసాదిస్తాను! అన్నాడు. సంతోషంతో రాముడు బదులిస్తూ, “అయోధ్యకు వెళ్ళే మార్గంలో ఉన్న వృక్షాలన్నీ ఫలపుష్ప సంభరితాలు అగుగాక! ఆ వృక్షాలనుండి అమృత పరిమళాలను వెదజల్లుతూ సుధారసతరంగిణులు ప్రవహించుగాక”. శ్రీరామునికి ప్రకృతిపై ఎంత మమకారమో!

ఆ మాటలకు అయోధ్యా మార్గంలో ఉండే వృక్షాలు తక్షణమే రసవంతమైన ఫలాలతో నిండుగా ఉన్నాయి. ఆశ్చర్యం గొలిపిన ఈ వింతను

చూచి వానరులు పుష్పక రథం దిగి ఫలాలను ఆస్వాదించారు. వానరులు తృప్తి పొందారు. వారు రామునికి చేసిన సేవకు ప్రతిఫలంగా బహుమతిరూపంలో ఇచ్చినందుకు అందరూ సంతోషించారు. రామభరతులకు భరద్వాజ ఆశ్రమానికి ఉన్న అనుబంధం అనిర్వచనీయమైనది.

హనుమంతుని వైపు చూచి "నీవు వెంటనే నందిగ్రామం వెళ్ళి భరతుణ్ణి కలిసి విజయ వార్తను, నేను తిరిగి అయోధ్యకు వస్తున్న విషయం విపులంగా చెప్పు. భరతుని ముఖ కవళికలను సైతం గమనించు. అతను పదవీ కాంక్ష, రాజ్యకాంక్ష, అధికార శక్తి వల్లగాని లేక కైకేయి ప్రేరణ వల్లనైనా సరే, రాజ్యాన్ని తానే పాలింపదలచుకుంటే అందుకు నేను సంతోషంగా అనుమతిస్తానని'' అన్నాడు. వనవాసదీక్షముగిసినా రామునికి రాజ్యకాంక్షలేదనే భావం వ్యక్తమైంది.

హనుమంతుడు నందిగ్రామానికి చేరుకున్న మీదట అక్కడ భరతుడు నారవస్త్రాలను ధరించి జటా జూటాలను ధరించి ఉండటం చూశాడు. భరతుడు చిన్న కుటీరంలో నివసిస్తూ, ఫలాలు, కందమూలాలను తిని జీవిస్తున్నాడు. భరతుడు ఎంతో విచారవదనుడై, శుష్కించిన శరీరంతో ఉన్నాడు.

భరతునికి అన్నగారిపై ఉన్న వాత్సల్యం, గౌరవంతో, అన్నగారే రాజ్యానికి అర్హుడని భావించి, అతడు లేని రాజ్యంలో నేనుండటానికి అనర్హుడనని, భరతుడు గూడ రామునివలె నారచీరలు, జటాజూటాలు పర్ణశాల నిర్మించుకొని నందిగ్రామంలో ఉన్నాడు. అన్నదమ్ముల భావన మమతా మమకారాలే కాదు, అర్హత అనర్హతలను, ధర్మా ధర్మాలను బేరీజు వేసిన మహోత్తములు. వీరిద్దరు రాజ్యాన్ని గడ్డిపోచగా భావించి అరణ్యవాసంలో ఒకరు, నందిగ్రామంలో ఒకరు నివసించారు. వారిద్దరిలోనూ అనిర్వచనీయమైన, అసాధారణమైన అనురాగం, అభిమానం వెలలేనిది.



మొదటి నుంచి రఘువంశపు రాజులు స్నేహపూర్వక కుటుంబ సంబంధాలు గలవారని చరిత్ర వలన తెలుస్తోంది.

**ఈనాడు అన్నదమ్ములు ఇద్దరైనా, ముగ్గురైనా, నలుగురైనా రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు వలె ఆదర్శ సోదరులుగా జీవించాలని కోరుకోవాలి.**

**రామ భరతుల కలయిక**

దివ్య విమానం నుంచి దిగటంతోనే భరతుడు పరుగున వెళ్ళి తన అన్నకు నమస్కారం చేశాడు. రాముడు వెంటనే తన ఆసనం మీద కూర్చొని భరతుణ్ణి ఆలింగనం చేసుకున్నాడు. భరతుడు దివ్యప్రేమావేశంతో, మృదువైన హృదయంతోను, బాష్పపూరిత నయనాలతోను అపరిమిత భక్తితో రామచంద్రుని పాదాలపై పడ్డాడు.

**భరతుని శుష్కించిన శరీరాన్ని, దేహాన్ని నార వస్త్రాలను కట్టుకోవటం, జటాజూటాలు ధరించటం, దర్భశయ్యపై పడుకొంటూ గడుపుతున్నాడని విని రాముడు ఎంతో కరుణా హృదయుడై దుఃఖించాడు.**

**రామ భరతుల సంభాషణ**

భరతుడు రాముని పాదుకలను చేత పట్టుకొని రాముని పాదాలపై ఉంచి "నీవు లేనిసమయంలో నేను పాలించిన రాజ్యమిదిగో, నీదయవల్ల అయోధ్య సిరిసంపదలతో తులతూగుతోంది. ధనాగారం, భాండాగారాలు, సైన్యం అన్నీ పదింతల అధికమై పెరిగాయి. ఇక నా కర్తవ్యం పూర్తి అయింది. ఇక వీటన్నిటిని వదలి నీకు అందచేస్తున్నాను" అన్నాడు. పాదుకలను శ్రీరామచంద్రుని ఎదుట ఉంచి బాష్పపూరిత నేత్రాలతో చేతులు జోడించి నిలిచాడు. శ్రీరామచంద్రుడు భరతుణ్ణి ఆలింగనం చేసుకుని అతన్ని కన్నీళ్ళతో అభిషేకించాడు.

శ్రీరాముడు పధ్నాలుగు సంవత్సరాలు అరణ్యవాసం చేసి తిరిగి వచ్చిన తరువాత తన అన్నకు రాజ్యాన్ని తిరిగి ఇచ్చివేయటానికి భరతుడు సమ్మతిని

తెలియజేయటం అతని విశాల హృదయానికి నిదర్శనం. రఘువంశపు రాజులు “ఆడిన మాట తప్పరని” పేరుంది. ఆ పేరును నిలబెట్టాడు భరతుడు.

**శ్రీరాముని పట్టాభిషేక సన్నాహాలు**

రాముడు తన ఆధ్యాత్మిక గురువైన వశిష్ఠుని పాదాల వద్ద కూర్చొని ఉండగా భరతుడు ఆయన ఎదుటకు వచ్చి, ప్రియమైన అన్నా! దయచేసి ఇంకా ఆలస్యం చేయకుండా రాజసింహాసనం పై పట్టాభిషిక్తునివై రాజభోగాలతో కూడిన జీవితాన్ని తిరిగి స్వీకరించు” అని ప్రార్థించాడు. ఉత్సవ సంరంభాల మధ్యన శ్రీరాముడు అయోధ్యలో ప్రవేశించాడు. దారిపొడవునా ఆయన పై మనోజ్ఞమైన, సౌరభభరితమైన పుష్పాలు వర్షిస్తున్నాయి. రాజన్యులు అభివాదం చేశారు. మహనీయులైన బ్రహ్మాది దేవతలు ఆనందోత్సాహాలతో ప్రభువు యొక్క లీలా విశేషాలను ఘనంగా కీర్తించారు.

**ప్రజల సంబరాలు**

రాజధానిలో ప్రవేశించిన రాముడు తనను స్వాగతించటం కోసం ప్రజలంతా తమ గృహాలనుండి వెలుపలికి వచ్చి వీధుల వెంట బారులు తీర్చి ఉండటాన్ని చూచాడు. పద్నాలుగు సంవత్సరాల తర్వాత మా రాముణ్ణి చూస్తున్నా మనే సంతోషం అయోధ్యా ప్రజల కళ్ళలో, ముఖంలో, పెదాల చిరునవ్వులో స్పష్టంగా కనుపిస్తున్నాయి.

**ఆ కాలంలో రాజుకు ప్రజలకు గల అవినాభావ సంబంధం, అవ్యాజమైనది. తిరుగులేనిది.**

ఆబాలగోపాలం తమ ప్రాణాలు పోయినవి తిరిగి వచ్చినవా! అన్నట్లుగా రాముణ్ణి చూచారు. ప్రజలు ఆనందంతో గంతులు వేస్తున్నారు. తమ ఉత్తరీయాలను ఊపుతూ “మన ప్రియతమ రాకుమారుడు తిరిగి వచ్చాడు. భక్తజన సంరక్షకుడైన శ్రీరామునికి ‘జయో - స్తు! విజయో - స్తు’ అంటూ



నినాదాలు చేశారు. సంగీతజ్ఞుల వాద్యధ్వనులు, వేదమంత్రోచ్చారణల మధ్య రాముడు ప్రేమాదరాలతో తన ప్రజలను చూచాడు.

శ్రీరాముడు తన మంత్రులకు అభివాదాలు చేసి తనకు, వానరులతోను, విభీషణునితోను ఉన్న రాజకీయ మైత్రిని వారికి వివరించాడు. అలా ఆయన తండ్రి ఉన్న గృహానికి చేరాడు.

**పట్టాభిషేక సంరంభం**

భరతుని అభ్యర్థన మేరకు జాంబవంతుడు, హనుమంతుడు, గవయుడు, ఋషభుడు, నాలుగు సముద్రాలనుండి జలాలు తీసుకు రాగా ఐదువందల మంది వానరులు, ఐదువందల పవిత్ర నదులనుండి జలాలను తీసుకువచ్చారు. వసిష్ఠునికి ఆ వస్తువులను అందజేశారు. మహర్షి విలువైన రత్నమాణిక్యాలతో నిర్మించబడిన సింహాసనం పై శ్రీరాముణ్ణి, సీతను ఆసీనులను గావించాడు.

వామదేవుడు, జాబాలి, కశ్యపుడు, కాత్యాయనుడు, సుయజ్ఞుడు, గౌతముడు, మొదలైన ఋషులు సహకరించగా వశిష్ఠుడు పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహించాడు. తొలుత బ్రాహ్మణులు అభిషేకించారు. తరువాత ఒక కన్య అభిషేకించింది. ఆపైన ఆయన మంత్రులు, ప్రముఖ యోధులు, వైశ్యులు ఒకరి తర్వాత ఒకరుగా అభిషేకించారు. అంతిమాభిషేకం పూర్తయిన మీదట వశిష్ఠుడు పట్టాభిషేక మహోత్సవాన్ని ఆకాశం నుండి చూస్తున్న లోకపాలురను ఇతర దేవతా ముఖ్యులను రామునిపై ఓషధులతో సంప్రోక్షించవలసినదిగా ఆదేశించాడు”.

**రాజమకుటం అలంకరణ**

రాముడు అనంత రత్న ఖచితమైన స్వర్ణ సింహాసనం పై కూర్చొనగా వశిష్ఠుడు ఆయన తలపై రాజమకుటాన్ని పెట్టి దేహాన్ని స్వర్ణాభరణాలతో అలంకరించాడు. గతంలో ఇక్ష్వాకువంశ రాజుల చేత ధరించబడిన ఆ

కిరీటం వైవస్వతమనువు పట్టాభిషేకం కోసం బ్రహ్మదేవుని చేత ప్రత్యేకంగా తయారుచేయబడింది.

**కానుకల సమర్పణ**

దేవేంద్రుని సూచన మేరకు వాయుదేవుడు రాముని మెడలో 100 స్వర్ణ కమలాలతో కూర్చబడిన హారాన్ని వేసి, ముత్యాలతోను మణులతోను కూడిన ఒక దివ్య కంఠహారాన్ని, ఆయనకు కానుకగా సమర్పించారు శత్రుఘ్నుడు శ్రీరాముని తలపై రాజచ్ఛత్రాన్ని పెట్టగా, సుగ్రీవ, విభీషణులు ఇరుప్రక్కల నిలిచి వింజామరలు వీచారు. తదుపరి గంధర్వులు గానం చేశారు. అప్సరసలు ఆనందోద్వేగంతో నాట్యం చేశారు. రాముడు 1,00,000 గోవులను 3,00,000 బంగారు నాణేలను, అనేక రకాల విలువైన రత్న మాణిక్యాలను బ్రాహ్మణులకు దానం చేశాడు. సుగ్రీవునికి కంఠ హారాన్ని, అంగదునికి వజ్రాలతోను అమూల్య రత్నాలతోను అలంకృతమైన కంకణ ద్వయాన్ని రాముడు బహూకరించాడు.

**సీతకు రాముని బహూకరణ**

రాముడు తనకు పూర్వం వాయుదేవుడు బహూకరించిన ఒక కంఠ హారంతో పాటు అతి విలువైన అలంకారాలతో కూడిన అనేక వస్త్రాలను సీతకు బహుకరించాడు. సీత హనుమంతునికి కంఠహారాన్ని బహుమతిగా ఇచ్చింది. తరువాత వానర ముఖ్యులందరికీ విలువైన వస్త్రాభరణాలను బహూకరించటం జరిగింది.

ఇలా రాముని పట్టాభిషేక మహోత్సవం అంగ రంగ వైభవంగా కనులకు విందు గొలిపేటట్టు విజయవంతంగా పరిసమాప్తి అయింది.

**సద్గుణాలు కలిగిన శ్రీరాముడు అన్ని వర్గాలవారికి, హోదాతో పనిలేకుండా, భటుని దగ్గిర నుంచి రాజు వరకు అందరినీ సమానమైన భావంతో గౌరవించేవాడు. అందుకే ప్రజలందరూ గౌరవించారు,**



**పూజించారు, సేవించారు, అభిమానించారు, నామాన్ని నినదించారు. అపకారం ఎప్పుడు తల పెట్టలేదు రాముడు. అపకారికి ఉపకారమే చేశాడు. శత్రువులకు ప్రాణభిక్ష పెట్టిన మానవత్వం గల మహోన్నత వ్యక్తి శ్రీరాముడు.**

**ఈ కారణం చేతనే రామునికి కొన్ని వేలమంది, లక్షల మందితో, కోట్ల మందితో సత్సంబంధాలు మెండుగా నిండుగా ఉన్నాయి. రాజుగా శ్రీరాముడు యుగయుగాల నుండి ఎందరి హృదయాలనో గెలుచుకున్నాడు. ఈ కలియుగంలో రాముడు ఆరాధ్యదైవంగా ప్రజలు భక్తిసంబంధాలు పెంచుకుంటున్నారు.**

**సర్వతోభద్రము**

సర్వతోభద్రమనగా శ్రీరాముని పట్టాభిషేక మహోత్సవసంరంభం. శ్రీరామునికి నాలుగు వైపులనున్న పరివారం, ఈ దృశ్యం విజయనగరం పట్టణానికి 14 కి॥మీ దూరంలో శ్రీరామతీర్థపుణ్యక్షేత్రం ఉంది. శ్రీరామస్వామి వారి దేవాలయంలో కనువిందు చేస్తోంది. ఆ ఆలయాన్ని 16వ శతాబ్దంలో పంచలోహవిగ్రహాలతో రూపుదిద్దుకున్న పట్టాభిషేక సంబరాన్ని కనులకు కట్టినట్టు తీర్చిదిద్దారు. సింహాసనముపై ఆసీనులైన సీతారాములు, వీరికి రెండు వైపులా లక్ష్మణుడు, విభీషణుడు, వారి తరువాత క్రమంలో భరత శత్రుఘ్నులు, సుగ్రీవుడు, హనుమంతుడు, జాంబవంతుడు, అంగదుడు, వశిష్టమహర్షి ఇంకా ఎందరో మహానుభావులు వున్నారు. వారు శ్రీరామునికి వినయంతో అభివాదం చేస్తూ నిలబడిన దృశ్యం చూచి తీరవలసిందే కాని వర్ణింపశక్యం గాదు. దివ్య మంగళ సుందరవిగ్రహాలను తనివితీరా చూడాలి, తరించాలి. త్రేతాయుగంలో పట్టాభిషేకాన్ని తలపించే విధంగా తీర్చిదిద్దారు. ఈ విధమైన సంరంభం భరతభూమిలో శ్రీరామతీర్థంలో మాత్రమే దర్శనమిస్తుంది. ఈ పుణ్యక్షేత్రంలోని సీతారామలక్ష్మణ విగ్రహాలు ద్వాపరయుగంలో పంచపాండవులు పూజించి, ధూప, దీప, నైవేద్యాలు నిర్వహించేవారని చరిత్ర చెబుతోంది. తర్వాత విజయనగరరాజులు 16వ

శతాబ్దంలో శ్రీరామస్వామి దేవాలయాన్ని భక్తిశ్రద్ధలతో పూజాదికములు, ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. సర్వతోభద్రాన్ని దర్శించి నమస్కరిస్తే కోరికలు నేరవేరుతాయని భక్తుల విశ్వాసం.

## బంధాలు - అనుబంధాలు

### ఋషులతో సంబంధాలు

పట్టాభిషేకం అయిన కొద్ది రోజులకు రాముణ్ణి వ్యక్తిగతంగా పూజించి ఆయన అద్భుతమైన లీలా విశేషాలను కీర్తించటం కోసం మహర్షులంతా అయోధ్యకు వచ్చారు. సప్తర్షులైన వశిష్ఠుడు, కశ్యపుడు, అత్రి, విశ్వామిత్రుడు, గౌతముడు, జమదగ్ని, భరద్వాజుడు రాజప్రాసాదానికి వచ్చారు. అలాగే కౌశికుడు, కణ్వుడు, అగస్త్యుడు, ధౌమ్యుడు, యవక్రీతుడు, గార్గ్యుడు, గాలవుడు, మేధాతిథి కుమారుడు ప్రస్కంధుడు, ఆత్రేయుడు, నముచి, ప్రముచి, సుముఖుడు, విముఖుడు, నృషద్గుడు, కవఘుడు, రౌద్రేయుడు కూడా వచ్చారు. వారందరికి రాముడు చేతులు జోడించి ఎదురుగా వచ్చి స్వాగతం పలికాడు. ఆ ఋషులందరికీ అసంఖ్యాకమైన గోవులను దానంగా ఇచ్చాడు.

రాముడు ఆ ఋషుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నాడు. ఋషులు రాముడితో "ఓ రామా! ఔదార్య శీలమైన నీ లీలలను ప్రదర్శించటం కోసం భూలోకంలో అవతరించి మమ్మలను తృప్తిగా సంతోషపరిచావు. ఇపుడు రావణుడు మరణించటంతో మేమంతా ఊరటను, సుఖసంతోషాలను అనుభవిస్తున్నాం. రావణుడు అభివృద్ధికి, శ్రేయస్సుకు అడ్డుగా ఉండేవాడు. వాస్తవానికి రావణుడే కాదు, ఖరుడు, మారీచుడు, కుంభకర్ణుడు, అతికాయుడు, నికుంభుడు, కుంభుడు మొదలైనవారు కూడా సకల ప్రాణులను భయభ్రాంతులు చేస్తూండేవారు. కనుక వారినందరిని నాశనం చేసినందుకు మేమెంతో కృతజ్ఞులమై ఉన్నాం. ఇంద్రజిత్తు మరణించినందుకు మేము ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నాం. నీవు, లక్ష్మణుడు తప్ప, ముల్లోకాల్లోనూ వేరెవరికీ అతణ్ణి వధించటం సాధ్యపడేది కాదు" అన్నారు.



"బ్రహ్మదేవుడు విభీషణుణ్ణి ఏదైనా వరాన్ని స్వీకరించమని అడుగగా అతను బదులిస్తూ "ఓ ప్రియమైన దేవా! నీవు నా పట్ల ప్రసన్నుడవైనందున నా జీవిత లక్ష్యం ఇప్పటికే నెరవేరింది. చాలకష్టాల మధ్య నా మనస్సు సర్వదా ధర్మ మార్గం మీదనే స్థిరంగా నిలిచి ఉండాలనేదే నా ఏకైక కాంక్ష. అప్పుడు బ్రహ్మదేవుడు విభీషణునికి అమృత తత్వాన్ని ప్రసాదించాడు.

### రాజులతో సత్సంబంధాలు

శ్రీరాముడు పట్టాభిషేకోత్సవానికి హాజరయ్యేందుకు వచ్చిన పలువురు మహారాజుల్లో జనక మహారాజు, కేతు రాజైన యధాజిత్తు, మూడు వందలమంది ఇతర రాజులు, యువరాజులకు, వీడ్కోలు పలికాడు. రాజుల వెంట రక్షణగా వచ్చిన యోధులకు రాముని కోసం తెచ్చిన విలువైన కానుకలనే ఇచ్చి త్రిప్పి పంపారు. ఈ కానుకలను అన్నింటినీ రాముడు సుగ్రీవునికి, విభీషణునికి, ఇతర వానరులకు, రాక్షసులకు బహుమతిగా ఇచ్చాడు.

శ్రీరాముడు తన శరీరం మీద నున్న ఆభరణాలను తీసి వాటిని హనుమంతునికి, అంగదునికి అలంకరించాడు. తక్కిన వానరులను రాముడు సోదరులుగా ప్రకటించి, ఆలింగనం చేసుకొని వారికి బహుమానాలు అందచేశాడు. వానరులంతా శ్రీరామచంద్రుని పవిత్రస్నేహంలో సంతోషంగా ఒక నెలపైగా అయోధ్యలో కాలక్షేపం చేశారు.

**సహాయం చేసిన వారిని జీవితంలో మరువ గూడదు అనే సత్యాన్ని తెలుసుకోవాలి. ఈ ప్రక్రియవల్ల అయోధ్యానగర ప్రజలకు వానరులకు మధ్య సన్నిహిత సంబంధాలు పెంచుకోవటమే గాక, రామునికి వానరులకు మధ్య ప్రేమాభిమానాలు, గౌరవ మర్యాదలకు కొదవ లేదు. రాముని వ్యక్తిత్వ వికాస లక్షణాలే ఇందుకు తార్కాణం.**

## హనుమపై ప్రత్యేక గౌరవం

వీడ్కోలు సమయంలో హనుమంతుడు రాముని ఎదుటకు వచ్చి ఇలా ప్రార్థన చేశాడు. "ఓ నా దైవమా! నీ పట్ల నా భక్తి సర్వదా అచంచలమై నిలువనివ్వు, నీ పట్ల నాకున్న ప్రేమ ఎన్నటికీ వేరొకరి వైపుకు గతి తప్పకుండా ఉండనివ్వు. అంతేగాక, ఈ భూలోకంలో నీ దివ్యలీలలు వర్ణించబడునంత కాలం నా జీవితం కొనసాగనివ్వు. వాస్తవానికి రామాయణ గానాన్ని ఆలకించటం చేత మాత్రమే నీ నుంచి కలిగే వియోగం దుర్భర బాధలను నేను తగ్గించుకోగలను. ఇచట హనుమంతుడు రాముని నుండి దూరమవుతున్నాడు. ఇద్దరి మధ్య అనురాగం పెరిగి ఒకరినొకరు వదలలేని పరిస్థితిలో, హనుమంతుడు వియోగబాధను అనుభవించాల్సిన సమయంలో "రామనామస్మరణమే" నా బాధను ఉపశమింపజేస్తుంది అన్నాడు. దీనివల్ల ప్రతి వ్యక్తి "రామనామ" మహత్యం తెలుసుకోవాలి. "రామనామజపం" కష్టాలను తీర్చుతుందనుటలో సందేహం లేదని దీని అర్థం.

వెంటనే రాముడు సింహాసనం నుండి దిగి వచ్చి హనుమంతుణ్ణి ఆలింగనం చేసుకుని హనుమా! రామాయణం గానం చేసినంత కాలం నీవు జీవించే ఉంటావు. వాస్తవానికి భూమి యొక్క ఉనికి కొనసాగినంత కాలం రామాయణం గానం చేయబడుతూనే వుంటుంది. నా ప్రియ హనుమంతా! నీవు నాకు చేసిన నిరుపమానమైన సేవకు నేనెన్నటికీ నీ ఋణం తీర్చుకోలేను. నేను శాశ్వతంగా నీకు ఋణపడి ఉంటాను.

శ్రీరాముడు ముత్యాలతోనూ, విలువైన రత్నాలతోనూ కూర్చబడి తన వక్షస్థలం పై విరాజిల్లుతున్న కంఠహారాన్ని తీసి హనుమంతుని మెడలో వేశాడు. వానరులంతా లేచి ఒక్కొక్కరుగా శ్రీరామునికి నమస్కారం చేశారు.

## ఆనందబాష్పాలతో వీడ్కోలు

వియోగం కలుగుతున్న ఉద్రేకంలో వానరుల మాటలు అస్పష్టమైనాయి. మాట రావటం లేదు. ఏదో బాధ గొంతులో కనుపిస్తోంది. ఎట్టకేలకు



వానరులు అక్కడ నుండి బయలు దేరి వెళ్ళారు. రాముడు వానరులతో స్నేహం చేసినది అతికొద్దికాలమే అయినా, అది ప్రగాఢ స్నేహముద్ర వేయడంవలన ఈనాడు వియోగబాధ కలిగింది. అయినా ఆ వీరులంతా తమ తమ కుటుంబాలతో తిరిగి కలుసుకుంటున్నందుకు ఆయన మిక్కిలి సంతోషం పొందాడు.

**ఒకరికొకరు సేవాభావంతో సహాయ సహకారాలు అందించుకొని నిస్వార్థసేవ చేశారు. వారి మధ్య నెలకొన్న స్నేహబంధం చిరకాలం నిలచి ఉంటుందనుటలో సందేహం లేదు.**

## ఆంజనేయుని వాక్‌శక్తి

''వాల్మీకి రామాయణంతో పాటు ఇతర రామాయణాల్లో, మంత్రశాస్త్రాల్లో, కావ్యాల్లో కూడా హనుమంతుని గొప్పదనం అనేకవిధాలుగా వ్యాప్తి చెందింది'' అని సామవేదం షణ్ముఖశర్మగారు ఆంజనేయుని ప్రాముఖ్యాన్ని వర్ణించారు. 'ఆంజనేయస్వామి' అనగానే రామభక్తి, వీరత్వం, జ్ఞానం, మూర్తీభవించిన దైవంగా మనస్సుకు కలుగుతుంది. ఆంజనేయునికి 'హనుమాన్' నామం కూడ వుంది. 'హనుమాన్' నామానికి వాక్ స్వరూపుడు అని అర్థం. దీనికి కొన్ని వేదశాస్త్ర వాక్యాలే ప్రమాణం.

'హనుమాన్ వాక్యకోవిదః' అని వాల్మీకి పేర్కొన్నాడు. వాక్కు అంటే కేవలం 'మాట' అని అర్థం చెబితే సరిపోదు. బుద్ధి, శక్తి, విశిష్ట జ్ఞానం, దాన్ని వివరించే పరిజ్ఞానం ..... వీటి కలయికే వాక్‌శక్తి. ఈ శక్తి కలిగిన సర్వశాస్త్రవేత్త హనుమ. హనుమాన్ అంటే 'జ్ఞానవాన్' అని అర్థం.

**మానవ సంబంధాలు పెంపొందించటంలో 'వాక్ శక్తి' ఉన్నవారే మంచి సలహా ఇచ్చేవారుగా జ్ఞానవంతులుగా, మాటలచాతుర్యం గలవారుగా చెప్పుకోవాలి. నారద మహర్షి తరువాత సమర్థుడైన సమాచార వైతాళికుడిగా**

**ఆంజనేయుడిని చెప్పుకోవాలి.**

రామాయణంలో తనకోసం కాకుండా కేవలం పరహితంకోసం, లోక రక్షణ కోసం ప్రవర్తించి రామ కార్యాన్ని నిర్వహించిన త్యాగమూర్తి హనుమ. హనుమలోని ఉపకార స్వభావం ఎంతటి గొప్పదో తెలుస్తుంది. బుద్ధిబలం, దేహబలం కలగలిసిన ఈ తేజోమూర్తిని ఆదర్శంగా గ్రహించి, ఎదిగినవారు గొప్పవ్యక్తిత్వాన్ని సంతరించుకోగలరన్నది స్పష్టం. పట్టాభిషేకానంతరం శ్రీరాముని మనసు మేరకు, సీతమ్మ దివ్యమైన కాంచనరత్నమాలను హనుమ కంఠంలో వేసి అభినందించింది. అంటే శ్రీరామపట్టాభిషేకం హనుమంతుని సన్మానించటంతో స్వస్తి పలికిందని తాత్పర్యం.

రామాయణంలో సీతారాములు, హనుమంతుడూ ఈ ముగ్గురూ సంపూర్ణదేవతా మూర్తులు.

**మంచిభావుకుడు**

ప్రథమ పరిచయంలోనే మనపట్ల ఇతరులకు సదభిప్రాయాన్ని కలిగించేది మనమాట. ఆ మాట ఎంత స్పష్టంగా, సంస్కారవంతంగా, వినయంగా ఉండాలో ఆంజనేయునికి తెలుసు. అతడు భిక్షుక రూపంలో రామలక్ష్మణుల వద్దకు వచ్చి మీరెవరు? ఈ ప్రాంతానికి ఎందుకు వచ్చారు? అని ప్రశ్నించాడు. ఆ మాటలు విన్న శ్రీరాముడు 'చతుర్వేద పఠనంలోనూ, వ్యాకరణశాస్త్రంలోనూ పండితుడు కానివాడు ఇంత చక్కగా నిర్దుష్టంగా మాట్లాడలేడు' అన్నాడు లక్ష్మణునితో. అంతటి మాటల నేర్పరి ఆంజనేయుడు.

మైనాకునితో ప్రియంగా, ఆప్యాయతతో భుజంతట్టి అతణ్ణి సంతృప్తి పరచి సముద్రం దాటుటకు ముందుకు సాగాడు.

**హనుమంతుడు చిరంజీవి**

శ్రీరాముడు ఎన్నో సంవత్సరాల సుపరిపాలన తరువాత వైకుంఠానికి ప్రయాణమవుతాడు. ఆయన సహచరులందరూ ఆయన్ను అనుసరిస్తారు.



అయితే హనుమంతుడు ఎప్పటికీ భూలోకంలోనే ఉండేందుకు ఇష్టపడుతాడు. అందుకు కారణం ఎన్ని యుగాలు మారినా రామభక్తులు ఉంటారు. వారు రామనామ, జపాదులను చేస్తూ జీవించాలనేది ఆంజనేయుని కోరిక. స్వామి అభీష్టానుసారం శ్రీరాముడు హనుమంతుల వారిని 'చిరంజీవి'గా అనుగ్రహిస్తాడు. ఆంజనేయుడు చిరంజీవి. ఈ సృష్టి ఉన్నంత వరకు ఆయన భక్తులు చేసే 'రామనామాన్ని' వింటూ ఆనంద పారవశ్యంలో ఉంటాడు. భవిష్యత్‌బ్రహ్మగా సృష్టి బాధ్యతలు చేపట్టేదాకా చిరంజీవిగా స్వామి, భక్తుల హృదయాల్లో కొలువై ఉంటాడు.

**కలియుగంలో గూడ హిమాలయాల్లో తపస్సు చేసుకుంటూ, ఆంజనేయుడు ఉన్నాడని భారతీయుల నమ్మకం. అందుకే హనుమను పూజిస్తారు, సేవిస్తారు, నమస్కరిస్తారు. రామాలయం ఉన్న చోట, హనుమంతుని ఆలయం గూడా ఉండటం విశేషం.**

**ఆంజనేయుని ప్రతిమాట, ప్రతి పని, ప్రతి ఆలోచన, ప్రతిమ, మనకు ఏదో ఒక సందేశాన్ని ఇస్తూనే ఉంటాయి.**

**కుబేరుని ఔదార్యం-రాముని విశాల హృదయం**

పట్టాభిషేక మహోత్సవ మధ్యాహ్న సమయంలో ఆకాశం నుండి ఒక శబ్దం వినిపించింది. తలపైకెత్తి చూడగా పుష్పక రథం. తనతో మాట్లాడటం కనిపించింది. ఆ రథం రామునితో "నీవు ఆదేశించినట్లే నేను కుబేరుని వద్దకు తిరిగి వెళ్ళాను. కాని, ఆ ధనాధిపతి నాతో రాముడు రావణుణ్ణి జయించినందుకు నీవిప్పుడు ధర్మబద్ధంగా ఆయనకే చెందుతావు' అని చెప్పాడు. అందువల్ల, కుబేరుడు నన్ను నీకు సేవ చేసేందుకు గాను నీవద్దకు తిరిగి పంపాడు. ఓ దేవా! దయచేసి అనుమానించకుండా నన్ను స్వీకరించు" అంది.

**వెంటనే రాముడు పుష్పాలతోను, ధూపంతోను, చందన లేపనంతోను పుష్పక రథాన్ని పూజించాడు. వెంటనే 'నాకెప్పుడైనా నీ సేవ అవసరం ఉంటే పిలిచినపుడు నావద్ద ప్రత్యక్షం కాగలవు. ఈ లోపల నీవు నీయిష్టం వచ్చిన చోటుకు పోవచ్చును." అని ఆదేశించాడు. పరుల సొమ్ము మీద, ఆస్తి మీద ఆశలేని వాడు రాముడు. ఇతరులు తనను గౌరవించాలనే తపన కన్నా, తను ఇతరులను గౌరవించాలనే తపన రామునిలో ఎక్కువ. అది ఆయన సహజసద్గుణం. రామునికి గల సద్గుణాలు అందరికీ నేటికీ ఆదర్శం.**

**శ్రీరాముని సుపరిపాలన-ప్రజాసంబంధాలు**

రాముడు తన రాజ్యాన్ని అయోధ్య నుండి భూమండలాన్ని 11,000 వేల సంవత్సరాలు పరిపాలించాడు. ఆ సమయంలో ఆయన 100 అశ్వమేధయజ్ఞాలతో సహా అనేక యాగాలు నిర్వహించాడు.

శ్రీరాముని రాజ్యంలో అరణ్యాలు, నదులు, పర్వతాలు, మహా పర్వతాలు, రాజ్యాలు, సప్తద్వీపాలు, సప్తసాగరాలు అన్నీ అనుకూలంగా ఉన్నాయి. అవి అన్నీ ఉండి సకల ప్రాణికోటి జీవితానికి వస్తువులను, పదార్థాలను సమకూర్చాయి. శారీరక బాధలు, మానసిక బాధలు, వ్యాధ్యార్ధక్యం, వియోగం, విలాపం, ఆపద, భీతి, గ్లాని, అనేవి ఎవరికి ఎన్నడూ కలుగనే లేదు. భర్త మరణంతో విలపించవలసిన వితంతువులు ఎవ్వరూ లేరు.

వాస్తవానికి వన్య మృగాలు సైతం తమ సహజ శత్రుత్వాన్ని త్యజించి సత్సంబంధాలను కలిగి ఉన్నాయి. ఒక దానినొకటి చంపు కోవటం మాని వేశాయి. ప్రజలంతా పూర్తిగా ధర్మవర్తనులై ఎల్లప్పుడూ రాముణ్ణి తమ ప్రభువుగాను, యజమానిగాను భావించారు. వారంతా రాముణ్ణి తమ ప్రాణంగాను, వారి ఆత్మగాను భావించారు. ప్రతిఒక్కరు వేలాది సంవత్సరాలు జీవించి వేలాది పుత్రులకు జన్మనిచ్చారు. కోరిన వారికి మృత్యువు కూడా



లేదు. ఎవరు ఏది మాట్లాడినా, రాముని గురించే. త్రేతాయుగంలో ఆనాడు భూలోకమంతా విష్ణులోకమైన వైకుంఠం వలె ప్రకాశించింది. ఆ కాలంలో ధర్మం మూడు పాదాలా ప్రకాశించింది.

భరతుడు రాముని ఎదుటకు వచ్చి రాజ్య పాలన గురించి ఈ విధంగా చెప్పాడు. రాముని సుపరిపాలన గురించి ప్రజలు, సచివులు సామంతులు చాల గొప్పగా ప్రశంసిస్తున్నారు.

అగ్రజా! నీ పట్టాభిషేకం జరిగి ఒక నెలపైగానే గడిచినప్పటికీ ఇప్పటికే వ్యాధిగాని, అకాల మృత్యువుగాని, స్త్రీలకు ప్రసవ వేదనలు గానీ ఎక్కడా లేనే లేవు. మేఘాలు సకాలంలో వర్షాలు కురిపిస్తున్నాయి. ప్రజలంతా ఆనందమయమైన మనస్సుతో ఉన్నారు. భరతుని ప్రశంసలను వింటూ రాముడు అమితమైన ఆనందాన్ని పొందాడు.

యావత్ప్రపంచానికి ఎంతమంది రాజులు, చక్రవర్తులు, ప్రభుత్వాలు, పాలకులు ఎంతగా శ్రమించినా లభించనటువంటిది రాముని సుపరిపాలన. శ్రీరాముడు ప్రజల మనిషిగా తన స్వార్థాన్ని వదలి ధర్మం, రక్షణ, బాధ్యత, ఆదర్శం అనే నాలుగు గట్టి స్తంభాల వంటి పునాదులపై నిర్మించిన రాజ్యం. సర్వకాల సర్వావస్థలయందు ప్రజాసమస్యల పట్ల ఆసక్తి కలిగి వుండి ప్రజల పట్ల విసుగు చెందని వాడు రాముడు. తన జీవితాన్ని ప్రజాప్రయోజనాల కోసమే వెచ్చించిన సత్పరిపాలకుడు దాశరథి.

**శ్రీరాముడు తన సోదరులతో సమానంగా ప్రజలను ప్రేమించాడు. వారి దుఃఖాలను, కష్టాలను తనవిగా భావించాడు. ప్రజల కోసం, ధర్మంకోసం సుఖాలను త్యాగం చేశాడు.**

**శ్రీరాముడు ప్రజల అభీష్టం ప్రకారం రాజ్య పాలన సాగించాడు. ప్రజాభిప్రాయానికి విలువ ఇచ్చాడు. ప్రజలను కన్న బిడ్డల వలె చూచేవాడు.**

అసలు రఘువంశ రాజులు ప్రజల పక్షం వారు. ప్రజలు తమ తల్లి దండ్రుల కన్నా పాలకులనే అధికంగా ప్రేమించే వారంటే వారి పాలనలోని నిబద్ధత, నిస్వార్థం ఎలాంటివో తెలుస్తాయి.

**"మాతా పృథివీ పుత్రో - హం పృథివ్యా" అన్న వేదవాక్యాన్ని అనుసరించి – తల్లి భూమాత అయితే ఆ భూమిని పరిపాలించే భర్త రాజే. పాలకుడెవరైనా ప్రజలకు కన్న తండ్రి కంటే ఎక్కువ.** ఈ విషయంలో రఘువంశంలోని దిలీపమహారాజే మనకు ఆదర్శమని కాళిదాసు మహాకవి రఘువంశ కావ్యంలో కీర్తించాడు. ప్రజలకు బుద్ధులు నేర్పడంలో గానీ, రక్షించటంలో గానీ, భరించి పోషించడంలో గానీ తండ్రి వంటివాడు దిలీప మహారాజు. రాజులు బాధ్యతల్ని నిర్వర్తిస్తూ ఉండగా ఆయా ప్రజల కన్న తండ్రులు కేవలం వారి జన్మ కారకులుగా మాత్రమే మిగిలి పోతున్నారట. పాలకులు ప్రజలను కన్న బిడ్డలుగా భావించి పాలించినపుడే ఆ రాజుకు, రాజపదవికి వన్నె చేకూరుతుంది.

ప్రాణ త్యాగానికైనా సిద్ధపడే వాడే పాలకుడు. అందుకే విశ్వామిత్రుని కోరిక మేరకు తాటకాది రాక్షసులను రాముడు ఎదిరించాడు. అరణ్యంలో ఉన్నా తన కుటుంబ క్షేమం కంటే ప్రజల యోగ క్షేమాలు భరతునితో సంభాషించేవాడు. ఉత్తమ పాలన అందించటానికి భరతునికి సలహాలు ఇచ్చి మంచిని చెప్పేవాడు. పాలకునికి నిశిత పరిశీలన కావాలి. అది పర్యటనల ద్వారా, పాదయాత్రల ద్వారా, ప్రజలను స్వయంగా రాజు కలియుట ద్వారా లభిస్తుంది. **అందువల్ల రాముడు ప్రజల వద్దకు ప్రజల కోసమే వెళ్ళేవాడు.**

### ఆదర్శ రాముడు

ధర్మబద్ధంగా రాజ్యమేలిన వాడు రాముడు. ప్రతి చిన్న విషయానికి ధర్మాన్ని జోడించి ధర్మ పరిపాలకునిగా కీర్తి గడించాడు. రామ రావణ



యుద్ధంలో గూడ ధర్మయుద్ధమే చేశాడు. శత్రువు విషయంలోనూ ధర్మంగా ప్రవర్తించాడు. అపకారికి గూడ ఉపకారం చేశాడు శ్రీరామచంద్రుడు. హృదయపూర్వకంగా రాజ్యాన్ని పాలించాడు రాముడు. ధర్మ నిరతితో నిజాయితీతో, నిబద్ధతతో రామరాజ్యాన్ని స్థాపించాడు. ధర్మంకోసం అరణ్యానికి వెళ్ళాడు. ధర్మాన్ని రక్షించటం కోసం రావణాది రాక్షసులను వధించాడు. పితృ వాక్యాన్ని ధర్మం అంటూ శిరసావహించాడు. అదే ధర్మం కోసం తనభార్య సీతతో వియోగాన్ని అనుభవించాడు. ఇలా రాముడు అన్ని సమయాలలో ధర్మాచరణ కొనసాగిస్తూ ధర్మరక్షకునిగా పేరు పొందాడు. అందుకే శ్రీరాముని **"రామో విగ్రహవాన్ ధర్మః – మూర్తీభవించిన ధర్మస్వరూపుడు రాముడు.**

శ్రీరాముడు మానవులతో బాటు సకలప్రాణికోటిపై ప్రేమ గలవాడు. పశు, పక్ష్యాదులు, వన్య మృగాలు రాముణ్ణి అభిమానించాయి. రామరాజ్యంలో చెట్లు చిగిర్చి పూలు పూశాయి, పండ్లు కాశాయి, రాజ్యమంతా సస్యశ్యామలంగా ఉంది.

### రాజ్యాలను నిలబెట్టిన రాముడు

దశరథ రాజ్యాన్ని త్యాగంతో గెలిచాడు. కిష్కింధ రాజ్యాన్ని సఖ్యతతో నిలబెట్టాడు. రావణ రాజ్యాన్ని ధర్మంతో గెలిచాడు. ఇన్ని రాజ్యాలను చూచిన అనుభవమే రాముని ఉత్తమ పాలకునిగా నిలబెట్టింది. ఈ మూడు రాజ్యాలలోని ప్రజలు రాముని అభిమానించారు, గౌరవించారు, పూజించారు, సేవించారు. ఆ ప్రజలందరితో సన్నిహితసంబంధాలను పెంచుకున్నారు, పంచుకున్నారు. ఉత్తమ పాలకునికి ప్రజలతో ఎల్లప్పుడూ మానవ సంబంధాలు స్నేహ సంబంధాలుగా ఉంటాయనుటలో సందేహం లేదు. ప్రజలు ప్రేమించే వాడే నాయకుడు. అందుకనే, రామరాజ్యమంటే బాధలు, కష్టాలు లేని రాజ్యమనీ తెలుసుకోవాలి. ఉత్తమనాయకుడైన రాముడు నాటికి, నేటికీ, రేపటికీ ప్రజల హృదయ సింహాసనంలోనే కొలువై ఉంటాడు.

**ధర్మో రక్షతి రక్షితః**

ధర్మాన్ని ఎవరు రక్షిస్తారో వారిని ధర్మమే కాపాడుతుందని మహర్షుల ప్రబోధం. ఆ ధర్మానికి శ్రేష్ఠమైన మంచిపనే ఆధారం. చిత్త శుద్ధతో మంచి పనులను ఆచరించాలి. కర్తవ్య కర్మలు ఆచరించటం మానవుల ధర్మమని వేదం ఘోషిస్తోంది.

శ్రీరామచంద్రుడు తన జీవిత కాలమంతా సత్య, ధర్మాలను బాధ్యతాయుతంగా అనుసరించాడు. సాక్షాత్తు ధర్మమూర్తిగా ప్రసిద్ధి గాంచాడు.

అరణ్య వాసానికి వెళ్ళే ముందు శ్రీరాముడు దుఃఖిస్తున్న తల్లి కౌసల్యతో "మాతా! ధర్మాత్ములు నడచిన మార్గాన్నే నేను అనుసరిస్తున్నాను. తండ్రి ఆజ్ఞను పాలించటమే ధర్మం. జీవితం శాశ్వతం కాదు. దీనికొరకై నేను అధర్మ వ్యవహారం చేయను. ధర్మం ముందు రాజ్యం చాల నీచమైనది. దాని కొరకై తండ్రి గారిని అపఖ్యాతి పాలు కానివ్వను. అరణ్యాలకు వెళ్ళిన తరువాత తండ్రిగారికి పుత్ర శోకం వలన దుఃఖం కలుగ కుండా జాగ్రత్తగా చూచుకోవాలని తల్లికి వినయంగా నివేదిస్తాడు.

శ్రీరామచంద్రుడు తన కర్తవ్యాన్ని విస్మరించలేదు. పితృవాక్య పరిపాలనకు కట్టుబడ్డాడు. స్వీయధర్మాన్ని సక్రమంగా నిర్వహించి లోక పూజ్యుడయ్యాడు.

**మనం బాధ్యతాయుతమైన కర్మలనాచరిస్తేనే సమాజంలో గౌరవ ప్రతిష్టలు గలుగుతాయి. ధర్మాన్ని విస్మరిస్తే వ్యక్తికి సమాజంలో విలువఉండదు. మంచి పనుల ద్వారా మంచి ఫలితాలను, చెడు పనుల ద్వారా చెడు ఫలితాలను పొందుతారు. అందుకే మంచినే ఆచరించాలి. ఇతరులకు చెడు జరిగినా సహించలేరు. అందువలన ఇతరులకు మేలు కలగాలని కోరుకోవాలి.**

మన బంధువర్గం, మిత్రబృందం, పదవి, అధికారం, సార్వజన సమ్మానం మరింకేదైనా సరే మనల్ని ఒంటరిగా వదిలేస్తాయి. కాని, ధర్మం అలాకాదు. మనిషి ఈ లోకాన్ని వదిలి పెట్టి వెళ్తున్నా మనిషితో పాటు



వెళ్తుంది ధర్మం. అందువలననే అది మనిషికి నిజమైన తోడు-నీడ. నిజమైన మిత్రుడు, సంబంధి, గురువు కూడా. ధర్మాన్ని సర్వకాలాల్లో అనుష్ఠించి ప్రతిష్ఠించటానికే సీతాదేవిని, లక్ష్మణుణ్ణి శ్రీరామచంద్రుడు వదిలి పెట్టవలసి వచ్చింది. ఈ ధర్మం పాలించటానికి శ్రీరాముడు, తర, తమభేదం లేదనీ అందరికీ ఒకే ధర్మం వర్తిస్తుందని నిరూపించాడు. లోకంలో ధర్మ ప్రతిష్ఠాపన చేయుటానికి శ్రీరాముడు మానవ రూపం దాల్చాడు. అందుకే శ్రీరామావతారం మహత్తరమైంది. ధర్మాచరణకు అవకాశం ఉండటం వలన మానవజన్మ శ్రేష్ఠమైనదని చెబుతారు.

**అన్నదమ్ముల అనుబంధాలు**

వాల్మీకి రామాయణంలో (అయోధ్య కాండ 40-9) సీతారామ లక్ష్మణులు వనవాసానికి బయలుదేరే సమయంలో సుమిత్ర తన కొడుకు లక్ష్మణునితో ఇలా సంబోధిస్తుంది.

**"రామం దశరథం విద్ధి మాం విద్ధి జనకాత్మజామ్ ।**
**అయోధ్యా మటవీం విద్ధి గచ్ఛ తాత యథా సుఖమ్ ॥"**

"నాయనా! లక్ష్మణా! రాముణ్ణి మీ తండ్రి దశరథునిగా భావించు. సీతా దేవిని నన్నుగా (తల్లి) తలంచు. అరణ్యాన్ని అయోధ్య అనుకో. సుఖంగా వెళ్ళు'. అని చెబుతుంది.

సుమిత్ర అభిప్రాయాన్నే సుందరకాండలో సీత హనుమంతునితో చెప్తుంది. అరణ్యవాస కాలంలో లక్ష్మణుడు శ్రీరాముని తండ్రివలె, నన్ను తల్లి వలె సేవించాడని **'పితృవద్వర్తతే రామే' మాతృవన్మాం సమాచరన్'** అని సీత అంటుంది. ఈ విధంగా, అన్నను తండ్రి వలె, వదినను తల్లి వలె పూజింపవలెనని రామాయణం మంచిని చెప్పింది. సీతారాములు పాద పద్మాల చెంత ఉన్న తనకు అలసట లేదని లక్ష్మణుడు అంటాడు. లక్ష్మణుని సేవలకు మురిసిపోయిన రాముడు, తండ్రి దశరథుడు మరణించిన విషయమే మరచిపోయినాడట.

అన్నా వదినల సేవకోసం లక్ష్మణుడు ప్రాణత్యాగానికి గూడ సిద్ధ పడ్డాడు. హనుమంతుడు తెచ్చిన సంజీవిని ఓషధులతో లక్ష్మణుడు తిరిగి బతికాడు. లక్ష్మణుడు యుద్ధంలో పడిపోయినపుడు రాముని హృదయాన్ని కలచి వేసింది. తన తమ్ముణ్ణి బతికించిన హనుమను హృదయానికి చేర్చుకొని కృతజ్ఞత తెలిపాడు. రాముడు హనుమకు సోదరస్థానం ఇచ్చి ఆదరించాడు.

రామ వనవాసానికి భరతుడు చాల దుఃఖపడతాడు. తానులేని సమయంలో తన తల్లి కోరిన వరాలతో ఈ సమస్య వచ్చిందని గ్రహించి తల్లిని నిందిస్తాడు. పితృ కర్మ చేసి, రాముణ్ణి రాజ్యానికి తీసుకొని రావటానికి సిద్ధమైనాడు. తనకు ఎటువంటి ద్రోహబుద్ధి లేదని, తన్ను క్షమించమని రాముణ్ణి వేడుకుంటాడు. చిత్రకూటానికి పోయి రాముణ్ణి చూడాలనే భరతుని ఆలోచన. అతని సోదర ప్రేమకు తార్కాణం. అన్నకే అగ్రతాంబూలం ఇవ్వాలని భరతుని ఆరాటం. రాముని సుందర వదనం, చిరునవ్వు చూడందే తనకు శాంతి లేదని అన్నాడు. రాముని పాద పద్మాలకు నమస్కరించనిదే నాకు శాంతి చేకూరదు అంటాడు భరతుడు. వదిన సీతను, మహాబలుడు లక్ష్మణుణ్ణి చూచేవరకు తనకు శాంతి లేదంటాడు.

రాముడు లేకుండా తాను అయోధ్యలో అడుగు పెట్టనని అంటాడు భరతుడు. రాముని పాదుకలు తీసుకుని వెళ్ళి సింహాసనం మీద ఉంచి రాజ్యం చేస్తాడు. జటావల్కలాలతో నంది గ్రామంలో నివసిస్తాడు. పద్నాలుగేళ్ళ తర్వాత రాముడు తిరిగి అయోధ్యకు రాకపోతే అగ్ని ప్రవేశం చేస్తానని అంటాడు.

**తండ్రి ఆజ్ఞ ప్రకారం భరతుడే రాజ్యం పాలించటం ధర్మమని రాముడంటాడు. భరతుని భక్తికి మెచ్చి "భరతుణ్ణి పోలిన సోదరులు దొరకరు" అని రాముడు ప్రశంసిస్తాడు. మీకు లేని సుఖం నాకెందుకు అంటాడు రాముడు. నాకు ఇంద్రపదవి దక్కినా నేను ఇష్టపడను. భరతునకు, శత్రుఘ్నునకు, లక్ష్మణునికి అందని సుఖం నాకు కలిగితే దాన్ని అగ్ని భస్మం చేయుగాక! అని రాముడు అన్నాడు.**



**అన్నదమ్ములు అందరూ సమానంగా ఉండాలి. సుఖాలు అందరకు కలగాలి. అందరూ ధర్మం ఆచరించాలి. ఒకరినొకరు అనురాగ బద్ధులై మెలగాలి. అన్నదమ్ముల అనుబంధం చరిత్రలో శాశ్వతంగా నిలచి పోవాలి. నలుగురు సోదరులు ఒకరినొకరు చూచుకోవడం, మాట్లాడుకోవడం, కలియడం, ప్రేమించడం, నవ్వుకోవడం మొదలైనవి వారి సోదరుల మమకారానికి నిదర్శనం.**

**రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నుల ప్రేమ లోకానికి ఆదర్శం. వర్తమాన, భవిష్యత్తుకాలాలలో అన్నదమ్ములు ఆ విధంగా మెలగాలని రామాయణం హిత బోధ చేస్తోంది.**

### తల్లిదండ్రులు - తనయుల సంబంధాలు

**తల్లి దండ్రులను ప్రత్యక్ష దైవాలుగ భావించి, వారికి విధేయులై ప్రవర్తించమని రామాయణం కూడ హితవు చెప్పింది. "యతో మూలం – ప్రత్యక్షే సతి దైవతే" ప్రత్యక్ష దైవ స్వరూపుడైన తండ్రి ఆజ్ఞను పరిపాలించే వారెవ్వరూ చెడిపోరని వాల్మీకి సందేశం. దైవంగా భావించే నా తండ్రి ఆజ్ఞను నేను తప్పక నెరవేరుస్తాను. దేవతలకు సైతం తండ్రే దైవం అనేది శ్రీరాముని నిర్ణయం.**

**తండ్రే ధర్మం, తండ్రే స్వర్గం అంటూ తండ్రినే స్తుతించినంత మాత్రాన తల్లిని తక్కువగా భావించకూడదు. తండ్రి పై ఎలాంటి గౌరవ బుద్ధి ఉంటుందో తల్లి పై కూడా అదే బుద్ధి ఉండాలనే భావాన్ని వాల్మీకి చక్కగా వర్ణించాడు. తల్లిదండ్రులు అమృతహృదయులు. వారు కొడుకుల బాగు ఎల్లప్పుడూ కోరుకుంటారు.**

రామలక్ష్మణ, భరత శత్రుఘ్నులు నలుగురు ఒకే తల్లి గర్భవాసంలో జన్మించకపోయినా అన్యోన్యత, ఆప్యాయతలతో ధర్మబద్ధంగా

నడుచుకున్నారు. నలుగురిలో ఎవరూ గాని కౌసల్య, కైకేయి, సుమిత్రలను మారు తల్లులుగా, సవతి తల్లి భావన వారి మనస్సులో లేకుండా ముగ్గురిని సమభావనతో తల్లులుగానే వాత్సల్యం ప్రదర్శించేవారు. ముగ్గురిని 'మాతాజీ' అనే సంబోధించి పలికేవారు. సుమిత్రాదేవి తన ఇద్దరు కుమారులలో లక్ష్మణుణ్ణి రాముని సేవలకును, శత్రుఘ్నుని భరతుని సేవలకును వినియోగించిన త్యాగమూర్తి.

కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు రచించిన శ్రీమద్రామాయణ కల్పవృక్షం గ్రంథంలో బాలకాండలో (340 ప. 82 పేజి) తల్లి, కొడుకుల అనుబంధాన్ని ఎంతో చక్కగా వర్ణించారు.

శ్రీరామచంద్రుణ్ణి విడిచి కౌసల్య ఉండలేదు.
శ్రీరామభద్రుణ్ణి విడిచి కైకేయి ఉండలేదు.
శ్రీరఘుకుల రత్నాన్ని విడిచి లక్ష్మణుడుండడు.
శ్రీరామలక్ష్మణులున్న చోటనే సుమిత్ర ఉంటుంది.

దశరథమహారాజుకు, ఆయన ముగ్గురు భార్యలకు రామునిపై మమకారం, ముద్దు, మురిపెములు ఎక్కువగా ఉన్నవని కవి భావం.

**తల్లిదండ్రుల పట్ల తనయుడు విధేయతతో నడచుకోవటమే మానవ ధర్మమని, సనాతన ధర్మమని, సన్మార్గమని అనేక విధాలుగా వాల్మీకి వ్యక్త పరిచాడు. 'పితృవాక్య పరిపాలన' అనే ధర్మాన్ని పూర్వులు కూడా అంగీకరించినదే, ఆచరించినదే.**

మాతా పిత పాదసేవాభాగ్యంలో దాగివున్నది మాధవ సేవే. ఈ సత్యం అనుభవంలోకి వచ్చి పరమేశ్వరుణ్ణిపొందే అవకాశం కూడ కలిగిస్తుంది. తండ్రి, కొడుకులమధ్య అవినాభావసంబంధాలు ఆరోగ్యకరంగా ఉండాలి.

రాముడు అరణ్యవాసంలో నున్న సమయంలో తల్లులు ముగ్గురి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ ఉండేవాడు. తల్లులకు ఎటువంటి కష్టాలు కలుగకుండా జాగ్రత్త వహించమని భరతుణ్ణి ఆదేశించేవాడు.



భరతుడు తన తల్లి కైకేయిని దూషించ గూడదని, తల్లి మనసు బాధకు గురిచేయ గూడదని హెచ్చరికలు చేసేవాడు రాముడు. లక్ష్మణుడు గూడ అరణ్యాలకు సీతా రాములతో వెళ్లే సమయంలో తన తల్లి సుమిత్రకు చెప్పి ఆజ్ఞ తీసుకుని, ఆశీస్సులు స్వీకరించి రఘువంశ రాజుల సదాచారాన్ని పాటించాడు.

పూర్వపు మహాపురుషుల, రాముని సోదరుల వంటి సేవాభాగ్యమే కుటుంబ వ్యవస్థకీ, వంశాభివృద్ధికి, సమాజానికి, దేశానికి ఎంతో మేలు చేస్తుంది. శాంతి చేకూరుస్తుంది. అధర్వవేదంలో కుటుంబసభ్యుల మధ్య అనురాగం గురించి ఇలా వివరించటం జరిగింది.

**ఓం మాభ్రాతా భ్రాతరం ద్విక్షన్ మా స్వసారముత స్వసా ।**
**సమ్యం చ న వ్రతా భూత్వా వాచం వదత భద్రయా ॥ (అధర్వవేదం)**

అన్నదమ్ముల మధ్య వైర భావం, ద్వేషం ఉండరాదు. అక్కచెల్లెళ్ళు ద్వేషించుకో గూడదు. కుటుంబ సభ్యులంతా అనురాగ సూత్రంలో ముడిపడి ఉండాలి. వేదధర్మం నాటికి, నేటికి, ఏనాటికి నిత్యమే! సత్యమే!!. శాశ్వత హితబోధ అన్నియుగాలకు, అన్ని కాలాలకు, అందరికీ అన్వయిస్తుంది. నవతరానికి, యువతరానికి రామాయణంలోని సోదర ప్రేమ ఆదర్శం, ఆచరణీయం. వైదిక సంస్కృతికి ప్రతీకలే రామలక్ష్మణులు.

**ధర్మంతోనే మనుగడ**

**ధర్మో హి పరమో లోకే ధర్మే సత్యం ప్రతిష్ఠితమ్ ।**
**ధర్మ సంశ్రితమే తచ్చ పితుర్వచన ముత్తమమ్ ॥**
**(అయోధ్యాకాండ,(21-40)**

లోకంలో సర్వశ్రేష్ఠమైంది ధర్మం. ధర్మంలోనే సత్యం ఇమిడి వుంది ధర్మానుకూలమైనందువల్ల తల్లి ఆజ్ఞ కంటే తండ్రి ఆజ్ఞ శ్రేష్ఠమైందని శ్రీరాముడు మాత కౌసల్యాదేవితో వనవాస సందర్భంలో అంటాడు.

నేను నారచీరలు, జింకచర్మాన్ని ధరిస్తాను, ఫలాలను, కందమూలాలను, భుజిస్తాను. నేను నా తండ్రిగారి ఆజ్ఞను, శ్రేష్ఠధర్మాన్ని పాలిస్తాను. వనాలలో సంచరిస్తూ తపస్విగా జీవిస్తానని శ్రీరామచంద్రుడు ప్రతిజ్ఞ చేస్తాడు.

అయోధ్యకాండలో **"రామోద్విర్నాభిభాషతే"** అంటాడు వాల్మీకి. అంటే శ్రీరాముడు ఒకేమాట మీద ఉంటాడు. లక్షలాది సంవత్సరాలు గడచినా, మర్యాదా పురుషోత్తమముడైన శ్రీరాముని ధర్మ, వైదిక మర్యాదామయ పవిత్ర చరిత్ర ప్రజలకు స్ఫూర్తిని కలిగిస్తుంది. బాల్యం నుంచి చివర వరకు ఆయన జీవనం పై పరిశోధన చేసి దృష్టిసారిస్తే ఎప్పుడూ ఆయన మర్యాదను ఉల్లంఘించినట్లు కనపడదు.

శ్రీరామచంద్రునిలో పితృవాక్యపరిపాలన, ఏకపత్నీవ్రతం, సోదరవాత్సల్యం జగద్విఖ్యాతి చెందినది. ఇవన్నీ ధర్మబద్ధంగానే ఆచరించాడు. ప్రజల చేత ఆచరింపచేశాడు. అందుకే ప్రజల దృష్టిలో శ్రీరాముడు దేవుడు, లోకపూజ్యుడుగా పేరు, ప్రశంసలు పొందాడు.

శ్రీరాముడు 'శ్రీ'తో కూడినవాడు. శత్రువినాశకుడు, సమస్త ప్రాణుల రక్షకుడు, ధర్మ రక్షకుడు. ఆశ్రయించిన వారికి అభయమిచ్చేవాడు. ఆయన వేదాలను, వ్యాకరణాది వేదాంగాలలోని తత్త్వాలను చక్కగా అర్థం చేసుకున్నవాడు. ధనుర్విద్యలో నేర్పరి.

శ్రీరాముడు మూర్తీభవించిన ధర్మం. ధర్మం ఒక ఆకారం ధరిస్తే శ్రీరాముడు. ధర్మం స్థూలంగానే గాక, సూక్ష్మరహస్యాలతో కూడుకున్నది. ఆ సూక్ష్మాన్ని పరిశీలిస్తే పరిపూర్ణ ధర్మం శ్రీరాముని నడతలో గోచరిస్తుంది. సీతమ్మ చరిత్రలో ప్రస్ఫుటిస్తుంది.

## గౌరవించడం రాముని లక్షణం

ప్రతివ్యక్తి తనను ఇతరులు గౌరవించాలని అనుకుంటాడు. కాని శ్రీరాముడు మాత్రం తాను ఇతరులను గౌరవించాలనే ఉత్తమ లక్షణం గలవాడు.



సుగుణాలలోను, ఆభిజాత్యంలోనూ, ప్రతిభలోనూ, పరాక్రమంలోనూ, ధర్మాచరణలోనూ, సర్వాధికుడే గాని, తన ఆధిక్యతను, గర్వాన్ని, అహంభావాన్ని ఎక్కడా ప్రదర్శించడు. అసలు అవన్నీ ఆయన మనసులో లేవు. 'తన విక్రమానికి తానే విస్మయం చెందడు' అని వాల్మీకి శ్రీరాముని ప్రశంసించాడు.

గుహుడు ఎదురై స్వాగతం పలికి, ఆతిథ్యమివ్వబోతే 'మిత్రమా! నాకోసం కాలికి చెప్పులు కూడా లేకుండా, స్నేహ పూర్వకంగా ఉన్న పాటున వచ్చావు. ఇదే నాకు ఆతిథ్యం" అని మనసారా కౌగలించుకున్నాడు శ్రీరామచంద్రుడు. ఆటవికరాజైన గుహునకు, మహారాజైన రాముడిచ్చిన మర్యాదచూశారా!

పక్షిరాజైన జటాయువుకి, శబరికి రాముడిచ్చిన ఆదరణ, వానరులతో సాంగత్యం, ఇవన్నీ తనను గౌరవించాలనే తపన కన్నా, ఇతరుల్ని గౌరవించే సంస్కారాన్ని తెలియజేస్తున్నాయి. ఈ లక్షణమున్నవారు అందరిచేత గౌరవం పొందుతారు. అటువంటి వారికి మానవ సంబంధాలు పెరగటానికి, గౌరవించటం ఒక సాధనగా ఉపకరిస్తుంది.

## దంపతుల ఆదర్శ జీవనం

**"చతుర్ణామాశ్రమాణాం చ గార్హస్థ్యం శ్రేష్ఠముత్తమమ్"** అని వాల్మీకి రామాయణ కావ్యం ద్వారా సందేశమివ్వటం జరిగింది. అంటే – భారతీయ సంస్కృతిలో నాలుగు ఆశ్రమాలున్నాయి. అందులో గృహస్థాశ్రమం శ్రేష్ఠమైనదని వాల్మీకి మహర్షి అంటున్నారు. పూర్వకాలంలో బ్రహ్మచారులను, వాన ప్రస్థులను ఈ గృహస్థులే పోషించేవారు. వివాహితులై గృహస్థాశ్రమాన్ని స్వీకరించేదంపతులకు ముందుగా నిర్మలమైన మనస్సు, స్నేహ పూరితమైన మాట, నిండైన హృదయం, విశాలమైన ఉదార స్వభావం ఉండాలి. తల్లి దండ్రులలోని ఈ మంచి లక్షణాలు వారి సంతానానికి రావాలి. ఉత్తమ

గృహస్థులు సామాజిక ధర్మాన్ని విడవకూడదు. పవిత్రమైన మానవ సంబంధాలను జాగ్రత్తగా కాపాడుకోవాలి.

**గృహబాధ్యతలను భార్యాభర్తలిద్దరు సమానంగా పంచుకోవాలి. ఎవరి ధర్మాన్ని వారు సక్రమంగా నిర్వహించాలి. భార్య వలన భర్త, భర్త వలన భార్య, ప్రసన్నంగా, అనురాగబద్ధులై ఉండాలి. ఒకరి యందు మరొకరికి విశ్వాసం, ప్రేమ వుండాలి. భర్త మనోవాక్కాయ కర్మలతో తన భార్య యందే మనసును లగ్నం చేయాలి. భార్య త్రికరణ శుద్ధిగా తన భర్తతోనే పరిపూర్ణమైన అనురాగాన్ని పొందాలి. ఎవరి వ్యక్తిత్వాన్ని వారు కాపాడుకుంటూ మంచి చరిత్రవంతులై వర్ధిల్లాలి.**

## రామాయణకాలంలో గురుశిష్య సంబంధాలు

ఆనాటి విద్యాలయాలు మానవీయ విలువలతో చేర్చిన విద్యను చదివించి విద్యార్థులను సంస్కారవంతులుగా తీర్చిదిద్ది క్రమశిక్షణతో విద్యను పూర్తి చేసేవారు. యుగయుగాలుగా వేద సమ్మిళితంగా ఋషిప్రోక్తంగా భాసిస్తూ వస్తున్న మన భారతీయ విద్యా సంస్కృతి సనాతనం. భారతీయ గురుకుల విద్యావిధానం మహోన్నతం. లౌకిక పారలౌకిక విజ్ఞాన సర్వస్వం భారతీయ విద్యావిధానంలో దృగ్గోచరం అవుతుంది. కృతయుగంలో ప్రహ్లాదుని గురుకులవాసం, త్రేతాయుగంలో దశరథపుత్రుల గురుకులవాసం, ద్వాపరయుగంలో కృష్ణ, కుచేలగురుకులవాసం మరియు కౌరవపాండవుల గురుకుల విద్యాభ్యాసం ప్రముఖమైనవి. మొన్నమొన్నటి తక్షశిల, నలంద, వారణాసి, ధాన్యకటకం వంటి గురుకుల విశ్వవిద్యాలయాలను ప్రత్యక్షప్రమాణాలుగా చెప్పుకోవాలి.

రామాయణకాలం నాటి విద్యావిధానాన్ని గురించి శ్రీకుసుమా తాండవకృష్ణగారు వారి పరిశోధనలో కొన్ని విషయాలను తెలియపర్చటం జరిగింది. ఆ విషయాలను ఈ సందర్భంలో గుర్తు చేసుకుందాం. వాల్మీకి



రామాయణమే దీనికి మూలాధారం. దశరథ మహారాజు రాజ్యంలో శాస్త్ర జ్ఞానంలేనివాడు, అశక్తుడు, విద్యలేని వాడు, అసత్యవాది, నాస్తికుడు లేడని వాల్మీకిఋషి మాట.

ఆకాలంలో తల్లిదండ్రులు బాలురను గురువుల పర్యవేక్షణలో గురుకులాలలో వుంచి విద్యాబుద్ధులు చెప్పించేవారు. గురువులు బాలుర మనోవికాసాన్ని పెంపొందించుతూ సుశిక్షణతో సఖ్యత, సంస్కారం, సంస్కృతులను నేర్పేవారు. అన్నివిధాలా యోగ్యులుగా తీర్చిదిద్దటమే వారి జీవితలక్ష్యంగా భావించేవారు. శిష్యులకు విద్యనేర్పటం, ఆదర్శవంతులుగా సమాజానికి మూలస్తంభాలుగా నిలపటం వారి ధ్యేయం. గురువు వ్యక్తిత్వం కూడా దానికి తగినట్లు ఆదర్శప్రాయంగా ఉండేది.

విద్యార్థులు అంచెలంచెలుగా ఉన్నత స్థానాలకు ఎదిగేవారు. విద్యార్థుల దృష్టిలో సోదరునిలాగా గురువులు కూడా గౌరవించబడేవారు. గురువు కన్న ఉత్తమ విద్యాదాత వేరెవరూ లేరని, విశ్వసించేవారు. **తల్లిదండ్రులు జన్మకారకులైతే గురువు జ్ఞాననేత్రాలు తెరిపించేవాడని ఉన్నత గౌరవస్థానం ఇచ్చేవారు.**

విద్యార్థిదశలో ఇంద్రియనిగ్రహం అత్యంతముఖ్యం అనీ, తపస్సులాగే విద్యను ఉపాసించి ఆర్జించాలని కఠిననియమం ఉండేది. ఆ సమయంలో త్యాగం, సహనం తప్పక పాటించవలసి ఉండేది. విద్యాభ్యాసం పూర్తయ్యే వరకు విద్యార్థులు బ్రహ్మచర్యనిష్ఠను పాటించేవారు. వినయవిధేయతలతో గురువును సేవించటం, ఆశ్రమ పరిశుభ్రత, హోమద్రవ్యసేకరణ, సమిధలు, దర్భలు, ఫలమూలాలు సిద్ధం చేయటం వల్ల యజ్ఞయాగాది శిక్షణ అలవడేది. బ్రాహ్మీముహూర్తస్నానం, త్రిసంధ్యోపాసన, అగ్నికార్యం, గురువులకు గౌరవప్రణామాలు ఇవన్నీ నిత్యకృత్యాలు. ఇటువంటి నిత్యనైమిత్తిక కార్యక్రమాలవల్ల ఉత్తమ ప్రవర్తన, నేర్పరితనం సాధనగా అలవడేవి.

పనులవల్ల గురు శిష్యసంబంధాలు తండ్రి కొడుకులవలె వాత్సల్యంతో ఉండేవి.

జ్ఞానవిజ్ఞానాలు వెల్లివిరిసే అనేక ఆశ్రమ విద్యాలయాలు దేశమంతటా ఉండేవి. వాల్మీకి ఆశ్రమం మహోన్నత వేదవాఙ్మయానికే కాదు, లలితకళలకు గూడ ఆటపట్టు. సీతారాముల పుత్రులు కుశలవులు వాల్మీకి ఆశ్రమవాసులే, వారికి అన్ని విద్యలతో బాటు సంగీతం, అభినయంకూడ నేర్పించారు వాల్మీకి మహర్షి.

## అధ్యయన కేంద్రాలు

యజ్ఞవాటికలు విద్యాయాత్రాస్థలాలుగా (నేటి Study Tours) ఉండేవి. గురువులు విద్యార్థులు ఎల్లప్పుడూ కూపస్థ మండూకాల్లాగా ఆశ్రమంలో ఉండేవారు కాదు. జ్ఞానాన్ని శాస్త్ర పాండిత్యాన్ని పెంచుకొటానికి వేరు వేరు ఆశ్రమాలను పర్యటించేవారు. ఒక గురువు వద్ద నుంచి మరొక గురువు వద్ద విభిన్న విద్యారీతుల కోసం మారే పద్ధతి ఉండేది. శిష్యులు గురువుల వద్ద అణకువ, వినయవిధేయులుగా వుంటూ జ్ఞాన సముపార్జన చేసేవారని తెలుస్తోంది.

మిథిలానగరంలో జరిగే జనకమహారాజు చేసే యాగానికి కౌశికముని తన శిష్యులను తీసుకువెళ్ళాడు. వాల్మీకి మహర్షి తన శిష్య బృందంతో శ్రీరాముని అశ్వమేధయాగానికి తీసుకువెళ్ళాడు. ఆ సమయంలో జరిగే శాస్త్ర చర్చలు విద్యార్థులకు ఎంతో ఉపకరించేవి. ఆశ్రమవాసుల జీవితం కేవలం ఆశ్రమానికే పరిమితం కాదు. సామాజిక సంబంధాలు కూడా ఉండేవి. రామ వనవాస కాలంలో జరిగే సంఘటనలన్నీ భరద్వాజ మహర్షి తన తపఃశ్శక్తితో తెలుసుకునేవాడు. ఆయన శిష్యులు మిథిల, నందిగ్రామం మొదలైన నగరాలకు వెళ్ళి వస్తూ అన్ని సంగతులూ తెలుసుకునేవారు. శ్రీరాముడు వనవాసం నుండి మరలి వస్తూ భరద్వాజాశ్రమంలో ఆగినప్పుడు



"మహర్షీ! నా తల్లుల, ప్రజల, భరతుని క్షేమాలు ఏమైనా తెలుస్తున్నవా? అని అడిగితే "రామా! అందరూ క్షేమంగా, ఉన్నారు. శిష్యుల ద్వారా వారి క్షేమం తెలుస్తూనే ఉన్నది". అని అనటం వల్ల శిష్యులే సమాచార వైతాళికులుగా ఉండేవారు. గురుశిష్య సంబంధాలు, సామాజిక సంబంధాలే మానవ సంబంధాల మెరుగు పడడానికి, పెంచుకోటానికి ఉపయోగపడతాయి. అవి ఆనాటి విద్యావిధానం ద్వారా బంధాలు ఏర్పడటానికి సాధనాలుగా ఉండేవి.

రామాయణంలో విద్యావంతునికి ఉండవలసిన ఉత్తమ లక్షణాలుగా 'సత్యం, ఇంద్రియ నిగ్రహం, కర్తవ్యనిష్ఠ, మనోవాక్కాయ కర్మలతో పవిత్ర జీవనం" భావించెడివారు. ఆ కాలంలో కొన్ని గూఢ విద్యలు గూడ నేర్పబడేవి. విశ్వామిత్ర మహర్షి రామలక్ష్మణులకు "బల" "అతిబల" అనే విద్యలను, అలౌకిక శక్తులను ధారపోశాడు. వాటివల్ల శారీరక మార్పురాదు. చింత ఉండదు. నిద్రలోనైనా ఆదమరచి ఉన్నపుడైనా శత్రువులు యేమి చేయలేరు. సమయస్ఫూర్తి, ఏ ప్రశ్నకైనా సమాధానం చెప్పగల చాతుర్యం, ఆకలి దప్పికలు లేక పోవటం, సమస్త విజ్ఞాన రాశి కరతలామలకం కావటం అనే బుద్ధి సూక్ష్మతగల విద్యలు ఆనాటి మహర్షులు తపస్సుతో ద్రష్టలై సాధించిన గూఢ విద్యలు. శక్తి మంత్ర సముదాయం అధ్యయనం చేయించేవారు. వ్రాత ప్రతులుగా తాటాకు గ్రంథాలు వాడినా స్వాధ్యాయమే ఎక్కువగా ఉండేది.

గురుశిష్యులమధ్య పాఠ్యపుస్తకాల తెరలు ఉండేవి కావు. గురు ముఖతః విద్యాభ్యాసమే ఉండేది. దీనివల్ల జ్ఞాపకశక్తిని వికాసవంతం చేసేందుకు గురువులు కంఠస్థం చేయించేవారు.

విశ్వామిత్రమహర్షి కథలు కథలుగా సృష్టి చరిత్రనంతా పదహారేళ్ళకే రామలక్ష్మణులకు చెప్పి వినోదాన్ని, విజ్ఞానాన్ని, వికాసాన్ని నూరిపోశాడు.

ఇటువంటి విద్యా విధానాన్ని విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు, వేదవిద్యాసంస్థలు కోరుకుంటున్నాయి. రామాయణంలోని విద్యాప్రణాళిక నేటికి ఆదర్శమే!

అభ్యాసం లేకపోతే విద్య క్రమంగా క్షీణిస్తుంది, కనుక ప్రతినిత్యం ప్రాతఃకాలాన్నే లేచి నియమ పూర్వకంగా చదివేవారు. అటువంటి విద్యకు ఋష్యశృంగుడే ఉదాహరణ. వేదపఠనం, పితృసేవ తప్ప అన్యమేమి తెలియవు. అందుకే వారికి ఎటువంటి కోరికలు లేవు, తెలియవు.

**చర్చాకార్యక్రమాలు**

విశ్రాంతి వేళల్లో విద్యార్థుల మధ్య చర్చాపోటీలు జరిగేవి. విజయోత్సాహంతో విద్యార్థులు పోటీపడేవారు. యువకుడైన రాముడు అస్త్రాభ్యాస సమయంలో తనకంటే వయసులో వృద్ధులు, జ్ఞానశీలురు అయిన వారితో సంభాషించి, వారి ఉపదేశాలను గ్రహిస్తూండేవారు". ఈ చర్చలవల్ల గురువులు, విద్యార్థులమధ్య సంబంధాలు పెరిగేవి.

**అశ్వమేధయాగం**

శ్రీరాముడు నిర్వహించిన అశ్వమేధయాగం గొప్ప విద్యాయజ్ఞ ప్రదర్శనగా చెప్పబడింది. ఆ యజ్ఞోత్సవానికి గొప్ప ఋషులు, రాజులు, వేదపారంగతులు, వైయాకరణులు, పౌరాణికులు; సాముద్రికులు; సంగీతశాస్త్రవేత్తలు; ఛందశ్శాస్త్రజ్ఞులు, జ్యోతిషశాస్త్రవేత్తలు; తర్కప్రవీణులు; కర్మవిదులు; చిత్ర కళాకోవిదులు; ధర్మశాస్త్రవేత్తలు; దర్శనసూత్రసర్వస్వం తెలిసినవారు; నృత్యవిశారదులు, ఎందరో పరివేష్టితులై ఉండేవారు. అటువంటి సభాసదుల సమక్షంలో వాల్మీకి శిష్యులు, సీతాసుతులైన కుశలవులు, రామాయణ కావ్యాన్ని మనోరంజకంగా గానం చేశారు.ధర్మశీల రామరాజ్యం మనకాదర్శం. యుగయుగాలుగా ఆ విద్యా సంస్కృతి వన్నె



తరగనిది. నాగరికత ఎల్లలెరుగనిది. యువతను మంచిపౌరులుగా తీర్చిదిద్దటమే ముఖ్య ఆశయంగా వుండేది.

వేదభూమి, యోగభూమి అయిన భారతీయ విద్యా సౌగంధం నవనవోన్మేషం అని, సనాతనం అనీ గ్రహించి విద్యావిలువలు కాపాడు కోవటం మనధర్మం.

**రామాయణ కాలంలోని విద్యావిధానం; బుద్ధివికాస విద్య; నాయకత్వలక్షణాలను పెంచే విద్య; వ్యక్తిత్వ వికాస విద్య; యుద్ధ తంత్రాల విద్యలు; శస్త్రాస్త్రవిద్యలు అన్ని మానవ సంబంధాలు, మానవ విలువలు పెంచుతూ, ఆచరిస్తూ శ్రేష్ఠమైన మానవవనరులను అభివృద్ధికి మార్గంలో నడవటానికి శ్రీమద్రామాయణం ఆదర్శం.**

**తండ్రి-కుమారుల సమావేశ సంబంధాలు**

శ్రీరాముడు అశ్వమేధయజ్ఞం నిర్వహిస్తున్నాడు. ఆ యజ్ఞ వాటికకు లవకుశులు రామాయణం గానం చేస్తూ వచ్చారు. చాలా కాలం పాటు వారు గానం చేసిన రామాయణాన్ని అపరిమితానందంతో రాముడు ఆకర్షించాడు. వారిద్దరు తన కుమారులు లవకుశులని తెలుసుకుని ఉప్పొంగిపోయాడు. సీత, వాల్మీకి ఆశ్రమంలో ఉన్నదని తెలిసి సంతోషించాడు. రామాయణగానం ద్వారా శ్రీరాముడు లవకుశులు తన కొడుకులని తెలుసుకోవటంతో వారి ముగ్గురిమధ్య బంధాలు, అనుబంధాలు పెరిగి, క్రమేపి అభివృద్ధి చెంది శ్రీరామునితో లవకుశులు అయోధ్యానగరానికి చేరారు.

తనకుమారుల మీద వాత్సల్యం పొంగి రాముని హృదయం ద్రవించింది. వెంటనే దీర్ఘాలోచనలో పడి ఆయన నిర్దోషవర్తనులైన దూతలను పిలిచి "మీరు తక్షణమే వాల్మీకి మహర్షి ఆశ్రమానికి వెళ్ళండి ఆయనతో" సీత నిజంగా నిరపరాధి అయితే, ఆమె ఏ కళంకం సోకని పవిత్రశీలవతియైతే

మీ అనుమతితో ఆమె ఇక్కడకు వచ్చి పురజనులందరి ఎదుట తను నిర్దోషిగా నిరూపించుకోవచ్చు, అని చెప్పండి. సీత రేపు ప్రాతఃకాలానికే వచ్చి నా సమక్షంలో తన పవిత్రతను నిరూపించుగాక!" అని ఆదేశించాడు. సీత వాల్మీకితో అయోధ్యకు బయలు దేరింది. సీతను కనులారా చూడాలని కోసల రాజ్యమంతటినుండి భారీ జన సందోహం హాజరైనారు. బ్రహ్మదేవుని నాయకత్వాన సకల దేవతలు ఋషిప్రముఖులు, నాగులు, సిద్ధులు మరెందరో దివ్యలోకవాసులు సమావేశమైనారు. మహాపతివ్రతయైన సీతపై అయోధ్యావాసులకు అవ్యాజమైన అభిమానం, గౌరవం ఉన్నాయని తెలుస్తోంది.

ఆ సమయంలో వాల్మీకి మహర్షి "రామా! నీకు సీతపై అనురాగమున్నప్పటికీ, ఆమె నిర్దోషిత్వాన్ని దృఢంగా విశ్వసించినప్పటికీ జనాభిప్రాయ భీతితో ఆమెను పరిత్యజించావు. సీత యొక్క పరిపూర్ణపావనత్వాన్ని నా దివ్య దృష్టితో నేను గ్రహించగలను. అందువల్ల ఈ సత్యాన్ని నీకు చాటిచెప్పటం కోసమే నేను వచ్చాను" అన్నాడు.

రాముడు ఒక్కక్షణం సీతమీద దృష్టి సారించి, సభాసదులతో "అలాగే! మహర్షి చెప్పినదంతా నేను ఆమోదిస్తున్నాను" అన్నాడు.

## సీత భూమాతలో ఐక్యం చెందటం

సీత కొంచెం తలను వంచి క్రిందికి చూస్తూ సభా సదులతో "ఓ భూదేవీ! నా విన్నపం ఆలకించు. నా వివాహం జరిగిన నాటినుంచి నేను రాముని తప్ప ఎవ్వరినైనా, ఎప్పుడైనా తలచి ఉండలేదు. రాముని కాక ఏ పురుషునినైనా, ఎప్పుడైనా ప్రేమించి ఉంటే నాకు ఆశ్రయాన్ని నిరాకరించు. అలాకాక తలపులోను, మాటలోను, చేతలోను నేను రాముని యందు మాత్రమే నిష్ఠ కలిగి ఉన్న దానినైతే ఈ దూషణ శీలుర ఎదుటకు రావలసిన అవమానాన్ని నేను పొందనవసరం లేదు. దయచేసి నీలో చోటివ్వు" అంది.



వెంటనే విచ్చుకున్న నేలలో నుంచి భూదేవి శోభాయమానంగా పైకి వచ్చింది. సీతను చేర పిలిచి ఆమెను ఒకచేతిలోకి తీసుకుని సింహాసనం పై తన ప్రక్కన కూర్చొపెట్టుకుంది. అప్పుడు దివినుండి, భువి నుండి దేవతలు, ఋషులు, రాజులు, జన సామాన్యం ఆశ్చర్యచకితులై వీక్షిస్తుండగా ఆ దివ్యసింహాసనం మెల్లగా భూగర్భంలోకి దిగిపోయింది.

తన పవిత్రతను ఇంత మహిమాన్వితంగా ధ్రువపరచినందుకు సీతను వేనోళ్ళ కొనియాడుతూ ప్రజలందరూ ఆశ్చర్యాన్ని ప్రకటించటంతో కలకలం చెలరేగింది. దివినుండి దేవతలు పుష్పవర్షం కురిపించారు, గానాలు, నృత్యాలు, సంగీత వాద్యాలతో పులకించారు.

పశ్చాత్తప్తుడైన శ్రీరామునితో బ్రహ్మదేవుడు "ఓ దేవా! దయచేసి నీ స్వరూపాన్ని గుర్తు తెచ్చుకో. నీవు దేవాది దేవుడవైన శ్రీమహావిష్ణువవి. సీత సాక్షాత్తూ లక్ష్మీదేవి. సీత ప్రస్తుతం నాగలోకంలో ప్రవేశించింది. సమీపంలో ఆమె నీ దివ్యధామమైన వైకుంఠంలో నిన్ను తిరిగి చేరుతుంది" అని అన్నాడు.

ఓ రామా! దుఃఖాన్ని వదిలి నీ దివ్యలీలలను వర్ణించే మహా కథాగానం యొక్క చరమ భాగాన్ని నీ పుత్రులనుండి ఆకర్ణించు. వాల్మీకి రచించిన ఈ శ్రీమద్రామాయణ ఇతిహాస కావ్యం విశ్వం యొక్క ఉనికి కొనసాగినంత కాలం ముల్లోకాల్లోనూ విస్తరింపచేస్తూనే ఉంటుంది" అని పలికి బ్రహ్మదేవుడు అంతర్ధానమైనాడు.

## శ్రీరాముడు దివ్యధామాన్ని చేరుకోవడం

శ్రీరాముని భూలోక లీలలు పరిసమాప్తి సమయం ఆసన్నమైంది. అందుచే కాలపురుషుడు సన్యాసి రూపంలో అయోధ్యకు వచ్చి, రాజప్రాసాదం వద్ద లక్ష్మణునితో "నేను బ్రహ్మదేవునిదూతను. నేను అతిముఖ్యమైన కార్యం మీద వచ్చినందున శ్రీరాముణ్ణి తక్షణమే దర్శింపకోరుతున్నాను" అని వెల్లడించాడు.

ఆ కాలుని స్వాగతించి స్వర్ణసింహాసనం పై ఆసీనుణ్ణి చేసి "ఓ పూజ్యుడా! నీరాక ఉద్దేశ్యమేమి? నాకు ఏమైనా సందేశం తెచ్చావా?" అని ప్రశ్నించాడు రాముడు.

ఆ దూత అందుకు సమాధానమిస్తూ "ఓ మహారాజా! బ్రహ్మదేవుని అభిలాషను నీవు గౌరవించినట్లయితే మన సమావేశం రహస్యంగా జరగాల్సిందే. ఎందుకంటే మన సంభాషణను ఎవరు విన్నా అతను త్వరలో మరణాన్ని పొందటం తథ్యమని గ్రహించబడుగాక. ఓ రామా! మధ్యలో ఎవరైనా వచ్చి అంతరాయం కలిగిస్తే వారితో సంబంధాలు తెంచుకుంటానని వాగ్దానం చేయాలి" అన్నాడు. "సరే అలాగే!" అని రాముడు సమాధానమిచ్చి లక్ష్మణునితో 'ద్వారపాలకుణ్ణి తొలగించు. ఈ సమావేశం అతి రహస్యంగా జరగాల్సి ఉంది కనుక నీవే స్వయంగా ద్వారాన్ని రక్షణ చేయాలి" అని ఆదేశించాడు.

దూతగా వచ్చిన కాలుడు శ్రీరామునితో "ప్రస్తుతం నీవు రావణుని సంహరించి, భూలోకాన్ని 11,000 సంవత్సరాలు పాలించటానికి అవతరించావు. ఓ దేవా! ఈ నియమిత కాలం సమాప్తి అయినందున భౌతిక జగత్తులో నీవిక ఎంతమాత్రం ఉండవలసిన అగత్యం లేదు. నీవు కోరినట్లయితే దేవతలపై నీ పాలనను తిరిగి సాగించటం కోసం మరోసారి దివ్యలోకానికి అధిరోహించి రాగలవు. సర్వవ్యాపియైన ఓ పరమాత్మా! నా శక్తి సామర్థ్యాలకు, నా ఉనికికి సైతం నీవే ఆధారానివి. అందువల్ల నా గౌరవ ప్రణామాలను సమర్పించనివ్వు".

కాలుని పలుకులను విన్నమీదట శ్రీరాముడు మందహాసం చేసి "నీవు చెప్పింది సత్యమే. నీకు సకల సౌభాగ్యాలు కలుగుగాక! ఇక నీవు బ్రహ్మదేవుని వద్దకు వెళ్ళి నేను దేవతల కార్యాన్ని నెరవేర్చడమైంది కనుక అతి త్వరలోనే నా స్వీయ దివ్యధామానికి తిరిగివస్తానని తెలియ జేయి" అని సమాధాన మిచ్చాడు.



**శ్రీరాముడు వైకుంఠవాస ప్రాప్తి - ఆర్తితో అనుసరిస్తున్న జనసందోహం**

రాముడు అరణ్యాలకు విశ్రమించటానికి వెళుతున్నాడన్న వార్త విన్న పురజనులు ఆయనను అనుసరించాలని నిశ్చయించుకున్నారు. శత్రుఘ్నుడు కూడ రాముని వెంట వెళ్ళటానికి నిశ్చయించుకున్నాడు. ఫలితంగా చివరకు రాముడు నగరం వెలుపలకు వచ్చేసరికి ఒక భారీ ఊరేగింపు ఆయన వెంటసాగింది. వాస్తవానికి తమ భక్తి ప్రేమల కారణంగా ప్రతి ఒక్క ప్రాణి రామునితో అరణ్యానికి అనుసరించటంతో అయోధ్యలో ఒక జంతువైనా కనుపించకుండా పోయింది.

రాముడు ఈ లోకాన్ని త్యజించటానికి మౌనంగా సాగిపోతుండగా ఆయన దక్షిణ పార్శ్వాన శ్రీదేవి నడువగా, ఉత్తర పార్శ్వాన భూదేవి నడిచింది. ముందు వైపున శక్తి నడువగా, ఓంకారం, గాయత్రి, వేదాలు సహా అసంఖ్యాకమైన ఇతరశక్తులన్నీ రాముణ్ణి అనుసరించాయి. తదుపరి భరతుని వెనుకనే శత్రుఘ్నుడు, ఆయన కుటుంబం అనుసరించారు. అంతట యజ్ఞాగ్నిని కాపాడుతూ బ్రాహ్మణులు కదిలారు. బ్రాహ్మణులు వెనుక పురజనులంతా తమ తమ స్థానాల ప్రకారం నడిచారు. వారిని అనుసరిస్తూ జంతువులు, పక్షులు వచ్చాయి.

**శ్రీరాముడు దివ్యధామానికి చేరుకునే విధానాన్ని గమనిస్తే సర్వప్రాణులు ఆయనతో గల సంబంధాలను గుర్తు తెచ్చుకున్నాయి. శ్రీరామునికి ముకుళిత హస్తాలతో చివరిసారి పుష్పాంజలి సమర్పించుకోటానికి అశేష సంఖ్యలో అన్ని ప్రాణులు వచ్చారు. రామునికి ప్రాణులకు మధ్యగల బంధాన్ని వర్ణించటానికి మాటలు చాలవు.**

రాముడు సరయూనది తీరానికి వచ్చి ఆగాడు. ఆ సమయంలో బ్రహ్మదేవుడు, దేవతలు తమ దివ్యరథాల్లో ఆకాశంపై ప్రత్యక్షమైనారు. దానితో ఆకాశం దివ్యకాంతులతో వెలిగిపోగా సుమధురపరిమళ భరితమైన చల్లని

గాలి వీచసాగింది. గంధర్వులు, అప్సరసలు నృత్యగానాలు చేయగా దేవతలు అత్యంత సౌరభయుతమైన పూలవాన వర్షించారు.

రాముడు జలప్రవేశం చేయగా బ్రహ్మదేవుడు సగౌరవప్రణామాలను సమర్పించి స్తోత్రాంజలి సమర్పించాడు.

భరత, శత్రుఘ్నులు తనను అనుసరించగా శ్రీరాముడు ఆధ్యాత్మిక లోకంలోని తన నిత్యధామానికి తిరిగి చేరుకున్నాడు. వాస్తవానికి దశరథనందనలు మాత్రమేగాక వారి అనుచరులంతా కూడా శ్రీరాముడు శాశ్వతంగా నివసించే వైకుంఠలోకాన్ని పొందారు. జీవిత పరిసమాప్తి సమయంలో గూడ శ్రీరాముని దర్శనంకొరకు, పురప్రజలు, మంత్రులు, ఋషులు, మహర్షులు, దేవతలు, బ్రహ్మదేవుడు, గంధర్వులు, అప్సరసలు, బ్రాహ్మణులు, భరతుని కుటుంబం యావత్తూ శ్రీరాముని వెంట ఉన్నారు. మర్యాదాపురుషోత్తముడైన శ్రీరామునికి మానవులకు, దేవతలకు, వానరులకు మొదలగు వారితో సంబంధాలు శాశ్వతంగా ఈనాటికి విశ్వవ్యాప్తమైనాయి.

## రామాయణకాలం - మానవజాతి సంబంధాలు

### ఇంటింటా రామాయణం

"రామ" శబ్దానికి, రామాయణ ఇతిహాస కావ్యానికి గల ప్రాముఖ్యం ఇంతా, అంతా కాదు. ఎంతో? అది వర్ణించటానికి మాటలు చాలవు, సమయం చాలదు. 'రామ' శబ్దం లేని పేరు గలవ్యక్తి ఉండదు. ప్రతిఇంట్లో 'రామ' శబ్దం ఉండేటట్లు పిల్లలకు పేర్లు భక్తితో, ఇష్టంతో, విశ్వాసంతో పెట్టుకుంటారు. మగపిల్లలే కాదు ఆడపిల్లలకు సైతం 'రామ' శబ్దంతో పేర్లు పెట్టుకోవడం సంప్రదాయంగా వస్తూంది. ఆ విధంగా 'సీత పేర్లు ఎంతో ఇష్టంతో ఆమె నామాలతో పెట్టుకొని పిలుచుకోవటం భారతీయుల సత్సంప్రదాయంగా వుంది. శ్రీరాముల వారి పట్టాభిషేకం ఫొటో లేని ఇల్లు వుండదు. అందరిండ్లల్లో తప్పని సరిగా ఉండాల్సిందే, పూజించాల్సిందే, నైవేద్యం చేయాల్సిందే.



ఇంటింటా రామ కీర్తనలను, శ్రీరామ శతకం, దాశరథీ శతకం తప్పని సరిగా చదువుకుంటారు. పిల్లలకు చిన్నతనంలోనే శ్రీరామశతకం, దాశరథీ శతకం, బాలరామాయణం కంఠస్థం చేయించేవారు. ఇప్పటికీ ఈ విద్యా సంస్కృతి కొనసాగుతూనే వుంది. బొమ్మల రామాయణాన్ని తేలిక భాషలో పిల్లలకు అర్థమయ్యే పద్ధతిలో ప్రచురిస్తున్నారు. ప్రతి ఇంటా ఈ రామాయణపుస్తకాలు పిల్లలకోసం ముద్రించి తప్పనిసరిగా చదివిస్తున్నారు.

### ఊరూరా రాములోరు

భారతదేశంలో ఎక్కడ చూచినా ఊరూరా రామాలయాలు, రామమందిరాలు, రాముని దేవాలయాలు నిర్మించారు. ప్రజలు స్వచ్ఛందంగా విరాళాలు వేసుకొన్నవి కొన్ని, పూర్వపు రాజులు కట్టించినవి కొన్ని. రామ భక్తులుగా పేరు గాంచి భద్రాచలంలో కంచర్ల గోపన్న (రామదాసు) నిర్మించిన సీతారామాలయం, ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి దేవాలయం, విజయనగరం జిల్లాలోని శ్రీరామతీర్థంలో శ్రీరామస్వామి దేవాలయం, గుంటూరు జిల్లా అంగలకుదురు గ్రామంలో వావిలికొలను సుబ్బారావుగారు నిర్మించిన కోదండరామభక్తసేవా సమాజం, తిరుపతిలోని ప్రముఖ కోదండరామస్వామి దేవాలయం, చిత్తూరు జిల్లాలో వాల్మీకి పురంలోని శ్రీసీతారామచంద్రస్వామి మొదలైన దేవాలయాలు నిర్మించబడినాయి. నిత్య, ధూప, దీప నైవేద్యాలను సీతారామలక్ష్మణ ఆంజనేయులకు అర్పించటం జరుగుతున్నది. ఈ దేవాలయాలన్నింటిలోనూ చైత్రమాసంలో శ్రీరామనవమి సందర్భంగా వసంత నవరాత్రులు లేక శ్రీరామనవరాత్రులుగా వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

ఊరూరా నెలకొన్న రామాలయాలలో శ్రీరామభజనలు నిత్యం జరుగుతూంటాయి. సాయంత్రం 5.30 గం॥ల నుండి 7.30 గం॥ వరకు ప్రజలు వేల సంఖ్యలో భజనలో పాల్గొని భక్తి తత్త్వాన్ని, ఆధ్యాత్మికతత్త్వాన్ని పొందుతున్నారు.

**రామనామం**

కలియుగంలో రామనామం కల్పవృక్షం వంటిది. రామనామ మహిమ మోక్షమార్గాన్ని కలుగచేస్తుంది. భారతీయ సంస్కృతిపై శ్రీరామచంద్రమూర్తి ప్రభావం అడుగడుగునా కనిపిస్తుంది.

'రామ' అనే శబ్దమే ఒక మహా మంత్రం. ఆ నామం తారక మంత్రం. హరి తత్త్వమైన నారాయణ అష్టాక్షరీ మంత్రం **'ఓం నమో నారాయణాయ'**, హరతత్త్వమైన శివపంచాక్షరీ మంత్రం **'ఓం నమశ్శివాయ'** లలోని రెండవ అక్షరం ప్రాణబీజాక్షరాలనుంచి ఉద్భవించిన నామమే **'రామ' నామం.** ఈ నామ స్మరణ ముక్తి దాయకం. సంసారమనే దుఃఖసాగరాన్ని దాటటానికి భక్తులకు పడవలా సహాయపడేది రామనామమే. ఈ రామనామంలో అపారమైన మహిమ దాగి వుంది.

**"రామ నామ జపాదేవ ముక్తిర్భవతి"**

రామనామ జపంవల్ల ముక్తి లభిస్తుంది అని యజుర్వేదంలో చెప్పబడింది. రామనామ మహిమ అమోఘం, నిగూఢమైనది.

కాశీ ప్రయాగలలో శరీరత్యాగ మొనరించితే ఏ ఫలితం కలుగుతుందో రామనామ పారాయణంతో అంతే ఫలితముంటుందని తులసీదాసు చెప్పాడు.

శ్రీరామ నామాన్ని విన్నా, జపించినా, స్మరించినా, వ్రాసినా ఎంతో మధురాతి మధురంగా ఉంటుంది. రామనామం కోటి పర్యాయాలు వ్రాసి ముక్తి పొందిన వారున్నారు. దీనినే 'రామకోటి' వ్రాయండి అంటారు. కష్టాలు, సమస్యలు, దుఃఖం కలిగినపుడు మానసిక ఉపశమనానికి, పరిష్కారానికి 'రామకోటి' వ్రాసి తరించిన వారున్నారు దేశంలో.

"అందరి బంధువయ్యా' అయోధ్యా రామయ్యా" అని భక్త జనం పాడుతూ ఆనందిస్తూంటారు. భక్తరామదాసు 'శ్రీరామ నీ నామమేమి రుచిరా … ఎంత రుచి, ఎంత రుచి, ఎంతో రుచిరా" అని కీర్తించాడు.



**"రామ మంత్ర వజపిసోహే మనుజా!**
**సకల వేదగళల్లి సారవాద మంత్ర**
**ముక్తి మార్గమే ఇదు మూలమంత్ర !**
**భక్తి రసకే దా పట్టుకట్టున మంత్ర!"** సుఖనిధి పురందర ….. మహామంత్ర అని పురందర దాసు తన కీర్తనల్లో వర్ణించాడు.

రామనామమహిమ రుచిని ఆస్వాదించిన రామదాసు "తారక మంత్రము కోరిన దొరికెను ధన్యుడనైతిని ఓ రామా!" అని పరవశుడై పాడుకున్నాడు, రామదాసు.

మోక్షదాయకమైన దివ్యమంత్రం రామనామం. ఈ నామానికి అర్థం **"రమణీయత్వాత్ రామః"** సౌందర్యమే రాముడు. అది కేవలం రూపసౌందర్యమేకాదు, గుణ మహిమ కథా సౌందర్యాలన్నీ రామునిలోనే ఉన్నాయి.

**'రామ' నామంలో ర.మ.అ అనే మూడక్షరాలు అగ్ని బీజాన్ని, సూర్యబీజాన్ని చంద్రబీజాన్ని తెలియజేస్తున్నాయని మంత్రశాస్త్రం చెబుతోంది.**

**'రామ' నామం మనకు జపించదగిన మంత్రం. 'రామరూపం' ధ్యానించదగిన దేవతా కృతి. 'రామచరిత్ర' అనుసరించవలసిన ఆదర్శం. ఈ మూడే మానవజాతికి ఇహపర సాధకాలు.**

ధర్మదేవతకు పుంభావ రూపం శ్రీరాముడు. ఐశ్వర్యం, ధర్మం, కీర్తి, సంపద, జ్ఞానం, వైరాగ్యం ఈ ఆరుగుణాలు సమానమైన రూపం ధరించిన వాడు శ్రీరామచంద్రమూర్తి.

రామనామం బాణంవంటిది. ఒకే బాణం రామునికి, ఒకే నామం భక్తునికి. అదే రామనామం. నామస్మరణే కలియుగంలో మానవులను కాపాడగలదని మన పెద్దలు చెప్తారు. శ్రీరామనామ స్మరణ చేసిన వాడెంత

పాపాత్ముడైనా మోక్ష పదవిని పొందుతాడని, రామనామం సమస్త అమంగళాలను అణచి వేసి మనోభీష్టాలను నెరవేరుస్తుందనీ భాగవతం చెప్తుంది. 'శ్రీరామ'నామం సర్వోపయోగమూ, సఫలమూ అయిన సరస సాధనమని శాస్త్రాలు పేర్కొంటున్నాయి.

**పార్వతీ పరమేశ్వరుల సంవాదం**

'శ్రీ సీతారామాంజనేయ సంవాదం' గ్రంథంలో 'రామనామ' మహిమగురించి పార్వతీ పరమేశ్వరులు సంభాషణలో వివరించారు. పరమేశ్వరుని పట్టపురాణియైన పార్వతీదేవి తన భర్తకు నాలుగు విధాలైన సపర్యలు చేస్తూ, సేవిస్తూ, పూజిస్తూ, ధ్యానిస్తూ, నమస్కరిస్తూ, ప్రాణనాథా! మోక్ష సుఖంనిస్తూ సర్వపాపాలను హరింపచేయటానికి కారణమైన మహామంత్రాన్ని చెప్పమని అడిగింది. పరమశివుడు చిరునవ్వు నవ్వి" నేను శ్రీరామ, శ్రీరామ, శ్రీరామ" అని జపిస్తూ ఆ శ్రీరామునియందే మనస్సును లగ్నంచేసి ధ్యానిస్తున్నాను. ఆ రామనామాన్ని ఒక్కసారి స్మరిస్తే విష్ణు, కృష్ణాది సహస్రనామాలు పఠించిన ఫలం కలుగుతుంది. కాబట్టి, ఆ శ్రీరామమంత్రాన్ని నీమనస్సున ధ్యానించు" అని ఉపదేశించాడు.

శ్రీరామమంత్రమహిమ వలన ఏ పాపాలు నశిస్తుందో తెలియపర్చమని పార్వతి ప్రశ్నించగా పరమేశ్వరుడు ఈ విధంగా చెప్పాడు.

పదివేల సార్లు బ్రహ్మహత్య చేయడం వలన కలిగిన పాపాన్ని, వేయిమార్లు కల్లు త్రాగుట వలన కలిగిన పాపాన్ని, అనేక పర్యాయాలు బంగారం దొంగిలించడం వలన కలిగిన పాపాన్ని హరిస్తుంది. కార్చిచ్చు కారడవిని కాల్చినట్లు తల్లిదండ్రులు, అన్నదమ్ములు, స్త్రీలు, శిశువులు, ఆచార్యులు, ఆవులు మొదలగు వానిని చంపడం వలన పాపాన్ని కాలుస్తుంది. రామనామము పెద్దలు దూషించుట వలన కలుగు దోషాలు నివారిస్తుంది. బడబానలం సముద్రాన్ని అడుగుపట్టించినట్లు 'రామమంత్రం సమస్త పాతకాల్ని పోగొట్టుతుంది.



బ్రహ్మ హత్య, గోహత్య, శిశుహత్య, స్త్రీహత్య మొదలైన మహాపాపాలను నశింపచేసి కోరిన కోరికలను ప్రసాదించేది శ్రీరామమంత్రమే కాని, మరొకటి లేదు.

రామనామం జపించడం వలన అనేక మంచి ఫలితాలు లభిస్తాయి. ఋషుల వాక్కు. ఆ శ్రీరామ రూపాన్ని పూజిస్తూ, రామ నామం జపిస్తూ వున్న బుద్ధిశాలురకు అష్టభోగాలు లభించి సుఖంగా వుంటారని పార్వతీ దేవికి చెప్పాడు. శ్రీరామమంత్రం కోరిన కోరికల నన్నిటినీ హెచ్చుగ ఇస్తూ ఉండగా కల్పవృక్షాన్ని, కామధేనువునూ, చింతామణీ చూచి సిగ్గుతో తలవంచుకుని ఉంటుంది. కాబట్టి, కామధేనువు, కల్పవృక్షం, చింతామణికి మించిన మహిమ గలది **'రామ'మంత్రం**.

రామమంత్రం ధర్మాన్ని, అర్థాన్ని, కామాన్ని కోరే వారికి పుత్రసంతానాన్ని ఇస్తుంది. సంపదల్ని, శాస్త్రజ్ఞానాన్ని, బ్రహ్మజ్ఞానాన్ని, కీర్తిని, మోక్షాన్ని, భోగాన్ని, సుఖాల్ని, దుఃఖాలను సహించటాన్ని, విద్యను కోరేవారికి విద్యనూ, వివాహ ప్రయత్నంలో సత్ఫలితాలను ఇస్తుంది.

అందుకే 'రామ' మంత్రం జపించే స్థలంలో గంగ, యమున, సరస్వతి, తుంగభద్ర, కావేరి, కృష్ణా, గోదావరి మొదలైన పుణ్యనదులు కలిగి ఉన్న ప్రదేశాలుగా భావిస్తారు. అందుకే ఆ స్థలం మహా పరిశుద్ధమైందని అధ్యాత్మ రామాయణంలో వివరించటం జరిగింది శ్రీరామనామ జపంతో సర్వజనులు సుఖాలు పొందుతారు.

'రామ' నామం, 'రామ మంత్రం' వలన ఎన్నో మహిమలు, ప్రయోజనాలు, ఇహపర సాధనాలు చేకూర్చుతుంది. కాబట్టి, రామశబ్దానికి ప్రపంచ ప్రజలకు జన్మ జన్మల సంబంధం. యుగాలు మారినా, తరాలు మారినా చెరిగిపోని బంధంగా చిరస్థాయిగా నిలచి ఉంది. ప్రతి మనిషి హృదయంలో దాగి ఉన్నాడు శ్రీరాముడు.

రామనామం వలన తెలియక చేసిన పాపాలు నశిస్తాయి. తెలిసి చేసిన పాలకు నిష్కృతి లేదు. అనుభవించవలసినదేనని సీతారామాంజనేయ సంవాదంలో స్పష్టంగా చెప్పబడింది.

**సుందరకాండ పారాయణ**

రామాయణ కావ్యంలో సుందరకాండకు ప్రత్యేక స్థానం ఉంది. సుందరకాండతో భారతీయులకు ఆధ్యాత్మిక సంబంధం ముడిపడి ఉంది. ఎంతో మహిమ కలది సుందరకాండ. సుఖశాంతులతో మనుగడ సాగించడానికి ఉపయోగపడే ఉత్తమ జీవనవిధానాలన్నీ రామాయణంలో ప్రస్తావించబడినాయి. రామాయణంలోని కాండలన్నింటిలో సుందరకాండ తలమానికం. భారతంలోని 'భగవద్గీత' వలె సుందరకాండం సుప్రసిద్ధమై, నిత్య పారాయణ గ్రంథమైనది. దీనిని ప్రతిదినం పారాయణ చేస్తే వారికి అన్ని కోరికలు సిద్ధిస్తాయి.

ఆత్మీయతతో ఆదరాభిమానాలు బలంగా ఉన్నపుడు ఆలుమగలు ఒకరికొకరు అందంగా ఉంటారు. తల్లిదండ్రులకు తమ పిల్లలు ముద్దు మురిపాలు చేకూరుస్తూ అందంగా కన్పిస్తారు. అట్లే పిల్లలకు తమ తల్లిదండ్రులు అందాల రాశులుగా కన్పిస్తారు. ఇవి అన్నీ ప్రేమైకవిషయాలు. కాని, లోక సాధారణ స్థితికి అతీతంగా అద్భుతంగా ఉండే 'సౌందర్యమే' ఇక్కడ ప్రస్తావించబడింది.

**"సుందరే సుందరో రామః, సుందరే సుందరీ కథా,**
**సుందరే సుందరీ సీతా, సుందరే సుందరం వనమ్ ।**
**సుందరే సుందరం కావ్యం, సుందరే సుందరః కపిః**
**సుందరే సుందరం మంత్రం, సుందరే కిం న సుందరమ్ ॥"**

పురుషమోహన కరుడు, సుగుణ సుందరుడు శ్రీరాముడు. సర్వవిధాల భువనైక సుందరి సీతామాత. కాంచనాద్రి కమనీయ విగ్రహుడైన హనుమంతుడు పరమసుందరుడు.



అశోకవనం అతిలోక సుందరం. శ్రీసీతారామ హనుమంతుల మహామంత్రాలు దివ్యాలు, సుందరాలు. ఈ మహితాత్ముని కథ సర్వాద్భుత సుందరం. ఈ సుందర కాండ అత్యంత సుందరం కనుక ఈ సుందరకాండలో సుందరం కాని దేది? సర్వమూ సుందరమే.

సీతాన్వేషణలో సఫలీకృతుడై వచ్చిన హనుమంతునకు శ్రీరాముని ఆలింగన భాగ్యమే లభించింది. దీక్షా దక్షులకు పరమార్థ సిద్ధి కల్గడం సహజమే గదా! ఇదే సుందరకాండ సందేశం.

అందువల్ల భారతీయులకు సుందరకాండపై ఆదరాభిమానాలు పెరిగి దాని మహిమ తెలుసుకుని నిత్య పారాయణ గ్రంథంగా దేశంలో ప్రసిద్ధి పొందింది.

సద్బ్రాహ్మణుల చేత, వేదపండితుల చేత ప్రజలు సుందరకాండ పారాయణ నియమ నిష్ఠలతో పారాయణ చేయించుకుని సుఖాలను పొందుచున్నారు, సమస్యలను పరిష్కరించు కొంటున్నారు, వివాహం కాని వారికి వివాహాలు జరుగుతున్నాయి. సుందరకాండ పారాయణానికి ప్రజలలో సద్భావన కలిగి ఇంటింటా పారాయణ గ్రంథంగా శాశ్వత ముద్ర వేసుకొన్నది.

**శ్రీరామనవమి-ప్రజల సంబరాలు**

శ్రీరామచంద్రుడు విభవనామ సంవత్సర చైత్ర శుద్ధ నవమి, శుక్లపక్షంలో పునర్వసు నక్షత్రాన కర్కాటక లగ్నంలో, ఉత్తరాయణ పుణ్యకాలంలో దశరథుడు – కౌసల్యల పుత్రుడుగా జన్మించాడు. ప్రతి సంవత్సరం చైత్రశుద్ధ నవమి పునర్వసు నక్షత్రాన శ్రీరామచంద్రుని పుట్టిన రోజును 'శ్రీరామ నవమి పండుగగా యుగాల నుంచి భారత దేశంలో జరుపుకుంటున్నారు.

శ్రీరామనవమి పండుగను అంగరంగ వైభవంగా బాజాభజంత్రీలతో మామిడి తోరణాలతో పందిళ్ళు నిర్మించి, రంగు రంగుల ముగ్గులతో కళ్యాణమండపాలను అలంకరిస్తారు. వాడవాడలా, గ్రామగ్రామాన,

పట్టణాలలో, నగరాలలో, వీధుల్లో, ఇండ్లలో సీతారామకళ్యాణం శోభ వర్ణానాతీతం. తొమ్మిది రోజులు రామనవరాత్రులు యథావిధిగా వేదమంత్రాలతో, వైదిక సంప్రదాయ బద్ధంగా జరిపిస్తారు. తొమ్మిదో రోజున శ్రీరామపట్టాభిషేక మహోత్సవాన్ని ఎంతో సుందరంగా నిర్వహిస్తారు. అశేష జనవాహిని ఈ తొమ్మిది రోజులు సీతారాముల ఆశీస్సులను పొంది, వారి కృపకు పాత్రులగుచున్నారు.

**భారతదేశంలో శ్రీరామక్షేత్రాలు**

అయోధ్య–శ్రీరాముని జన్మస్థలం; భద్రాచలం – భద్రునికి రాముడు ప్రత్యక్షమైన ప్రదేశం; ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు పంచపాండవులకు అరణ్యవాససమయంలో సీతారామలక్ష్మణ విగ్రహాలను అందించి పూజించమని ఇచ్చిన ప్రదేశం శ్రీరామతీర్థంలో శ్రీరామస్వామి దేవాలయం, విజయనగరం (జిల్లా), కోదండరామస్వామి దేవాలయం, ఒంటిమిట్ట, కడపజిల్లా, తెనాలి – రెండవ భద్రాద్రిగా పేరుపొందిన ప్రదేశం; పట్టణాలలో శ్రీరామనవమి ఉత్సవాలు భారీఎత్తున జరగటం హిందూ సంస్కృతికి చిహ్నంగా చెప్పుకోవచ్చు.

ఈ శ్రీరామనవమి సందర్భంగా గరుడ, అశ్వ, హంస, పుష్పపల్లకి, కల్పవృక్ష, గజ వాహనాలపై సీతారామలక్ష్మణ, ఆంజనేయ స్వాములను తిరువీధులలో ఊరేగిస్తారు. చివరి రోజు వివిధ పూలతో బొమ్మలతో అలంకరించిన రథాలపై సీతారామలక్ష్మణ ఆంజనేయస్వాములను ఊరేగిస్తారు. ప్రజలు తండోపతండాలుగా వచ్చి స్వామి, అమ్మవార్లను పురవీధులలో ఊరేగింపుగా వెళుతున్న సమయంలో ప్రజలు బారులు తీరి కర్పూర హారతులు, నారికేళ ఫలం, కదళీఫలాలతో స్వామి వార్లకు అర్పించి తమ భక్తిని చాటుకుంటారు. జనసంద్రానికి ఎంత భక్తో; అమితమైన భక్తి. ముకుళిత హస్తాలతో చేతులు జోడించి నమస్కరిస్తారు. రామనామ జపం చేస్తూ, తనివి తీర ఆ రాముని కనులారా చూచి ఆనందించి తరిస్తారు.



శ్రీరామనవమి 'తిరునాళ్ళు' అని పల్లెవాసులు రెండు ఎడ్లబండ్లలో, ఒంటెద్దు బండ్లల్లో, ట్రాక్టర్లలో, సైకిళ్ళల్లో కాలినడకన వచ్చి శ్రీరాముని దర్శనం చేసుకుని యాత్రా స్థలంగా భావించి 'ఆరోజు రాత్రి' నిద్ర చేసి మరునాడు స్వగృహానికి తిరుగు ప్రయాణం చేసేవారు. ఇప్పటికీ ఈ సంప్రదాయం కొనసాగుతూనే వుంది. ఈ పండుగ ఒక సరదాగా, సందడిగా, సంస్కృతికి చిహ్నంగా నిర్వహించటం సంతోషం. దేవుని పెళ్ళికి అందరూ పెద్దలే. ప్రజలంతా ఐక్యతగా, సమైక్యంగా, వర్గ, వర్ణ, కుల, ప్రాంతీయ బేధాలు మరచి మానవ జాతి అంతా శ్రీరామనవమి 'తిరునాళ్ళు' పండుగ వేడుకగా జరుపుకుంటున్నారు.

శ్రీరామనవమి పండుగ ఒక్కటే ఇంత భారీగా జన సందోహం మధ్యన జరుపుకోవటం భారతీయ చరిత్రలో ఇదొక సువర్ణ అధ్యాయం. ప్రజలకు – శ్రీరామునికి విడదీయరాని సంబంధం జన్మ జన్మలబంధం అని చెప్పవచ్చు.

సీతారాములకు – భారతీయులకు మధ్యగల సంబంధాలు, భక్తి, ముక్తి, ఆధ్యాత్మిక సంబంధాలుగా పెంపొందుతున్నాయని చెప్పటంలో సందేహం లేదు.

ప్రస్తుతం మంచి చెడుల యుగం. మంచిచేయాలి, మంచిని పెంచాలి. మంచికి ధర్మశాస్త్రం అవసరం. ధర్మశాస్త్రం దైవసమానం. ధర్మశాస్త్రమంతా రామాయణంలో ప్రతి శ్లోకంలోను కనుపిస్తుంది. **శ్రీరాముడు *"ధర్మశాస్త్రం ఈ విధంగా చెప్పింది, చేయాలి అనే వాడు కాని నేను ఇలా చెబుతున్నాను చేయండి" అనేవాడు కాదు"* అని కంచి మహాస్వామి శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర సరస్వతీ స్వామివారు తిరుపతిలో ఒక ఉపన్యాస కార్యక్రమసందర్భంలో చెప్పారు.**

**రామాయణకాలంలో సమాచార సేకరణ**

రామాయణకాలంలో ప్రజాస్వామ్య పద్ధతులే అమలులో ఉండేవి. దూతల ద్వారా, గూఢచారుల ద్వారా సమాచార సేకరణ చేసేవారు. ప్రజల

మనస్సును, రాజ్య పాలన గురించి విమర్శలు, ప్రశంసలకు సంబంధించిన సమాచారాన్ని రాజులు దూతల ద్వారా, గూఢచారుల ద్వారా సేకరించి, తదనుగుణంగా రాజ్యపాలన చేసేవారు. త్రేతాయుగంలో ఇక్ష్వాకువంశ రాజులు ముఖ్యంగా రఘుమహారాజు, శ్రీరామచంద్ర మహారాజులు ప్రజలనుంచి స్వయంగా విషయాలను సేకరించేవారు. వినతి పత్రాలు ద్వారా, గూఢచారులు / దూతల ద్వారా కష్టసుఖాలు తెలుసుకునేవారు. ఆ కాలంలో ఈ మూడు విధాలైన ప్రక్రియలే సమాచార సాధనాలుగా ఉపయోగించేవారు.

శ్రీరాముడు రాజసేవకుడు భద్రుడు ద్వారా ప్రజాభిప్రాయాన్ని, శత్రుఘ్నుడు భరతుడు ద్వారా రాజ్యపాలన గురించి విషయ సేకరణ చేసేవాడు.

**రాజ్యపాలనకు ప్రజాభిప్రాయం, ప్రజాసంబంధాలు, ప్రజల భాగస్వామ్యం – ఈ మూడు విధానాలు మూడు కన్నులుగా భావించేవారు. ముక్కంటి త్రినేత్రుడుగా ఎంతశక్తిమంతుడో, ఈ త్రినేత్రములు రాజ్యపాలనకు అంత శక్తివంతమైనవిగా భావిస్తారు.**

రామరాజ్యం ప్రజాభిప్రాయానికి అనుకూలంగా నడిచింది. ప్రజల మాటకు శ్రీరాముడు ఎల్లప్పుడూ విలువలు ఇవ్వటం సంప్రదాయం. ప్రజాస్వామ్యయుతంగా రామరాజ్యం కొనసాగింది. మాటలతో మానవ సంబంధాలు పెరగవు, పనుల వల్ల, విలువలతో, నీతిమంతమైన పాలన ఏర్పడినపుడే రాజుకు – ప్రజలకు మధ్య మానవ సంబంధాలు పటిష్టమౌతాయి. శ్రీరామచంద్రుడు ఈ విధమైన సుపరిపాలనను 11,000 సంవత్సరములు రాజ్య పాలన చేసి మానవ సంబంధాలను పెంచి పోషించాడు. త్రేతాయుగంలోనే ఇక్ష్వాకు వంశపు రాజులు శ్రీకారం చుట్టారు. అందువల్ల ఆనాటి రాజులు జనరంజకంగా పాలన చేశారు.



**మానవజాతికి నాయకుడు-మానవశక్తి**

శ్రీమద్రామాయణకావ్యమంతా పరిశీలించి, పరిశోధించి, విశ్లేషిస్తే శ్రీరాముడు మానవజాతికంతా నాయకుడు. నాయకత్వ లక్షణాలు పూర్తిగా పుంజుకున్నవాడు శ్రీరాముడు. రాక్షస రావణుడు వాలిచేతిలో, కార్తవీర్యార్జునుని చేతిలో ఓడిపోయాడు. రాముని చేతిలో ఓడిపోతానని భయం పట్టుకుంది. ఎవరిచేతిలోనూ మరణం లభించకూడదని వరం అడిగాను కాని, మానవుడి చేతిలో చావు రాకూడదని అడగటం మరచిపోయానని బాధపడ్డాడు. మానవుడు ఏం చేస్తాడులే! అని చులకనగా చూచాడు మానవజాతిని. మానవుడికి భయపడటమెందుకు? వీరికి భయపడితే బలహీనపడిపోతామని అనుకున్నాడు. మానవుని రూపంలో వున్న శ్రీరాముడు ఒక బలమైన రాక్షసుని, ఆతని తమ్ములను, కొడుకులను, వంశాన్ని చివరకు లంకారాజ్యాన్ని సర్వనాశనం చేయగలిగాడు. నరులు ఇంత బలవంతులా! అనిపించింది. శ్రీరాముడు ఒకగంట పన్నెండు నిమిషాలలో పద్నాలుగు వేలమంది రాక్షసులను, ఖరదూషణాదులనే రాక్షస సైన్యాధ్యక్షులను సంహరించ గలిగాడు. దీనిని విశ్లేషిస్తే ఆయన భుజబలం అంత గొప్పది. దేవతలు పుష్పవర్షం కురిపించారు. శ్రీరాముని చర్య మానవజాతికే గర్వకారణం. శ్రీరామునిలో మంచిలక్షణాలు, గుణాలు, నడవడి, సత్ప్రవర్తన, మాటతీరు, నైపుణ్యం, ధర్మాచరణ, సత్యవాక్కు, నిర్ణయాధికార నిపుణత, మైత్రీబంధం, వానరులతో సంబంధాలు మొదలైన అన్ని మంచి గుణాలు మూర్తీభవించాయి. అందుకే శ్రీరాముడు మానవజాతికి నాయకుడు. అందుకే మానవులంతా అన్ని యుగాలవారు, అన్ని కాలాలవారు, అన్ని తరాలవారు శ్రీరాముణ్ణి అనుసరించాలి, అనుకరించాలి, ఆదర్శంగా నిలవాలి. తత్ఫలితంగా విజయం వరిస్తుంది.

**రామాయణ పారాయణ ఫలితం**

శ్రీమద్రామాయణ ఇతిహాసకావ్యం సాక్షాత్తు శ్రీమహావిష్ణువుకు అభిన్నమైనది. కనుక భగవంతునియందు సుదృఢమైన భక్తివిశ్వాసాలు గలవారు మాత్రమే దీనిని గానం చేయాలి. ఒక్క శ్లోకం శ్రవణం చేసినా కూడా ఆరోజున మనిషి చేసిన సకల పాపాలను అది నిర్మూలించగల శక్తి ఉంటుంది.

**రామాయణ పారాయణం, రామనామం, రామ మంత్రం జపించిన వారికి ధర్మార్థకామ మోక్షాలనే చతుర్విధ పురుషార్థాలన్నింటినీ ప్రసాదిస్తుంది. అంతేగాక, జీవితంయొక్క చరమగమ్యమైన దివ్యభక్తి వైపు పయనించటానికి అది దోహదం చేస్తుంది.**

**రామరాజ్యంలో కుటుంబసభ్యుల మధ్య, భార్యాభర్తలమధ్య, తల్లిదండ్రులు పిల్లలమధ్య, పురజనులకు రాజులకు మధ్య, ప్రజల్లో ఒకరితో ఒకరికి సదవగాహన కలిగి, సత్సంబంధాలను పెంచుకొని, పంచుకొని "వసుధైక కుటుంబం" జీవనం చేస్తూండేవారు. అయితే వారి సంబంధాలన్నీ స్వార్థ పూరితంగాకుండా, 'మానవాళికి' ప్రయోజనంగా పెంపొందేవి. సంబంధాలన్నీ, విలువలతో గూడినవిగా, ధర్మబద్ధంగా, సత్యవచనంతో, న్యాయబద్ధంగా, నీతివంతంగా పోషించబడినాయి.**

శ్రీరామచంద్రుని సుగుణాలే అయోధ్యప్రజలకు సంక్రమించాయి. రాజు అడుగుజాడలలో ప్రజలు నడిచారు. "యథా రాజా తథా ప్రజాః" అన్నట్లు రాజ్యపాలన ప్రశాంతంగా నడిచింది.

**శ్రీమద్రామాయణ శ్రవణఫలం**

బాలరామాయణము రచించిన కవులు శ్రీమద్రామాయణ శ్రవణం, పారాయణం వలన లభించే ఫలమును చక్కగా వర్ణించారు.

**వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే ।**
**వేదః ప్రాచేతసాదాసీత్సాక్షాద్రామాయణాత్మనా ॥**



అంటే వేదాలచే తెలియబడేవాడు, సర్వదేవోత్తముడు అయిన శ్రీమన్నారాయణుడు దశరథపుత్రుడై అవతరించెను. కనుక వేదం వాల్మీకి మహర్షి వలన శ్రీమద్రామాయణం రూపంగా రచింపబడింది. (శ్రీమద్రామాయణాన్ని పఠిస్తే భగవంతుని సులభంగా తెలిసికోవచ్చునని అభిప్రాయం.)

**యః కర్ణాఞ్జలిసమ్పుటైరహరహస్సమ్యక్పిబంత్యాదరా**
**ద్వాల్మీకేర్వదనారవిన్దగళితం రామాయణాఖ్యం మధు ।**
**జన్మ వ్యాధి జరావిపత్తి మరణైరత్యన్తసోపద్రవం**
**సంసారం సవిహాయ గచ్ఛతి పుమాన్విష్ణోః పదం శాశ్వతమ్ ॥**

**శ్రీమద్రామాయణ మనే తేనె వాల్మీకి మహర్షి ముఖమనే కమలం నుండి పుట్టింది. దీనినెవడు భక్తితో వినునో వాడు జననం, మరణం మొదలైన వానిచే అపాయకరమైన నీ సంసారాన్ని వదలి శాశ్వతమైన విష్ణులోకాన్ని చేరుతారు. మోక్షాన్ని పొందకోరేవారు శ్రీమద్రామాయణాన్ని పఠించాలని లేదా వినాలని భావం.**

**శ్రీమద్రామాయణం వలన మంచి ఫలితాలు, శుభ పరిణామాలు కలుగుతాయి, కనుకనే అన్నియుగాల్లో, కాలాల్లోని మానవులు శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయులయందు భక్తిని పెంచుకోవటంవలననే రామునికి ప్రజలకు మధ్య మానవ సంబంధాలు పెంచుకోవటం జరుగుతంది.**

శ్రీరాముని గుణగణాలు, లక్షణాలు, మాటల సరళి, నడవడి, ధర్మం, సత్యమార్గాన్ని, మానవసంబంధాలను అనుసరించి నియమబద్ధులై జీవించినవారే, జీవన సమరంలో తప్పక విజయం సాధిస్తారు.

"సర్వేజనాః సుఖినో భవన్తు"

# మహాభారత కాలంలో మానవసంబంధాలు

## I. 1. పరిచయం

మహాభారతం భారతీయుల జాతీయకావ్యం. ధర్మం, అర్థం, కామం, మోక్షం అనే నాలుగు పురుషార్థాలను సాధించటానికి అవసరమైన విజ్ఞానమంతా వ్యాసమహర్షి ఈ మహాభారత గ్రంథంలో చక్కగా వివరించాడు. వేదాలు, శాస్త్రాలు, ఉపనిషత్తులు, పురాణాలసారానికి ఇందులో సముచితమైన స్థానం కల్పించాడు. అందువలన, ఈ గ్రంథం 'పంచమవేదం'గా ప్రాముఖ్యం వహించింది. మహాభారతం ప్రపంచ గ్రంథాలన్నిటిలోకి గొప్పది.

"మహాభారతంలో ఉండేది ఎక్కడైనా ఉంటుంది, ఇందులో లేనిది ఎక్కడా లేదు"

**"యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్"**

ధర్మానికి జయం కలిగించి అధర్మాన్ని అంతమొందించటానికి అవతార పురుషుడుగా, గీతనుపదేశించిన శ్రీకృష్ణపరమాత్మ ప్రధాన పాత్ర పోషించాడు. ద్వాపరయుగాన్నంతా శ్రీకృష్ణుడు ఒక ప్రధానకార్యనిర్వహణ అధికారిగా ఆధిపత్యం వహించాడని చెప్పవచ్చు.

## 2. ద్వాపరయుగం

ద్వాపరయుగం 8,64,000 సంవత్సరాలపాటు నడిచింది. ఈ యుగానికి గురువు వ్యాసమహర్షి. ద్వాపరయుగంలో రెండువంతులు ధర్మం, రెండువంతులు అధర్మం నడిచాయి.

ద్వాపరయుగంలో నాణానికి ఒకవైపు మానవతావిలువలు గలవారు ఉన్నారు. ధర్మం ఆచరించేవారు, సద్గుణాలు గలవారు; అహింస పాటించేవారు, న్యాయంగా ఉండేవారున్నారు. వీరంతా సత్సంబంధాలు



కలిగి ఉన్నారు. వీరికి కొండంత అండగా సహాయ సహకారాలందించిన పురుషోత్తములు, ఋషులు, బంధువులు, గురువులు, వారి పుత్రులు, ధర్మాన్ని ఆచరించే రాజులు ఉన్నారు. వీరంతా మానవసంబంధాలు సత్సంబంధాలతో, సన్నిహిత సంబంధాలు కలిగి విజయం సాధించారు.

ఈ యుగంలో యజ్ఞయాగాది క్రతువులు చేశారు. బ్రాహ్మణులను గౌరవించారు. శస్త్రాస్త్రవిద్యలలో నైపుణ్యంగలవారున్నారు. యుద్ధతంత్రాలు తెలిసినవారున్నారు. బలపరాక్రమాలు గలవారున్నారు.

ద్వాపరయుగమనే నాణానికి రెండోవైపు దుర్మార్గంలో నడిచేవారు, ప్రోత్సహించేవారు, దురాశాపరులున్నారు. స్త్రీలను అవమానపరచేవారు, దుర్గుణాలు గలవారు, హింసామార్గాన్ని ఎన్నుకున్నవారున్నారు, కుట్రలు, కుతంత్రాలు, మాయలు, కణికవిద్యలో నేర్పరులున్నారు. బలహీనులున్నారు. రాక్షసులున్నారు. అధర్మాన్ని పాటించేవారంతా వారి వారి ప్రవర్తన కలవారితో సంబంధాలు కలిగి ఉన్నారు. వీరిలో వీరికి సంబంధాలు ఉన్నా ప్రవర్తనా లోపాలతో, సంస్కారవంతులుగా ప్రవర్తించక, అధర్మంతో, హింసాయుత మార్గంలో అపజయాలు పొంది, కుటుంబం సర్వనాశనానికి దారితీసింది. ఇవన్నీ దుష్టసంబంధాలు పెంచటానికి దోహదపడ్డాయి.

ద్వాపరయుగం చివర రెండు కుటుంబాలమధ్య భీకరసంగ్రామం జరిగి అధర్మపరులు నాశనమైనారు. ధర్మం ఆచరించిన వారు విజయం సాధించారు. రాజ్యాన్ని పాలించి సుపరిపాలన అందించారు. ఈ కాలంలోనే మానవీయవిలువలతో మానవసంబంధాలను పెంచి పోషించారు.

ఈ యుగంలో జరిగిన సంఘటనలను సన్నివేశాలను సంస్కృతభాషలో వ్యాసమహర్షి రచించి, 'మహాభారత' కావ్యంగా రూపుదిద్దాడు. యుగగురువు వ్యాసులవారు లోకానికి ఒక సందేశాత్మకగ్రంథంగా అందించారు. ఈ కాలాన్నే మహాభారతకాలంగా ఈ నాటికీ బహుళ ప్రజాదరణ పొందుతోంది.

## 3. "కురు" వంశవృక్షం

పరాశరమహర్షి, యోజనగంధి దంపతులకు వ్యాసుడు జన్మించాడు. లోకంలో వేదాలను వ్యాపింపచేసిన వాడు కాబట్టి, అతడు వేదవ్యాసుడైనాడు. ఇతడు మహాజ్ఞాని. యోజనగంధి అసలు పేరు సత్యవతి. ఈమె కౌరవవంశ చరిత్రలో ప్రధాన పాత్ర పోషించింది. వేదవ్యాసుడు తల్లికి నమస్కరించి, తపస్సు చేసుకోటానికి వనాలకు వెళ్తూ "తల్లీ నీకు అవసరం కలిగినపుడు నన్ను తలచుకో, నేను వచ్చి నీ కోరిక తీరుస్తాను" అని చెప్పి వెళ్ళిపోతాడు. తల్లీకొడుకుల అనుబంధం అటువంటిది.

శంతనుమహారాజు, గంగాదేవికి జన్మించినవాడు భీష్ముడు. భీష్ముడు బ్రహ్మచారిగా, దీర్ఘాయువుగా, మహావీరుడుగా జీవించిన సత్యవ్రతుడు. శంతనుడు భీష్మునిపై అమితమైన ప్రేమచూపించేవాడు.

తరువాత కొంతకాలానికి శంతనునికి, సత్యవతికి ప్రేమ వివాహమైంది. అయితే వీరిద్దరికి కలిగిన సంతానానికే పట్టాభిషిక్తుణ్ణి చేయాలని దాశరాజు నియమం విధించాడు. ఆ నియమాన్ని భీష్ముడు విని తండ్రి శంతనుని ఒప్పించాడు. భీష్ముడు ఆజన్మాంతం బ్రహ్మచర్య దీక్షను అవలంబించేటట్టు అంగీకరించాడు. భీష్ముని వలననే శంతనునికి సత్యవతికి వివాహమైంది.

శంతనుడు సత్యవతికి చిత్రాంగదుడు, విచిత్రవీర్యులనే కుమారులు కలిగారు. వీరు చిన్నతనంలో ఉండగనే తండ్రి శంతనుడు మరణించాడు. ఈ పిల్లల పోషణతో బాటు రాజ్యరక్షణ భారం భీష్మునిపై బడింది. భీష్ముడు అందుకు అంగీకరించాడు.

తదుపరి కొన్ని సంవత్సరాల తరువాత చిత్రాంగదునికి పట్టాభిషేకం చేశాడు. ఇతడు గర్వాంధుడై గంధర్వుల చేతిలో మరణించాడు. ఆ తరువాత విచిత్రవీర్యుణ్ణి హస్తినాపురానికి పట్టాభిషేకం చేశాడు. ఇతనికి కాశీరాజు కూతుళ్ళు అంబిక, అంబాలికలను తెచ్చి వివాహం చేశాడు. ఇతడు



రాత్రింబవళ్ళు భార్యలతో భోగించి బలహీనుడై శరీరాన్ని చాలించాడు. కురువంశ కుమారులలో మిగిలింది భీష్ముడు ఒక్కడే. తల్లి సత్యవతి వివాహం చేసుకోమని చెప్పిన సలహాను భీష్ముడు తిరస్కరించాడు. అప్పుడు సత్యవతి వేదవ్యాసుడుని తలచి, అతను తన కోడండ్రైన అంబిక, అంబాలికల యందు మగ సంతానాన్ని కలిగేటట్లుగా భావించమంది.

కొద్దినెలల తరువాత అంబికయందు వేయి ఏనుగుల బలం గల ధృతరాష్ట్రుడు పుట్టాడు. ఇతడు పుట్టు గ్రుడ్డి. అంబాలికయందు మరొక మగపిల్లవాడు పుట్టాడు. అతని శరీరం పాండువర్ణంతో ఉన్నందున అతణ్ణి పాండురాజు తెల్లని శరీరపు రంగుగలవాడు అన్నారు. సలక్షణ సంతానం కలగలేదన్న అసంతృప్తితో అంబికను మరొక కుమారుణ్ణి కనుమని కోరుతుంది సత్యవతి. కాని, అంబిక వ్యాసుని గడ్డం, నల్లని రూపం, జడలు చూచి రెండవసారి పొందలేక ఒక చెలికత్తెను తనబదులుగా పంపింది. ఆమె వ్యాసుని హృదయాన్ని మెప్పించి ఒక కుమారుని పొందింది. అతడే ధర్మవిదుడైన విదురుడు. వారిని పెంచి, పెద్దవారిని చేసి, విద్యావంతులను చేసి వివాహితులను చేసే బాధ్యత గూడ భీష్ముడే నిర్వహించాడు.

ధృతరాష్ట్రుడు గాంధారికి వ్యాసుని వరం వలన దుర్యోధనుడు మొదలైన వందమంది కుమారులు, ఒక కుమార్తె జన్మించారు.

పాండురాజు భార్యలు కుంతీ, మాద్రులకు వరుసగా ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు పుట్టారు. ఈ అయిదుగురు 'పంచపాండవులు'గా లోకంలో ప్రసిద్ధిచెందారు. పంచపాండవులకు ద్రౌపది భార్య అయింది. ద్రౌపది అగ్నిజ్వాలనుంచి జన్మించింది. ఈమెకు పాంచాలి అనే పేరు గూడ వుంది.

ద్రౌపది యందు ధర్మరాజుకు ప్రతివింద్యుడు, భీమసేనునికి శ్రుతసోముడు; అర్జునునికి శ్రుతకీర్తి; నకులునికి శతానీకుడు; సహదేవునికి శ్రుతసేనుడు పుట్టారు. వీరినే ఉపపాండవులని పిలుస్తారు.

ఇంకనూ ధర్మరాజుకి స్వయంవరంలో లభించిన దేవిక అనే స్త్రీకి యౌధేయుడు పుట్టాడు. భీమసేనునికి జరంధర వలన సర్వగుడు; హిడింబకు ఘటోత్కచుడు పుట్టారు. అర్జునునికి సుభద్రవల్ల అభిమన్యుడు పుట్టాడు. నకులునికి చేది వంశజురాలైన రేణుమతికి నిరమిత్రుడు పుట్టాడు. సహదేవునికి స్వయంవరంలో లభించిన విజయకు సుహోత్రుడు పుట్టాడు.

పాండవపుత్రులైన పదునొకండు మందిలోనూ కురువంశాన్ని నిలిపిన వాడు అభిమన్యుడు. అతనికి విరాటరాజు కూతురు ఉత్తరనిచ్చి వివాహం చేశారు. ఉత్తర, అభిమన్యులకు పరీక్షిత్తు పుట్టాడు. పాండవులు, ఉపపాండవులు సత్సంబంధాలు పెంచి పోషించారు. వీరికి శ్రీకృష్ణుడు, బలరాముడు, విదురుడు అండగా ఉన్నారు.

**4. భారతం విశిష్టత - ప్రచారం**

మానవజీవితమనే మహాసముద్రాన్ని మథించి వ్యాసుడు మానవాళికి అందించిన అమృతకలశం మహాభారతం. వ్యాసుణ్ణే బాదరాయణుడని, కృష్ణద్వైపాయనుడని, వేదవ్యాసుడనే పేర్లతో పిలవటం ప్రాచీన కాలంనుంచి వస్తూనే ఉంది. మహాభారతం వేదాలలోని సారాంశాన్ని పూర్తిగా అందించటమే గాక, ఆయా అంశాలమధ్య వైరుధ్యం ఏర్పడినపుడు, వాటి సమస్యల పరిష్కారానికి మార్గాన్ని చూపి సమన్వయ పరచిన గ్రంథంగా పేరు వచ్చింది. సంస్కృతభాషలో రచించిన మహాభారతం తెలుగు, తమిళ, కర్ణాటక, హిందీ, మరాఠీ మొదలైన దేశభాషలలోకి అనువాదమయింది.

మహాభారతంలో వివిధ సన్నివేశాలను, ధర్మాధర్మాలను, దుర్మార్గాలను, సన్మార్గాలను, అవమానాలను, మంచిచెడులను, జూదంవల్ల కలిగే దుష్ఫలితాలను, కష్టాలు, సుఖాలు, సమస్యలు, పరిష్కారాలు మొదలైన విషయాలను ప్రజలకు అవగాహన కలిగించుటకు ప్రాచీనకాలంలో వివిధ ప్రచారసాధనాలను ఉపయోగించేవారు.



ఆనాడు ప్రచార సాధనాలుగా తోలుబొమ్మలాట, హరికథ, బుర్రకథ, యక్షగానం, పురాణాలు మొదలైనవి ప్రముఖంగా ఉండేవి. నేటికీ ప్రజలు మహాభారతకథలపై ఆసక్తి చూపిస్తూ హరికథలకు వేలసంఖ్యలో హాజరవుతున్నారు. ఇటీవల మహాభారత కథలను 18 రోజులు నిర్వహించారు. 18 పర్వాలను రోజుకొక పర్వం చొప్పున 2012 సంవత్సరం విజయవాడలో శ్రీకోట సచ్చిదానందశాస్త్రి భాగవతార్ హరికథాగానం నిర్వహించారు.

క్రమేపీ మహాభారతంలోని సన్నివేశాలన్నిటినీ విభజించి నాటకాల రూపంలో ప్రచారంలోకి తెచ్చి ప్రజలకు ఆసక్తి కలిగించేవారు. శ్రీకృష్ణరాయబారం, పాండవోద్యోగవిజయాలు; గయోపాఖ్యానం; కురుక్షేత్రం మొదలైనవి. ఏకపాత్రాభినయనంలో భీముడు, దుర్యోధనుడు, కర్ణ, అభిమన్యుడు మొదలైన పాత్రలను నైపుణ్యంతో, హావభావాలతో, గర్జిస్తూ, గదతిప్పుతూ పద్యాలను, శ్లోకాలను రాగయుక్తంగా, భావయుక్తంగా చదివేవారు. ప్రజలు పరవశించి, ఈలలు వేసి, 'వన్స్ మోర్' అని కేకలు వేస్తూ, కరతాళధ్వనులు చేస్తూ; ఆనందపరవశులై నాటకరమ్యతను వ్యక్తపరచేవారు.

**'చిత్రసీమ'లో భారతం**

చిత్రసీమ (సినిమా రంగం) మహాభారతానికి పెద్దపీట వేయటం జరిగింది. మంచి సంభాషణలతో, ఘాటైన పదజాలంతో, ఆకర్షణీయమైన సెట్టింగులుతో, వీనులువిందైన పద్యాలతో, శ్లోకాలతో, పాటలతో కర్ణాటక సంగీతాన్ని మేళవించి ప్రజలను ఆకట్టుకునేటట్టుగా వివిధ పేర్లతో సినిమాలు నిర్మించారు. ముఖ్యమైనవిగా; శ్రీకృష్ణలీలలు, శ్రీకృష్ణరాయబారం, శ్రీకృష్ణసత్య, శ్రీకృష్ణపారిజాతం, మాయాబజార్, పాండవుల బాల్య కథ; శ్రీకృష్ణపాండవీయం, పాండవవనవాసం, దానవీరశూరకర్ణ; భీష్మ; మహారథి

కర్ణ, బాలభారతం; శ్రీకృష్ణవిజయం; కురుక్షేత్రం; నర్తనశాల; వీరాభిమన్యు మొదలైనవి.

20వ శతాబ్దంలో టెలివిజన్ ప్రవేశపెట్టిన తరువాత మహాభారతాన్ని హిందీభాషలో రామానందసాగర్ దర్శకత్వంలో డైలీ సీరియల్‌ను ప్రసారం చేసి ప్రజలలో ఇతిహాసగ్రంథం పై అవగాహన కల్పించారు. ముఖ్యంగా తెలుగు ప్రజలు ఈనాటికీ గ్రామాలలో మహాభారత కథా కాలక్షేపం 40 రోజుల పాటు నిర్విరామంగా జరుపుకుంటూనే ఉన్నారు.

**ఆంధ్రుల భారతం – కవిత్రయభారతం :** తెలుగుభాషలో ఆంధ్రావళికి, ఆదికావ్యమైన మహాభారతాన్ని అందించిన మహాకవులు ముగ్గురు. వీరు త్రిమూర్తులవంటివారు. వారిలో మొదటివారు ఆదికవి నన్నయ భట్టారకుడు; రెండవవారు కవిబ్రహ్మ తిక్కనసోమయాజి, మూడవకవి ప్రబంధ పరమేశ్వరుడు ఎఱ్ఱాప్రగ్గడ. ఈ ముగ్గురిని మూడు అక్షరాలతో విడి విడిగా నన్నయ, తిక్కన, ఎఱ్ఱన అని పిలవటం కవితాప్రపంచానికి అలవాటు. వీరినే 'కవిత్రయం' అని పిలవటం కొన్ని శతాబ్దాలనుంచి వస్తున్న సాహితీ సంప్రదాయం. వేరువేరు ప్రాంతాల్లో, వేరు వేరు కాలాల్లో మహాభారతరచన సాగించిన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులంతటివారు. తరతరాల తెలుగుజాతికి ఆదర్శంగా తెలుగు సంస్కృతి పీఠంపై నిర్మించిన ఉన్నత స్వర్ణగోపురం 'ఆంధ్రమహాభారతం'.

మహాభారతాన్ని 'కవిత్రయం' పదునెనిమిది పర్వాలలో ఆంధ్రజాతికి అందించారు. ఆది, సభా పర్వాలను, అరణ్యపర్వంలో కొంతభాగాన్ని నన్నయ రచించగా, మిగిలిన అరణ్యపర్వ భాగాన్ని పూర్తిగా రచించినవాడు ఎఱ్ఱాప్రగ్గడ, మిగిలిన పదిహేను పర్వాలను అనగా విరాట పర్వంనుంచి, స్వర్గారోహణ పర్వం వరకు తిక్కన సోమయాజి రచించాడు.

### తెలుగువారి ఆదరణ

**"తింటే గారెలు తినాలి, వింటే భారతం వినాలి", భారతం 'చదివినవాడు పండితుడు'** మొదలైన లోకోక్తులు తెలుగులో పుట్టాయి.



ఆంధ్రులకు మహాభారతమంటే ఎంతటి ఆదరణ, ఇష్టమో తెలుస్తోంది. మహాభారతం విననివాడు, చదువనివారు, పద్యాలు నోటివెంట రానివారు తెలుగువారిలో లేరని చెప్పవచ్చు.

మహాభారతగ్రంథాన్ని ఎంతమంది కవులు వ్రాసినా, భాగవతార్‌లు హరికథలు చెప్పినా, పండితులు పురాణ ప్రవచనం చేసినా, ఎన్ని సన్నివేశాలను చిత్రీకరించినా, వారి ప్రధాన ఉద్దేశ్యం ధర్మప్రబోధం చేయటమే. ధర్మం ఆచరిస్తే కీర్తిగడించి ఉత్తమలోకాలకు వెళుతారని, అధర్మం ఆచరిస్తే కుటుంబం సర్వనాశనమై నరకానికి వెళుతారని ప్రజలకు అవగాహన కల్పించటమే మంచి కార్యం అనిపించుకుంటుంది.

## II. భారతకాలం - మానవసంబంధాలు

### పాండవులు, కౌరవులు మనస్పర్థలు

పాండవుల, కౌరవుల విద్యాభ్యాసం, విలువిద్యా నైపుణ్యాలు పూర్తయిన పిదప వారిలో మనస్పర్థలు, ఈర్ష్యాసూయలు, గర్వం పెచ్చు పెరిగి శత్రుత్వానికి దారితీశాయి. అందుకు కొన్ని కారణాలు ఇలా చెప్పుకోవచ్చు.

1. దుర్యోధనుడు భీముణ్ణి బలాన్ని సహించలేక అతణ్ణి చంపే ప్రయత్నం చేయటం.

2. అర్జునుడు విలువిద్యలో ఆరితేరిన వాడుగా ప్రకాశించాడు. అతనికి ప్రత్యర్థిగా కర్ణుణ్ణి అంగరాజుగా చేసి దుర్యోధనుడు ప్రోత్సహించటం.

3. దుర్యోధనుడు కణిక నీతి నాశ్రయించి ధృతరాష్ట్రుని అండదండలతో, శకుని కర్ణుని సలహాలతో పాండవులను అవమానపరచాలని తలపెట్టడం, లక్క ఇల్లు తగలపెట్టడం.

4. పాండవులు హస్తినాపురంలో ఉంటే తనకు రాజ్యాధికారం రావటం అసాధ్యమని భావించి తండ్రిని ప్రోత్సహించి వారిని ఇంద్రప్రస్థానికి పంపించటం.

5. పాండవులను శకుని ప్రేరణతో జూదానికి పిలచి వారితో దుర్యోధనాదులు అధర్మంగా జూదమాడి వారిని ఓడించటం.

6. పాండవులు ఓడిపోయిన పిదప వారిని పన్నెండు సంవత్సరాలు అరణ్యవాసం, ఒకసంవత్సరం అజ్ఞాతవాసం చేయటమనే నిబంధన విధించి వారిని అడవులపాలు చేయటం దుర్యోధనుని పన్నాగం.

7. పాండవులను రాజ్యం నుంచి పంపించి వారి రాజ్యాన్ని గూడ కాజేసి తానే, 'రారాజు'గా పట్టాభిషిక్తుడు కావాలనే దురాశగలవాడు దుర్యోధనుడు.

దుర్యోధనుడు ఆచరించే దుర్మార్గాలకు, అధర్మాలకు తండ్రి ధృతరాష్ట్రుడు, శకుని, కర్ణుడు, దుశ్శాసనుడు మొదలైన వారి అండదండలున్నాయి.

## కురువృద్ధులు

కురువృద్ధులుగా పేరు, ప్రతిష్ఠలు పొందిన భీష్మ, ద్రోణ, కృప, అశ్వత్థామ, విదురుడు మొదలైన వారు కౌరవుల వైపు వారికి అండగా ఉన్నారు. కురువంశంలో ఉండి, వారి ఇంట కార్యకలాపాలు నిర్వహించటం వలన వీరంతా కౌరవుల వైపు సహాయంగా ఉన్నారు. వీరంతా ధర్మవర్తనులు తపశ్శక్తి సంపన్నులు. అధర్మాన్ని సహించనివారు. నీతికోవిదులు. అయినప్పటికీ వృద్ధులంతా ధృతరాష్ట్రుడు, వారి సంతానాన్ని ఆదుకుంటున్నారు. వీరంతా ఇచ్చే ధర్మబోధలు, నీతిసూత్రాలు, మానవీయవిలువలు కౌరవులు పెడచెవిని పెట్టేవారు.

తండ్రి ధృతరాష్ట్రుని మాటకు విలువ ఇచ్చేవారు కాదు, వినేవారు కాదు. వీరందరి మధ్యగల సంబంధాలు, ధర్మంతో నీతివంతమైన సంబంధాలు లేకపోవటం వలన పాండవులు వీరిని తిరస్కరించేవారు.

## పాండవులు - వారి సంబంధాలు

పంచపాండవులు అయిదుగురు – ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకుల సహదేవులు – వీరి భార్య ద్రౌపది. తమ్ములందరూ అన్న ధర్మరాజంటే



ఎక్కువ మమతా, మమకారాలు చూపేవారు. అన్న ఆజ్ఞను అందరూ శిరసా వహించేవారు. ధర్మరాజు ధర్మమూర్తి. ధర్మం ఆచరించటం, ధర్మం బోధించటం తప్ప మరొక మార్గం ఎరుగని వాడు. అన్నదమ్ములమధ్య సంబంధాలు, సత్సంబంధాలుగా, సన్నిహిత బంధాలుగా ఎల్లవేళలా ఉండేవి. అవన్నీ ధర్మసంబంధాలే. కష్టసుఖాలు, కలిమిలేములు, సుఖ–దుఃఖాలు సమభావనతో చూచేవారు, అనుభవించేవారు. సమస్యలు ఎదురైతే ధర్మమార్గంలోనే మానవతా దృక్పథంతో పరిష్కరించుకునేవారు.

పంచమవేదమైన మహాభారతంలో చెప్పబడిన జ్ఞానానికంతటికీ ఆచరణలో ఆదర్శంగా నిలచినవాడు ధర్మరాజు. అతడు సహజంగానే జ్ఞాని. ఏకాగ్రత గలవాడు. ఏకాగ్రచిత్తంతో స్మరించి, ధ్యానించి, తపించి, యమ, సూర్య, అగ్ని, ఇంద్రాది దేవతలను సుముఖులుగా చేసికొన్న ఉత్తముడు ధర్మరాజు. జ్ఞానాన్ని, భక్తిని ఆచరణలో చూపటమే ఆయన ధ్యేయం.

ఇక భీముని విషయానికి వస్తే, భీముడు ప్రచండబలవీరుడు. భీముడు అన్నగారి మాటను, ధర్మాన్ని ధర్మశాసనంగా భావించేవాడు. అన్న ఆజ్ఞ వేదం. అన్నమాటను జవదాటకుండా ఆచరించే ఆదర్శకర్మ వీరుడు భీముడు. భీమునికి అన్నగారి భక్తియే వ్రతం. అతనికి అన్నయే జ్ఞానం, అన్నను అనుసరించటమే కర్మ.

మరొక తమ్ముడు అర్జునుడు. అయిదుగురి అన్నదమ్ములలో అర్జునుడు మధ్యముడు. ఇతను యుద్ధవీరుడు, నరనారాయణులలో నరుడు ఇతడు. నారాయణుని యందు భక్తి ఎక్కువ కలవాడు. అన్న ధర్మజుడు దైవకార్యం నిర్వహించవలసి వచ్చినపుడు అర్జునుడి సహాయం వాడుకుంటాడు. ఇంద్రునిసాయం కావాలన్నా, పరమేశ్వరుని సహాయం కావాలన్నా సాక్షాత్తు నారాయణ స్వరూపుడైన శ్రీకృష్ణునితో అనుసంధానం పెంచుకోవాలన్నా అర్జునుడే మూలకారకుడు. కృష్ణుని పట్ల నిత్యం భక్తిని చూపేవాడు అర్జునుడు

భగవద్గీతను శ్రీకృష్ణభగవానునిచే స్వయంగా విన్న శ్రోత. భగవద్గీత సందేశానికి ప్రధానకారకుడు అర్జునుడే. అతని భక్తి, అతని జ్ఞానం గాండీవ పాండిత్యాన్ని ప్రదర్శించటానికి ఉపకరణాలుగా నిలిచాయి. అర్జునుడు యుద్ధాలలో విజయుడు. సాటిలేని మేటి ధీరుడు. శస్త్రవిద్యలో నేర్పరి. కర్మ మార్గాన్ని అనుసరించినా, జ్ఞానాన్ని గౌరవించినవాడు, భక్తిని పండించుకొన్నవాడు.

పాండవులలోని చివర ఇద్దరూ నకుల సహదేవులు. వీరు మాద్రి కుమారులు. వీరు జంటవీరులు. వారికి అన్నలే దేవుళ్ళు, వారి సేవయే భక్తి. అన్నలు చెప్పిన పని చేయటమే వారి విధి, వారు సేవా తత్పరులైన కర్మవీరులు.

పాండవుల భార్య ద్రౌపది. అబల రూపంలో అవతరించిన అహంకారశక్తి. ధర్మజుని జ్ఞానశక్తినీ, భీమాదుల క్రియాశక్తినీ తన ఇచ్ఛాశక్తితో నడిపించిన స్త్రీ మూర్తి. ఆమె ఒక్కసారి పిలిస్తే చాలు ఎక్కడ ఉన్నా భగవంతుడు ఆమెకు కనుపిస్తాడు. ఆమె ప్రధానంగా కార్యశూరురాలు. కురుసభలో చీరలందించిన శ్రీకృష్ణుడు, విరాటనగరంలో శరీరాన్ని రక్షించిన సూర్యభగవానుడు ఆమె భక్తికి, శక్తికి ప్రత్యక్ష సాక్షిగా నిలిచిన భగవత్ స్వరూపులు. ద్రౌపది అగ్ని నుండి పుట్టిన అయోనిజ. భర్తలకు ఎలా సేవచేయాలో, సత్యభామకు సలహా ఇచ్చిన అనుభవజ్ఞురాలు. కౌరవుల అవమానాగ్నితో నిత్యం జ్వలిస్తూ శత్రుశేషం లేకుండా యుద్ధమనే యజ్ఞం సాగించిన సాహసికురాలు. కర్మ మార్గం అనుసరించిన మహాపతివ్రత ద్రౌపది.

**అన్నదమ్ములైదుగురూ ఒకరినొకరు విడిపోక కలిసి మెలిసి సఖ్యత, ఐక్యత, సమైక్యతతో సత్సంబంధాలు, ప్రేమాస్పదమైన పద్ధతిలో విజయాన్ని సాధించారని తెలుస్తున్నది. అయిదుగురికి భార్యగా ద్రౌపది చూపిన ఓర్పు, నేర్పు, సహనం, సంయమనం, కొనియాడదగినవి.**



**కౌరవుల సంబంధాలు - దుష్కార్యాలు**

పాండురాజు మరణించిన తరువాత పాండవులు హస్తినాపురంలో కౌరవులతో పాటు (ధార్త రాష్ట్రులతోపాటు) పెరిగారు. బ్రాహ్మణుల వలన వేదాలు, ధనుర్విద్య మొదలైన విద్యలు నేర్చుకున్నారు. ఎక్కువ జ్ఞానం సంపాదించారు. వారి సుగుణ సంపదను చూచి సహించక దుర్యోధనుడు చెడు పనులు చేస్తూండేవాడు. శకుని, కర్ణ, దుశ్శాసనులు సలహా పై పాండవులకు ఎప్పుడూ అపకారం చేసేవారు. పాండవులు పరమధార్మికులు అయినందున ధృతరాష్ట్రకుమారుల చెడు కార్యాలకు హాని కలుగకుండ ఉండేవారు.

దుర్యోధనుడు, దుశ్శాసనుడు, శకుని, కర్ణుడు వీరు నలుగురు దుష్కార్యాలు చేస్తారు కాబట్టి, వీరిని **'దుష్టచతుష్టయం'** అని పిలవటం తెలుగు వారి అలవాటు. దుర్యోధనుడు మొదలైన కౌరవులంతా భీమునికి అపకారం చేయటానికి, చంపటానికి అనేక ప్రయత్నాలు చేశారు. భీముడు పాండవులకు వజ్రకవచం వంటివాడు. నీరుతో, విషంతో అతణ్ణి చంపటానికి దుర్యోధనుడు ప్రయత్నించి విఫలమైనాడు. భీముడు అంతులేని బలం కలవాడు. వజ్రంలాంటి శరీరం కలవాడు, దివ్యుడని తెలిసింది. అరణ్యవాస సమయంలో పాండవులందరినీ సామూహికంగా చంపటానికి ప్రయత్నించారు. అగ్నితో లక్క ఇల్లు తగులపెట్టటానికి ప్రయత్నించారు. పాండవులు తెలివితేటలతో, ధర్మ వర్తనులు కాబట్టి, ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ప్రమాదంనుంచి తప్పించటానికి విదురుడు సహాయపడ్డాడు.

**ధర్మవర్తనులను, మంచివారిని, సత్యసంధులను, ప్రజలందరి బాగు కోరేవారిని, సద్గుణమే సంపదగా కల వారిని పాపకార్యాలనుండి దైవమే కాపాడుతుంది. కాబట్టి, ప్రజలంతా ధర్మమార్గాన్ని, సత్యాన్ని పలకటం, సద్గుణాలు కలవారికి ఏ ఆపద జరగదని తెలుసుకోవాలి.**

లక్క ఇంటి నుంచి బయటపడిన తరువాత పంచపాండవులు బ్రాహ్మణవేషాలు ధరించి ద్రుపదుని పట్టణానికి వెళ్ళారు. అక్కడ ద్రౌపది స్వయంవరానికి హాజరైనారు. మత్స్య (చేప) ఆకారంలో అమర్చిన యంత్రాన్ని అర్జునుడు శ్రమలేకుండా బాణంతో పడగొట్టాడు. రాజులందరినీ ఓడించి, ద్రౌపదిని గ్రహించాడు. పాండవులయిదుగురూ కుంతీ, వ్యాసుడు మొదలైన పెద్దల సలహా విని, అయిదుగురూ ద్రౌపదిని వివాహం చేసుకుని ద్రుపదుని పట్టణంలో ఉన్నారు.

**బంధాలు - అనుబంధాలు**

దేవతల అంశలతో జన్మించి సాటిలేని పరాక్రమవంతులు, వేదవిదులు, బ్రాహ్మణులు, ధర్మంగా పాలించే రాజులు, ఋషులు మొదలైన ధర్మపరాయణులు, సద్గుణాలు గలవారంతా పాండవుల వైపు ఉన్నారు.

రాక్షసాంశలతో పుట్టినవారంతా ఉద్ధతుడు, ఉన్మదుడు, సైంధవుడు, శకుని, కౌరవసోదరులు మొదలైన వారంతా దుర్యోధనుని వైపు ఉన్నారు. అయితే ధర్మవర్తనులైన భీష్మ, ద్రోణ, కృప, అశ్వత్థామ, విదురులంతా కౌరవులవైపు ఉన్నారు. వీరంతా కురువంశంమీద, ధృతరాష్ట్రుని మీద గౌరవంతో వారి పక్షానే ఉన్నారు. వీరంతా ఒకరితో ఒకరు పోరాడి యుద్ధంలో భూభారం తగ్గేటట్లుగా మరణించారు. **భూభారంతో పాటు ధర్మానికి అధర్మానికి మధ్య జరిగిన పోరాటమే కురుక్షేత్రయుద్ధం. ధర్మమే గెలిచింది. ధర్మవర్తనులు బ్రతికి బయటపడ్డారు. అధర్మవర్తనులు ఘోరంగా మృతి చెందారు.**

**తోడికోడళ్ళ సంబంధాలు**

కురుక్షేత్రయుద్ధం ముగిసిన తరువాత ధర్మరాజుకు పట్టాభిషేకం జరిగింది. కొంతకాలం ధృతరాష్ట్రాదులు తమ్మునికొడుకుల దగ్గరే ఉన్నారు. కాని, ఎక్కువకాలం గడపటం ఇష్టంలేక వానప్రస్థానానికి వెళదామని బయలుదేరారు.



ధృతరాష్ట్రుడు, గాంధారి, విదురుడు బయలుదేరితే సాగనంపటానికి పాండవులు వెంటవెళ్ళారు. ధర్మరాజాదులు ఊరిబయట చెఱువు వరకు వెళ్ళి ఆగిపోయారు. ధృతరాష్ట్రుడు, గాంధారి, విదురుడు అరణ్యమార్గం పడుతుంటే కుంతీదేవి కూడా వారిని అనుసరించింది. ధర్మరాజు ఆమెను అడ్డుకొని "ఇదేమిటమ్మా! నీవు వానప్రస్థానానికి వెళ్ళటమేమిటి? ఇన్నాళ్ళుగా నీవు ఎక్కడో, మేము ఎక్కడోగా బ్రతికాము. ఈ చివరిదశలోనైనా మా ఎదురుగా ఉండి మమ్మల్ని ఆశీర్వదిస్తుండవా? ఇట్లయితే మమ్మల్ని యుద్ధం చేయమని ఎందుకు ప్రేరేపించావు" అని అడిగాడు.

కుంతి మెల్లగా నవ్వి "నాయనా! ఏనాడు నీతండ్రి చేయిపట్టుకొని గడపదాటి కురువంశపు రాజభవనంలో అడుగు పెట్టానో, మా అక్కగారు గాంధారీదేవి ఆప్యాయంగా నన్ను హృదయానికి చేర్చుకున్నది. నాటినుండి నేటివరకు ఎన్నో సంఘటనలు జరిగాయి. మీరు, కౌరవులు ఎన్నో సార్లు తగవులాడుకున్నారు.

'నీ కొడుకులు, నా కొడుకులను హింసిస్తున్నారని' ఆమె అనలేదు. మహాయుద్ధకాలంలో గూడ ఆమె పెదవి విప్పి ఒక్క మాట గూడ అనలేదు. మీరు యుద్ధంలో గెలిచారు. ఇప్పుడు నేను రాజమాతను. కాని, నూరుగురు కొడుకులను పోగొట్టుకొని, నిండు దుఃఖంతో ఉన్నది గాంధారి. పండువయస్సులో, కళ్ళు లేని భర్తతో వనవాసానికి వెళ్తున్న నా తోడికోడలిని విడిచిపెట్టి, రాజభవనాలలో సుఖభోగాలలో తేలి ఆడుతానని ఎలా అనుకున్నావు నాయనా? నీకు ధర్మం ఉపదేశించినదానిని. నా ధర్మం తప్పుతానా?" అన్నది. సేవాధర్మాన్ని ఆచరించింది.

ధర్మరాజు తల్లిపాదాలకు నమస్కరించి ఆమెకు దారి ఇచ్చి తప్పుకున్నాడు. కుంతి తల్లిగా తన కొడుకులకు ధర్మం బోధించింది.

తోడికోడళ్ళ అన్యోన్యత, సహనం, ఓర్పు, సంయమనం ఆ కాలంలో కొనియాడదగినవి. వారిద్దరి మధ్య సంబంధాలు చరిత్రలో నిలచిపోయేవిగా వున్నాయి. ఈనాటి తోడికోడళ్ళు సంబంధాలు పటిష్ఠపరచుకోవాలి.

**కౌరవ వంశం - వ్యక్తిత్వం**

కౌరవవంశమంతా మంచి వ్యక్తిత్వ గుణాలు, లక్షణాలు గల వారని ప్రసిద్ధి. పవిత్రమైన దేహాలు గలవారు, సత్వగుణం గలవారు, సేవాభావం, యజ్ఞ యాగాలలో భూరిదక్షిణలిచ్చి బ్రాహ్మణులను సంతృప్తి పరిచేవారు. అరిషడ్వర్గాలను జయించినవారు, ధర్మార్థ కామాలను పొందినవారు, సకల వేద వేదాంగాలు అభ్యసించినవారు, సత్ప్రవర్తన, నాయకత్వలక్షణాలు గల వారు. కీర్తి ప్రతిష్ఠలే ఆశయంగాగల భరతుడు పుట్టినవంశం కౌరవవంశం. ఆ వంశంలో పుట్టినవారు పాండవులు.

కౌరవవంశంలో నిరంతర అధ్యాపకుడైన గురువును శిష్యుడు తండ్రిగా భావించి పూజించేవారు. అది ఆనాటి ధర్మం. ప్రస్తుత యుగంలోనూ గురువును పూజించటానికి, స్మరించటానికి **'గురుపూర్ణిమ'**ను వేడుకగా జరుపుకోవటం జరుగుతోంది.

కోపంలేని వారు గొప్పవారని చెబుతూంటారు. పాండవులు కోపంలేని వారని ప్రసిద్ధి. ఎవరైనా అధర్మంగా ప్రవర్తించినా, మాట్లాడినా 'చూపులో కోపం ప్రదర్శించే వారు. అధర్మం విషయంలో భీముడు కోపం ప్రదర్శించి మాట్లాడినా, కోపం లేని ధర్మరాజు అతనిని బుజ్జగించి, సముదాయించి, ఉపశమింపచేసి శాంతపరచేవాడు. మహాభారతంలో **"వేలకొద్ది యజ్ఞాలు చేసిన వారికంటే కూడ 'కోపం' లేనివాడే గొప్పవాడని పరమార్థం"** వివరించటం జరిగింది.

**కోపంలేనివారికి ఎంతో మంది వ్యక్తులతో సన్నిహిత సంబంధాలు, స్నేహసంబంధాలు పెరగటానికి అవకాశం ఏర్పడుతుందని గ్రహించాలి. కోపం లేనివారు శత్రువును జయించవచ్చు.**



**మాటల నైపుణ్యం - సత్సంబంధాలు**

మాట్లాడేవిధానం, పలికే మాటలు ఎలా ఉండాలో చాల చక్కగా భారతంలో వివరించటం జరిగింది. సభలలో మనసుకు ప్రీతికలిగించేది, మేలైనది, ఉచితమైనది, సత్యమైనది, తీయనిది, విస్తృతం కానిది మాట. మాట ధర్మంతో కూడుకుని ఉండాలని సలహా ఇవ్వటం జరిగింది. మాట్లాడేమాట ఎదుటివారి హృదయం గాయపడకుండా అభిమానాన్ని, గౌరవాన్ని, ప్రేమను, సత్సంబంధాలను పెంచేవిగా, పోషించేవిగా ఉండాలని చెప్పటం జరిగింది.

**సత్యభాషణం :** ధర్మరాజుకు 'నిత్యసత్య వ్రతశీలి' అనే బిరుదు వుంది.

**"సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్, న బ్రూయాత్ సత్యమప్రియమ్**

**ప్రియం చ నానృతం బ్రూయాత్ ఏష ధర్మస్సనాతనః"** అని ఆర్యోక్తి.

సత్యాన్నే చెప్పాలి, ప్రియమే పలకాలి. సత్యమైనా అప్రియం పలుకగూడదు. అలాగే ప్రియమైన అసత్యమూ చెప్పరాదు, ఇది అనాదిగా వస్తున్న నీతి.

మహాభారతకాలంలో ధర్మరాజు ఒకానొక సందర్భంలో**'సత్యం మాతా, పితా జ్ఞానం'** అంటాడు. **"సత్యమే నా తల్లి, జ్ఞానమే నా తండ్రి"** అని దాని అర్థం. సత్యం తల్లిలాంటిది. తల్లిని గౌరవించినట్లు సత్యాన్ని గౌరవించి సత్యమే మాట్లాడాలి" అని దీన్నిబట్టి తెలుస్తోంది.

శకుంతలా దుష్యంతులు ప్రేమించుకుంటారు. వారికి ఒక కుమారుడు కలుగుతాడు. దుష్యంతుడు ఆమెను విడిచి వెళ్ళిపోతాడు. చాలా కాలం తర్వాత రాజుగారి సభలో దుష్యంతుడు ప్రవేశించి "శకుంతలకు, నాకు ఎటువంటి సంబంధం లేదు. ఆమె ఎవరో అసలు నాకు తెలియదు" అని

అబద్ధాలాడుతాడు. ఆసమయంలో శకుంతల దుష్యంతునితో సత్యం గొప్పదనాన్ని గురించి ఈ విధంగా చెబుతుంది.

**"నూరు చేదబావులకన్నా ఒక దిగుడుబావి మేలు**
**నూరు దిగుడుబావులకన్నా ఒక యజ్ఞం శ్రేష్ఠం**
**నూరు యాగాల కన్నా ఒక పుత్రుడు మేలు**
**నూర్గురు పుత్రులకన్నా ఒక సత్యవాక్యమే గొప్పది.**

సత్యం యజ్ఞయాగాది క్రతువులకన్నా గొప్పదని దీని అర్థం. మాటల చాతుర్యంలో సత్యమైన మాటకు విలువ ఎక్కువ. సభలో అందరిముందు దుష్యంతుడు సత్యాన్ని పలికాడు. కొడుకును కౌగిలించుకున్నాడు.

## దుష్యంతుని సుపరిపాలన

ఆ కాలంలో దుష్యంతుని పరిపాలనలో, దేశం ప్రజల అభివృద్ధితో ప్రసిద్ధి చెంది రోగాలు, దుఃఖాలు, విఘ్నాలు, నష్టాలు, అనుమానాలు, అవమానాలు ఏమీ లేకుండా ధర్మమైన పాలన సాగింది. ప్రజలంతా సత్ప్రవర్తనతో మానవసంబంధాలు కలిగి ప్రశాంత జీవనం సాగించారు. దుష్యంత మహారాజు గూడ శకుంతలను, భరతుణ్ణి భార్యా పుత్రులుగా నిండు సభలో అంగీకరించి, స్వీకరించటం ఆయన ధర్మనిరతికి నిదర్శనం. **భార్యాభర్తలు విడాకులు తీసుకుని విడిపోకుండా, పెద్దల సభలో తప్పును ఒప్పుకొని ధర్మాన్ని నిలపెట్టారు. భార్యా భర్తల సంబంధాలు పెంపొందాయి.**

## జంతువుల మధ్య స్నేహసంబంధాలు

కణ్వమహాముని ఆశ్రమంలో చిలుకలు సామవేదాన్ని సుస్వరంగా పాడుతూండేవట! ఆ వేదనాదాన్ని ఏనుగులు తన్మయత్వంతో వింటూండేవట. సింహాలు -ఏనుగులు; పిల్లులు - ఎలుకలు; పులులు-మేకలు; పాములు-ముంగిసలు వారి విరోధాన్ని వదిలి, కలిసి మెలసి స్నేహభావంతో తిరుగుతూండేవట. ఇటువంటి స్నేహస్వభావాన్ని చూచి కణ్వమహర్షి



ఎంతగానో ఆశ్చర్యపడి, సంతోషించేవాడు. శకుంతల పసిపిల్లగా ఉన్న వయస్సులో పైకి లేవటానికి చేతకాక ఏడుస్తుండేది. ఆ అరుపు విని రాక్షసులు, క్రూరమృగాలు ఆహారంగా నోట కరచుకొని పోకుండా, పక్షుల గుంపులు తమ రెక్కలతో ఆడించి ఆ పిల్లను రక్షించుకుంటూ చుట్టూ వలయంగా ఉన్నాయి. **జంతువులు వైరం మాని స్నేహ సంబంధాలు పెంచుకున్నాయి.**

**పక్షులు గూడ దయగల హృదయంతో, పసికందు శకుంతలను క్రూర మృగాల బారి నుంచి రక్షించటం మానవత్వానికి మించిన సందేశం ఇచ్చింది. పక్షుల మనస్సు వెన్న అని తెలుసుకోవాలి.**

## పాండవులు - ప్రజలమధ్య సంబంధాలు

ధర్మరాజును యువరాజుగా చేసి పట్టాభిషిక్తుణ్ణి చేశాడు ధృతరాష్ట్రుడు. ధర్మరాజు తరువాత, వారి కుటుంబంలోని వారికే, వారి కొడుకులకే రాజ్యం వంశపారంపర్యంగా దక్కుతుంది. దుర్యోధనునికి రాజ్యపాలన చేసే అవకాశం ఉండదు. అందువల్ల దుర్యోధనుడు మోసంతోకూడిన ఆశయం కలవాడై, రాజ్యకాంక్షతో, భోగభాగ్యాలు అనుభవించాలని ఆశ కలవాడై తండ్రి ధృతరాష్ట్రుణ్ణి ఒప్పించి పాండవులను, కుంతిని వారణావతానికి పంపటానికి నిర్ణయించారు.

పాండవులు తల్లి కుంతీ దేవితో వారణావతానికి బయలుదేరిన సమయంలో హస్తినాపుర ప్రజలు "ఎందుచేత ధృతరాష్ట్రుడు వీరిని హస్తిన నుండి పంపివేయాలనుకున్నాడు? ఇది అధర్మమని తెలిసి గూడ భీష్ముడు ఎందుకు అంగీకరించాడు? ఎందుకు అడ్డగించలేదో? తండ్రి, తాతల నుండి వరుసగా వచ్చిన రాజ్యాన్ని పాండు కుమారులలో పెద్దవాడు ధర్మరాజు గదా! భరతవంశంలో ప్రముఖుడు అయిన ధర్మరాజుకు రాజ్యం అప్పగించక, ధర్మం తప్పి ఎందుచేత కురువృద్ధులు అతడిని దూరం చేశారో? ధర్మరాజు వెళ్లే ప్రదేశానికి మనం కూడా వెళుదాం! అతడున్న చోటునే మనంగూడ

ప్రీతితో ఉందాం. ఈ హస్తినలో ఉండటం ఎందుకు?" అని పాండవుల మీద వున్న వాత్సల్యంతో వారంతా మాట్లాడుకున్నారు. పాండవుల వెంట ప్రయాణమైనారు.

వెంటనే ధర్మరాజు "తన వెంటవచ్చే వాళ్ళను స్నేహ పూర్వకంగా ఓదార్చి "తండ్రిమాట పాటించక పోవటం ధర్మవిరుద్ధమని, అందుచేత వారణావతం వెళ్ళి వస్తామని" చెప్పి వారందరిని వెనుకకు పంపాడు.

పంచపాండవులు, తల్లి కుంతీదేవిపై హస్తినాపుర ప్రజలకు గల సంబంధాలు వర్ణింపటానికి వీలు కానివి. పాండవులు ధర్మ వర్తనులు కావటం చేత, తండ్రి లేని వారు పురప్రజలకు వారిపై దయాహృదయంతో మానవీయ దృక్పథంతో ఉన్నారని తెలుస్తోంది. పాండవులకు, హస్తినాపుర ప్రజలమధ్య అత్యంత ఆప్యాయ, అనురాగంతో సంబంధాలు ఉండేవని తెలుస్తోంది. **ధర్మవర్తనులైన వారికి ఎప్పుడూ అందరి అండదండలు, దయా గుణం, సత్సంబంధాలు కలిగి ఉంటారు.**

### విదురుడు, వ్యాసుని హిత బోధ

వారణావతంలో ధర్మరాజు, నలుగురు సోదరులు చేయదగిన పనులన్నిటినీ విదురుడు చెప్పి సాగనంపాడు. ధృతరాష్ట్రుడు మీకు మేలు చేసే వానివలె ఉండి తరువాత కీడు చేస్తాడు. దుర్యోధనుని దుష్టబుద్ధితో గూడిన సలహా విని ధృతరాష్ట్రుడు మిమ్ములను హస్తిన నుంచి పంపించాడు.

విదురుడు పాండవులతో ఇంకా "మీరు ఏమరుపాటు లేకుండా విషంవల్ల, అగ్నివల్ల కలిగే ప్రమాదాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. దుర్యోధనుడు చేసే చెడుపనులు తెలుసుకొని, ఆ చెడు పనులకు పరిష్కారం, విరుగుడు గూడ చెప్పి పంపిస్తాను" అన్నాడు. కుంతీదేవి, పాండవులు విదురుడు చెప్పిన సలహాకు, అతనికి తమపై ఉన్న బంధుప్రీతికి సంతోషించారు.



**మహాభారతకాలంలో విదురనీతికి ఎక్కువ విలువ ఉందని పరిశీలన మీదట తెలుస్తుంది. విదురుడు 'వేద విదుడు'గా పేరు పొందాడు. విదురునికి పాండవులకు ప్రేమ పూర్వక సంబంధాలు బాల్యం నుంచి ఉన్నాయి. మంచివారికి మంచివారే సహాయ సహకారాలు అందిస్తారు. వారు పరస్పర సంబంధాలు పెంచుకొంటారు.**

వారణావతం చేరిన పాండవులు, కుంతీ, దుర్యోధనుడు దుష్టబుద్ధితో నిర్మించిన లక్క ఇంటిలో నివసిస్తున్నారు. పాండవులు నిద్రిస్తున్న సమయంలో లక్క ఇంటిని తగలపెట్టటానికి దుర్యోధనుడు వ్యూహం పన్నాడు. ఈ సంగతిని విదురుడు రహస్యంగా దూత ద్వారా పాండవులకు సందేశం పంపాడు. పాండవులు రహస్యంగా లక్క ఇంటి నుంచి తప్పించుకు వెళ్ళిపోయారు. తరువాత లక్క ఇల్లు అగ్ని జ్వాలలకు బూడిదైపోయింది. పాండవులు చనిపోయారని ధృతరాష్ట్రుడు, దుర్యోధనుడు మొదలైనవారు సంతోషించారు. కాని వారు బ్రతికే వున్నారని కొంతకాలానికి తెలిసి దుర్యోధనాదులు ఆశ్చర్యం ప్రకటించి కొంత బాధపడ్డారు. **ధర్మవర్తనులు కష్టాలలో ఉన్నా వారిని ఏదో రూపంలో భగవంతుడు రక్షిస్తాడు.**

### వ్యాసుని సలహా

శాలిహోత్రుని ఆశ్రమంలో నివసిస్తున్న కుంతిని, పాండవులను కలిసి వ్యాసుడు వారికి తగిన సలహాలు ఇచ్చాడు. ధర్మరాజు, అతడి సోదరులను, కుశల ప్రశ్నలడిగి వ్యాసుడు "ధృతరాష్ట్రుడు కొడుకు మాటవిని, ఇది మంచి పద్ధతి కాదని నచ్చచెప్పలేదు. దుర్మార్గుడై మీకు అపకారం చేసి మిమ్మల్ని రాజ్యం నుండి వెళ్ళగొట్టాడు. దుర్మార్గులను ఎక్కడైనా, ఎప్పుడైనా నమ్మకూడదని నీకు హితోపదేశం చేయాలని వచ్చాను" అని అన్నాడు.

"అన్ని ధర్మాలు తెలిసిన వాళ్ళు, వినయవంతులు అయిన మీకు బంధువులతో దూరంగా ఉండటం పూర్వజన్మ కృతం. దీనికి దుఃఖించవద్దు.

కొంత కాలానికి మీరు కూడా బంధువులతో కలిసి ఎప్పటివలె రాజ్యం చేస్తారు. మీరున్న ప్రదేశం శాలిహోత్రముని తపస్సుచే ఏర్పడిన సరోవరం – దీని నీళ్ళు త్రాగిన వారికి, ఆకలి దప్పులుండవు. ఈ చెట్టు కూడ చలి, గాలి, ఎండ, వానల నుండి మిమ్మల్ని కాపాడుతుంది. మీరంతా ఇతరులకు కనుపించకుండా మీ పనులు నెరవేరు వరకు కొన్ని రోజులు ఉండండి. తరువాత ఏకచక్రపురానికి వెళ్ళండి. అక్కడ బ్రాహ్మణరూపంలో బ్రాహ్మణులతో కలిసి ఉండి నా రాక కోసం ఎదురు చూస్తూండండి” అని వ్యాసుడు వారికి సలహా ఇచ్చాడు.

కన్నీరు కారుస్తున్న కుంతినీ, పాండవులను ఓదార్చుతూ వ్యాసుడు “నీ కొడుకు యుధిష్ఠిరుడు ధర్మాత్ముడు. అతడు నారాయణుని భుజాలవంటివాడు. నలుగురి తమ్ముల బలం చేత, రాజులందరిని శాసిస్తాడు. సార్వభౌముడు చేసే రాజసూయ, అశ్వమేధాదియాగాలు చేసి తాత, తండ్రుల రాజ్యాన్ని పాలిస్తాడు. కురువంశాన్ని పవిత్రం చేస్తాడు” అని చెప్పి వారికి మానసిక శాంతి కలిగించాడు. **ప్రక్కన ఉన్న హిడింబను చూచి ‘దీనిపేరు కమలపాలిక. ఇది భీమునికి వశమై సేవచేసి మహాబలవంతుడైన కొడుకును కంటుంది. అతడు మిమ్మల్నందరినీ ఆపదసమయంలో రక్షిస్తాడు”** అని చెప్పి వ్యాసమహర్షి అదృశ్యమైనాడు.

వ్యాసమహర్షి బోధలవలన పాండవులు తల్లితో శాలిహోత్రముని ఆశ్రమంలో దుఃఖం లేకుండా సుఖంగా ఉన్నారు.

**“దుఃఖాల్లో ఉన్నవారికి, కష్టాల్లో ఉన్న వారికి పరిష్కారాలు చెప్పి మానసిక శాంతి కలిగించిన వ్యాసమహర్షి మానసిక శాస్త్రవేత్త గూడ. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవటమే మనిషికి గొప్ప గుణం.”**

### బ్రాహ్మణులతో పాండవుల సంబంధాలు

పాండవులు చక్కని జడలతో, జింక చర్మం ధరించి, దర్భలతో, నారచీరలతో వేదపఠనం చేస్తూ ‘బ్రహ్మచర్యాన్ని అవలంబించి ఏకచక్రపురానికి



వెళ్ళి సుఖంగా ఒక ఇంట్లో ఉన్నారు. వీరంతా ఏకచక్రపురంలో ఉంటూ సంతోషంతో చదువుతూ భిక్షాటనకు వెళ్ళగా బ్రాహ్మణ గృహస్థులు దయతో వారిని తృప్తి పరచారు. బ్రాహ్మణులంతా “సూర్యతేజులు, ధీరులు. భూమండలరాజ్యలక్ష్మికి అర్హత కలిగిన వారు. వీళ్ళను బ్రహ్మదేవుడు ఎందుచేత భిక్షాన్నం తినేవాళ్ళుగా చేశాడో అని ఏకచక్రపుర ప్రజలు దుఃఖించేవారు.

వీరు నివసిస్తున్న బ్రాహ్మణగృహంలో ఒకనాడు ఏడుపు వినబడింది. కుంతీదేవి ఆ ఏడుపు విని “మనం ఇతరులెవ్వరికి తెలియకుండా సుఖంగా ఉన్నాం. ఎందుచేతనో ఈ బ్రాహ్మణగృహంలో ఏడుపు వినిపిస్తున్నది. దీన్ని విచారించి ఈ బాధను తొలగించాలి” అని భీమునితో అన్నది.

### ఉపకారం చేయాలి

“మనకు మహోపకారం చేసిన బ్రాహ్మణునికి కష్టసమయంలో ఉపకారం చేసి తృప్తి పరచాలి” అనుకున్నది కుంతీదేవి. ఆ బ్రాహ్మణుడు తనకు కలిగిన ఆపదను, ముంచుకొస్తున్న దుఃఖానికి కారణం చెప్పాడు.

“ఈ ప్రాంతపురాజులు బ్రాహ్మణుల నుండి పోకచెక్కను గూడ కప్పంగా తీసుకోరు. కాని, ఈ పాపాత్ముడైన రాక్షసుడు తిండి కొరకు బ్రాహ్మణుల నుండి మనిషినే కప్పంగా స్వీకరిస్తున్నాడు” అన్నది బ్రాహ్మణుని భార్య.

వెంటనే కుంతి “మీకు ఒకడే కుమారుడు. ఆ పసివాణ్ణి బలి ఇవ్వటం ధర్మం కాదు. బ్రాహ్మణ హత్య మహాపాపం. కాబట్టి, నాకు అయిదుగురు కుమారులున్నారు. వారిలో ఒకరిని ఆ రాక్షసునికి బలిగా పంపుతాను. మీరు విచారించవద్దు” అని చెప్పి బ్రాహ్మణదంపతులను ఊరడించింది.

### కుంతి ఆలోచన

బ్రాహ్మణవధను సహింపక తనకుమారుడు భీముణ్ణి బకాసురునికి అర్పిస్తున్నాను. నా కుమారుణ్ణి చంపటం ఆ రాక్షసునికి సాధ్యంకాదు. అని

తన ఆలోచనను భీమునికి చెప్పింది. ఇదివరకు కూడ చాలమంది రాక్షసులను చంపాడు. భీముడు మహాబలవంతుడు, మంత్రసిద్ధి కలవాడు, అని భీముని పిలిచి ఆ బ్రాహ్మణుణ్ణి సంతోషపెట్టవలసిందిగా ఆజ్ఞచేసింది. అందుకు భీముడు సరే అని బకాసురుణ్ణి చంపటానికి బండిలో ప్రయాణమైనాడు.

ధర్మరాజుకు ఈ విషయం తెలియపర్చగా "ఉత్తమ క్షత్రియుడు ఇతరుల దుఃఖాలు తొలగించటానికి పుట్టిన ధర్మశీలుడు. బ్రాహ్మణులకు ఇష్టమైనది తప్పక చేస్తే అది మహాపుణ్యఫలమని వేదవ్యాసుడు చెబితే విన్నాను. వేదవ్యాసుడే గదా ఏకచక్రపురానికి వెళ్ళమని సలహా ఇచ్చి బ్రాహ్మణులతో నివసించమని చెప్పింది" అని అన్నాడు ధర్మరాజు.

తల్లి కుంతి దయార్ద్ర బుద్ధికి, బ్రాహ్మణ భక్తికి, ధర్మాచరణానికి సంతోషించి ధర్మరాజు కూడ భీముణ్ణి ఆజ్ఞాపించాడు.

## బకాసుర వధ

భీముడు బకాసురులు ఇద్దరూ భీకరంగా హోరాహోరిగా పోరాడగా భీముని ధాటికి తట్టుకోలేక బలహీనుడై, బకాసురుడు భీముని చేతిలో మరణించాడు.

బకాసురుని మరణవార్త విని ఆ పురంలో బ్రాహ్మణులంతా సంతోషించారు.

**♦ సుఖంగా ఉండటానికి నివాసమిచ్చిన బ్రాహ్మణునికి ప్రత్యుపకారం చేయటం ఉత్తమధర్మం.**

**♦ బ్రాహ్మణ కుమారుణ్ణి బ్రతికించటానికి తన అయిదుగురి కుమారులలో ఒకణ్ణి బలిగా ఇవ్వటానికి తల్లి నిర్ణయించటం మానవధర్మం.**

**♦ బ్రాహ్మణ హత్య మహాపాపమని తెలిసి బ్రాహ్మణ హత్యను నివారించారు కుంతీ, పాండవులు.**



**♦ బ్రాహ్మణులు సేవా పరాయణులని, ఉపకారం చేసేవారని, పురం హితంకోరే వారని, యజ్ఞయాగాది కర్మలు నిర్వహిస్తారని, వేదవేదాంగాలు రోజూ అధ్యయనం చేసేవారని, ధర్మవర్తనులని భావించి బ్రాహ్మణులు పాండవులు సత్సంబంధాలు పెంచుకున్నారు.**

## బ్రాహ్మణులతో ద్రుపదుని సంబంధాలు

భరద్వాజ మహర్షి కుమారుడైన ద్రోణుడు, పృషతుని కుమారుడైన ద్రుపదుడు ఒకచోట ఉండి ప్రియమిత్రులై వేదాలను చదివారు. తరువాత అగ్నివేశుని దగ్గర ధనుర్వేదాన్ని నేర్చుకున్నారు. ద్రుపదుడు పాంచాలదేశానికి రాజు కాగా, ద్రోణుడు ప్రపంచ ప్రసిద్ధి పొంది పాండవులకు, కౌరవులకు శస్త్రవిద్యలో ఎంతో నేర్పరులుగా శిక్షణ ఇచ్చాడు.

ద్రుపదునికి ద్రోణునికి సత్సంబంధాలు లేక శత్రుత్వాన్ని పెంచుకున్నారు. దీని ఫలితంగా ద్రుపదుడు యుద్ధంలో ద్రోణుడిని చంపగల పుత్రుడిని, అర్జునుడికి భార్య కాగల పుత్రికను పొందాలని ప్రతిజ్ఞ చేశాడు. వెంటనే ద్రుపదుడు బ్రహ్మజ్ఞాన సంపన్నులైన బ్రాహ్మణులు నివసించే ప్రదేశాలకు వెళ్ళి ప్రతిదినం బ్రాహ్మణ సేవ చేయసాగాడు. ఒకనాడు ద్రుపదుడు గంగానదీ తీరంలో యాజుడు, ఉపయాజులు అనే ఇద్దరు బ్రాహ్మణులను చూచాడు. వారిద్దరితో సంభాషించగా ఉపయాజుడు తనకన్న పెద్దవాడైన అన్న యాజుని దగ్గరకు వెళ్ళమని చెప్పాడు.

వెంటనే ద్రుపదుడు యాజునితో తను యాగం చేయాలనే కోరిక వ్యక్తపరచాడు. యాజుడు యజ్ఞం చేయించే యాజ్ఞికుడిగా ఉండటానికి అంగీకరించాడు. నీ కోరికకు తగిన కొడుకు, కూతురు జన్మిస్తారు, భయపడవద్దని ఆశీర్వదించాడు.

## దృష్టద్యుమ్నుడు, ద్రౌపది జననం

యాజుడు యాజ్ఞికుడుగా, ఉపయాజుడు సహాయకుడుగా ఉండి ద్రుపదుని భార్య కోకిలాదేవి ధర్మపత్నిగా యజ్ఞం శాస్త్రోక్తంగా చేయించారు.

మంత్రాలతో ఆహుతులుగా వ్రేల్చిన పదార్థాలతో తృప్తి పొందిన అగ్నిదేవుని వలన "అగ్నిజ్వాలవలె భయంకరమైన శరీరం కలవాడు, ఖడ్గాన్ని, పెద్ద ధనుస్సును ధరించినవాడు, శ్రేష్ఠమైన కవచంతో, కిరీటంతో అలంకరింపబడినవాడు రథాన్ని అధిరోహించినవాడు అయిన ఒక పుత్రుడు అగ్నిహోత్రుని వలె ఉదయించాడు. అతనికి దృష్టద్యుమ్నుడు అని పేరు పెట్టారు.

వంశాన్ని పావనం చేసేది, మనోహరమైన ఆకారం కలది అయిన ఒక సుందర కన్య చిరునవ్వుతో అగ్నికుండంలో నుంచి ఉదయించింది. ఈ కన్యకు 'కృష్ణ' అనే పేరు పెట్టటం జరిగింది.

దృష్టద్యుమ్నుడు, కృష్ణ అనే పేర్లు ప్రజలందరికి తెలిసే విధంగా ఆకాశవాణి పలికింది. లోక వ్యవహారంలో ఈమెను ద్రౌపది అని పిలవటం సంప్రదాయంగా వచ్చింది. ద్రుపదుని కూతురు కావటం వలన 'ద్రౌపది' అయిందని రచయితల వ్యాఖ్యానం.

యాజుడికి దక్షిణలిచ్చి బ్రాహ్మణులను పూజించాడు.

♦ **చిత్తశుద్ధితో యజ్ఞయాగాది క్రతువులు నిర్వహిస్తే సంతానం కలుగుతుందని రామాయణ, భారత కాలాలను బట్టి తెలుస్తోంది. రామాయణంలో దశరథుడు పుత్రకామేష్టి యాగం చేసి గదా నలుగురు కుమారులు జన్మించారు.**

♦ **ద్రుపదునికి బ్రాహ్మణులమీద విశ్వాసం, నమ్మకం, గౌరవం ఉన్నందువలననే సన్నిహిత సంబంధాలు కలిగి యజ్ఞం పూర్తిచేసి సత్ఫలితాలను పొందాడు.**

### ధర్మజుని మానవతా దృష్టి

ఏకచక్రపురంలో చాల రోజులు నివసించాం కాబట్టి మరొక ప్రదేశానికి వెళదామని నిర్ణయించుకున్నారు పాండవులు. కుంతి వెంటనే పాంచాలపురానికి వెళుదామని చెప్పగా అందుకు కొడుకులందరూ అంగీకరించారు. మార్గమధ్యంలో వారికి వ్యాసమునీంద్రుడు కనుపించాడు.



"పాంచాలరాజు కూతురైన కృష్ణ(ద్రౌపది)కు స్వయంవరాన్ని ప్రకటించాడు. అందువల్ల మీరు ద్రుపద పురానికి వెళ్ళండి. అక్కడ మీకు మేలు కలుగుతుంది" అని వ్యాసుడు వారికి సలహా ఇచ్చాడు.

మార్గంలో అంగారపర్ణుడనే గంధర్వుడు తన భార్యలతో అర్ధరాత్రి గంగానదీ తీరానికి జలక్రీడల కోసం వెళుతున్నాడు. పాండవుల పాదధ్వని విని వారితో "అర్ధరాత్రి సమయంలో, ఉదయ సాయంకాల సంధ్యలలో భూతాలు, యక్షులు, రాక్షసులు, గంధర్వులు తిరుగుతుంటారు. కనుక మానవులు భయపడతారు" అని అన్నాడు. వెంటనే అర్జునుడు "బలహీనులైన వారు భయపడతారు. మేము మహాశక్తి కల వీరులం కావటం చేత ఎక్కడైనా, ఎప్పుడైనా సంచరిస్తూ ఉంటాం. అడవులు, నదులు, నీవు సంపాదించినవా? **సహజ సంపద అంతా జనులందరికీ సంబంధించినవి, అనుభవింప దగినవి"** అని అన్నాడు అంగారపర్ణుడితో.

అంగారపర్ణుడు తీవ్రమైన కోపంతో అర్జునుని మీద వాడి బాణాలు వేయగా, అర్జునుడు ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించగా అంగారపర్ణుడు దిమ్మ తిరిగి నేలమీద పడిపోయాడు. అర్జునుడు అంగారపర్ణుని జుట్టు పట్టుకొని ధర్మరాజు వద్దకు ఈడ్చుకొని వచ్చాడు. అంగారపర్ణుని భార్య కుంభీనసి భయంతో "నాకు పతి దానం" చేయండి. మీకు ధర్మం పెరుగుతుంది" అని వేడుకొని, సలహా గూడ ఇచ్చింది.

పుణ్యాత్ముడు, ధర్మమూర్తి అయిన ధర్మరాజు దయతలచి అర్జునునితో 'యుద్ధంలో ఓడినవాడు, క్రుంగిపోయినవాడు, శౌర్యం కోల్పోయినవాడు అయిన అంగారపర్ణుణ్ణి విడిచిపెట్టు" అని ఆజ్ఞాపించాడు.

ఆ క్షణం నుంచి అంగారపర్ణుడు అర్జునుడితో స్నేహాన్ని పెంచుకొని మంచిసంబంధాలు పెంపొందించుకొన్నాడు. **శత్రుత్వాలెన్ని ఉన్నా భర్తను**

**కాపాడి, క్షమించి, భార్యను సుమంగళిగా జీవించటానికి, భార్యాభర్తల అన్యోన్యతను పెంచటానికి ఆజ్ఞ చేయటం మానవుని ఉత్తమ ధర్మం.**

## పాండవులు ధౌమ్యునితో సంబంధాలు

పాండవులు గంగా నదిని దాటి ఉత్కచమనే పుణ్యతీర్థానికి వెళ్ళారు. అక్కడ పాపరహితుడు, ఇష్టపడి తపస్సు చేస్తున్నవాడు, ప్రసిద్ధుడు, లోకంలో పవిత్రమైన చరిత్ర కలవాడు, సజ్జనుల చేత పూజింపబడేవాడు, ధార్మికుడు, మహాత్ముడు, మేలు కలిగించే వాడు, బ్రాహ్మణ వంశానికి అలంకారమైనవాడు, దేవలుని తోబుట్టువులలో గొప్పవాడు అయిన ధౌమ్యుణ్ణి తమకు పురోహితుణ్ణిగా పాండవులు స్వీకరించారు. ధౌమ్యుడు గూడ వారిని మిక్కిలి ప్రేమించి పురోహితత్వాన్ని స్వీకరించాడు. ధౌమ్యుని ఆశీర్వచనం పొంది పాండవులు తల్లితో కూడ పాంచాల దేశానికి బయలు దేరారు. ఆ విధంగా వారు ధౌమ్యునితో సత్సంబంధాలను కలిగి ఉన్నారు.

మార్గమధ్యంలో వారికి ద్రుపదనగరానికి వెళుతున్న బ్రాహ్మణులు కనుపించారు. మీరెక్కడికి వెళుతున్నారు" అని పాండవులు అడుగగా, వారిలా చెప్పారు.

## ద్రౌపది స్వయంవరమహోత్సవం

"పాండవులు ద్రౌపది స్వయంవరమహోత్సవానికి ప్రయాణమైనారు. ద్రుపదుని నగరంలోనికి పాండవులు ప్రవేశింపగా ఎదుట నిలబడిన వేదవ్యాసునికి నమస్కరించి, చేతులు జోడించి నిలువగా "వారికి రానున్న శుభాలను వ్యాసుడు చెప్పి, ఆశీర్వదించి" వెళ్ళాడు. ద్రుపదనగరంలో ఒక కుమ్మరి ఇంట్లో విడిది చేసి ఎవరికి తెలియకుండా బ్రాహ్మణ వృత్తిలో ఉన్నారు. పాంచాల రాజు అర్జుననికి తన కుమార్తె నివ్వాలని ప్రయత్నించి పాండవుల కోసం వెదకి, వాళ్ళను ఎక్కడ ఉన్నారో తెలుసుకోలేక స్వయంవరం ప్రకటించాడు.



## ద్రుపదుని చాటింపు

"ఆకాశంలో కట్టిన మత్స్యయంత్రాన్ని ఈ విల్లు ఎక్కుపెట్టి ఐదు బాణాలతో ఎవడు పడగొడతాడో అతడే ధర్మ ప్రకారం నా కుమార్తెకు భర్త అవుతాడు." అని ద్రుపదుడు చాటింపు వేశాడు. ఆ చాటింపు విని రాజులంతా ఒకరి కంటే మరొకరు ముందుగా సంతోషంతో ఆభరణాలు ధరించి, మైపూతలు పూసుకొని, మంచి దుస్తులు ధరించుకొని, ఐశ్వర్యంతో తమ తమ ధ్వజాలు మొదలైన చిహ్నాలు స్పష్టంగా కనపడే విధంగా, భూతలం కంపించే విధంగా, ద్రౌపది స్వయంవర మంటపానికి ప్రీతితో వెళ్ళారు.

## హాజరైన రాజులు

ద్రౌపది స్వయంవరానికి భూమండలంలోని రాజకుమారులంతా వచ్చారు. స్వయంవరానికి వచ్చిన రాజుకుమారులంతా మత్స్యయంత్రాన్ని విరచటానికి ప్రయత్నించి విఫలులైనారు. వేదమంత్రాలఘోషతో ప్రకాశిస్తున్న బ్రాహ్మణులు ప్రత్యేకంగా ఏర్పరచిన ఆసనాలలో కూర్చున్నారు.

## అర్జునుడు శివుని విల్లు విరవడం

బ్రాహ్మణవేషంలో ఉన్న అర్జునుడు ధనుస్సును సంధించి ప్రజలంతా ఆశ్చర్యపడుతుండగా, ఆ మత్స్యయంత్రాన్ని పడగొట్టాడు. అది చూచి బ్రాహ్మణులు, క్షత్రియులు, అక్కడకు వచ్చిన జన సమూహమంతా ఆశ్చర్యపరవశులైనారు. బ్రాహ్మణులలో ఇంత గొప్పవారున్నారా? ఇతడు బ్రాహ్మణ రూపంలో వున్న దేవేంద్రుడో, శివుడో! సూర్యుడో! కుమారస్వామియో! అని మనసులో అనుకున్నారు. భూమి మీద జనుల జయజయధ్వానాలు చేశారు. ఆకాశంలో పొగిడే దేవతల ధ్వనులు అర్జునుని విజయానికి సూచికలుగా వినిపించాయి. బ్రాహ్మణోత్తములు ఉత్తరీయములను పదే పదే వీచుతూ పెద్దగా కేకలు వేశారు. అర్జునుని మీద పూల వాన అందంగా కురిసింది.

ద్రౌపది తెల్లని పూలదండతో అర్జునుణ్ణి పూజించింది. ఆ ఉత్సవాన్ని, ఆ సంబరాన్ని చూచి ఓర్వలేక దుర్యోధనుడు మొదలైన రాజులంతా కోపించి వీరవిహారం చేశారు.

**శ్రీకృష్ణుని జోక్యం**

ఓడిన రాజులలో కొంతమంది ముఖ్యంగా కర్ణుడు, శల్యుడు మొదలైన వారు బ్రాహ్మణ వేషంలో ఉన్న అర్జునునితో యుద్ధంచేసి ఓడిపోయారు. మీరెవరో తెలుసుకోవాలని ఉంది? ఇతరులు చేయటానికి సాధ్యంకాని గొప్ప పని చేసిన వారెవరు? ఈ బ్రాహ్మణుడు ఆ స్వయంవరంలో పద్మాలవంటి కన్నులు గల ద్రౌపదిని ధర్మమార్గంలో పొందాడు. ఈ సాటిలేని పరాక్రమశాలిని జయించటం ఎవరికి సాధ్యమో చెప్పండి" అని అన్నారు.

శ్రీకృష్ణుడు జోక్యం చేసుకొని "వద్దు, వాళ్ళెవరో తెలుసుకొనే ప్రయత్నం మానండి" అని రాకుమారులందరితో అనగా, వాళ్ళు తమ దేశాలకు తిరిగి వెళ్ళారు. ధర్మరాజు, నకుల సహదేవులు తల్లి దగ్గరికి ముందుగా వచ్చారు. తర్వాత భీమార్జులు ద్రౌపదితో కూడా వచ్చి నమస్కరించి "మేమొక భిక్ష తెచ్చాము" అని తల్లికి నివేదించారు. కుంతి, పిల్లలు తెచ్చిన భిక్షను గూర్చి తెలియక ఎప్పటి మాదిరిగానే భావించి, సంతసించి 'దానిని మీరైదుగురు' పంచుకోండి" అని కొడుకులను ఆజ్ఞాపించింది. పాండవులు ఈ విషయాన్ని చర్చించి అయిదుగురూ ద్రౌపదిని భార్యగా స్వీకరించటం ధర్మ విరుద్ధం కాదని నిర్ణయించారు. ఇది బ్రహ్మ సృష్టించిన సత్యం కాక వేరే ఏముంది. ఈమెకు శివుడిచ్చిన వరం కూడా వున్నది.

**పాండవులను ద్రుపదుడు గుర్తించటం**

మత్స్యయంత్రాన్ని విరచి ద్రౌపదిని పొందిన వారెవరు? వారి కులగోత్రాలు ఏమిటి? వారెక్కడివారు? తల్లిదండ్రులెవరు? తెలుసుకోకుండా ద్రుపదుడు అర్జునుడికి ఎట్లా ద్రౌపదినిచ్చి వివాహం చేస్తాడు. వారి గురించి తెలుసుకోటానికి ద్రుపదుడు ఒక పురోహితుణ్ణి వెంట పంపాడు. ఆ పురోహితుడు భీమార్జునుల వెంట అనుసరించాడు. వారందరిని పరామర్శించి ద్రుపదమహారాజు మిమ్ములను చూడాలని ఆసక్తి చూపుతున్నాడు మీ పరాక్రమాలను తెలుసుకోవాలనుకుంటున్నాడు అని అన్నాడు. పాండవులు సరేనని పాంచాలనగరానికి ద్రుపదుని కోరిక మేరకు ప్రయాణమైనారు.



ధర్మరాజు వారిని గురించి వివరంగా పుట్టుపూర్వోత్తరాలన్నీ చెప్పాడు. వారందరిని తల్లితో సహా ద్రుపదునికి పరిచయం చేశాడు. ద్రుపదుడు సంతోషించి నేను ద్రౌపదిని అర్జునునికి ఇచ్చి వివాహం చేయాలనుకున్న కోరిక ఫలించిందని సంతోషించాడు. అర్జునునికిచ్చి ద్రౌపదిని వివాహం చేస్తానని చెప్పాడు. పెద్దవాడైన ధర్మరాజుని నేనుండగా మూడవ వానికి, చిన్నవానికి వివాహం ఎట్లా కుదురుతుంది. అందువలన ముందు నేను, తర్వాత భీముడు, అర్జునుడు, నకుల సహదేవులు వివాహం చేసుకుంటారు" అని చెప్పాడు. వెంటనే ద్రుపదుడు **"ఒకమగవాడికి పెక్కుమంది భార్యలుండటం విన్నాం, కాని పెక్కుమంది మగవారికి ఒక్క స్త్రీ భార్య కావటం ఏ యుగంలోనూ, ఏ కథలలోను ఎవ్వరి వలన వినలేదు" అని అన్నాడు.**

"నీవు వేద సంబంధమైన ధర్మం స్వరూపం తెలిసిన వాడివి. ధర్ముని కుమారుడవు. నీ మాటలు ధర్మ విరుద్ధాలని అనటానికి వెనుకాడుతున్నాము. లోకంలో మునుపు ఎన్నడూ ఇటువంటిది వినలేదు. దీనిని గురించి నీవు, నేను, కుంతీ, దృష్టద్యుమ్నుడు మరింత లోతుగా ఆలోచించి రేపు నిర్ణయిద్దాం" అని ద్రుపదుడు ధర్మరాజుకు సలహా ఇచ్చాడు.

**వేదవ్యాసుని సలహా**

ద్రుపదుడు, ధర్మరాజు సందేహపడుతుండగా వారి ధర్మ సందేహాన్ని పోగొట్టటానికి వ్యాసమహాముని అక్కడికి వచ్చాడు. వేదవ్యాసునితో

ద్రుపదుడు “మునీంద్రా! ధర్మాధర్మ నిర్ణయం చేయటం ఇతరులెవ్వరికీ సాధ్యంకాదు. ధర్మ సంకటం ఏర్పడకుండా మీరే దీనిని ఆలోచించి పరిష్కరించండి” అని ప్రార్థించాడు.

**ధర్మజుని ధర్మవివరణ**

మధ్యలో ధర్మరాజు కలుగచేసుకొని “నవ్వులాటకైనా నామాట అసత్యంలో, నా మనస్సు అధర్మంలో ఎన్నడూ ఉండదు. ధర్మం ఆ విధంగానే ఉన్నది. అందువలన ద్రౌపదిని “ఇవ్వదగును, ఇవ్వకూడదు” అని ఆలోచించటం మానుకోండి. బాధపడకుండా, మా అయిదుగురికి ఇచ్చి వివాహం జరిపించు” అని చెప్పాడు.

దీనికి ఉదాహరణగా ధర్మజుడు పూర్వం జరిగిన ఇటువంటి సంఘటనలు చెప్పి వారి సందేహాన్ని తొలగించాడు. అవి ః

1. పూర్వం గౌతముని వంశంలో పుట్టిన జటిల అనే ఋషి కూతురు తన తపః ప్రభావం చేత ఏడుగురు ఋషులకు భార్య అయిందనీ,

2. దాక్షాయణి అనే ముని కన్యక ఒకే పేరుతో ప్రచేతసులనబడే పదిమందికి భార్య అయిందనీ కథలలో వినబడుతూనే ఉన్నది,

3. అంతేకాక, గురువులలో తల్లి ప్రథమ గురువు, ఉత్తమ గురువు. అటువంటి తల్లి మాటను, బ్రహ్మ చేసిన పనిని మార్పు చేయటం సాధ్యమా? అని ధర్మరాజు చెప్పాడు.

వెంటనే ద్రుపదుడు “ధర్మ సూక్ష్మాన్ని నిర్ణయించటం మనకు సాధ్యం కాదు. విజ్ఞానానికి నిధి అయిన వేదవ్యాసుడు ఆలోచించి ఏది నిర్ణయిస్తే అదే ఇప్పుడు చేయదగింది అని పల్కగా వ్యాసుడు ద్రుపదునితో ఇట్లా అన్నాడు.

“ధర్మరాజు ధర్మతత్త్వం తెలిసినవాడు. ధర్మమార్గం తప్పి ఎందుకు మాట్లాడుతాడు? దేవతామూర్తి అయిన కుంతీదేవి తెలియక ఎందుకు



అసత్యం పలుకుతుంది. వీళ్ళ మాటలు, దేవతల అభిప్రాయం ఒకటే. అందువలన వేరే ఆలోచన మాని పాండవులైదుగురికి నీ కుమార్తె ద్రౌపదినిచ్చి వివాహం చెయ్యి” అని సలహా ఇచ్చాడు.

పూర్వపు మహాత్ములలో గూడ ఇటువంటి చరిత్రలున్నాయి. అందువలన సందేహించక పాండవులైదుగురికి ద్రౌపదినిచ్చి వరుసగా వివాహం జరిపించు. ఇది మన నిర్ణయం కాదు, దైవ నిర్ణయం. అని వ్యాసుడు ద్రుపదుణ్ణి ఒప్పించాడు.

ద్రౌపది, పంచపాండవుల వివాహబంధం ధర్మబద్ధంగానే జరిగి ద్రుపదుడు, పాండవులు, వ్యాసునిమధ్య ధార్మికచర్చలద్వారా సంబంధాలు ప్రకాశించాయి.

**వైభవంగా ద్రౌపది వివాహం**

ఒక శుభముహూర్తంలో మంత్రయుక్తంగా, వేద పండితుల ఆశీర్వచనాలతో, అంగరంగ వైభవంగా, మంగళాలంకారాలు, మంగళవాద్యాల నడుమ, ధౌమ్యుడు మొదలైన బ్రాహ్మణ సమూహంతో పంచపాండవులకు ద్రౌపదితో వివాహం శోభాయమానంగా జరిగింది. అందరూ సంతోషించారు. దేవతలు పుష్పవర్షం కురిపించారు.

**కోడలు ఎలా ఉండాలి?**

భూమండల సామ్రాజ్యాధికార సంపదకు కారణమైన పతివ్రత ద్రౌపది, సమానంగా సేవచేసి భర్తలందరికీ మిక్కిలి సంతోషాన్ని కలిగించింది. కుంతీదేవి, కోడలు ఉత్తమగుణాలకు ఎంతో సంతోషించి “ద్రౌపది విష్ణుమూర్తి పై లక్ష్మీదేవివలె, చంద్రుని మీద రోహిణీదేవివలె, ఇంద్రుని మీద శచీదేవి వలె, వసిష్ఠునిపై అరుంధతివలె నీ భర్తలమీది ప్రేమతో పతిభక్తి ప్రకాశించగా సంతానాన్ని పొందు. అన్నదానం చేసి బ్రాహ్మణులను తృప్తి పరచు, భూమి మీద ప్రజలందరి పట్ల దయకలిగి ఉండు.

నీ భర్తలు యజ్ఞ యాగాది కర్మలు చేయునప్పుడు, భూ మండలాన్ని పరిపాలిస్తున్నపుడు నీవు వాళ్ళ ధర్మపత్నిగా ఉండు. నేను నిన్ను నా కోడలిగా చేసుకొని సంతోషించినట్లే నీవు కూడా నీ కొడుకులను, మనుమలను పొంది సంతోషించు.

భర్తలకు భోజనం వడ్డించు విషయంలోనూ కోడలికి సలహా ఇచ్చింది. “భిక్షాన్నం రెండు భాగాలు చేసి ఒక భాగం దేవతలకు నివేదనచేసి, బ్రాహ్మణులకు దానంచేసి, కొంతభాగం మన ఆశ్రమంలో జీవించే వారికి పెట్టు. మిగిలినది రెండు భాగాలు చేసి ఒక భాగాన్ని ఆరుగా విభజించి అందులో నాలుగు భాగాలు అన్నదమ్ములు నలుగురికి పెట్టు, పక్కగా వుంచిన భాగాన్ని భీముని ముందుపెట్టు, ఆ ఆరింటిలో మిగిలిన రెండూ మనకిద్దరికి పెట్టు” అని సూచించింది.

ద్రౌపది అత్త గారి మాటలను తు.చ. తప్పకుండా అనుసరించింది. భర్తలు మృగచర్మాలపై నిద్రించిన తరువాత, ద్రౌపది అత్తగారి పాద సమీపంలో నిద్రించేది.

**ఎంతో అనుభవజ్ఞురాలైన అత్తగారి సలహాలను పాటించటం కోడలి ధర్మం. కష్టాలలోనూ, సుఖాలలోనూ, సమస్యలలోనూ, సంసారం సాఫీగా నడిపించటంలోనూ అత్తగారికి ఉన్న అనుభవం, కోడలికి స్ఫూర్తి. అత్త సలహాలను పాటించటం వలన అత్తా కోడళ్ళు సంబంధాలే గాకుండా కుటుంబంలో కలహాలు, కలతలు లేకుండా కుటుంబసంబంధాలు సత్సంబంధాలుగా ప్రకాశించాయి.**

## సంతోషాలు, అసూయ

(1) పాండవులైదుగురూ ద్రౌపదిని వివాహమాడటం విని ద్వారకలో ఉన్న శ్రీకృష్ణుడు సంతోషించాడు. ఆ అయిదుగురికి వజ్రాలు, వైడూర్యాలు, మరకతాలు, ముత్యాలు పొదిగిన ఆభరణాలు బహుమతిగా ఇచ్చాడు. వివిధ



దేశాలకు సంబంధించిన చిత్ర విచిత్రాలైన దుస్తులను చదివించాడు. ఎన్నో ఏనుగులు, గుఱ్ఱాలు, రథాలు, పల్లకీలు, వేశ్యా సమూహాలను పంపించాడు. శ్రీకృష్ణుడు పాండవుల మధ్య స్నేహసంబంధాలకు విలువైన కానుకలు చిహ్నాలే గదా!

(2) రాజ్యాధికారంతో శత్రువీరులకు భయం కలిగిస్తూ, సుగుణాలతో ప్రకాశిస్తూ భోగాలతో తులతూగుతున్నారు. మహాపరాక్రమశాలులైన పాండవులు ఉండటం వలన ద్రుపదునికి దేవతల వలన కూడా భయం లేకుండా ఉన్నది. ద్రుపదుడు సంతోషంతో వెలిగిపోతున్నాడు. అతని దేశంలో – రోగాలు, దొంగలు, కొల్లగొట్టుట లేనివై కలతలు లేక ప్రజలు సుఖంగా ఉన్నారు.

(3) ద్రుపదుని నగరంలో పాండవులు సమస్త రాజ్య వైభవంతో ఉన్నారు. ఈ విషయం తెలిసి దుర్యోధనాదులు అసూయ చెందారు. ధృతరాష్ట్రుడు గూడ కలత చెంది మనస్సులో బాధ పడ్డాడు. పాండవులపై పైకి కనుపించని అసూయను పెంచుకున్నాడు.

పాండవులకు పెదతండ్రి కొడుకులైన దుర్యోధనాదులు శత్రువులయ్యారు. ద్రుపదరాజ పుత్రికను వివాహం చేసుకోవటం వలన, పాండవులకు బంధువర్గం పెరిగింది. పాండవుల మిత్రులూ, బంధువులూ వారి వారి స్వార్థాల కంటే పాండవుల శ్రేయస్సునే కోరుతారు. కౌరవపక్షం దానికి విరుద్ధం. వారికి స్వార్థమే లక్ష్యం. ఈ సంగతిని తెలిసికున్న దుర్యోధనుడు పాండవ బలాన్ని అంచనా వేసి, భయపడి, వాళ్ళపట్ల అందరికి విరోధభావాన్ని ప్రయోగించాలని ఆలోచించాడు.

## దుష్టసంబంధాలకు పునాది

దుర్యోధనుడు, శకుని, దుశ్శాసనుడు, కర్ణుడు – పాండవులకు వ్యతిరేకంగా దుష్టపన్నాగాలు పన్ని వారిని హింసించి, బాధపెట్టి, కష్టాలలోకి

నెట్టి రాజ్యాని కంతటికీ రారాజు ఖ్యాతి సంపాదించాలన్న కోరికతో ఉన్నాడు. పాండవులు వీరికి శత్రువులైనారు. అందువల్ల "శత్రువుని ఎదుర్కొనే విషయంలో రాజనీతి మూడు మార్గాలు చూపిస్తుంది" అని శకుని చెప్పాడు కర్ణునితో. శత్రువుని ఎప్పుడూ బలహీన పరుస్తూ ఉండటం ఒకరకం. మరొక వర్గాన్ని ఎప్పుడూ హింసిస్తూ ఉండటం రెండవరకం. మూడవరకం శత్రువును ఎప్పుడుపడితే అప్పుడు, ఎక్కడ దొరికితే అక్కడ సంహరించాలి. పాండవుల విషయంలో ఇదే శ్రేష్ఠమైన మార్గం" అని అన్నాడు శకుని.

దుర్యోధనుడు మరొక చెడు వ్యూహం పన్నుతూ "కుంతీ, మాద్రి పుత్రులను విడదీయటం ఒకటి. ద్రుపదునికి పాండవులకు మధ్య విరోధం కలిగించాలి. ద్రౌపదికి పాండవుల మీద అసహ్యం కలిగేటట్లు చేయాలి. సమయం చూచి భీముణ్ణి చంపాలి. ఇవేవీ సాగకపోతే పాండవులకు ఇతర స్త్రీలతో పరిచయం కలిగించి వారి చేత దుష్టపన్నాగాలు చేయించాలి" అన్నాడు. కర్ణుడు దుర్యోధనునితో "నీవు పన్నిన పన్నాగం సాధ్యపడేది కాదు. మనం ద్రుపదుణ్ణి జయించి పాండవులను పరాజితులను చేయటం ఒక్కటే మార్గం" అన్నాడు.

**కురువృద్ధుల హితబోధ**

ధృతరాష్ట్రుడు కురువృద్ధులైన భీష్మ, ద్రోణ, విదురులను పిలిపించి వారితో సంప్రదించి నిర్ణయిద్దామని వారిని రప్పించాడు. వారికీ విషయాన్ని వివరించాడు.

భీష్ముడు "ధృతరాష్ట్రా! నీకు, నాకు పాండవుల రక్షణ భారం సమానంగా ఉంది. రాజ్యాన్ని పాలించవలసింది పాండవులే కాని దుర్యోధనులు కారు. అధికారం వారిది. అందుచేత వారి రాజ్యం వారికివ్వటం ధర్మమార్గం" అని అన్నాడు.

ద్రోణాచార్యుడు "తన అభిప్రాయం కూడా భీష్ములవారి నిర్ణయాన్నే బలపరుస్తున్నానని చెప్పాడు. పాండవులు సజీవులై ఉన్నారనీ, ప్రజలూ,



జానపదులూ అందరూ వారిని చూడాలని ఎదురు చూస్తున్నారు. ప్రజాభిప్రాయం గ్రహించి పాలించే కురువంశంలో జన్మించిన మీరు, వెంటనే ప్రేమతో పాండవులను హస్తినాపురానికి పిలిపించండి" అని అన్నాడు.

వెంటనే విదురుణ్ణి పిలిచి పాంచాల దేశానికి వెళ్ళి రాజ లాంఛనాలతో పాండవులను ద్రౌపదీ సమేతంగా తీసుకురమ్మన్నాడు ధృతరాష్ట్రుడు.

**పాండవులకు ప్రజల జేజేలు**

హస్తినాపుర ప్రజలే కాక పరిసరాల ప్రజలు లక్షల సంఖ్యలో వచ్చి పాండవులను చూచి ప్రశంసల జల్లులు కురిపించారు.

విద్వాంసులూ, కళాకోవిదులూ వారిని అభినందించి సత్కరించారు. మంగళవాయిద్యాలు మ్రోగుతుండగా వ్యాపార ప్రముఖులు తమకు చక్కని రక్షకులు వచ్చారని ఆనందంతో పాండవులను అభినందించారు. నగర వీథులన్నీ పన్నీటి జల్లులతో సుగంధ ధూపాలతో వెలుగుతున్నాయి.

నగరంలోని ప్రజలంతా పాండవులను చూచి మిక్కిలి ప్రేమతో ఇట్లా అనుకున్నారు.

"ధర్మస్వరూపుడైన ధర్మరాజు తమ్ములతో కూడా ఇక్కడికి వచ్చాడు. పాండురాజే మళ్ళీ బ్రతికి మనలను కాపాడటానికి ఇపుడు వచ్చినట్లున్నది. మనకు మేలు కలుగుతుంది. మహాత్ములైన పాండవులకు మానవబలం, దైవబలం ఉండటం వలన ఆపదలు తొలగుతాయి కాని, రాజ్యం తొలగిపోతుందా? మనం చేసిన దాన, జప, హోమాల పుణ్యమే ఉన్నట్లయితే ఈ ధర్మరాజు హస్తినాపురంలో ఉండి భూమండలాన్ని పరిపాలించుగాక".

హస్తినాపుర పౌరులంతా ఆశీర్వదిస్తూండగా, పాండవులు సకల జనులకు సంతోషం కలిగేటట్లు అయిదు సంవత్సరాల పాలన తరువాత ధృతరాష్ట్రుడు వారిని పిలిపించాడు.

**మహాభారతకాలంలో ధర్మాన్ని ఆచరించే వారినీ, సచ్చరిత్ర ఉన్నవారినీ, మానవీయత ఉన్న వారినీ ప్రజలు గౌరవించారు. ప్రజాభిప్రాయం పాండవుల పక్షమే. ప్రజలు ధర్మం వైపే ఉన్నారు.**

### పాండవులకు అర్ధరాజ్యం

అయిదు సంవత్సరాలు గడచిన తరువాత ధృతరాష్ట్రుడు పాండవులను తన సభాభవనానికి పిలిపించాడు. అతనితో "ధర్మనందనా! అహంకారంతో, దర్పం మత్తులో నా కొడుకులు నన్ను లెక్క చేయటం లేదు. అందుచేత వారికి, మీకు ద్వేషాలు పెరగకుండా, మీరు ఖాండవప్రస్థంలో నిశ్చింతగా ఉండండి. మీ అర్ధరాజ్యాన్ని మీరు సుఖంగా అనుభవించండి" అని అన్నాడు.

ధృతరాష్ట్రుడు విదురునితో 'మహామంత్రీ! నేడే ధర్మరాజుకు రాజ్యాభిషేకం చేయిస్తున్నాను. వేద విదులైన బ్రాహ్మణులనూ, వ్యాపార రహస్యాలు తెలిసిన వైశ్యులనూ పిలిపించండి. భద్రగజం మీద ధర్మరాజు రాజలాంఛనాలతో ఊరేగుతూంటే ప్రజలందరూ పాండురాజు చేసిన ఉపకారానికి ధృతరాష్ట్రుడు తిరిగి వారికి ఉపకారం చేశాడని ఆనందించాలి" అని అన్నాడు.

ఆ సమయానికి అక్కడకు వచ్చిన వ్యాసుడు, శ్రీకృష్ణుడు సంతోషించి వేదోక్తంగా ధర్మరాజుకు రాజ్యాభిషేకం చేశారు.

నగరమంతా ఊరేగి తిరిగి వచ్చిన ధర్మరాజును దగ్గరగా తీసుకొని ధృతరాష్ట్రుడు "నాయనా! పురూరవ, నహుష, యయాతి ప్రభువు మొదలైన **మన వంశీయులందరికీ ఖాండవప్రస్థమే రాజధాని.** తరువాత కాలంలో హస్తినాపురానికి మార్చటం జరిగింది. నువ్వు ఈ పాతనగరాన్ని మరల చక్కగా నిర్మించి మన వంశ కీర్తి ప్రతిష్ఠలు నిలబెట్టు. ఈ నగరంలో నిన్ను అభిమానించేవారందరూ నీ వెంటవస్తారు. వారందరితో హాయిగా నీరాజ్యం నువ్వు పరిపాలించు" అని సలహా ఇచ్చాడు.



### ఇంద్రప్రస్థనగరం

శ్రీకృష్ణుని అండతో, సహకారంతో పాండవులు **ఖాండవప్రస్థం** చేరారు. శ్రీకృష్ణుడు విశ్వకర్మను పిలిపించి అమరావతికి దీటైన నగరం నిర్మించమన్నాడు. వ్యాసులవారు శాంతికర్మ జరిపించాడు. నగరనిర్మాణ పథకం రూపొందింది. రాజులకు అవసరమైన సకల సదుపాయాలతో భవనాలు, అంతఃపురాలు, ఉద్యానవనాలు, సభామండపాలు, జలాశయాలు, క్రీడల స్థలాలు సుందరంగా నిర్మించారు. నగరానికి ముప్పది రెండు ద్వారాలు నిర్మించారు. ధర్మరాజు కలశంతో, ముందుకు నడుస్తూండగా వ్యాసుడు, కృష్ణుడు, అశేష జనవాహిని వెంటరాగా ధర్మరాజు నగర ప్రవేశం చేశాడు. ఆ నూతన నగరానికి **'ఇంద్రప్రస్థం'** అని పేరు పెట్టారు.

ఈ శుభసమయంలో నగర ప్రజలకు వారి వారి అవసరాలకు తగిన ఏర్పాట్లు జరిగాయో లేదో స్వయంగా పర్యవేక్షించాడు ధర్మరాజు.

దాన ధర్మాలతో ప్రజారంజకంగా ధర్మరాజు ఇంద్రప్రస్థంలో పాలన సాగిస్తున్నాడు. ఆ సమయంలో నారదుడు వచ్చాడు. అన్నదమ్ము లయిదుగురూ, భార్య ద్రౌపదితో నియమబద్ధంగా దాంపత్యజీవితం సాగించాలని చెప్పాడు.

### నియమంతో సోదరుల సంబంధాలు

వెంటనే ధర్మరాజు "మహర్షీ! మేం అంతా ఒక నియమం చేసుకున్నాం. సంవత్సరానికి ఒకరితో ద్రౌపది ఉంటుంది. ఆ సమయంలో వారి శయ్యా మందిరానికి మాలో ఇతరులెవరు వెళ్ళరాదు. వెళ్ళినా పన్నెండు నెలలు అరణ్యంలో ఉండాలి" అని చెప్పగా నారదుడు సంతోషించి, వారి సత్కారాలుపొంది వెళ్ళాడు.

ఒకరోజు ద్రౌపదీ, ధర్మరాజులున్నమందిరంలో అర్జునుడు అడుగుపెట్టి సమయభంగం కారణంగా అడవులకు వెళతానన్నాడు. ధర్మరాజు వారించి,

నాయనా! అన్నగారు అంతఃపురంలో ఉన్నా తమ్ముడు రావచ్చు. కాని, తమ్ముని శయనమందిరానికి అన్న వెళ్ళకూడదని ధర్మశాస్త్రం చెబుతోంది" అన్నాడు. అయినా అర్జునుడు నియమభంగానికి ప్రాయశ్చిత్తం చేసుకుంటానని బయలుదేరాడు. అతని వెంట ఎందరో వేదవిదులూ, యతులూ, పౌరాణికులూ బయలుదేరారు.

**ధర్మపాలన**

ధర్మరాజు తమ్ములు నలుగురు ప్రేమతో తనకు విధేయులై వెలుగుతున్నారు. వేదం విధించిన యజ్ఞం వలె సమస్తాన్ని పవిత్రం చేసే శుభకరమైన ఆకారం కలవాడై లోకంలో అందరి చేత నమస్కరింపబడే వాడుగా ప్రకాశిస్తున్నాడు. ధర్మమే ప్రధానంగా కలవాడయిన ధర్మరాజు సంతోషంతో గొప్పగా రాజ్యపాలన చేశాడు.

**ధర్మజుని వ్యక్తిత్వం**

ధర్మరాజు పుణ్యాత్ముడు, వేదాన్ని చదువుకోవటంలో ఆసక్తి కలవాడు, గొప్ప యజ్ఞాలు నిర్వహించాడు. మనువు వంటి ధార్మికమైన నడవడి కలవాడు. అన్ని వర్ణాలను, ఆశ్రమాలను రక్షించే సమర్థత కలవాడు. ఆడితప్పనివాడు, శత్రువులు లేనివాడు, మృదు స్వభావి, మితభాషి, హితభాషి. భరతవంశ శ్రేష్ఠుడై సలక్షణ, సుగుణాలు కలిగి భూమండలం మంచి రాజును పొందినట్లయింది. లక్ష్మి స్థిరమైన భర్త కలది అయింది. ధర్మం మంచి బంధువు కలది అయింది. జనులు శరత్కాల పూర్ణ చంద్రుని వెన్నెల్లోనూ, ఆ ధర్మరాజుతో సమానమైన ప్రీతి కలవాళ్ళయి సంతోషించారు.

**సుపరిపాలన**

ధర్మరాజు ధర్మప్రవర్తన కలవాడవటం వలన ప్రజలు రోగాల వలన, దొంగల వలన, శత్రుదేశాల వలన బాధలు లేక అంతులేని సంపదలు సమృద్ధిగా పొందారు. ఆ దేశంలోని బ్రాహ్మణోత్తములు యజ్ఞం చేయటం,



చేయించటం, వేదం చదవటం, చదివించటం, దానం చేయటం, పుచ్చుకోవటం అనే ఆరు కర్మలను ఆచరించారు. క్షత్రియులు, వైశ్యులు వృద్ధిపొంది బ్రాహ్మణ భక్తికలవారై, ధర్మమార్గం తప్పక, ఎల్లప్పుడూ పుణ్యకార్యాలు శ్రద్ధతో యజ్ఞాలు, యాగాలు నిర్వహిస్తూ, వేదాలు చదువుతూ, దానాలు చేస్తూ జీవిస్తున్నారు.

ఇతర వర్ణాలవారు కేవలం బ్రాహ్మణులకు సేవ చేయటంలో ఎంతో ఆసక్తి కలవాళ్ళయినారు. వారు ధర్మం మీద స్థిరమైన బుద్ధికలవాళ్ళయి నడుచుకున్నారు. ధర్మజుని ధర్మరాజ్యం గొప్పగా అభివృద్ధి పొందింది. పాండవులు తమ పరాక్రమంతో, స్నేహంతో రాజులందరినీ తమ వశం చేసుకుని సత్సంబంధాలు పెంచుకొని సుఖంగా ఉన్నారు.

**"ప్రజలకు సుపరిపాలన అందించటానికి ధర్మం ఆచరించటమే మూల సూత్రం. ధర్మపాలన అందించే వారికి దైవబలం తోడుగా ఉంటుంది".**

**"యథారాజా తథా ప్రజా" అన్నట్లు రాజు ధర్మాన్ని ఆచరిస్తే ప్రజలూ ధర్మాన్నే ఆచరిస్తారు. ఆ ధర్మమే మనలను రక్షిస్తుందని అర్థమవుతోంది. మానవ సంబంధాలు ధర్మంతోనే ముడిపడి వుంటాయి.**

**ధర్మరాజు మయసభప్రవేశం**

మయసభాభవన నిర్మాణం అయిన తరువాత ధర్మరాజు ప్రవేశించాడు. పదివేల మంది వేదవిదులను పంచభక్ష్య పరమాన్నాలతో, వస్త్రభూషణాదులతో, గో, భూదానాలతో సంతోషింపచేసి వారి ఆశీస్సులను పొందాడు. మంగళవాద్య ఘోష ఆలాపిస్తుండగా వేదవిదులు వేదపఠనం చేస్తూండగా సభాభవనంలో దేవతాహ్వానం చేసి ధర్మరాజు సింహాసనం అధిష్ఠించాడు.

**విందులు, వినోదాలు**

ఆ సభాభవన ప్రవేశోత్సవానికి అనేక దేశాల చక్రవర్తులు, రాజులు, మంత్రులు, కళాకారులు, జానపదులు, బ్రాహ్మణోత్తములు, భాగవతాదులు,

ఆప్తులు, స్నేహితులు, సన్నిహితులు బహుదూరప్రాంతాల నుంచి వచ్చారు. సమస్త ప్రజానీకానికి ఉచితంగా స్నాన, పాన, భోజన, విశ్రాంతి సదుపాయాలు ఏర్పాటు చేశారు. ధర్మరాజు ఎందరెందరో బ్రాహ్మణుల్ని భక్తితో పూజించారు. కోరినవాళ్ళకు కోరిన దానాలిచ్చి తృప్తి పరచాడు. తన కీర్తి అన్ని దిక్కులకు వ్యాపింపచేశాడు. గంధర్వులు, గాన, నాట్యవిద్యా కోవిదలైన అప్సరసలు నాట్యం చేశారు. తుంబుర, చిత్రసేనులు గానంచేస్తూ విచ్చేసిన ఆహ్వానితులకు కనులకు ఇంపుగా వీనుల విందుగా అలరింపచేశారు. తన ఐశ్వర్యం ప్రకాశించేటట్లు ప్రేమతో బంధుమిత్రులకు ఆనందం కలిగించాడు.

**ఇంత జన సందోహాన్ని చూచి ధర్మరాజుకు ఎంతమందితో స్నేహ సంబంధాలున్నాయో! అని ఆశ్చర్యం వ్యక్తపరిచారు ఆహ్వానితులు.**

**నారదుడి రాజనీతి**

ఒకరోజు వేద వేదాంగ విదుడు తపస్సంపన్నుడు, పురాణేతిహాసాల రహస్యాలు తెలిసిన వాడు, ధర్మతత్త్వ ప్రచారకుడు, రాజనీతి రహస్యవేత్త, సంగీతకోవిదుడు, మహావక్త అయిన నారదమహర్షి సభాభవనానికి వచ్చాడు. ధర్మరాజు ఆ మహర్షిని స్వాగతించాడు. నమస్కరించి, వినయంతో అర్ఘ్య పాద్యాదులర్పించాడు. ఉచితాసనం మీద కూర్చోపెట్టి కుశల ప్రశ్నలు వేశాడు. నారద మహర్షి ధర్మరాజుతో తాత, ముత్తాతలు నడచిన మార్గాన్ని, రాజు ఆచరించవలసిన రాజనీతిని, ఉండవలసిన గుణాలను, లక్షణాలను ధర్మరాజుకు బోధించాడు.

ధర్మనందనా! నువ్వు నీ తండ్రి, తాత ఏర్పరచిన ధర్మ పద్ధతిని తప్పక ఆచరిస్తున్నావు కదా! ధర్మాన్ని తెలుసుకొని, ధర్మార్థ కామాలు ఒకదాని నొకటి బాధించకుండ, కాలానికి తగినట్టుగా విభజించి సేవిస్తున్నావు కదా! ధర్మ మందే మనసు నిలిపి, చేయవలసిన రాజకార్యాలను స్వబుద్ధితో



ఎల్లప్పుడూ అర్ధరాత్రి దాటిన తరువాతే ఆలోచిస్తున్నావు కదా! ప్రభుత్వోద్యోగాల్లో స్థిరంగా యోగ్యులైన వారిని అర్హతలున్న వారిని, శక్తి సామర్థ్యాలున్న వారిని గుర్తించి గౌరవభావంగా, స్థిరంగా నియమించావు కదా!

పుణ్యాత్ములు, శాస్త్ర నియమాలు బాగా తెలిసిన వాళ్ళు నీమీద ప్రేమగలవాళ్ళు, వంశపారంపర్యంగా ఉద్యోగంచేస్తున్న బ్రాహ్మణోత్తముల్ని రాజకార్యనిర్వహణకు మంత్రులుగా ఏర్పరచుకున్నావు గదా! అని నారదమహర్షి ఆశను వ్యక్తపరచాడు.

**"రాజ్యపాలన, ప్రభుత్వపాలన ఎలా ఉండాలో నీకు తెలుసు గదా! ధర్మాచరణ, ఆలోచనల అమలు, బ్రాహ్మణోత్తముల సలహాలు తీసుకుంటున్నావనే అనుకుంటున్నాను" అని నారదుడు అన్నాడు.**

**నారదమహర్షి బోధించిన ప్రభుత్వం, పాలన నైపుణ్యాలు, వ్యూహాలు, యాజమాన్య పద్ధతులు. రాజుకు ప్రజలకు మధ్య సత్సంబంధాలు పెంపొందటానికి ఉపయోగించాయి.**

ఓ ధర్మరాజా! రాజుకు విజయం కలగటానికి అతని రహస్యాలోచనం, ఆ రహస్యాలోచన ప్రజల కంట పడకుండా జాగ్రత్తగా కాపాడుకుంటున్నావు కదా!

నీ పురోహితుడు ధైర్యవంతుడు, ధర్మాధర్మాలు తెలిసినవాడు. వివిధ వేదశాస్త్రాలు చదివినవాడు. రాగద్వేషాలు లేక సమభావన కలవాడు. సరస్వతీ దేవి వంటి ముఖం కలవాడు – అని చెప్పుకోగల వాడే కదా! యజ్ఞాలలో నియమించిన యాజ్ఞికుడు యజ్ఞం చేయించటంలో నిపుణుడై రాగ ద్వేషాలు లేకుండా, తన పనులను మరువకుండా ఉన్నాడు కదా!

సైన్యాధ్యక్షులుగా వివిధయుద్ధాల్లో విజయాన్ని సాధించటంలో నిపుణులైన 'వాళ్ళను, ఎదిరించ సాధ్యంకాని పరాక్రమం కలవారిని, విశ్వాస

పాత్రులైన వారిని, గౌరవానికి అర్హులైన వారిని, నీ మేలుకోరేవారిని నియమించావు గదా!

ఎక్కువ పలుకుబడి కలిగి, పనిమంతుడు, సమర్థుడు అయిన మంత్రి తన హద్దుమీరి, ఇతర రాజులను గొప్ప ధనవంతులుగా చేసి, వాళ్ళతో చేతులు కలిపి, నీకు వ్యతిరేకంగా ఏర్పడేటట్లుగా ఉండటం లేదు కదా! ఉండగూడదు అని అర్థం. ధర్మరాజా, ధనం ఎటువంటి వారికైనా దురాశనూ, గర్వాన్ని కలిగిస్తుంది.

ఓ ధర్మరాజా! నీ ఆస్థానపండితులు, జ్యోతిష్కులు, శాస్త్ర పాండిత్యం చేత, స్వంత ప్రతిభ చేత దేవతా సంబంధాలు, అంతరిక్ష సంబంధాలు, భూ సంబంధాలు అయిన ఉపద్రవాలను కనిపెట్టి వాటికి పరిష్కారాలకు శాంతి క్రియలు నీచేత జరిపించి, సన్మానాలు, సత్కారాలు పొందుతున్నారు గదా! ఆయుర్వేదంలో సమర్థులైన వైద్యులు ప్రజల మీద ప్రేమతో వైద్య సేవలు చేస్తున్నారు గదా! చక్కగా ఆలోచించి పెద్దలసేవతో మానసిక వ్యాధులను, ఔషధసేవతో శారీరక వ్యాధులకు చికిత్స చేసుకుంటున్నావు కదా!

ధర్మనందనా! పన్నులు వసూలు చేయటం వంటి ధనార్జన విషయమైన పనులలో, అవినీతి పరులు, పక్షపాత బుద్ధి కలవాళ్ళు నియుక్తులు కాకుండా చూచుకుంటున్నావా? లేనిచో ప్రభుత్వ ధనాగారానికి నష్టం వాటిల్లుతుంది. ప్రభుత్వం మీద ద్వేషభావం కలుగుతుంది. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య సంబంధాలకు దెబ్బ తగులుతుంది. అందువల్ల అలాంటి ఉద్యోగ నియామకాల్లో ప్రభువు ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

ఓ రాజా! వ్యక్తుల ఉత్తమ, మధ్యమ, అధమ యోగ్యతలను, సమర్థతలను తెలుసుకొని ఉత్తమ, మధ్యమ, అధమ ఉద్యోగాల్లో నియమించావు కదా! సేవకులకు, ఇబ్బంది లేకుండా తగిన జీతాలు దయతో సకాలంలో అందుతున్నాయి గదా! అందవలెనని దీని అర్థం. జీతాలు సకాలంలో చెల్లిస్తే



ఉద్యోగులు తృప్తి చెంది సమర్థవంతులుగా పనిచేస్తారు. రాజులకు అనుకూలంగా వుంటారు. రాజు, ప్రజలూ ఆరోగ్యంగా వుంటారు.

వంశపారంపర్యంగా పనిచేయుచున్న సేవకులను ప్రీతితో సన్మానం చేస్తున్నావు కదా! వారిని సన్మానం చేసి, వారి సంక్షేమం కోరి సహాయం చేస్తే వారు రాజ్యంకోసం ప్రాణాలు అర్పిస్తారు. ఆ విధంగానే యుద్ధంలో మరణించిన వీరసైనికుల కుటుంబాలకు గూడు, గుడ్డ, తిండి మొదలైన వాటికి లోటు లేకుండా ఇచ్చి వాళ్ళను సంతోషంగా పోషిస్తున్నావు గదా!

**ఓ ధర్మరాజా! ధనంపై లోభ బుద్ధికల వాళ్ళని, దొంగల్ని, స్నేహానికి యోగ్యులు కాని వారిని, శత్రువుల పట్ల పక్షపాతం కలవాళ్ళని, ధైర్యంలేని వారిని, దుర్మార్గులైనవారిని, రాజకార్యాలు నిర్వహించటానికి పంపటం లేదు కదా! వారిని పంపగూడదు అని అర్థం.**

ధర్మనందనా! దొంగభయం లేకుండా నీవు రాజ్యాన్ని పాలిస్తున్నావు కదా! నీ ప్రభుత్వోద్యోగుల్లో ధనం మీద ఆశ కలవారై ఆ దొంగల దగ్గర డబ్బు పుచ్చుకొని వాళ్ళకు రక్షణ కల్పించటం లేదు కదా! అటువంటి చెడ్డవారికి రక్షణ కల్పించగూడదు. రాజుకి, పాలనకు చెడ్డపేరు వస్తుంది. రాజుని ప్రజలు నిందిస్తారని తెలుసుకోవాలి. దొంగలను, ధనాశపరులైన ఉద్యోగులను శిక్షించాలని అర్థం.

ఓ ధర్మప్రభూ! భుజబలంతో నీవు పరిపాలిస్తున్న ఈ భూమిలో అనావృష్టి భయంలేకుండా చెరువులు నిండి కనుల పండువుగా వున్నాయి కదా! చెరువులు నిండుగా ఉన్నట్లయితే పంటలు పండి ప్రజలు ఆహారధాన్యాలు కొరత లేకుండా తృప్తిగా జీవిస్తారు.

ధర్మరాజా! ఉదారమైన మనస్సుతో పేద రైతులకు, ధాన్యపు విత్తనాలు, వర్తకులకు నూటికి ఒక రూపాయి వడ్డీ వంతున అప్పులు ఇస్తున్నావు కదా!

**"ఏ ప్రభువైనా వ్యవసాయాన్ని, వ్యాపారాన్ని ప్రోత్సహించాలి. సమాజశ్రేయస్సు చేయటం అవసరం. రైతు సంక్షేమం ముఖ్యమైన విషయంగా భావించేవారు. మహాభారత కాలంలోనే అధికాహారోత్పత్తికి విత్తనాలు, ఆర్థికాభివృద్ధికి తక్కువ వడ్డీతో ఋణాలు రాజులు ఇచ్చేవారు.**

రాజా! కుంటివాళ్ళనూ, గ్రుడ్డివాళ్ళనూ, అంగవిహీనులైన వారిని, మూగవాళ్ళను, చెవిటి వారిని, బంధువులు, తల్లిదండ్రులులేని వారిని దయతో పోషిస్తున్నావు కదా!

**'దయ గల హృదయం ప్రభువుకు ఉండవలసిన ప్రధానగుణం 'మానవసేవే మాధవసేవ' లక్ష్యంగా పనిచేసే వారు. వికలాంగులకు, అనాథలకు ప్రభుత్వం చేయూత ఇవ్వటం మహాభారత కాలంలోనే ఉన్నది.**

చేసిన మేలు గుర్తించి ఆ మేలు చేసిన వ్యక్తిని పదిమంది పెద్దలున్న సభలో ఉచిత రీతిని సత్కరిస్తున్నావు కదా! చేసిన మేలు గుర్తించగల రాజే ప్రపంచ ప్రజల మన్ననలు పొంది ఇంకా చక్కగా పరిపాలించగలడు. కృతజ్ఞత ఒక గొప్పగుణం. అది మానవతా లక్షణం. మంచిని గుర్తించి పదిమంది ముందు ప్రశంసించటం కంటే మంచి పెంచటానికి మేలైన మార్గం మరొకటి లేదు.

ధర్మరాజా! ఆదాయంలో నాల్గవభాగాన్ని లేదా మూడవభాగాన్ని లేదా సగభాగాన్ని మాత్రమే ఖర్చుచెయాలి కాని, అంతకుమించి చేయకూడదని గ్రహించావు కదా! ఆయుధశాలలు, ధనాగారాలు, గుఱ్ఱపుశాలలు, గజశాలలు, కోశాగారాలు, వీటిని నిర్వహించువారిని ఎంతో నమ్మదగినవారిని, నీ పట్ల భక్తిగల వారిని, సమర్థులైన వారిని నియమించావు కదా! ప్రజలంతా నిన్ను ప్రశంసించేటట్లుగా గురువుల్ని, వృద్ధ శిల్పుల్ని, గొప్ప వ్యాపారుల్ని, బంధువుల్ని, ఆశ్రితుల్ని, సజ్జనుల్ని పేదరికం రాకుండా దయతో పోషిస్తున్నావు గదా! అందర్ని పోషిస్తున్నావనే అర్థం గోచరిస్తున్నది.



**"మహాభారతకాలంలో ప్రజలు పేదరికంతో బాధపడకుండా సంతృప్తిగా జీవిస్తున్నారని తెలుస్తోంది".**

**"ప్రభుత్వ కార్యాలయాలలో, సైనిక విభాగాలలో నమ్మకం గల వారిని మాత్రమే నియమించాలని నారద మహర్షి సలహా.**

పాండవాగ్రజా! ఇష్టులైన మంత్రులు, బంధువులు, సైన్యాధిపతులు, రాకుమారులు, పండితులు అధిక సంఖ్యలో ఆసీనులై ఉండగా ప్రపంచమంతా ప్రశంసించే విధంగా ప్రతిదినం నీవు కొలువు తీరుతున్నావు గదా!

**"రాజు బ్రతికుంటేనే అనుకున్న పనులన్నీ నెరవేరేది. అందుచేత ఆత్మరక్షణ అందరికీ ముఖ్యం. అందులోనూ అధికార పీఠం అధిష్ఠించిన మహారాజుకు ఆత్మ రక్షణ అతిముఖ్యం. ఆయనకు ఇంట బయట శత్రువులుంటారు. అందువల్ల ఏ రాజైనా సమర్థులైన గూఢచారుల్ని నియమించాలి. ఎదుటి వారి ఎత్తుగడలను తెలుసుకోవాలి. ఆత్మరక్షణకు, శత్రుశిక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. గూఢచారివ్యవస్థ చాల ముఖ్యమైనది. ధర్మనందనా! రాజ్యంలోపల, బయటుండే శత్రువులనుండి నిన్ను నీవు రక్షించుకుంటూ, శత్రురాజుల ప్రవర్తనను గూఢచారుల వలె కళ్ళద్వారా కనిపెడుతున్నావు కదా!".**

ఓ ధర్మరాజా! ఇంకా నేను చెప్పబోయే రాజనీతి, పాలనా సూత్రాలను పాటిస్తున్నావు గదా! గొప్పపండితులతో కలిసి, సర్వధర్మాల్లో నేర్పరివై, రాగద్వేషాలు లేకుండా సమభావనతో శ్రద్ధగా దయతో లోకవ్యవహారాలు విచారించాలి. **ప్రపంచమంతా 'వార్త' మీదే నడుస్తున్నది. అదిలేకుంటే ప్రజలంతా చిమ్మచీకట్లో మునిగినట్లే. అందుకు ప్రభువు 'వార్త'ను బాగా నడపాలి.**

భార్యను పొందటానికి ఫలం – సంభోగసుఖం, పుత్రులు పుట్టడం; ధర్మాలు వినటానికి ఫలం – సచ్ఛీలం, సత్ప్రవర్తన సిద్ధించటం;

సంపాదించినధనానికి ఫలం – దానం చెయ్యటం, అనుభవించటం, వేదాలకు ఫలం – అగ్నిహోత్రాలు. ఈ సంగతి క్రమంగా తెలుసుకో. నీ రక్షణలో ఉన్న కోటలన్నీ ఎక్కువగా ధనాన్ని, ధాన్యాన్ని, ధనుర్బాణాలను, యుద్ధవీరుల్ని; ఎప్పుడూ తరగని నీళ్ళను, పశువుల గడ్డిని, ఉప్పు, పులుపు, కారం వంటి ఆహార పదార్థాల్ని వివిధపానీయాల్ని, వంటచెఱకును, సమృద్ధిగా నిల్వ ఉంచుకోవాలి. అనేక యంత్ర సాధనాలతో శత్రువులు ఛేదించటానికి వీలు కలిగించకుండా ఉండాలి. అత్యవసర పరిస్థితిలో వీటి ఉపయోగం ఉంటుంది.

దైవబలాన్ని ముందుగా పొంది, బుద్ధిబలంతో అంతశ్శత్రువులైన కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యాలు; ఇంద్రియాల్ని – వాక్, పాణి, పాద, పాయు, గుహ్యాలు; జ్ఞానేంద్రియాలు – స్పర్శ, చక్షువు, శ్రోత్రం; జిహ్వ, ఘ్రాణం; మనస్సును కూడ చేర్చితే మొత్తం ఇంద్రియాలు పదకొండు; ప్రపంచ ప్రసిద్ధి గల బలవంతుడవై, మితిమీరిన మదం అనే 'మాలిన్యంతో గ్రుడ్డిదైన మనస్సు కలవాళ్ళు; మిక్కిలి మత్తెక్కిన వాళ్ళు, ఇంద్రియాల వశమైన వాళ్ళు శత్రువుల్ని జయించాలన్న ఉత్సాహంతో ఉండాలి.

నీవు దండెత్తటానికి ముందే, బలవంతులైన శత్రురాజుల మీద సామ, దాన, భేద, దండోపాయాల్ని చక్కగా ప్రయోగించాలి.

నాస్తికత; అసత్య మాడటం; ఏమరుపాటు, సోమరితనం, తెలివితక్కువవారితో కార్యాలోచన చేయటం, అతికోపం; అధిక కాలం దుఃఖించటం పనికిరాదు. చేయవలసిన పనిని గురించి అతి దీర్ఘంగా ఆలోచించటం, ఆలస్యంగా చేయటం, జ్ఞానుల్ని గుర్తించకపోవటం, ప్రయోజనకరమైన విషయాల్లో వ్యతిరేకంగా ఉండటం త్యజించాలి. భంగకరమైన, ఆలోచనలు చెయ్యకుండటం, రహస్యాలోచనలు బయటపడకుండ కాపాడుకోవటం, ఇంద్రియసుఖాలకు అలవాటు పడటం, అనే పద్నాలుగు రాజదోషాలను విడనాడాలి.



**ఇంద్రప్రస్థం రాజధానిగా రాజ్యపాలన సాగించే తరుణంలో ధర్మరాజుకు నారద మహర్షి ధర్మాలు, రాజనీతి, పరిపాలనలో మెళకువలు, నైపుణ్యాలు మొదలైన విశేషాలు బోధించటం ఎంతో ఉచితంగా ఉంది. ఆది సభాపర్వాల రచయిత, ఆదికవి నన్నయ తెలుగువారికి ధర్మసూత్రాలను అందించటం మనందరి అదృష్టం. ధర్మబోధలు మహాభారత కాలానికే కాదు, నేటి భారతకాలానికి, రాబోవు భవిష్య భారతకాలానికి ఎంతో అవసరం.**

## ధర్మజుని సమాధానం

నారద మునీంద్రా! చేతనైనంతవరకు అన్యాయమార్గాన్ని వదలి, మహాత్ముల చరితల్ని ఆదర్శంగా ఉంచుకొని, మీ ధర్మ బోధవల్ల శుభాలైన వాటిని మనః పూర్వకంగా ఆచరిస్తాను" అని ధర్మజుడు సమాధానమిచ్చాడు.

## ధర్మరాజు రాజసూయయాగం

నారదమునీంద్రులు యమసభలో ఉన్న సమయంలో పాండురాజు ఆ సభకు వచ్చాడు. వారిద్దరి మధ్య జరిగిన సంభాషణలలో పాండురాజు నారదునితో "ఓ నారదమునీంద్రా! మీరు మానవలోకానికి వెళ్ళి నేను యమసభలో ఉన్న విషయాన్ని, రాజసూయ యాగం చేసిన పుణ్యాత్ములంతా ఇంద్రసభలో ఉన్న విషయాన్ని, కీర్తి సంపన్నుడైన నా కుమారుడు ధర్మరాజుకు చెప్పండి. ఆ యాగం చెయ్యటానికి అతణ్ణి ఆజ్ఞాపించండి" అన్నాడు. ఇంతేగాక నాకుమారులు అయిదుగురు సాటిలేని శక్తి సంపన్నులు, దేవతల వరాలవల్ల జన్మించిన పుణ్యాత్ములు. పెద్దవాడు ధర్మజుడు తమ్ముల భుజబలంతో శత్రువుల్ని జయించి, చక్రవర్తిగా రాజసూయ మహాయాగం చెయ్యగలడు.

"ధర్మరాజు రాజసూయ యాగం చేస్తే నాకు పితృ, పితామహ సమూహంతో ఇంద్రలోక సుఖప్రాప్తి కలుగుతుంది", అని పాండురాజు చెప్పిన సందేశాన్ని నారదుడు ధర్మరాజుకు చెప్పాడు.

తండ్రికోర్కెను తీర్చటం కుమారుల విధి పుత్రుడుగా పుట్టినందుకు ఫలం పితృదేవతలకు ఎంతోభక్తితో, సంతోషంతో మేలు చెయ్యటమే కదా! జీవించినవారు గతించిన వారితో ఈ విధమైన సంబంధాలు పెంచుకోవటమే దీని ఉద్దేశ్యం.

రాజసూయ యాగంవల్ల ప్రజల పాపాలు తొలగి పోతాయి. రాజులంతా ధర్మరాజు ప్రతాపానికి లొంగిపోయే వాళ్ళే. సర్వసంపదలు సేకరించటానికి ఇది తగిన సమయం. ఓ ధర్మశ్రేష్ఠా! మానవయత్నంలో రాజులెవ్వరు నీకు సమానంగా ఉండరు.

**రాజసూయయాగం**

వంశపురోహితుడు ధౌమ్యుడు మొదలైన వాళ్ళు చెప్పిన దానికి తగినట్లే రాజసూయ యాగం చేయటానికి తమ్ముల అంగీకారం పొందాడు. ఈ యాగ నిర్వహణకు శ్రీకృష్ణుడే సమర్థుడని అనుకున్నాడు. కారణం :- "శ్రీమహావిష్ణువే శ్రీకృష్ణుడు. ఆద్యంతరహితుడు. ఆదిపురుషుడు, పురుషోత్తముడు అయిన శ్రీ మహావిష్ణువు పుట్టుక లేనివాడే అయినా, లోకానికి మేలు చెయ్యాలని వసుదేవ సుతుడుగా మానవలోకంలో అవతరించాడు. అందుకే ఆ మహాత్ముడే ఈయాగాన్ని నిర్విఘ్నంగా జరిపించగలడు" అని నిశ్చయించాడు ధర్మరాజు.

ద్వారకానగరానికి సేవకుల్ని పంపి శ్రీకృష్ణుణ్ణి తీసుకొని రమ్మని పంపాడు ధర్మరాజు. ధర్మరాజు పంపిన సందేశాన్ని అందుకొని శ్రీకృష్ణుడు చాల శీఘ్రంగా ఇంద్రప్రస్థానికి వచ్చాడు. శ్రీకృష్ణుడు పెద్దలకు నమస్కరించి భక్తిని, పిన్నలను కౌగిలించుకొని ప్రేమను ప్రదర్శించాడు. రాజసూయయాగం నిర్వహించటానికి గల కారణాలను ధర్మరాజు శ్రీకృష్ణునికి వివరించాడు. శ్రీకృష్ణుడు సంతసించి అంగీకరించాడు.

శ్రీకృష్ణుని సహాయంతో ధర్మజుని సోదరులైన భీమార్జునులు, నకుల సహదేవులు దుర్మార్గంగా రాజ్యమేలుతున్నవారు, అధర్మంగా పరిపాలిస్తున్న



రాజులతో యుద్ధంచేసి వారిని సంహరించారు. జరాసంధుణ్ణి, శిశుపాలుణ్ణి, రోచమానుణ్ణి, దశార్ణపతి మొదలైనరాజులను ఓడించారు.

భీమార్జున నకుల సహదేవులు నాలుగుదిక్కులకు వెళ్ళి రాజుల చేత కప్పాలు తీసుకొని అపారధనాన్ని తెచ్చి ధర్మజునికందించారు. అర్జునుడు ఉత్తర దిక్కునకు వెళ్ళి కురుభూములను పాలించే రాజుల వద్దకు వెళ్ళి చెప్పగా వారు సంతోషించారు. వెంటనే అమూల్యాలు, అసంఖ్యాకములైన రత్నాభరణాలను, కప్పాలను, కానుకలుగా సమర్పించారు.

**ఆప్తమిత్రులసలహా**

ధర్మరాజు అభిప్రాయానికి తగినట్లు అతని ఆప్తమిత్రులు ఈ విధంగా సలహా ఇచ్చారు. "కురువంశోద్ధారక ఓ ధర్మరాజా! నీ ధర్మపరిపాలన చేత, నీ సుగుణ సంపద చేత, నీ నిష్కళంక ప్రవర్తన చేత ఈ భూమి మీద ప్రజలందరికీ అభివృద్ధి కలిగించావు. రాజును మోసం చేసే వారి వల్ల, రాజుకు ఇష్టులైన వాళ్ళవల్ల, దొంగలవల్ల బాధతగ్గిపోయింది. రోగం, భయం, దుఃఖం మొదలైన కష్టాలు తొలగిపోయాయి. పరాక్రమంలో నీ తమ్ములు రాజులనందరినీ జయించారు. అందరు రాజులు నీ ఆజ్ఞకు లోబడి ఉన్నారు. నీవు రాజసూయ యాగం చేయటానికి ఇది ఉత్తమ సమయం".

**ఇంద్రప్రస్థం - అపరభూమండలం**

యాగానికి అవసరమైన సాధన సామగ్రిని సహదేవుడు ఏర్పాటు చేస్తున్నాడు. యాగశాలలో వివిధ దేశాలనుండి వచ్చిన రాజులకు మంచి విడుదులు ఏర్పాటు చేశారు. భూ మండలంలో ఉండే బ్రాహ్మణ, క్షత్రియ, శూద్రులనందరినీ ఆహ్వానించారు. ఇంద్రసేనాదులవంటి శిల్పాచార్యులను నియమించారు. ఇంద్రప్రస్థానికి నలువైపులా ఉద్యానవనాలతో, కోనేరులతో, దిగుడు బావులతో సుందరంగా నిర్మించారు. అవసరమైన నెయ్యి, నూనె, బియ్యంవంటి, ఆహార పదార్థాలు సమృద్ధిగా నిల్వచేశారు. అతిథి

గృహసముదాయం కోట్ల ఐశ్వర్యం శోభిల్లునట్లు ఏర్పరిచారు. ఇంద్రప్రస్థపురం అంతా అపరభూమండలంలా (Mini World) ప్రకాశించింది.

రాజసూయానికి భీష్ముడు మొదలైన ఆప్తులు సాటిలేని ధనరాసులు వెంట తీసుకొని ప్రేమతో రాజసూయయాగం చూడాలన్న ఉత్సాహంతో వచ్చారు. భీష్మునితో ధృతరాష్ట్రుడు, విదురుడు, ద్రోణుడు మొదలైన వారు వచ్చారు.

**యజ్ఞశాల ప్రవేశం**

వివేకవంతుడు, విశేష ధర్మజ్ఞుడు అయిన ధర్మరాజు, యజ్ఞదీక్ష వహించి బ్రాహ్మణులు, దాయాదులు తనచుట్టూ ఉండగా మహావైభవంగా యజ్ఞశాలలో ప్రవేశించింది. బ్రహ్మతేజస్సు, క్షత్రతేజస్సు, ఉత్తమ ఆభరణాలతో రత్నతేజస్సులతో తన తేజస్సు ప్రకాశించగా గుణశోభితుడు, యజ్ఞదీక్షితుడు అయి, రూపుదాల్చిన ధర్మంలా ఉన్న ధర్మరాజును రాజ్యంలోని ప్రజలంతా చూచి మహానందభరితులైనారు.

వేదమంత్రాలధ్వని, ఆశీర్వచనాల ధ్వని అనేక వాద్యాలమహాధ్వని, బ్రహ్మజ్ఞాన సమానులైన బ్రాహ్మణోత్తములంతా తనచుట్టూ ఉండగా, ధర్మరాజు బ్రహ్మదేవునిలా ప్రకాశించాడు.

**వేదసభను మించిన వేదిక**

రాజసూయయాగం వేదం మూర్తీభవించిన వేదపండితుల నినాదంతో వేదిక సభను మించిన కేంద్రంగా ఆనందపరచింది. అనంత పారగులైన వారైన ధౌమ్యులు ఋగ్వేద తంత్రాన్ని నిర్వహించే ఋత్విక్కులుగా నియమించారు. యాజ్ఞవల్క్యుడు యజుర్వేద తంత్రాన్ని నడిపే ఆచార్యుడుగా ఉన్నాడు. వేదవ్యాసుడు ప్రధాన ఋత్విక్కైన బ్రహ్మగా నియమించబడ్డాడు. సుసాముడు సామవేద తంత్రాన్ని నడిపే ఋత్విక్కుగా, వీరిపుత్రులు, శిష్యులు మైత్రావరుణుడు, అచ్ఛావాకుడు మొదలైనవారు సహాయ ఋత్విక్కులుగా,



నారదాది బ్రహ్మలు సదస్యులుగా, భీష్మాదిరాజర్షులు సహాయులుగా రాజసూయయాగం మహామనోహరంగా పరిసమాప్తమైంది.

**సర్వజనులు తృప్తిపొందారు**

అనేకసుగుణాలతో విరాజిల్లుతున్న ధర్మరాజు రాజసూయయాగానికి విచ్చేసిన దేవతలతో సహా ప్రజలందరిని సంతృప్తి పరిచాడు. అగ్నిహోత్రుని ముఖంలో మంత్రాలతో ఆహుతుల్ని అధికంగా వేల్చడం చేత దేవతలు తృప్తి పొందారు. నిండుగా దక్షిణలు, దానాలు ఇవ్వటం చేత బ్రాహ్మణులు సంతసించారు. సముచిత సన్మానాలు, సత్కారాలు చేయటం వలన వివిధ దేశాలరాజులు ఆనందించారు. తనకు ఇష్టమైన అన్నదానం అధికంగా చేయటం చేత సామాన్య ప్రజలు పూర్తిగా తృప్తి పొందారు.

ధర్మబద్ధమైన నడవడి కలిగి, పుణ్యాత్ముడై, తమ్ముళ్ళతో కూడి ఉన్న ధర్మరాజును అందరూ అమితంగా ప్రశంసించారు.

**పెంపొందిన మానవసంబంధాలు**

రాజసూయయాగం నిర్విఘ్నంగా పూర్తిచేసి విజయం వరించి పేరు ప్రఖ్యాతులు విస్తరించాయి. ఈ యాగఫలితంగా ధర్మరాజుకు మానవసంబంధాలు మరింత పెంపొందాయని చెప్పవచ్చు. ఎంతమందో, కొన్ని వేలమంది కాదు, లక్షలమంది యాగాన్ని చూడటానికి వచ్చారు. వారందరికీ అతిథి మర్యాదలు, సత్కారాలు, సన్మానాలు, దక్షిణలు, దానాలు, కానుకలు, కట్నాలు ఇచ్చి గౌరవించటంతో మానవసంబంధాల నిపుణుడుగా ధర్మరాజుకు వివిధ రాజ్యాలతో క్రొత్త సంబంధాలు ఏర్పడ్డాయి, ఇదివరకున్న సంబంధాలు పటిష్ఠపడ్డాయి.

**మర్యాదలు-కానుకలు**

**రాజసూయయాగానికి వచ్చిన బంధుజనులందరి అనుగ్రహం పొంది, బంగారు, వెండి, రత్నాలను దక్షిణలుగా, దానాలుగా ఇచ్చే విషయంలో**

**కృపాచార్యుణ్ణి, కార్యాకార్యాల గురించి ఆలోచించటంలో భీష్మద్రోణుల్ని, సకల పదార్థాలను వినియోగ పరచటంలో విదురుణ్ణి, వివిధ దేశాల రాజులు తెచ్చే కానుకలను గ్రహించటంలో దుర్యోధనుణ్ణి, భక్ష్యభోజ్యాది ఆహార పదార్థాలను అందరికి అందజేయటంలో దుశ్శాసనుణ్ణి నియమించాడు ధర్మరాజు. ఇవన్నీ ఆ కాలంలో మర్యాదలు, గౌరవాలు పాటించే సంఘాలు.**

### శ్రీకృష్ణుడికి అర్ఘ్యమిచ్చుట

శాంతస్వభావం కలవాడు, శంతనుని కుమారుడు అయిన భీష్ముడు రాజసూయయాగాన్ని చూచి సంతోషించి, తృప్తిపొంది ధర్మరాజుతో ఈ విధంగా అన్నాడు. "కురువంశ వర్ధనా! ధర్మరాజా! స్నాతకుడు, ఋత్విజుడు, సద్గురుడు, ఇష్టుడు, భూపాలుడు, జ్ఞాన సంపన్నుడు – ఈ ఆరుగురు పూజింపదగినవాళ్ళు. ఈ ఆరుగురిలో సద్గుణాలచేత ఎవరు అధికుడో అటువంటి వాణ్ణి ఒకణ్ణి ప్రేమతో పూజించు" అని సలహా ఇచ్చాడు భీష్ముడు. అటువంటి వారు ఎవరు ఉన్నారని ధర్మరాజు ప్రశ్నించాడు. వెంటనే భీష్ముడు "విష్ణుస్వరూపుడైన శ్రీకృష్ణుడు ఉండగా అర్ఘ్యప్రదానానికి అర్హులైనవాళ్ళు ఇక్కడ ఇంకెవరున్నారు? ధర్మరాజా! యజ్ఞపురుషుడు, సర్వలోకపూజ్యుడు, అచ్యుతుడు అయిన శ్రీకృష్ణుణ్ణి పూజించు. అదే సుమా! యజ్ఞ ఫలం" అని భీష్ముడు ధర్మజునికి సెలవిచ్చాడు. భీష్ముని మాటను అంగీకరించి ధర్మరాజు, సహదేవుడు తెచ్చిన అర్ఘ్యాన్ని పూజించటానికి అన్ని అర్హతలు గల శ్రీకృష్ణునికి శాస్త్రోక్తంగా సమర్పించాడు. **"పెద్దలమాటను వినటం, అర్హతగల వారిని గుర్తించి, గౌరవించటం వలన వ్యక్తిత్వం పెరుగుతుంది.** శ్రీకృష్ణుణ్ణి గుర్తించి అర్ఘ్యం ఇవ్వటం వలన ధర్మరాజు కుటుంబానికి, శ్రీకృష్ణుని కుటుంబానికి మధ్యప్రేమ పూర్వకమైన సంబంధాలు దినదినాభివృద్ధి పొందాయి.

### కౌరవుల ఈర్ష్యా సూయలు

రాజసూయయాగం పూర్తయిన తరువాత దుర్యోధనుడు, శకుని **మయసభ** విశేషాలు చూడాలన్న ఆసక్తితో ఇంద్రప్రస్థంలో కొన్ని రోజులున్నారు.



ఆ సభామందిర నిర్మాణ చాకచక్యం, అపూర్వ సౌందర్యం, నీలపు రాళ్ళ కాంతులు, స్ఫటిక రాళ్ళ కాంతులు, శిల్పచాతుర్యం, కనులకు విందుచేసి హృదయాలను ఆకట్టుకున్నాయి. నీటిమడుగని తెలియక దుర్యోధనుడు ఆ మడుగులో దిగి కట్టిన వస్త్రములు తడిసిపోగా వెనుదిరిగాడు. అతణ్ణి చూచి ద్రౌపది నవ్వింది. ఆమెతో బాటు ఆమె చెలికత్తెలు గూడ నవ్వారు. అది అవమానంగా భావించాడు దుర్యోధనుడు.

### దుర్యోధనుని మనోవేదన

మయసభను చూచి దుర్యోధనుడు, శకుని ఈర్ష్యాసూయలు పెరిగాయి. అవమానం జరిగింది. రాజసూయయాగంలో ధర్మరాజుకు వచ్చిన కానుకలు, వెండి, బంగారు హారాలు, రత్నాలు, మణులు, ధనం చూచి వారిద్దరి కళ్ళు చెదిరాయి. పాండవుల ధన సంపత్తి పెరిగింది. అతడి మనస్సుకు, కళ్ళకు మంట అయింది. వారిద్దరి రక్తం ఉడికిపోతున్నది. దుర్యోధనుని శరీరం వేడిచేత కళావిహీనమయింది. కృశించింది.

దుర్యోధనుడు రాజ్యవ్యవహారాలు మాని, స్నేహితులను కలవటానికి ఇష్టపడక పాపపు పని చెయ్యటంలో మనస్సును లగ్నం చేశాడు. కౌరవకులానికి అపకీర్తి కలిగించే పనిలో ఉన్నాడు.

అర్జునుడు దేవసంబంధమైన రథాన్ని, దివ్యమైన గుఱ్ఱాలను, గాండీవమనే ధనుస్సును, దేవదత్తమనే శంఖాన్ని సంపాదించాడు. మయుడనే రాక్షస శిల్పి వలన సభాభవనాన్ని నిర్మించారు. దానినే **'మయసభ'** అని పిలవటం అలవాటు. భీముడు మగధరాజైన జరాసంధుణ్ణి చంపాడు. అన్ని దిక్కులను జయించి చక్రవర్తియై ధర్మరాజు రాజసూయయాగం చేశాడు. పాండవుల ఘనకార్యాలను, సుగుణాలను విని దుర్యోధనుడు ఓర్వలేక, అసూయతో, పగ పెంచుకొని తన మేనమామ శకుని సహకారంతో అధర్మ జూదం ఆడాడు. ధర్మరాజును ఓడించి, పన్నెండు సంవత్సరాలు అరణ్యవాసం ఒకసంవత్సరం అజ్ఞాతవాసంలో నివసించేట్లుగా నియమం చేశాడు. వారిని

దేశంనుండి వెళ్ళగొట్టాడు దుర్యోధనుడు. కురుక్షేత్రయుద్ధంలో దుర్యోధనాదులు సర్వనాశనం అయినారు.

**ఎవరైనా బాగుపడి, సకల భోగాలతో, సత్ప్రవర్తనతో మంచిపేరు సంపాదిస్తే వారిని చూచి సంతోషించాలి. ఇతరులూ వారిని ఆదర్శంగా తీసికొని ప్రవర్తించాలి. అలా కాకుండా మంచి వారిని చూచి ఓర్వలేక, అసూయ పెంచుకోవటం, పగ పెంచుకోవటం వారిని ఏ విధంగా నాశనం చేయాలని దురాలోచనకు పూనుకునే వారే చివరకు సర్వనాశనం అవుతారని దుర్యోధనాదుల దుష్ప్రవర్తన తెలుపుతోంది.**

## దుర్యోధనుని దురాలోచన

పాండవుల సంపదకు కన్ను కుట్టి దుర్యోధనుడు శకునితో "పాండవుల సంపదను ఏ విధంగా దోచుకోటానికి సాధ్యమౌతుందో చెప్పమని" అన్నాడు. వెంటనే శకుని "దుర్యోధనా! పాండవుల సంపదను అపహరించే పనికి ధృతరాష్ట్రుని అనుమతి పొందాలి. నీ ఉద్దేశ్యం నెరవేర్చే పని నాది. వారి ఐశ్వర్యం నీకు చెందటం నా పని" అని అన్నాడు శకుని.

దుర్యోధనుడు కోరికను తెలియజేశాడు. వెంటనే ధృతరాష్ట్రుడు "దుర్యోధనా! కౌరవసంపద నీకే ఎక్కువగా ఇవ్వబడింది. తమ్ములు, స్నేహితులు, సేవకులు నీకు ఇష్టమైన వాళ్ళే కాని ఇష్టంలేనివారు లేరు. దేవేంద్రుడికి సంపద ఉన్నట్లు నీకూ సమానంగా వుంది. రాజులందరూ నీచుట్టూ చేరి గౌరవంతో నీ ఆజ్ఞ పాలిస్తారు. కాబట్టి, నీకేమి కొరత. నీవు కృశించటం, వెలవెల బోవటం, రాజ్యభోగాల్లో, సుఖాల్లో విరక్తి చెందటం ఎందుకు?

"ధర్మరాజు ఐశ్వర్యం దేనికీ అంతులేదు. అన్ని సముద్రాల్లోని శ్రేష్ఠ రత్నాలకు నిలయం. ధర్మజునికి కప్పంకట్టని రాజులే లేరు. కొండలతో, ద్వీపాలతో, అరువులతో విశాలమైన భూమండలమంతా పాండవుల అధీనమైవున్నది. కేరళ, చోళ, పాండ్యరాజులు ధర్మరాజుకు మంచిముత్యాలను, పగడపు చెట్లను,



ఏలకులను, అగరు చెక్కలను, గంధపు చెక్కలను ప్రీతితో తెచ్చి ఇచ్చారు. అతని ఆస్తికి అంతులేదు. వేల గుఱ్ఱాలు కానుకగా ఇచ్చారు." ఇటువంటి విస్తారమైన సంపదను చూచి దుర్యోధనునికి అసూయ పెరిగి పాండవుల పై కక్ష్య సాధించాలనీ, ఆ సంపదను తను పొందాలని కుట్ర పన్నుతున్నాడు. దుర్యోధనుడు దురాశ పెంచుకొని చివరకు దుఃఖానికి చేటు తెచ్చుకున్నాడు. ఈ కుట్రకు తన మేనమామ శకుని సహాయం ఎలాగూవుంది.

## మాయాద్యూతం

దుర్యోధనా! సూర్యునితో తేజస్సుగల ధర్మరాజు ఐశ్వర్యాన్నంతా మాయాద్యూతం నెపంతో నీకు అపహరించి ఇస్తాను." అని శకుని చెప్పాడు. ధర్మరాజుకు జూదం అంటే ఇష్టం. కాని, అందులో ఎంత మోసం ఉంటుందో అతనికి తెలియదు. నేను ద్యూతవిద్యలో చాల నేర్పరిని అని శకుని చెప్పగానే సుయోధనుడు సంతోషించాడు. తండ్రి పాదాలమీద పడ్డాడు. 'ఈ శకుని అభిప్రాయాన్ని అంగీకరించు' అన్నాడు. అందుకు ధృతరాష్ట్రుడు ఇలా అన్నాడు, "నేను విదురునితో చర్చించి ఆలోచిస్తా. అతడు నీతి కోవిదుడు. దూరదృష్టి కలవాడు. కురుపాండవపక్షాలకు రెండింటికీ క్షేమం కోరేవాడు.

విదురునితో సంప్రదించటానికి దుర్యోధనుడు అంగీకరించలేదు. విదురుడు ఎప్పుడూ పాండవపక్షమే. వారి వైపే మాట్లాడుతాడు. ఈ విషయం విని ధృతరాష్ట్రుడు తీవ్రంగా దుఃఖించాడు. అయినా జూదం తగదని మనస్సులో అనుకొన్నాడు. కొడుకుకు సంతోషం కలిగేవిధంగా "శిల్పులను పిలిపించాడు. రత్నాలు పొదిగిన వెయ్యి స్తంభాలతో, వందలకొలది ద్వారాలతో, రకరకాలైన రత్నకాంతులతో ప్రకాశించే అందమైన సభను నిర్మించాడు.

ఈ విషయం తెలుసుకున్న విదురుడు ఆశ్చర్యపడి "కలియుగం ప్రవేశించటం, జూదం సర్వజననాశకరం'' కావటం తెలుసుకొని ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు.

**విదురుని సలహా**

"జూదమాడటానికి నేను ఏమాత్రం అంగీకరించను. కపటంతో నీకొడుకుల్లో పాండవులకు, కౌరవులకు విరోధం కల్పించటానికి ఎందుకు సిద్ధమైనావు. నీ పుత్రులంతా ఒకరితో ఒకరు కలిసి మెలిసి అన్యోన్యంగా నివసించేలా చెయ్యి." (నీ పుత్రులంతా అంటే పాండవులు, కౌరవులు అని అర్థం.)

ఎంత శాంత స్వభావులైనా, గుణవంతులైనా, జూదం వాళ్ళలో వాళ్ళకు మనస్పర్థలు ఏర్పడటానికి, శత్రుత్వం కలగటానికి కారణం అవుతుంది. నీకు చేతనైనంత వరకు శకుని, దుర్యోధనుల చెడ్డపనిని మాన్పించి, కురుకులాన్ని రక్షించు" అని విదురుడు నీతి బోధ చేశాడు.

**ధృతరాష్ట్రుని అనునయవాక్యాలు**

ఓ విదురా! నేను, నీవు, భీష్ముడు ఉండగా కొడుకులకెందుకు శత్రుత్వం ఏర్పడుతుంది? దేవతలు దయచూపేబుద్ధి కలవాళ్ళు కావటంచేత నాకు, నా పుత్రులకు కీడు, భయం కలుగుతాయా! విదురా! నీవు ఈ జూదానికి అంగీకరించు. అనవసరంగా అనుమానం పెంచుకోవటం ఎందుకు? ఇంద్రప్రస్థపురానికి వెళ్ళి ధర్మరాజును పిలుచుకొనిరా! అని విదురుణ్ణి పంపాడు. ఇతడు భీష్మునికి జరిగినదంతా చెప్పి 'ఈ జూదం కూడని పని' అన్నాడు.

ధృతరాష్ట్రుడు తరువాత దుర్యోధనునితో రహస్యంగా ఇలా చెప్పాడు. "ఈ జూదం ఎందుకు? దీనివల్ల మీలో మీకు తీవ్రవైరం పుడుతుంది. మీ వైరం వల్ల భూమి మీద ప్రజలందరికి భయంకరమైన కీడు కలుగుతుంది. మీరు, పాండవులు ప్రస్తుతం ఉన్నట్లుగా పరస్పరం ప్రేమతో పాలిస్తుండటం మంచిది. మోసంతో ఇతరుల సంపదను పొందాలనుకోవటంవల్ల పాపం కలుగుతుంది. పాపాత్ములకు సంపద, ధర్మం తప్పక నశిస్తాయి.



"ధర్మాధర్మాలు బాగా తెలిసిన విదురుడికి ఈ మాయాజూదం సమ్మతంకాదు. నీకు పాండవులకంటే అయిదురెట్లు సంపద ఎక్కువ ఉన్నది. నీవు కూడ యజ్ఞం చేయి. లోకంలోని రాజులంతా నీకు కూడ తమ సంపదలన్నింటినీ తెచ్చిఇస్తారు." అని అనగా విని దుర్యోధనుడు తండ్రితో ఇలా అన్నాడు.

ఓ ధృతరాష్ట్ర మహారాజా! ధర్మరాజుతో జూదమాడటమే నాకు యజ్ఞం. ఈ యజ్ఞం వల్ల కోరుకున్న సంపదలు పొందటానికే అదే తగిన ఉపాయం. పాండవుల ఐశ్వర్యాన్ని ఏదో విధంగా అపహరించాలి. ఆవిధంగా చేస్తేనే నాహృదయంలో బాధ తీరుతుంది అన్నాడు దుర్యోధనుడు.

విదురుడు ఎంత నచ్చచెప్పినా తండ్రి ధృతరాష్ట్రుడు వంశగౌరవానికి, నాశనానికి దారి తీస్తుందని బోధచేసినా కొడుకు దుర్యోధనుడు అంగీకరించలేదు. జూదం ఆడటానికి సంసిద్ధులైనారు. పాండవులను తీసుకురావటానికి విదురుడు ఇంద్రప్రస్థానికి వెళ్ళాడు. ధర్మరాజాదులు జూదం ఆడటానికి హస్తినకు వచ్చారు.

**ధర్మరాజు, దుర్యోధనుల సంభాషణ**

ధర్మరాజా! ఇక్కడ స్నేహంగా జూదం ఆడుకుందాం. కాలక్షేపం అవుతుంది. పాచికలాడటం బాగా తెలిసినవాళ్ళు. నీవు జూదంలో ఆసక్తి గలవాడవని, సమర్థుడవని చెబితే విన్నాం" అని దుర్యోధనుడు అన్నాడు.

వెంటనే ధర్మరాజు "దుర్యోధనా! మోసం, జూదం క్షత్రియధర్మానికి తగినవికాదు సుమా! ఎప్పుడూ ధర్మాన్ని ఆచరించేవాళ్ళు ఈ రెంటినీ వదలివెయ్యాలి. రాజులు జూదమాడటం పాపపుపని. మోసపు మార్గాలు అనుసరించే నీచపు జూదగాళ్ళతో జూదమాడకూడదు. దానివల్ల లోకంలో ఎటువంటి వాళ్ళయినా ధనాన్ని, ధర్మాన్ని కోల్పోతారు. మధ్యలో శకుని కల్పించుకుని "జూదమాడే కళలో నేర్పరివి. లోకజ్ఞానం కలవాడివి.

గొప్పమేధావివి, కీర్తిమంతుడివి, ఉత్తమరాజనీతి చక్కగా తెలిసినవాడివి నీవు ఆ జూదాన్ని నిందించటం తగునా! ధర్మరాజుని శకుని పొగడ్తలతో ముంచెత్తటం జూదం ఊబిలోకి దించటానికే. మనస్పర్థలకు, దుష్టసంబంధాలకు శకుని పునాది వేశాడు.

**జూదానికి సంసిద్ధత**

జూదమాడటం తప్పని తెలిసి కూడా, దైవనిర్ణయానుసారం ధర్మరాజు అందుకు అంగీకరించాడు. చుట్టూ మంచిగంధం, కర్పూరం, కస్తూరి, కలిపిన నీళ్ళు చల్లి జూదమాడే స్థలం అలంకరించారు. గంధంచేత, పూల చేత పూజింపబడిన పాచికలు అమర్చుకొని కూర్చున్న శకునిని, వివింశతిని, చిత్రసేనుణ్ణి, వికర్ణుణ్ణి చూచి వీరిలో ఎవడు నాతో జూదమాడే వాడనగా, అతనితో దుర్యోధనుడు ఇలా చెప్పాడు.

పుణ్యాత్మా! ఓ ధర్మరాజా! నా పక్షాన శకుని నీతో జూదమాడతాడు. కాదని అనకుండా ఇతడు ఒడ్డిన ధనరాశులు ఏవైనా సరే, నీకిస్తా అన్నాడు.

జూదం ప్రారంభమైన కొద్ది సమయంలోనే ధర్మరాజు సమస్త సంపదలను, రత్నరాసులను, బంగారు ఆభరణాలను, రాజ్యాన్ని ఓడిపోయాడు. జూదాన్ని ఇంకా శకుని, దుర్యోధనాదులు ప్రేరేపింపగా తన నలుగురు సోదరులను ఒడ్డాడు. ఆ నలుగురిని, తనతోబాటు జూదంలో ఓడిపోయాడు.

రాజ్యం సర్వస్వాన్ని, నలుగురు తమ్ములను, నిన్ను ఒడ్డి ఓడిపోయావు. ఇంకా నీ దగ్గర ఇంకొక ధనం ఉన్నది గదా! ఎలా మరచావు. కమలాక్షి ద్రౌపది నీధనం కాదా! అన్నాడు శకుని.

ద్రౌపదిని పణంగా ఒడ్డాడు ధర్మజుడు. పాచికల మీద ప్రీతితో మళ్ళీ ఆటకు పూనుకొని, కులకాంత అయిన ద్రౌపదిని పణంగా ఒడ్డాడు. దుష్టశక్తులచేతిలో ఆమెను కూడా ఓడిపోయాడు. ఇంక ఓడటానికి ఏమీ



లేదు. అందుచేత గర్వాన్ని కోల్పోయాడు. దీనమైన ముఖంతో ఆటచాలించాడు ధర్మరాజు.

**"జూదం ఎంత బలీయమైనదో! చెడు వ్యసనం – జూదం, ఎంత దుర్మార్గమైనదో! అన్ని ధర్మాలు తెలిసిన ధర్మరాజే ఓడిపోతే సామాన్య మానవులెంత? జూదం ఎంత పనిచేస్తుందో తెలుస్తోంది. వంశాలు, కుటుంబాలు, వ్యక్తులు, రాజ్యాలు గూడ సర్వనాశనమైనాయి".**

**పాండవుల కౌరవుల మధ్య చెడుసంబంధాలు**

పాండవులు మాయాజూదంలో ఓడిన తరువాత విదురుడు ధృతరాష్ట్రునితో "దుర్మార్గుడైన దుర్యోధనుడు దోషాలతోనే జన్మించాడు. వీడు పుట్టినపుడు నక్కల అరుపులు వినబడ్డాయి. ఎన్నో చెడుశకునాలు పుట్టాయి. ఈ జూదంవల్ల అనేక అరిష్టాలు, వంశనాశనానికి పలుకష్టాలు ఏర్పడ్డాయి. మహాభారతకాలంలోని చివరి ఘట్టంలో ద్వాపరయుగం అంతిమ దశలో ఘోరవిపరీతాలు జరిగాయి. దీని కంతటికీ కారణం దుష్టచతుష్టయమైన నలుగురు – వారు దుర్యోధనుడు, శకుని, దుశ్శాసనుడు, కర్ణుడు. వీరంతా అధర్మపరులు, కుట్రలు, కుతంత్రాలు, మాయలు, మర్మాలు చేసినవారు. వీరంతా అనుసరించిన దుష్టచేష్టలకు ధర్మపరులైన భీష్మద్రోణ కృపాచార్య, అశ్వత్థామ, విదురులంతా వారిని దండించక మౌనంగా ఉన్నారు. దండించినా, వారించినా దుర్యోధనుడు వినక మూర్ఖంగా, మొండిగా వాదించేవాడు. ధృతరాష్ట్రుడు కొడుకులమీద ప్రేమతో పైకి ధర్మపన్నాలు పలికినా, హృదయంలో కొడుకులు చేసిన చెడ్డపనులను ప్రోత్సహించి, వారికే సర్వరాజ్యాధికారం కలగాలని కోరుకునేవాడు. అంతా అధర్మమే నడిచింది. ద్వాపరయుగం – రెండువంతులు అధర్మం, రెండువంతులు ధర్మంతో నడిచింది.

**విదురుని మంచిమాటలు**

ఓ ధృతరాష్ట్రమహారాజా! నీచమానవుడు, గుణహీనుడు అయిన దుర్యోధనుణ్ణి వెలివేసి ధర్మమార్గాన కౌరవవంశాన్ని కాపాడు. పాండవులు

మాత్రం పరాయివాళ్ళా? అని విదురుడు చెప్పాడు. దుర్యోధనుని చెడుపనుల వలన వంశానికి, ప్రజలకు కీడు కలుగుతుందని అతడు పుట్టినపుడే కలిగిన దుశ్శకునాలే సూచించాయి. ఒకణ్ణి వలన వంశానికి ముప్పు వచ్చేటట్లుంటే అతణ్ణి నిందించటం ధర్మమనే కర్తవ్యాన్ని ఉపదేశించాడు. పాండవులను కాపాడితే వంశాన్ని కాపాడినట్లవుతుంది. లేకపోతే ఘోరయుద్ధం జరుగుతుందని హెచ్చరించాడు విదురుడు. 'ఇంకా అశ్రద్ధ చేయక ఈ దుర్మార్గపు జూదాన్ని' ఆపు అని అనగా 'పుత్రులమీద మమతా మమకారాలతో ఏమీ చెయ్యటానికి తోచక ధృతరాష్ట్రుడు ఊరకున్నాడు.

ఇంకా విదురుడు "న్యాయంవదిలి, శకుని మాయాద్యూతంలో పాపబుద్ధి కలవాడై భరతవంశం వాళ్ళయిన పాండవుల సంపద ఈ విధంగా అపహరిస్తే ఇతరులు నిన్ను ఛీ కొట్టరా? ఇందులో ఛీకొట్టే కారణాలు ఆరు చెప్పారు ః

1. అన్యాయంగా పాపబుద్ధితో మాయతో పాండవ సంపదను హరించటం.

2. పాండవులు భరతవంశం వారు కావటం చేత ధర్మాత్ములే కాక, దాయాదులు స్వీయవంశం వారే కావటం, దానివలన తమ వారినే తాను నిలువు దోపిడి చెయ్యటం.

3. అన్నదమ్ములను శత్రువులుగా భావించటం

4. పాండవ వినాశనం స్వీయనాశనం కాదని భావించటం.

5. ఉత్తమవంశజులు ఆచరించవలసిన ఉదాత్తచర్య మాయాద్యూతం కాకపోవటం.

6. అపహరణ భావం అధర్మమూలం కావటం.

ధైర్యవంతులు, భుజపరాక్రమం చేత శత్రువులను జయించిన వాళ్ళు అయిన పాండవులను పెచ్చు పెరిగిన పొగరుతో జూదంలో పడిపోయేటట్లు చేశావు. వాళ్ళను ఇలా మోసం చెయ్యటం మంచిదా?



విదురుడు పలికిన మంచి మాటలకు ఎంతో విలువ, శాస్త్ర బద్ధం ఉన్నాయి.

దుర్యోధనుడు కోపించి విదురునితో "నీవు శత్రువులనే పొగడుతావు. పాండవ పక్షాననే మాట్లాడుతావు. ధృతరాష్ట్రుని పుత్రులను ఎప్పుడూ నిందిస్తావు. తిన్న యింటికి ఎన్నడూ అనుకూలంగా ఉండవు. మావద్ద ఉంటూనే విషసర్పంలా నటిస్తున్నావు. నీవు తప్పు ఎన్నటం ఎందుకు? నీ హద్దులో నీవు ఉండు. మాకు బుద్ధులు చెప్పవద్దు" అన్నాడు.

వెంటనే విదురుడు దుర్యోధనునితో "చెడిపోయేటట్లు చెడు బుద్ధులు చెప్పేవాళ్ళు నీకు స్నేహితులు, సన్నిహితులు. మా వంటి మంచిమాటలు చెప్పేవాళ్ళు, వారి మాటలు నీ పట్ల వ్యర్థమౌతాయి. నేను పుత్రులు గల ధృతరాష్ట్రుని మేలు కోరేవాణ్ణి. నన్ను మరొక విధంగా అర్థం చేసుకున్నావు. త్రోసిపుచ్చి మాట్లాడావు, పాండవులతో వైరం మంచిది కాదు."

"వినటానికి ఇంపుగా ఉండే మాటలను చెప్పే వాళ్ళనే ఎక్కువగా మెచ్చుకుంటారు. మేలు చేసేదైనా వినటానికి ఇంపుగా ఉండని మాటను వినటానికి ఎవరూ ఇష్టపడరు. అందుచేత గొప్ప ప్రతిభావంతులు కూడ అలాంటి కటువైన మాట చెప్పరు.

**విదురుని హిత వాక్యాలు, సలహాలు దుర్యోధనునికి ఎలా ఉన్నా లోకానికి మాత్రం శిరోధార్యాలు. మంచి మాటలు అందరికీ అవసరమే. దుర్మార్గులకు మంచి విషయాలు చెప్పటం "చెవిటి వారి చెవిలో శంఖం" ఊదినట్లే ఉంటుంది.**

**జూదంలో ఓడిన ధర్మరాజు**

ఉన్న సంపదనంతా ఓడిపోయాడు ధర్మరాజు. జూదంలో శకుని ప్రేరేపింపగా ధర్మజుడు తన తమ్ములను, తదుపరి భార్య ద్రౌపదిని ఒడ్డి ఓడిపోయాడు. వెంటనే దుర్యోధనుడు "ద్రౌపది తమకు దాసీగా ఉండాలనీ,

తన ఇల్లు వరుసగా శుభ్రపరచటానికి ద్రౌపదిని సభకు తీసుకురావలసిందిగా విదురుణ్ణి ఆజ్ఞాపించాడు."

ఆ ఆజ్ఞను సహించక విదురుడు "నీతో సమానమైన మూర్ఖులు లోకంలో మరెవ్వరూ లేరు. ఇంత క్రూరమైన పనికి నన్ను పంపదగునా! అని దుర్యోధనునితో అన్నాడు.

**దుర్యోధనా! మోసంతో జూదమాడి ధనం సంపాదిస్తే దుర్మార్గుని సంపదలు నాశనమవుటయేగాక అతనికి మొదటి నుంచి ఉన్న "సంపదలు కూడ సమూలంగా నాశనమవుతాయి" అని విదురుడు పలికాడు. విదురుని మాటలలో రాబోవు కాలంలో కౌరవులకు వినాశనం తప్పదని, ఉన్న సంపద, అక్రమార్జన మొత్తం కూడగట్టుకొని ఊడ్చుకొని పోతుందని ఊహించి చెప్పటం జరిగింది.**

## సభలో ద్రౌపది ప్రవేశం

దుశ్శాసనుడు ద్రౌపదిని సభలోకి ఈడ్చుకొనివచ్చి సభ ముందుంచాడు. ధర్మాధర్మంపై చర్చ జరుగుతున్న సమయంలో దుర్యోధనుడి తమ్ముళ్ళలో వికర్ణుడు "కురువంశ పెద్దలైన భీష్ముడు, ధృతరాష్ట్రుడు, విదురుడు, గురువైన ద్రోణుడు, కృపుడు, మొదలైన వాళ్ళు మౌనంగా ఉన్నారు. సభలో కూర్చొన్న వాళ్ళలో మిగిలిన ధర్మజ్ఞులు రాగద్వేషాలు మాని ఆలోచించి చెప్పండి" అన్నాడు. ఎవ్వరూ మాట్లాడలేదు. అపుడు వికర్ణుడు "నేనే ధర్మ నిర్ణయం చేస్తాను, అందరూ వినండి. జూదం, వేట, మద్యపానం, అతిగా తినటం అనే నాలుగూ చెడు వ్యసనాలు. వీటికి అలవాడు పడిన మానవుడు ధర్మం తప్పి ప్రవర్తిస్తాడు. అటువంటివాని పనులు లెక్కలోకి తీసుకోకూడదు. జూదగానిచేత పిలువబడి జూదవ్యసనంలో మోసంతో ఓడిపోయిన ధర్మరాజు, పాండవులందరికీ ఉమ్మడి సొమ్ము అయిన పాంచాలిని పందెంగా చేశాడు. అందుచేత ఆమె అధర్మం చేత జయించబడింది. ఆ సుకుమారిని, ఒకే వస్త్రం ధరించి ఉన్నదాన్ని, ఈ సభకు పిలవటం అన్యాయం" అని తేల్చి చెప్పాడు.



సభలోని కర్ణుడు, దుశ్శాసనుడు, శకుని, దుర్యోధనుడు (దుష్టచతుష్టయం) వికర్ణుని ధర్మపన్నాలకు అడ్డుతగిలి అతణ్ణి నిందించారు. దుర్యోధనుడు దుశ్శాసనుణ్ణి పిలిచి "ఈ పాండవుల, ద్రౌపది వస్త్రాలు లాగి తీసుకో" అని ఆజ్ఞాపించాడు. బలహీనులైన పాండవులు ముందుగా వారి బట్టలు ముందే తీసి పెట్టి సభలోనిల్చుండి పోయారు.

ధర్మాధర్మవిచక్షణ లేని దుశ్శాసనుడు ద్రౌపది కట్టుకున్న వస్త్రాన్ని ఆలోచించకుండా వివస్త్రను చేయటానికి ప్రారంభించాడు. ఆపకుండా అతని ప్రయత్నం కొనసాగిస్తున్నా తొలగించబడిన వస్త్రాన్ని పోలిన వస్త్రాలు ఆమె వంటి మీద విరామం లేకుండా వస్తూనే ఉన్నాయి. ఆ సన్నివేశాన్ని సభలోని వారంతా చూచి సంతోషించారు. దుశ్శాసనుడు మాత్రం ఆ వస్త్రాలను లాగలేక అలసిపోయి, పట్టువిడిచి, సిగ్గుచెంది విరమించాడు. ఈ సంఘటన అంతా శ్రీకృష్ణుని కరుణా కటాక్షాలతో జరిగినదని ధర్మాత్ములంతా సెలవిచ్చారు. ఆ సమయంలో ద్రౌపది శ్రీకృష్ణుణ్ణి ప్రార్థించింది. కష్టాలలో ఉన్న వారిని, ధర్మాన్ని ఆచరించేవారిని కాపాడటమే పరమాత్ముని ధర్మం గదా!

ఆ సమయంలో భీమసేనుడు కళ్ళు ఎఱ్ఱచేశాడు, పళ్ళుకొరికాడు. భయంకరమైనముఖంతో యమునిలా అందరూ వినేటట్లుగా ఇలా ప్రతిజ్ఞ చేశాడు. "దుశ్శాసనుని వక్షఃస్థలం చీల్చి సెలయేటిలా ప్రవహించే రక్తాన్ని త్రాగుతానని" భీముడు సభలో ప్రమాణం చేశాడు.

అంతేకాదు, భీముడు "ఈ విధంగా చెప్పినట్లు చెయ్యకుంటే నేను, తండ్రి, తాతల మార్గాన్ని తప్పిన వాడినవుతాను" అని గట్టి దీక్ష పూనాడు. తొడమీద కూర్చొని రమ్మని పిలిచిన దుర్యోధనుని తొడలు భయంకర యుద్ధరంగంలో ఎదుర్కొని గదాదండం దెబ్బలతో విరుగ గొడతానని మరో శపథం చేశాడు భీముడు. వికర్ణుడు చిన్నవాడైనా బృహస్పతిలా శాస్త్రప్రకారం స్పష్టంగా ధర్మాన్ని తెలియపరచాడని చెప్పాడు, అయినా ఎవ్వరూ వినలేదు.

ధృతరాష్ట్రుడు వెంటనే దుర్యోధనుణ్ణి పిలిచి పాండవుల శక్తి సామర్థ్యాలు, ధర్మాచరణ, బంధుత్వం చెప్పి వారి మీద కోపం మానమని చెప్పాడు. కొడుకును త్రోసిపుచ్చి కోడలు ద్రౌపదిని పిలిచి మెత్తని మాటలతో ఆమెను బుజ్జగించాడు.

**ద్రౌపదికి వరాలిచ్చుట**

ద్రౌపదీ! నాకోడళ్ళందరిలోకి నీవు గౌరవించదగినదానివి. నీకు ఏ వరం కావాలో కోరుకోమని అడిగాడు ధృతరాష్ట్రుడు. అప్పుడు ద్రౌపది అడిగిన రెండు వరాలు ఇచ్చాడు –

(1) ధర్మరాజును దాస్యంనుంచి విముక్తుణ్ణి చేయటం.

(2) ధర్మరాజు నలుగురు తమ్ములు, తమ ఆయుధాలతో, కవచాలతో, గృహాలతో అందరికీ మేలు కలిగేటట్లు దాస్యం నుండి విముక్తి చేయటం.

ధృతరాష్ట్రుడు పై రెండు వరాలిచ్చి మూడవ వరం కోరుకోమన్నాడు. అందుకు సమాధానంగా ద్రౌపది "వైశ్య స్త్రీ ఒక వరం, ఉత్తమ క్షత్రియ స్త్రీ రెండు వరాలు, శూద్ర స్త్రీ మూడు వరాలు, బ్రాహ్మణ స్త్రీ వందవరాలు కోరుకోవచ్చు" అందువల్ల నేను మూడవ వరం కోరుకోను" అని చెప్పింది.

**వరాలు అడిగారు గదా అని ఇష్టమొచ్చినట్లు ద్రౌపది కోరుకొనలేదు. శాస్త్రబద్ధంగా రెండు వరాలనే కోరుకున్నది. (కష్టాల్లో గూడ ద్రౌపది క్షత్రియ స్త్రీధర్మాన్ని ఆచరించింది.) ద్రౌపది ధర్మశాస్త్ర ఆచరణకు ఆ సభలోని పెద్దలంతా ఆశ్చర్యం వెలిబుచ్చారు. సంతోషించారు.**

**పాండవులు ఇంద్రప్రస్థానికి పయనం**

ద్రౌపది మాటలు విని ధృతరాష్ట్రుడు ఆమె గుణగణాలకు, ధర్మ పరిజ్ఞానానికి, నీతికి సంతోషించి ధర్మరాజును అతని తమ్ములన పిలిపించి "నీవు సర్వసంపదలు, నీరాజ్యం తీసుకొని ఎప్పటివలె ఇంద్రప్రస్థానికి వెళ్ళి సుఖంగా జీవించు, నీకు మేలు కలుగుతుంది" అని దీవించి పంపాడు. నీవు పెద్దల సేవచేసి అన్ని ధర్మాలు తెలుసుకున్నావు. నా కొడుకు జ్ఞానంలేక నీకు కీడు చేశాడు, ఈ అపకారాన్ని మరచిపో. నీకు నేను బోధించేది ఏమీ లేదు.



**"మనసులో వైరం గురించి ఆలోచించ గూడదు. ఓర్పుతో కూడిన మనసు కలిగి ఉండటం, గుణాలు గ్రహించి దోషాలు విడిచిపెట్టటం వ్యక్తిత్వ వికాసలక్షణాలు. ఈ లక్షణాలు వల్లనే మానవసంబంధాలు పెంచుకోటానికి అవకాశమేర్పడుతుంది"** మహాభారతంలోని మంచి సూక్తుల్లో ఇది ఒకటి.

**"కోపంతో ఉన్న తమ్ముడు భీమసేనుణ్ణి బుజ్జగించి శాంతింపచేసి అన్న ధర్మరాజు తన తమ్ములతో, ద్రౌపదితో ఇంద్రప్రస్థపురానికి వెళ్ళాడు. తమ్ములు కోపం, ఆవేదన, ఆవేశం, శత్రుత్వ లక్షణాలు ప్రదర్శించినా ధర్మమూర్తిగా ధర్మరాజు వారిని శాంతింపజేశాడు. శాంతమూర్తిగా పేరుపొందాడు. అన్నదమ్ముల సఖ్యత, పెద్దన్న గారిని గౌరవించటం అనే కుటుంబ సంప్రదాయాన్ని పాటించటం సంతోషించే సంఘటన. కుటుంబానికి పెద్దవాడైన అన్నగారికి ఉండాల్సిన మంచి గుణాలన్నీ ధర్మరాజులో ఉన్నాయి. కనుకనే తమ్ములు ఆయనను దైవంగా భావించారు. ఇది భారతీయ సంస్కృతి."**

**కౌరవుల కుతంత్రాలు - క్షీణించిన సంబంధాలు**

పాండవుల సంపదను, ధైర్యసాహసాలను, కురువృద్ధులంతా వారిని ప్రశంసించారు. శస్త్రాస్త్రవిద్యలలో నైపుణ్యాన్ని, గదాయుద్ధపాటవాన్ని, కత్తి, డాలు, కవచం లోని పరాక్రమాన్ని చూచి కౌరవులు ఈర్ష్యాసూయాలు పెంచుకొన్నారు. వారిని ఎలాగైనా ఓడించి దేశ బహిష్కరణచేయాలని మనసులో నిర్ణయించుకున్నారు కౌరవులు. కావున, పాండవులను మరల జూదంలో ఓడించి దేశం నుండి వెళ్ళ గొట్టటమే వారి నిర్ణయం. ఈ నిర్ణయాన్ని దుర్యోధనుడు చెప్పగా తండ్రి ధృతరాష్ట్రుడు గూడ అంగీకరించాడు. ఇది పాండవుల పట్ల కౌరవుల కుతంత్రం. ఈ విషయంలో కౌరవులు

'తండ్రి ఆజ్ఞ, దైవనిర్ణయం దాటనవునా! వెంటనే దుర్యోధనుడు దూత ప్రాతికామిని ఇంద్రప్రస్థానికి పంపి ధర్మరాజును జూదానికి ఆహ్వానించాడు.

భీష్ముడు తన అసమ్మతిని తెలియపర్చాడు. గాంధారి దుర్యోధనుణ్ణి వదిలి వేసి అయినా కౌరవకులాన్ని రక్షించమని ధృతరాష్ట్రుడికి హితబోధ చేయటం గూడ జరిగింది. వారి మాటలను పెడచెవిన పెట్టాడు దుర్యోధనుడు.

**రెండవ పర్యాయం జూదం**

రాజశ్రేష్ఠుడైన ధర్మరాజు తన పక్షంలోని జనులందరికీ బాధ కలిగేటట్లుగా తమ్ములతో, ద్రౌపదితో కలిసి ఇష్టంగా హస్తినకు వెళ్ళాడు. ద్యూతసభలో జూదగాడు, మోసగాడు, కుతంత్రాలకు ఆద్యుడు అయిన శకుని ధర్మరాజుతో "ధృతరాష్ట్రమహారాజు ధనసంపదను, రాజ్యసంపద ఇచ్చి మిమ్మల్ని సన్మానించాడు. అట్టి సంపదను తిరిగి ఒడ్డి జూదమాడటం తగదు. నేను ఒక క్రొత్తపందెం చెపుతాను. దానిని అమలుపర్చు. దీన్ని ఓడిన వాళ్ళు జింకచర్మం, నారచీరలు ధరించి, అడవుల్లో దుంపలు, ఫలాలు ఆహారంగా, బ్రహ్మచర్యం వ్రతం అవలంబించి, పండ్రెండేండ్లు అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం చేయాలి. అజ్ఞాతవాసంలో వాళ్ళు కనపడితే మళ్ళీ పండ్రెండేండ్లు అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం చేయాలి" అని నిబంధన పెట్టాడు.

"రెండవసారి జూదమాడటానికి పిలిస్తే వెనుదిరిగి వెళ్ళటమా! అందులో ఇంద్రప్రస్థానికి రాజు. వెనుదిరిగి వెళితే బలహీన పడిపోతాము గదా!" అని ఆలోచించి ధర్మరాజు రెండవసారి జూదానికి అంగీకరించాడు.

"పాండవులను ఓడించి, అరణ్యవాసానికి పంపి అజ్ఞాత వాసం చేయించాలని కౌరవుల వ్యూహం. ఆ సమయంలో వారిని ఏదో విధంగా మట్టుపెట్టాలని వారి ఆలోచన. లేనిచో మరల 12 సం॥ అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం చేస్తే, వారిని పూర్తిగా ప్రజలు విస్మరిస్తారు.



ఈ లోపల వారి రాజ్యాన్ని చేజిక్కించుకోవచ్చని దుర్యోధనుని కుట్ర. పాలనాయంత్రాంగం, గూఢచారి వ్యవస్థ వారి చేతులలో ఉంటుంది గదా!

**రెండవసారి అపజయం**

రెండవసారి ధర్మరాజు పందెం వేసి శకుని చేతిలో అధర్మంగా ఓడిపోయాడు. పన్నెండు సంవత్సరాలు అరణ్యవాసం ఒక సంవత్సరం అజ్ఞాతవాసం చేయాల్సిన పరిస్థితి వచ్చింది. వెంటనే పాండవులు తమ రాజ్యసుఖాలను వదలి బ్రాహ్మణులు, మిత్రులు, బంధువులు, ప్రజలు వెంటరాగా అరణ్యానికి వెళుతూ ధృతరాష్ట్ర, విదుర, కృప, ద్రోణాచార్యుల వద్ద శెలవు తీసుకున్నారు. ఆ సమయంలో విదురుడు పాండవుల కీర్తి, గుణ గణాలను వర్ణిస్తూ ఇలా అన్నాడు.

**పాండవుల గుణగణాలు**

'ధర్మరాజా! నీవు ధర్మమూర్తివి, భీముడు పరాక్రమవంతుడు, అర్జునుడు యుద్ధ విశారదుడు, కీర్తిమంతుడు. నకులుడు న్యాయసంపన్నుడు. సహదేవుడు మేధావి, నియమశీలి. పుణ్యాత్ముడైన ధౌమ్యుడు ఆధ్యాత్మిక విద్య చేత పూజ్యుడు. అందమైన ద్రౌపది ధర్మార్థాల్లో చక్కని వివేకం గలది. ఈ విధంగా ఎన్నో గొప్ప గుణాలు కలిగి ఒకరికొకరు హితులై, ధైర్యవంతులైన మిమ్మల్ని లోకంలో ఇతరులు ఆదరించక మీతో వైరం పెట్టుకో గలరా"! అని విదురుడు అన్నాడు.

**ఎన్నో మంచిగుణాలు, కీర్తి, బలపరాక్రమాలు ఉన్న వారితో ఎవరూ శత్రుత్వం పెట్టుకోరు. లోకంలో మంచివారిని అందరూ ఆదరిస్తారని, చెడు వారిని విస్మరిస్తారని విదురుని విశ్లేషణ.**

**అరణ్యవాస ప్రవేశం**

తల్లి కుంతీ దేవి, విదురుడు ఆశీర్వదించగా పాండవులు, ద్రౌపది వరుసగా నడుచుకుంటూ సభనుండి బయటకు వచ్చి నగరం గుండా

నడుస్తూ వెళ్ళారు. సభలోని జనులు, వింటుండగా అమిత కోపంతో కఠినాతి కఠినమైన మాటలను పాండవులు మాట్లాడారు.

♦ చేతి గదదెబ్బతో లోకద్రోహులైన దుర్యోధనాది శత్రువులను మహాభయంకరమైన యుద్ధంలో హరిహరాదులు అడ్డమైనా హతమారుస్తాను.

♦ పాపి అయిన దుర్యోధనుణ్ణి నేలగూల్చి అతని తలను తన్నుతాను. నీచుడైన దుశ్శాసనుణ్ణి చంపి వాడి నెత్తురు త్రాగుతాను.

♦ నన్నెదిరించి పోరాడే కర్ణుడు మొదలైన దుర్మార్గుల్ని, శత్రుసమూహాల్ని సంహరిస్తాను.

♦ దుష్టుడు, కుటిలుడు, అయిన శకుని యుద్ధంలో మాబాణాల చేత ఓడించి పంపుతాము.

ఆవిధంగా భీమార్జున నకుల సహదేవులు కోపావేశంతో ప్రతిజ్ఞలు చేసి, తమ ఆయుధాలు ధరించి హస్తినాపురం నుండి అరణ్యాలకు బయలుదేరారు. పాండవులు ఇంద్రప్రస్థపురంలో ఇరవైమూడేళ్ళు రాజ్యంచేసి పాపపు జూదంలో ఓడిపోయి, నీరసించారు. వీరులు, బుద్ధిమంతులు, నిత్యసత్యవ్రతులు అయిన పాండవులు వేలకొలది బ్రాహ్మణులు వెంటరాగా అరణ్యవాసానికి వెళ్ళారు.

ఎల్లవేళలా బ్రాహ్మణులు పాండవుల వెంటే ఉంటారని తెలుస్తుంది. బ్రాహ్మణులు ధర్మపరాయణులు. అన్ని సమయాలలో ధర్మమూర్తులైన పాండురాజు వంశాన్ని వీడరని విశదమవుతోంది. ధర్మవేత్తలంతా సత్సంబంధాలు, ధార్మికసంబంధాలు కలిగి ఉంటారు.

**కుటుంబకలహాలు - చెదిరిన సంబంధాలు**

దుర్యోధనుడు, శకుని మొదలైన వారు పాండవులను మాయాజూదంలో ఓడించి, అరణ్యవాసానికి పంపటం జరిగింది తరువాత రాజ్యంలో



ధృతరాష్ట్రునికి, విదురునికి మనస్పర్ధలు వచ్చి విదురుణ్ణి బహిష్కరించటం జరిగింది. విదురుడు చెప్పిన మంచిమాటలు, సత్సంబంధాలు పెంచుకోమని, పాండవుల, కౌరవుల మధ్య సయోధ్య కుదుర్చుకోమని, ధర్మమూర్తులను హింసించవద్దని విదురుడు హితవు పలుకగా ధృతరాష్ట్రుడు, దుర్యోధనుడు వాటిని తిరస్కరించారు.

**"కుటుంబ సభ్యులతో కలహం ఏమాత్రం శ్రేయస్కరం కాదు. బిడ్డలను అదుపులో ఉంచుకోమని విదురుడు చెప్పాడు. మానవ ప్రయత్నం చేయాలిగదా! ఆ పై దైవనిర్ణయం ఎలా ఉంటే అట్లా జరుగుతుంది,"** అని వ్యాసుడు గూడ సలహా ఇచ్చాడు.

**<u>మైత్రేయుని శాపం</u>**

తరువాత మైత్రేయుడు ధృతరాష్ట్రుణ్ణి కలిసి ఇట్లా చెప్పాడు. "ధృతరాష్ట్రా! నీకొడుకులు దుర్బుద్ధులై మోసపుజూదం సాగించి పాండవులను ఓడించి అడవికి పంపినట్లు విన్నాను. నీమీద నాకు స్నేహభావం, ప్రేమ ఉన్నాయి. నీవూ, భీష్ముడూ బ్రతికి ఉండగా పాండవులు, కౌరవులు కలహించటం ఉచితంగా లేదు. సర్వస్వతంత్రాలు ఉండి ఈ అన్యాయాన్ని చూస్తూ ఊరకున్నావు. నీ మహాసభలో నీచప్రవర్తన జరిగినా నివారించక పోవటం వల్ల తపస్వి మండలంలో నీపేరు ప్రఖ్యాతులు సన్నగిల్లాయి. అని చెప్పాడు మైత్రేయుడు. ఇంకా పాండవులు అరణ్యవాసం చేస్తున్న సమయంలో వారి బల పరాక్రమాలను, రాక్షససంహారాలను దుర్యోధనునికి వివరించాడు. **"పాండవులతో పోరాడి నిలువగల మానవప్రాణి ఉన్నాడా! నీవు కోపం, మూర్ఖత్వం వదిలి పాండవులతో శాంతంగా ప్రవర్తించు"** అని చెప్పాడు. ఆ సంభాషణా సమయంలో దుర్యోధనుని ప్రవర్తన, హావభావాలు మైత్రేయునికి అసహ్యం కలిగించాయి. ఆ క్షణంలో ఆయన "ఓరీ మూఢ దుర్యోధనా! నీ హితవు కోరి చెప్పినా నీకు వినపడలేదు. పైగా అనాదర భావంతో కాళ్ళు నేలరాస్తూ, తొడ చరుస్తున్నావు. దీని ఫలం అనుభవించక తప్పదు. నీ

దురాలోచన కారణంగా కురు పాండవ సంగ్రామం సంభవించి తీరుతుంది. ఆ యుద్ధంలో భీమసేనుడు నీ తొడలు విరగ గొట్టుగాక", అని శపించాడు. ధృతరాష్ట్రుడు మునిపాదాలపైబడి క్షమాభిక్ష కోరుతూ శాపవిమోచనం అర్థించాడు.

**"మహారాజా! దుర్యోధనుడు పాండవులను ప్రేమించి వారి రాజ్యం వారికిచ్చి సఖ్యతతో ఉంటే ఈశాపం తగులదు. లేదా శాపఫలం అనుభవించవలసిందే",** అన్నాడు మైత్రేయుడు.

**బంధువుల స్నేహహస్తం**

పాండవుల వనవాస వార్త తెలిసిన వెంటనే వృష్ణి, అంధక, భోజ వంశీయులు, దృష్టద్యుమ్న, దృష్టకేతు, కేకయ రాజనందనులు ధార్తరాష్ట్రులను నిందిస్తూ పాండవులను చూడటానికి వెళ్ళారు. వారందరూ ఉండగా శ్రీకృష్ణుడు అచటికి వచ్చాడు. అప్పుడు ద్రౌపది తనకు జరిగిన అన్యాయాన్ని, పరాభవాన్ని, ధార్తరాష్ట్రుల వికటపు చేష్టలను శ్రీకృష్ణునికి విన్నవించింది. **పాండవులు బలాబలాలు, అస్త్రవిద్యానైపుణ్యం వృథా అయినాయి. నిండు సభలో భార్యకు అవమానం జరిగితే భర్తలు రక్షణకు రారా? కొంచెమైనా శక్తి లేనివాడు కూడా తన సొంత భార్యకు రక్షణకు ప్రయత్నిస్తాడు గదా! భార్యకు రక్షణలేక పోతే ఆమె వల్ల కలిగే పిల్లలకు రక్షణ ఉంటుందా! సర్వజనులకు రక్షకుడవైన నిన్ను శరణు వేడాను. నీవల్ల రక్షణ పొందాను.**

శ్రీకృష్ణుడు ద్రౌపదిని, ధర్మరాజుని అతని తమ్ములను బుజ్జగించి, సముదాయించి, అనునయించి ద్వారకానగరానికి సుభద్ర, అభిమన్యునితో వెళ్ళాడు. మిగతా బంధువర్గమంతా వారి వారి ప్రదేశాలకు వెళ్ళారు.

ధర్మజుని రాజ్యంలోని బ్రాహ్మణులు, వైశ్యులు మాత్రం పాండవులను వదలి వెళ్ళడానికి అంగీకరించలేదు. బంధుమిత్రులందరూవెళ్ళిన అనంతరం బ్రాహ్మణుల అనుమతితో ప్రయాణానికి సిద్ధమైనాడు. ధర్మరాజు రథాలను సిద్ధపరచమని ఆజ్ఞాపించాడు. ఆ సందర్భంలో ధర్మరాజు బ్రాహ్మణులకు గోవు, హిరణ్య, వస్త్ర దానాలు బహుమతిగా ఇచ్చాడు.



**ధర్మమూర్తికి గల మానవసంబంధాల సంపదకు హద్దులేదు. కష్టసమయంలో బంధువులు, వివిధ వర్గాల, వర్ణాల, సన్యాసులు, మునులు, ఋషుల దర్శనం, వారి ఆశీర్వచనమే మానసిక, శారీరక బలాన్నిస్తుంది.**

**ధర్మరాజు-భీముని సంభాషణ**

అయిదు సంవత్సరాలు అరణ్యవాసం గడిచింది. ధర్మరాజు, ద్రౌపది, భీమ, నకుల, సహదేవులు, ధౌమ్యులతో కలిసి అర్జునునికోసం ఎదురుచూస్తున్నారు. ఒకనాడు భీమసేనుడు "అన్నా ధర్మనందనా! కృచ్ఛ్రవ్రతాచరణానుసారం, ఒకదినం ఒక సంవత్సరంగా లెక్కకు వస్తుందని శాస్త్రం చెబుతున్నది. మీరు పదమూడు రోజులు, ఈ వ్రతం ఆచరించి పదమూడేళ్ళు గడువు పూర్తిచేస్తే కౌరవులతో యుద్ధం చేసి వారిని సర్వనాశనం చేయగలం" అన్నాడు.

అందుకు సమాధానంగా "నాయనా! అసత్యదోషం నా నెత్తిమీద పడనిస్తావా! ఈ గడువుకాలం పూర్తికాగానే నీ అభిమతానుసారం ప్రతిజ్ఞలు నెరవేర్చుకోవచ్చు. అసమానయోధుడవైన నీవుమాత్రం అక్రమమార్గం అనుసరిస్తావా? ఆవేశంలో అంటున్నావు కానీ, అని ధర్మరాజు అనునయించాడు.

**యక్షునితో సంబంధం**

ఒకనాడు ఒక బ్రాహ్మణుడు తను కోల్పోయిన అరణిని (మథించి నిప్పు పుట్టించే కొయ్య) తనకిప్పించమని ధర్మరాజుని శరణు వేడాడు. మృగమొకటి ఆ అరణిని కొమ్ముకు తగిలించుకుని పారిపోయింది. అరణి లేకపోతే నిత్యపూజలు, అనుష్ఠానం నిలిచిపోతాయి. దానిని త్వరగా తెచ్చి ధర్మస్థితిని కాపాడమనీ ధర్మరాజుని ఆ బ్రాహ్మణుడు ప్రార్థించాడు. అరణిని

తీసుకురావటానికి ధర్మరాజు తమ్ములతో కలిసి బయలుదేరాడు. మృగం వారికి కనపడకుండా చాల దూరం వెళ్ళిపోయింది. ఇంతలో వారికి దాహం వేసింది. పాండవులు విశ్రాంతి తీసికోవటానికి ఒక మర్రిచెట్టు నీడన ఆగారు. వెంటనే నకులుణ్ణి పిలచి, దగ్గరలో ఏదైనా నీటి కొలను నీరు తెచ్చి తమకు దప్పిక తీర్చమని చెప్పాడు. నకులుడు ఆ కొలనులోకి వెళ్ళి నీరు త్రాగబోగా అశరీరభూతం అతడిని అడ్డుకుంది. ఆ కొలను తనదనీ, తను అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పి, నీరు త్రాగాలని నియమం విధించింది. ఆ మాటలు లెక్కచేయక నీరు త్రాగి నకులుడు సరోవర తీరంలో పడిపోయాడు.

నకులుడు రావటం ఆలస్యమైందని ధర్మరాజు సహదేవుని పంపాడు. సహదేవుడు ప్రశ్నలకు సమాధానం చెప్పక పోవటం వలన అతను గూడ పడిపోయాడు. అదేవిధంగా అర్జునుడు, భీముడు గూడ పడిపోయారు. చివరకు ధర్మరాజే స్వయంగా వెళ్ళాడు. తన తమ్ములు తీరం వద్ద పడి ఉండటం చూచి ఆశ్చర్యపోయాడు. చాల దుఃఖించాడు. దప్పికకు ఆగలేక ధర్మరాజు కొలనులో దిగాడు. అశరీరభూతం అతణ్ణి అడ్డుకుంది.

వెంటనే తాటిచెట్టంత పొడవు గల భయంకరాకారంతో ఒక యక్షుడు ఆ తీరంలో నిలబడి అతని అనుమతి లేకుండా ఆ నీరు త్రాగితే, ఎంతటివారైనా చనిపోతారని చెప్పాడు. ధర్మరాజు విచారశీలుడు కాబట్టి ఆలోచించ గలిగాడని, తన ప్రశ్నలకు సమాధానాలు చెప్పవలసిందని అడిగాడు. ధర్మరాజు వినయంతో అన్ని ప్రశ్నలకు సరియైన సమాధానాలు ధర్మబద్ధంగా వివరించాడు.

ధర్మరాజు ఇచ్చిన సమాధానాలకు యక్షుడు సంతోషించి 'నలుగురు తమ్ములలో ఒకడిని బ్రతికిస్తాను. అతణ్ణి ఎన్నుకో'' మని ధర్మరాజును అడిగాడు. నకులుణ్ణి బ్రతికించుమని కోరుకున్నాడు. భీమార్జునులు నీకు ఉపయోగిస్తారు కదా! వారిని వదలి నకులుణ్ణి ఎందుకు ఎన్నుకున్నావు" అని యక్షుడు ప్రశ్నించాడు. కుంతీ పుత్రులలో మొదటి వాడిని నేనున్నాను. అట్లాగే మాద్రి పుత్రులలో నకులుడు బ్రతికి ఉండటం ధర్మం" అని ధర్మరాజు అన్నాడు.



యక్షుడు ధర్మరాజు యొక్క ధర్మబుద్ధికి, సమానమైన నిర్ణయానికి సంతోషించాడు. చనిపోయిన భీమాదులను బ్రతికించాడు. ధర్మాత్ముడని ప్రజల చేత పొగడబడే ధర్మరాజు ధర్మహానికి సహించడని నిరూపించుకున్నాడు. అతడు అన్ని విధాలా సార్థకనామధేయుడైనాడు.

ఓ యక్షనాయకా! నీవెవరివో నాకు తెలియపరుచు'' అని ధర్మనందనుడు అడిగాడు. ఆ మహాత్ముడు చిరునవ్వుతో "ఓ రాజేంద్రా! నేను ధర్ముడను. సత్యం, శౌచం, దానం, తపస్సు, శమము, దాంతి, యశస్సు, జ్ఞానం అనేవి నా మూర్తులు. ఉత్తమ ధార్మికుడవు, నాకుమారుడవు అయిన నిన్ను చూడాలనే వేడుకతో వచ్చాను. నన్నాశ్రయించిన వారు దుర్గతి పొందరు. కాబట్టి, నీకిష్టమైన వరం కోరుకొమ్ము" అని అన్నాడు.

వెంటనే ధర్మరాజు నమస్కరించి "హరిణం అపహరించిన అరణిని తిరిగి ఇప్పించి కర్మలోపం, ధర్మలోపం కాకుండా కరుణించమని" అడిగాడు. ధర్మజుని ధర్మబుద్ధికి సంతోషించి ఆ మాయనంతా తానే కల్పించానని తెలిపి, ధర్ముడు అరణిని ధర్మరాజుకి తిరిగి ఇచ్చాడు. యక్షునితో ధార్మిక సంబంధాల వలన ధర్మరాజుకి మేలు జరిగింది. వరాలు పొందాడు. అనుకున్నది సాధించాడు.

"ధర్మజా! మిమ్మల్ని అజ్ఞాతవాసంలో ఎవ్వరూ గుర్తించకుండా ఉండేటట్లు వరమిస్తున్నాను." అని ధర్మదేవతయే వారికి ఉపయోగపడే వరమిచ్చాడు. ఏ తమ్ముని బ్రతికించాలని యక్షుడు అడిగినప్పుడు, ధర్మరాజు తీసికున్న నిర్ణయం తమ్ములందరినీ బ్రతికించటానికి దారితీసింది. అందుకే ధార్మిక బుద్ధితో సరైన నిర్ణయం తీసుకోవాలన్నది సందేశం!

## భార్యాభర్తల అన్యోన్యత

మహాభారతంలో భార్యాభర్తల అన్యోన్యత వల్ల కుటుంబంలో సత్సంబంధాలు ఉంటాయని వివరింపబడింది. కుటుంబ సంబంధాలు పెంచుకోవటానికి మహాభారతంలో చక్కని చిట్కాలు చెప్పబడ్డాయి. అరణ్యవాస సమయంలో శ్రీకృష్ణ బలరాములు, సత్యభామ, రేవతీదేవి పాండవులను పరామర్శించటానికి వచ్చారు. ఆ సందర్భంలో ద్రౌపదికి సత్యభామకు జరిగిన సంభాషణలో భార్యాభర్తల అన్యోన్యత, ఆప్యాయత చర్చకు వచ్చాయి. వాటిని ద్రౌపది సత్యభామకు వివరించింది.

సత్యభామ ద్రౌపదితో "వదినా! నీవు భర్తలతో ఎంతో అన్యోన్యంగా ప్రేమతో ఉంటావు. వారుగూడ నిన్ను అనురాగంతో చూస్తుంటారు. వారెప్పుడూ ప్రసన్నవదనాలతో నిన్ను చూస్తారు. ఒక్కమాట గూడ కఠినంగా మాట్లాడరు. కళ్ళు ఎఱ్ర చేసిన సందర్భాలు కూడా లేవు. మరి నీదగ్గర మంత్రాలు, తాయత్తులు, వ్రతాలు, ఓషధులు ఏమైనా ఉన్నాయా? అని అడుగుతుంది.

ద్రౌపది చిరునవ్వు నవ్వి "సత్యా! నువ్వు చెప్పిన మంత్రాలు, తాయెత్తులు, వ్రతాలు, ఓషధులు మనవంటి వారికి కాదమ్మా! శీలరక్షణ తెలియని నీచులకు అవి కావాలి. అసలు మన మనస్సుకు అటువంటి ఊహలను రానివ్వకూడదు.

"నేను ఆచరించే మార్గాలు కొన్ని ఉన్నాయి. అవి చెబుతాను విను" అని ద్రౌపది ఇలా చెప్పింది.

♦ అహంకార, దురభిమానాలను దగ్గరకు రానివ్వను. ఎవరితోనూ కఠినంగా మాట్లాడను. ఎక్కడబడితే అక్కడ అనవసర విషయాలను చర్చించను. చూడను. సిగ్గుమాలిన దానిలా అందరితోనూ మాట్లాడను. మనకు పరిచయం లేనివారి వైపు చూడాలని కూడా అనిపించదు. నిరంతరం మా భర్తల మనస్సును గ్రహించి దానికి అనుగుణంగా నడుచుకోవటమే



నేను సాధించిన బ్రహ్మవిద్య వారు సంపదలతో తులతూగిననాడు ఏ గౌరవం చూపానో అదే గౌరవం ఈనాడు అరణ్యవాస దీక్షలోనూ చూపుతున్నాను.

♦ ఏ పనిమీదైనా వెళ్ళి, వారు తిరిగిరాగానే ఎదురేగి చిరునవ్వుతో స్వాగతం ఇచ్చి సేద తీరుస్తాను. వారికేది ఇష్టమో దాన్ని నేనే స్వయంగా చేస్తాను.

♦ ఇల్లు పరిశుభ్రంగా ఉండేలా చూస్తాను. సోమరితనాన్ని నా దగ్గరికి రానివ్వను. పరిహాస ప్రసంగ సమయంలో తప్ప వారి ముందు కూడా నవ్వుతూ వెకిలిగా నిలబడను. తోటలలో ఒంటరిగా తిరుగను. నీచులను దరి చేరనివ్వను. అసంతృప్తి అనేది నే నెరుగను. అసలు కోపమే రానివ్వను. వచ్చినా క్షణంలో తోసేస్తాను. భర్త తోడులేకుండా ఇతరుల ఇండ్లకు వెళ్ళను. ప్రసంగాలు వింటానే తప్ప, అందులో నా తెలివి ప్రదర్శించను. వారు దేశాంతరం వెళితే అలంకారాలు ముట్టను. అలంకారం లేకుండా, అపరిశుభ్రవస్త్రాలతో వారి కెప్పుడూ కనుపించను.

♦ మా అత్త కుంతీదేవి ఎవరెవరితో ఎలా ప్రవర్తించేదో అలానే ప్రవర్తిస్తాను. ఆవిడకు, వీరికి, ఎదురు చెప్పి తగవులు చెయ్యను. మనస్సు నిర్మలంగా ఉంచుకొని తెల్లవారుజామున నిద్రలేచి ఎవరెవరి అవసరాలు ఏమిటో అన్నీ స్వయంగా చూస్తాను.

♦ ఇంద్రప్రస్థంలో వున్న రోజులలో ఎనిమిదివేల మంది వేదవిదులు, ఎనభై ఎనిమిది వేలమంది విద్యార్థులు, ఇంకా ఎందరో అతిథులు, అభ్యాగతులూ, ఇంకా మా పరివారగణం, వారందరి భోజన భాజనాలు స్వయంగా చూచుకునే దాన్ని. వారందరి సుఖ సంతోషాలు నా బాధ్యతే.

♦ ఆదాయ వ్యయాలు ఎప్పటికప్పుడు చూచుకునే దాన్ని. మా కోశాగారంలో నాకు తెలియనిది లేదు. అది అక్షయంగా ఉండేటట్లు చూచుకునేదాన్ని. అందరికన్నా ముందుగా నిద్ర లేచి అందరూ సుఖంగా

నిద్రించాక నేను శయ్యాగారం వెళతాను. వీటితోనే నేను వారి అనుగ్రహం పొందాను.

♦ సత్యభామా! సుఖం వల్ల సుఖం రాదు. దుఃఖానుభవంవల్ల సుఖం తెలుస్తుంది.

♦ సింహద్వారం వద్ద, ఆవరణలో భర్త కనుపించగానే దాసీలను పిలిచి ఆయన అవసరాలు చూడమనకు. నువ్వే ఆయనను స్వయంగా సేవించు. నీ భర్త నీకు ఏ విషయం చెప్పినా పరమరహస్యంగా వుంచు. రహస్యం కాకపోయినా సరే. నీ భర్త శ్రేయోభిలాషులు, స్నేహితులు కన్పించినపుడు వారి విషయంలో అనాదరం కనిపించ నివ్వకుండా, వారి భోజన భాజనాలు అన్నీ స్వయంగా చూచుకో. ఆయనకు గిట్టని వారుంటే వారివైపు చూడనే చూడకు.

♦ పనీ పాటలు లేక చాడీలు చెప్పే ఆడువారిని నీ దగ్గిరకు రానీయకు. కొడుకులతో అయినా సరే ఏకాంతంగా ఉండకు. ఎప్పుడూ చిరునవ్వుతో, సువాసనలు వీచే పూలు ముడిచిన శిరస్సులో (జుట్టుతో) శరీర అలంకారాలతో, పరిశుభ్రమైన వస్త్రాలు ధరించి, వినయంగా భర్తను సేవించటానికి ఎదురు చూస్తూ వుండు. అప్పుడు వాసుదేవుడు తన అనురాగ సామ్రాజ్యానికి నిన్ను పట్టమహిషిని చేస్తాడు అంది.

ఈ సంభాషణ ముగించిన తరువాత శ్రీకృష్ణుడు సత్యభామా సమేతుడై ద్వారకానగరానికి ప్రయాణమైనాడు.

ద్రౌపది అనుభవాలు, సత్యభామకు ఇచ్చిన సలహాలు అందరికీ అనుసరణీయం.

**అజ్ఞాతవాస సమయంలో సంబంధాలు**

పాండవులు అరణ్యవాసం పూర్తి చేసుకొని అజ్ఞాతవాసం గడపటానికి ప్రణాళికలు సిద్ధంచేస్తున్నారు. అరణ్యవాసంలో ఎంతో మంది మనుష్యులతో ఋషులతో, మహర్షులతో, పురుషోత్తములతో, బ్రాహ్మణులతో



సత్సంబంధాలు ఏర్పరచుకున్నారు. ధర్మమార్గంలో పన్నెండు సంవత్సరాలు విఘ్నాలు లేకుండా పూర్తి చేశారు. అజ్ఞాతవాసంలో ఎవరికీ తెలియకుండా, అవతలివారు గుర్తు పట్టకుండా, రహస్యమైన ప్రదేశంలో ఒక సంవత్సరకాలం పూర్తిచేయాలి. దుర్బుద్ధులుగల దుర్యోధనాదులు, పాండవుల ఉనికిని కనిపెట్టి వారి అజ్ఞాతవాసాన్ని భగ్నం చేయాలని పన్నాగాలు పన్నుతూంటారు. ఎత్తుకు పై ఎత్తులు వేసి వ్యూహాలకు ప్రతివ్యూహాలు వేసి కౌరవుల కంటపడకుండా ఉండటానికి అయిదుగురన్నదమ్ములు ఆలోచించి, చర్చించి, విశ్లేషించారు. చివరకు విరాటనగరంలో అజ్ఞాతవాసం గడపటానికి నిర్ణయం తీసుకున్నారు.

ఈ సందర్భంలో పురోహితుడు ధౌమ్యులవారు పాండవులు ద్రౌపదితో కొన్ని సలహాలు, సందేశాలు ఇచ్చి సత్సంబంధాలు పెంచుకోవాలని హితవు పలికాడు. రాజులతో వారి కుటుంబసభ్యులతో, వారి పరివారగణంతో ఏవిధంగా ప్రవర్తించాలో ఉపదేశించాడు.

♦ ధర్మనందనా! రాజభవనానికి వెళ్ళదలచిన వారు ముందుగా అనుమతి పొందాలి. సభాభవనంలో ఎక్కడ కూర్చుంటే మనల్ని ఎవరూ కదిలించరో అక్కడే కూర్చోవాలి. ప్రభువు అభిమానం పొందాము గదా! అని మన ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించ గూడదు. కొన్ని సందర్భాలలో సాహసించి ప్రభువు సేవ చేయాలి. సాధ్యమయినంత వరకు రాజుగారి ఆజ్ఞకోసమే ఎదురుచూస్తూ వుండాలి.

♦ రాణివాసంతో పరిచయం పెరగనివ్వ కూడదు. వారి బంధుజనంతో అతిగా సంబంధం పెంచుకో గూడదు. రాజద్రోహులను మనదగ్గరకు రానివ్వకూడదు. స్త్రీ వాంఛాపరులను ఒక కంటకనిపెట్టి జాగరూకతతో మెలగాలి.

♦ యుద్ధసమయాలలో ప్రభువు అవమానించినా లక్ష్యపెట్టకూడదు. అతిరహస్య విషయాలను సభలో, బహిరంగంగా మాట్లాడకూడదు. ప్రభువు పరివారం వద్ద మన గొప్పతనాన్ని కీర్తించుకుంటే చాల అనర్థాలున్నాయి.

సభలో కాళ్ళు చేతులు ఆడించ గూడదు. వెకిలిగా నవ్వటం, వికార చేష్టలు వ్యక్తికి తగదు. సందర్భాన్ని బట్టి చిరునవ్వుతో మందహాసం చెయ్యాలి. కాని, మరీ బిర్రబిగిసి పెదవులు ముడుచుకొని కూర్చోకూడదు.

♦ సత్యభాషణం చెయ్యాలి. ప్రభువు మనకిచ్చిన కానుకలు తగినట్లుగా అలంకరించుకుంటూ ఉండాలి. భార్యాబిడ్డలను వదలి దూరదేశాలకు వెళ్ళవలసి వస్తే అనుమానించక రాజు సేవ చేయాలి.

♦ ఏ పరిస్థితుల్లో అయినా అనుమానం రాకుండా మసలేవాడు రాజానుగ్రహం పొందగలడు. నిశ్చింతగా వెళ్ళి రండి. అంటూ వారి క్షేమం కోసం హోమం చేసి సాగనంపాడు ధౌమ్యుడు.

♦ పాండవులంటే విశేషాదరం ఉన్న మత్స్యదేశాధిపతి విరాటరాజు ఆస్థానంలోనికి, పాండవులు, ద్రౌపది మారువేషాల్లో విడి విడిగా ప్రవేశించారు. అలా వస్తున్న ధర్మరాజును చూచి, "ఇటే వస్తున్న ఆ మహాపురుషుణ్ణి చూడండి. విప్రరూపంలో కనపడుతున్నా, ఆయన మహారాజులా, దేవేంద్రునిలాగా ఉన్నాడు" అంటూ సభాసదులతో అన్నాడు విరాటరాజు. మారువేషంలో వున్న ధర్మరాజు ఇలా తనను పరిచయం చేసుకున్నాడు. "ప్రభూ! విధివంచితుడనైన విప్రుణ్ణి! నన్ను కంకుభట్టు అంటారు. ద్యూత విద్యలో నిపుణుణ్ణి. ఒకప్పుడు ధర్మరాజు కొలువులో ఉండేవాణ్ణి.

♦ 'విప్రశ్రేష్ఠా! నాకు అక్షవిద్య చాల ఇష్టం. నిరభ్యంతరంగా నా ఆస్థానంలో ఉండు' అన్నాడు విరాటరాజు.

♦ రాజా! నాకొక నియమం ఉంది. వివాదాలు ఉండకూడదు. తక్కువవాళ్ళతో ఆడను. జూదంలో మొత్తాన్ని వెంటనే ఇవ్వాలి.

♦ రాజు అంగీకరించగా కంకుభట్టుగా ప్రవేశించాడు ధర్మజుడు.

♦ ఆతర్వాత భీముడు 'వలలుడు' అనే పేరుతో వంటవాడిగా చేరాడు.



♦ ఇంతలో సైరంధ్రిగా వెళుతున్న ద్రౌపదిని చూచి, రాణి సుధేష్ణ పిలిపించింది. ఆమె పూర్వాపరాలడిగింది. 'నేను సైరంధ్రిని. ఒకప్పుడు ద్రౌపది, సత్యభామల దగ్గర పనిచేశాను. మీరు అంగీకరిస్తే ఇక్కడ చేరతాను' అన్నది ద్రౌపది.

♦ 'ఇంత అందంగా ఉన్నావే. ఏమైనా చిక్కులు వస్తాయేమో, అని స్త్రీలైన మాకే సందేహంగా ఉంది" అన్నది సుధేష్ణ. 'ఆ భయమే అక్కర్లేదు తల్లీ! నా భర్తలు ఐదుమంది గంధర్వులు. నన్ను రక్షిస్తూంటారు' అంటూ సైరంధ్రిగా ప్రవేశించింది ద్రౌపది.

♦ పిదప నకులుడు, గుర్రాలను కాచే "దామగ్రంథి"గా, సహదేవుడు పశురక్షకుడైన 'తంత్రీపాలకుడి'గా మారువేషాల్లో చేరారు. పిదప నాట్యాచార్యుడైన 'బృహన్నల'గా అర్జునుడు రాజుగారి అంతఃపురంలో చేరాడు.

అజ్ఞాతవాసం సమయంలో మారువేషాలలో ఉన్న పాండవులకు, విరాటరాజ దంపతులు, వారి పరివారానికి పరస్పర స్నేహభావంతో సత్సంబంధాలతో ప్రశాంతంగా జీవితం గడుపుతున్నారు. ఒకరోజు రాణి సుధేష్ణాదేవి సోదరుడు కీచకుడు కామాంధుడై ద్రౌపదిని చేపట్టాలని ప్రయత్నించాడు. అటువంటి నీచమైన కార్యం చేయవద్దని సుధేష్ణ సలహా ఇచ్చినా కీచకుడు వినలేదు. ఒకనాటి రాత్రి కీచకుడు ద్రౌపదిని బలాత్కరించగా, అజ్ఞాతరూపాలలో ఉన్న పాండవులు కీచకుణ్ణి చంపటానికి ప్రణాళిక సిద్ధం చేశారు. వలలుని రూపంలో వున్న భీముడు కీచకుని మీదకు దాడిచేసి అతనిని చంపాడు. ద్రౌపదిని బంధించిన ఉపకీచకులను గూడ భీముడు వధించాడు.

కీచకవధ వార్త హస్తినాపురంలోని కౌరవులకు తెలిసింది. వారంతా అనేక విధాల వార్తలను విశ్లేషించి పాండవులు జీవించారా? మరణించారా?

అని సందేహాలను వ్యక్తపరిచారు. కురువృద్ధులు మాత్రం పాండవులు జీవించే ఉంటారు. వారు సాహసులు, బలపరాక్రమాలు గలవారు, ధర్మపరాయణులు. వారికి ఏ అపకారం జరుగదు అని భరోసా పలికారు. వారు సమయం కోసం ఎదురు చూస్తుంటారు. ఆలస్యం చేయకుండా వారిని పట్టే ప్రయత్నం చేయాలి అనగా భీష్మాచార్యులు లేచి–

నాయనా! దుర్యోధనా! ఆచార్య ద్రోణులు యథార్థం సెలవిచ్చారు. వారు మరణించటం అసంభవం. వారు నివసించే ప్రాంతంలో ప్రజలందరూ ధర్మతత్పరులుగా ఉంటారు. వారుండే చోట విద్వాంసులు విశిష్ట పూజలు అందుకుంటూ ఉంటారు. పాడి పంటలు సమృద్ధిగా ఉంటాయి. వారున్న చోట నాస్తికులుండరు. దేవతారాధనలు, యజ్ఞయాగాది క్రతువులు, దానధర్మాలు విరివిగా సాగుతుంటాయి. అటువంటి ప్రదేశంలో మన గూఢచారులు జాగ్రత్తగా గుర్తుపడితే వారు దొరుకుతారు" అన్నారు. ధర్మపరాయణులైన పాండవులు ఎక్కడ ఉంటే ఆప్రాంతం సుభిక్షంగా ఉంటుంది.

**విరాటుని పై దండయాత్ర**

అజ్ఞాతవాసం సాగిస్తున్న పాండవులను ఎలా అయినా పసిగట్టి, వారి చేత తిరిగి అరణ్యవాసం, అజ్ఞాతవాసం, చేయించాలని దుర్యోధనుడు ప్రయత్నిస్తున్నాడు. ఆ ప్రయత్నానికి ప్రణాళికలు సిద్ధంచేసి దక్షిణ గోగ్రహణం, ఉత్తర గోగ్రహణం అనే నెపంతో యుద్ధానికి బయలు దేరాడు. విరాటుడు కూడా సేనాబలాన్ని సిద్ధం చేశాడు.

విరాటుని గోసంపదను హరించుకుపోతున్న కౌరవులను ఓడించి, పాండవులు ఆ గోవులను వెనుకకు తరలించారు. విజయం సాధించారు.

ఉత్తరుడు సాధించిన విజయాన్ని గురించి కంకుభట్టుతో విరాటుడు సంభాషిస్తున్న సమయంలో వారిద్దరి మధ్య తేడా వచ్చింది. ఆ కోపంలో



విరాటరాజు కంకుభట్టుపై పాచికలు విసిరాడు. ఆ సంఘటనతో కంకుభట్టు నుదుటికి గాయమై రక్తం కారింది. దానికి సైరంధ్రి రూపంలో ఉన్న ద్రౌపది "మహారాజా! ఉత్తమవంశ సంజాతుడూ, శీలవంతుడూ అయిన మహాపురుషుడాయన. అటువంటి ఉత్తమపురుషుని రక్తబిందువులు ఈ నేలమీద ఎన్ని పడతాయో అన్ని సంవత్సరాలు అనావృష్టి పీడ కలుగుతుంది కాబట్టి, ఈ రాజ్యానికి అటువంటి స్థితి కలుగకూడదని ఈ పనిచేశానంది". ఇంతలో ఉత్తరుడు వచ్చి సంతోషంతో ఈ విజయానికి ఒక మహాపురుషుడు సహాయం అందించాడు. మహాపురుషుణ్ణి పొగడుతూ, యుద్ధ వార్తలు వినిపించాడు విరాటునికి ఉత్తరుడు.

తరువాత మారువేషాలతో ఉన్న పాండవులు తమ నిజరూపాలను తెలిపి విరాటుణ్ణి ఆశ్చర్యంగొలిపారు. విరాటుడు వినయంతో ధర్మరాజు వంక చూచి "ఆర్యా! ఈ రాజ్యం సర్వస్వాన్ని మీకు సమర్పిస్తున్నాను. నా ముద్దుల కూతురు ఉత్తరను మీ కుమారుడు అభిమన్యునికిచ్చి వివాహం జరిపిస్తాను" అన్నాడు.

పాండవులు విరాటనగరంలో బహుసత్కారాలు పొంది, ఉపప్లావ్యం చేరి అక్కడ ప్రజల ఆదర సత్కారాలతో సంతోషించారు.

అంగరంగ వైభవంగా మంగళవాద్యాలనడుమ, పెద్దల ఆశీర్వచనంతో, శ్రీకృష్ణుని సమక్షంలో ఉత్తరాభిమన్యుల వివాహం జరిగింది.

**అజ్ఞాత వాసంలో ఉన్న పాండవులు ధర్మనిష్ఠతో, వినయంతో, అనుమానాలు రాకుండా; అవమానాలు లేకుండా, విరాటరాజు కొలువులో కుటుంబ సభ్యుల మధ్య, వారి పరివారంతో సత్సంబంధాలు పెంచుకొన్నారు. వారి బలపరాక్రమాలను, నిజరూపాలను తెలుసుకుని విరాటరాజు పాండవులతో వియ్యం పొంది కుటుంబసభ్యులలో ఒకరైనారు.**

## రాయబారవ్యవస్థ - సత్సంబంధాలు

రామాయణకాలంలో రాయబార వ్యవస్థకు పునాదులు ఏర్పడితే మహాభారతకాలంలో ఆ వ్యవస్థకు బలం ఏర్పడింది. ఇద్దరు వ్యక్తులమధ్య, ఇరువర్గాలమధ్య ఉన్న సమస్యలు, మనస్పర్థలు, వ్యతిరేకతలు, ఆస్తి పంపకాలు. వాటిని పరిష్కరించటానికి ఒక మధ్యవర్తిని నియమించుకొని సానుకూలంగా పరిష్కరించుకోవటమే రాయబార వ్యవస్థ ముఖ్యోద్దేశ్యం. రాయబారరూపంలో రాజనీతి, విదురుని ఉపదేశంలో లోకనీతి, సనత్సుజాతుని నోట ఆత్మజ్యోతి మహాభారతంలో స్పష్టంగా కనిపిస్తాయి.

మహాభారతంలో నలుగురు రాయబారులు ఉన్నారు. కౌరవులు – పాండవుల మధ్య సయోధ్య కుదిర్చి సంబంధాలు మెరుగు పర్చటమే వీరి కర్తవ్యం. రెండు కుటుంబాల మధ్య శత్రుత్వం నివారించి యుద్ధం రాకుండా శాంతిని, ధర్మాన్ని నిలబెట్టటం వీరి అంతరార్థం. నలుగురు రాయబారులు వారి వారి అభిప్రాయాలను భిన్న రీతులలో ఉపదేశించటమే సత్సంబంధాలకు పునాదిగా తెల్సుకోవాలి.

**1. వ్యవహారజ్ఞానం లేకుండా నిజాన్ని నిష్ఠూరంగా చెప్పటమే తెలిసిన రాయబారి, ద్రుపద పురోహితుడు;**

**2. కర్ర విరగకుండా, పాము చావకుండా మంత్రాంగం నడిపిన రాయబారి, సంజయుడు.**

**3. త్రాచుపామును బలమైన కర్రతో నడ్డి విరిచే రాయబారి, వాసుదేవుడు.**

**4. విరిగిన మనసులను మరింత దూరంచేసే రాయబారి శకుని కొడుకు ఉలూకుడు.**

ఉత్తర–అభిమన్యుల వివాహం జరిగిన తరువాత పాండవుల శ్రేయస్సు వాంఛించే పెద్దలు రాయబారం నడపటానికి చర్చించారు.



## ద్రుపద పురోహితుడు

ద్రుపద పురోహితుడు హస్తినాపురం ప్రవేశించాడు. ధృతరాష్ట్ర, భీష్మ, విదురులను దర్శించి కుశల ప్రశ్నలడిగి, సత్కారాలు పొంది, పాండవుల క్షేమ సమాచారాలు తెలియజేశాడు. సభామధ్యలో ద్రుపద పురోహితుడు తన సందేశాన్ని వినిపించాడు.

“మహారాజా! పాండురాజు, మీరు అన్నదమ్ములు. తండ్రి ఆస్తికి మీరు ఇద్దరూ సమానులు గదా! అయితే సర్వసంపదలు మీ బిడ్డలే అనుభవిస్తూ పాండవులకు ఏమీ లేకుండా చేశారు. ఇది అందరికీ తెలిసిన విషయమే. మీ దుర్యోధనాదులు పాండవులను సంహరించాలని చూచారు. ఇప్పుడు శకునితో జూదం ఆడించి వారిని మోసం చేసి వారి రాజ్యం అపహరించారు. ద్రౌపదీ దేవిని పరాభవించారు. అందరిని అడవిపాలు చేశారు. అజ్ఞాతవాస సమయంలో వారెన్నో బాధలు అనుభవించారో మీరు ఊహించగలరు.

ఇన్ని జరిగినా మీతో కలిసి ఉండటానికే ఇష్టపడుతున్నారు. పాండవుల సుగుణాలు బాగా తెలిసిన వారెందరో ఈ సభలో ఉన్నారు. మీరందరూ బాధ్యతను తీసుకొని దుర్యోధనుని మనస్సు మార్చటానికి ప్రయత్నించాలి. యుద్ధం అవసరం లేకుండా, రక్తపాతం లేకుండా వారి రాజ్యం వారికిస్తే చాలునని పాండవులు భావిస్తున్నారు” అన్నాడు ద్రుపద పురోహితుడు.

ఇంకా పాండవుల శక్తి సామర్థ్యాలను, బలపరాక్రమాలను, అస్త్రవిద్యా నైపుణ్యం, శ్రీకృష్ణుని సహాయం, ఆశీర్వచనం మొదలైన విషయాలను వివరించాడు పురోహితుడు. కనుక నామాట విని వారి రాజ్య భాగం వారికిచ్చి రెండు కుటుంబాలు సుఖశాంతులతో వర్ధిల్లండి” అని ముగించాడు పురోహితుడు.

ఈ సందేశాన్ని విన్న భీష్ముడు అది అంతా సత్యమే అని పలికాడు. కర్ణుడు, దుర్యోధనుడు వారి మాటలను పరిహసించారు. వారి బలాలను

చూచి లొంగిపోనవసరం లేదని బదులు పలికాడు. ధృతరాష్ట్రుడు వారిని మందలించాడు.

ధృతరాష్ట్రుడు సభలో పెద్దల నుద్దేశించి "మీ మాటలలో రెండు వంశాల శ్రేయస్సు ఉన్నది. అంతేకాదు, లోకకళ్యాణ కాంక్ష మీ ఆలోచన. నేను బాగా ఆలోచించి పాండవుల వద్దకు సంజయుని పంపుతాను" అని పురోహితునితో చెప్పాడు.

## సంజయరాయబారం

"పాండవులు ఉపప్లావ్యం చేరినట్లు తెలిసింది. నీవు రేపు బయలుదేరి వెళ్ళి వారి క్షేమసమాచారాలు తెలుసుకురావాలి. అక్కడకు వెళ్ళగానే ధర్మరాజును దర్శించాలి. ఆదరవచనాలతో వారి యోగ క్షేమాలు నేను అడిగినట్లు చెప్పాలి" అని ధృతరాష్ట్రుడు సంజయుని పిలచి రాయబారానికి పాండవుల వద్దకు పంపాడు. ముందుగా పాండవులను గురించి సంజయునికి వివరించాడు ధృతరాష్ట్రుడు. "సాధుస్వభావులు, పరోపకార పరాయణులూ అయిన మీకు రాకూడని కష్టాలు వచ్చాయి అని చెప్పు. సంజయా! ఇంత జరిగినా వారికి మన మీద క్రోధం లేదు. ఎప్పుడూ మోసం చేసి ఎరుగరు. సాహస కార్యక్రమాలు ప్రదర్శించి సంపదలు సాధించారు. ధర్మ విరుద్ధంగా వారు ఏనాడూ ప్రవర్తించ లేదు. కామచింతతో చరించలేదు". అని వివరించాడు ధృతరాష్ట్రుడు.

"ఇంతకాలం ప్రవాసంలో ఉన్నా వారి మిత్రులందరూ వారి దగ్గరకే చేరారు. అంటే స్నేహ సంబంధాలను వారు ఎలా రక్షించుకుంటూ వస్తున్నారో గ్రహించు. స్వాగత, సన్మానాలు అందుకోటానికి వారు అర్హులు. అయినా మన కౌరవులు వారిని అవమానాలపాలు చేశారు. దుర్యోధనుని బుద్ధి, రాగ ద్వేషాలకు లొంగి మూర్ఖంగా నడుస్తున్నాడు. వీడు సర్వభోగాలు అనుభవిస్తూ వారి సంపదలను కూడా హరించాలనుకుంటున్నాడు. అదేదో



ఘనకార్యం అని అతని ఊహ," అని ధృతరాష్ట్రుడు పాండవుల, కౌరవుల మనస్తత్వాలను, లక్షణాలను తు.చ తప్పక వివరించాడు సంజయునికి.

పాండవులను అడిగినట్లు చెప్పు. భరతవంశ శ్రేయస్సు, ప్రధానంగా అక్కడ మాట్లాడవలసిన మాటలు నీకు నేను చెప్పనవసరం లేదు. ఏ దశలోనూ క్రోధాన్ని దగ్గరకు రానివ్వకు, శాంత స్వభావుడవై నడుచుకో." అని చెప్పి సంజయుడిని సాగనంపాడు.

## సంజయ-ధర్మరాజు సంభాషణ

సంజయుడు ఉపప్లావ్యం చేరి ముందుగా ధర్మరాజును దర్శించాడు. "ధర్మనందనా! నువ్వు నీ సోదరులతో, అనుచరగణంతో, మిత్ర బృందంతో సుఖంగా ఉన్నందుకు మా మహారాజు తన సంతోషం తెలుపుతున్నాడు. మీ అందరిని పేరు పేరునా కుశలం అడగమని ఆజ్ఞాపించాడు. పాంచాల రాజపుత్రి ద్రౌపదీదేవి తన కుమారులతో క్షేమంగా ఉన్నట్టు తెలుసుకోమన్నాడు. చక్కని శీలమూ, మంచి నడవడి కలిగి మీతో వుందా వారందరి సమాచారమూ ఆయన అడిగి రమ్మన్నాడు" అని సంజయుడు ధృతరాష్ట్రుని సందేశం అందించాడు.

ధర్మరాజు గూడ సంజయునితో "నీ రాక మాకు సంతోషం కలిగిస్తున్నది. నిన్ను చూస్తే మాకు ధృతరాష్ట్రమహారాజును చూచినంత తృప్తిగా ఉంది. భరతవంశ ప్రముఖుడూ, కురువంశ వృద్ధుడూ అయిన మా పెదనాన్న క్షేమ సమాచారాలతో వచ్చిన నీకు స్వాగతం. భీష్మాచార్యుని, ధృతరాష్ట్రకుమారులను, అశ్వత్థామ, యుయుత్సుడు కర్ణుడు మొదలైన వారి క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నాడు ధర్మరాజు.

ప్రత్యేకంగా దుర్యోధనుని రాజ్యపాలన గురించి ధర్మరాజు అడిగి తెలుసుకున్నాడు. దుర్యోధనుడు తన మంత్రుల, పరిజనుల రక్షణ, పోషణల విషయమై శ్రద్ధ వహిస్తున్నాడా! లేక మరొక దారి చూచుకోవలసివస్తున్నదా!

మంత్రులు గౌరవంతో ఉంటూ లోలోపల భేదభావాలు పెంచుకోకుండా ఉంటున్నారా! లోకంలో చోరభీతి, శత్రుభయం గలిగినపుడు వారు నకుల సహదేవులను తలచుకుంటున్నారా! ఘోష యాత్రలో వారికి జరిగిన పరాభవం నుంచి మా భీమార్జునులు రక్షించిన విషయం మరువలేదు కదా!

"సంజయా! మంచి మాటలతో దుర్యోధనాదులు దారికి రాకపోతే మరొక మార్గాన మా రాజ్యం మేము సాధించుకోగలం", అన్నాడు ధర్మరాజు.

వెంటనే సంజయుడు ధర్మనందనా! నీ నోట అసత్యం రాదు. అన్నీ వాస్తవాలే పలికావు. అక్కడ వారందరూ కుశలమే. ఇంతవరకూ మీ విషయంలో వారు అన్యాయంగా, ద్రోహబుద్ధితో ఉన్నారు. మీరు అందుకు భిన్నంగా వారిపట్ల సద్భావనతో నడుస్తున్నారు. మీ వంటి మంచి వారిని హింసించిన ధృతరాష్ట్రుణ్ణి లోకం నిందిస్తూనే ఉంది. అయినా కురువంశ శ్రేయస్సు కోరి ఆయన చెప్పిన మాటలు వినండి. మా మహారాజు శాంతినే కోరుతున్నాడు. ఉభయులూ సంధి చేసుకొని సామరస్య భావంతో ఉండే పద్ధతిలో మాట్లాడమని నన్ను రాయబారిగా పంపాడు. ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చి, సత్సంబంధాలు పెంచటమే రాయబారి లక్ష్యం గదా!

మీరు సరళ స్వభావులు, ధర్మ సంపన్నులు, దయార్ద్ర హృదయులు, ఔదార్యం, లజ్జా మీ భూషణాలు. క్రూరత్వాన్ని దగ్గరకు రానివ్వరు. ఏనాడూ మీరు చెడు కార్యాలు చేయలేదు.

పాపానికి అవకాశం కలిగించి, నరకానికి బాటలు వేస్తూ, సర్వనాశనానికి దారితీసే యుద్ధాన్ని ఎవ్వరూ కోరుకోరు. సజ్జనులుగా కీర్తిని సాధించిన మీరు యుద్ధానికి అనుకూలంగా ఉంటారని నేను అనుకోను.

ధార్తరాష్ట్రులను శత్రువులుగా భావించి, సంహరించటానికి మీరు సాహసిస్తారని ఎవరూ ఊహించరు. సాత్యకి, కృష్ణుడు, ద్రుపదుడు,



చేకితానుడు వీరందరూ మీకు సహాయంగా ఉన్నారు. దేవేంద్రుడు వచ్చినా మిమ్ము ఎదిరించి నిలువలేడు.

దుర్యోధనుని దగ్గర అపారమైన సైన్యం వుంది. వారిని జయించటం కూడా సామాన్యం కాదు. జయాపజయాలను ఎవరూ ముందుగా నిర్ణయించలేరు. ద్రుపదుడు, శ్రీకృష్ణుడు ఇక్కడే ఉన్నారు. వారుభయులు నిశితంగా ఆలోచించి రెండు వంశాల శ్రేయస్సుకు తగిన పద్ధతిలో నడుపుతారని నమ్ముతాను.

**మా ప్రభువుతో బాటు, మీ పితామహుడు కూడా శాంతినే కోరుతున్నాడు. ధర్మనందనా! అదే మీకు కళ్యాణ ప్రదమని భావిస్తున్నాను" అన్నాడు సంజయుడు.**

వెంటనే ధర్మరాజు "సంజయా! నీ మాటలు చాల విచిత్రంగా ఉన్నాయి. మేము యుద్ధానికి సుముఖంగా ఉన్నామనే అభిప్రాయం నీ కెందుకు కలిగిందో తెలీదు. నీ మనస్సులో యుద్ధభీతి ఎలా ప్రవేశించింది? సర్వనాశనానికి దారితీసే సంగ్రామం కంటే నిఖిల జన కళ్యాణ హేతువైన శాంతియే శ్రేయస్కరం.

**యుద్ధం చేయకుండా మాపని నెరవేరుతుందంటే అంతకంటే కావలసింది లేదు. శ్రమ పడకుండా ఫలం దక్కుతుందని తోస్తే, నడ్డి వంచి అవస్థ పడేవాడెవడు?**

ధర్మబద్ధంగా, ప్రజాశ్రేయస్కరంగా ఉండే కార్యాలు మాత్రమే మేం చేస్తాం. సుఖభోగాలు లభించినా, అవి ధర్మంగా వస్తేనే స్వీకరిస్తాం.

మీ మహారాజు అపార ధన, ధాన్య, సంపదలతో సుఖంగా ఉన్నాడు. తరతరాలు హాయిగా జీవించగల భోగసాధనాలున్నాయి. అయినా తృప్తి కలుగలేదు వారికి. సంజయా! ఒక్క విషయం మరచిపోకు. **"యుద్ధంలో విజయం పుణ్యాత్ములకే లభిస్తుంది"**.

దుష్టబుద్ధి సర్వసంపదలు కాజేశాడు దుర్యోధనుడు. అది తెలిసి కూడ ఆ కొడుకును వదల లేక బాధపడుతున్నాడు మీ ప్రభువు. విద్వాంసుడైన విదురుడు చెప్పే హితబోధలు తలకెక్కడం లేదు. కురువంశ శ్రేయస్సు కోసం పాటు పడేవాడు విదురుడు. వాని మాటలే చేదుగా ఉంటే ఎవరు చెప్పి ఏం లాభం. ఈర్ష్య, క్రోధం, పరులను నిందించటం, మిత్రద్రోహం, అయోగ్యత ఇన్ని అవగుణాలు ఉన్నవాడు దుర్యోధనుడు. అవన్నీ బాధ్యతాయుతంగా ఖండించకుండా ఉపేక్షించి, పుత్రవ్యామోహంలో మునిగిపోయి స్తబ్ధంగా ఉన్నాడు ధృతరాష్ట్రుడు.

నా తమ్ములు అర్జునుడు, భీముడు విజృంభించి గాండీవం, గదా దండం ధరించి వీరవిహారం ఆరంభించిన మరుక్షణంలో మీ వారి ఆశలు గాలిలో కలియక తప్పదు. నా తమ్ములు నలుగురు నిలబడి ఉండగా దేవేంద్రుడు వచ్చినా మా రాజ్యం మరొకరికి దక్కదు.

సంజయుడు "దుర్యోధనాదుల పరాక్రమాలను, వారికి గల కురువృద్ధుల అండ, సైన్యం సంఖ్యను వివరించి యుద్ధం ఆలోచనలను మానుకోవలసిందిగా ధర్మజునికి" సలహా ఇచ్చాడు.

మీరు బంధుమిత్ర యోధవరులతో దుర్యోధనుని గర్వాన్ని అణగార్చవచ్చు. ఇది వరకే ఆ పని చేసి ఉండవలసింది. ఇంతవరకూ వారి బలం పెరిగే అవకాశాలు కల్పించారు. వాతావరణం మీకు అనుకూలంగా లేదు ఈనాడు. కాబట్టి, మీరు కౌరవులతో సంధి చేసుకొని వంశనాశనం తప్పించండి" అని సలహా ఇచ్చాడు సంజయుడు.

అక్కడే ఉన్న శ్రీకృష్ణుడు గూడ సంజయునితో "సంజయా! పాండవులను కష్టాలనుండి రక్షించి వారికి సుఖ శాంతులు కలిగించటం నా ధ్యేయం. కౌరవులు కూడా సంతోషంగా ఉండాలనే గాఢమైన కోరిక కూడా ఉన్నది. ఉభయులూ శాంతిగా జీవించాలనేదే నా అభిమతం. అందుకు వీరిని సుముఖులను చేశాను. ధర్మరాజు కూడా శాంతినే కోరుతున్నాడని నీవు గ్రహించి ఉండాలి. రాజ్యం విషయానికి వస్తే, సంధి జరుగుతుందనే ఆశ నాకు లేదు. రాజ్యం అంతా తామే అనుభవించాలని మీ మహారాజు సంకల్పం. ఇక యుద్ధం కాక దారి ఏది? ధర్మజుడు కాని, నేను కాని ధర్మాన్ని అతిక్రమించటం సహించలేము. జ్ఞానమార్గమా! కర్మమార్గమా! అన్నాడు కృష్ణుడు.



శ్రీ కృష్ణుడు చివరకు సంజయునితో "ఇప్పుడింకా వారి దురాగతాలన్నీ మళ్ళీ త్రవ్వటం దేనికి! నేను హస్తినాపురం వస్తున్నాను. వీరి రాజ్యం వీరికిచ్చే విధంగా ధర్మబద్ధమైన చర్చలు జరుపుతాను. వారు అంగీకరించారా అదృష్టవంతులం లేదా ఆయుధాలు చేత పట్టి భీమార్జునులు రణరంగంలో ప్రవేశించి కౌరవనాశనం చేస్తారు. యుద్ధభూమిలోనే మా భీమసేనుడు మీ దుర్యోధనుని పరిహాస ప్రసంగాలను గుర్తుకు తెస్తూ చెండాడుతాడు.

చివరిమాట, "ఇన్ని జరిపినా ధృతరాష్ట్రుని యందు వీరికి గురుభావం తగ్గలేదు. ఆయనను సేవించాలనే తపన ఎంత ఉన్నదో, యుద్ధం చేయాలనే ఆవేశమూ అంత వున్నది" అన్నాడు శ్రీకృష్ణుడు.

**సంజయుని తిరుగుప్రయాణం**

ధర్మరాజాదులందరి వద్ద సెలవు తీసికొని సంజయుడు అర్జునునితో కొంత సేపు సంభాషించి హస్తినాపురానికి తిరిగి ప్రయాణం చేశాడు.

హస్తినాపురికి చేరిన వెంటనే సంజయుడు ధర్మరాజుతో, శ్రీకృష్ణునితో జరిపిన చర్చలను, వారిచ్చిన సమాధానాలను, సందేశాలను ధృతరాష్ట్రునికీ, దుర్యోధనునికీ వివరించాడు. భీష్మ, ద్రోణ, కృప, విదుర మొదలైన పెద్దలంతా విన్నారు.

ధృతరాష్ట్రుడు దుర్యోధనునితో "నాయనా! వీరి మాటలు విని సమ్మతించు. పాండవుల విషయమై వీరు చెబుతున్న మాటలు యథార్థం. వీరి కంటే మన శ్రేయస్సు కోరేవారు లేరు" అని చెప్పాడు.

ఆ మాటలు వింటూనే దుర్యోధనుడు ఆవేశంతో సభాభవనం వదలి వెళ్ళాడు. ధృతరాష్ట్రుడు కొలువు చాలించి అభ్యంతర మందిరానికి వెళ్ళి మనస్సు బాధతో కృంగిపోయాడు.

వ్యాసులవారు విజయం చేసి "వాసుదేవుని సహాయ సహకారాల వలన అన్ని కష్టాలు హరించుకు పోతాయి" అని బోధించాడు. ఇదంతా విన్నాడు ధృతరాష్ట్రుడు. ఇది సంజయ రాయబారం.

**విదురనీతి**

ధృతరాష్ట్రుడు సంజయుణ్ణి పాండవుల వద్దకు రాయబారానికి పంపాడు. సంజయుడు వెళ్ళిన పని ఏమయిందో అతడి వలన తెలిసికొని మనకేది క్షేమకరమో దానిని ఆలోచించి చేయవలసిందని ఎదురుగా కూర్చొన్న విదురునితో అన్నాడు కురురాజు. ధృతరాష్ట్రుని మనసులో అశాంతి, ఆందోళన, కలత కలుగుతున్నాయి. తన మనసులోని కలతను మాన్పటానికి విదురునితో "నీవు ధర్మాధర్మాలు, నిత్య వినీతులు తెలిసిన వాడవు. నిద్రలేక దుఃఖంతో ఉన్నవారు నీ హితవచనాలనే అమృతాన్ని నా కందించు" అని ధృతరాష్ట్రుడు అడిగాడు.

వెంటనే విదురుడు ఈ విధంగా హితోపదేశం చేశాడు. ఈ హితోపదేశాన్నే మహాభారతకాలంలో 'విదురనీతి' గా వర్ణించటం జరిగింది.

**విదురనీతి**

ధృతరాష్ట్రా!

♦ ధనమూ, విద్య, ఉత్తమ వంశమూ దుర్బుద్ధులకు మదం కల్గిస్తాయి. ఇవే సద్బుద్ధులకు దమం కలిగిస్తాయి. "దమం అంటే అణకువనూ, గౌరవాన్ని కలిగిస్తాయని అర్థం". ఇచట దుర్బుద్ధులు అంటే కౌరవులని, సద్బుద్ధులు పాండవులని అంతరార్థం చెబుతుంది.



♦ గొప్ప విలుకాని మంచిబాణం ఒకని బాధిస్తే బాధిస్తుంది లేదా తప్పిపోతే తప్పిపోతుంది. కాని, నేర్పుగలవాడి స్ఫూర్తి, శత్రురాజునూ, అతడి దేశాన్ని నశింపజేస్తుంది.

♦ ప్రభుత్వాన్ని చేపట్టి, మంత్రోత్సాహాలనే రెండింటినీ కదలనీయక జోడు చేసి మిత్రులు, అమిత్రులు, తటస్థులు అను మూడు వర్గాలను సామ, దాన, భేద, దండాలనే నాలుగు ఉపాయాలచేత పూర్తిగా వశ పరచుకోవాలి. వాక్కు, చక్షువు, శ్రోత్రము, జిహ్వ, ఘ్రాణం అనే ఐదు ఇంద్రియాలను జయించాలి. సంధి, విగ్రహాయన, ఆసన, ద్వైధీ భావాలనే ఆరింటినీ తెలుసుకోవాలి. వేట, జూదం, పానము, స్త్రీ, వాక్పారుష్యం, దండపారుష్యం, అర్థం వ్యర్థం చేయటం అనే సప్తవ్యసనాలను విడిచి వర్తించేవాడు వివేకధనుడు.

♦ మధురపదార్థాలు ఒక్కడూ తినటం, అనేక మంది నిద్రిస్తుంటే ఒక్కడే మేల్కొని ఉండటమూ, కార్యాలోచన ఒక్కడే చేయటమూ, మార్గంలో ఒక్కడూ నడవటమూ పనికి రాదు. ఒక్కడూ కాకుండా, పదిమంది మనుషులతో ఏ పనైనా కలిసి చేయమని అర్థం. **పదిమందితో కలిసి మానవసంబంధాలతో మానవీయవిలువలతో రాజ్యపాలన చేయవచ్చని దీని సారాంశం.**

♦ సత్ప్రవర్తన అనే సముద్రాన్ని దాటించటానికి ఓడవలె సత్యం ఒప్పి ఉంటుందంటే, సత్యాన్ని మించిన గుణం మరొకటి ఉంటుందా!

♦ క్షమించే స్వభావం కలవాళ్ళను చూచి ప్రజలు అసమర్థతను ఆపాదిస్తారు. అయినా, ఆలోచిస్తే గొప్పదైన క్షమాగుణమే మిక్కిలి ప్రకాశించే ఆభరణం. మంచి సౌందర్యం కావాలనుకునేవారు దానిని ధరిస్తారు.

♦ కఠినమైన మాటలు పలకకపోవటం, పాపపు పనులు చేయకపోవటం – ఈ రెంటిచేత లోకంలో పురుషుడు ఉత్తముడు అనిపించుకుంటాడు.

♦ సమర్థుడై ఉండి గూడ శాంతం వహించేవాడూ, బీదవాడై ఉండి తనకు ఉన్నంతలో దానం ఇచ్చేవాడు పుణ్యాత్ముడనిపించు కుంటాడు.

♦ న్యాయబద్ధంగా సంపాదించిన ధనాన్ని అర్హతలేని వారికివ్వటం, అర్హులకు ఇవ్వకపోవటం అనే వాటివలన రెండువిధాలా ఆపద కలుగుతుంది.

♦ తన హోదాకు మించిన వేషధారణ, తనను తానే పొగడుకోక పోవటం, దానం చేసి, ఎందుకు చేశానా అని బాధ పడకుండా ఉండటం, తనకు ఎంత గతిలేక పోయినా సన్మార్గాన్ని అతిక్రమించకపోవటమూ నడవడికి మేలుకలిగిస్తాయి. ఇవే సత్ప్రవర్తనకు మూలం.

♦ స్నేహం, మాట, బలమూ, వివాహం, యుద్ధమూ తమతో సమానులైన వారితోనే సరిపోతుంది. కాని తమకంటే అధికులతో, అల్పులతో మంచిది కాదు.

♦ ఎంత తక్కువ ఉన్నప్పటికీ దానినే సరియైనదిగా ఇతరులకు పంచిపెట్టి అనుభవించటం మంచిది. పనులు చేసేటప్పుడు కష్టానికి సహించి, కొంచం సుఖాన్ని అనుభవించటం మేలు. అడిగితే శత్రువుకైనా ఇవ్వటమే మంచిది.

♦ లోకం తనను పొగడితే మంచివాడు విని పొంగిపోడు. ఇంకా ఎంతో మేలు చేస్తాడు. తాను మాత్రం ఏ కొంచం ఆపద చేయని విధంగా ప్రవర్తిస్తాడు. ఇతరుల ఆపదలను పోగొట్టుతుంటాడు.

విదురుడు లోకనీతిని, ధర్మ ప్రీతిని పాటించే మంచివారి లక్షణాలను, గుణాలను వివరించి, అవి ధర్మరాజులో నిండుగా ఉన్నాయని పేర్కొన్నాడు. కౌరవులయందు ఆ గుణాలు లేవని గట్టిగా చెప్పాడు. అన్నీ ఆలోచించుకుని పాండవులకు రావలసిన భాగాన్ని ఇచ్చి, వారిని దగ్గరికి తీసుకొని, కలిసి మెలిసి స్నేహంతో ఉండమని, కౌరవులు, పాండవులు సమైక్యంగా ఉంటే దేవతలుసైతం తేరిపార చూడలేరని హితవు చెప్పాడు.



♦ అదే ధర్మరాజు వ్యక్తిత్వం, అదే ఆయన హృదయం అన్నాడు. అదే ధృతరాష్ట్రుడి కర్తవ్యమన్నాడు. అదే ధృతరాష్ట్రుడి మనశ్శాంతికి మందు అన్నాడు విదురుడు.

♦ బాగా మగ్గకుండానే పండు ముందుగా కోస్తే రుచి లేకపోవటమే కాదు విత్తనంకూడా పనికి రాదు. పక్వమైన తరువాత కోస్తే పండు బాగుంటుంది. విత్తనంకూడా చెడదు. కార్యం సఫలమయ్యే విధంకూడా ఇంతే. ఇతరుల ధనానికి, విద్యాపరిపక్వతకూ, తేజస్సుకూ, బలానికీ మనస్సు కాలిపోయేటట్లు ఓర్వలేని మనుష్యుడు రోగం ఏమీ లేకుండానే బాధపడతాడు. మనిషికి ఈర్ష్యాసూయలు ఉండగూడదని తెలుసుకోవాలి.

♦ ఎదుటివారికి మేలైనవీ, ఇష్టమైనవీ, మనస్సుకు సంతోషకరమైనవీ అయిన మాటలు ఎక్కువ మాట్లాడగలిగితే మంచిది. అట్లా కాకపోతే ఏమీ అనకుండా నోరు మూసుకుని ఊరుకోవటం ఎంతో మంచిది.

♦ స్నేహవిరోధాలు, జ్ఞానాజ్ఞానాలు, ధర్మాధర్మాలు, ఆధిపత్యనైచ్యాలు తమ మాటల తీరును బట్టి వస్తాయి కాబట్టి, ఇష్టంగా మాట్లాడాలి.

♦ కత్తితో గానీ, గొడ్డలితో గానీ గట్టిగా నరకగా తెగిపోయిన చెట్టుకు చిగురు పుడుతుంది. కాని, మాటలచే చెడి భగ్నమైన కార్యం తరువాత ఏవిధంగానూ సఫలం కాదు.

♦ శరీరంలో నాటుకున్న బాణాలను ఉపాయంతో తొలగించవచ్చును. కానీ, మిక్కిలి గట్టిగా మనస్సులో నాటుకున్న మాటలు ఎన్ని ఉపాయాల చేతనైనా బయటకు వస్తాయా? రావు అని అర్థం.

♦ ధృతరాష్ట్రా! అయ్యో! ధర్మరాజునోటివెంట ఎప్పుడూ చెడుభాష, కఠినమైన మాట ఒక్కటి కూడా లేదు. నీ కొడుకులు ఒకళ్ళని మించి ఒకళ్ళు నీచ వాక్యాలు అనేక విధాలుగా ప్రేలుతూ ఉంటే నీవు దానికి జంకక వింటూ ఉంటావు. నీకిది తగినదేనా? తగినది కాదు.

♦ **తండ్రిగా పిల్లలను క్రమశిక్షణతో పెంచాలి. పిల్లలు తప్పు చేసినా, కఠినంగా మాట్లాడినా తండ్రి దండించాలని అర్థం.**

♦ చెడుకాలం దాపురిస్తే చెడుమాటలూ, చెడుత్రోవపట్టిన చేతలూ ధర్మ బద్ధాలయినట్లు తోస్తాయి. తగిన మాటలూ, చేతలూ నీతి మాలినవని నిర్ణయిస్తుంది. **"వినాశకాలే విపరీతబుద్ధిః"**అనే సూక్తి ఇక్కడ ఉపయోగిస్తుంది.

**"మనుషుల మాటలను బట్టే వారి వ్యక్తిత్వాన్ని అంచనా వేయవచ్చు. మంచి మాటలే మానవసంబంధాలను తీర్చిదిద్దుతాయి. ఇద్దరు మనుషుల మధ్య సుహృద్భావానికి మాటల సరళి ముఖ్యం. ప్రాచీనకాలం నుంచి మనకు కొన్ని సామెతలు వాడుకలో వున్నాయి.**

**"నోరు మంచి దయితే ఊరు మంచిదౌతుంది"** నోటి మాట మంచిది అయితే ఆ ఊరంతా మంచిదని, సహాయ సహకారాలు అందిస్తారు.

**"ఆచి తూచి మాట్లాడండి"** అంటే ఆలోచించి జాగ్రత్తగా మాట్లాడాలని అర్థం. తొందరపడి మాట్లాడరాదు.

**"కాలు జారితే తీసుకోవచ్చుగానీ, నోరు జారితే తీసుకోలేము"** అంటాం. పొరపాటున కఠినమైన, అసహ్యమైన, చేదు పదాలు మాట్లాడితే, వాటిని వెనక్కు తీసుకోలేము. ఆ మాటలు మనసులో నాటుకుపోతాయి.

**వ్యక్తిత్వవికాస లక్షణాలు**

**మహాభారతాన్ని అధ్యయనం చేస్తే "కమ్యూనికేషన్స్ స్కిల్స్" (భావప్రకటన నైపుణ్యం) వల్ల సంబంధాలను మెరుగు పరచుకోవాలి.**

ఇంకా విదురుడు తన హితబోధను కొనసాగిస్తూ, ధృతరాష్ట్ర మహారాజా!

♦ నీతి మార్గంలో బ్రతకటం ఉత్తమం. శక్తి యుక్తులతో సంపదలు పొందటం మధ్యమం. బరువుతో లాగే అరకొరలైన బ్రతుకులు అధమం. నీతి మాలిన వాళ్ళను మెచ్చుకోరు.



♦ ఒకప్పుడు మంచిబ్రతుకు, బ్రతుకవచ్చును లేదా ఆపదలకు గురికావచ్చును, ఒకప్పుడు ప్రశంసలు ఇంకొకప్పుడు లేదా అడుక్కునే దుస్థితి రావచ్చు. ఇట్లా ఎన్నో సుఖాలూ, దుఃఖాలూ మంచి చెడుల మిశ్రమమే జీవితం.

♦ దుఃఖం వలన బలం, ఆకారం చెడుతుంది. మనసు పాడవుతుంది. రోగం వస్తుంది. కాబట్టి, దుఃఖించటం మానుకోవాలి.

♦ తపస్సూ, ఇంద్రియనిగ్రహం, విద్య, వినయం మనశ్శాంతికి కారణాలు.

♦ జ్ఞాతి వైరం, గోవులను అపహరించటం, బ్రాహ్మణులను తక్కువ చేయటం, స్త్రీలను బాధించటం నివారించే వాడి గొప్పతనం విలసిల్లుతూ ఉంటుంది.

♦ దాయాదులు కలిసి, మెలసి ఒకరికొకరి ఆశ్రయాలనూ, సంతోషాలనూ, సంపదలనూ పొందితే తామర సరస్సువలె ప్రకాశిస్తారు.

♦ అన్నదమ్ములు కలిసి ఉంటే అసాధ్యులవుతారు. అట్లా కాక వేర్వేరుగా వుంటే శత్రువుకు లోకువై మిక్కిలి నశిస్తారు.

**కాబట్టి అన్నదమ్ములు సన్నిహిత సంబంధాలు పెంచుకోవాలని విదురుని సలహా. ఈ సలహా అందరికీ, వర్తిస్తుంది.**

♦ ఏనుగులు, గుఱ్ఱాలు మొదలైన సంపదలూ, అందమైన స్త్రీలతో క్రీడా విలాసాలూ, ప్రజలకు ప్రీతికరంగా పరిపాలించే పద్ధతి, యుద్ధాలలో గెలిచి అతిశయించటమూ, ప్రకాశించే ఆభరణాలూ, మైపూతలూ, వస్త్రాలూ అనేవాటి వలన కలిగే వైభవంగల రాజులు సైతం మరణించారే తప్ప, జీవించి ఉన్నారా?

♦ చివరకు విదురుడు "నీలో నీవే బాగా ఆలోచించుకో! ధర్మరాజును విడువవద్దు. మనసు గట్టి పరచుకొని కొడుకులకూ, మంత్రులకు సంధి

అయ్యే విధం చెప్పి అభ్యుదయం కలిగేటట్లు కుదుర్చు" అని ధృతరాష్ట్రునితో చెప్పాడు.

♦ ధృతరాష్ట్రుడు ఇట్లా అన్నాడు – "నీ మాటల వలన నా మనస్సు నిర్మలమై తేరుకుంది. నేను ఇట్లాగే చేస్తాను. ఆలోచించగా ఇదే చేయదగింది, ఇదే ధర్మమూ, కీర్తి, లాభం."

♦ విదురుడు "ధృతరాష్ట్ర మహారాజా! దైవమే సమర్థమైనది. నేనిలా నడవగలను, నడవలేను అనటానికి మానవుడి తరమా! <u>పురుష ప్రయత్నం కంటే దైవం గొప్పది".</u>

♦ విదురనీతి విన్న ధృతరాష్ట్రుడు "పుణ్యాత్మా విదురా! నీవు నాకు ధర్మమార్గాన్ని, నీతి తత్త్వమార్గాన్ని స్వచ్ఛమైన మాటలతో వివరించావు.

నీవు చెప్పిన మాటలు కల్మషం లేనివి. నేర్పరులు సమ్మతించేవి. రాజనీతి మార్గాన్ని బోధించేవి. అయినా కొడుకును విడచి ఉండలేను. 'ధర్మం జయిస్తుంది' అని చూస్తూ ఉంటాను" అన్నాడు.

**"మనశ్శాంతి కోసం నీతివాక్యాలు ఉపయోగ పడతాయని విదురనీతి ద్వారా తెలుస్తోంది. జీవనవికాసానికి మానవాళి ఆచరించాల్సిన నీతి, ధర్మం, ఆధ్యాత్మికతత్త్వం మహాభారత కాలంలోనే ప్రాణం పోయటం జరిగింది".**

**"తల్లిదండ్రులు, పిల్లల విషయంలో జాగ్రత్త వహించి క్రమశిక్షణతో పెంచాలి. ధృతరాష్ట్రుడు, గాంధారి పిల్లలు తప్పుచేసినా సరిదిద్దక పోవటంతో వారు దుర్బుద్ధులుగా, దుర్మార్గులుగా ప్రవర్తించి సోదర సమానులైన పాండునందనులను అరణ్యంపాలు చేశారు. దుర్బుద్ధులవల్ల సంబంధాలు విచ్ఛిన్నమవుతాయని తెలుసుకోవాలి.**

### శ్రీకృష్ణరాయబారం

ఆఖరు ప్రయత్నంగా శ్రీకృష్ణుడు, హస్తినాపురానికి వెళ్ళి రాయబారం నడపటానికి నిశ్చయించాడు. అక్కడ ఉన్న ధర్మరాజుతో శ్రీకృష్ణుడు



"పాండవాగ్రజా! నీఇష్ట ప్రకారం కురు సభాభవనానికి వెళ్ళి సాధ్యమైనంత వరకు సంధి ప్రయత్నం సాగిస్తాను. మీకు కష్టం కలగని విధంగా ఆలోచించి నడుపుతాను. మీ అన్నదమ్ములు, ద్రౌపది అభిప్రాయాలు విన్నాను. మీ ఉభయ వంశాలవారూ, సుఖశాంతులతో ఉంటే ఆనందిస్తాను.

### హస్తినాపుర ప్రవేశం

శ్రీకృష్ణుడు హస్తినాపురంలో అడుగు పెట్టే వేళకు దుర్యోధనుడు తప్ప మిగిలిన ప్రముఖులందరూ ఎదురు వెళ్ళి స్వాగతం పలికారు. అందరినీ చిరునవ్వుతో చూస్తూ వాసుదేవుడు సభాభవనం ప్రవేశించాడు. భీష్మపితామహులకు అభివాదం చేశాడు. అందరితో బంధుమర్యాదలు నడిపించాడు. విదురుని వెంట అతని గృహానికి వెళ్ళాడు. విదురుడు పాండవుల యోగక్షేమాలు విచారించాడు.

### రాయబారం

సభాభవనంలో అడుగు పెట్టి ఉచితాసనం పై కూర్చున్నాడు శ్రీకృష్ణుడు. గంభీర స్వరంతో శ్రీకృష్ణుడు "ధృతరాష్ట్ర మహారాజా! కురు పాండవులూ వారి బంధుమిత్రులూ సుఖసంతోషాలతో జీవయాత్ర సాగించటానికి అనుకూలమైన శాంతిని ప్రసాదించమని అడగటానికి వచ్చాను. ఇంతకంటే సర్వజనుల శ్రేయస్కరమైనది లేదని నీకు నేను వేరే చెప్పవలసిన పనిలేదు.

పిల్లలు అన్యాయాలు, అక్రమాలు, చేస్తున్నారేమో గ్రహించి వారిని సరైన దారిలో పెద్దల మన బాధ్యత. అలా కాకుండా వాళ్ళు మనకళ్ళ ఎదుటనే దుర్మార్గపు పనులు చేస్తుంటే వెంటనే వారిని దండించి మంచి బుద్ధి చెప్పాలని నీకు తెలుసు.

నీ కుమారులు ఇంతకాలంగా సాగించిన అత్యాచారాల ఫలంగా ఘోరవిపత్తు నీ నెత్తిమీద పడనున్నది. ఇప్పటికైనా నువ్వు మేలుకొని వారిని సక్రమ మార్గాన నడపకపోతే సర్వనాశనం తప్పదు.

నువ్వు తలచుకుంటే రెండు కుటుంబాలు హాయిగా జీవించగలవు. నువ్వు నీ కుమారులను అదుపులో పెట్టు. పాండవులను నేను సరిగ్గా సక్రమ మార్గంలో నడిపిస్తాను. పాండవులతో స్నేహంగా ఉంటే, వారు మీ అందరినీ మర్యాదగా చూస్తూ రక్షించగలరు. ఆ రోజు మీ మీద కత్తి దూయగల వారుండరు. అందువల్ల పాండవుల కంటే మీకే మేలు ఎక్కువ జరుగుతుంది. కాదంటావా? యుద్ధం జరుగుతుంది. రెండు వైపులా నాశనం, నీకు సంతాపం, మీకు వార్ధక్యం వచ్చిన ఈ సమయంలో ఎందుకీ దురవస్థలో చిక్కుకోవటం.

**"పిల్లలను సన్మార్గంలో, శీలవంతులుగా ధర్మపరాయణులుగా తీర్చి దిద్దటం తండ్రి బాధ్యత గదా! అని శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రునికి గుర్తుచేశాడు. తండ్రి పట్టించుకోక పోతే, తండ్రికి చెడ్డపేరు వస్తుంది, కుటుంబానికి చెడ్డపేరూ, వంశం అప్రతిష్ఠపాలు కావటం తథ్యం" తండ్రి మాట వినకపోతే చివరకు ఫలితా లెలా ఉంటాయో మహాభారత వంశనాశనం జరగటం తెలిసింది కదా! ఇకనైనా ప్రజలు ధర్మం, సత్యం తెలుసుకోవాలి.**

పాండవుల యందు పుత్రవాత్సల్యం చూపి వారి రాజ్యభాగం, లేకపోతే అయిదు ఊళ్ళిచ్చినా చాలునని ధర్మరాజు ప్రార్థిస్తున్నాడు. ఈ రోజు వరకు వారికి మీ వారు చేసిన అవమానాలు, కలిగించిన కష్టాలు మరచిపోయి సంధికే వారు అంగీకారం తెలుపుతున్నారు. బాగా ఆలోచించి శాంతికోసం కృషి చేయండి" అన్నాడు శ్రీకృష్ణుడు. తరువాత నారద, పరశురామ, కణ్వమహర్షులు దుర్యోధనునికి హితబోధ చేశారు. ద్వేషంకంటే శాంతం ఎంత లాభమో వివరించారు.

ధృతరాష్ట్రుడు తన నిస్సహాయతను తెలిపి చింతించాడు. శ్రీకృష్ణుడు దుర్యోధనునికి తగిన విధంగా సలహా ఇచ్చాడు. శాంతికోసం ప్రయత్నించమని హితవు పలికాడు.



భీష్మపితామహుడు, ద్రోణుడు, విదురుడు గూడ దుర్యోధనుణ్ణి, శ్రీకృష్ణుడు చెప్పిన విధంగా నడుచుకోమని హితవు చెప్పారు. తరువాత ధృతరాష్ట్రుడు "నాయనా! ఇంతమంది పెద్దలు వాసుదేవుని హితాన్ని సమర్థిస్తున్నారు. నేను కూడా ఆ దారినే నడుచుకోవలసిందిగా చెపుతున్నాను. అదే శ్రేయస్కరం" అని సలహా ఇచ్చాడు.

అందరి ఉపదేశాలు విని దుర్యోధనుడు "కృష్ణా! పాండవపక్ష పాతంతో సాగిన నీ ప్రసంగం నన్ను దోషిగా చూపించింది. నాకు భయం కలిగించి, మీ పని నెరవేర్చుకోటానికి ఉపయోగపడేలా ఉంది. ఇక్కడి పెద్దలు గూడ అదే ధోరణిలో ఉన్నారు. ఎంత ఆలోచించినా నేను చేసిన నేరమేమిటో నాకు తెలియదు.

**వీరుడైనవాడు యుద్ధరంగంలో మరణానికి వెనుకడుగు వేయడు. పర్యవసానంగా నేను పాండవులకు సూదిమొన మోపిన నేల అయినా విడిచిపెట్టేది లేదు.**

అందుకు సమాధానంగా శ్రీకృష్ణుడు "చాల సంతోషం, అయితే యుద్ధభూమిలో ప్రాణాలు వదలటానికే సిద్ధంగా ఉండు. 'పాండవులకు చేసిన ద్రోహమేమిటని' అడుగుతున్నావు. వారి సిరిసంపదలు చూచి ఓర్వలేక మాయచేసి హరించటానికి జూదం సాగించటం ద్రోహం కాదూ!

- అన్నగారి భార్య అనే ఆలోచన లేకుండా నిండు సభలో ద్రౌపదికి చేసిన అవమానం, మాట్లాడిన దుర్భాషలు అక్రమాలూ కావా?
- పాండవులు అరణ్యవాసానికి వెళ్తుంటే కర్ణదుశ్శాసనులతో కలిసి మీరాడిన అపహాస్యం అంతా ధర్మపరుడెవడైనా సహించగలడా?
- బాల్యంలో వారిని వారణావతానికి పంపి లక్క ఇంట్లో పెట్టి నాశనం చెయ్యటానికి పథకం వేయలేదూ?

♦ విషం కలిపిన అన్నం పెట్టి, పాములతో కరిపించి నదిలో పడవేసి భీముని చంపటానికి ఎత్తులు వేయలేదూ?

ఈ విషయాలన్నీ ఎవరికి తెలియదు? ఈనాడు వారి రాజ్యం వారికివ్వటానికి అంగీకరించకపోవటం ఏం న్యాయం. నేడు కాకపోతే రేపు యుద్ధభూమిలో రక్తపు మడుగులో నువ్వు గిలగిల తన్నుకునే రోజున వారి రాజ్యం వారు తీసుకొంటారు" అని అన్నాడు.

**భీష్ముడు "ధృతరాష్ట్రా! వీణ్ణి రాజసింహాసనం ఎక్కించగలవు. కాని దానికి తగిన సత్ప్రవర్తన ఎక్కడ నుంచి తేగలవు? అన్నాడు.**

**దేశంలో ఒకసామెత ఉంది. అది "పిల్లల్ని కన్నాంగాని, వారి రాతల్ని కన్నామా?" అలాగే ధృతరాష్ట్రుడు నూర్గురు కొడుకులను కన్నాడు గానీ, వారి రాతల్ని, భవిష్యత్తుని కనలేదు గదా! ఎవరి కర్మను వారనుభవించక తప్పదు.**

**శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రునితో "మహారాజా! వంశరక్షణార్థం వ్యక్తినీ, గ్రామశ్రేయస్సుకోసం కులాన్నీ, దేశకళ్యాణానికి గ్రామాన్ని, ఆత్మశాంతికి భూమండలాన్నీ విడిచి పెట్టాలని నీతికోవిదులు చెబుతున్నారు. అందుచేత మీ వంశ రక్షణకోసం దుష్టులను పారద్రోలండి" అని సలహా ఇచ్చాడు.**

### గాంధారి బుజ్జగింపు

ఇంతలో గాంధారి వచ్చి "నాయనా దుర్యోధనా! నీ శ్రేయస్సు కోరి భీష్మ, ద్రోణ, కృప, విదురాదులు చెప్పిన హితవు విని నడచుకోవాలి. ఇంద్రియాలను అదుపులో పెట్టగల శక్తిమంతులే రాజ్యపాలనకు అర్హులు. పాండవులు వీరులు, జ్ఞానులు, ఇంతే కాక వీరందరూ ఏకాభిప్రాయంతో ఉన్నారు. కృష్ణార్జునులు అజేయులని మన పెద్దలందరూ చెబుతున్నారు". అని కుమారునితో బుజ్జగింపు మాటలు పలికింది.



ఇంకా గాంధారి కొడుకుతో "నువ్వు కోపాన్ని విడిచి వారి రాజ్యం వారికిస్తే నీ శత్రువులను కూడా వారు సంహరించి సుఖశాంతులు కలిగిస్తారు. నీ రాజ్యభాగంతో నువ్వూ, నీ మంత్రులూ భోగభాగ్యాలతో తులతూగవచ్చు. పదమూడు సంవత్సరాలు వారికి కలిగించిన కష్టాలు చాలు. ఈనాటికీ వారిని జయించే శక్తి నీకు లేదు. భీష్మ ద్రోణులు మనతో జీవితం సాగిస్తున్నారు. కనుక ఆ దృష్టితో యుద్ధం చేస్తారే తప్ప వారు ధర్మ విరుద్ధంగా నడుస్తారని అనుకోకు.

ఎటు ఆలోచించి చూచినా పాండవులతో సంధి నీకు మేలుచేస్తుంది. నీ పరివారానికి, బంధువులకు, ప్రజలకూ శ్రేయస్కరం అని మరువకు" అన్నది గాంధారి.

తల్లి మాటలు గూడ పెడచెవిన పెట్టి దుర్యోధనుడు సభామండపం విడిచి దుష్ట చతుష్టయంతో వెళ్లి శ్రీకృష్ణుని తాళ్లతో బంధించడానికి ప్రయత్నించాడు. ధృతరాష్ట్రుడు, విదురుడు ఇద్దరూ దుర్యోధనుణ్ణి మందలించి మనసు మార్చలేకపోయారు.

### శ్రీకృష్ణుడి విశ్వరూపం

శ్రీకృష్ణుడు "దుర్యోధనా! ఒక్కసారి నీ కళ్ళు తెరచి ఇటు చూడు, అంటూ తన విశ్వరూపం చూపించాడు. ఆ సమయంలో దివ్యకాంతులతో దేవగణాలు, రుద్ర, ఆదిత్య, వసు, మహర్షి గణాలు, పాండవయోధులూ, ప్రజాపతి కనుపించారు. అక్కడి రాజులందరికీ విద్యుత్‌లాంటి దేదీప్యమానంగా ప్రకాశించే కాంతిని చూచే శక్తిలేక కళ్ళు మూతలు పడ్డాయి. భీష్మ, ద్రోణ, విదుర, సంజయులు మాత్రం ఆ విశ్వరూపాన్ని వాసుదేవుని అనుగ్రహం వల్ల చూడగలిగారు.

అది గ్రహించి ధృతరాష్ట్రుడు తనకు కూడా ఆ రూపాన్ని దర్శించే అవకాశం కల్పించమని కోరగా, కృష్ణుడు ఆయనకు నేత్ర దానం చేశాడు.

క్షణంలో శ్రీకృష్ణుడు వెలుపలికి వచ్చి సిద్ధంగా ఉన్న రథం వద్దకు వస్తుండగా, ధృతరాష్ట్రుడు వెనుకనే వచ్చి "కృష్ణా! నా కుమారులమీద నా అధికారం ఎలా ఉన్నదో చూచావు గదా! ఇంక నా దోషం ఏమీ లేదని నీవు అంగీకరిస్తావా!" అన్నాడు.

ఆ మాటలు విని వాసుదేవుడు అచట వున్న పెద్దలందరిని ఉద్దేశించి "మీరంతా విన్నారు కదా! ఇంకనేను పాండవులతో చర్చించి అనంతర కర్తవ్యం నిర్ణయించాలి. నాకు శెలవివ్వండి" అన్నాడు, ఇది శ్రీకృష్ణుని రాయబారం.

♦ **పాండవులు, కౌరవులు ఉభయుల మధ్య సఖ్యత, స్నేహభావం కుదిర్చి వంశ గౌరవం కాపాడాలని ద్రుపద పురోహితుడు, సంజయుడు, శ్రీకృష్ణుడు రాయబారాలు సాగించారు. సంధి కుదిరితే పొందు లాభాలు, యుద్ధం అనివార్యమైతే కలిగే నష్టాలు, నాశనం, హింస మొదలైనవి వివరంగా వారందరికి చెప్పారు. పాండవులు శాంతి సుఖాలు కోరుకున్నారు. కౌరవులు మొండిగా, మూర్ఖత్వంతో సూది మొనంత భూమినైనా ఇవ్వనని పట్టుపట్టారు. పెద్దలూ చెప్పారు. తల్లి గాంధారీ చెప్పింది. ఎవరు చెప్పినా కౌరవులు వినలేదు.**

♦ **రెండు కుటుంబాలమధ్య సత్సంబంధాలు, సన్నిహిత సంబంధాలు నెలకొల్పి వసుధైక కుటుంబం స్థాపించాలని అందరి లక్ష్యంగా వుంది.**

♦ **రాజ్యకాంక్ష, పదవీకాంక్ష, సంపదమీద ఆసక్తి వల్ల కుటుంబ సంబంధాలు దూరమై, వారి మధ్య శత్రుత్వం పెరిగింది.**

♦ **ధర్మాన్ని ఆచరించే వారికి, అధర్మాన్ని కోరుకునే వారికి మధ్య కలహాలు ఉంటాయని గమనించాలి. ధర్మాత్ములకు దైవం తోడు ఉంటుందనీ, అధర్మపరులకు వారి చెడుపనులే వారి వెంట ఉంటాయి. ధర్మపరులకు విజయం, సుఖం, అధర్మపరులకు వంశ విచ్ఛిన్నం, జననష్టం, దుఃఖం కలుగుతుందని పెద్దల సందేశం.**



## శ్రీకృష్ణ-పాండవుల సంభాషణ

హస్తినాపురం నుండి తిరిగి వచ్చిన రాయబారి శ్రీకృష్ణుడు ఉపప్లావ్యంలోని పాండవులకూ, వారి ఆప్తులకూ విశేషాలన్నీ వివరించాడు. **"తాను పట్టిన కుందేటికి మూడే కాళ్ళు"** అనుకునే మూర్ఖుడు దుర్యోధనుడు. యుద్ధానికే సిద్ధంగా ఉన్నాడు. దండనీతి తప్ప మార్గంలేదు. కనుక మనం మన సన్నాహాలు ప్రారంభించాలి, అన్నాడు కృష్ణుడు.

అప్పుడు ధర్మరాజు తన సోదరులతో, ఆప్తులతో, సంప్రదించి ద్రుపద, విరాట, శిఖండి, సాత్యకి, చేకితాన, భీమసేనులను అక్షౌహిణి పతులుగా, దృష్టద్యుమ్నుని సర్వసేనాపతిగా నియమించాడు.

## సమరాంగణం

కురుక్షేత్ర సమీపాన హిరణ్యానదీ తీరంలో పాండవసేన శిబిరాలు నిర్మించింది.

కురుసేనకు అధిపతిగా భీష్ముణ్ణి అభిషేకించారు. కృతవర్మ, శల్యుడు, భూరిశ్రవసుడు, సుదక్షిణుడు, జయద్రథుడు, నీలుడు, విందానువిందులు, త్రిగర్త సోదరులు, బృహద్బలుడు వీరందరూ అతిరథులు. దుర్యోధనుడూ అతని సోదరులు నూర్గురూ కృప, ద్రోణుల శిక్షణలో ఆరితేరిన రథికులే.

పాండవులు, కౌరవులు ఒకరి బలాలు ఒకరు అంచనా వేసుకున్నారు.

యుద్ధ భేరి మ్రోగింది. పదునెనిమిది రోజులు రెండు కుటుంబాల మధ్య భీకరపోరాటం జరిగింది. జన నష్టం, ఆస్తినష్టం, వంశ గౌరవం నేలకూలాయి. అంతా విషాదం. దుఃఖమయం. బంధువులు తగ్గి పోయారు. కౌరవవంశంలోని స్త్రీలంతా వైధవ్యం పొందారు.

అధర్మం నశించింది. అవినీతి బీటలు బారింది. ధర్మం గెలిచింది, ధర్మాత్ములు విజయం సాధించారు ధర్మపతాకం రెపరెపలాడింది. పాండవులు రాజ్యాన్ని సంపాదించుకున్నారు.

యుద్ధ సమయంలో భీష్ముడు, శ్రీకృష్ణుడు మానవజాతి కందించిన సందేశం యుగ యుగాలకు శాశ్వతంగా నిలిచాయి. అవి ఈ సందర్భంలో తెలుసుకుందాం. మహాభారతకాలంలో రాజ్యపాలన ఏవిధంగా సాగింది? ప్రజలకు – రాజులకు మధ్య సంబంధాలు ఎలా వుండేవి? మొదలైన విషయాలు గూడ ఈ సందర్భంగా గుర్తుతెచ్చుకోవాలి.

## గీతామకరందం

**"భారతామృతసర్వస్వ గీతయామథితస్యచ**
**సారమద్ధృత్య కృష్ణేన అర్జునస్యముఖే హుతమ్" ॥** (భీష్మ పర్వం)

భారతమను అమృతరాశియొక్క సర్వస్వమైన గీతను శ్రీకృష్ణ పరమాత్మ మథించి దాని సారాన్ని తీసి అర్జునుని ముఖంలో విన్యసింపజేశాడని పై శ్లోకానికి అర్థం.

వేదాలసారమే ఉపనిషత్తులు. ఈ ఉపనిషత్తులసారమే భగవద్గీత. సర్వ శాస్త్రమయమైనదీ భగవద్గీత. విశ్వవాఙ్మయ మంతటిలోను శ్రీమద్భగవద్గీత వంటి గొప్ప గ్రంథం మరొకటి లేదు. ఇదియే భారతీయ సంస్కృతికి మణిదీపమై అలరారుతూంది. గీత మంత్రమయం.

శ్రీకృష్ణుడు భగవత్స్వరూపుడుగా, జగద్గురువుగా పూజించటం ద్వాపరయుగం నుంచి వస్తున్నది. ఆయన ఇచ్చిన సందేశాన్ని దాటిపోకూడదని అర్థం. సందేశమనే గీతను దాటకుండా ఆ పరిధిలోనే సందేశాన్ని తు.చ. తప్పకుండ ఆచరించినపుడు మానవుడు పరిపూర్ణుడవుతాడు, స్థిత ప్రజ్ఞుడూ అవుతాడు. గీతా సందేశాన్ని మకరందంగా గ్రోలి మనస్సులో జీర్ణం చేసుకొని ఆచరించినవాడే భయం, ఆందోళన, సోమరితనం విడనాడాలి. సద్గుణాలు, సలక్షణాలు కలిగివుండాలి. వృత్తి ధర్మాన్ని పాటించటం మొదలైన సద్విషయాలు తెలుసుకోవాలి. మానవ జీవితం ధర్మమార్గంలో నడిపించటానికి సాధ్యపడుతుంది.



మానవజాతికంతటికీ మార్గనిర్దేశం చేసే మహోన్నతమైన పవిత్ర గ్రంథంగా భగవద్గీత శాశ్వత ముద్ర సంపాదించుకుంది. పాశ్చాత్యులు కూడా ఈ గ్రంథాన్ని వారి మాతృభాషలోకి అనువదించి, పరిశోధించి, సారాంశాన్ని అర్థం చేసుకొని మకరందంగా ఆస్వాదిస్తున్నారు. విదేశీయులు భగవద్గీతను **"మేనేజ్‌మెంటు గురువు"**గా అభివర్ణించారు. ముఖ్యంగా సింగపూర్, చైనా దేశాలు భగవద్గీతను అధ్యయనం చేశాయి.

గీతలోని అంతస్సందేశాలను ఆకళింపు చేసుకుంటే ''మనుష్య లక్షణం"గా చెప్పిన ఆచరణ మనకూ అలవడుతుంది. మనమూ మంచి మనుష్యులం కాగలుగుతాం. చీలికలుగా, మనస్పర్థలతో, విడిపోతున్న మానవసమాజాన్ని ఛిద్రమైన వస్త్రం కాకుండా ఒకటిగా చేసి ప్రకాశింప చేయకలుగుతాం! ఈ లక్ష్యంతో శ్రీకృష్ణుడు బోధించిన సందేశమే గీతామకరందం.

## భీష్ముని ధర్మసూక్ష్మాలు

కురుక్షేత్ర సంగ్రామంలో విజయం సాధించారు పాండవులు. ఉత్తరాయణ ప్రవేశంకోసం అంపశయ్యపై శయనిస్తున్న కురువృద్ధుడు, జ్ఞాన వృద్ధుడు, పితామహుడైన భీష్మాచార్యుల వారిని చూడటానికి శ్రీకృష్ణునితో వెళ్ళారు. భీష్మాచార్యులను సమీపించి ఆయనకు పాదాభివందనం చేశారు పాండవులు.

వెంటనే శ్రీకృష్ణుడు "కురువంశ శేఖరా! ఇప్పుడు నువ్వు ధర్మరాజుకు పరమధర్మాలు వివరించాలి" అనగా, భీష్ముడు "వాసుదేవా! పరిహాసమా ఇది! కాకపోతే నీవుండగా నేను వారికి ధర్మ సూక్ష్మాలు చెప్పటం ఏమిటి? అన్నాడు.

పితామహా! కీర్తిని మూటగట్టుకోవాలని ఆశ, కోరిక నాకు లేవు. సర్వధర్మాలు నీ సమక్షంలో వినిపించి నీ యశోదేహం ముల్లోకాలలో విహరింపచేయాలని నా కోరిక" అన్నాడు వాసుదేవుడు.

## వాత్సల్యంతో ధర్మజుణ్ణి

భీష్ముడు చేయి చాపి ధర్మరాజును వాత్సల్యంతో దగ్గరగా తీసికొని నాయనా! నీ సందేహాలు అడుగు. వెంటనే ధర్మరాజు "తాతా! మిమ్ము చూస్తుంటే ఏమి అడగాలో తెలియడం లేదు. మాకు ఏవి అవసరమో అవి మీరే చెప్పండి, అని వినయంగా తలవంచాడు.

♦ నాయనా! రాజ్యపాలనం కత్తి మీద సాము వంటిది. నీవు క్షమా శీలంతో ఉంటే మావటివాడు ఏనుగు మీదకెక్కి అంకుశంతో పెత్తనం చేసినట్లు, ప్రజలు ప్రభువు మీద పెత్తనం చేస్తారు. నువ్వు మరీ క్రూరంగా ఉంటే క్రూరమృగాన్ని హింసించినట్లు హింస పెడతారు.

అందుచేత వసంతఋతువులో సూర్యునివలె చురుక్కుమనిపించి, చల్లదనం ఇవ్వాలి. ఆ ఋతువులో ఎండచురుకు తగ్గితే మళ్ళీ వానలుండవు కదా! అని దీని అర్థం.

♦ గర్భవతి అయిన స్త్రీ తన లోపలి బిడ్డ ఆరోగ్యం మనసులో ఉంచుకొని, ఆహార విహారాలు సాగించేటట్లు, ప్రభువు ప్రజల కష్టసుఖాలు తెలిసి ప్రవర్తించాలి. రాజ్య పాలనకూ, ధర్మ సాధనకూ అవశ్యమైన అర్థాన్ని అతి చాకచక్యంతో ఆర్జించాలి. పులి పిల్లలను తిన్నట్లు ప్రజలను పన్నుల పేరిట ఒక్కసారి కబళించగూడదు. పశువు శరీరం మీద చేరిన జలగలా ఎప్పటికెంత అవసరమో అంతంత గ్రహిస్తుండాలి.

♦ ఎన్ని అడ్డంకులున్నా "ప్రజాభిమానం" కోలుపోకూడదు. సేవకులను వంచించకూడదు. వారికి మనస్సు తెలియనివ్వకుండా వారి రక్షణ భారం వహించాలి. ఇంద్రియాలను నిగ్రహించాలి. పాము కుబుసం విడిచేటట్లు కోరికలను విసర్జించాలి. ఆశ్రితులలో, అమాత్యులలో, నీ వారెవరో విద్వేషులెవరో గ్రహించాలి. రాజ్యంలో మానవ సంబంధాలు పెంచుకోవాలి.



పితామహా! ఎన్నో ధర్మసూక్ష్మాలు మీ నుంచి విన్నాను. అయినా నా మనస్సు శాంతించలేదు. నానా దేశాధిపతులను సంహరించాను. ఆత్మీయులను, గురువులను, ఆప్తులను సంహరించాను. ఈ హింస నన్ను బాధిస్తున్నది. దుర్యోధనుని లోభం నాకు ఆగ్రహం కలిగించింది. ఆ కారణం చేత ఇంత ఆఘాయిత్యం జరిగింది అన్నాడు ధర్మరాజు.

భీష్ముడు నవ్వి, ధర్మనందనా! ఎవరి మరణానికి ఎవడూ కారణం కాడు. కర్త కాడు. ఎవడి కర్మ ఫలం వాణ్ణి అలా తీసుకుపోతుంది. అంతే! దానికి విచారించాల్సిన అవసరం లేదు. దేనికైనా దైవ ప్రయత్నమూ, పురుష ప్రయత్నమూ ఉంటాయి. దైవం బీజం, మానవ ప్రయత్నం క్షేత్రం. క్షేత్రం చవుడు అయితే బీజం ఫలించదు కదా! మానవ ప్రయత్నమనే కర్మ జరగకుండా బీజం ఫలించదు సుమా! నేలను బాగా దున్ని చదును చేసి, నీరు పడితేనే బీజం ఫలించేది. హేమాహేమీలంతా అనుసరించిన ధర్మమార్గంలో నీ కర్మ నువ్వు చేస్తేనే ఫలితం లభించేది.

♦ దేన్ని మనం ఆశ్రయించుకొని ఉంటామో దాన్ని ఎప్పుడూ విడవకూడదు. వేద వేద్యుడైన పరమపురుషుని ఆరాధిస్తూ ఆయన అనుగ్రహం పొందటానికి నిరంతరం కృషి చెయ్యాలి.

♦ ఎప్పుడు శుచిగా ఉండాలి. నిత్యసత్యం పలుకుతుండాలి. సోమరి కాకుండా నిరంతరం వ్యవసాయం సాగిస్తుండాలి. విద్యాజ్ఞానం సంపాదించాలి. దాన ధర్మాలతో అందరినీ సంతృప్తిపరచాలి. సత్కర్మలు చేసేవారి యింట లక్ష్మి శాశ్వతంగా నివసిస్తుంది.

♦ కృతఘ్నుడూ, క్రూరుడూ, నాస్తికుడూ, లక్ష్మికి శత్రువులు. వీరే కాదు నిరంతరం భర్తకు ఎదురు సమాధానం చెబుతూ, గయ్యాళియై, ఎల్లవేళలా, యిరుగు పొరుగు ఇళ్ళల్లో వుంటూ, అవకాశం కలిగినప్పుడల్లా చెంగు పరచి నిద్రకు వాలే ఇల్లాలున్న ఇంట్లో లక్ష్మి నిలువదు.

♦ తాతా! అర్థ విషయం చెప్పారు కనుక కామం విషయం గురించి గూడ వివరించండి అని ధర్మరాజు అడిగాడు.

ధర్మరాజా! కామ సేవనంలో స్త్రీకి కలిగే సుఖం పురుషునికి ఉండదు. అయితే కామంతో మనస్సు నిండిన స్త్రీకి మంచి చెడూ విచక్షణ ఉండదు. ఆ సమయంలో ఆమె చెయ్యని సాహసం ఉండదు. అందువల్ల ఆ విషయంలో నిగ్రహం వున్న స్త్రీని పతివ్రతగా ఆరాధించాలి.

♦ ఇక దానం విషయం- అయినవాడూ, కానివాడూ, దానానికి అర్హుడు కాడు. శ్రద్ధతో వేదవిద్య నభ్యసించి, విధ్యుక్త కర్మలాచరించే ధర్మ పరునికే దానం చెయ్యాలి. దేవీభాగవతంలో మణిద్వీపవర్ణన చదివితే ఉన్న దోషం కాస్తా పోతుంది.

♦ వేద, పురాణ, శాస్త్ర పఠనం చేసినా, ఉత్తమవంశంలో జన్మించినా ప్రయోజనం లేదు. మనిషికి అన్నిటినీ మించినది శీలం. శీలం లేనివాడికి ఇహ పరాలలో సుఖసంతోషాలు లేవు. అలానే పతివ్రతయైన భార్యవల్ల లోకంలో పురుషుడు ఖ్యాతి పొందుతాడు.

♦ నాయనా! ధర్మనందనా! అన్ని దానాలలో భూదానం ఉత్తమమైనది. శాంత చిత్తంతో జీవిస్తూ యజ్ఞ యాగాది క్రతువులు, సత్కార్యాలు చేసే విద్వాంసుని మనంతట మనం పిలిచి భూదానం చెయ్యాలి. ఈ భూమి రత్నగర్భ కనుక భూదానం వల్ల సర్వరత్న, మణి, సువర్ణ దానాలు చేసిన ఫలం లభిస్తుంది. అంతకంటే గొప్పదైనది అన్నదానం, ఆకలి గొన్న వానికి కడుపునిండా భోజనం పెట్టటం కంటే పుణ్యకార్యం భూమిలో లేదు అని భీష్ముడు వివరించాడు.

♦ గురువుకంటే తండ్రి అధికుడు. తండ్రికంటే తల్లి అధికురాలు. అన్నగారు తండ్రితో సమానుడు. వదిన మాతృసమానురాలు. ఉపవాసాలూ, ఏకభుక్తాలూ, దేహం ఆరోగ్యంగా ఉండటానికి ఉపయోగపడతాయి. ఉపవాస దీక్షతో తపస్సు చేసినవాడు నూరు సంవత్సరాలు జీవిస్తాడు.



♦ మనస్సును ఏకాగ్రతతో ఇంద్రియాలన్నింటినీ నిగ్రహించి వేద విద్య అభ్యసించాలి. చిత్త శుద్ధితో పరంజ్యోతి ఉపాసన చేయాలి. అటువంటి వారికి ఉత్తమలోకాలు ప్రాప్తిస్తాయి, అని ఇతిహాస ప్రమాణాలతో ధర్మసూక్ష్మాలు విశదం చేశాడు గంగాపుత్రుడైన భీష్ముడు.

ఎన్నో ధర్మసూక్ష్మాలు, సూత్రాలు, నీతి వచనాలు విన్న తరువాత, ధర్మరాజు మనస్సుకు ఉపశమనం కల్గింది. హస్తినాపురం చేరి ధర్మబద్ధంగా రాజ్య పాలన చేయటం ప్రారంభించాడు.

తాత-మనవడి సంబంధాలు పూర్తిగా ధర్మంతోనే నిండి ఉన్నాయి. అందుకే ధర్మం గెలిచింది. **"ధర్మో రక్షతి రక్షితః"** అని వేద వచనం.

**భీష్ముడు - మానవసంబంధాలు**

భీష్మాచార్యునికి మానవులకు మరచిపోలేని సంబంధాలు ఈనాటికీ ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. భీష్ముని పేరును అనేక సందర్భాలలో మనుషులు గుర్తుకు తెచ్చుకుంటూంటారు. ఆ సంబంధాలేమిటో తెలుసుకుందాం.

**భీష్మ ప్రతిజ్ఞ**

మనకుటుంబాలలో తాత, ముత్తాతల పేర్లు తెలియని వారికి సైతం దశరథుడు, భీష్ముడు ఇతరుల పేర్లు బాగా తెలిసే ఉంటాయి. రామాయణ భారతాలకు ప్రపంచంలో వున్న ప్రచారం దీనికి కారణం. లోకంలో ఎవరైనా భీషణమైన శపథం చేస్తే దాన్ని **'భీష్మ ప్రతిజ్ఞ'** అని చెప్పటం జరుగుతుంది. ఆజన్మాంతం బ్రహ్మచారిగా ఉంటానని ప్రతిజ్ఞ చేశాడు భీష్ముడు. భీష్ముడు 170 సంవత్సరాలు జీవించాడని తేల్చారు.

**భీష్మ పంచకం**

మాసాలలో మాఘమాసానికొక ప్రత్యేకత ఉంది. మాఘ శుద్ధ సప్తమి మొదలు ఏకాదశి వరకు అయిదు రోజులనూ **'భీష్మ పంచకం'** అంటారు.

మాఘ శుక్ల ఏకాదశికి 'భీష్మ ఏకాదశి'గా పేరు వచ్చింది. దీన్నే కొన్ని గ్రంథాలు **'జయ ఏకాదశి'** గా చెప్పాయి.

భీష్ముడు తన పంచప్రాణాలల్లో మొదటిదాన్ని సప్తమినాడు, రెండోదాన్ని అష్టమి నాడు, మూడో ప్రాణం నవమితిథిలో, నాలుగోదాన్ని దశమిపూట, ఆఖరి ప్రాణాన్ని ఏకాదశినాడు విడిచిపెట్టాడని ప్రచారంలో ఉంది. అందుకే ఈ అయిదు రోజులను **'భీష్మపంచకం'**గా చెబుతారు.

ముఖ్యంగా సంతానం కోరేవారికి భీష్మాష్టమి చాల ముఖ్యమైన రోజు. ఈ రోజు తిలాంజలి సమర్పించి, భీష్ముణ్ణి స్మరించేవారికి సంతాన ప్రాప్తి కలుగుతుందని హేమాద్రి పండితుడు వర్ణించాడు. దీన్ని భీష్మపంచక వ్రతంగా ఆయన చెప్పాడు. భీష్మునికి తర్పణం ఆచరించి అష్టమినాడు శ్రాద్ధం పెడితే సంతానం కలుగుతుందని **'పద్మ పురాణం'** చెబుతోంది. సంవత్సర పాపం తొలగి పోవాలంటే ఆనాడు భీష్మునికి జలాంజలి సమర్పించాలని భారతం పేర్కొంది.

ఏది ఏమైనా ఒక ఏకాదశి పర్వదినాన్ని తన పేరుతో ముడిపడేలా చేసుకున్న ధన్యజీవిగా మానవాళి భీష్మ పితామహుణ్ణి మనసారా స్మరిస్తున్నారు.

### విష్ణుసహస్రనామం-ప్రజలలో చైతన్యం

భారతీయ వాఙ్మయంలో వేదాలు, ఉపనిషత్తుల తరువాత, అంతటి ప్రామాణికమైన గ్రంథాలు రామాయణ, భారత, భాగవతాలు. మానవులు నిత్యం పారాయణ చేసి తరించుటకు వీలుగా శ్రీమద్రామాయణం యుద్ధకాండలో **'ఆదిత్య హృదయం'** శ్రీమద్భారతంలోని అనుశాసనిక పర్వాన **'శ్రీవిష్ణుసహస్రనామస్తోత్రం'** వాల్మీకి, వ్యాసమహర్షులు వివరించారు.

మూలం : ధర్మరాజు భీష్మునివద్ద అనేక రాజనీతి ధర్మాలను తెలిసికొని, ఒకరోజు భీష్ముణ్ణి **"కోధర్మః సర్వధర్మాణామ్ భవతః పరమో మతః కిం జపన్ముచ్యతే జంతుః జన్మ సంసారబంధనాత్"** "సర్వ ధర్మాలలో గొప్పదైనది ఏది? ఎవరిని జపిస్తే సర్వజీవులకు తమ జన్మబంధాలను నుండి విముక్తి లభిస్తుంది?" చెప్పవలసిందిగా ప్రార్థించాడు. అందుకు సమాధానంగా భీష్మాచార్యులు ధర్మరాజుతో



**"జగత్ప్రభవం, దేవ దేవం – అనన్తం పురుషోత్తమమ్ ।**
**స్తువన్నామ సహస్రేణ – పురుషస్సతతోత్థితః ॥**

పదునాలుగు లోకాలకు ప్రభువు, దేవతలకే దేవుడు, ఆది, మధ్య, అంతంలేనివాడు, పురుషులలో ఉత్తముడు అయిన శ్రీమహావిష్ణువు సహస్రనామాలు స్తుతించిన జీవులు సంసార సముద్రంనుండి తరింపబడుతారని" వివరించాడు. "ఈ విష్ణుసహస్రనామాలన్నీ ఋషులచే కీర్తింపబడినవే. వానిని నేను ఒక మాలగా కూర్చి నీకు వివరించాను" అని భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు.

### పారాయణ ఫలం

విష్ణుసహస్రనామస్తోత్రం చాలా మహిమాన్వితమైనది. ఆ స్తోత్ర ప్రారంభంలో స్తోత్రాన్ని నిత్యం చదివిన లేక వినిన వారిలో బ్రాహ్మణులకు వేదాంత జ్ఞానం, క్షత్రియులకు యుద్ధంలో జయం, వైశ్యులకు ధన సమృద్ధి, శూద్రులకు సర్వ సుఖాలు లభిస్తాయని భారతం హితవు పలికింది. అంతేగాక కోరిన కోరికలు నెరవేరుతాయని హితవు పలికాడు. రోగం, భయం, ఆపదలనుండి రక్షింపబడుతారు. యశస్సు, శ్రేయస్సు లభిస్తాయి. తేజోవంతులవుతారనియు మరియు సర్వపాపాలనుండి ప్రక్షాళన పొంది శుద్ధులై సనాతన బ్రహ్మాన్ని చేరెదరనియు (మోక్షాన్ని పొందుతారు) స్పష్టంగా తెలుస్తోంది.

**భీష్మునికి మానవులకు గల సంబంధాలు అనిర్వచనీయమైనవి, శాశ్వతమైనవి. నాటికీ, నేటికీ, ఏనాటికీ ఆయన ఆదర్శపురుషుడే మానవాళికి.**

## ప్రజలు-ప్రభుత్వాలు-ప్రజాసంబంధాలు

మహాభారత కాలం నాటి ప్రజలు – ప్రభుత్వాలు ఏ విధంగా సత్సంబంధాలు కలిగివున్నారు? ప్రజల మేలుకోరి రాజులు చేసిన ఉపకారాలు, పరిపాలనా వ్యవహారాలు గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. భారతం విజ్ఞాన సర్వస్వంగా రూపొందింది. మహాభారతకాలాన్ని అధ్యయనం చేస్తే ఎన్నో మంచి విషయాలు, ధర్మసూత్రాలు, నీతి సందేశాలు, రాజనీతి తెలుసుకోవచ్చు. ఆనాటి పరిపాలనా సౌకర్యాలు, సౌలభ్యాలు ఈ కాలానికి ఎంత వరకు ఉపయోగిస్తాయో పరిశీలించి ఆచరించాలి. ఆచరణాత్మకమైన సంక్షేమ రాజ్య లక్షణాలు భారతకాలంలో కనిపిస్తాయి. భారతకాలమంతా ప్రజాస్వామ్య పాలనగానే పరిఢవిల్లింది.

### 1. వ్యవసాయం - వృత్తులు

వ్యవసాయం, పశుపోషణ, భారతకాలం నాటికి ముఖ్యమైన వృత్తులుగా వున్నాయి. రైతుల విషయంలో పాలకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని భారతం చెబుతోంది. ధర్మరాజును నారదుడు అడుగుతాడు "నీరాజ్యంలో రైతులు ఆనందంగా వున్నారా? రైతు ఆనందంగా వుంటే రాజ్యం శాంతంగా వుంటుందని వారి సిద్ధాంతం. పంటలు, చెఱువుల పై ఆధారపడి వున్నాయి. పంటలు దైవ సమానాలు. చెఱువులు మొదలైన నీటి వనరులు కల్పించటం రాజు విధి. సప్త సంతానాలలో చెఱువు త్రవ్వించటం ఉంది. అది పుణ్య హేతువు.

ప్రతి గ్రామంలోనూ శూరులు, బుద్ధిమంతులు, కార్యశూరులు వున్నారు. వారి చేత, పంచాయితీలు ప్రజల శ్రేయస్సుకోరి, ధర్మంగా గ్రామ పాలన సాగించేవి. సీమవర్తి గ్రామాల స్థితి గతులు తెలుసుకోవటానికి సైనికులు, అధికారులు తరచుగా సందర్శిస్తూ వుండేవారు.



ఈ రక్షణ వ్యవస్థ సమర్థంగా పనిచేయాలని మహాభారతం చెబుతోంది. అరణ్యపర్వం, ఘోషయాత్రాఘట్టంలో ఆవులకు, దూడలకు సంఖ్య గుర్తువేసేవారని పేర్కొనబడింది. లక్షల సంఖ్యలో ఉండేవి ప్రభుత్వ పశువులు. వాటి లెక్క రాజుకు ముఖ్య అవసరం. చెట్లు నాటించటం, ఉద్యానవనాలు నిర్మించటం ప్రజా క్షేమం కోసమే. ప్రజలకు అల్పాదాయ మార్గాలను, పర్యావరణ రక్షణకు ఇవి ఉపయోగపడేవి.

దున్నటం, విత్తడం లేని భూములకు పన్ను విధించే పద్ధతి రామాయణం కాలం నుండి లేదు. చిక్కి కృశించిన పశువులను, రైతులు పోషించలేని వానిని రాజే భరించాలి. సుమారు నెలరోజులదాకా దూడలు తల్లిపాల మీదనే ఆధారపడతాయి. ఆ తరువాత గడ్డికి అలవాటుపడతాయి. అప్పటిదాకా ఆవుల నుండి పాలు పిండటం నిషేధం.

### 2. వ్యాపారము, పన్నులు

దేశ, విదేశ వ్యాపారాన్ని మహాభారతకాలంలో రాజులు ప్రోత్సహించారు. రాజు తన రాజ్యంలోని వ్యాపారులకు రక్షణ కల్పించి, అందుకు ప్రతి ఫలంగా పన్నులు స్వీకరించేవాడు. వ్యాపారం ఆనాడు వస్తు వినిమయ పద్ధతిలో జరిగినట్లు కనిపిస్తుంది. నాణెములు చలామణి గురించి ప్రస్తావించలేదు. విదేశీ వ్యాపారుల నుండి క్రమబద్ధమైన రీతిలో పన్ను వసూలు చేయాలి. అధికంగా పన్నులు వసూలు చేయటం ఆర్థిక వ్యవస్థకే చెడు తెస్తుందని సభాపర్వంలో చెప్పటం జరిగింది.

ఆకస్మికంగా ధనవంతులైనవారు రాజ్యంలో ఉంటే ఆ ధనం వారికి ఎలా వచ్చిందో రాజు తెలుసుకోవాలి. ప్రస్తుతం ప్రభుత్వోద్యోగులు ప్రభుత్వానికి, వారు ఏమైనా ఆస్తులు (స్థిర, చరాస్తులు) సంపాదిస్తే వాటిని వార్షిక నివేదికల ద్వారా తెలియపర్చాలనే నిబంధన నేటికీ వున్నది.

కఠిన పద్ధతిలో రాజు పన్నులు వసూలు చేయరాదు. పతితుడైన యజమానిని పురోహితుడు వదిలి పెడతాడు. కామాంధుడైన పురుషుని

భార్య అనాదరిస్తుంది. అధికంగా పన్నులు వసూలు చేసే రాజును ప్రజలు వదిలేస్తారు.

ప్రజలకు ఉపయోగపడే వస్తువులను తెచ్చి అమ్మే వ్యాపారులను రాజు గౌరవించాలి. వారిని రాజోద్యోగులు బాధించకుండా చూడాలి అని సభాపర్వం చెబుతోంది.

శిల్పులకు వస్తు సామగ్రి ఇచ్చి చాతుర్మాస్య దినాలలో పోషించాలి. లేకుంటే వారు దేశం వదిలి పోవటానికి అవకాశం ఇచ్చినవారౌతారు.

దీనిని సంక్షేమ రాజ్యం అంటారు. దేశానికి ఏదైనా అమంగళం జరిగితే రాజు సుఖభోగాలను అనుభవించకూడదు. ప్రజల మధ్యకు వెళ్ళి వారిని ఉత్సాహపరచి ప్రోత్సహించాలి. ప్రజలవద్దకు పాలన నిర్వహించేవారు.

చేసే పనిని బట్టి ప్రజాయోగ క్షేమం చూడాలి అంటుంది భారతకాలం. కళాకారుడు సామాన్య వ్యక్తి కాదు.

సమసమాజం పేరుతో అందరిని ఒకే త్రాటిపై తీసుకువచ్చి అవమానిస్తే అది దేశానికీ, భావితరాలకు అనర్థం.

## 3. ఉద్యోగులు - వేతనం

ప్రభుత్వోద్యోగులు, సైనికులు ఈ కోవలోకి వస్తారు. మహాభారతకాలం నుంచీ ఈ వర్గమనస్తత్వంలో మార్పులేదు. వారికి సకాలానికి వేతనం చెల్లించాలి. వారి వేతనం తగ్గించకూడదు, ఆలస్యం చేయరాదు. అలా జరిగితే వారు అలక వహిస్తారు. వారి కోపం మహాఅనర్థానికి దారితీస్తుంది.

అవసర సమయాలలో సైనికులకు రాజోద్యోగులకు ముందుగా కొంత వేతనం ఇవ్వాలి. ఇచ్చి వారి సేవలను పొందాలని కూడా మహాభారతకాలంలో నిర్ణయించటం జరిగింది. ఈ అవకాశాన్ని ప్రస్తుత ప్రభుత్వాలు కూడ కల్పించటం గమనించాలి. రాజు తమను తల్లిదండ్రుల వలె కాపాడుతారని, రాజు సమదర్శి అని ప్రజలు భావించాలి.



రాజసేవలో ఆనందంగా మృత్యువును ఆహ్వానించిన వారి కుటుంబాలను పోషించాల్సిన బాధ్యత పాలకులదే.

## సత్కారాలు

విద్యావంతులు, వినయశీలురు, జ్ఞానసంపన్నులు, పండితులు, వేదవిదులు అయిన వారిని రాజు ప్రత్యేకంగా సత్కరించాలి. అటువంటి వారిని నిండుసభలో గౌరవించాలి. దీని వలన మిగిలిన వారికి స్ఫూర్తి కలుగుతుంది. బిరుదులు, బహుమతులు మొదలగు వానితో రాజ్యం మేలు కోరేవారిని సత్కరించే విధానం మహాభారత కాలం నుండి వస్తున్న సత్సంప్రదాయమే.

భర్తలను, బిడ్డలను పోగొట్టుకున్నవారు ఆకలితో అలమటిస్తూంటారు. ప్రజాసేవలో ప్రాణాలు అర్పించటానికి ఎవ్వరూ ముందుకు రారు. అటువంటి అనాథలను గుర్తించి, సహాయం చేయటం సౌకర్యాలు కల్పించటం తమ్ముడు నకులునికి అప్పగించాడు ధర్మరాజు. ఈ విషయం ఉద్యోగపర్వంలో వివరించటం జరిగింది. ఇంతే కాదు, ఏదిక్కులేని వారికి కూడా రాజే పోషించాలి ఆకాలంలో.

## 4. కుటుంబ జీవితం

రామాయణ కాలానికే అనగా త్రేతాయుగంలోనే వివాహ వ్యవస్థకు అంకురార్పణ జరిగింది. పాణిగ్రహణం, అగ్నికి ప్రదక్షిణ చేయటం వంటి ఆచారాలు నియమబద్ధమైనాయి. ఏకపత్నీవ్రతానికి రాముడు, అతని సోదరులు ఉదాహరణగా నిలచారు. భారతకాలానికి సమాజ స్వరూపం సమస్యగా అవతరించింది. అందుచేత అష్టవిధ వివాహాలను ఆనాటి సమాజం అంగీకరించింది. అవి: బ్రాహ్మం; దైవం; ఆర్షం, ప్రాజాపత్యం; ఆసురం; గాంధర్వం; పైశాచికం; రాక్షసం. వీనిలో **"గాంధర్వం శ్రేష్ఠ ముచ్యతే"** అని మహాభారతంలోని ఆదిపర్వం వివరించింది.

వధూవరుల ప్రేమ, స్వేచ్ఛానిర్ణయానికే ఆనాటివారు ప్రాముఖ్యం ఇచ్చారని స్పష్టమవుతోంది. వివాహిత స్త్రీ పుట్టినింట చిరకాలం ఉండరాదని నియమం ఆనాడే ఉంది. ఇది ఈనాటికి ఆచరణలో చూపుతున్నారు. జ్యేష్ఠునకు వివాహం కాకుండా పిన్నలకు వివాహం చేయటం ఆకాలంలోనూ; ఈకాలంలోను ఆచారం కాదు.

ద్రౌపది వివాహ సందర్భంలో ఈ చర్చ జరిగింది. బ్రాహ్మణాల కాలం నుంచి కూడా భార్యను గౌరవంగా చూడాలని విధించారు. 'కోపం వచ్చినపుడు భార్యను అప్రియం' చేయకూడదు. పుత్రసంతానం కోసం ఆనాడు, ఈనాడు కూడా తపిస్తూనే ఉన్నారు.

**'సంతానం హి పరోధర్మః'** అనే మాటకు ప్రాధాన్యం ఇచ్చారు. **ఉమ్మడి కుటుంబాలవలన సుఖం చేకూరుతుంది.** కుటుంబాలు విడిపోతే దుఃఖం మాత్రమే అనుభవించాలి. ఇటువంటి సందర్భం చెబుతూ విభావసుడు, సుప్రతీకుడు అనే సోదరుల విషయం భారతంలో ప్రస్తావించబడింది. కుటుంబాలు విభజన జరిగినతరువాత విభేదాలు సమసిపోవు అని వారి ఆలోచన. **'కలిసి ఉంటే కలదు సుఖం'** అన్న సూక్తి ఉమ్మడి కుటుంబాల ప్రాశస్త్యం ఉన్న ఆ కాలంలోనే ఉంది.

తమ్ముణ్ణి కుమారుని వలెను, అన్నను తండ్రి వలెను భావించాలి.

గౌరవ అతిథులు వచ్చినప్పుడు లేచి నిలబడి ఆహ్వానించటం ఆనాటి నుండి వస్తున్న సంస్కృతి, సంప్రదాయమే. కౌరవసభకు కృష్ణుడు వచ్చినపుడు రాజుతో సహా అందరూ లేచి నిలబడి ఆహ్వానించారు. ఆ సంప్రదాయం ఈ నాటికీ ఆచరిస్తున్నారు. శుభముహూర్తంలో ప్రయాణం చేయటం ఆనాటి సంప్రదాయమే.

వృద్ధులు జీవించాలనే ఆశలేనప్పుడు నిరాహారవ్రతం పాటించి ప్రాణ త్యాగం చేసే పద్ధతి అనుమతించబడింది.



అమావాస్య పితృదేవతలకు, పూర్ణిమ దేవతల అర్చనకు ప్రధానమని భావించారు ఆకాలంలో.

**సుపరిపాలన**

మహాభారతకాలంలో ధర్మరాజు తన నలుగురి తమ్ములతో కలిసి రాజ్యపాలన చేసి సుపరిపాలన అందించాడు. భీముణ్ణి యువరాజుగా చేసి, సంధి, విగ్రహాది సర్వరాజ్యాంగ విషయ నిర్వహణ భారం విదురునికి అప్పగించాడు. అర్థ మంత్రిగా యుయుత్సుని నియమించాడు. సేనల, పరిచారికల జీత, భత్యాలు నకులుని చేతిలో పెట్టి, ఇరుగు పొరుగు ప్రాంతాల ఆక్రమణలు అర్జునుని భుజస్కంధాల మీద మోపి, విప్రదేవతా పూజలూ, యజ్ఞ యాగాది సర్వకార్యనిర్వహణ భారం ధౌమ్యుల వారికి అప్పగించి అంతరంగ కార్యదర్శిగా సహదేవుని తీసుకున్నాడు. వీరందరి సహాయ, సహకారాలు, సలహాలతో సుపరిపాలన అందించాడు ధర్మరాజు.

♦ మహానగరాలలో, జనపదాలతో అన్న సత్రాలు నిర్మించాడు. రాజమార్గాలలో దాహశాంతికి చలివేంద్రాలు నడిపాడు.

♦ దేవతాపూజలు, పితృదేవతల ఆరాధనలూ, అతిథి అభ్యాగతుల సత్కారాలు, అనాథల, దీనుల పోషణభారం; దేశ, దేశాల నుంచి వచ్చే విద్వాంసులకు సముచిత సన్మానాలు చేయించాడు. దేశంలో ఆకలి దప్పుల బాధలేకుండా స్వయంగా పర్యవేక్షించేవాడు ధర్మరాజు.

♦ ధర్మపరిపాలనతో, ప్రజలకు తండ్రివలె భావించి సుపరిపాలన అందించి ప్రజారంజకంగా కీర్తి ప్రతిష్ఠలు సంపాదించారు.

♦ సుపరిపాలన అందించటంలో నారద మహర్షి రాజనీతి ఉపయోగపడింది. విదురుని నీతివాక్యాలు పాలనకు వన్నె తెచ్చాయి. భీష్మ పితామహుని ధర్మసూక్ష్మాలు, ధర్మాచరణకు దారిచూపాయి. శ్రీకృష్ణుని గీతోపదేశంలోని హితబోధలు ధర్మరాజుకు సహకరించాయి. వీరందరూ ధర్మరాజుకు సలహాదారులుగా భావించాలి.

**మహాభారతకాలంలోని సుపరిపాలన వలన రాజుకు – ప్రజలకు మధ్య స్నేహపూర్వకమైన సంబంధాలు ప్రకాశించాయి. ప్రజలు కష్టాలు లేక కలిసి మెలసి ఉన్నారు. కుటుంబాలు విడిపోకుండా ఉమ్మడి కుటుంబాలుగా విలసిల్లాయి. ఉమ్మడి కుటుంబాలే సత్సంబంధాలు పెంచుతూ మానవసంబంధాలకు పునాదులుగా నిలిచాయి. మహాభారత కాలంలో ధర్మరాజు పాలనలో రాజ్యమంతా వసుధైక కుటుంబంగా వర్ధిల్లింది.**

**మానవసంబంధాలు పునరుద్ధరించటానికి మహాభారత కాలంలోని సంఘటనలు, సన్నివేశాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. మంచి చెడులను ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. వేళ్ళూనుకు పోయిన భారతీయ సంస్కృతి, నాగరికత, ఆచారవ్యవహారాలు, సంప్రదాయాలు, వివాహవ్యవస్థ, సుపరిపాలన మళ్ళీ బ్రతికించి ప్రకాశించటానికి యువతరం, నేటితరం నడుం బిగించాలి. ఆ లక్ష్యంతోనే మహాభారత కాలంనాటి మానవసంబంధాలను విశ్లేషించుకొని అనుసరించటం మానవాళి జీవనవిధానానికి సత్సందేశమే.**

**కుశలప్రశ్నలు**

ఇద్దరు లేక ముగ్గురు వ్యక్తులు కలుసుకున్నప్పుడు పరస్పరం కుశలప్రశ్నలు చర్చించటం సంప్రదాయం. మానవ సంబంధాలు పెంపొందటానికి కుశల ప్రశ్నలు ఒక ముఖ్య సాధనంగా ప్రాచీనకాలంనుంచి వస్తున్న భారతీయ సంప్రదాయం.

చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు, దివాకర్ల తిరుపతి శాస్త్రి గారు "తిరుపతి వేంకటకవులు"గా ప్రసిద్ధి. 'పాండవోద్యోగ విజయం' అనే కురుక్షేత్ర నాటకాన్ని రచించి తెలుగు వారి హృదయంలో శాశ్వత ముద్ర వేశారు.

అర్జునుడు, దుర్యోధనుడు సహాయం అర్థించటానికి శ్రీకృష్ణుని వద్దకు ద్వారకానగరానికి వెళ్ళారు. శ్రీకృష్ణుడు నిద్రలో వున్నాడు. దివ్యదృష్టితో



శ్రీకృష్ణుడు గ్రహించాడు. నిదురమత్తు నటిస్తూ అర్జునుని వైపు చూస్తూ కౌగిలించుకొని ప్రేమతో "ఎక్కడ నుండి రావటం? అందరూ సుఖంగా ఉన్నారా? నీతమ్ములు, మొదలైన బంధువులు చక్కగా ఉన్నారా? అని అర్జునుణ్ణి ప్రశ్నిస్తాడు.

ఆ విధంగానే శ్రీకృష్ణుడు ప్రక్కకు తిరిగి దుర్యోధనుణ్ణి చూచి గౌరవంతో బావా! ఎప్పుడు వచ్చావు? ఎల్లరు సుఖులే గదా? మీ వంశోన్నతి కోరు భీష్ముడు, మీ మేలుకోరు ద్రోణుడు క్షేమంగా ఉన్నారా? అని ప్రశ్నిస్తాడు.

అర్జునుడు, దుర్యోధనుడు వారు వచ్చిన పనిని శ్రీకృష్ణునికి విన్నవించారు. అందుకు శ్రీకృష్ణుడు "మీ ఇద్దరికీ నేను సమానంగా సహాయం చేయదగినవాడను, కాని ముందు వెనుకలను విచారిద్దాం" అని అన్నాడు. ఎవరిని ఎవరు ముందు గౌరవించాలో శ్రీకృష్ణుడు వివరించాడు.

శ్రీకృష్ణుని ఇంటికి దుర్యోధనుడు ముందుగా వచ్చాడు. అర్జునుడు కొంత ఆలస్యంగా వచ్చాడు. శ్రీకృష్ణుడు నిద్రనుండి లేచి ముందుగా చూచినది అర్జునుణ్ణి. నేను ముందుగా చూచిన వానిని ఏ సహాయం కావాలో అడగటం నా ధర్మం అని శ్రీకృష్ణుడు అంటాడు. శ్రీకృష్ణుడు సమయస్ఫూర్తితో సందర్భోచితంగా వ్యవహరించినతీరు, మాట్లాడిననైపుణ్యం మెచ్చుకోదగినవి.

**యుధిష్ఠిరుడు**

**యుద్ధంలో సాయుధ పోరాటం ఒక్కటే కాదు. నిత్యజీవితంలో ఎంతటి క్లిష్టమైన సమస్యలు ఎదురైనా ఆపదలు చుట్టుముట్టినా ధైర్యంగా నిలబడాలి. వాటిని సహనంతో ఎదుర్కొనటం గూడ యుద్ధంతో సమానమే! నిజానికి యుద్ధంలో విజయం కన్నా జీవితంలో గెలుపు ఇంకా గొప్పది. జీవితమనే సమస్యల సుడిగుండంలో స్థిరంగానిలబడి తన వ్యక్తిత్వాన్ని నిరూపించినవాడు కావడంచేత యుధిష్ఠిరుడు సార్థక నామధేయుడు.**

**యక్షుడు అడిగిన ప్రశ్నలకు సునిశితమైన సమాధానాలు చెప్పి తన తమ్ములందరిని బ్రతికించుకోగలిగిన గుండె నిబ్బరం, స్థిరచిత్తం ధర్మరాజు**

**అస్తి! అందుకే ఆయన్ను యుధిష్ఠిరుడన్నది. విజయానికి కావలసింది ఆవేశం ఒక్కడే కాదు, ఆలోచన కూడా కావాలి. నిత్యజీవితంలో రెండోది ఇంకా ముఖ్యమైనది.**

పితామహా! మీరు మనసారా నన్ను ఆశీర్వదించి, అనుమతి ప్రసాదిస్తే నేను యుద్ధాన్ని ప్రారంభిస్తాను" అన్నాడు. భీష్మ పితామహుడు తల పంకించాడు. నాయనా! యుద్ధనీతిని గౌరవించావు. వంశ మర్యాదను పాటించావు. పెద్దలను మన్నించావు. నిన్ను అభినందిస్తున్నాను" అని ఆశీర్వదించాడు. 'అవసరమైనపుడు మరొకసారి కలుసుకో, అని కూడా చెప్పాడు. యుద్ధానికి అనుమతించాడు. అదే క్రమంలో ద్రోణుడు, కృపుడు, శల్యుడు, ధర్మజుని నమస్కారాలు అందుకుని 'విజయో - స్తు' అని దీవించారు.

ఇదంతా గమనించిన కృష్ణుడు "భేష్! యుద్ధం సగభాగం పూర్తయింది" అన్నాడు. గెలుపుకోసం మిగిలిన సగభాగం మీ నలుగురూ సాధించవలసి ఉంది" అని తెల్చి చెప్పాడు. పాండవులకు సంతోషం కలిగించాడు.

కురుక్షేత్ర భీకర సంగ్రామంలో, సగభాగాన్ని ధర్మరాజు తానొక్కడూ పూనుకొన్నాడు. ఏ ఆయుధమూ చేతిలో లేదు. ధర్మరాజు తన అపార లౌకిక నైపుణ్యంతో, అసాధారణ బుద్ధి కుశలతతో, అమోఘ చాతుర్యంతో అవలీలగా పూర్తిచేశాడు.

**అందుకే, మహాభారతకాలంలో ధర్మరాజును యుధిష్ఠిరుడన్నది. ఆయన కథనుండి మనం నేర్చుకోవలసింది ఒక్కటే, యుద్ధాలను గెలవాలంటే మనకు ఆయుధాలు అవసరంలేదు. మాటలతోనే సాధించవచ్చు. గౌరవం, ఆదరణలతో విజయం వరిస్తుందని తెలుసుకోవాలి. మనస్సుంటే మార్గం ఉంటుంది. మాటలే ఆయుధాలు. మాటే మంత్రం.**



**ధర్మోరక్షతి రక్షితః**

ధర్మాన్ని ఎవరు రక్షిస్తారో, వారిని ధర్మమే కాపాడుతుందని మహర్షుల హితబోధ. ఆ ధర్మానికి శ్రేష్ఠమైన మంచిపనే ఆధారం. చిత్తశుద్ధితో మంచి పనులను ఆచరించాలి. కర్తవ్య కర్మలు ఆచరించటం మానవుల ధర్మమని వేదం గట్టిగా చెప్తోంది.

ధర్మరాజు ధర్మాచరణలో మొదటి వాడుగా పేరు పొందాడు. సత్య-ధర్మాలను తు.చ. తప్పక పాటించాడు. కష్టాల్లోనూ ధర్మాన్ని వదలలేదు. భార్య ద్రౌపది, తమ్ములు భీమ, అర్జున, నకుల, సహదేవులు ధర్మమార్గంలో అన్న ధర్మరాజుని అనుకరించారు. ద్వాపరయుగంలో మానవసంబంధాలు 'ధర్మం చర' వల్లనే ప్రకాశించాయి.

ప్రపంచంలో అన్నిటి కంటె గొప్పది ధర్మం. ధర్మంలోనే సత్యం దాగివుంది. ధర్మాన్ని ఆచరించినవారు సత్యాన్ని పాలించినట్లే. సత్యాన్ని పాలించిన వారు దేవతలను ఆరాధించినట్లేనని శాస్త్రాలు వివరిస్తున్నాయి.

**ధర్మానికి వారసులు**

మనపెద్దలు అనుసరించిన ధార్మిక సూత్రాలను మనం అనుసరించాలి. మన తరువాత తరాల వారికి వాటిని అందించాలి. ఆదర్శ భావాలను వారికి నేర్పించి వారిని ధర్మానికి వారసులుగా చేయాలి. ధనానికంటే ధర్మం గొప్పది. ధర్మం సురక్షితమైంది. ధనం వుంటే భయం కలుగుతుంది. ధనం ఎప్పుడైనా క్షీణించిపోయేదే. ధనం అశాశ్వతం. ధర్మాన్ని ఎవరూ దొంగిలించరు. అంత్యదశలో ధర్మం మనవెంట వస్తుంది.

మన పూర్వీకులు తరతరాలుగా ధర్మాన్ని కాపాడుతూ వచ్చారు. మనం దానిని జాగ్రత్తగా పరిరక్షించుకోవాలి.

**ధర్మాన్ని నాశనం చేయాలని ప్రయత్నిస్తే అది మనలను నాశనం చేస్తుంది. రావణుడు, దుర్యోధనాదులు అధర్మాన్ని ఆచరించి చరిత్రలో అధములుగా నిలిచిపోయారు.**

తైత్తిరీయారణ్యకం **"ధర్మోవిశ్వస్య జగతః ప్రతిష్ఠా"** అని హితవు పలికింది. అంటే ధర్మమే సకల జగత్తుకీ ఆధారం. అసలు ధర్మాన్ని ఆచరించలేని జీవితం పరిమళం లేని పూవుతో సమానంగా ఉంటుంది. ఈ విధంగా మనుస్మృతి కర్తవ్యాలను తెలియపర్చటంలో విశేష ప్రచారం పొందింది. ధర్మాచరణతోనే మానవసంబంధాలు పెరిగి సుఖశాంతులతో జీవించవచ్చని మహాభారత చరిత్ర వివరిస్తోంది.

**భారతవీరుని వ్యక్తిత్వం**

మహాభారతకాలంలో ఆనాటి వ్యక్తులు ప్రవర్తించిన తీరు, వారి నడవడిక, వారి ధార్మికత్వం, సత్యవ్రతం, నీతిమంతంగా నిలబడటం మొదలైన సుగుణాలవలన భారతవీరుని వ్యక్తిత్వం ఎటువంటిదో స్పష్టంగా తెలుస్తుంది. ఒకసంఘటనను వివరంగా తెలుసుకుందాం.

అరణ్యవాస సమయంలో శ్రీకృష్ణుని ఆదేశం మేరకు వ్యాసమహర్షి ఉపదేశంతో అర్జునుడు సదాశివుని కోసం తపమాచరించాడు. ఫలితంగా పాశుపతాస్త్రాన్ని వరంగా పొందాడు. శివుని చిన్మయ తనువుతో స్పర్శ పొందిన కారణంగా అర్జునుడి దేహం దివ్యమైంది. దానితో స్వర్గంలో ప్రవేశించగలిగే అర్హత లభించింది.

ఆ స్వర్గంలో ఊర్వశి ప్రవేశించి అర్జునుడితో సంగమాన్ని కోరింది. అర్జునుడు చలించి "అమ్మా! నువ్వు పుత్రవాత్సల్యంతో నన్ను దీవించి ధన్యుణ్ణి చేయాలి" అని నమస్కరించాడు. ఈ విధమైన సమాధానానికి ఊర్వశి ఆశ్చర్యపోయింది.

ఫల్గుణా! ఇవేమి మాటలు, నీకు నేను ఎలా తల్లినైనాను. నిన్ను కోరి వలచి వచ్చిన కన్యను, అప్సరసను.

జనయిత్రీ! "నాజన్మ కారణమైన స్వర్గాధిపతి ఇంద్రుడి లోకంలోని దానవు. నాకు తల్లివే కదా!"



'అర్జునా! నువ్వు చెబుతున్న మాటలు నాకు వింతగా వున్నాయి. ఇది స్వర్గలోకం, మీది భూలోకం. మీ వావి వరసలు ఇక్కడ అవసరంలేదు. ఇక్కడ పనిచేయవు. ఈ సురలోకంలో అడుగుపెట్టిన నీవు హాయిగా నాతో కలిసి విహరించవచ్చు, సరస సల్లాపాలాడవచ్చు", అని తన మనోవాంఛను తెలియజేసింది ఊర్వశి.

అమ్మా! నేను ఇక్కడికి అతిథిగా వచ్చాను. ఇక్కడి వింతలు, విశేషాలు గమనించి, సంతోషించాలి. ఈ లోకాధిపతి ఇచ్చే ఆతిథ్యాన్ని స్వీకరించాను. ఇక్కడి సుఖభోగాలకు నేను పనికిరాను తిరిగి భూలోకానికి వెళ్ళాలి. మీలోకనియమాలను, స్వేచ్ఛావర్తనను నేను విమర్శించను. మీది స్వర్గలోక లక్షణం. నాది మానవలోక ధర్మం. నా స్వధర్మాన్ని నేను విడువను. తల్లీ! నీకు నమస్కారం". అని అంజలి ఘటించాడు అర్జునుడు.

ఈ మాటల్ని విని ఆవేశపడిన ఊర్వశి "నన్ను తిరస్కరించిన నీవు పౌరుషహీనుడివై స్త్రీ జనమధ్యంలో గడుపుతావు" అని శపించి నిష్క్రమించింది.

ఇదంతా గమనించిన మహేంద్రుడు అర్జునునికి ప్రత్యక్షమై "నాయనా! నీ ధర్మనిరతి కొనియాడదగినది. నీ పరాక్రమం ఒక ఎత్తు. నీ ధర్మ నిరతి ఇంకొక ఎత్తు. ప్రతిశాపమిచ్చే సమర్ధత కలిగి కూడా నిగ్రహించుకున్నావు. నిన్ను అభినందిస్తున్నాను. ధర్మపరుని పట్ల ప్రయోగించిన శాపం కూడా వరమై కాపాడుతుంది. ఊర్వశి నీకిచ్చిన శాపం అజ్ఞాతవాససమయంలో వరమై, కవచమై నిన్ను రక్షిస్తుంది" అని అభినందించి ఆశీర్వదించాడు.

ఈ సన్నివేశంలో చాలా విలువలు గోచరిస్తాయి.

**అవసరార్థమో, ఆతిథ్యం కోసమో మనం స్వదేశాన్ని విడచి విదేశాలకు వెళుతూంటాం. ఆ సమయంలో అక్కడి జీవన విధానం, ఆచార వ్యవహారాలు మనకంటి ముందు తళుక్కుమంటాయి. కానీ మనశరీరం, ఇందులోని నెత్తురు, దీనిని అంటి పెట్టుకున్న తరతరాల సాంప్రదాయిక విలువలు**

వీటిని మరచిపోగూడదు. మనదైన ధర్మాన్ని వదలి అక్కడి ధర్మాన్ని ఆచరించవలసిన అవసరం లేదు. మన ధర్మానికి దెబ్బతగలనంత వరకు వారి జీవన విధానంలోని విలువల్ని గౌరవించవచ్చు. అట్లాగని అక్కడి విలువలను, ఆచారాలను విమర్శించవలసిన పనిలేదు. మన ప్రాథమిక విలువలకు హాని జరగకుండా, కొన్ని మంచి లక్షణాలను ఆమోదించటం అనుచితం కాదు. మన అసలైన భారతీయ స్వాభావిక సంస్కృతిని విసర్జించటం మంచిది కాదు.

ఈ సందేశం భారత కాలంలోని ఘట్టంలో మెరిసే జ్ఞానదీప్తి. ఈనాడు ఎక్కువ సంఖ్యలో విదేశాలకు వెళ్ళే యువతకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వేళ్ళూనుకు పోయిన భారతీయ సంస్కృతి సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను పరిరక్షించవలసిన బాధ్యత యువతరం పై ఉన్నది.

వృక్షమెంత ఆకాశానికి ఎదిగినా, ఆ అనంతాకాశంలోని వాయుతరంగాలకు ఆనందంగా తల ఊపినా, తన వేరు (మూలం) సంబంధాన్ని తెంచుకోగూడదు. ఆ బంధం తెగితే క్రమంగా పతనమే తప్ప మరో మార్గంలేదు.

కర్మభూమికి చెందిన అర్జునుడు స్వర్గలోక గొప్పదనాన్ని సాక్షిగా చూసి, గౌరవించి, ఆశ్చర్యపడి ఆనందించాడే గాని ఆ స్థితిలో ఎటువంటి ఆకర్షణకు లోను కాలేదు, అనుసరించలేదు. తన మూలాలను మరచిపోలేదు. తిరిగి తాను స్వదేశానికి వెళ్ళి కర్తవ్య పాలనలో ధర్మ ప్రతిష్ఠ చేయాలనే స్పృహను కోల్పోలేదు. ఇదీ భారతవీరుని వ్యక్తిత్వం.

నేటితరం, భావితరం వారు విధిగా అర్జునుని మాదిరి కర్తవ్యపాలనలో ధర్మప్రతిష్ఠ చేయాలని భావించాలి. ఇంత విస్తృతి కలిగిన వివేచనను



ప్రస్తావించి ప్రదర్శించిన సంస్కృతిలో జన్మించి కూడా, దీని మౌలిక విలువల్ని విస్మరిస్తున్నామంటే పతనం వైపు నడుస్తున్నట్లే కదా!

ఏలోకంలోని వారు ఆలోకంలోని ప్రజలతో విలువలు, ధర్మం, నీతి, సంప్రదాయాలను మేళవించి మానవ సంబంధాలను పెంచుకోవాలని మహాభారతం స్పష్టం చేసింది.

ప్రస్తుత దేశకాలపరిస్థితులలో ఒక్కసారి ఇతిహాస గ్రంథాల జ్ఞానబోధ
అవగాహనతో జాగరూకులమైతే చాలు! అదే మానవాళి ప్రథమ
కర్తవ్యంగా భావించాలి. అంతేకాదు, ఆచరణలో అనుష్ఠించి చూపాలి.